నిశ్శబ్దం

- రామ్‌గోపాల్ వర్మ


SHOUT
SHARE
IT


అంకితం
వ్వా

అతనిష్టం మనకిష్టం!

'నేనొక దుర్గం - నాదొక స్వర్గం..., అనితరసాధ్యం నా మార్గం' అన్నారు శ్రీశ్రీ.

రామూ అని పిలవబడే రామ్‌గోపాల్ వర్మ నాకెప్పుడూ ఓ ఆశ్చర్యం. ఆ ఆశ్చర్యమే నన్నతన్ని కలుసుకునేలా చేసింది. కలిసిన తర్వాత నా ఆశ్చర్యం ఇంకొంచెం పెరిగింది. రామ్‌గోపాల్ వర్మ సినిమాలన్నీ నేను చూడలేదు. కొన్ని చూశాను. మరికొన్ని విన్నాను. కోపం, ప్రేమ, ఇష్టం, ఆనందం, విషాదంలాంటి మానవ స్థాయీ భావాల్ని (బేసిక్ ఎమోషన్స్) అత్యంత సహజంగా చిత్రీకరించడంలో అతనికి అతనే సాటి.

అతను తన చుట్టూవున్న ప్రపంచాన్ని చూసే పద్ధతి చాలా భిన్నంగా వుంటుంది. పరాజయం విజయాలకతీతంగా వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవడాన్ని కొందరు మాత్రమే చేయగలరు. ఆ కొందరులో ఒకడు రామ్‌గోపాల్ వర్మ. అనితరమైన అతని పరిశీలనాశక్తి అతని ఆయుధం.

కళాపిపాస అతన్ని దర్శకునిగా మార్చి ఉండవచ్చు. అతను ఒకవేళ సుప్రసిద్ధ దర్శకుడు కాకపోయినా ఈ సమాజంలో ఏదో ఒక రంగంలో ఓ స్పష్టమైన ముద్రను మిగిల్చేవాడనేది నా అభిప్రాయం.

అతను రాసింది చదివినతరువాత, అతనితో మాట్లాడినతరువాత నాకేమని పించిందంటే తాను ఏ తాత్విక భూనికనుంచి ఆలోచిస్తున్నానో తన జీవిన తాత్వికత ఏమిటో యథార్థంగా అలాగే మనకు కనబడాలని, తనని అత్యంత నగ్నంగా (హిపోక్రసితో తొడుక్కునే ముసుగుల్ని అన్నిటినీ తీసేసి) మనముందుంచాలని అతని ఆలోచనకావొచ్చని అనిపించింది. సినిమా మాధ్యమం ద్వారా తాను కమ్యూనికేట్ చేయలేకపోయిన అంశాల్ని ఈ రాతల ద్వారా మనముందుకు తేవాలనే ప్రయత్నం కనబడింది.

రామూని చూస్తుంటే నాకేమనిపిస్తుందంటే Process of Learning ఎంత ముఖ్యమో Process of Unlearning కూడా అంతే ముఖ్యం అని. అప్పుడే మనిషి నిరంతరం బాల్యంలో జీవించగలుగుతాడు. లేకపోతే జ్ఞానభారాన్ని మోస్తూ మరణిస్తాడు. సమాజంలో అస్తిత్వ

సమస్యని ఎదుర్కొంటున్నా అనేకమందికి ఈ పుస్తకంలో బోల్డెన్ని సమాధానాలు దొరుకుతాయి. మనగురించి పట్టించుకుంటూ కూర్చోడానికి జనానికి అంత తీరికలేదు. మనం వాళ్ళమీద ఏమాత్రం ప్రభావం చూపిస్తామో ఆ మేరకు మాత్రమే వాళ్ళు మనలను పట్టించుకుంటారు.

ఈ పుస్తకంలో అతని రాతలు చూస్తుంటే నాకు పైన చెప్పిన శ్రీశ్రీగారి మాటలు గుర్తొచ్చాయి. అందుకే అనితర సాధ్యం నా మార్గం అన్న శ్రీశ్రీ మాటలు ఓ మనిషిగా రామ్‌గోపాల్ వర్మకు కూడా వర్తిస్తాయి.

తనని నిజాయితీ ప్రజెంట్ చేసుకోవడం అతనికిష్టం. అందుకే అతనిష్టం మనకిష్టం.

– ఎమెస్కో విజయకుమార్

రామూ'యిజం'

మనుషులమైన మనందరికీ మనశరీరాలు, వాటి విధులు చిన్న చిన్న తేడాలతో ఒకేలా ఉంటాయి. కాని మారేవీ, చాలా విపరీతంగా, విభిన్నంగా ఉండేవీ మన ఆలోచనా సరళులు మాత్రమే. మనిషనేవాడు ఒకలా ఆలోచిస్తే గాంధీ అవుతాడు, ఇంకోలా ఆలోచిస్తే హిట్లర్ అవుతాడు. ఆలోచనలకి,భావాలకీ ఒక రూపం అనేది ఉండదు. నిద్రాహారాలు కావల్సింది కేవలం మన శరీరానికి గానీ, మన ఆలోచనలకీ, మన భావాలకీ కాదు. అలాంటప్పుడు అవి నివాసం ఉండటానికి మన తలలు లేదా మన మెదడులు వాటికి ఎందుకు అవసరం అనేది నాకిప్పటికీ కొరుకుడు పడని ప్రశ్న.

నేను పుట్టినప్పుడు ఒక బ్లాంక్ మైండ్‌తో పుట్టాను. ఆ తరువాత నేను పెరిగిన వాతావరణం, నేను కలిసిన మనుషులు, నేను చదివిన పుస్తకాలు,నాకు ఎదురైన అనుభవాలు వగైరాలన్నిటి మూలాన నా తలలో రామూ అనే ఒక ఆలోచనల సమూహం ఏర్పడింది. అలాగే ఒక సుబ్బారావు, ఒక జీవన్, ఒక రవీంద్ర, ఒక జాకబ్, ఒక మహ్మద్ లాంటి కోట్ల కోట్ల సమూహాలు కోట్ల కోట్ల మెదడులలో ఏర్పడతాయి. నేను తెలుసుకున్న, అనుభవించిన పరిస్థితుల్నించి నేను నిర్ణయించు కున్న జీవన విధానం నుంచి నేను నమ్మే నా యిజం పుట్టుకొచ్చింది. కనుక నేను ఇక్కడ రాసిన శీర్షికలలో కానీ, నాకు రకరకాల సమూహాల నుంచి వచ్చిన కామెంట్లకి నా రియాక్షన్స్ కానీ, నన్ను వేసిన ప్రశ్నలకి నేనిచ్చిన జవాబులు కానీ, నాకుగా నేను తెలుసుకుని, నేర్చుకుని, అర్థం చేసుకున్న నా వ్యక్తిగత ఆలోచనల నుంచి వచ్చినవి కాబట్టి ఈ నా ఆలోచనా భావాలని నా వ్యక్తిగత యిజంగా భావించి నా ఆలోచనలకి "రామూయిజం" అని పేరు పెట్టాను.

– రామ్‌గోపాల్ వర్మ

వెనక మాట

ముందు మాట కన్నా వెనక మాటకి ఎక్కువ ఇంపార్టెన్స్ ఉంటుందని నా నమ్మకం. ఎందుకంటే ఒక పని అయిపోయిన తర్వాత దాని ఫలితాన్ని విశ్లేషించడం వల్లే మనకి దాని పట్ల అవగాహన పెరుగుతుంది. అప్పుడు మనకి దాని నుంచి వచ్చిన అనుభవాన్ని స్టడీ చేసి వేరే వాళ్ళకి అర్థమయ్యేటట్టు చెప్పడాన్ని వెనకమాట అంటే బావుంటుందనిపించి ఇక్కడ హెడ్డింగ్ వెనక మాట అని పెట్టాను.

ఒక మనిషి జీవితాన్ని కానీ తన జీవితకాలంలోని ఆలోచనలని కానీ చదివితే తన జీవితం కూడా మనం జీవించిన వారిమవుతాం. నన్ను బాగా ప్రభావితం చేసిన చాలామంది తత్వవేత్తల రచనలు, ఫిక్షన్ రచనలు,చివరికి కామిక్ పుస్తకాలు కూడా నాకు జీవితాన్ని అర్థం చేసుకోవడంలో చాలా సహకరించాయి. అన్ని పుస్తకాలు నేను చదివినప్పుడు నా పుస్తకం కూడా కొందరితోనైనా చదివిద్దామన్న అభిప్రాయంతో ఈ పుస్తకం రాయడానికి పూనుకున్నాను. నాకు నా కుటుంబంలో నా వారసుల కన్నా నా ఆలోచనలే అక్కడక్కడో ఎక్కడెక్కడో మిగులుండాలన్న ఓ కోరిక ఉండబట్టి కూడా ఈ పుస్తకం రాశాను.

నాకు ఊహ తెలిసినప్పట్నించీ నేను దేవుడ్ని నమ్మలేదు, పెద్దలని గౌరవించలేదు, స్నేహానికి విలువివ్వలేదు, చదువు మీద ధ్యాస పెట్టలేదు. కానీ సినీ కళని చాలా గాఢంగా నమ్మాను, గౌరవించాను, విలువిచ్చాను, ప్రేమించాను.

ఈ పుస్తకంలో సినిమాల మీద నాకున్న ఆలోచనలతో పాటు జీవితం పట్ల నా ఊహల గురించి కూడా చాలా రాతలు ఉంటాయి. నేనిక్కడ రాసినవి రచనలు కాదు రాతలు. నాకు అప్పటికి తోచింది, నేను ఊహించింది, నాకు అనిపించింది రాసేశాను. మీకు నా ఇక్కడి రాతలు కొన్ని నవ్వు తెప్పించొచ్చు. కొన్ని కోపం తెప్పించొచ్చు, కొన్ని ఇరిటేట్ చెయ్యొచ్చు, కొన్ని కాంట్రవర్సీగా కూడా ఉండొచ్చు. అది ఎందుకంటే,

జీవితంలో మనకందరికి వేరే వాళ్ళ మీద, వేరే వాళ్ళందరికీ మన మీద కూడా నేను పైన చెప్పిన భావాలన్నీ ఎప్పుడో ఒకప్పుడు తప్పకుండా కలిగి ఉంటాయి.

ఇది వాళ్ల వాళ్ళ యుక్తాయుక్త విచక్షణ, పరిసరాల రీత్యా అలవడిన జ్ఞానం, మానసిక స్థితితో పాటు జీవితంలోని భిన్న అనుభవాల ద్వారా ఏర్పడిన పర్సనల్ ఎమోషన్స్ పై ఆధారపడి ఉంటుంది.

నాకు నిలకడ ఉండదు, నేను అన్నమాట మీద నిలబడను. మాటిమాటికీ మనసు మార్చుకుంటాను. చాలా స్వార్థపరుణ్ని, విపరీతమైన తలపొగరున్న వాడ్ని. ఇక్కడి నా రాతలన్నీ నేను పైన చెప్పిన బ్యాక్‌గ్రౌండ్‌లోంచి వచ్చినవి. ఇంత చెప్పిన తరువాత కూడా మీరు ఇంకా ఈ పుస్తకం చదివితే అదింక మీ ఇష్టం.

"నా ఇష్టం" తో నేను మాట్లాడేదానికి అర్థం "మీ ఇష్టం" తో మీరేం అర్థం చేసుకుంటే అదే –

– రామ్‌గోపాల్ వర్మ

నేను

"ఒక మనిషిని చుట్టూ ఉన్న పరిస్థితులే తయారు చేస్తాయి" అని కారల్ మార్క్స్ చెప్పినట్టు... అయాన్ రాండ్, ఫ్రెడరిక్ నీషే, ఆర్థర్ షాపెన్ హోపర్, నా విజయవాడ ఫ్రెండ్ సత్యేంద్ర, జేమ్స్ హాడ్లీ చేజ్, ఫ్రెడరిక్ ఫోర్సైత్, ముప్పాళ్ళ రంగనాయకమ్మ, మ్యాడ్ మ్యాగజైన్లు, సెక్స్ పుస్తకాలు, చందమామ, బాలమిత్ర కథలు, స్టీఫెన్ స్పీల్‌బర్గ్, కె. బాలచందర్‌లాంటి నా జీవితంలో ఎదురైన ప్రతి వ్యక్తి అనుభవాల నుంచి నాకు నచ్చి, నేను తీసుకుని, నావి చేసుకున్నవి నాలో ఒక భాగం, అయితే ఇంకో భాగం నేను మంచి స్టూడెంట్ కాకపోవటం, నా ఇష్టమొచ్చినట్టు చేయడానికి అనుమతించిన నాన్న ఉండటం, ఐదేళ్ళు విజయవాడ వీధుల్లో వీరంగం చేయడం, నన్ను ఒక సినిమా ఉన్మాది చేసిన ప్రసాద్ మామయ్య, సినిమాల గురించి విశ్లేషణ అలవాటు చేసిన మురళీ మామయ్య లాంటి వాళ్ళు నా జీవితంలో తారస పడటం మూలాన కూడా "నేను" నేనయ్యాను, నేను "నా" లా మిగిలాను. "నా ఇష్టం" వచ్చినట్టు బ్రతికాను, బ్రతుకుతున్నాను, బ్రతకబోతున్నాను.

– రామ్‌గోపాల్ వర్మ

విషయక్రమం

1.	శివ ప్రయాణం	13
2.	తప్పే ఒప్పు!	16
3.	శివారంభం	19
4.	బ్యాక్‌సీట్ డైరెక్టర్	21
5.	కొన్ని అబద్ధాలు - ఒక నిజం	23
6.	'శివ' పురాణం	26
7.	జ్ఞాపకాల 'చైను'	28
8.	ఆలోచనలయోధుడు	30
9.	అసిస్టెంటుకి అసిస్టెంటు	33
10.	అతిపెద్ద థ్రిల్	35
11.	చిట్టీస్ బార్	37
12.	డస్ట్‌బిన్‌లో అదృష్టం	40
13.	హ్యాపీ డెత్ డే	44
14.	లాకప్ పాఠాలు	46
15.	లాకప్‌లో రెండోసారి	49
16.	నా శ్రీదేవి	51
17.	నన్ను అత్యంత ప్రభావితం చేసిన ఓ వ్యక్తి	55
18.	రీ ప్రోగ్రామింగ్	59
19.	రైఫిల్	62
20.	ఎందుకు సినిమా గోరంతల్ని కొండంతలుగా చూపెడుతుంది	64
21.	ఎవ్వడూ పోటుగాడు కాదు	67
22.	రంగీలా వెనక రమేష్	70
23.	నన్ను ఎక్కువగా భయపెట్టే విషయాలు	73
24.	భయమంటే భయం	74
25.	మర్యాదలేని మర్యాద	76
26.	'ఐడియా' కున్న శక్తి	78
27.	సినిమా ఎలా ఆడింది?	80
28.	పేరులో ఏముంది?	83
29.	ఆలోచనల దర్శకత్వం	86
30.	మంట పెట్టిన 'ఆగ్'	89
31.	అండర్ వరల్డ్‌తో నా పరిచయం	92

32. ఇదెక్కడి మీడియా? 94
33. స్టార్లూ - యాక్టర్లూ 98
34. ద్వేషాన్ని ప్రేమిస్తాను! 100
35. ఒక డ్రామా కామిక్ ట్రాజెడీ 101
36. బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ - ఒక మానసిక దృక్కోణం 106
37. గోడమీద పిల్లులు 108
38. నేను భయపడ్డ సమయం 111
39. డబ్బు 112
40. నా జీవితంలో అతి పెద్ద ఫ్లాప్ 115
41. నా ప్రపంచం 119

నా గురించి ఇతరులు ***121***

1. నా కొడుకు రాము - సూర్యావతి 123
2. నాకు అర్థమైన (?) రామ్ గోపాల్ వర్మ - కృష్ణవంశీ 128
3. ప్రేమలేఖ - పూరీ జగన్నాథ్ (సినీ దర్శకుడు) 132
4. సర్కార్ రామ్ - శివ నాగేశ్వరరావు (డైరెక్టర్) 134
5. రాం గోపాల్ వర్మంటే... ఒక శివుడు! ఒక దెయ్యం!! ఒక చరిత్ర!!!
   - తనికెళ్ళ భరణి 136
6. WRONG-GO-PAL-WAR-MAA (రాంగ్-గో-పాల్-వార్-మా) 139
7. నిశ్శబ్ద సంభాషణ - పూడూరి రాజిరెడ్డి (సినీ విశ్లేషకుడు) 142
8. రామూని ఎంజాయ్ చెయ్యాలి - మురళీ రాజు 144
9. రామ్ ఎఫెక్ట్ - కె. క్రాంతి కుమార్ రెడ్డి (సినీ పరిశీలకుడు) 146
10. 'రామ్‌గోపాల్‌వర్మని చంపటం చేయటం ఎలా?'
    - అవిర్నేని భాను (ఒక దురభిమాన అభిమాని) 151
10. అతనో సూటి వంకర - జె.వి.రమణ (కాలేజ్ ఫ్రెండ్) 155
12. తను - మోహన్ కృష్ణ (క్లాస్‌మేట్) 157
13. Reminiscences on Ram – Satyendra 160

రకరకాల ప్రశ్నలకి, కామెంట్లకి, స్టేట్‌మెంట్లకి నా రకరకాల రియాక్షన్లు ***167***

వీరప్పన్ లో, ఒసామా బిన్ లాడెన్ లో, దావూద్ ఇబ్రహీంలో
ఒక వేళ వర్మ టైపు ఆలోచనలుంటే వాళ్ళ ఇంటర్వ్యూలు ఎలా
ఉండేవి అనే ఊహతో రాసినది. - జీవన్ రెడ్డి (వర్మ ఫాన్) 249

కొన్ని మధుర, కొన్ని అమధుర స్మృతులు ***255***

నామీద మీడియా.... మీడియా మీద నేను.... ***271***

శివ ప్రయాణం

చిత్ర పరిశ్రమలో ప్రవేశానికి, నాకొక బలమైన స్థానం కల్పించడానికి నిర్మాతలు, ప్రేక్షకులు నా రకరకాల ఎక్స్‌పెరిమెంటల్ చిత్రాలను చూడటానికి 'శివ' నాకు చాలా తోడ్పడింది. 'శివ' విడుదలైన కొన్ని రోజులకు ఇండస్ట్రీలోని ఒక వ్యక్తి.... నా గురించి "ఇప్పుడు వీడు 'శివ' సినిమా అడ్డం పెట్టుకొని పదేళ్లపాటు చెత్త సినిమాలు తీసినా, కేవలం ఆ సినిమా బ్రిలియన్స్ మీద గౌరవంతో వీడ్ని ప్రేక్షకులు భరిస్తారు" అన్నాడు.

అసలు 'శివ' తెర మీదికి రావడానికి నేనేం చేశానో చెప్తాను.

నన్ను రక్షించిన ఆ కిలోమీటర్ నడక....

మా నాన్నగారు అన్నపూర్ణ స్టూడియోలో సౌండ్ ఇంజినీర్‌గా పనిచేస్తుండటంతో, అక్కడ పెద్దవాళ్లతో ఆయనకు పరిచయాలు ఉండేవి. ఓరోజు నాన్నగారి దగ్గరకు వెళ్లి నేనొక ఫిల్మ్ డైరెక్టర్ కావాలనుకుంటున్నానని చెప్పాను. ఆయన నాకు పిచ్చి పట్టినట్టు చూశారు. అలా అనుకోవడంలో అర్థముంది. అలా చూడటంలో అర్థముంది. విజయవాడలో సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో చదువుతున్నప్పుడు, గ్యాంగ్ ఫైట్స్‌లో పాల్గొంటూ చదువు మీద శ్రద్ధ లేకుండా పనికిరానివాడిగా పెద్ద గుర్తింపే తెచ్చుకున్నాను. ఒక ఇన్‌స్టిట్యూట్‌లో గానీ, ఎవరి దగ్గరా అసిస్టెంట్‌గా పనిచేయకుండా, ఒక సినిమా డైరెక్ట్ చేయొచ్చనే అవగాహన ఆ టైమ్‌లో ఎవరూ ఊహించనిది.

అందుకే నాకు మతి భ్రమించిందని భావించి, అలాంటి పగటి కలలు కనొద్దని నాన్నగారు చెప్పారు. డిజప్పాయింట్‌మెంట్‌తో తాతగారి సహాయంతో హైదరాబాద్‌లోని హోటల్ కృష్ణా ఒబెరాయ్ (ఇప్పుడు తాజ్‌కృష్ణా) కన్‌స్ట్రక్షన్‌కు సైట్ ఇంజినీర్‌గా జాయిన్ అయ్యాను. అక్కడ పనిచేస్తూనే డైరక్టర్‌గా అవకాశం కోసం ప్రయత్నాలు మొదలుపెట్టాను. రామోజీరావుగారు అప్పటికి ఉషాకిరణ్ మూవీస్ సంస్థను స్థాపించి 'ప్రతిఘటన', 'శ్రీవారికి ప్రేమలేఖ' వంటి విభిన్నమైన చిత్రాలను రూపొందించారు. రామోజీరావుగారి దృష్టిలో పడటానికి, ఆయన సారథ్యంలో నడుస్తున్న ఇంగ్లీషు పత్రిక 'న్యూస్‌టైమ్'లో 'ద ఐడియా దట్ కిల్డ్ థర్టీ మిలియన్ పీపుల్' అనే ఆర్టికల్ రాశాను. ఆ టైటిల్ సబ్-ఎడిటర్ దృష్టిని ఆకర్షించడంతో అది వెంటనే ప్రచురితమైంది.

జర్మన్ నియంత హిట్లర్ ఆలోచనల మీద తత్త్వవేత్త 'నీషే' గురించి అందులో చర్చించాను. చాలామంది దానికి ఇంప్రెస్ అవడంతో, దాని రచయితగా నాకు రామోజీరావు గారిని కలిసే అవకాశం దొరికింది. ప్రాక్టికల్ ఎక్స్‌పీరియన్స్ లేదనే కారణంతో నాకు దర్శకుడిగా అవకాశమివ్వడానికి ఆయన తిరస్కరించారు. దర్శకుడికి అనుభవం అవసరం లేదు, తాను చెప్పాలనుకున్న విషయంలో స్పష్టత, దాన్ని తెరకెక్కించగల నైపుణ్యం ఉంటే సరిపోతాయని వాదించాను. నా లాజిక్‌తో ఆయన ఏకీభవించలేదు. రామోజీరావుగారికే అర్థం అవకపోతే, ఇంకెవరికి అర్థం అవుతుందని నా ప్రయత్నాలు వదిలేశాను. అదే సమయంలో నైజీరియాలో ఇంజినీర్‌గా ఉద్యోగ అవకాశం వచ్చింది.

కృష్ణా ఒబెరాయ్ కన్‌స్ట్రక్షన్‌లో ఇంజినీర్‌గా నెలకు ఎనిమిది వందల రూపాయలు సంపాదిస్తున్నాను. నైజీరియాకు వెళితే నెలకు నాలుగువేలు సంపాదించే అవకాశం. అప్పుడది నా కుటుంబానికి ఎంతో అవసరం కూడా. ఇక దర్శకుడు కావాలనే ఆలోచన వదిలేసి, నైజీరియా వెళ్లడానికి ఏర్పాట్లు మొదలు పెట్టాను. ప్రయాణానికి అవసరమైన డాక్యుమెంట్లలో భాగంగా నాకు ఇంటర్నేషనల్ డ్రైవింగ్ లైసెన్సు అవసరం వచ్చింది.

అందుకోసం నా ఫ్రెండ్ నాయుడు నన్ను ఆర్.టి.ఒకు తీసుకువెళ్తూ, దారిలో లాల్‌బహదూర్ స్టేడియం దగ్గర ప్రియదర్శిని అనే ఒక వీడియో లైబ్రరీ దగ్గర ఆపాడు. వీడియో లైబ్రరీల కల్చర్ కొత్తగా వస్తోన్న ఆ రోజుల్లో, నేను మొదటగా చూసిన వీడియో షాపు అదే. నాయుడు దాని ఓనర్ అయిన తన ఫ్రెండ్‌తో మాట్లాడుతుండగా నేను షాపులో క్యాసెట్లు పరిశీలించాను. అలా వాటిని చూస్తున్నప్పుడే నాకు వీడియో లైబ్రరీ పెడితే ఎలా ఉంటుందన్న ఆలోచన ఫ్లాష్‌లా మెరిసింది.

మిగతా వీడియో షాపు ఓనర్ల కన్నా సినిమాల గురించి నాకే ఎక్కువ తెలుసని నాకు గట్టి నమ్మకం. సాయంత్రం అయ్యేటప్పటికి నా కోరిక బలపడింది. మా నాన్న వెస్పా స్కూటర్ తీసుకుని సిటీలోని ఆరేడు వీడియో షాపులు తిరిగొచ్చాను. రాత్రయ్యేసరికి నైజీరియా వెళ్లాలన్న ఆలోచనలు పూర్తిగా మనసులోంచి తుడిచేశాను. మా నాన్న, తాతయ్య, ఇంట్లో వాళ్లందరూ నాకు పిచ్చి పట్టిందనే నిర్ణయానికొచ్చేశారు. నేనవేవీ పట్టించుకోకుండా నా ఆలోచనలు ఎలా అమలుపరచాలా అని తీవ్రంగా ఆలోచించడం మొదలుపెట్టాను.

అప్పటికి వ్యాపారానికి కావలసిన పెట్టుబడి నా దగ్గర లేదు. తెలిసిన వాళ్లొక పది– పన్నెండు మంది దగ్గర ఒక్కొక్కరి నుంచి వెయ్యి నుంచి మూడువేల వరకు తీసుకుని, చివరకు ఇరవైవేలు పోగేశాను. కొన్ని క్యాసెట్లు కొనడానికి ఆ డబ్బు సరిపోతుంది. మరి షాపు పరిస్థితి...? మా నాన్నగారు రిటైర్మెంట్‌కు దగ్గరలో ఉండటంతో కుటుంబాన్నెలా నడపాలా అన్న సందిగ్ధంలో పడిపోయారు.

రిటైర్మెంట్ తరువాత ఆధారం కోసం ఒక జ్యూస్ షాపు పెట్టాలని నాన్న ఆలోచిస్తున్నప్పుడు, మా అంకుల్ ఒకాయన అమీర్‌పేట్‌లో తనకున్న షాపును మా నాన్నగారికి ఎలాంటి డిపాజిట్టూ లేకుండా ఇచ్చారు. నాన్న దగ్గరికి వెళ్లి నా వీడియో లైబ్రరీకి ఆ షాపు ఇవ్వమని అడిగాను. ఎలాంటి స్పందనా లేదు. ఆయన మౌనంగా ఉండటం చూసి, ఆలోచించుకోవటానికి కొంత సమయం కావాలేమో అనుకొని నేను అక్కణ్నుంచి వెళ్లిపోయాను.

మరుసటి రోజు రాత్రి మా ఇంకో అంకుల్ నన్ను అమీర్‌పేటలో ఒక బార్‌కి తీసుకెళ్లారు. డ్రింక్ చేస్తూ మధ్యలో నేను షాపు ఇమ్మని అడిగినందుకు మా నాన్నగారు ఎంత బాధపడ్డారో చెప్పారు. ఆఖరి దశలో తనకోసం ఉంచుకున్నది కూడా బలవంతంగా తన నుంచి అడగడం ఆయన్నెంత కుంగదీసిందో వివరించాడు. దాంతో నేను తీవ్ర ఉక్రోషం, నిరాశానిస్పృహలకు లోనై వీడియో లైబ్రరీ ఆలోచనను అక్కడికక్కడే విరమించుకున్నాను. పెట్టుబడి కోసం సేకరించిన డబ్బులు ఎవరివి వారికిచ్చేసి నైజీరియా వెళ్లాలనే నిర్ణయానికొచ్చేశాను.

బార్ నుంచి మా ఇల్లు కిలోమీటర్ దూరంలో ఉంది. అక్కడి నుంచి ఇంటికి నడుస్తూ వెళ్లగానే నాన్నతో నాకు షాపు అవసరం లేదని చెప్పాలనుకున్నాను. అడుగులువేస్తూ ఆలోచిస్తుంటే నా భావోద్వేగాలు క్రమంగా అడుగంటి, మెల్లిగా లాజిక్ పనిచేయడం మొదలుపెట్టింది. నాన్న డిస్టర్బ్ అయ్యారన్న కారణంతో నేను షాపును వెనక్కి ఇచ్చేస్తే, అది ఆర్థికంగాగాని, ఇంకో రకంగానైనా మా కుటుంబ జీవితంలో మెరుగైన మార్పు తీసుకొస్తుందా? వీడియో లైబ్రరీ సక్సెస్ మీద నాకు అంత నమ్మకం ఉన్నప్పుడు నాన్నని ఇప్పుడు సంతోషపెట్టి, తర్వాత బాధపెట్టాలా? లేకపోతే ఇప్పుడు బాధపెట్టి, తర్వాత సంతోషపెట్టాలా? అనే పాయింట్ మీద బాగా ఆలోచించాను. ఆ కిలోమీటర్ నడక అయ్యేటప్పటికి నా భావోద్వేగాల మీద నా లాజిక్ గెలిచింది. నాన్నగారిని ఏ మాత్రం పట్టించుకోకుండా వీడియో లైబ్రరీ పెట్టడానికి ఏర్పాటు చేసుకోవడంలో మునిగిపోయాను. కాని ఒకవేళ ఆ బార్ మా ఇంటి పక్కనే ఉండుంటే ఉక్రోషంతో నాన్నగారికి నేను వీడియో లైబ్రరీ పెట్టడం లేదని వెంటనే చెప్పేసి ఉండేవాడిని. కిలోమీటర్ దూరం ఉండటంతో నాకు దొరికిన టైమ్ మూలాన, ఎమోషన్స్‌కి లోనవకుండా ఆలోచించడానికి ఒక అవకాశం దొరికి, నేనూ నా కుటుంబం, నా దర్శకత్వ కెరీర్ ఆ కిలోమీటర్ నడక మూలాన రక్షించబడ్డాయి.

తప్పే ఒప్పు!

'సర్కార్ రాజ్'లో సిల్వర్ మణి (కోట శ్రీనివాసరావు క్యారెక్టర్) అంటాడు, 'జిస్కే పాస్ పవర్ హై ఉస్కా రాంగ్ భీ రైట్ హోజాతా హై!' (ఎవడి దగ్గర బలం ఉంటుందో వాడి రాంగ్ కూడా రైటే)

కేవలం అధికారం వల్ల మాత్రమే ఇది సాధ్యపడుతుందని నేను నమ్మను. జీవితం పట్ల మన దృక్పథం కూడా ఇందులో చాలా పెద్ద పాత్ర పోషిస్తుంది.

అమీర్‌పేట్‌లో 'మూవీ హౌజ్' పేరిట వీడియో లైబ్రరీ తెరవాలని నిర్ణయించుకున్నప్పుడు దానికి నా దగ్గర ఉన్న క్యాపిటల్ ఇరవై వేల రూపాయలు. దీనితో వీడియో ఫిలిమ్స్ కొనాలని నా ఆలోచన. నా ఫ్రెండ్ వాళ్ల నాన్నొకరికి వీడియో క్యాసెట్లు అమ్మే బిజినెస్ ఉంది. నేను ఆయన్ని నమ్మాను.కానీ ఆయన నాకు చెడిపోయిన టేపులు అంటగడ్డాడు. కొన్ని 'ప్లే' కావు. ఇంకొన్ని వీసీఆర్‌లో స్ట్రక్ అయిపోయేవి. ఆయనతో డీల్ చేయడం వల్ల నాకు పదివేల రూపాయల నష్టం వచ్చింది. అంటే నా క్యాపిటల్ సగానికి సగం తగ్గిపోయింది. ఇక చేసేది లేక, కేవలం వంద టేపులతోనే నా షాపు ప్రారంభించాల్సి వచ్చింది. ఇదంతా ఒక ఎత్తయితే, అసలు అమీర్‌పేట లాంటి ఏరియాలో వీడియో లైబ్రెరీ అనేది బిజినెస్ పరంగా వర్క్ అవుట్ కాదని కొందరు చెప్పడం మొదలుపెట్టారు. ఎందుకని అడిగితే ఆ ఏరియాలో ఎక్కువగా ఉండేది దిగువ, మధ్య తరగతి కుటుంబాలు. వాళ్ల దగ్గర వీసీఆర్‌లు ఉండవు. పైగా ఆల్రెడీ పంజాగుట్ట సర్కిల్ దగ్గర 'ఫాంటసీ' అనే మరో వీడియో షాపు ఉంది. దానితో పోటీ పడటం మరీ కష్టం. ఎందుకంటే, బంజారా హిల్స్‌లోని ధనవంతులు అందరూ అక్కడికే వెళ్తారు అని హితబోధ చేశారు. నేనెవరి మాటా వినకుండా షాపు పెట్టా, నెల రోజులు తిరిగేసరికల్లా నా షాపు పుంజుకొని 'ఫాంటసీ' వీడియో లైబ్రరీ మూతపడింది.

ఇప్పుడు, నన్ను షాపు అక్కడ పెట్టడం మంచిది కాదన్న అదే సిద్ధాంతకర్తలు 'ఈ రోజుల్లో వీసీఆర్ కొనడం అందరికీ మామూలైపోయింది' అంటారు. 'ఫాంటసీ' దగ్గర కంటే 'మూవీ హౌజ్' పార్కింగ్ ప్లేస్ ఎక్కువ అన్నారు. ఒక 'వాస్తవం' ఉనికిలోకి వచ్చాక మనం ఎన్ని సిద్ధాంతాలైనా రూపొందించుకోవచ్చు. ఒకవేళ షాపు నిజంగానే సక్సెస్ కాకపోతే వాళ్లు ఏమనుండేవారు? 'నేను నీకు ముందే చెప్పాను కదా!' అనేవారు. వర్క్ అవుట్ అయింది కనుక వాళ్లు చెప్పింది కన్వీనియెంట్‌గా మరిచిపోయి, మరో సిద్ధాంతం ప్రతిపాదించారు.

ఇలాంటి 'నిపుణులు' మొదట్నుంచీ నాకు సినిమాల విషయంలో కూడా చాలా సలహాలు ఇస్తూనే ఉన్నారు. అది చెయ్యి, ఇది చెయ్యకూడదూ అంటూ. వీళ్లలాంటి వాళ్లు 'రంగీలా' ఫ్లాప్ అవుతుందన్నారు. నువ్వు లవ్ స్టోరీస్ తీస్తే చూడరు, ఊర్మిళ నెగిటివ్ అవుతుందని అన్నారు. తర్వాత వీళ్లే 'దౌడ్' బ్లాక్‌బస్టర్ అవుతుందన్నారు. ఎందుకూ 'ఖల్ నాయక్' తర్వాత సంజయ్‌దత్, 'రంగీలా' తర్వాత ఊర్మిళ, రెహమాన్‌తో చేస్తున్న సినిమా కాబట్టి. అలాగే 'సత్య' ప్రాజెక్టును అటక మీద పెట్టేయమన్నారు. కారణం, మురికి లొకేషన్స్‌లో ఆ చెమట ముఖాలను ఎవరు చూడాలనుకుంటారు?

అయితే, వీళ్లే 'ఆగ్' (తెలుగులో 'అగ్ని')తో పాటు నా ఇంకొన్ని ఫెయిలయిన సినిమాలను కూడా చేయొద్దన్నారు. కానీ, వీళ్లకు 'ఆగ్' గురించి చెప్పిన సంగతి గుర్తుంటుంది గానీ, 'దౌడ్', 'సత్య' గురించి చెప్పిన విషయాలను 'మరిచిపోతారు'. అలాగని నా నమ్మకాలన్నీ నిజమయ్యాయని కాదు. నేను మా ఫ్రెండు వాళ్ల నాన్నను నమ్మి నష్టపోయినట్టే, నాకు తెలిసిన వీసీఆర్‌లు ఉన్న నా స్నేహితులు ఇంకో ఇరవై మంది మీద నమ్మకంతో నేను నా బిజినెస్ మొదలు పెట్టాను. నేను వాళ్లకి తెలుసు కాబట్టి వాళ్లందరూ నాకే బిజినెస్ ఇస్తారని అనుకున్నాను. అంటే రోజుకు ఇరవై క్యాసెట్లు వెళ్లడం గ్యారంటీ అని నా నమ్మకం. ఇరవై క్యాసెట్లు అటుంచి రోజుకు వంద క్యాసెట్ల రేంజ్‌కి బిజినెస్ పెరిగింది. కానీ, ఆ ఇరవై మందిలో ఎవరూ ఎప్పుడూ నా షాపుకు రాలేదు, వచ్చిన వాళ్లు డబ్బులు ఇచ్చేవాళ్లు కాదు.

ఎందుకంటే నేను వాళ్లకు 'క్లోజ్' కనుక! కచ్చితంగా ఆ ఇరవైమంది వస్తారన్న నా నమ్మకం ఫ్లాప్ అయ్యింది. నేను ఊహించని ఆ వందమంది మూలానా నా షాపు హిట్ అయ్యింది. జీవితం అంటే అంతే మరి!

నా లైబ్రెరీకి వచ్చేవాళ్ల అభిరుచిని బట్టి, క్యాసెట్లలోని సినిమా కథలు చెబుతుండేవాడిని. కొంతమంది నేను కథ చెప్పకపోతే సినిమా కన్నా నేను చెప్పిందే బాగుందనే వాళ్లు. మొత్తానికి ఓ ఎనిమిది నెలలపాటు కౌంటర్ మీద విజయవంతంగా బిజినెస్ చేశాను. ఇక్కడే నా షాపు మీద ఒక పోలీస్ రైడ్ వల్ల మొదటిసారి పోలీసులతో నాకు 'పరిచయం' ఏర్పడింది. అమితాబ్ సినిమా 'ఆఖరీ రాస్తా' పైరసీ క్యాసెట్లు చేసినందుకుగానూ పంజాగుట్ట పోలీస్ స్టేషన్ లాకప్‌లో గడపాల్సి వచ్చింది అప్పుడే. ఫస్ట్ టైం పోలీసులతో స్నేహం చేశాను. వాళ్ల సైకాలజీ అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాను. ఆ అర్థం చేసుకున్న దాన్నే తరువాత నా సినిమాల్లోని పోలీసుల క్యారెక్టర్లకు అప్లై చేశాను. ఏదేమైనా వీడియో లైబ్రెరీ పెద్ద సక్సెస్ కావడంతో నెలకు ఇరవై వేలకు పైగా సంపాదించడం మొదలుపెట్టాను. ఇంజనీర్‌గా ఎనిమిది వందలు నా నెల జీతం కంటే, మా నాన్నగారు నెలకు సంపాదించే పదిహేను వందల కంటే అది చాలా రెట్లు ఎక్కువ. మా నాన్నగారు ఎప్పుడూ నన్ను బయటికి పొగడకపోయినా, నా వైపు గర్వంగా

చూసిన చూపు ఇప్పటికీ మర్చిపోలేను. నా ఆర్థిక పరిస్థితుల్లో అకస్మాత్తుగా వచ్చిన ఈ మార్పు నేను మళ్లీ సినిమాల్లోకి అడుగుపెట్టడం కోసం ప్రయత్నించడానికి కొండంత బలాన్నిచ్చింది. అనుకోని విధంగా నాయుడు ఆ వీడియో లైబ్రెరీ దగ్గర ఆగడం, ఆ బార్ మా ఇంటి నుంచి కిలోమీటర్ దూరం ఉండటం అనేవి నేను డైరెక్టర్ అవ్వటానికి తోడ్పడిన ముఖ్యాంశాలు, లేకపోతే నేనిప్పుడు నైజీరియాలో ఉండేవాడిని. జీవితంలో తప్పులనేవి జరగవు. వెయిట్ చేస్తే అవన్నీ చివరికి ఒప్పులుగా మారతాయి.

శివారంభం

వీడియో లైబ్రరీ నడిపే రోజుల్లో ఒకరోజు మా నాన్నగారు అంటుండగా విన్నాను. నాగార్జున వాళ్ల బ్రదర్ కొత్త సినిమా స్టోరీ కోసం చూస్తున్నారని. దానికి కె.రాఘవేంద్రరావుగారు దర్శకుడు.

వెంకట్ వాళ్ల బావమరిది సురేంద్రగారు మా షాపుకు వస్తుండేవారు. ఆయన ద్వారా అపాయింట్‌మెంట్ సంపాదించగలిగాను. వెంకట్‌గారికి నా 'రాత్రి' కథ వినిపించాను. ఇలాంటి సినిమాలు తెలుగు మార్కెట్‌కు పనికిరావు అన్నారాయన. హీరో ఓరియెంటెడ్ కథ ఏదైనా ఉంటే చెప్పమన్నారు.

నేను అదే రోజు సుమారు ఒక అరగంటలో 'శివ' స్టోరీ వన్‌లైన్ ఆర్డర్ రాశాను. ఇందులో కొన్ని నా కాలేజీ అనుభవాలు, మరికొన్ని గోవింద్ నిహ్లానీ 'అర్ధ సత్య', రాహుల్ రవైల్ 'అర్జున్', దిలీప్ శంకర్ 'కాలచక్ర'లోంచి ఎత్తుకొచ్చిన సీన్లు.

వెంకట్‌గారికి ఈ కథ బాగా నచ్చింది. దాన్ని రాఘవేంద్రరావుగారికి నేరేట్ చేయడానికి నన్ను తీసుకెళ్లారు. ఇదో ప్రయోగాత్మక సినిమాలా ఉందే తప్ప, డ్రామా ఏమీ లేదన్నారు రాఘవేంద్రరావు. ఆయనలాంటి హైలీ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ చెబుతున్నాడంటే, అది నిజమే అయ్యుండొచ్చని అనిపించి, దానిని రీ వర్క్ చేస్తానని చెప్పాను.

ఆ తరువాత ఆయన డైరెక్ట్ చేసిన 'కలియుగ పాండవులు' చూశాను. అప్పుడు నాకు అర్థమైంది, అసలు రాఘవేంద్రరావుగారు 'శివ'ను ఎలా అర్థం చేసుకున్నారూ అని. అదే విషయం వెంకట్‌గారితో చెప్పాను. నిజంగా నా స్టోరీ నచ్చితే గనక, నాకు ఎవరి దగ్గరైనా అసిస్టెంట్ డైరెక్టర్‌గా అవకాశం ఇప్పించమని అడిగాను. అప్పుడు నా సబ్జెక్ట్ నేనే దర్శకత్వం చేసుకోగలను కదా!

అప్పటికి నాకు సురేంద్రగారితో కొంచెం చనువు ఏర్పడింది. ఆయన బి.గోపాల్‌గారితో 'కలెక్టర్ గారి అబ్బాయి' ప్రారంభించబోతున్నారు. నాగార్జున, ఏఎన్నార్‌గారు అందులో నటిస్తున్నారు. అలా నేను ఐదో అసిస్టెంట్ డైరక్టర్‌గా బి.గోపాల్ దగర చేరాను.

గోపాల్‌గారు చాలా బిజీ. ఆయన ఇంకేదో సినిమాను అప్పటికి పూర్తి చేయాల్సి ఉంది. సో, 'కలెక్టర్ గారి అబ్బాయి' స్క్రిప్ట్ సెషన్స్‌కు రచయితలు కొమ్మనాపల్లి గణపతి రావుగారు, సూర్యదేవర రామమోహనరావు గార్లతో పాటు నేను పాల్గొన్నాను. వాళ్ల

చర్చలు వింటున్నప్పుడు నాకు కొన్ని ఐడియాస్ వచ్చేవి. వాటితో నేను వాళ్లని ప్రభావితం చేయగలిగాను. వాళ్లిద్దరూ నా మీద చాలా ఇంప్రెస్ అయ్యి, సురేంద్రగారితో నా గురించి చాలా బాగా చెప్పారు. అప్పట్నుంచి నన్ను పికప్ చేసుకోవడానికి సురేంద్రగారు మా ఇంటికి కారు పంపడం మొదలెట్టారు. బస్సులోను, అప్పుడప్పుడూ మా నాన్నగారి స్కూటర్‌లోను వెళ్లే నాకు ఇది ఒక పే...ద్ద... గెంతు. అప్పటికి నేను ఇంకా నాగార్జునను కలవలేదు.

అంతా సిద్ధమై గోపాల్‌గారు షూటింగ్ ప్రారంభించే నాటికి, నా నేరేషన్స్, నా సినిమా నాలెడ్జ్ మీద వెంకట్‌గారికి, సురేంద్రగారికి మంచి ఇంప్రెషన్ ఏర్పడింది. దీన్ని చాలామంది జీర్ణించుకోలేకపోయే వాళ్లు. ఎందుకంటే, నేను కేవలం ఐదో అసిస్టెంట్‌నే. నాకు అంత ఇంపార్టెన్స్ ఇవ్వడం ఏంటి? ఆ రోజుల్లో అసిస్టెంట్ డైరెక్టర్ అంటే ఏదో చెప్పిన పని చేసుకుపోయేవాళ్లనే అభిప్రాయమే తప్ప, వాళ్లకు అంత ప్రాధాన్యం ఎవరూ ఇచ్చేవాళ్లు కాదు.

నా ఆటిట్యూడ్, నేను ఇంగ్లీషులో మాట్లాడగలగడం వాళ్లకు మూడ్ ఆఫ్ చేసేది. ఇది ఎంతవరకూ వచ్చిందంటే, ఒకసారి సురేంద్రగారు, గోపాల్‌గారు సినిమా బడ్జెట్ ఎలా తగ్గించాలా...? అని చర్చించుకుంటుండగా, బడ్జెట్ తగ్గించటానికి గోపాల్‌గారు చెప్పిన సలహాల్లో ఒకటి... నన్ను తీసేయమనడం, పైగా క్లాప్‌బోర్డులు, కంటిన్యుటీ బుక్స్ పోగొట్టడం లాంటి ట్రాక్ రికార్డు కూడా నాకుంది. దాంతో సురేంద్రగారు నన్ను బాధ్యతల నుంచి తప్పించారు. దీనివల్ల నాకు చాలా కలిసొచ్చింది. సెట్లో నేను ఫ్రీగా తిరగగలిగాను.

నాకు మెల్లిగా నాగార్జునతో పరిచయం పెరగడం మొదలైంది. నేను కథ చెప్పే విధానం, నా సినిమా సెన్స్ తనకి బాగా నచ్చాయి. కానీ తన మొదటి సినిమా 'విక్రమ్' తర్వాత కొన్ని ఫ్లాపులు వచ్చాయి. మొదటిదైనా ఆడిందంటే దానికి కారణం, నాగేశ్వర్రావు గారి అబ్బాయి మొదటి చిత్రం అని అందరూ అనేవాళ్లు. దాంతో నాగార్జున నాకు సినిమా ఇచ్చే విషయంలో సొంతంగా నిర్ణయం తీసుకునే స్థితిలో లేడు. మొత్తానికి నేను నాగార్జున చెంచాగా, ఒక చెత్త అసిస్టెంట్ డైరెక్టర్‌గా, ఆటిట్యూడ్ ప్రాబ్లెమ్ ఉన్న ఓ పొగరుబోతుగా పేరు తెచ్చుకున్నాను.

ఈలోగా నా వీడియో లైబ్రరీని నా షాప్‌లో పనిచేసేవాళ్లకి అప్పగించాను. బిజినెస్ దెబ్బతినడం మొదలుపెట్టింది.

"నేను నీకు ముందే చెప్పాను కదా" బాపతుగాళ్లు మళ్లీ వచ్చి చెప్పడం మొదలుపెట్టారు. డైరెక్టర్ కావాలనే పిచ్చి పిచ్చి కలలు కనడం మానెయ్యి అంటూ. నేను వాళ్ల మాటలు వినకుండా ముందుకు దూసుకెళ్లి 'శివ'ని రియాలిటీగా మార్చాను. కానీ 'శివ' రియాలిటీగా మారడం దానంతటదే సాధ్యమవ్వలేదు. సాధ్యపడేలా చేశాను. ఎలా అంటే? అబద్ధాలు చెప్పి, చాలా నాటకాలు ఆడి.

బ్యాక్‌సీట్ డైరెక్టర్

'కలెక్టర్ గారి అబ్బాయి' సెట్స్ మీద ఉన్న సమయంలోనే సురేంద్రగారికి 'ద సౌండ్ ఆఫ్ మ్యూజిక్' ఆధారంగా ఒక సినిమా తీస్తే బాగుంటుందన్న ఆలోచన వచ్చింది. తర్వాత అదే 'రావుగారిల్లు'గా రూపుదిద్దుకుంది.

'కలెక్టర్ గారి అబ్బాయి'కి నేను లేట్‌గా చేరినందువల్ల చాలావరకు స్క్రిప్ట్ వర్క్ అయిపోవచ్చింది. అలాగే, కాస్టింగ్, టెక్నీషియన్ల ఎంపికలాంటి నిర్ణయాలు కూడా జరిగిపోయాయి. కాబట్టి 'రావుగారిల్లు' నాకో మంచి అవకాశం. ఒక సినిమా... ఆలోచన దశనుంచి నేను దగ్గరగా చూడొచ్చు. ఈలోగా నేను సురేంద్రగారికి, వెంకట్‌గారికి, నాగార్జునకు నా మాటల చాతుర్యం వల్ల దగ్గరవ్వడంతో నా స్టేటస్ పెరిగింది. కానీ ఈ మాత్రానికే నాకు సినిమాను డైరెక్టు చేసే అవకాశం ఇచ్చేంత సీన్ లేదు.

వాళ్లకున్న ప్రధాన భయమల్లా నాకు ప్రాక్టికల్ ఎక్స్‌పీరియన్స్ లేదని. కానీ నేను ఆలోచించి సురేంద్రగారిని ఒక విషయంలో ఇన్‌ఫ్లుయెన్స్ చేయగలిగాను. 'రావుగారిల్లు'కు ఓ పెద్ద దర్శకుడు కావాలని ఆయన అనుకుంటుండగా, కొత్తవాడైనా మంచి అనుభవజ్ఞుడ్ని తీసుకుంటే బెటర్ అని ఆయన్ను ఇన్‌ఫ్లుయెన్స్ చేశాను. అలా రావు గారిల్లు డైరెక్టర్‌గా బి.గోపాల్‌గారి అసిస్టెంట్ 'తరణి' పేరు తెరమీదకి వచ్చింది.

తరణికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పద్నాలుగేళ్ల అనుభవం ఉంది. తనని డైరెక్టర్‌ని చేయడంలో నాకు కలిసొచ్చేది ఏమిటంటే, తరణిగారు నాకు బాగా తెలుసు. ఆయన డైరెక్ట్ చేస్తే, అన్నింట్లోనూ నేను ఇన్వాల్వ్ కావొచ్చు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే, నేను బ్యాక్‌సీట్ డైరెక్టర్ కావొచ్చు. ఇదీ నా ప్లాన్. కానీ, నేను వేసిన చాలా ప్లాన్స్‌లాగే ఇదికూడా ఫ్లాప్ అవ్వడం మొదలయ్యింది.

మొదట్లో నేను అవకాశం ఇప్పించానన్న కృతజ్ఞత తరణిగారికి ఉండేది. కానీ, నేను అదే పనిగా ఆయన ప్రతీపనిలో కల్పించుకోవడంతో ఆయనకు చిర్రెత్తుకొచ్చేది. పైగా నేను పెద్దవాళ్లతో రాసుకుపూసుకు తిరుగుతున్నానన్న ప్రాబ్లమ్! జయసుధ, రేవతి లాంటి వాళ్లు నాకున్న వాక్చాతుర్యం వల్ల తరణి కంటే నాతో ఎక్కువ డిస్కస్ చేసేవారు. తరణిగారిని ఇది బాగా అప్‌సెట్ చేసేది.

ఇది ఎందాకా వచ్చిందంటే, సురేంద్రగారికి అల్టిమేటమ్ ఇచ్చారు తరణి, నేను సెట్లో ఉంటే, డైరెక్టు చేయనని. సురేంద్రగారి డైలెమా చూసి నేనే పక్కకు

తప్పుకుంటానన్నాను. అయితే సమస్య ఎక్కడ వచ్చిందంటే, అసలు కథను యాక్టర్స్ అందరికీ నెరేట్ చేసింది నేను. తరణిగారేమో అలా షూట్ చేయట్లేదు. ఆ మార్పులకు కారణం చెప్పడు. దీంతో అందరూ అసౌకర్యంగా ఫీలయేవాళ్లు.

ఈలోగా 'కలెక్టర్ గారి అబ్బాయి' విడుదలై హిట్ అయ్యింది. నాగార్జున ఫామ్‌లోకి వచ్చాడు. ఇప్పుడు నాకు దర్శకుడుగా ఛాన్స్ ఇచ్చే రిస్క్ తీసుకోగలడు. కానీ ఏఎన్నార్‌గారు తిరస్కరించారు. "రాము ఏదో ఇంగ్లీష్ మాట్లాడతాడు కాబట్టి, ఇంగ్లీష్ నవలల నుంచి కోట్ చేసి చెబుతుంటాడు కాబట్టి, అతడు దర్శకత్వం కూడా చెయ్యగలడనుకోవడం మీనింగ్‌లెస్' అన్నారు. నాగార్జున హెల్ప్‌లెస్!

ఇదిలా ఉండగా, రావుగారిల్లులో ఏఎన్నార్‌గారితో ఓ ముఖ్యమైన సీన్ షూట్ చేస్తున్నారు తరణి.

ఆ సీన్ గురించి ఏఎన్నార్‌గారికి ఒక సందేహం వచ్చింది. దానికి తరణి జవాబివ్వలేకపోయారు. తప్పించుకోవడానికి ఆ ఐడియా నేను చెప్పాను కాబట్టి, సురేంద్రగారు దాన్ని ఒప్పుకున్నారు కాబట్టి బలవంతంగా షూట్‌చేస్తున్నాను అన్నారు. ఏఎన్నార్ గారు నన్ను పిలిపించారు. ఆ సీన్ ఎంత చెత్తగా ఉందో అని ఆయన ఏదో అనబోయారు. నేను ఆ సీన్ ఏమిటో, అది ఎలా షూట్ చేయాలో మొత్తం వివరించాను. నా వివరణ ఆయనకు చాలా నచ్చి, ఆయనకు తరణి తప్పుగా తీస్తున్నారని అర్థమైంది.

అంతేకాదు, అసలు ఆ సీన్‌లోని పాయింట్ ఏమిటో కూడా తరణికి అర్థం కాలేదని ఆయనకు అర్థమైంది. దాంతో అది పూర్తయ్యేంతవరకూ నన్ను అక్కడే ఉండమన్నారు. ఇంకా చెప్పాలంటే, నా మీద మంచి ఇంప్రెషన్ వచ్చి నాగార్జునకి, నాకు బ్రేకు ఇచ్చే విషయంలో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నాగార్జున ఎలాగూ నామీద పాజిటివ్‌గానే ఉన్నాడు. వెంకట్‌గారికీ, సురేంద్రగారికీ నేను ఓ.కే. కానీ ఎందుకో అప్పటికీ వాళ్లు త్వరగా ఓ నిర్ణయం తీసుకోలేకపోయారు. ఇప్పుడో అప్పుడో చూద్దాం అంటున్నారు. ఆ చూడటం ఎప్పుడు?

కొన్ని అబద్ధాలు - ఒక నిజం

బి.గోపాల్‌గారితో, 'విజయ్' అని ఓ సినిమా ప్లాన్ చేస్తున్నామన్నారు వెంకట్‌గారు. సురేంద్రగారేమో మళ్లీ తండ్రీకొడుకులతో కోదండరామిరెడ్డి గారి దర్శకత్వంలో ఇంకో సినిమా ఉందన్నారు. దీని తర్వాత కె. రాఘవేంద్రరావుగారితో మరొకటి ఉందట. ఇవన్నీ అయితే గానీ నా సినిమాకు మోక్షం రాదు. అన్ని రోజులు ఆగటం నా వల్లకాదు.

అప్పటికి నాకు సినీ పరిశ్రమ ఎలా వర్క్ చేస్తుందో, సినిమావాళ్ల మనస్తత్వాలేమిటో బాగా అర్థమైంది. కోదండరామిరెడ్డి గారి సినిమాకు నన్ను స్టోరీ గాయమన్నారు సురేంద్రగారు. రాశాను. గణేశ్‌పాత్రోగారిని డైలాగ్స్ కోసం తీసుకున్నారు. కోదండరామిరెడ్డిగారు ఆ రోజుల్లో ఏడాదికి 5-6 సినిమాలు చేసేవారు. ఒక్కొక్కసారి ఆయనకు ఆయన షూట్ చేస్తున్న సినిమా కథేమిటో వింటానికి కూడా టైం ఉండేది కాదు. నేను చెప్పిన కథ కోదండరామిరెడ్డి గారికి, గణేశ్‌పాత్రోగారికి ఇద్దరికీ నచ్చింది.

దీన్నే ఏఎన్నార్‌గారికి నెరేట్ చేయడానికి పాత్రోగారిని హైదరాబాద్ పంపాలనుకున్నారు సురేంద్రగారు. అప్పుడు మేమంతా చెన్నైలో ఉన్నాం. అక్కినేని గారు వేరే షూటింగ్ కోసం హైదరాబాద్‌లో ఉన్నారు. ఆ రాత్రి నేను పాత్రోగారిని కలిసి, ఏఎన్నార్‌కు నెరేట్ చేసే అవకాశం నాకే ఇమ్మని అడిగాను. ఆయనకేమీ ఇబ్బంది లేదు. ఎలాగూ నేను రాసిన కథే. పైగా పోవాల్సిన బాధ తప్పుతుంది. దీన్నే ఆయన సురేంద్రగారికి చెప్పారు. సురేంద్ర ఒప్పుకున్నారు.

ఇక్కడ మళ్లీ నేను ఇంకో ఎత్తు వేశాను. ఆ స్టోరీని ఏఎన్నార్‌గారికి కావాలని ఎలా చెప్పానంటే, ఆ స్క్రిప్టులో చాలా లోపాలున్నాయని ఫీలయ్యారు ఏఎన్నార్‌గారు. నాకు కావల్సిందీ అదే. ఆయన పాత్రోగారితో, సురేంద్రగారితో ఫోన్లో మాట్లాడి, ఈ స్టోరీ వర్క్‌అవుట్ కాదన్నారు. వాళ్లకు విషయం ఏమిటో అర్థం కాలేదు గానీ ఏదో తేడా జరిగిందని, నేను చెన్నై తిరిగి రావటం కోసం ఎదురు చూశారు.

నేను చెన్నై తిరిగి వచ్చి వాళ్లకి అసలు అక్కినేనిగారికి చెప్పినదానికి పూర్తి రివర్సులో ఇంకేదో చెప్పాను. వాళ్లు మరింత కన్‌ఫ్యూజ్ అయ్యారు. నా ధీమా ఏమిటంటే, కోదండరామిరెడ్డిగారికి ఎలాగూ కథని సరిచేసే టైం ఉండదు. పాత్రోగారి చేతిలో పది సినిమాలున్నాయి. పైగా ఆయన డైలాగ్ రైటర్ మాత్రమే. మొత్తానికి ఎలాంటి పరిస్థితి వచ్చిందంటే, ఇప్పుడు చేతిలో స్క్రిప్టేమీ లేదూ, నాగార్జున డేట్స్ ఊరికే వేస్ట్ అయ్యేట్టున్నాయి.

అప్పుడు, నాగార్జున ఆఫీసు పై అంతస్తులో ఉన్నాడు. నేను తన దగ్గరికెళ్లి, కోదండరామిరెడ్డిగారి సినిమాకి స్క్రిప్టు లేదని చెప్పాను. "ఎలాగూ నాది రెడీగా ఉంది, నాకు దర్శకుడుగా ఛాన్స్ ఇవ్వాలని నీకు ఉద్దేశం ఉన్నప్పుడు ఆ ఎప్పుడో ఇచ్చేది ఇప్పుడే ఎందుకు ఇవ్వకూడదు?" అని అడిగాను. సురేంద్ర ఏమంటాడో అన్నారాయన.

సురేంద్ర దగ్గరికి వెళ్లి, "అనవసరంగా నాగార్జున డేట్స్ వృథా అయిపోతాయి, మళ్లీ ఎప్పటికో గానీ దొరకవు. ఒకవేళ నాగార్జున ఇదే డేట్స్‌కు నాతో సినిమా చేయడానికి ఒప్పిస్తే, మీకు ఓకేనా" అని అడిగాను? ఆయన ఆలోచిస్తుండగానే.

మళ్లీ నాగార్జునను కలిసి, సురేంద్రగారు నాతో సినిమా చేయడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పాను. నాగార్జున ఓకే అన్నారని సురేంద్రగారికి చెప్పాను.

ఇందులో బేసిక్ పాయింట్ ఏమిటంటే, వాళ్లిద్దరినీ వాళ్లకే తెలియకుండా ఏ మానసికస్థితికి తెచ్చానంటే, ఎదుటివాడికి చాలా ఓకే అని. దీని తరువాత కూడా ఇద్దరూ వెంకట్‌తో మాట్లాడాలన్నారు.

అప్పుడు వెంకట్‌గారు ఏదో పనిమీద బయటికివెళ్లారు. అర్ధరాత్రిదాకా ఆయన కోసం వెయిట్ చేశాను. రాగానే చెప్పాను, 'సురేంద్రగారు, నాగార్జున ఇద్దరూ నాతో సినిమా తీయడానికి నిర్ణయించుకున్నారు' అని. అయినా ఆయన నాకు కమిట్ కాలేదు. తెల్లారి నేను వెంకట్ కంటే ముందు నిద్రలేచి, ఆ ఇద్దరికీ చెప్పాను, వెంకట్‌గారు చాలా హ్యాపీగా ఫీలయ్యారని. తరువాత ఆ రోజంతా ముగ్గురిలో ఏ ఇద్దరూ కూడా నేను లేకుండా కలవకుండా మేనేజ్ చేశాను.

వాళ్లలో వాళ్లకు చిన్న చిన్న ప్రాబ్లమ్స్ అప్పట్లో ఏవో ఉండేవి. దాన్ని నేను అడ్వాంటేజ్‌గా తీసుకున్నాను. ఒకరు వ్యతిరేకించినా మిగతా ఇద్దరూ నన్ను సపోర్ట్ చేస్తారేమో అనే ఫీలింగ్ వాళ్ల ముగ్గురిలో విడివిడిగా క్రియేట్ చేశాను.

మెల్లిగా ఈ విషయాన్ని నేను ఆఫీసులో మిగతా స్టాఫ్‌కి లీక్ చేశాను. వాళ్లలో ఒకరు సురేంద్రగారిని అడిగారు, "కోదండరామిరెడ్డి గారి ప్రాజెక్టు ఆగిపోయిందట కదా?' అని. వీళ్లకు ఎలా తెలిసిందా అని ఆయన ఆశ్చర్యపోయారు. నేను వెంటనే సురేంద్రగారితో, ఇది నాగార్జునగారివల్లో, వెంకట్‌గారివల్లో జరిగుంటుందనీ, వెంటనే కోదండరామిరెడ్డిగారికి మీరు విషయం చెప్పాలనీ, ఎవరో బయటి వ్యక్తులు ఆయన దృష్టికి తీసుకువస్తే బాగుండదనీ అన్నాను. సురేంద్రగారు అలాగే అన్నారు. కోదండ రామిరెడ్డి గారిని కలిసి విషయం చెప్పారు.

దాంతో ఆ వార్త దావానలంలా వ్యాపించింది. అన్నపూర్ణ స్టూడియోస్ లాంటి సంస్థ ఓ పెద్ద దర్శకుడి సినిమాని ఆపేసి, రామ్‌గోపాల్‌వర్మ అనే ఒక కొత్త కుర్రాడికి అవకాశం ఇస్తోందని. ఇండస్ట్రీలో ఇలాంటిది ఎప్పుడూ జరగలేదు.

ఇక ఆ తరువాత ముగ్గురూ ఆధికారికంగా ఏఎన్నార్‌తో చెప్పడం, ఆయన ఓకే అనడం, 'శివ' ప్రీ ప్రొడక్షన్ స్టార్ట్ అవడం వెంటవెంటనే జరిగిపోయాయి.

నిజమే, నేను దీనితో సంబంధం ఉన్నవాళ్లందరికీ అబద్ధాలు చెప్పాను. కాని ఒక నిజాన్ని మాత్రం నేను బలంగా నా మనఃస్ఫూర్తిగా నమ్మాను, కోదండరామిరెడ్డిగారు తీయబోయే సినిమా కంటే 'శివ' కచ్చితంగా మంచి సినిమా అవుతుందని. అలాగే అది అందరికీ మంచి చేస్తుందని కూడా. అఫ్‌కోర్స్ అందరికంటే ఎక్కువ మంచి నాకే అనుకోండి.

'శివ' పురాణం

రౌడీలంటే చిన్నప్పుటినుంచి నాకో ఇంట్రెస్ట్ ఉండేది. చిన్నప్పుడు స్కూల్లో, క్లాస్‌రూమ్‌లో పిల్ల రౌడీల దగ్గర్నించి నేను పెరిగిన తరువాత వీధి రౌడీల మీద కూడా నాకు చాలా ఇంట్రెస్ట్ ఉండేది.

సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చేస్తున్నప్పుడు నేనొక టఫ్‌గై అనే భావం అందరిలో ఉండేది. నిజానికి నేనెవరినీ ఎప్పుడూ కొట్టకపోయినా, అవసరమైతే ఎవరినైనా ఎదుర్కోగలను అనే భ్రమ మాత్రం అందరికీ కలిగించాను.

నా చుట్టూ ఉండే ఆరుగురు రౌడీ కుర్రాళ్లకి మాత్రమే ఆ విషయం తెలుసు, నిజంగా ఫైట్ జరిగితే నేనొక పంచ్ కూడా ఇవ్వలేనని. కానీ, ఆ ఆరుగురిలో ప్రతి ఒక్కరికీ నాకేమైనా ప్రాబ్లమ్ వస్తే మిగిలిన ఐదుగురూ ఎంతకైనా తెగిస్తారనే అభిప్రాయాన్ని కలిగించాను. సిద్ధార్థ కాలేజీలోని రౌడీలతో నా అనుభవాల ఆధారంగానే, సత్య, కంపెనీ, సర్కార్ సినిమాల్లో రౌడీల మనస్తత్వాల్ని తెరకెక్కించాను. అంతేగాని ప్రచారంలో ఉన్నట్టు అండర్ వరల్డ్‌తో నాకున్న సంబంధాల వల్ల కాదు.

'శివ' సినిమా ఓపెనింగ్ సీన్‌లో కారులో కొంతమంది స్టూడెంట్స్‌ని కొట్టడం అనేది మా కాలేజీలో జరిగిన సంఘటనే. ఈ సినిమాలో కనిపించే వాతావరణం అంతా నా కాలేజీ బ్యాక్‌గ్రౌండ్‌లోంచి వచ్చింది. 'శివ' స్టోరీ లైన్ బ్రూస్లీ సినిమా 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' నుంచి తీసుకున్నాను. బ్రూస్లీ హాంకాంగ్ నుంచి రోమ్‌కు వచ్చి, అక్కడ చైనా రెస్టారెంట్‌లో పనిచేయడం, అక్కడి లోకల్ గూండాలు రెస్టారెంట్ యజమానిని వేధించడం, బ్రూస్లీ వారితో పోరాటానికి దిగి రెస్టారెంట్‌ను కాపాడటం, ఆ పోరాటం అలా సాగుతూ చివరికి ప్రధాన ప్రత్యర్థి 'చక్‌నారిస్'తో బ్రూస్లీ కలోజియమ్‌లో ఒంటరిగా ఫైట్ చేయడం.

అలాగే 'శివ'లో నాగార్జున వేరే టౌన్ నుంచి వచ్చి కాలేజీలో చేరడం, తోటి విద్యార్థులను లోకల్ గూండాలు వేధించడం, 'శివ' ఆగ్రూప్‌లోని ఒక్కొక్కడితోనూ పోట్లాడటానికి దిగి, కాలేజీని కాపాడటం, చివరకు ప్రధాన ప్రత్యర్థి రఘువరన్‌తో బిల్డింగ్ టెర్రస్ మీద ఒంటరిగా ఫైట్ చేయడం సేమ్ టు సేమ్ స్టోరీ. హహ్హాహ్హా!

ఇలాంటి ఒక సింపుల్ ప్లాట్‌ను తీసుకుని, ప్రేక్షకులు అంతకు ముందెన్నడూ చూడని కారెక్టర్స్‌ను, సీన్స్‌ను రూపొందించాలనుకున్నాను. అందుకోసం చాలా సినిమాల నుంచి కొన్ని కొన్ని సీన్స్ కాపీకొట్టాను. గణపతి చందా సీన్‌ను దిలీప్ శంకర్ 'కాల్‌చక్ర' నుంచి, ఒకపాటకు ముందు అమల నాగార్జునకు కాఫీ ఇచ్చే సీన్‌ను సంజీవ్‌కుమార్

ఏదో చిత్రం నుంచి, సైకిల్ ఛేజ్ సీన్ రాహుల్ రవైల్ 'అర్జున్' నుంచి, మరణించిన స్నేహితుడి తల్లి ఇన్‌స్పెక్టర్‌ను చెంపమీద కొట్టే దృశ్యం స్టీవెన్ స్పీల్‌బర్గ్ 'జాస్' నుంచి తీసుకున్నాను.

నాకేం కావాలో విపరీతమైన క్లారిటీ ఉండటం వల్ల ఎలాంటి హడావుడీ లేకుండా షూటింగ్ చాలా ఫాస్ట్‌గా జరిగింది. ఎడిటింగ్ ముగిసిన తరువాత అసలు కష్టాలు మొదలయ్యాయి. మా సినిమాకు సంబంధం లేని ఇద్దరు ప్రొడ్యూసర్ల వ్యక్తులకి డబల్ పాజిటివ్ ఒక ప్రొజెక్షన్ ఏర్పాటు చేశారు. వాళ్లు సినిమా చూసి ఏ మాత్రం డ్రామా లేకుండా బోరింగ్‌గా ఉందని పెదవి విరిచారు.

బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సౌండ్ ఎఫెక్ట్స్ లేకపోవడంతో వాళ్లకి ఒక సైలెంట్ సినిమాలా అనిపించింది. ఆ రోజుల్లో అలాంటి అండర్ ప్లే పెర్‌ఫామెన్స్ ఉండకపోయేది. ఆ పరిస్థితిలో నాగార్జున నాకు పెద్ద అండలా నిలిచి బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, సౌండ్ ఎఫెక్ట్స్ నాకు నచ్చిన విధంగా చేయించుకోవటానికి పూర్తిగా సహకారం ఏర్పాటు చేశాడు.

సినిమా కాపీ చూసిన డిస్ట్రిబ్యూటర్లు 'శివ'లో ఎక్కువ హింసాపూరిత దృశ్యాలున్నాయనీ, దానివల్ల మహిళలు, కుటుంబ ప్రేక్షకులు ఈ సినిమా చూడరనీ అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రేక్షకుల్లో మహిళలు, ఫ్యామిలీ ఆడియన్స్ ఎక్కువ శాతమని ఇండస్ట్రీ వర్గాల నమ్మకం.

సురేంద్రగారు, వెంకట్‌గారు యావరేజ్ బిజినెస్ చేస్తుందని అనుకున్నారు. కానీ నేను మాత్రం 'శివ' పెద్ద హిట్ అవుతుందని చెప్పాను.

సినిమా విడుదలైన మొదటిరోజు వెంకట్ గారికి ఒక డిస్ట్రిబ్యూటర్ నుంచి ఒక రిపోర్ట్ అందింది. ఆడియన్స్ సినిమాను ఎలాంటి రెస్పాన్స్ లేకుండా నిశ్శబ్దంగా చూస్తున్నారని. దానికి కారణం ఏంటో మాకు అర్థం కాలేదు. ఆ రోజు సాయంత్రం అదే డిస్ట్రిబ్యూటర్ మళ్లీ ఫోన్ చేసి చెప్పాడు– "ఆడియన్స్ సినిమాను నిశ్శబ్దంగా చూడటానికి కారణం వాళ్లు స్టన్ అయిపోవడమే"నని.

శివ బాక్సాఫీస్ దగ్గర సంచలనాలు సృష్టించడంతో, ఆంధ్రదేశంలో ప్రతి ఇంటా నా పేరు మారుమోగిపోయింది. సురేంద్ర, వెంకట్‌గార్ల ఆలోచన తప్పి, నా నమ్మకమే గెలవడంతో సంతోషంతో పొంగిపోయాను.

గమనిక : 'రాత్రి' సినిమా మీద నాకు 'శివ' కంటే పెద్ద హిట్ అవుతుందనే నమ్మకం ఉండేది. కానీ, అది సూపర్ ఫ్లాప్ అయ్యింది.

జ్ఞాపకాల 'చైను'

శివ గురించి కొన్ని సంగతులు:

ఒరిజినల్‌గా సినిమాలో విలన్ పేరు 'శివ'. నాగార్జునకు నేను స్క్రిప్ట్ చెబుతున్నప్పుడు తన క్యారెక్టర్‌కు ఆ పేరు బాగుంటుందని సజెస్ట్ చెయ్యటంతో అలా మార్చేశాను.

విజయవాడలో ఒక పేరుమోసిన రౌడీకి రాధ అనే అమ్మాయి పేరుండటాన్ని దృష్టిలో ఉంచుకుని 'శివ'లో విలన్‌కు కూడా ఒక అమ్మాయి పేరు 'భవాని' అని పెట్టాను.

'అమెరికన్ సినిమాటోగ్రాఫర్' మ్యాగజైన్‌లో స్టడీకామ్ గురించి చదివి, ఒక కెమెరా అసిస్టెంట్‌తో దాని గురించి మాట్లాడుతున్నప్పుడు తను ఒక షాకింగ్ న్యూస్ చెప్పాడు, నాలుగేళ్లుగా చెన్నైలో స్టడీకామ్ కెమెరా ఉందనీ, ఇంతవరకూ దాన్నెవరూ వాడలేదనీ. ఆ తరువాత కెమెరామన్ గోపాల్‌రెడ్డితో ఆ విషయం చర్చించాను. ఆయన స్టడీకామ్‌ని ఉపయోగించటానికి అంతగా ఆసక్తి చూపలేదు.

దానికి రెండు కారణాలు చెప్పారు. మొదటిది ఫోకస్ కంట్రోల్ చేయలేమని, రెండు ఫ్రేమ్ సెంటర్ చేయడం సాధ్యం కాదనీ. ఛేజ్ సీన్‌కు ఈ రెండూ అంత ముఖ్యం కాదని గోపాల్‌రెడ్డితో మాట్లాడి ఒప్పించాను. స్టడీకామ్‌ను ఉపయోగించిన మొదటి డైరెక్టర్‌గా నా పేరు నిలిచిపోయింది.

'శివ' రిలీజ్ తర్వాత ఏడాదిలో పది స్టడీకామ్‌లు ఇంపోర్ట్ అయ్యాయి. అంతకుముందు నాలుగేళ్ల నుంచీ ఎవరూ వాడకుండా అది చెన్నైలో ఉందన్న విషయాన్ని మర్చిపోకూడదు. కొత్త టెక్నాలజీకి ప్రజలెప్పుడూ ఆమడ దూరంలో ఉంటారు. దాన్ని తీవ్రంగా ప్రతిఘటిస్తారు. దాన్ని ఇంకెవరైనా వాడేదాకా ఎదురు చూస్తుంటారు.

శివలో చాలా ఫైట్ సీక్వెన్స్‌లు నేనే డిజైన్ చేశాను. రాజు అనే ఫైట్ మాస్టర్ ఆ రోజుల్లో ఇండస్ట్రీలో టాప్ పొజిషన్‌లో ఉన్నాడు. అతను చేసినవి నచ్చక ఆ బాధ్యత నేనే తీసుకున్నాను. ఒకసారి 'శివ'ను గమనిస్తే నాగార్జున ఎక్కువగా మొహంమీద, పొత్తి కడుపులో పంచ్‌లు ఇస్తుంటాడు. ఎందుకంటే బాక్సింగ్‌లో నేను నేర్చుకున్నవి ఆ రెండే!

దర్శకుడుగా మొదటిసారి ముంబయిలోని ఒక తెలియని వ్యక్తి నుంచి కాంప్లిమెంట్ అందుకున్నాను. చెన్నైలో సినిమా పరిశ్రమ స్ట్రయిక్ చేస్తున్న మూలాన, ఇళయరాజా ముంబైలో శివ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ చేశారు. బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ జరుగుతుండగా ఒక వయొలిన్ ప్లేయర్ నా దగ్గరకు వచ్చి, "ఈ సినిమా అద్భుతం"! అన్నాడు. అతడి

పేరు ఇస్మాయిల్ దర్బార్. ఆయనే ఆ తరువాత 'హమ్ దిల్ దే చుకే సనమ్', 'దేవదాస్' సినిమాలకు సంగీతం అందించాడు.

శివ, జె.డి.ల ఫస్ట్ ఫైట్ ఫుట్‌బాల్ ఆట బ్యాక్‌గ్రౌండ్‌లో ప్లాన్ చేద్దామనుకున్నాను. ఒమెన్ పార్ట్-2, డామియన్ లోంచి ఈ సీన్ ఇన్‌స్పైర్ అయ్యాను. కానీ దీనికి వెంకట్‌గారు అంతగా స్పందించలేదు. దాంతో సైకిల్ చైన్ ఐడియాతో వచ్చాను. ఇది వెంకట్‌గారికి కనెక్ట్ అయింది. ఇంటికి వెళ్లి సైకిల్ చైన్ లాగుదామని ప్రయత్నించాను. సాధ్యం కాలేదు. గట్టిగా లాగితే నా చెయ్యి ఊడి వస్తుందేమో గానీ, చైన్ తెగదని అర్థమైంది. కానీ ఆ సీన్‌ను సినిమాలో వాడకుండా ఉండలేకపోయాను. ఎందుకంటే అది డెఫినెట్‌గా పండుతుందని నానమ్మకం. చైన్ తెగుతుందా? తెగదా? అని జనంలో ఇప్పటివరకూ ఎవరూ ప్రయత్నించి ఉండరు. ఆ నమ్మకం మీద ఛాన్స్ తీసుకుందామని డిసైడైపోయి ఛాన్స్ తీసేసుకున్నాను.

నా ప్లాన్ ఫలించింది. ఎంత ఫలించిందంటే, ఇరవై యేళ్ల తర్వాత కూడా ఇప్పటికీ చాలమంది మేం 'శివ' చూసి సైకిల్ చైన్‌ను ఆయుధంలా వాడుకున్నామని చెప్పుకుంటారు. అది కేవలం వాళ్ల ఊహ అని నాకు తెలుసు. ఎందుకంటే, చేత్తో సైకిల్ చైన్‌ను తెంచడం సాధ్యం కాదని నాకు తెలుసు.

ఇక రెండోది - సైకిల్ చైన్‌ను నిజంగా ఆయుధంగా వాడలేం. ఒకవేళ సైకిల్ చైన్‌తో ఎవరినైనా కొట్టడానికి ప్రయత్నిస్తే అది వెనక్కు వచ్చి విసిరిన వాళ్లకే తగులుతుంది.

'శివ' జ్ఞాపకాల గురించి, ప్రత్యేకంగా సైకిల్ చైన్ గురించి ఎవరైనా మాట్లాడితే, నేను చేసిన మోసానికి నాలో నేను చాలాసార్లు నవ్వుకుంటూ ఉంటా గానీ, సైకిల్ చైన్ ఇంకా వాళ్ల మనసులను తాకుతున్నందుకు చాలా గర్వంగా కూడా ఫీలవుతా!

ఆలోచనాయోధుడు

పంజాగుట్ట కాలనీలో మా కుర్రాళ్లందరం దాని ట్రైలర్ చూసినప్పట్నించి సినిమా కోసం ఎంతగానో ఎదురు చూశాం. ఆ సినిమా పేరు 'ఎంటర్ ద డ్రాగన్'. అందులో హీరో బ్రూస్‌లీ. అంతకుముందు నేనెన్నడూ కరాటే, కుంగ్-ఫు లాంటి మాటలు వినలేదు. కానీ ఆ సినిమాలో బ్రూస్‌లీ చేసిన ఫైట్స్ చూస్తే దిమ్మ తిరిగిపోయింది. బ్రూస్‌లీ నన్ను కనికట్టు చేశాడన్నా, అతడి పట్ల నాకు భయభక్తులు కలిగాయన్నా కూడా తక్కువ చెప్పినట్టే అవుతుంది. అంతగా అతడి విన్యాసాలు నాకు విస్మయం కలిగించాయి. నారాయణ గూడలోని శ్రీనివాస థియేటర్‌కు ఏడు కిలోమీటర్ల దూరం సైకిల్ తొక్కుకుంటూ వెళ్తూ, అక్షరాలా పదిహేడు సార్లు ఆ సినిమా చూశాను.

ఆ తర్వాత బ్రూస్‌లీ మరో సినిమా 'రిటర్న్ ఆఫ్ ద డ్రాగన్' అయితే సికింద్రాబాద్‌లోని సంగీత్ థియేటర్‌లోనూ, అమీర్‌పేట్‌లోని సత్యం థియేటర్‌లోనూ, ఏకంగా 23సార్లు చూశాను. ఇది 'ఎంటర్ ద డ్రాగన్' కంటే ముందు తీసినప్పటికీ, మన దేశంలో తర్వాత విడుదలైంది. బ్రూస్‌లీ నా మనసులో ఎంతగా నిండిపోయాడంటే, అతడి గురించిన ప్రతి చిన్న విషయం కూడా క్షుణ్ణంగా తెలుసుకోవాలన్న ఆసక్తి కలిగేది.

బ్రూస్‌లీ గనక మరో ఆరంగుళాల పొడవు ఉండి ఉంటే, ఇంత పేరూ, ప్రఖ్యాతీ వచ్చి ఉండేవి కాదు అని నా నమ్మకం. ఎందుకంటే తను 5 అడుగుల 7 అంగుళాల ఎత్తుగల మామూలు శరీరనిర్మాణం ఉన్నవాడు కావడంతో, అందరూ అతడిలా అవొచ్చని ఆశపడ్డారు. అదే 6 అడుగుల 2 అంగుళాలు ఉన్న హెవీ వెయిట్ బాక్సర్‌లా అవగలమని ఎవరూ ఆశపడరు.

ఎందుకంటే వాళ్ల ఎత్తు అసామాన్యం, ఒక విధంగా అవాస్తవం. కానీ ఒక సామాన్యుడి సైజ్ బ్రూస్‌లీకి సమంగా ఉంటుంది. అందుకే బ్రూస్‌లీ అందరికీ అందుబాటులో ఉన్నట్టు కనిపించాడు. 'ఎంటర్ ద డ్రాగన్' విడుదల తర్వాత ప్రపంచవ్యాప్తంగా కొన్ని లక్షల మంది మార్షల్ ఆర్ట్స్ స్కూళ్లల్లో చేరడానికి పరుగులు పెట్టారు. అందులో నేనూ ఒకణ్ని.

బ్రూస్‌లీ ఒక అందమైన కల. నేనూ, నాలాంటి ఎంతోమందీ తప్పకుండా నిజమౌతుందని నమ్మిన కల. ఆ సినిమాలో బ్రూస్‌లీని చూపించినట్లుగానే, మేం కూడా కఠినంగా శ్రమిస్తే కచ్చితంగా అలా కాగలమని ప్రగాఢంగా నమ్మాం.

అయితే, ఎంతో ఆరంభశూరత్వంతో ప్రారంభమైన నా మార్షల్ ఆర్ట్స్ శిక్షణ, కొన్ని క్లాసుల తర్వాత కుంటుపడింది. బ్రూస్‌లీ కావడం అటుంచి, ఆయన దరిదాపుల్లోకి వెళ్లడం కూడా అసాధ్యమని అర్థమైంది. దాంతో బ్రూస్‌లీ కావాలన్న నా కలను వదిలేసి, ఫిలిం మేకింగ్ రంగంలో స్థిరపడ్డాను. ఇందులో నొప్పీ తక్కువ, సులువూ ఎక్కువ.

అయితే, ఆ కలను పక్కన పెట్టినా, బ్రూస్‌లీ మీద చేసిన అధ్యయనం వ్యక్తిగతంగానూ, నా సినిమాలపైనా ఎన్నో రకాలుగా ప్రభావం చూపింది. చాలమందికి తెలియని విషయమేమంటే లీ ఫైటరే కాదు, ఒక ఫిలాసఫర్ కూడా. లీ అంటాడు... "చాలాకాలంగా స్థిరపడిపోయిన వ్యూహాలను బ్రేక్ చేయగలగడమే, యుద్ధకళను అర్థం చేసుకోవడంలో మొదటి మెట్టు. ఏ పరిధిలోనూ ఇమడకపోవడమే నిజమైన భావప్రకటన స్వేచ్ఛ. గతంలో ఎంతోమంది గొప్పవాళ్లు ఎన్నో గొప్ప యుద్ధరీతుల్ని రూపొందించి ఉండవచ్చు గాక. వాళ్లు ఎంతో వివేకవంతమైన, మార్మికమైన యోగులు కావొచ్చు. కానీ ఆ విన్యాసాల్ని ఇతరులు క్రమంగా మెరుగు పెట్టుకుంటూ రావడం, కొత్త శైలినీ, సొగసునూ అద్దడం జరిగాయి. కాబట్టి పాత వ్యూహాలనే బెస్ట్ ప్రమాణంగా భావించనక్కర్లేదు. ఎప్పుడో తీర్చిదిద్దిన వాళ్లకంటే, ఇప్పుడు బతికివున్నవాడు భిన్నంగా ఆలోచించేదానికే ఎక్కువ ప్రాధాన్యం ఉండాలి."

ఒక మనిషి భిన్నంగా ఉండటంలో ఏ తప్పూ లేదని ఈ మాటలు నాకు విశ్వాసం కలిగించాయి. విభిన్నంగా ఉండటమంటే స్వతంత్రంగా ఉండటమే. స్వతంత్ర వ్యక్తిత్వం ఉన్న మార్షల్ ఆర్టిస్ట్‌ను ఎలానూ కాలేకపోయాను, కనీసం అలాంటి మనిషిగా, అలాంటి ఫిలిం మేకర్‌గానైనా ఉందామని నిర్ణయించుకున్నాను. నాకు అన్ని శైలులూ ఉన్నాయి, ఏ శైలీ లేదు అన్నాడు బ్రూస్‌లీ. అలాగే నా సినిమాల్లో అన్ని శైలులూ ఉంటాయి, ఏ శైలీ ఉండదు.

బ్రూస్‌లీకి అర్థమైంది... తన దగ్గర ఉన్న విద్యకు ఒక తాత్త్వికకోణం జతచేసి చెబితే, తనకి ఎక్కువ లబ్ధి కలుగుతుందని. అంతే తప్ప, ఎదుటివాడి ముఖం మీద పిడిగుద్దులు గుద్దడంలోనో, ఎదురు దెబ్బలు తినడంలోనో కాదని.

బ్రూస్‌లీని అర్థం చేసుకోవడంలో పొరపడ్డామో, సరిగ్గా ఊహించామో అలా ఉండనీయండి... నా విమర్శకులూ, నన్ను నిందించేవాళ్లూ అనేదేమిటంటే, ప్రేక్షకుల మీద నా సినిమాల కన్నా, నా ఆలోచనా ధోరణి కలగజేసే 'ప్రభావం' ఎక్కువని. 'మంచైనా చెడైనా ఒక చేత కన్నా దాని వెనుక ఉన్న ఆలోచనే ఎప్పుడైనా ఎవరినైనా తాకేది, పనికొచ్చేది గ్రహించు, పనికిరానిది వదిలిపెట్టు' అంటాడు మావో. దీనికి బ్రూస్‌లీ అదనంగా ఈ మాట చేర్చాడు.... "నీకు మాత్రమే ప్రత్యేకమైనదాన్ని దానికి కలుపు." ఇది కూడా నా ఆలోచనా ధోరణిలో చోటుచేసుకుంది. మనిషికి అత్యావశ్యకమైన, స్వీయ అస్తిత్వానికి సంబంధించిన క్రమశిక్షణ గురించి బ్రూస్‌లీ ఈ (రవీంద్రనాథ్ టాగూర్) కవితను ఉదహరించేవాడు...

"నా టేబుల్ మీద ఉన్నదో వయొలిన్ తీగ, పూర్తి స్వేచ్ఛగా, దాని ఒక కొనను మెలిపెట్టాను, అది స్పందించింది. ఇప్పుడూ అది స్వేచ్ఛగానే ఉంది. కాని అది దేనికోసం ఉన్నదో ఆ పనిచేయడానికి దానికిప్పుడు స్వేచ్ఛ లేదు. అది సంగీతాన్ని సృష్టించాలి.

అందుకని దాన్ని నేను తీసుకొని నా వయొలిన్‌కు బిగించాను.
దాని ప్రాణాలు పోయేట్టుగా గట్టిగాలాగి కట్టాను.
ఇప్పుడు ఇది నిజమైన స్వేచ్ఛ కలిగి ఉంది,
ఒక వయొలిన్ తీగకి కావల్సిన స్వేచ్ఛ."

అయితే, ప్రపంచంలో అత్యంత గొప్ప బాడీపవర్ ఉన్నవాడు, అతి గొప్ప పోరాటయోధుడు, గొప్ప ఆలోచనాశీలి అయిన బ్రూస్‌లీ, అతి మామూలుగా... ఒక పెయిన్ కిల్లర్‌ను వేసుకోవడంతో రియాక్షన్ వచ్చి చనిపోవడాన్ని నేను జీర్ణించుకోలేక పోయాను. అతడు చనిపోయినప్పటి నా మనోవేదనను ఎప్పటికీ మరిచిపోలేను. ఆ మరణం ఇప్పటికీ నాకో నమ్మలేని నిజం!

ఇంకో విధంగా చెప్పాలంటే బ్రూస్‌లీ నాకు చేసిన నమ్మకద్రోహం! లేకపోతే ఏమిటి? అలాంటి మనిషి, కేవలం 32 ఏళ్లవాడు, అలా చనిపోవడం నన్ను నిలువునా కంపింప జేసింది. అయితే లోతుగా ఆలోచించిన కొద్దీ ఒక విషయం మాత్రం స్పష్టమైంది. ఎన్ని రకాలుగా, ఎవడు, ఎందరికి ప్రేరణ కలిగించినవాడైనప్పటికీ, ఎంతమంది పరిపూర్ణతకు నమూనాగా నిలబడ్డవాడైనప్పటికీ, చిట్టచివరకు చనిపోవాల్సిందే!

నామీద బయటికి కనిపించే బ్రూస్‌లీ ప్రభావం గురించి సింపుల్‌గా చెప్పాలంటే, తనే దర్శకత్వం వహించిన 'రిటర్న్ ఆఫ్ ద డ్రాగన్' ఇతివృత్తాన్ని నా మొదటి సినిమా 'శివ' కోసం అనుసరించడమే. మార్షల్ ఆర్ట్స్ సినిమా కాకపోయినప్పటికీ బ్రూస్‌లీ భావోద్వేగ శైలిని ఆ సినిమా యాక్షన్ సీన్స్‌లో నేను అనుకరించాను. నాకు తెలిసినంత వరకూ ఫైట్ సీక్వెన్స్‌లో ఎమోషన్ ఎలా తీసుకురావాలో అర్థమైన ఏకైక యాక్షన్ కోరియోగ్రాఫర్ బ్రూస్‌లీ.

ఆయన చావుకు ఎంతగానో దుఃఖించానని ఇంతసేపూ చెప్పినవాణ్ని, ఈ ఒక్క విషయం చెబితే మీకు చాలా క్రూరంగా అనిపించవచ్చు. ఒక విధంగా బ్రూస్‌లీ 32 ఏళ్ల వాడిగా 1973లో చనిపోవటం నాకు చాలా ఆనందమే. ఎందుకంటే ఇప్పుడు 2010లో 70 ఏళ్ల ముసలి బ్రూస్‌లీని చూసే గత్యంతరం నుంచి తప్పించుకున్నందుకు!

గమనిక : ఫోటోల (పేజి 262) లో నా బ్రూస్లీ పోజు చూసి దయచేసి నవ్వకండి.

అసిస్టెంటుకి అసిస్టెంటు

శివ ఓపెనింగ్ షాట్ ఎలా ఉండాలనే దాని మీద నేను షూటింగ్ మొదలుపెట్టటానికి చాలా రోజుల ముందు నుంచి కూడా చాలా విపరీతమైన స్పష్టతతో ఉండేవాణ్ని. కాలేజ్ బోర్డు సజెషన్‌లో కెమెరా పెట్టి, నెమ్మదిగా క్రేన్ కిందకు డౌన్ చేస్తూ, గేటు ముందు సడన్‌గా ఆగిన కారు టైరు క్లోజప్‌కి కెమెరాని ప్లాన్ చేయాలని నా ఆలోచన. శివ ప్రీ ప్రొడక్షన్ టైమ్ నుంచి నేను ప్రతిరోజూ పదే పదే ఆ షాట్ చెప్పడంతో విసిగెత్తిన నా అసిస్టెంట్ శివనాగేశ్వరరావు, స్క్రిప్ట్ దశలో అనుకున్న వాటికే పర్మినెంట్‌గా ఫిక్స్ అవకూడదని, షూటింగ్ టైములో చాలాసార్లు ప్రాక్టికల్‌గా సాధ్యం కాకపోవచ్చని నాకు క్లాస్ పీకాడు. కాలేజ్ బోర్డు, క్రేన్ హైట్ మిస్ మ్యాచ్ అయ్యే అవకాశముందనే పాయింటును శివనాగేశ్వరరావు లేవనెత్తాడు. ఒకవేళ బోర్డు క్రేన్ హైట్ కన్నా చాలా హైట్‌గా ఉండి, కెమెరాను టిల్ట్-అప్ చేయవలసి వస్తే, కాలేజ్ కాకుండా ఫ్రేమ్‌లో ఆకాశం కనిపించే అవకాశం ఉంది. ఒకవేళ బోర్డు మరీ కిందకు ఉంటే, కాలేజీ కాకుండా కేవలం గ్రౌండ్ మాత్రమే కనిపించే అవకాశం ఉంది. అది వినడానికి సింపుల్‌గా అనిపించినా, లొకేషన్‌లో షూటింగ్ చేయడం ఒక్కొక్కసారి ఎంత కష్టతరంగా ఉండటానికి అవకాశం ఉందో తను నాకు తెలియజెప్పిన తొలిపాఠం అది.

మనం మనసులో అనుకున్న దానికి, ప్రాక్టికల్‌గా తీయడానికి మధ్య ఉన్న రేఖ చాలా బలమైనది. నాగేశ్వరరావు సలహా దృష్టిలో ఉంచుకొని, ఆర్ట్ డైరెక్టర్‌తో మాట్లాడి, కావలసిన ఎత్తుకు కాలేజ్ బోర్డును ముందుగానే అడ్జస్ట్ చేయించాను. శివనాగేశ్వరరావు నాకు 'శివ' సినిమాకు అసిస్టెంట్, కానీ తరణి డైరెక్ట్ చేసిన 'రావుగారిల్లు' సినిమాకు శివనాగేశ్వరరావు చీఫ్ అసిస్టెంట్. నేను ఆ సినిమాకి శివనాగేశ్వరరావుకి అసిస్టెంట్‌ని. 'రావుగారిల్లు'లో నేను ప్రొడ్యూసర్ రికమెండేషన్ క్యాండిడేట్‌ని కాబట్టి, నాకు ఏమన్నా ఇంపార్టెంట్ పనులు ఇవ్వడానికి నాగేశ్వరరావు అంతగా నన్ను విశ్వసించ లేకపోయేవాడు. కానీ షూటింగ్ జరుగుతున్న ప్రాసెస్‌లో నాతో జరిగిన చాలా డిస్కషన్ల మూలాన, నేను ప్రొడ్యూసర్ క్యాండిడేట్ అనే అర్హత కన్నా, ఇంకొంచెం ఎక్కువేనని అర్థం చేసుకున్నాడు. శివను డైరెక్ట్ చేసే చాన్స్ రాగానే, నా చీఫ్ శివనాగేశ్వరరావును నాకు అసిస్టెంట్‌గా రమ్మని రిక్వెస్ట్ చేశాను. శివనాగేశ్వరరావు, కృష్ణవంశీ, తేజ, ఉత్తేజ్ 'శివ'కు అసిస్టెంట్ డైరెక్టర్స్. కృష్ణవంశీ, ఉత్తేజ్ ఇద్దరినీ శివనాగేశ్వరరావే నాకు రికమెండ్ చేశాడు. సినిమా తియ్యటానికి బ్రేక్ కోసం నేను ఎదురుచూస్తూ ఆ మధ్యలో కాలం గడపటానికి 'రావుగారిల్లు'

సినిమాకు పనిచేశాను. ఆ సమయంలో ప్రొడ్యూసర్స్ వెంకట్, సురేంద్రలు నాతో చాలా ఇంప్రెస్ అయ్యారు కాబట్టి, సెట్‌లో డెరైక్టర్ కంటే ఎక్కువ ఇంపార్టెన్స్ నాకు ఇచ్చేవాళ్లు. దాంతో డెరైక్టరే కాదు, అసిస్టెంట్ డెరైక్టర్స్ అందరూ కూడా నన్ను అదోలా చూసేవాళ్లు. నేను నా ఇంగ్లిష్ ప్రావీణ్యంతో, నాలెడ్జ్‌తో ప్రొడ్యూసర్స్‌ను బుట్టలో వేసుకున్నానని వాళ్లు అనుకునేవాళ్లు.

నిజంగానే నా ఆలోచనాధోరణి, నా మాటలు నాకు అలాంటి చాన్స్ రావడానికి చాలావరకు తోడ్పడ్డాయి. ఆ రోజుల్లో ఒక అసిస్టెంట్ డెరైక్టర్ ఇంగ్లిష్‌లో మాట్లాడటం చాలా అరుదు. అదే వాళ్ల భయానికి కారణమైంది. ఇంగ్లిష్ సినిమాల పట్ల నాకున్న జ్ఞానం, అన్నపూర్ణ స్టూడియోలో ఓ మూలపడి నేను తప్ప ఇంకెవరూ దుమ్ము కూడా దులపని 'అమెరికన్ సినిమాటోగ్రాఫర్' పుస్తకాల నుంచి నేను తెలుసుకున్న ఫిలిం మేకింగ్ టెక్నిక్స్, నేను వాళ్లకు వివరించేటప్పుడు వాళ్లను విపరీతంగా భయపెట్టేవి. దీనంతటి తరువాత మొనగాడిలాగ 'శివ' షూటింగ్‌కు మహా ధైర్యంగా వెళ్లిన నేను, మొదటిరోజు ఫస్ట్ షాట్ ఎలా చెప్పాలో తెలియక కంప్లీట్‌గా కన్‌ఫ్యూజ్ అయ్యాను. సెట్‌లో చాలామంది ఉండటం, చాలా పనులు జరుగుతుండటంతో ఒక్కసారిగా నా మైండ్ బ్లాంక్ అయింది. లైటింగ్ పూర్తయిన తరువాత కెమెరామన్ గోపాల్‌రెడ్డి 'ఆర్డర్ సర్' అని అరిచాడు. సెట్‌లో ఆర్డర్ కోసం గోపాల్‌రెడ్డి అలా అన్నాడని నేను అనుకుని, వెంటనే నేను కూడా 'ఆర్డర్ సర్' అని బిగ్గరగా అరిచాను. వెంటనే శివనాగేశ్వరరావు నావైపు ఓ హీనాతిహీనమైన చూపు విసిరి, షాట్ తీయడానికి గోపాల్‌రెడ్డి నీ ఆర్డర్ కోసం 'ఆర్డర్ సర్' అని అడిగాడు. ఇక్కడ నువ్వే సర్ అయినప్పుడు, నువ్వు మళ్లీ తిరిగి 'ఆర్డర్ సర్' అని ఎలా అంటావని అన్నాడు. నేను సిగ్గుతో గొర్రెలా తలూపి, శివనాగేశ్వరరావు ఆదేశాలను అనుసరించాను. శివనాగేశ్వరరావు విసిరిన చూపు ఎఫెక్ట్‌తో నేనింకా కన్‌ఫ్యూజ్‌కి లోనయ్యి, ఏవి ఆర్డర్ ఇయ్యాలో తెలియక తికమక పడుతుంటే, వెనక నుంచి శివనాగేశ్వరరావు నా చెవిలో స్టార్ట్, కెమెరా చెప్పమని ప్రాంప్టింగ్ చేశాడు. సౌండ్, యాక్షన్ అని తర్వాత మళ్లీ ప్రాంప్ట్ చేశాడు. అలా ఫైనల్‌గా నేను నా అసిస్టెంట్ ఆర్డర్లని పాటించి స్టార్ట్, సౌండ్, కెమెరా, యాక్షన్ చెప్పేశాను. ఆ టైమ్‌లో నేను నా అసిస్టెంట్ అసిస్టెంట్‌కి అసిస్టెంట్‌గా ఫీలయ్యాను.

గమనిక : తరువాత నేను శివనాగేశ్వరరావుని దర్శకుడిగా పెట్టి 'మనీ' సినిమాని నిర్మించాను.

అతిపెద్ద థ్రిల్

విజయవాడ కామయ్యతోపులోని విజయలక్ష్మి థియేటర్ కాంపౌండ్‌లో తిరుగుతూ ఉండేవాణ్ని. ఒక్కరోజు కూడా మిస్‌కాకుండా విజయలక్ష్మి థియేటర్‌లో ఏదో ఒక సినిమా చూసేవాణ్ని. చాలాసార్లు చూసిన సినిమానే మళ్లీ మళ్లీ చూస్తుండేవాణ్ని. విపరీతంగా ఆ సినిమాలను స్టడీ చేసేవాణ్ని.

ఆ విజయలక్ష్మి థియేటర్ కుడిపక్కనే ఉన్న రూంలో అద్దెకుండే నేను, ప్రతీసారి టికెట్ కొనడానికి డబ్బులు లేకపోవడంతో, సంచార జీవిలా థియేటర్ చుట్టూ తిరుగుతూ, అక్కడి క్యాంటీన్‌లో టీ తాగుతూ, బిస్కెట్లు తింటూ గడిపేవాణ్ని, క్యాంటీన్ అతనికి ఇవ్వడానికి డబ్బులు లేకపోతే అక్కడ ఖాతా పెట్టా. అప్పుడప్పుడు టిక్కెట్ కొంటానికి డబ్బు లేక తన దగ్గర అప్పు కూడా తీసుకునేవాణ్ని. ఆ క్యాంటీన్ ఓనర్ నా మీద జాలి, చిరాకు ఏకకాలంలో ప్రదర్శించేవాడు.

కాలేజీ టైంలో కూడా థియేటర్ దగ్గర తిరుగుతుండటం, థియేటర్ మేనేజర్ చాలాసార్లు గమనించాడు. ఆయన ముఖంలో నా పట్ల ఓ రకమైన ఏవగింపు, అసహ్యం కనిపించేవి. ఒకరోజు నన్ను పట్టుకుని డైరెక్టుగా, నీ ప్రవర్తన పట్ల నువ్వు చాలా సిగ్గుపడాలి అని తిట్టాడు. నీ కోసం అహర్నిశలూ కష్టపడుతూ, నీ భవిష్యత్తు మీద ఎన్నో ఆశలు పెట్టుకున్న మీ తల్లిదండ్రుల గురించి ఏ మాత్రం ఆలోచించకుండా, చదువుని నిర్లక్ష్యం చేసి, థియేటర్ దగ్గర కాలక్షేపం చేయడం సరైంది కాదనీ, ఆలోచించుకోమనీ చెప్పాడు.

ఆయన ఇచ్చిన క్లాసు నన్ను కేవలం రెండు రోజుల వరకే థియేటర్ దరిదాపులకు వెళ్లకుండా చేసింది. ఆ తరువాత మళ్లీ మామూలే (కుక్క తోక వంకర సామెత తెలుసు కదా!) థియేటర్ దగ్గర నేను కనిపించినప్పుడల్లా మేనేజర్ చాలా చిరాగ్గా చూసేవాడు. ఆ తర్వాత, తన టైమ్ నా కోసం వృథా చేయడమంత పనికిమాలిన పని ఇంకొకటి లేదనుకుని నన్ను పట్టించుకోవడం మానేశాడు.

దాదాపు నాలుగేళ్ల పాటు విజయలక్ష్మి థియేటర్ నాకు రెండో ఇల్లు అనడం కరెక్ట్. కొన్నిసార్లు థియేటర్‌లో సినిమా చూస్తుండేవాణ్ని. కొన్నిసార్లు కాంపౌండ్‌లో పోస్టర్స్ చూస్తూ ఉండేవాణ్ని. టికెట్ కొనడానికి డబ్బులు లేనప్పుడు రాత్రిపూట థియేటర్ వెనక నిలబడి లోపల్నుంచి వచ్చే సౌండ్స్ వింటూ గడిపేవాణ్ని.

విజయవాడ నుంచి వచ్చేసిన కొన్నేళ్లకు నేను డైరెక్టర్ అయ్యాను. నా మొదటి సినిమా 'శివ' బ్లాక్‌బస్టర్ హిట్ అవడంతో, థియేటర్స్‌లో ప్రేక్షకుల రియాక్షన్ చూడటానికి డిస్ట్రిబ్యూటర్ ఆహ్వానంతో మళ్లీ చాలా ఏళ్ల తర్వాత విజయవాడ వెళ్లాను. 'శివ' ఏయే

థియేటర్స్‌లో నడుస్తోందని అడిగితే, ఆయన చెప్పిన పేర్లలో 'విజయలక్ష్మి' కూడా ఉంది. ఒక పాత ప్రేమికురాలి పేరు విన్నట్టైపులో నా గుండెరెప్పల్లుమంది. నేను అక్కడే చూస్తానని డిస్ట్రిబ్యూటర్‌కు చెప్పాను.

విజయవాడలో నేను దిగిన హోటల్ నుంచి విజయలక్ష్మి థియేటర్‌కు ఏడు కిలోమీటర్ల దూరం. ఆ దారిలో ఎయిర్ కండిషన్ కారులో ప్రయాణిస్తుంటే, పాత జ్ఞాపకాలు ఉప్పెనలా మనసుకు తాకాయి. ఇదే రూట్లో కిక్కిరిసిన బస్సుల్లో ప్రయాణించడం, బస్ టికెట్ కొనుక్కోవడానికి డబ్బులు లేక చాలాసార్లు నడిచి వెళ్లడం గుర్తుకొచ్చాయి.

మధ్యలో డిస్ట్రిబ్యూటర్ థియేటర్‌కు ఫోన్ చేసి రాంగోపాల్‌వర్మ దారిలో ఉన్నారని చెప్పాడు. మేం అక్కడికి వెళ్లేసరికి థియేటర్ ప్రాంగణమంతా జనంతో నిండిపోయి ఉంది. థియేటర్ ఓనర్ తన కుటుంబంతో కలిసి వచ్చి నా మెడలో పూలదండ వేయగానే, చప్పట్ల మోత మోగింది. ప్రొప్రయిటర్, అతడి మిత్రులలో నావైపు షాకింగ్‌గా, అపనమ్మకంగా చూస్తూ ఉన్న ఓ ముఖం కనిపించింది. అది అప్పుడు నాకు క్లాస్ పీకిన మేనేజర్‌ది. అంతకు ముందు ఆయనకు నా ముఖం తప్ప నా పేరు తెలీదు. ఒక పనికిరాని వాడుగా ఆయన మనసులో నిలిచిపోయిన నేను, ఈ సినిమాను డైరెక్ట్ చేస్తానని ఎంత మాత్రం ఊహించలేకపోయాడు. ఒక అపరాధ భావనతో కూడిన గర్వమైన చిరునవ్వుతో ఆయనవైపు చూశాను. ఇంతలో, ఓనర్ నన్ను థియేటర్‌లోకి తీసుకెళ్తూ, క్యాంటీన్ నుంచి నాకేమైనా తెప్పించమని మేనేజర్‌ని పురమాయించాడు.

వెనక్కి తిరిగి క్యాంటీన్ వైపు చూడగానే, జనంలోంచి నావైపు తదేకంగా చూస్తూ, కళ్లలో ఆనందబాష్పాలు నింపుకున్న నాకు అప్పిచ్చే క్యాంటీన్ ఓనర్ కనిపించాడు. అతన్ని చూడగానే నేను అతడికి నలభై రూపాయలు బాకీ ఉన్నానన్న విషయం గుర్తొచ్చి పశ్చాత్తాపపడ్డాను. నేను వెంటనే ఆ డబ్బు అతడికి ఇమ్మనీ, అతడు అడిగితే ఇంకా ఇమ్మనీ నా వాళ్లకు చెప్పాను. అతడు డబ్బు తీసుకోవడానికి నిరాకరించాడనీ, నాతో ఒక ఫోటో మాత్రం దిగాలని ఆశ పడుతున్నాడనీ మావాళ్లు చెప్పారు. నేను అతడితో క్యాంటీన్ కౌంటర్ వెనుక నిలబడి ఒక ఫోటో దిగాను.

సినిమా చూసి థియేటర్లోంచి బయటికి వస్తున్నప్పుడు చుట్టూ చూశాను. ప్రేక్షకుల గుంపులో ఉన్న మేనేజర్ దగ్గరకి వెళ్లాను. ఇంకా షాక్‌లో ఉన్న ఆయన, నన్నొక దయ్యాన్ని చూసినట్టు చూస్తూ షేక్‌హ్యాండ్ కోసం నేను చేయి చాపగానే, నన్ను గట్టిగా కౌగిలించుకున్నాడు. విజయలక్ష్మి థియేటర్ కాంపౌండులో ఆ మేనేజర్ నన్ను ఆప్యాయంగా కౌగిలించుకున్న క్షణం నా జీవితంలో నాకు అతిపెద్ద థ్రిల్!

గమనిక : 'రాత్రి' సినిమాలోని ప్రారంభ దృశ్యంలో రేవతి బస్సు దిగే సీను కామయ్యతోపులో తీశాను. ఆ ప్రదేశానికి గౌరవార్థం అలా చేశాను. పైగా, ఆ సీన్‌కు సంబంధించిన ఆలోచన మొదట నా మనసులో మెదిలింది విజయలక్ష్మి థియేటర్ కాంపౌండ్‌లోనే.

చిట్టీస్ బార్

నా ఫ్లాప్ సినిమాలన్నీ నేను ఇంటెన్షనల్‌గా తీసినవి.

హిట్ సినిమాలన్నీ అనుకోకుండా సంభవించినవి.

'రాత్రి' సినిమాను నేను ప్లాన్ చేస్తున్న సమయంలో నా కజిన్ చిట్టి నా దగ్గరకు వచ్చి, హైదరాబాద్‌లోని మెహదీపట్నం రోడ్‌లో ఓ బార్ అండ్ రెస్టారెంట్ ఓపెన్ చేయాలనుకుంటున్నట్టు చెప్పాడు. మెయిన్ రోడ్డుకు అంత దగ్గరగా ఉన్న అంత పెద్ద కాలనీ చుట్టుపక్కల ఐదు కిలోమీటర్ల పరిధిలో ఎక్కడా మరో బార్‌లేని కారణంగా, అక్కడ పెడితే బిజినెస్ చాలా బాగుంటుందని చెప్పాడు. కేవలం ఇరవై లక్షల పెట్టుబడితో, మొదటి సంవత్సరంలోనే కోటి రూపాయలు సంపాదించవచ్చని కాగితం మీద లెక్కలు చూపించాడు. అతనికి ఆల్ ద బెస్ట్ చెప్పాను. బార్ స్టార్ట్ అయిన తరువాత కోటి రూపాయల లాభం అటుంచి, బిజినెస్ లేకపోవడంతో ఏడాది కల్లా మా కజిన్ ఆ బార్ మూసేయాల్సి వచ్చింది. ఏంట్రా? ఏమైందీ? అని అడిగితే, అది రెసిడెన్షియల్ కాలనీ కాబట్టి, అక్కడ ఉండేవాళ్లెవరూ దగ్గరగా ఉన్న బార్‌లో తాగడానికి ఇష్టపడక, దూరంగా ఉన్న బార్స్‌కి వెళ్తున్నారు. అది ఊహించే అంతకుముందు ఎవరూ అక్కడ బార్ ఓపెన్ చెయ్యలేదని చెప్పాడు.

తను చెప్పిన కారణాలు కరెక్ట్ అవ్వొచ్చు. కాకపోవచ్చు. కానీ చిట్టీస్ బార్, రాత్రి సినిమా ఫ్లాప్ అవడానికి ఒకే కారణాలు. సినిమా తియ్యాలని డిసైడ్ చేసే ముందు అనుకున్నవన్నీ కరెక్టనిపిస్తాయి. కానీ ఫ్లాపైన తరువాత ఇంకా కరెక్ట్ కారణాలు తెలుస్తాయి. కాకపోతే నేను సినిమా ఇండస్ట్రీలో ఉన్నాను కాబట్టి, 'రాత్రి' ఫ్లాప్ అందరికీ తెలిసింది. చిట్టీ బార్ ఫ్లాప్ అవటం నాకు తప్ప ఇంకెవరికీ తెలియదు.

ఇరాక్ యుద్ధమే తీసుకుంటే, చాలా దేశాల ప్రజలు, ఆఖరికి చాలామంది అమెరికన్స్ కూడా ఇరాక్‌పై అమెరికా దాడిని ఖండించారు. సద్దాం హుస్సేన్ తన దగ్గర సామూహిక జనహనన ఆయుధాలు దాచాడన్న వార్తకు సంబంధించిన విశ్వసనీయత గురించి ప్రశ్నించారు. యుద్ధంలో అమాయకులైన స్త్రీలు, పసిపిల్లలు చనిపోతారని ఆవేదన చెందారు. అంతేగానీ ఇరాక్‌మీద అమెరికా గెలవగలుగు తుందా? అనే సందేహం ఎవరికీ రాలేదు. ఊహించినట్టుగానే యుద్ధం మొదలై వారం గడచిన తర్వాత, సద్దాం, అతని కొడుకులు పారిపోయారు. 'పని పూర్తయింది' అన్న బ్యానర్ బ్యాక్‌గ్రౌండ్‌గా అమెరికా అధ్యక్షుడు ఉపన్యాసం ఇచ్చాడు. కానీ అప్పట్నుంచీ యుద్ధం అంతులేకుండా కొనసాగుతూనే

పోయింది. ఎలా బయటపడాలో తెలియక అమెరికా జుట్టు పీక్కుంటోంది. యుద్ధంలో రెండు వందల మంది అమెరికా సైన్యం చనిపోతే, యుద్ధం తరువాత పరిణామాల్లో దాదాపు పన్నెండు వేలమంది అమెరికన్లు చనిపోయారు.

ఇప్పుడు విషయమేంటంటే, యుద్ధం తరువాత పరిణామాల గురించి రాజనీతిజ్ఞులతో సహా మామూలు ప్రజలు కూడా ఎక్స్‌పర్ట్‌లైపోయారు. వీధి చివర పాన్‌షాప్ అతను కూడా యుద్ధంలో అమెరికా వైఫల్యాన్ని చూసి ఫూలిష్ దేశం అనికామెంట్ చేస్తాడు.

ఇక సినిమాల్లోకి వస్తే, నన్ను చాలా మంది 'ఆగ్' (అగ్గి) లాంటి ఫ్లాప్ ఎలా తీశావని చాలా వింతగా అడుగుతుంటారు. ఈ ప్రశ్నలు వేసేవాళ్లంతా ఓ విషయాన్ని అర్థం చేసుకోరు. ఒక సుదీర్ఘ క్రమంలో వేరు వేరు రోజుల్లో, వేరు వేరు సందర్భాల్లో ఆ ప్రత్యేక పరిస్థితులకు సంబంధించిన ప్రత్యేక కారణాల వల్ల తీసుకున్న ఎన్నో నిర్ణయాల ఆధారంగా ఒక సినిమా రూపొందించబడుతుంది. ఒక ఫిలిం మేకర్ ప్రతిభావంతుడా, కాడా అన్న సంగతి అటుండనీ. వాళ్లు ఎలాంటి టాలెంట్ ఉన్నవారైనా టాలెంట్ లేకపోయిన వారైనా ఏడాదిపాటు, ఒక్కోసారి ఏళ్ల తరబడి ఒక సినిమా మీద పనిచేస్తుంటారు. కానీ ఏ మానసిక స్థాయి ఉన్న ప్రేక్షకుడికైనా అది చెత్త అని తెలుసుకోవడానికి రెండు గంటలు చాలు. సినిమా ఐడియా అనుకుంటున్నప్పటి నుంచి, దాన్ని తెరకెక్కించే క్రమంలో ఉండే బోల్డన్ని విషయాల్లో ఎన్నో రకాల తప్పులు జరగడానికి అవకాశం ఉంటుంది. ఫిలింమేకర్ ఆలోచన ఎప్పటిదో అయ్యుంటుంది. వేర్వేరు వయసులు, వేర్వేరు భావజాలాలు ఉన్న ప్రేక్షకుల ఆలోచన ఆ సినిమా థియేటర్లో ఎంటర్ అయ్యే టైముది అయ్యుంటుంది.

అందుకే నేను ఏమంటానంటే – నా ఫ్లాప్ సినిమాలన్నీ నేను ఇంటెన్షనల్‌గా తీసినవి. హిట్ సినిమాలన్నీ అనుకోకుండా సంభవించినవి. జీవితంలో ఏదైనా మనం మనసా వాచా నమ్మితేనే చేస్తాం. కానీ అందులో ఏది సక్సెస్ అవుతుంది? ఏది కాదు? అనేది చాలా అరుదుగా తప్ప మన ఆధీనంలో ఉండదు.

నా మిత్రుడొకడు ఒకమ్మాయితో ఏడు సంవత్సరాలడేటింగ్ తర్వాత పెళ్లి చేసుకున్నాడు. ఆ పెళ్లి పెద్ద ఫ్లాప్ అయ్యింది. ఎందుకనడిగితే, ఏడేళ్ల డేటింగ్‌లో ఒకరికొకరికి తెలియని ఎన్నో విషయాలు ఇప్పుడు కొత్తగా తెలిశాయని చెప్పాడు. సినిమాలాగే పెళ్లనేది ప్రేమ తరువాత రిలీజ్ అవుతుంది. ఇంతకీ నేను చెప్పొచ్చేదేమిటంటే, సినిమాలు పక్కన పెట్టి జీవితంలోకి చూస్తే, చాలా విషయాల్లో చాలా వైఫల్యాలు ఎదురవుతుంటాయి. వైఫల్యమంటే తీసుకున్న నిర్ణయం తప్పవడం, అంతే! మనమంతా ఇతరుల తప్పుల్ని ఎత్తి చూపడంలో, విమర్శించడంలో నిష్ణాతులం. చాలా అరుదుగా మాత్రమే మనసొంత తప్పుల్ని గుర్తిస్తాం. అంతమాత్రాన అది అపజయపు దారుల్లో అడుగు పెట్టకుండా మనల్ని ఆపదు.

సునీల్ గవాస్కర్ ఒకసారి నాతో ఏమన్నాడంటే, ఎప్పుడైనా ఒక మ్యాచ్‌లో అవుటయ్యి పెవిలియన్‌కు తిరిగి వచ్చినప్పుడు, మోకాలి ప్యాడ్స్ తీసే అటెండెంట్ కూడా ఆ బాల్ టచ్ చేయకుండా ఉండాల్సిందని చెబుతుంటాడంట. ఆ కామెంట్ చేసే అతగాడు అసలు బ్యాట్‌ను సరిగ్గా పట్టుకోగలుగుతాడా లేదా అన్నది వేరే విషయం.

మళ్లీ చిట్టీ బార్ విషయానికొస్తే, అతడి కారణాలు సరైనవేనని భావించి, అతడికి కొందరు ఆర్థికంగా సహకారం అందించారు. ఒకవేళ అది హిట్ అయి ఉంటే అందరూ అతణ్ని దార్శనికుడిగా కీర్తించేవారు. కానీ అది ఫ్లాపవడంతో గుడ్డిగా వ్యాపారంలోకి దిగాడని తిట్టిపోశారు. అదే నా వీడియో లైబ్రరీ సంగతి తీసుకుంటే, నావి పలికిమాలిన ఆలోచనలని భావించిన వాళ్లు, నన్ను సపోర్ట్ చేయలేదు. కానీ అది హిట్టవ్వగానే వాళ్ల దృష్టిలో నేనొక విజనరీగా మారిపోయాను.

నేను అంచనా వేసిన కారణాల వల్ల నా లైబ్రరీ హిట్ కాలేదు. చిట్టి అనుకున్న కారణాల వల్ల అతని బార్ ఫెయిల్ అవలేదు. చిట్టి తన ప్లానులో ఫెయిలయ్యాడు. నా లైబ్రరీ నేను అనుకోని కారణాల వల్ల సక్సెస్ అయ్యింది.

డస్ట్‌బిన్‌లో అదృష్టం

అమ్మ ఆ రోజు డస్ట్‌బిన్‌లోంచి ఆ విజిటింగ్ కార్డు బయటికి తియ్యకపోతే ఎవరెవరి జీవితాలు ఎలా ఉండేవో ఎవరు చెప్పగలరు..?

అవకాశం కోసం నేను అన్నపూర్ణ స్టూడియో చుట్టూ తిరుగుతున్న రోజుల్లో 'కలెక్టర్ గారి అబ్బాయి' మ్యూజిక్ కంపోజింగ్ సెషన్స్ జరుగుతూ ఉండేవి. మ్యూజిక్ డైరెక్టర్ చక్రవర్తిగారు, డైరెక్టర్ బి.గోపాల్ గారు లంచ్‌కు వెళ్లినప్పుడు, చక్రవర్తి గారి ఒక అసిస్టెంట్ అప్పుడప్పుడు తను కంపోజ్ చేసిన ట్యూన్స్ నాకు పాడి వినిపిస్తుండే వాడు. అవి నాకు చాలా నచ్చేవి. ఒకరోజు తనకి 'శివ' సినిమా లోంచి ఓ సీన్‌ను వివరించి, అది నేను ఎలా షూట్ చేయాలనుకుంటున్నానో చెప్పి, అక్కడ ఎలాంటి సంగీతం ఉంటే బాగుంటుందని అడిగాను. అక్కడ అసలు సంగీతమే ఉండకూడదు. నిశ్శబ్దమే సంగీతమని చెప్పాడు తను. ఆ సమాధానం నన్ను బాగా ఇంప్రెస్ చేసింది. ఆ రోజే తనతో అన్నాను. నాకు ఎప్పటికైనా బ్రేక్ గనక వస్తే, నిన్ను సంగీత దర్శకుడిగా తీసుకుంటానని.

నాకు 'శివ' చాన్స్ వచ్చింది. పైగా సంగీత దర్శకుడిగా ఇళయరాజా గారిని తీసుకునే చాన్స్ కూడా వచ్చింది. చాలా గిల్టీ ఫీలింగ్‌తో ఆ అసిస్టెంట్‌కి చెప్పాను. ఇళయరాజాతో చేస్తున్నాను కాబట్టి నిన్ను తీసుకోలేకపోతున్నానని.

తను నా పరిస్థితి అర్థం చేసుకోగలను అని, నాకు ఆల్ ద బెస్ట్ చెప్పాడు. అయినా, నా గిల్టీ ఫీలింగ్ మాత్రం నన్ను వదల్లేదు. 'శివ' పెద్ద హిట్ కాగానే తన దగ్గరికి వెళ్లి, నా రెండో సినిమాకి సంగీత దర్శకుడిగా తీసుకున్నాను. ఆ మ్యూజిక్ అసిస్టెంట్ పేరు కీరవాణి. ఆ సినిమా 'క్షణక్షణం'.

నా కెరీర్ మొత్తంలో బెస్ట్ మ్యూజికల్స్ అంటే రెండే... రంగీలా, క్షణక్షణం.

కీరవాణి దగ్గర ఓ కీబోర్డ్ ప్లేయర్ పనిచేస్తుండేవాడు. అతడితో అప్పుడప్పుడూ మాట్లాడుతుండేవాణ్ని, ప్రత్యేకించి బ్యాక్‌గ్రౌండ్ సౌండ్ ట్రాక్స్ చేస్తున్నప్పుడు. ప్రయత్నిస్తే తను ఓ మంచి సంగీత దర్శకుడు కాగడలడని నాకు అనిపించేది. కాని తను నేను టెక్నికల్‌గా కంపోజర్‌ని కాదండీ అనేవాడు. చాలా రోజుల తర్వాత 'అంతం' సినిమా చేస్తున్నప్పుడు, సంగీత దర్శకుడు ఆర్.డి.బర్మన్‌తో ఓ సమస్య వచ్చి, నేను వేరొకరిని

తీసుకోవాలనుకున్నాను. కీరవాణి బిజీగా ఉన్నందువల్ల ఆ కీబోర్డ్ ప్లేయర్‌ను ఓ పాట కంపోజ్ చేయమని ఒత్తిడి చేశాను. తను చేశాడు కానీ, ఆ సినిమా, ఆ పాట రెండిటికీ గుర్తింపు లేకుండా పోయాయి. కానీ, చిరంజీవి గారితో నేను సినిమా చేసేటప్పుడు ఆ కీబోర్డ్ ప్లేయర్ పేరు సూచించాను. నాకు నమ్మకం ఉందంటే తనకి ఓకే అన్నారు చిరంజీవి. అభిమానుల మధ్య ఎంతో సందడిగా ప్రారంభమైన ఆ సినిమా, కొన్ని కారణాల వల్ల అర్ధంతరంగా నిలిచిపోయింది.

ఆ కీబోర్డ్ ప్లేయర్ మాత్రం తీవ్ర నిరాశకు లోనయ్యాడు. అయితే, ఆ సినిమా కోసం తను చేసిన ఒక పాటకు చిరంజీవి గారు బాగా ఇంప్రెస్ అయ్యి, ఆయన తరువాత సినిమాను చేసే అవకాశం ఇచ్చారు. ఆ సినిమా పేరు 'బావగారూ బాగున్నారా'. ఆ సినిమా తర్వాత ఆ కీబోర్డ్ ప్లేయర్ తెలుగులో అగ్రశ్రేణి సంగీత దర్శకుల్లో ఒకరుగా పేరు తెచ్చుకున్నాడు. అతడి పేరు 'మణి శర్మ'.

'శివ' షూటింగ్ పూర్తయ్యి, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ చేయాల్సిన యూనియన్ స్ట్రయిక్ నడుస్తోంది. దాంతో ఇళయరాజా గారు, నేను ముంబయి వెళ్లాల్సి వచ్చింది. అక్కడ ఇళయరాజా ఎంపిక చేసుకున్న ఓ సంగీత బృందం, ఆ సినిమాను చూసింది. ఆ బృందంలోంచి ఓ వయొలిన్ ప్లేయర్ నా దగ్గరికి వచ్చి, ఈ సినిమా పెద్ద సెన్సేషన్ క్రియేట్ చేస్తుందని చెప్పాడు. నా సినిమాకి సంబంధం లేని మనిషి నుంచి వచ్చిన మొట్టమొదటి అభినందన అది. ఆ తర్వాత తనూ నేనూ బ్యా గ్రౌండ్ స్కోర్ జరిగినన్ని రోజులు ఏవేవో విషయాలు మాట్లాడుకుంటూ ఉండేవాళ్లం.

కొన్నేళ్ల తర్వాత 'ద్రోహి' (తెలుగులో 'అంతం') సినిమాకు ఆర్.డి.బర్మన్‌తో పాట కంపోజ్ చేయించుకోవడానికి మళ్లీ ముంబయి వెళ్లాను. మళ్లీ ఆ వయొలిన్ ప్లేయర్ నన్ను కలిశాడు. 'శివ' సక్సెస్‌ను ముందే ఊహించగలిగినందుకు తను తన సంతోషాన్ని నాతో పంచుకున్నాడు. తర్వాత తన బెస్ట్‌ఫ్రెండ్ అని చెప్పి ఒకతణ్ని నాకు పరిచయం చేశాడు. అతడు పాటల రచయిత అని కూడా చెప్పాడు. ఆ రచయిత నాకు ఓ విజిటింగ్ కార్డ్ ఇచ్చాడు. నేను దాన్ని నా జేబులో పెట్టుకున్నాను. ఆ సాయంత్రమే హైదరాబాద్ వచ్చేశాను. ఇక ఆ కార్డు సంగతి పూర్తిగా మరిచిపోయాను. ఇంతకు ముందే చెప్పినట్టు, 'ద్రోహి' సినిమాకు ఆర్.డి.బర్మన్‌తో తేడా రావడం వల్ల, కొత్త సంగీత దర్శకుడు మణిశర్మతో పాట ట్యూన్ చేయించుకున్నాను.

ఆ సాయంత్రం నేను చెన్నై వెళ్లడానికి రెడీ అవుతుండగా మా అమ్మ ఓ విజిటింగ్ కార్డుల కట్ట తెచ్చి, ఇందులో ఏమైనా పనికొస్తాయా? లేదంటే డస్ట్‌బిన్‌లో పడేస్తాను అంది. అవి చాలా కాలంగా పోగుపడుతున్న కార్డులు. హడావుడిలో ఓసారి వాటిని చకచకా తిప్పి చూశాను. అందులో ఆ పాటల రచయిత కార్డు ఉండటం గమనించాను. అన్నింటినీ పడెయ్యమని అమ్మతో చెప్పేశాను. అయితే, నేను చెన్నైకి వెళ్లే సమయానికి

అక్కడికి రావాల్సిన గీత రచయిత జావేద్ అఖ్తర్ గారు ఏదో పని పడి రాలేకపోతున్నారని కబురొచ్చింది. నాకు చిరాకేసింది. ఆ రాత్రి జరగాల్సిన రికార్డింగ్‌ని క్యాన్సిల్ చేసుకోవడానికి నేను సిద్ధంగా లేను. అందుకే ఇంకెవరైనా రైటర్‌ను పంపమని ముంబయిలో ఉన్న నా మనుషులతో చెప్పాను. ఎవరూ అందుబాటులో లేరని జవాబు వచ్చింది. ఏం చేయాలో అని ఆలోచిస్తుండగా, హఠాత్తుగా నాకు అమ్మ చూపించిన విజిటింగ్ కార్డు గుర్తొచ్చింది. వెంటనే అమ్మకు ఫోన్ చేశాను. ఆ విజిటింగ్ కార్డులన్నింటినీ అప్పుడే డస్ట్‌బిన్‌లో పడేశానని చెప్పింది. ఆ కార్డు కావాలని అడిగితే మళ్లీ డస్ట్‌బిన్‌లో వెతికింది. అదృష్టవశాత్తూ అది దొరికింది. అందులో ఉన్న నంబర్ సాయంతో నేను ఆ రచయితను చెన్నైకి రప్పించి మణిశర్మ కంపోజిషన్‌కు పాట రాయించాను. రికార్డింగ్ పూర్తయ్యింది. అయితే ఆ పాట, ఆ సినిమా రెండూ ఫ్లాప్ అయ్యాయి.

ఆ గీత రచయిత, ఆ వయొలిన్ ప్లేయర్ నన్ను కలుస్తుండేవారు. ఆ సమయంలో 'రంగీలా' ఇంకా ఆలోచన దశలో ఉంది. వాళ్లిద్దరికీ ఆ స్టోరీ వినిపించాను. ఇద్దరూ ఎక్జయిట్ అయ్యారు. ఆ వయొలిన్ ప్లేయర్ ఒక ట్యూన్ ఇచ్చాడు. దానికి ఆ రచయిత పాట రాశాడు. నాకు బాగా నచ్చింది కూడా. ఇక,రంగీలాకు నిన్నే తీసుకుంటానని ఆ వయొలిన్ ప్లేయర్‌కి మాటిచ్చేశాను. వాళ్ల ఆనందానికి అవధుల్లేవు.

కొన్ని రోజుల తర్వాత మణిరత్నంగారు నాకు చెన్నైలోని వాళ్లింట్లో 'రోజా' పాటలు వినిపించారు. ఎ.ఆర్.రెహమాన్ బ్రిలియన్స్ నన్ను అబ్బుర పరిచింది. తన శబ్దం, తన లాంటి సంగీతం ఎలాగైనా, ఏం చేసైనా నా సినిమాలో ఉండాలన్న దురాశ మొదలైంది. దాంతో ఆ వయోలిన్ ప్లేయర్‌కు ఇచ్చిన మాట తప్పి, రెహమాన్‌ను సైన్ చేశాను. వయొలిన్ ప్లేయర్ చాలా ఫీల్ అయ్యాడు. పాటల రచయిత తన స్నేహితుణ్ని అన్యాయం చెయ్యొద్దనీ అతన్ని కూడా ఉండనిమ్మనీ బతిమాలాడు. సినిమాను మరింత బాగా తేవడానికి తీసుకున్న ప్రొఫెషనల్ నిర్ణయమే తప్ప, ఇందులో ఇంకేమీ లేదని సర్దిచెప్పాను. తర్వాత ఆ పాటల రచయిత గురించి రెహమాన్‌తో మాట్లాడాను. తన మొదటి పాట పోయినా, తన టాలెంట్ మీద నాకు నమ్మకం ఉందని చెప్పాను. నీకు తన మీద నమ్మకముంటే నాకూ ఓకే అని రెహమాన్ బదులిచ్చాడు. అలా 'రంగీలా' కోసం ఆ పాటల రచయిత మెహబూబ్ రాసిన మొదటి పాట 'తన్హా తన్హా' ఆ పాటను మణిరత్నంకు వినిపిస్తే, చాలా రోజుల తర్వాత హిందీ సినిమా పాటలో దిల్, దీవానా, సనమ్ అనే ఊకదంపుడు మాటలు లేకుండా ఓ మంచి పాట విన్నానని చెప్పారు. వెంటనే తన 'బోంబే' (తెలుగులో 'బొంబాయి') సినిమా కోసం తీసుకున్నారు. తంతే బూరెల బుట్టలో పడినట్టు, మెహబూబ్ డస్ట్‌బిన్ లోంచి రంగీలా, బోంబేలో పడ్డాడు. ఇక రంగీలా, బోంబే సక్సెస్ తర్వాత వచ్చిన గుర్తింపుతో మెహబూబ్ తన ఆప్తమిత్రుడైన ఆ వయొలిన్ ప్లేయర్‌ని దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీకి పరిచయం చేశాడు. తన 'హమ్ దిల్ దే చుకే సనమ్' సినిమా కోసం ఒక కొత్త సంగీత దర్శకుడి కోసం వెతుకుతున్న భన్సాలీ అతన్ని సైన్ చేశాడు.

అలా ఆ వయొలిన్ ప్లేయర్ ఇస్మాయిల్ దర్బార్ అనే సంగీత దర్శకుడిగా ఆవిర్భవించాడు. 'హమ్ దిల్ దే చుకే సనమ్' పెద్ద హిట్. ఈలోగా రెహమాన్ సినిమాలు కొన్ని ఫ్లాప్ అయ్యాయి. నా 'దౌడ్'తో సహా. దాంతో ఇస్మాయిల్ దర్బార్ ఓ వెలుగు వెలిగాడు. నేను కంగ్రాట్స్ చెప్పటానికి ఫోన్ చేస్తే, ఇస్మాయిల్ ఫోన్ తియ్యలేదు. ఆ తర్వాత ఇస్మాయిల్ దర్బార్ ఓ ఇంటర్వ్యూలో, ఇప్పుడే నేను సక్సెస్ అయ్యాను గనక, నాకు రామ్ గోపాల్‌వర్మతో సహా అందరూ ఫోన్లు చేస్తున్నారు అని చెప్పాడు. అది నేను అతనికి రంగీలా చాన్స్ ఇవ్వక బాధపెట్టినందుకు, నామీద తీర్చుకున్న ప్రతీకారం అని వేరే చెప్పనక్కర్లేదుగా!

అయితే ఒకరి బ్రేకుకి మరొకరు కారణమైన ఆ ఇద్దరు ప్రాణ స్నేహితులు - ఇస్మాయిల్ దర్బార్, మెహబూబ్... షారుఖ్‌ఖాన్ 'దేవదాస్' తర్వాత, కొన్ని కారణాల వల్ల విడిపోయారు. నెమ్మదిగా ఇద్దరూ కేరీర్ గ్రాఫ్‌లో కిందకు జారిపోయారు.

మళ్లీ కొన్ని సంవత్సరాల తర్వాత, ఆ పాత విషయాలను పాతేసి, స్నేహాన్ని పునరుద్ధరించుకుందామని వాళ్లు నాకు ఫోన్ చేస్తే నేను ఎత్తలేదు. ఎందుకంటే ఇప్పుడు నేను మరో బృందంతో పని చేసుకుంటున్నాను. పాత స్నేహాలను పునరుద్ధరించు కోవాలన్న ఆసక్తి గానీ సమయం గానీ నాకు లేవు.

ఈ ఆర్టికల్ ద్వారా నేను చెప్పదలుచుకున్న పాయింట్ ఒకటే. ఎవరెవరిని అదృష్టం ఎప్పుడు ఏ డస్ట్‌బిన్‌లో పడేస్తుందో, మళ్లీ ఎప్పుడు అందులోంచి బయట పడేస్తుందో ఎవరూ చెప్పలేరు.

అమ్మ ఆ రోజు డస్ట్‌బిన్‌లోంచి మెహబూబ్ విజిటింగ్ కార్డు బయటికి తియ్యకపోతే ఎవరెవరి జీవితాలు ఎలా ఉండేవో ఎవరు చెప్పగలరు..?

హ్యాపీ డెత్ డే

చాలా ఏళ్ల కిందట 'క్షణక్షణం' సినిమాకు సంబంధించిన పని మీద నేను హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్లాల్సి వచ్చింది. నాకు బాగా సన్నిహితురాలైన ఒకామె, నా ప్రయాణాన్ని వాయిదా వేసుకొమ్మని చెప్పింది. ఎందుకూ అంటే, మరుసటి రోజు తన పుట్టినరోజు అని చెప్పింది. "లేదు, నేను కచ్చితంగా వెళ్లాలి. అర్జెంట్ పని" అన్నాను. "అంటే, నా పుట్టినరోజు కంటే నీ పనే నీకు ఎక్కువా?" అని అడిగింది. నేను, "నీ పుట్టిన రోజుకు అంత ప్రత్యేకత ఏముంది? ఎంతో కొంత సాధించాను అనుకునే నేనే, నా పుట్టినరోజును ఎప్పుడూ జరుపుకోలేదు. నాకు తెలిసి నువ్వు సాధించింది శూన్యం. అలాంటిది నీ పుట్టిన రోజు వేడుక జరుపుకోవడానికి ఓ అంతగా ఇదవ్వాల్సిన అవసరముందా? నువ్వు పుట్టడానికి లోకాన్ని ఉద్ధరించేటంత పెద్దకారణం ఉందని నువ్వు అనుకుంటున్నావా? నీ తల్లిదండ్రులు కలిసినప్పుడు ప్రత్యేకంగా నీకు మాత్రమే జన్మనివ్వాలనే తలంపు వాళ్లకు ఎంతమాత్రం ఉండి ఉండదు. ఎవరు, ఎందుకు, ఎప్పుడు నీ పుట్టుకకు కారణమయ్యారో నీకు ఏమాత్రం తెలియటానికి ఆస్కారమే లేనప్పుడు, నీ జన్మ మీద నీకు ఏ మాత్రం కంట్రోలే లేనప్పుడు ఇంక నువ్వు కేవలం పుట్టినంత మాత్రాన, అంత గొప్పతనం ఉందని నువ్వు ఎందుకు అనుకుంటున్నావు?" అన్నాను.

ఆమె నా చెంప చెళ్లుమనిపించింది.

నేననుకోవడం ఈ పుట్టినరోజు ఉత్సవాలు జరుపుకోవాలన్న ఆరాటానికి ప్రాథమిక కారణం... ప్రతి మనిషిలో దాగున్న తీవ్రమైన అభద్రతా భావం. నేనెవరికీ పట్టనేమో, నాకు ఏ మాత్రం ప్రాధాన్యత లేదేమో అన్న దిగులు లోంచి ఈ టైపు వేడుకలు పుడతాయి. ఎక్కువశాతం మంది జీవితంలో ఏమీ సాధించరు. సాధించలేమని కూడా వాళ్లకి అర్థమైపోతుంది. అందువల్ల కనీసం ఆ ఒక్కరోజైనా కొంతమంది ఆ వ్యక్తిని ప్రత్యేకంగా చూస్తే, తమకు తాము ఆ ఒక్కరోజు గ్రేట్‌స్టార్స్‌గా ఫీల్ అయిపోతారు. ఇంక ఆ ఫీలింగ్ మళ్లీ పునరావృత్తమయ్యే రోజు కోసం, వాళ్లు మళ్లీ 364 రోజులు ఆత్రంగా ఎదురుచూస్తారు.

నా జీవితంలో నా పుట్టినరోజున నేను అందుకున్న బెస్ట్ గ్రీటింగ్ నా సెల్‌ఫోన్‌లో ఒక మెసేజ్ రూపంలో వచ్చింది. అది ఓ అజ్ఞాత ఫోన్ నంబర్. అందులో ఏముందంటే – 'హే రాము... నీ జీవితం లోంచి ఇంకో సంవత్సరం పోయిందిరా. ఇలాగే చస్తూ ఉండు'. అంతే బర్త్‌డేల మీద ఉన్న నా పర్సనల్ ఫీలింగ్ మొత్తాన్ని ఆ మెసేజ్ ఒక దృక్పథంలో పెట్టింది.

నా పుట్టినరోజున వచ్చే శుభాకాంక్షలు నాకు కేవలం నేను నా వయసులో ఇంకా పెద్దవాణ్నైపోయానని గుర్తు చేస్తాయి. చావుకు దగ్గరవుతున్నానని గుర్తుచేస్తాయి. ఇంకా చెప్పాలంటే, నేను చేయాల్సింది చేయడానికి సమయం తగ్గిపోతోందని గుర్తుచేస్తాయి. అందుకే, ఎవరైనా నాకు హ్యాపీ బర్త్‌డే చెప్పడానికి దగ్గరికొస్తున్నారంటే, వాళ్లు నాకు హ్యాపీ డెత్ డే చెబుతున్నట్టుగా భయంతో వాళ్ల నుంచి పారిపోతాను.

ఎవరైనా సెలబ్రేట్ చేసుకోవాలనుకుంటే, వాళ్ల విజయాన్ని లేదా వాళ్లు సాధించిన దానిని సెలబ్రేట్ చేసుకోవాలి కాని, కేవలం వాళ్లు పుట్టడాన్ని సెలబ్రేట్ చేసుకోవడం అనేది నా దృష్టిలో కేవలం ఒక అవివేక పరాకాష్ఠపు మూర్ఖత్వం. ఒకవేళ నాకుగా నేను సెలబ్రేట్ చేసుకోవాలనుకుంటే, నేను ఏ రోజైతే 'శివ' సినిమా తీయటానికి నా ప్రొడ్యూసర్‌ని ఒప్పించగలిగానో, ఆ రోజుని సెలబ్రేట్ చేసుకోవడానికి ఇష్టపడతాను తప్ప, కేవలం నేను పుట్టినరోజును కాదు. లక్షలాది మంది జనం, జంతువులు, క్రిమికీటకాలు ప్రతి రోజూ పుట్టినట్టే, నేను కూడా పుట్టానంతే.

పుట్టిన తరువాత ఏం చేశావన్న దాంట్లో సెలబ్రేషన్ ఉండాలి కానీ, పుట్టినందుకే సెలబ్రేట్ చేసుకునేవాళ్లు అత్యంత మహా చేతగాని వాళ్లని నా నమ్మకం.

గమనిక : నన్ను చెంప దెబ్బ కొట్టిన ఆమెకు చాలా ఏళ్ల క్రితం నేను దూరమై పోయాను. కాని, కిందటి ఏడాది ఆమె పుట్టినరోజునాడు జస్ట్ లైక్ దట్ హ్యాపీ బర్త్‌డే విషెస్ చెబుతూ ఒక మెసేజ్ పంపించాను. ఆమె నుంచి రిప్లై రాలేదు.

లాకప్ పాఠాలు

నేను చదువుకునే రోజుల్లో కాలేజీల్లో గ్యాంగ్ ఫైట్స్ చాలా జరుగుతుండేవి. విజయవాడలోని సిద్ధార్థ కాలేజీలో నేను కూడా అలాంటి ఫైట్స్‌లో పాల్గొన్నాను. చదువు మీద శ్రద్ధ లేకపోవడం, ఏదో సాహసం చేయాలన్న ఉత్సుకత, కాలేజీలో ఇలాంటి గ్యాంగ్ ఫైట్స్‌కు దారి తీస్తాయి. మా కాలేజీలో 'వీ.టి.' అనే ఓ స్టూడెంట్ ఉండేవాడు. అతనితో ఉన్న వైరం వల్ల మా గ్యాంగ్ ఎప్పటికైనా అతన్ని కొట్టాలని ఎదురు చూస్తూండేది. అప్పుడు విజయవాడలో పోలీసులు ఏ రెండు వర్గాలు కొట్టుకున్నా ముందే ఇద్దర్నీ తన్ని ఆ తరువాత మాట్లాడేవారు.

ఫైనల్ ఎగ్జామ్ చివరి రోజు ఎలాగైనా వీ.టీ. మీద ఎటాక్ చేయాలని ప్లాన్ చేశాను. రెండు నెలలు సెలవులుంటాయి. కాబట్టి అందరూ ఎవరి ఊళ్లకు వాళ్లు వెళ్లిపోవచ్చు. ఈలోగా పరిస్థితులు వాటంతట అవే చక్కబడతాయనేది నా ఆలోచన. కానీ ఓ ప్రాబ్లమ్ వచ్చి పడింది. మా బ్యాచ్‌లో నర్సింగ్‌రావు అని ఉన్నాడు. తన ఎగ్జామ్ మరుసటి రోజుకు పోస్ట్‌పోన్ అయింది. మేం గనక ముందు అనుకున్నట్లుగా మా ప్లాన్‌ను అమలు చేస్తే, నర్సింగ్ రావు ఒక్కడే పోలీసులకు దొరికిపోయే ప్రమాదం ఉంది. అలాగని వాయిదా వేద్దామా అంటే, వీ.టీ. అదే రోజు ఇంటికి వెళ్లిపోతున్నాడని తెలిసింది. చివరికి నర్సింగ్ రావుకి ఇబ్బంది కలగకూడదని ఆపరేషన్ క్యాన్సిల్ చేశాను.

అయితే, ఇక్కడో ఎత్తుగడ వేశాను. ఎగ్జామ్స్ చివరి రోజు మేము వీ.టి.ని కొట్టబోతున్నట్టు కాలేజీలో రహస్యంగా పాకేలా చేశాను. అనుకున్నట్లుగానే ఆ వార్త వీ.టి.కి తెలిసింది. దాంతో ఎగ్జామ్ హాల్ నుంచి బయటికి రాగానే తనకు రక్షణగా ఉండటానికి కొంతమందిని తెచ్చుకున్నాడు. నా వేగుల ద్వారా ఎవరెవరు వచ్చారో కనుక్కున్నా. ఈ దెబ్బతో అసలు వీ.టీ.ని ఎవరెవరు సపోర్ట్ చేస్తున్నారో తెలుసుకునే అవకాశం కలిగింది నాకు. తను ఊహించినట్టుగా ఎటాక్ జరక్కపోయే సరికి, అదంతా రూమర్ అనుకొని వీ.టీ. వాళ్ల ఊరు వెళ్లిపోయాడు. ఆ తరువాత రెండు నెలల గ్యాప్‌లో వీ.టీ. సపోర్టర్స్‌ను స్టడీ చేసి, వాళ్లెవరు? ఎవరికి సంబంధించినవాళ్లు? వాళ్ల బలాలు, బలహీనతలు తెలుసుకున్నా.

కొంతమందిని హెచ్చరించీ, ఇంకొంతమందిని భయపెట్టీ, కొందరితో స్నేహంచేసీ... ఇలా రకరకాలుగా వీ.టీ.ని సపోర్టు చేసేవాళ్ల సంఖ్యను తగ్గించేశాను. సెలవుల నుంచి వచ్చిన వీ.టీ.కి ఈ విషయాలేమీ తెలియవు. వీ.టీ. ఈగో, షార్ట్‌టెంపర్‌లనే నాకు

ఆయుధాలుగా మలుచుకున్నా. కాలేజీ టైమ్‌లో మా గ్యాంగ్‌ను వెంటబెట్టుకుని క్యాంపస్ ఫెన్సింగ్ దాటి వీ.టీ. ఉండే కాలనీ వైపు వెళ్లాను. మేం ఎటాక్ చేయబోతున్నామన్న విషయాన్ని ఆఖరు క్షణంలో లీక్ అయ్యేలా చేసి తనకి పారిపోయే అవకాశం కల్పించాను. విషయం తెలిసిన వీ.టీ., మేం రూమ్‌కు వెళ్లేలోపు అక్కడి నుంచి పరుగెత్తాడు. నేను వెంటనే నా గ్యాంగ్‌తో సహా క్యాంపస్ లోపలికివచ్చేశాను.

విపరీతమైన షార్ట్‌టెంపర్ ఉన్న వీ.టీ. మళ్లీ వస్తాడని నాకు తెలుసు. అనుకున్నట్లుగానే తను ఒక బయటి గ్యాంగ్ మిత్రుడితో కలిసి స్కూటర్ మీద క్యాంపస్ లోపలికి వచ్చాడు. వెంట తెచ్చుకున్న కత్తి తీసి నన్ను ఒక్కసారిగా పొడవబోయాడు. సడెన్‌గా రవీంద్ర అనే నా ఫ్రెండ్ నాకు అడ్డు రావడంతో కత్తి అతని ఛాతీలో దిగింది. ఇక నేను, ఇంకొందరు రాడ్స్, స్టిక్స్‌తో వీ.టీ. వెనక పడ్డాం. అతడు పరుగెత్తుకెళ్లి మెస్ రూమ్‌లో దాక్కున్నాడు. రక్తమోడుతున్న కత్తి ఇంకా అతడి చేతిలోనే ఉంది. మేం అతడు బయటకు రాకుండా అక్కడే నిలబడ్డాం. ఈ గొడవలో వీ.టీ. వెంట వచ్చిన మిత్రుడు పారిపోయాడు. పోలీసులు రానేవచ్చారు. వీ.టీ.తో సహా మమ్మల్నీ పట్టుకెళ్లారు. పటమట పోలీస్ స్టేషన్‌లో వేరు వేరు లాకప్స్‌లో మమ్మల్ని ఉంచారు.

తరువాత నేను కంప్లెయింట్ రాస్తున్నప్పుడు స్పాట్‌లో లేని వీ.టీ. సపోర్టర్లను కూడా ఇరికించాను. వాళ్లందరూ దాడి జరిగినప్పుడు అక్కడే ఉన్నారని పోలీసుకు అబద్ధం చెప్పాను. రవీంద్ర గాయపడటం, వీ.టీ. రెడ్ హ్యాండెడ్‌గా కత్తితో సహా దొరకడం వల్ల పోలీసులు నేను చెప్పింది నమ్మేశారు. వీ.టీ. మీద హత్యాప్రయత్నం కేసు నమోదు చేసి, నేను చెప్పిన అందరినీ అరెస్ట్ చేశారు. ఆ రకంగా ఒక్క మాస్టర్ ప్లాన్‌తో మొత్తం నా ప్రత్యర్థి గ్యాంగ్‌ను ఆనవాళ్లు లేకుండా చేశాను. స్టేట్‌మెంట్ తీసుకుని పోలీసులు మమ్మల్ని వదిలిపెట్టారు. ఆ తరువాత వీ.టీ. పేరెంట్స్ నన్ను కలిసి, రవీంద్ర కేసువెనక్కి తీసుకునేందుకు సహకరించాలని కోరారు. హాస్పిటల్‌లో ఉన్న రవీంద్రని ఒప్పించి నాకు పరిచయమున్న వ్యక్తుల ద్వారా ఇన్‌స్పెక్టర్‌ను కలిసి, సంఘటనలకి కొన్ని పిట్ట కథలు జతచేసి చెప్పి, కేసులోని తీవ్రతను తగ్గించాను. దాంతో వీ.టీ.కి బెయిల్ దొరకడం సులువైంది.

ఇంతకూ ఈ మొత్తం కథలో నేనొక ఆసక్తికర విషయం చెప్పాలనుకుంటున్నా. అది కంప్లెయింట్ ఇవ్వటానికి ముందు మేం లాకప్‌లో ఉన్నప్పుడు జరిగింది. ఒక సబ్ ఇన్‌స్పెక్టర్ ఫోన్‌లో మాట్లాడుతుండగా నేను లాకప్ బార్స్‌లోంచి విన్న మాటలు, నా జీవితంలో నాకు చాలా విలువైన పాఠం నేర్పాయి. ఎస్సై తన మిత్రుడితో ఫోన్‌లో ఆ మాటా ఈ మాటా చెప్పి చివరకు "ఆ సిద్ధార్థ కాలేజీ పిల్లలు ఏదో చిల్లర గొడవ పడితే తీసుకొచ్చి లాకప్‌లో పడేశాం" అన్నాడు. చాలా క్యాజువల్‌గా అతడన్న మాటలు నన్ను బలంగా తాకాయి. పిల్లలు అని తను వాడిన పదం... లార్జర్ కాంటెక్ట్స్‌లో చూసినపుడు, మనకు చాలా గొప్ప విషయాలు అనుకున్నవి నిజానికి చాలా అల్పమైనవని అర్థమవుతుంది.

నెలలకొద్దీ వీ.టీ. మీద దాడికి మేం చేసిన ప్లాన్స్, దాన్ని అమలు చేసిన ఉత్కంఠ భరిత క్షణాలు, రవీంద్ర కత్తిపోటుతో హాస్పిటల్ పాలవడం... ఇవన్నీ ఇన్‌స్పెక్టర్ దృష్టిలో చాలా చిన్నవి. ఎందుకంటే ఎన్నో భయంకరమైన కేసులు రోజూ డీల్ చేస్తుంటాడు కాబట్టి. కానీ మేమూ, వీ.టీ. కలిసి నిర్మించుకున్న మా ప్రపంచంలో మాకు ఈ గొడవ ఒక ప్రపంచయుద్ధం. లాకప్ నుంచి బయటకు వచ్చాక నెమ్మదిగా మా గొడవ గురించి ఆలోచించడం మొదలుపెట్టాను. ఒక స్కూల్లో పెన్సిల్ కోసం ఇద్దరు పిల్లలు పోట్లాడుకోవడానికీ, కాశ్మీర్ గురించి ఇండియా-పాకిస్తాన్ తగవు పడటానికీ, మా గ్రూపుల కొట్లాటకూ మౌలికంగా పెద్ద తేడా లేదనిపించింది. ఉపయోగించే ఆయుధాలే మారుతాయి.

నాకూ, వీ.టీ.కీ జరిగిన గొడవ పటమట పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌కి చాలా చిన్నది. విజయవాడ ఎస్పీ దృష్టిలో పటమట పోలీస్ స్టేషన్ చాలా చిన్నది. ఆంధ్రముఖ్యమంత్రికి విజయవాడ చాలా చిన్న ఏరియా. దేశాన్ని నడిపే ప్రధానమంత్రికి ఆంధ్రప్రదేశ్ ఇంకా చిన్నది. అమెరికా అధ్యక్షుడికి ఇండియా, ఇండియా లోపల జరిగే వ్యవహారాలు అంత ప్రముఖం అనిపించకపోవచ్చు. ఇలా చూసుకుంటూపోతే విభిన్న దృష్టికోణాలు, విరుద్ధ ప్రాధాన్యాల నడుమ చివరకు దేనికీ అంత ప్రాముఖ్యం ఉండదని అర్థమైంది. బుద్ధుడికి బోధివృక్షం కింద జ్ఞానోదయం అయితే, నాకు విజయవాడ పటమట పోలీస్ స్టేషన్ లాకప్‌లో అయింది.

గమనిక :

1. చాలా ఏళ్ల తరువాత నా 'సర్కార్' ప్రివ్యూకు మా కాలేజీ స్నేహితుల్ని ఆహ్వానించాను. వీ.టీ. కూడా ఉన్నాడు. మేము ఒకరినొకరం కౌగిలించుకున్నాం. అసలు మేమిద్దరం పరస్పర వ్యతిరేకంగా ఎందుకు దెబ్బలాడుకున్నామా అని మాట్లాడుకున్నాం.
2. నా కోసం కత్తి బారినపడిన రవీంద్రను కాలేజీ వదిలేసింతర్వాత నేను మళ్లీ ఇప్పటివరకూ కలవలేదు.

లాకప్‌లో రెండోసారి

రెండోసారి నేను లాకప్‌లో గడిపింది, హైదరాబాద్ పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో. అమితాభ్ బచ్చన్ 'ఆఖ్‌రీ రాస్తా' చిత్ర నిర్మాత ఎ.పూర్ణచందర్‌రావు, తన సినిమా పైరసీ జరుగుతోందని వీడియో లైబ్రరీల మీద పోలీసులకి కంప్లయింట్ చేశాడు. దాంతో పోలీసులు అన్ని వీడియో లైబ్రరీల మీదా రెయిడ్ చేశారు. నా షాపులోని వందల క్యాసెట్లు సీజ్ చేసి నన్ను లాకప్‌లో పెట్టారు. అయితే ఆ రోజుల్లో పైరేట్ చేసిన క్యాసెట్లకు ఏదో వేరే పేరు అతికించేవాళ్లు. వాటన్నింటినీ వీసీఆర్‌లో చూస్తేగాని ఏది దొంగ క్యాసెట్టో తెలియదు. నా ఒక్కషాపులోనే వందల క్యాసెట్లు! ఇలాంటివి ఇంకెన్ని? పోలీసులు ఒక్కొక్కటీ చెక్ చేసినంతసేపూ నేను లాకప్‌లో ఉండాల్సి వచ్చింది.

అయితే, విజయవాడ లాకప్‌కీ, హైదరాబాద్ లాకప్‌కీ తేడా ఏమిటంటే, మా ఫ్యామిలీ మెంబర్స్ హైదరాబాద్‌లోనే ఉంటారు కాబట్టి జీర్ణించుకోలేకపోయారు. మా కజిన్స్ తమ పరిచయాలతో నన్ను లాకప్‌లోంచి త్వరగా బయటకు తీసుకురావడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఒక్క రాత్రి మాత్రం నేను లాకప్‌లో ఉండాల్సి వచ్చింది. అర్ధరాత్రి ఓ పిక్ పాకెటర్‌ను పట్టుకొచ్చిన పోలీసు అతన్ని మెడపట్టి నేనున్న సెల్‌లోకి తోసేశాడు.

అతను లాకప్ ఓ మూలకు వెళ్లి, నన్ను ఓసారి కిందికీ, మీదికీ చూసి, చొక్కావిప్పి, దాన్నే తలగడగా పెట్టుకుని ఓ విలాసవంతమైన పడక గదిలో ఉన్నట్టు నిద్రకు ఉపక్రమించాడు. నేను మాత్రం గోడకు చేరగిలబడి రాత్రంతా అలా కూర్చుండి పోయాను. అర్ధరాత్రి దాటాక, ఇన్‌స్పెక్టర్ ఇంటికి వెళ్లిపోయాక కానిస్టేబుల్స్ అందరూ ఒక రూమ్‌లోకి చేరారు. వాళ్లు రెయిడ్‌లో దొరికిన బ్లూ ఫిలిం క్యాసెట్ చూస్తున్నారని నాకు అర్థమైంది. తరువాత పిక్ పాకెటర్ పక్కనే నేనూ నిద్రపోయాను.

ఉదయం కళ్లు తెరిచేసరికి పిక్ పాకెటర్, కానిస్టేబుల్ కటకటాలకి చెరోవైపునా కూర్చుని టీ తాగుతూ, తమ కుటుంబాల గురించి మామూలుగా మాట్లాడుకుంటున్నారు. అడ్డుగా ఉన్న ఊచలు తొలగించి చూస్తే వాళ్లిద్దరూ స్నేహితుల్లా కనిపిస్తారు. మొదట ఈ ఆలోచన నాకు కొంత ఆశ్చర్యం కలిగించినా, తరువాత ఇన్‌స్పెక్టర్ నాతో మాట్లాడిన తరువాత ఓ వాస్తవం బోధపడింది. నాతో ప్రొడ్యూసర్ల గురించి మాట్లాడుతూ, "ఈ డబ్బున్న నా కొడుకులు – ముఖ్యంగా సినిమా నిర్మాతలు, ఇన్‌కం టాక్స్ వాళ్ల దగ్గర తప్పుడు లెక్కలు చూపించి లక్షలూ, కోట్లూ నొక్కేస్తారు. అదే బతుకుతెరువు కోసం చిన్న చిన్న తప్పులు చేసి వందల్లో, వేలల్లో సంపాదిస్తే మిమ్మల్ని తప్పుబడతారు" అన్నాడు.

ఇన్‌స్పెక్టర్‌లోని లోపలి మనిషి, చట్టప్రకారం ప్రొడ్యూసర్‌కి జరిగిన అన్యాయం కన్నా, మా తప్పనిసరి పరిస్థితుల్ని అర్థం చేసుకున్నాడు. నేను కేసులోంచి బయటపడటానికి తనవంతుగా సహకరించాడు.

లోతుగా ఆలోచిస్తే వీడియో క్యాసెట్లు పైరేట్ చేసినవాడు గాని, నాతో లాకప్‌లో గడిపిన జేబుదొంగ గాని, నిర్మాత పూర్ణచందర్‌రావు గాని, ధనికుల మీద ఏహ్యభావం ఉండటంవల్ల నాకు సహకరించిన ఎస్సైగాని... యూనిఫారాలు, ఉద్యోగ బాధ్యతలు, అంతస్థులు పక్కన పెడితే ఆఖరికి అందరూ మనుషులే. ఇరవై నాలుగు గంటల లాకప్ అనుభవం తరువాత ఒక పోలీస్ స్టేషన్ ఎలా పని చేస్తుందో ప్రత్యక్షంగా తెలుసుకోగలిగాను. తరువాత ఆ ఇన్‌స్పెక్టర్‌తో నాకు పరిచయం పెరిగింది.

అతడి సహకారంతో అప్పుడప్పుడూ స్టేషన్ బయట నిలబడి అక్కడ జరిగే రోజువారీ వ్యవహారాల్ని ఆసక్తిగా గమనించేవాణ్ని. ఈ అనుభవాలు నాకు నేరస్థుల మానసిక పరిస్థితులను అర్థం చేసుకోవడానికి తోడ్పడ్డాయి. వీటినే నేను తర్వాత్తర్వాత నా పాత్రల కోసం 'శివ', 'సత్య', 'కంపెనీ' లాంటి సినిమాల్లో మరింత నాటకీయంగా ఉపయోగించుకున్నాను. సివిల్ ఇంజినీరింగ్ చేసినప్పుడు విన్న పాఠాల కంటే, లాకప్‌లో నేర్చుకున్న పాఠాలే నాకు నిజమైన డిగ్రీని తెచ్చిపెట్టాయి.

గమనిక : ఎవరివల్లనైతే నేను రెండోసారి, ఒక రాత్రంతా ఒక పిక్ పాకెటర్‌తో లాకప్‌లో గడపాల్సి వచ్చిందో, ఆ 'ఆఖ్‌రీరాస్తా' నిర్మాత ఎ. పూర్ణచందర్‌రావు గారు, నా 'శివ' సినిమాని నాతోనే హిందీలో నిర్మించారు.

నా శ్రీదేవి

విజయవాడలో నేను ఇంజనీరింగ్ చేస్తున్న రోజుల్లో ఎన్నోసార్లు శ్రీదేవి కొత్త సినిమా టికెట్ కోసం పొడవాటి క్యూలలో నిల్చునేవాణ్ని. నిల్చున్న ప్రతీసారి హోర్డింగుల్లో ఉన్న ఆమె చిత్రాలవైపు మంత్రముగ్ధుణ్ని చూస్తూ ఉండిపోయేవాణ్ని. ఆమె అందం, ఆమె సెక్స్ అప్పీల్ ఎంత బలమైనవంటే, వాటి వెనక ఉన్న ఆమెలోని నిజమైన నటిని గుర్తించడానికి ప్రేక్షకులకీ, సినిమా ఇండస్ట్రీకి కూడా చాలా సంవత్సరాలు పట్టింది. నిజానికి 'పదహారేళ్ల వయసు' సినిమా నుంచీ శ్రీదేవి తన నటనాచాతుర్యాన్ని ప్రదర్శిస్తూనే ఉంది. అయితే, ఆమె ఆకర్షణా శక్తి తనలోని సెక్సీ ఇమేజ్‌నే బహిర్గతం చేస్తూ, ఆమెలోని నటనాశక్తికి ప్రేక్షకుల్ని అంధుల్ని చేసింది.

శ్రీదేవిని చేరుకోవాలన్న నా ప్రయాణం నా మొదటి సినిమా 'శివ' నుంచి ప్రారంభమైంది. చెన్నైలోని నాగార్జున ఆఫీసులో 'శివ' స్క్రిప్ట్ మీద పని చేస్తున్నప్పుడు పక్కవీధిలో ఉండే శ్రీదేవి వాళ్లింటికి నడిచి, గేటు బయట నిలబడి తన ఇంటివైపు తదేకంగా చూస్తూ నిలబడేవాణ్ని. అందానికి ఆది దేవతలాంటి శ్రీదేవి, ఆ డొక్కు ఇంట్లో ఉంటోందంటే నేను నమ్మలేకపోయేవాణ్ని. డొక్కు ఇల్లు అంటే అదేదో పాతబడిన ఇల్లని కాదు. అసలు శ్రీదేవిలాంటి అత్యంత అందగత్తెని తనలో ఉంచుకునే అర్హత మనిషి నిర్మించిన ఏ ఇంటికీ లేదని నా నమ్మకం. నేను గేటు బయట నిలబడి, తనెప్పుడైనా ఇంట్లోంచి బయటికో బయట్నించి ఇంట్లోకో వెళ్లేటప్పుడు ఒక్కసారైనా చూడలేకపోతానా అని నిరీక్షిస్తుండేవాణ్ని. నా దురదృష్టం కొద్దీ అలాంటిది ఎప్పుడూ జరగలేదు.

'శివ' విడుదలై పెద్ద హిట్ అయ్యాక, నిర్మాత గోపాల్‌రెడ్డి వచ్చి నన్ను అడిగాడు. శ్రీదేవితో సినిమా చేయడానికి ఏమైనా ఇంట్రెస్ట్ ఉందా? అని. నేను, "మీకేమైనా పిచ్చా ఏంటి? ఆమెను ఒక్కసారి చూడ్డానికి నేను చచ్చిపోగలను. సినిమా సంగతి అటుంచండి" అన్నాను. గోపాల్‌రెడ్డి ఆమెతో నాకో మీటింగ్ ఏర్పాటు చేశాడు. నేను ఏ ఇంటిగేటు బయట ఎన్నిసార్లు నిలబడ్డానో అదే ఇంటికి నన్ను తీసుకెళ్లాడు. సాయంత్రం ఏడున్నర ప్రాంతంలో మేము అక్కడికి వెళ్లాం. నా అదృష్టానికి శని పట్టి అదే సమయానికి కరెంట్ పోయింది. దాంతో లివింగ్ రూములో గోపాల్‌రెడ్డితో పాటు క్యాండిల్ వెలుతురులో కూర్చుని, దేవత ఎప్పుడు ప్రత్యక్షమౌతుందా అని ఎదురుచూస్తూ కూర్చున్నా. నా గుండె వెర్రిగా కొట్టుకుంటోంది. "కాస్త హడావుడిగా ఉంది, ముంబాయికి వెళ్లాల్సిన ఫ్లయిట్‌కు రెడీ అవుతోంది" అని శ్రీదేవి వాళ్లమ్మ మాకు చెప్పింది.

మేము వెయిట్ చేస్తున్న సమయంలోనే ప్యాకింగ్ చేసుకుంటూ శ్రీదేవి లివింగ్ రూమునీ దాటుకుంటూ ఆ గది నుంచి ఈ గదికీ, ఈ గది నుంచి ఆ గదికీ చకచకా కదులుతోంది. ఒకసారి ప్రత్యక్షమౌతూ, ఆ వెంటనే అదృశ్యమౌతూ ఆమె ఫ్లాష్‌లా కదులుతున్న దృశ్యాలను నా మది కళ్లలో ఫార్వర్డ్, రివర్స్ చేసుకుంటూ స్లోమోషన్‌లో నేత్రానందం పొందటం మొదలుపెట్టాను. మధ్య మధ్యలో ఒక్కోసారి నన్ను వెయిట్ చేయిస్తున్నందుకు నావైపు క్షమాపణతో కూడిన తను చిందించిన చిన్న చిన్న చిరునవ్వులు నా పాలిట ఎలక్ట్రిక్ షాకులయ్యాయి. చివరికి వచ్చి తను నా ఎదురుగా కూర్చుంది. ఫార్మాలిటీగా నాతో సినిమా చేయడం తనకు చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉందని నాలుగు మాటలు చెప్పి, హడావుడిగా ముంబాయికి వెళ్లిపోయింది. ఆమె వెళ్లిపోయిన తర్వాత కూడా చాలసేపు నేను శ్రీదేవి వాళ్లమ్మని గౌరవంగా చూస్తూ మాట్లాడాను. ఎందుకంటే ఆ తల్లి సాక్షాత్తూ శ్రీదేవికి జన్మనిచ్చిన మహాతల్లి.

మేఘాల్లో తేలిపోతూ ఆ ఇంటి నుంచి వెనక్కి వచ్చాను. ఆ క్యాండిల్ లైట్ వెలుతురులో నా ముందు శ్రీదేవి కూర్చున్న తీరు ఓ మహాద్భుతమైన పెయింటింగ్‌లా నా మనస్సులో శాశ్వతంగా ఒక ముద్రవేసింది. ఆ రూపం నా మనసునూ, మెదడునూ పూర్తిగా ఆక్రమించుకున్న సంతోషంతో 'క్షణ క్షణం' స్క్రిప్ట్ రాయడం మొదలుపెట్టాను.

ఆ సినిమా తీయడం వెనక ఉన్న నా ఏకైక లక్ష్యం శ్రీదేవిని ఇంప్రెస్ చేయాలని. సింపుల్‌గా చెప్పాలంటే 'క్షణక్షణం' నేను శ్రీదేవికి రాసిన ప్రేమలేఖ.

'క్షణక్షణం' సినిమా షూటింగ్ జరిగినన్నాళ్లూ ఆమె అందం, ఆకర్షణ, వ్యక్తిత్వం నన్ను ఆమె మీది నుంచి కన్నార్పకుండా చేసేవి. ఆమె పర్సనల్ లైఫ్‌లో ప్రవర్తించే తీరు కొత్త డిస్కవరీ నాకు. ఆమె తన చుట్టూ ఒక కనబడని గోడ కట్టుకుని ఉండేది. ఎవరినీ దాన్ని దాటి లోపలికి రానిచ్చేది కాదు. ఇక షెడ్యూళ్లు పూర్తయిన కొద్దీ ఆమె చూపించే నటనను పరిశీలిస్తూ, ఆమె అనుసరించే శైలిని గమనిస్తూ యాక్టింగ్‌కు సంబంధించిన ఎన్నో ప్రాథమిక విషయాలు తెలుసుకున్నాను. ఆమె నటనలోని సంక్లిష్టత, ప్రతిభ కాకలు తీరిన మహానటులనబడే వాళ్లకన్నా కూడా కొన్ని వందల రెట్లు ఎక్కువ.

ఓ రోజు 'అందనంత ఎత్తా తారా తీరం' పాట షూటింగ్ జరుగుతోంది. వెంకటేష్, శ్రీదేవి డ్యాన్స్ చేస్తున్నారు. ఓ షాట్ కాగానే నేను ఫెంటాస్టిక్ అన్నాను. కానీ డ్యాన్స్ మాస్టర్ సుందరం ఇంకో టేక్ చేద్దామన్నాడు. ఆ టేక్ అయ్యాక, నేను మళ్లీ ఫెంటాస్టిక్ అన్నాను. డ్యాన్స్ మాస్టర్ రీటేక్ అన్నాడు. ఎందుకీయన మళ్లీ టేక్ కావాలంటున్నాడని నా అసిస్టెంట్‌ని అడిగితే, అతను నా చెవిలో "సర్, మీరు శ్రీదేవిని చూస్తున్నారు, ఆయన వెంకటేష్‌ను చూస్తున్నాడు" అన్నాడు. ఆమె ఫ్రేమ్‌లో ఉందంటే, ఆమె పక్కన ఎవరుండనీ, ఏం జరుగుతుండనీ నేనే కాదు, లక్షలాది మంది ఆమెనే చూసేవారు. ఊటీ, కొడైకెనాల్లో శ్రీదేవి మీద తీసిన పాటలు నేను సినిమాల్లో చూసేటప్పుడు కెమెరామెన్ గ్రీనరీలు,

లోయలు చూపించటానికి ఆమె నుంచి కెమెరా ప్యాన్ చేసినప్పుడు తందామన్నంత కోపం వచ్చేది. 'లొకేషన్లు చూట్టానికి కాదురా బాబూ, శ్రీదేవిని చూట్టానికి వచ్చా'నని అరిచి చెప్పాలనిపించేది. ఆమెకు ఆ టైంలో ఎంత పాపులారిటీ ఉండేదో స్వయానా కళ్లతో చూసుంటే గాని ఎవరూ నమ్మలేరు. 'క్షణక్షణం' క్లైమాక్సును మేము నంద్యాలలో చేశాం. శ్రీదేవి అక్కడికి వచ్చిందని తెలియగానే పట్టణం మొత్తం స్తంభించిపోయింది. బ్యాంకులు, గవర్నమెంటు ఆఫీసులు, స్కూళ్లు, కాలేజీలు... మొత్తం పనిచేయడం మానేశాయి. ప్రతి ఒక్కరిలోను శ్రీదేవిని చూడాలన్న కోరికే.

ఒక ట్రావెలర్స్ బంగళాలో శ్రీదేవి బసచేసింది. నేను, వెంకటేష్ దానికి కొద్ది దూరంలో ఉన్న మరో బంగళాలో ఉన్నాం. రాత్రంతా ఆమె ఉన్న బంగళా చుట్టూ కనీసం ఓ పదివేల మంది జనం మూగి ఉండేవారు. 50 మంది పోలీసులతో పాటు ఓ వందమంది లోకల్‌వాళ్లు ఆమెకు రక్షణగా ఉండే వాళ్లు.

మేము షూటింగ్ స్పాట్‌లో ఉన్నప్పుడు, శ్రీదేవి బయల్దేరి లొకేషన్‌కి వస్తుందన్న విషయాన్ని మావైపు ఉవ్వెత్తున దూసుకుంటూ వస్తున్న దుమ్ము తెలిపేది. వేలమంది ఆమె కారు వెనక పరుగెత్తుకుంటూ వస్తుంటే గాల్లోకి రేగిన దుమ్ము అది. 'క్షణక్షణం' షూటింగ్ పూర్తి చేశాము. ఆ తర్వాత శ్రీదేవితో 'గోవిందా గోవిందా' తీస్తున్న మధ్యకాలంలోనే ఆమె వ్యక్తిగత జీవితం ఎన్నో కుదుపులకు లోనైంది. ఆమె నాన్నగారు పోయారు. అమ్మ ఏదో మానసిక వ్యాధికి లోనయ్యింది. యావద్భారతదేశ యువకులు కలలుగన్న సుందరాంగి శ్రీదేవి జీవితంలో ఏర్పడిన ఖాళీని బోనీకపూర్ పూరించాడు. దాంతో నాలాంటి ఎన్నో కోట్లమంది ఒంటరి వాళ్లయిపోయారు.

స్టార్‌డమ్ నుంచీ, మ్యాగజైన్ల కవర్‌పేజీల నుంచీ, ఆర్క్‌లైట్ల వెలుతురు నుంచీ, వెండితెర వెలుగుల నుంచీ ఆమె ఒక సాధారణ గృహిణిగా మారిపోయింది. ఒక మామూలు మహిళలా బోనీకపూర్ ఇంట్లో టీ అందిస్తుండటం నేను చూశాను. స్వర్గంలో ఉండాల్సిన ఒక దేవతను నేలమీదికి దించేసినందుకు బోనీకపూర్‌ని లాగి కొట్టాలనిపించింది. తర్వాత నేను బోనీకపూర్ ఇంటికి వెళ్లటం మానేశాను. ఎందుకంటే ఒక మామూలు ఇంట్లో, మామూలు మనుషుల మధ్య, మామూలు వాతావరణంలో శ్రీదేవిని చూడడం నావల్ల కాలేదు.

శ్రీదేవి ప్రపంచంలో అత్యంత విలువైన ఒక వజ్రంలాంటిది. ఆ వజ్రాన్ని ఒక ఇంద్రభవనం లాంటి సెట్టింగులో, కళ్లు మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాల వెలుతురులో, ఒక సినిమాటిక్ యాంబియన్స్‌లో చూడాలి తప్ప ఇలా ఒక మామూలు ఇల్లాలిగా చూడటం నాకు చేతకాని పని.

విశ్వబ్రహ్మ సృష్టించిన అత్యద్భుతమైన సౌందర్యరాశి శ్రీదేవి. అలాంటి అందం లక్ష సంవత్సరాలకు ఒక్కసారి మాత్రమే జన్మిస్తుంది.

నిజమైన శ్రీదేవిని బోనీకపూర్ తన ఇంట్లో పెట్టుకుని ఉండచ్చు. కాని నేను మాత్రం వెండితెర కలలు కనే నా హృదయపు ఆలయంలో ఆ దివ్య దేవతను ఇప్పటికీ, ఎప్పటికీ నా మనసు కెమెరాలో శాశ్వతంగా బంధించుకున్నాను. శ్రీదేవికి జన్మనిచ్చిన ఆమె తల్లిదండ్రులకి, ఆమె అందాన్ని శాశ్వతంగా బంధించగలిగే మూవీ కెమెరాను కనిపెట్టిన ఫ్రెంచ్ సైంటిస్ట్ లూయీ లూమియర్‌కి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటూ నా ఈ లవ్‌స్టోరీని ఇక్కడితో ముగిస్తున్నాను.

గమనిక :

1. తనంటే నాకెంత ఇష్టమో నేనేప్పుడూ శ్రీదేవికి చెప్పలేదు. ఎందుకంటే తనని పొందే అర్హత నాకు గానీ, ఈ ప్రపంచంలో ఇంకెవరికిగానీ లేదని నా నమ్మకం. ఆ నమ్మకాన్ని వమ్ము చేస్తూ తను బోనీకపూర్‌ని పెళ్లి చేసుకుంది. నేను ఆరడుగుల ఆజానుబాహుణ్ణి, అందగాడ్ని కాకపోవచ్చు. కానీ కాంపిటీషన్ బోనీకపూరే అయినప్పుడు నేను నా మనస్సు విప్పి శ్రీదేవిని అడిగుంటే కచ్చితంగా నాకూ ఒక ఛాన్స్ ఉండుండేదని నా ఇప్పటి ప్రగాఢ నమ్మకం. లైఫ్‌లో నోరు తెరిచి అడగకపోవటం మూలాన, చెయ్యి చాచకపోవటం మూలాన మనకి కలిగే నష్టాలు కోకొల్లలు. కానీ శ్రీదేవిని పోగొట్టుకున్న నష్టం అనేది నా జీవితంలోనే నాకు అతి పెద్ద ఫెయిల్యూర్.

2. ఎప్పటికయినా శ్రీదేవి కనీసం ఈ శీర్షిక అయినా చదువుతుందని నాకొక చిన్న ఆశ.

నన్ను అత్యంత ప్రభావితం చేసిన వ్యక్తి

సరిగ్గా నా ఆలోచనాధోరణి ఎప్పుడు ఓ కచ్చితమైన రూపం తీసుకుంది? అని చాలామంది నన్ను అడుగుతుంటారు. దానికి నా సమాధానం 'సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజ్‌లో సత్యేంద్ర నా జీవితంలోకి వచ్చాక'.

నా జీవితంలో నాకు తారసపడిన వాళ్లలో అతను నిస్సందేహంగా నామీద అత్యంత ప్రభావం చూపాడు.

సత్యేంద్ర నాకంటే రెండేళ్లు చిన్నవాడు. విపరీతమైన చదువరి. చదివినతర్వాత ఆ పుస్తకాన్ని, ఆ రచయితను ఎంత లోతుగా విశ్లేషించేవాడంటే, ఆ పుస్తకం రాయడానికి ఆ రచయితను ఏయే కారణాలు పురిగొల్పి ఉంటాయి అనేది తనకి ఇట్టే అర్థమైపోయేది. ఒక్కో మానసిక స్థాయి ఉన్న పాఠకుడి మీద ఆ పుస్తకం ఎలాంటి ప్రభావం చూపగలదో కూడా అంచనా వేసేవాడు.

విద్యార్థులే కాదు, కాలేజీ లెక్చరర్లు కూడా సత్యేంద్ర తెలివితేటలకు భయపడే వారు. అతడు ఏదైనా డౌట్ అడగడానికి చేయి ఎత్తగానే, లెక్చరర్ల ముఖాల్లో కనబడే భయం తాలూకు ఫీలింగును నేను స్పష్టంగా గమనిస్తూ ఉండేవాణ్ని. అతడు కాలేజీకి హవాయి చెప్పులతో వచ్చేవాడు. ఆఖరి బెంచీలో కూర్చునేవాడు. పక్కన ఉన్న ఎవరినో ఒకరిని ఓ తెల్ల కాగితం అడిగి తీసుకుని, నడుస్తున్న పాఠానికి సంబంధించిన ముఖ్యాంశాలు ఏవో కెలికినట్టు నోట్ చేసుకునేవాడు.

ఒక్కోసారి ఆ పాఠానికి సంబంధించిన పాయింట్ ఏమిటో తనకు అర్థమైందని పిస్తే, క్లాసు మధ్యలోనే వెళ్లిపోయేవాడు. లేదూ, ఆ క్లాసు తనకు ఏమీ కొత్తగా చెప్ప దనుకున్నా, లెక్చరర్‌కు అంత సామర్థ్యం లేదనుకున్నా అతడు ఆగేవాడు కాదు. దానికి సంబంధించిన పుస్తకం సొంతంగా చదువుకోవడం నయం అనేవాడు.

నవలలు చదివినంత అలవోకగా అతడు ఇంజనీరింగ్ టెక్నికల్ పుస్తకాలు చదవడం నేను చూశాను. అతడి ఇంట్రెస్టులు అనూహ్యంగా, విభిన్నంగా ఉండేవి. వాటిమీద చాలా లోతైన అవగాహన ఉండేది. నాకు కొద్దికొద్దిగా సినిమా గురించైనా తెలుసు అనుకునేవాణ్ని. కానీ తనకు సినిమాపై నాకంటే ఎన్నోరెట్లు లోతైన అవగాహన ఉండేది. పైగా అతడికి ఉన్న ఎన్నో ఆసక్తుల్లో సినిమా ఒకటి మాత్రమే. నాకు ప్రపంచంలో ఉన్న ఎన్నో తాత్విక ధోరణులను, తత్వవేత్తలను పరిచయం చేసింది తనే.

ప్లేటో నుంచి మొదలుపెట్టి, ఇమాన్యుయల్ కాంట్, డెస్కార్టెస్, షోపెన్ హావర్, అయన్ ర్యాండ్, ఇంకా ఫ్రెడ్రిక్ నీషే... వీళ్లందరూ తన ముందు ఏదో చిన్న పిల్లలైనట్టుగా తను నాతో మాట్లాడేవాడు. అప్పుడే కాదు, నా ఇప్పటి నమ్మకమూ ఏంటంటే, వాళ్లందరి కంటే కూడా సత్యేంద్ర తెలివైనవాడు. ఇది నిజం కానక్కర్లేదు. కానీ అతడి అవగాహన నాకంటే ఎన్నో ఎన్నో రెట్లు ఎక్కువ కాబట్టి వాళ్ల మీద, వారి చింతన మీద సత్యేంద్ర పరిశీలనలను ప్రశ్నించే అర్హత నాకు లేదని నేను భావిస్తాను.

ప్రత్యక్షంగా మన ముందు కనపడేదానికి వెనకాల ఏముందో అతడు ఆలోచించేవాడు. ఓ రోజు ఇద్దరం కలిసి సినిమాకు వెళ్లాం. దాని పేరు కోమా. రాబిన్‌కుక్ రాసిన మెడికల్ థ్రిల్లర్ ఆధారంగా తీసిందది. అందులో ఒక సీన్లో హీరోయిన్ ఓ మార్చ్యురీ కోల్డ్ స్టోరేజీలో చిక్కుకుపోతుంది. చుట్టూ ప్లాస్టిక్ షీట్స్‌లో వేలాడదీసిన శవాలుంటాయి. ఆ సినిమా చూస్తున్న వాళ్లం దరూ నాతో సహా ఆ అమ్మాయి దీనస్థితి గురించి భయపడుతున్నాం. కానీ సత్యేంద్ర ఆ శవాల గురించి మాట్లాడాడు, అవి కూడా ఒకప్పుడు మనుషులేనని.

అవి నవ్వేవి, ఏడ్చేవి, తమ తమ కలలు కనేవి, కానీ ఇప్పుడు మనల్ని భయపెట్టడానికి వాటిని కేవలం ప్రక్రియలుగా చేసేశారన్నాడు. వాస్తవంగా ఆ అమ్మాయి కంటే ఆ శవాలదే ట్రాజెడీ అన్నాడు. మరోసారి ఇద్దరమూ 'పాపిలాన్' అనే సినిమాకు వెళ్లాం. ఇంటర్వెల్‌లో కాలేజీ ప్రిన్సిపల్ కళ్ళల్లోపడ్డాం. పరీక్షలకి చదువుకోకుండా ఎందుకు వచ్చారన్న ఆయన ప్రశ్నకి సత్యేంద్ర తాను ఆ సినిమాను ఏడోసారి చూస్తున్నానని చెప్పాడు. దానికి ప్రిన్సిపల్ ఇందులో అన్నిసార్లు చూసేంత గొప్పదనం ఏమీ కనిపించలేదే అన్నారు. దానికి సత్యేంద్ర, నేను చూడగలిగింది మీరు చూసుండకపోవచ్చు అన్నాడు.

మరి అంత పరిశీలనగా చూసేవాడివి ఒక్కసారి చూస్తే చాలు కదా, ఇన్నిసార్లు చూడ్డమెందుకు? అన్నారు ప్రిన్సిపల్. అయితే మీరు మీ భార్యను రోజూ ఎందుకు కలుస్తారు అని ఎదురు ప్రశ్నించాడు సత్యేంద్ర. చాలా ఏళ్ల తర్వాత ఆ ప్రిన్సిపల్ రిటైర్ అయ్యాక, 'నేను మరిచిపోలేని ఓ విద్యార్థి' అంటూ సత్యేంద్ర గురించి ఓ మ్యాగజైన్‌కి ఆర్టికల్ రాశారు.

నా ఫైనలియర్‌లో 'పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల కోసం ఒక రెసిడెన్షియల్ కాలనీ' అనే ప్రాజెక్టు రిపోర్ట్ తయారు చెయ్యాల్సి వచ్చింది. దానికి సత్యేంద్రను ముందుమాట రాయమని కోరాను. అతడు వెంటనే ఓ పేపరూ, పెన్నూ తీసుకుని సెకను కూడా ఆలోచించకుండా రాయడం మొదలుపెట్టాడు. దాన్లోని మొదటి పేరాగ్రాఫ్ నాకు ఇంకా గుర్తుంది.

అది ఇలా సాగుతుంది... "జీవికి మొదటిసారిగా జీవించాలని అనిపించి నప్పట్నించీ జీవం లేని మట్టికి ఓ రూపం ఇవ్వడం మొదలుపెట్టింది. ప్రకృతి బీభత్సాల నుంచీ,

క్రూరమృగాల నుంచీ ప్రతి ప్రాణీ తనను తాను కాపాడుకునేందుకు ఆశ్రయం తీసుకోవడం అత్యవసరమైంది. ఆ నిర్మాణం జంతు ప్రపంచంలో సహజాతంగానే మిగిలిపోతే, మనుషుల్లో అది ఓ స్పష్టమైన రూపం సంతరించుకుంది".

నిజానికి సత్యేంద్రతో నా నాలుగేళ్ల సాహచర్యాన్ని, అతడి గురించిన నా అవగాహనను ఈ ఒక్క ఆర్టికల్‌లో పొందుపరచలేను. ఇంకా చెప్పాలంటే అతడిని అర్థం చేసుకునేంత సామర్థ్యం, తెలివితేటలు నాకు లేవని నాకు తెలుసు.

కాలేజీ ముగిసింతర్వాత మేము టచ్‌లో లేకుండా పోయాము. అయితే అది నేను కోరుకున్నది కాదు. అతడికే నా మీద బోరు కొట్టింది. కొన్నేళ్ల తర్వాత ఓ సినిమా షూటింగ్ కోసం అతడున్న పట్టణం వైజాగ్‌కి వెళ్లాను. అతడి గురించి జాడ కనుక్కోవడానికి ప్రయత్నించాను. చివరికి ఓ కిటికీ లేని గదిలో, ఒక హోటల్లో ఎన్నో రకాల పుస్తకాలతో అతడు కనిపించాడు. అంతకు కొన్నేళ్ల ముందే అతడు ఇల్లు వదిలిపెట్టి వచ్చాడని తెలిసింది. అతడి కళ్లల్లో దేనిమీదా ఏ విధమైన ఆసక్తీ కనిపించలేదు. జ్ఞానంపట్ల అతడు సంతృప్త దశకు వచ్చేశాడని నాకు అర్థమైంది.

అతడితో నా బంధం ఆరాధన, అమితాశ్చర్యం, అంతులేని భయం అనే మూడు దశలుగా రూపాంతరం చెందుతూ వచ్చింది. అంతకుముందు అతడంటే నాకు భయం వేయడానికి కారణం, అతడి జ్ఞానకాంతి పట్ల నాలో విపరీతమైన అసూయ ఉండటం. అలాగే కోపమూ వచ్చేది, అతడి ముందు నాకు ఏ విధమైన విలువ లేనట్టు నాకు అనిపించేది.

ఇప్పుడు అతడంటే నాకు భయం కలుగుతోంది. ఎందుకంటే తన నాలెడ్జ్‌కు సంబంధించిన ప్రతికూల ఫలితాలను చూస్తున్నాను. అతడికి ఈ భూమ్మీది ప్రతి విషయం మీదా, ప్రతి మనిషి మీదా నిరాసక్తత ఏర్పడింది. దానివల్ల అతడు జీవచ్ఛవమైపోయాడు. నేను చివరిసారిగా అతడిని కలిసినప్పుడు, అతడి కళ్లు ఎటో చూస్తున్నాయి. నాలాంటి సామాన్యుడికి ఉద్వేగం కలిగించే ఏ అంశానికీ అతడి మనసు స్పందించడం లేదు. దాని ఫలితంగా అతడు ఈ ప్రపంచం నుంచి తనను తాను దూరంగా ఉంచుకున్నాడు.

నా అదృష్టం కొద్దీ నా జీవితంలో జరిగిన ఒక మహోద్భుతమైన విషయం ఏమిటంటే, అతడు నాతో కొన్ని విలువైన సంభాషణలు జరిపాడు. అవి నా జీవితాన్ని మార్చేశాయి. అతడు నాలో ఒక గొప్ప భయాన్ని కూడా కలిగించాడు. అతడికి జరిగింది చూసింతర్వాత, ఓహో, మితిమీరిన జ్ఞానం అనేది కూడా ఒకటుంటుందని నాకు అవగాహనకు వచ్చింది. ఈ వాస్తవ ప్రపంచంలో అయన్ ర్యాండ్ సృష్టించిన హోవార్డ్ రోర్క్ లాంటివాళ్లు నిజంగా ఉండరు అని నమ్మేవాళ్లకు నేను చెప్పేదొకటే. అలాంటి మనుషులు ఉంటారు. అందులో ఒకరిని నేను కలిశాను. మాట్లాడాను.

తనలాంటి మేధావితో పోలిస్తే నేను కేవలం నా చేతనైనంత మేరకు తనని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించిన ఓ అతి సాధారణుడ్ని.

గమనిక : సత్యేంద్ర నాకిచ్చిన ఒకే ఒక కాంప్లిమెంట్... "నువ్వొక అతిపెద్ద ఇడియట్‌వి. మిగతావాళ్లని అది కూడా అనలేను."

రీ ప్రోగ్రామింగ్

మనలో చాలామందిమి కొన్ని భావావేశాలకు ఎంత బలంగా ప్రోగ్రామ్ అయ్యి ఉంటామంటే, ఆ ఆవేశాలకు ఎందుకు లోనవుతుంటామో వాటికి సంబంధించిన ప్రాథమిక అవగాహన కూడా మనకుండదు. ఇది ఎప్పుడు గమనించానంటే, నేను, నా మిత్రుడు ఓసారి సినిమాకు వెళ్లాం. సినిమా స్టార్ట్ కావడానికి ముందు న్యూస్‌రీల్‌లో సుభాష్ చంద్రబోస్‌ని చూపించారు. నేతాజీని చూడగానే నా స్నేహితుడు లేచి చప్పట్లు కొడుతూ, ఈల వేశాడు. బోసును చూస్తేనే తనకు రోమాలు నిక్కబొడుచుకుంటాయని చెప్పాడు.

అసలు నీకు సుభాష్ చంద్రబోస్ గురించి ఏం తెలుసని అడిగాను. ఆయన స్వాతంత్ర్య సమరయోధుడనీ, గాంధీజీని వ్యతిరేకించి, పోరాట మార్గమే పరిష్కారంగా భావించాడనీ చెప్పాడు. బోసు ఎలాంటి పోరాటాలు చేశాడో నీకు తెలుసా అని అడిగాను. తెలియదన్నాడు. అయితే, హిట్లర్ గురించి నీ అభిప్రాయం ఏమిటి అన్నాను. హిట్లర్‌ను ఒక బూతు మాటతో తిట్టిపోశాడు. "బోస్, హిట్లర్‌కి అండగా జపాన్‌తో స్నేహం చేశాడన్న విషయం నీకు తెలుసా?" అని అడిగాను. ఎందుకంటే అప్పుడు మనల్ని పాలిస్తున్న బ్రిటిష్ వాళ్లకు హిట్లర్ శత్రువు కాబట్టి, శత్రువుకు శత్రువు స్నేహితుడు కాబట్టి. ఈ విషయం చెప్పగానే అతడు గందరగోళానికి గురయ్యాడు. నేననుకోవడం మళ్లీసారి నేతాజీని గనక అతడు చూస్తే, ఇంతకు ముందంతగా అతడి రోమాలు నిక్కబొడుచుకోవు.

ఇక్కడ విషయం దేశానికి నేతాజీ చేసిన సేవ గురించి కాదు. ఆయన గురించి నాకు తెలిసింది కూడా చాలా తక్కువ. కానీ నేతాజీ అనగానే అమితమైన ఉద్వేగానికి లోనయ్యేలా ప్రోగ్రామ్ కాబడిన నా స్నేహితుడి కన్నా అంతో ఇంతో నాకు కొంత తెలుసు. ఇప్పుడు అతడి మనసులో నేను ఒక సందేహం నాటగానే, నిజంగా తనకు ఆదర్శప్రాయుడైన నేతాజీ గొప్పదనం ఏమిటి? అన్న దానితో సంబంధం లేకుండా, నేను చెప్పింది వినడం మొదలుపెట్టాడు. స్పష్టంగా చెప్పాలంటే తన బుర్రని రీ ప్రోగ్రామ్ చేసే అవకాశాన్ని నాకిచ్చాడు. అంటే నేను ఏది చెబితే అది విన్నాడు, నమ్మాడు, చివరికి నన్ను తన ఆదర్శప్రాయుడిని చేసుకున్నాడు.

మరో సందర్భంలో నేను ఒకతనితో మాట్లాడుతున్నాను. భూమ్మీద ఉండే ప్రతిప్రాణి పట్లా దయ చూపిస్తానని అతడు చెబుతున్నాడు. జంతువుల పట్ల ఉండాల్సిన కరుణ గురించి ఎడతెరిపి లేకుండా నాకు బోధించాడు. నేను ఒకటే అడిగాను. నీకు ఎవరైనా లక్ష రూపాయలిచ్చి, ఒక కుక్కను చంపమంటే చంపుతావా? చాన్సేలేదు, అన్నాడతను.

ఒకవేళ అది పది లక్షలైతే? అయినా చంపనన్నాడు. సరే, ఒకవేళ మూగ ప్రాణి అయిన ఆ మంచి కుక్కను చంపాలనుకుంటున్న ఒక కర్కోటకుడైన మనిషిని చంపడానికి నీకు లక్ష రూపాయలిస్తే? కొంత ఆలోచన తర్వాత చంపను అన్నాడు.

ఎందుకంటే మనిషి కూడా ప్రాణే కదా! అంటే దీన్ని బట్టి కుక్కా, మనిషా, అవి చేసేది మంచా, చెడా అన్న దానితో నీకు సంబంధం లేదు. కేవలం వాటికి ప్రాణముందన్న ఏకైక కారణంతో నీవు వాటిని ప్రేమిస్తావు, అంతేగా అన్నాను. అవుననన్నాడు. ఇంకోలా చెప్పాలంటే నువ్వు గాంధీని, హిట్లర్‌ను ఒకేలా ప్రేమిస్తావు, అనగానే అతడు కన్‌ఫ్యూజ్ అయ్యాడు.

ఆ కుక్కను చంపాలనుకుంటున్న మనిషిని నువ్వు చంపనూ అంటున్నావంటే, వాళ్లు మంచి చెడు ఏం చేసినా, ఎలాంటివారైనా ఏ హెచ్చుతగ్గులూ లేకుండా అందరినీ సమానంగా ప్రేమిస్తావని అర్థం. అలా కాకుండా మంచీ చెడ్డ విచక్షణ నీకుంది అని నువ్వు అనుకుంటే గనక, కుక్కను చంపాలనుకుంటున్న మనిషిని నువ్వు కచ్చితంగా చంపి తీరాలి. ఎందుకంటే ఆ కుక్క అమాయకప్రాణి, ఆ మనిషి కర్కోటకుడు.

కొంతసేపటి తర్వాత ఇంకా కన్‌ఫ్యూజన్ తోనే అతడు నేను ఆ మనిషిని చంపుతాను అని జవాబిచ్చాడు. ఒకవేళ ఆ మనిషి అదే లక్ష రూపాయలకోసం ఆ కుక్కను చంపుతున్నాడనే అనుకో. ఆ లక్ష రూపాయలు చావు బతుకుల్లో ఉన్న తన చిన్నారి వైద్యం కోసం అత్యవసరం అనుకో. అప్పుడు నువ్వు, కుక్కను కాపాడ్డానికి చిన్నారిని చంపేస్తావా? లేదూ, చిన్నారిని కాపాడ్డానికి కుక్క చనిపోయినా ఫరవా లేదంటావా? ఒకవేళ ఆ చిన్నారిని కాపాడ్డానికి ఆ మనిషి ఆ కుక్కను చంపడానికి ఒప్పుకున్నావే అనుకుందాం. మరి నీకు అన్ని ప్రాణుల పట్ల సమానమైన కరుణ ఎలా ఉన్నట్టు? ఒకవేళ నీకు కొద్దిగా కాలజ్ఞానం తెలిసి, ఆ చిన్నారి పెరిగి పెద్దై అత్యంత దుర్మార్గుడు కానున్నాడు అని తెలిసిందనుకో, ఆ కుక్క చాలా విశ్వాసం గలదిగా రూపొందుతుందని కూడా తెలిసిందనుకో, అప్పుడెలా నిర్ణయం తీసుకుంటావు?

ఇలా నా ప్రశ్నలు ఒకదాని తర్వాత ఒకటి వేసుకుంటూ పోయినకొద్దీ అతడిలో కోపం కట్టలు తెంచుకోవడం మొదలైంది. ఆ మనిషి, కుక్క, చిన్నారిని వదిలేసి నన్ను చంపేస్తాడేమోననుకున్నా. అందుకని ప్రోగ్రామ్ అయిన అతడ్ని 'డీ ప్రోగ్రామింగ్' చేసే నా ప్రాజెక్టును అంతటితో ఆపేశాను.

తనలాగే చాలామంది నిజంగా నేను చెప్పాలనుకుంటున్నదాన్లోని తర్కాన్ని, విశ్లేషణను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించరు. ఒకవేళ వాళ్లకు నిజంగానే అర్థమైతే, వాళ్ల అస్తిత్వం తుడిచి పెట్టుకుపోతుంది. ఇన్నేళ్లుగా తాము ఇదీ అని ఏదైతే నిర్మించుకుంటూ వచ్చారో అంతా భూస్థాపితమై ఖాళీ మెదడుతో మిగిలిపోతారు. సహజంగానే దానికి

వాళ్లు సిద్ధంగా ఉండరు. అందుకని వాళ్లలోని ఆలోచించే శక్తిని పాతరేసి, వాళ్ల నమ్మకాల్ని సమర్థించుకోవడానికి మాత్రం ఎంతటికైనా తెగిస్తారు.

ఇంకో సందర్భంలో తనను తాను దేశభక్తుడు అని చెప్పుకునే వ్యక్తితో మాట్లాడ్డం జరిగింది. అతడు పాకిస్తాన్‌ను తీవ్రంగా ద్వేషిస్తాడు. దేశంకోసం చనిపోవడానికి కూడా సిద్ధం అన్నాడు. నేను అతడ్ని ఈ ప్రశ్న అడిగాను. "ఒకవేళ చాలా విశ్వసనీయత గల ఒక సర్వేలో పాకిస్తానీయులందరూ చాలా మంచివాళ్లు, భారతీయులందరూ పచ్చి స్వార్థపరులు అని చెప్తే అప్పుడేం చేస్తావు?

నువ్వు బాగా ప్రేమిస్తున్న కనీసం యాభై మంది భారతీయుల పేర్లు చెప్పు చూద్దాం? నువ్వు ఎప్పుడూ తిడుతూ ఉండే మన దేశపు మురికి రోడ్లని, అవినీతి వ్యవస్థనా నువ్వు ప్రేమించేది? నువ్వు ఫలానా మనిషి కోసమో, ఫలానా కారణం కోసమో చనిపోవడానికి సిద్ధంగా లేనప్పుడు, నేను దేశం కోసం చనిపోతాను అని నువ్వు చెబుతున్నప్పుడు నువ్వు చెప్పేది నీ స్పృహలో ఉందా? ఒకవేళ యుద్ధం జరిగి, పాకిస్తాన్‌ను భారత్ గెలిచిందే అనుకో, భారత్‌లో పాక్ అంతర్భాగం అయ్యిందే అనుకో, అప్పుడు నువ్వు పాకిస్తాన్‌ని, పాకిస్తానీయుల్ని ప్రేమిస్తావా? అసలు నీకు ఎంతమంది పాకిస్తానీయులు ద్వేషించేంతగా తెలుసు?" ఈ ప్రశ్నల శర పరంపర తర్వాత, అతడు ఆగీ ఆగీ అసలు తను భారత్‌ను ప్రేమిస్తున్నాడా లేదా అన్న సందిగ్ధంలో పడ్డాడు.

నేను నమ్మేదేమిటంటే, మనమందరం సామాజికంగా, మతపరంగా కొన్ని కొన్ని నిర్దేశించిన భావోద్వేగాలకు లోనయ్యేటట్టుగా ప్రోగ్రామ్ అయి ఉన్నాం. ఇదే గొప్పది అనుకోవడం, దానికి విశ్వాసంగా ఉండటం, కట్టుబడి ఉండటం, కనీసం అవి ఎందుకు అలా చెబుతున్నాయో కూడా మనకు మనం ప్రశ్నించుకోకుండా వాటిని గుడ్డిగా అనుసరిస్తాం. అలా కాకుండా మనని మనం డీ ప్రోగ్రామ్ చేసుకోగలిగితే తిరిగి ఫ్రెష్‌గా రీ ప్రోగ్రామ్ చేసుకునే అవకాశం మనకి ఉంటుంది.

గమనిక : నేను పైన చెప్పిన లాంటి విశ్లేషణ నా కాలేజీ టైం నించి కొన్ని వందల మందికి చెప్పాను. కానీ ఇంతవరకూ అర్థమైనవాళ్లు ఒక్కళ్లూ లేరు. దాని వలన నన్ను నేను రీ రీ ప్రోగ్రామ్ చేసుకున్నాను.

రైఫిల్

ఆమెను అలాగే పిలిచేవాళ్ళం. ఎందుకు, ఎవరు ఆ అమ్మాయికి 'రైఫిల్' అని పేరు పెట్టారో తెలియదు కానీ, తనకి ఆ పేరే స్థిరపడిపోయింది. నా జీవితంలో అంత సెక్సీ అమ్మాయిని నేను ఇంతవరకు చూడలేదు.

విజయవాడలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజిలో నేను చదువుతున్నప్పుడు, కాలేజీలో ఒక కన్‌స్ట్రక్షన్ వర్క్ జరుగుతూ ఉండేది. ఆమె అక్కడికి కూలీ పనికి వచ్చేది. మా క్లాస్‌మేట్స్ అందరమూ కిటికీలోంచి ఆమెవైపు కన్నార్పకుండా చూస్తూ ఉండేవాళ్ళం. బోరుగా సాగే 'సాయిల్ మెకానిక్స్' పాఠం నుంచి రైఫిల్ మాకు పెద్ద రిలీఫ్. ఆమె కాళ్ల మీద సిమెంట్ పేరుకుపోయి ఉండేది. జుట్టును ఎప్పుడూ సరిగ్గా ముడిచేది కాదు. నగ్నపాదాలతో నడుస్తూ, మా కళ్లల్లోకి సూటిగా చూసేది. చాలామంది స్త్రీలు తమ శరీరం మొత్తంతో కలిగించలేని ఉత్తేజాన్ని, ఆమె తన ఒక్క చిటికెన వేలుతో కలిగించగలిగేది. కల్తీ లేని శృంగారానికి గనుక ఒక రూపం వస్తే, ఆమె రైఫిల్‌లా ఉంటుంది. ఆ దుస్తుల మాటున దాచిన ఆమె శరీరం గురించిన ఊహలు మమ్మల్ని వెర్రెత్తించేవి.

ఒప్పుకుంటాను. మా వయసు కూడా అలాంటిది. చీరను చుట్టిన టెలిఫోన్ స్తంభం కూడా కవ్వించే వయసే. అయితే రైఫిల్ విషయంలో మాత్రం ఇది నిజం కాదు. నిలువెల్లా విద్యుత్ ప్రకంపనలు పుట్టించగలిగే మహత్తు ఏదో ఆమెలో ఉండేది. అలాగని మా క్యాంపస్‌లో అమ్మాయిలు లేరని కాదు. ఇంజనీరింగ్ కాలేజీలోనూ, మెడికల్ కాలేజీలోనూ లెక్కకు మిక్కిలి ఉండేవారు. కాని రైఫిల్ రైఫిలే!

దేవుడు ఒక అమ్మాయిని ఎలా ఉండాలనుకుని సృష్టించాడో దానికి నిలువెత్తు రూపం రైఫిల్. నేను ఎప్పుడైనా నా జీవితంలో దేవుడిని గౌరవించానంటే దానికి ఒకే ఒక్క కారణం ఆడదాన్ని సృష్టించాడుగనుక. కాని, రైఫిల్‌ను సృష్టించినందుకు తనంటే అమిత గౌరవం ఏర్పడింది.

ఒక అమ్మాయి అందానికీ, సెక్సువాలిటీకి మధ్య ప్రాథమికమైన తేడా ఉన్నదని నేను భావిస్తాను. అందం మన ఇంద్రియాలను సంతృప్తి పరుస్తుంది. కానీ సెక్సువాలిటీ మన ఇంద్రియాలను నియంత్రిస్తుంది. ఇంకా సరిగ్గా చెప్పాలంటే, మనల్ని వివశుల్ని చేస్తుంది. మనలోని లాజిక్‌ని గాల్లో కలిపేసి, మనలోని యానిమల్ ఇన్‌స్టింక్ట్‌ని నిద్రలేపుతుంది. దేనిమీదా లేశ మాత్రం కూడా శ్రద్ధ పెట్టని ఆమె నిర్లక్ష్యం, ఎవరినీ లక్ష్యపెట్టని ఆమె ప్రవర్తన, మా మదిలో ఆమెనో శృంగార నాయకిగా నిలబెట్టేవి.

రాత్రిపూట టెక్స్ట్‌బుక్స్ చేతిలో ఉంచుకుని, ఆమెను గురించిన నిరంతర చర్చలు సాగిస్తూ ఉండేవాళ్లం. చేతిలో పట్టుకున్న పాఠ్యపుస్తకం ఆమే అయితే ఎంత బావుంటుందోనని తియ్యని కలలు కంటుండేవాళ్లం. కానీ, మా అందరి మూకుమ్మడి విల్‌పవర్, మా పెంపకం, మా చదువు, నీతి నియమాలు, మత విశ్వాసాలు, భయం.... ఇవన్నీ మమ్మల్ని కళ్లాల్లా వెనక్కి లాగి, ఆమెను వశపరచుకోవడానికి మేం ఆలోచించే ప్రయత్నాలకి గోడల్లా అడ్డుపడేవి.

రకరకాల ఫ్యాషనబుల్ డ్రెసెస్ ధరిస్తూ, పెదాలకి ఎర్రటి లిప్‌స్టిక్ పూసుకునే పాలరాతి శిల్పాల్లాంటి ఆధునిక అమ్మాయిలు అంతమంది ఉండగా, రైఫిలే ఎందుకు సెక్సీగా కనిపించేది? నేననుకోవడం, ఏ మగాడు కూడా అమ్మాయిని ముద్దు పెట్టుకునేటప్పుడు లిప్‌స్టిక్ రుచి చూడాలనుకోడు. కాస్మొటిక్స్‌తో కప్పెట్టని నిఖార్సయిన, అచ్చమైన శరీరమే నిజమైన సెక్స్యువల్ డిజైర్‌ని ప్రేరేపిస్తుంది. కృత్రిమ అలంకరణలన్నీ శృంగారంలోని నిజాయితీని తగ్గించేస్తాయి. కాస్మొటిక్ ఇండస్ట్రీ వాలాలు, కాస్ట్యూమ్ డిజైనర్స్, మేకప్‌వాళ్లు, జ్యువెలరీ వ్యాపారులు అందరూ కలసి స్త్రీ అనబడే అద్భుతమైన సౌందర్యరాశికి తమ వ్యాపారం కోసం వాళ్ల ఒరిజినల్ బ్యూటీని కప్పెట్టే ప్రయత్నం చేస్తారు. రైఫిల్‌కి అవేవీ లేవు కాబట్టే, తను అంత అందగత్తెగా కనిపించేది అని నా అభిప్రాయం.

1. పెద్ద ట్రాజెడీ ఏంటంటే, ఇప్పుడు ఈ ఆర్టికల్ ఒకవేళ రైఫిల్ చదివినా కూడా, తనకి తను రైఫిల్ అని తెలియదు. ఎందుకంటే, రైఫిల్‌కు తనను మేమంతా రైఫిల్ అని పిలుస్తున్నట్టుగా తెలియదు.

2. ఆమెను చూడగానే క్యాంపస్‌లోని ఎన్నివందలమంది విద్యార్థుల గుండెల్లో లావాలు పెల్లుబికాయన్న విషయం కూడా ఆమెకు తెలీదు.

3. కాలేజీకి ఎదురుగా ఉండే పాన్‌షాప్ అతణ్ని ఆమె పెళ్లి చేసుకున్నప్పుడు, మా అందరిలో వెల్లువెత్తిన అసూయాజ్వాలల గురించి కూడా ఆమెకు తెలియదు.

4. స్త్రీ యొక్క శృంగారాన్ని కథావస్తువుగా తీసుకుని ఎప్పటికైనా నేను కచ్చితంగా ఓ సినిమా తీస్తా. ఆ సినిమాని ఆమెకు అంకితం చేస్తూ, రైఫిల్ అని పేరు పెడతా.

ఎందుకు సినిమా గోరంతల్ని కొండంతలుగా చూపెడుతుంది

"ఒక అందమైన అమ్మాయి మొహం మీద చిన్న మొటిమ ఉన్నంత మాత్రాన ఆమె అందం తరిగిపోదు". కానీ ఒక చిత్రకారుడు ఒక అందమైన అమ్మాయి మొహాన్ని మొటిమతో చిత్రిస్తే అది మనకి కచ్చితంగా నచ్చదు.

అలా జీవితంలోలాగే సినిమాలో కూడా ఒక దర్శకుడు మామూలుగా ఉన్నదాన్ని మరింత ఎక్కువ అందంగా, మరింత సృజనాత్మకంగానూ ఉండేలా తన శైలి, సంభాషణలు, నేపథ్య సంగీతం, పాత్ర చిత్రణ వంటి వాటి సహాయంతో తీర్చిదిద్దుతాడు. అంటే అవి వాస్తవంగా ఉన్నదాని కన్నా బెటర్‌గా కనిపించేలా చేస్తాడు. అతని ఊహలో (దృక్కోణంలో) ఆయా వస్తువులు, సంఘటనలు ఎలా ఉంటే బాగుంటాయో, అలాగే ఆయా వ్యక్తులు ఎలా ఉంటే బాగుంటారో అన్న ప్రాతిపదిక అతని చిత్రీకరణని శాసిస్తుంది.

సరిగ్గా ఈ విషయం దగ్గరే అతని 'కళ' మనకి బోధపడుతుంది. ఈ కళ మంచిదో, చెడ్డదో అనేది సినిమా చూస్తున్న ప్రేక్షకుడి మనస్తత్వం మీద ఆధారపడి వుంటుంది, కొన్ని సందర్భాల్లో ఒక్కోసారి అతను పెరిగిన నేపథ్యం (అతని చుట్టూ ఉన్న పరిస్థితుల) వల్ల కూడా అది మంచిగా గానీ, చెడుగా గానీ అతనికి అనిపించవచ్చు.

థియేటర్‌లో కూర్చొని సినిమా చూస్తున్న ప్రేక్షకుల మనసులోని భావాలకి ఆ చిత్రదర్శకుడు ప్రదర్శించిన భావాలకి దగ్గరగా ఉన్నప్పుడు ఆ ప్రేక్షకుల్ని ఒక అనుభూతికి గురిచేస్తాయి. ఆ సమయంలో దర్శకుడు చూపే విషయం ప్రేక్షకుల మనస్సులోకి చొచ్చుకుపోతుంది. సినిమా పూర్తయిన తర్వాత కూడా ఆ చిత్ర దర్శకుడి దృష్టి ప్రేక్షకుల దృష్టిలో కూడా ఒక అంతర్భాగం అవుతుంది.

తన చిత్రం ద్వారా దర్శకుడు చెప్పే "నేనిలాగే ప్రపంచాన్ని చూడాలను కుంటున్నాను" అనే దాన్ని 'జీవితమంటే నాకు ఇదే' అని అర్థం చేసుకోవాలి. జీవితం పట్ల తన దృక్కోణాన్ని చెప్పటంలో దర్శకుడి ఉద్దేశ్యం ప్రేక్షకులకి ఒక్కోసారి అంత త్వరగా కొరుకుడు పడదు. ప్రతి దర్శకుడికి తెరమీద నటీనటుల ద్వారా తన అభిప్రాయాలను సాకారం చేయాలనే ఉంటుంది. కానీ, సినిమా నిర్మాణంలో పలువురి సమయమూ, శ్రమా, వ్యాపారమూ

కలిసి ఉండటం వల్ల ఒక చిత్రకారుడికున్న స్వాతంత్ర్యం లేకుండా తన చిత్రం ఎంతకు అమ్ముడు పోతుందనే ఆలోచనలని కలిపి అభిప్రాయ వ్యక్తీకరణకు పూనుకుంటాడు.

మన అవసరాల కోసం ప్రపంచాన్ని మార్చేయాలని మనందరం గట్టిగా ప్రయత్నిస్తుంటాం. కానీ, అలా చేయటానికి ముందు మన వ్యక్తిగత విలువలను మనకు మనమే గుర్తించటం అవసరం. జీవితంలోని ప్రతీదాన్ని గురించీ ప్రత్యేకమైన వ్యక్తిగత అభిప్రాయాల్ని ఏర్పరచుకుని, ప్రపంచానికి తగినట్టు శారీరకంగానూ, మానసికంగానూ కొంతవరకూ మనల్ని మనం మార్చుకోవచ్చు, కానీ ప్రపంచాన్నే మార్చేయాలన్న బలమైన కోరిక ఉంటేనే మనకంటూ వున్న ఒక ప్రత్యేకమైన కళ బయటపడుతుంది.

ఉదాహరణకు 'కంపెనీ' చిత్రంలో మాఫియా వాళ్లని నేను చిత్రీకరించిన తీరు నేర ప్రపంచాన్ని గురించిన నా కళాత్మకమైన ఊహ మాత్రమే. నేర ప్రపంచంలో మాలిక్ వంటి వ్యక్తి ఉండాలనేది నా కోరిక మాత్రమే కానీ అక్కడ మాలిక్ వంటి వాడు ఉండాల్సిన అవసరం లేదు. అలాగే 'సర్కార్'లో నా వ్యక్తిగత అభిప్రాయంలో నేను చెప్పదలచుకుంది "బాల్ ధాకరే (బాలా సాహెబ్ ధాకరే)ను నేనెలాచూడదలిచాను" అనే.

సినిమా కథతో పాటు ఎంతో సృజనాత్మకంగానూ, ఎంతో అందంగానూ చూపించే దర్శకుడి శైలే ముఖ్యమని నా గట్టి నమ్మకం. రచయిత కథని, సంభాషణల్ని అందిస్తాడు, ఒక పాత్రలో నటుడు నటిస్తాడు. ఇవన్నీ కూడా దర్శకుని ప్రతిభతో అతని శైలితో సంలీనమై ప్రేక్షకుల మనసుల్లో దాగి ఉన్న ఉద్వేగాలు బయట పడే మందులా పనిచేస్తాయి.

కథ లేకుండా కేవలం స్టైల్ మాత్రమే పనిచేయదనే మాట ఎంతమంది చెప్పినా స్టైల్ లేనిదే సినిమా లేదని నా గట్టి నమ్మకం.

ఎందుకంటే, స్టైల్ అనేచోటే దర్శకుడు కనిపించేది. రాయటం వగైరా ఇతర నైపుణ్యాలు ఉన్నప్పటికీ... దర్శకునికి మౌలిక నిర్వచనం ఏంటంటే, నటన ప్రదర్శనకూ, ప్రాథమిక కళలకూ దర్శకుడే సూత్రం వంటివాడు. నటులు, సంగీత దర్శకుడు, ఛాయాగ్రాహకులు తదితరులందరి పనులకూ దర్శకుడే ప్రదర్శకుడు. తన ప్రత్యేక శైలితో తానేం చెప్పదలచుకున్నాడో, దానికి వారందరూ ప్రాథమిక సాధనాలవుతారు.

ఈ మౌలిక కళలకు పరిపూర్ణత రావాలంటే, సినిమాలో చూపించాలనుకున్న కళలన్నిటి గురించీ దర్శకునికి మంచి అవగాహన ఉండటం చాలా అవసరం. తరువాత వీటన్నిటినీ తన అసాధారణ శక్తితో క్లుప్తీకరించి, వ్యక్తిగత అభిప్రాయాలతో కలబోసి సినిమా సృజనకు తగిన ఆలోచనలు కలిగి ఉండాలి.

ఇటువంటి అద్భుతమైన సృజన కలిగిన దర్శకులు బహు అరుదనే చెప్పాలి. మాలో చాలామంది దర్శకులు, ఇతరుల ప్రతిభ మీద ఆధారపడుతూ, నటీనటులతోనూ, సాంకేతిక

నిపుణులతోనూ తీసే చిత్రం ఒక్కోసారి గొప్పచిత్రం కావచ్చు. ఒక్కోసారి కాకపోవచ్చు. చాలాసార్లు ఒక చిత్రంలో మార్గదర్శనం చేసే సెంటర్ పాయింట్ విషయం లేక, పతాక స్థాయికి చేరుకోలేకపోవచ్చు.

రోజు గడిచే కొద్దీ ఒక సినిమా భావాత్మక అనుభవమవుతుంది. అది మిమ్మల్ని నవ్వించగలదు, ఏడ్పించగలదు, గగుర్పాటు కలిగించగలదు... ఒక దర్శకుని చేతిలో పడిన మంచికథ ఆ భావాన్ని మరింత ఎత్తుకు తీసుకెళ్లగలదు. గొప్ప దర్శకుడు తన సృజనను, కళాత్మకంగా మంచి స్టైల్‌ని జోడించి ఆ అందాన్ని, భావాల్నీ మరింత గొప్పగా చిత్రీకరించగలడు. ఉదాహరణకు రచనలో "ఆమె చాలా అందంగా ఉంది" అని ఉంటే, దర్శకుని కళాత్మకత ప్రేక్షకులలో "ఆమె చా...ల్లా....అం...ద్దం...గా ఉంది" అనే భావనను కలిగించగలదు.

మామూలుగా భాషలో ఇది వ్యాకరణ దోషం కావచ్చు కానీ, సినిమా పరిభాషలో ఆమె జనానికి నిజంగానే చా....ల్లా....అం....ద్దం...గా కనిపిస్తుంది.

అందుకనే నేను "గోరంతల్ని కొండంతలుగా చూపించే సినీ కళని అమితంగా ప్రేమిస్తాను.

ఎవ్వడూ పోటుగాడు కాదు

ఎవరైనా ఒక ఐడియా ఇస్తారు... దాని వల్ల ఆ పని జరుగుతుంది. అప్పుడు ఐడియా ఇచ్చినవాడు తన తెలివికి నిదర్శనం అయినట్టుగా 'మరి ఎవరి ఐడియా అనుకుంటున్నారు?' అంటాడు. ఇక్కడ మనం మెచ్చుకోవల్సింది.. ఆ ఐడియా ఇచ్చినవాడినా లేక ఆ ఐడియానా...?

అనేక సందర్భాలలో నటీనటుల్లో గానీ, టెక్నీషియన్లలోని టాలెంట్లను గుర్తించడంలో నేను సిద్ధహస్తుడని చాలామంది అంటూంటారు. కానీ వాళ్ల వాళ్ల ప్రతిభల గురించి ఆ సమయంలో నేను ఏమాలోచించి ఉంటానో ఆ చాలామందిలో ఎవరికైనా తెలుసా...?

అసలు నిజమేమిటంటే వాళ్లెవరి గురించీ, నేను ఎన్నడూ, ఏమీ ఆలోచించలేదు. సత్యకి అనురాగ్ కాశ్యప్‌ని రచయితగా తీసుకోవడానికి ఒకే ఒక కారణం. నేను సత్య తియ్యాలని నిర్ణయించు కున్నప్పుడు నన్ను కలుసుకున్న తొలి రచయిత కాశ్యప్. అతన్ని తీసుకోవడానికి కారణం కేవలం ఇదొక్కటే. ఇక సహ రచయితగా పనిచేయడానికి సౌరభ్ శుక్లాను అతనే తీసుకువచ్చాడు. ఇక సత్యలో పేర్లు వేసినప్పుడు సౌరభ్ శుక్లా పేరు పైన వేశాం ఎందుకంటే, వయస్సులో అనురాగ్ కన్నా శుక్లా పెద్దవాడు గనక అలా వేయడం జరిగింది.

'అబ్ తక్ చప్పన్' తీసిన షిమిత్ అమీన్, ప్రభాల్‌రామన్ కంటే ఎక్కువ టాలెంట్ ఉన్న వాడని నేననుకోను. ప్రభాల్ 'గాయబ్' సినిమా తీశాడు. కాని నిజానికి ప్రభాల్‌కు అబ్ తక్ చప్పన్ మెటీరియల్ ఇచ్చి చేయమంటే షిమిత్ కంటే చాలా బాగా చేసేవాడు. కానీ 'గాయబ్'ను షిమిత్ చేతిలో పెట్టి ఉంటే అది పూర్తిగా పాడయ్యేదని నా నమ్మకం.

నేను సత్య, దౌడ్ సినిమాలను ఒకే టైంలో తీశాను. దానిలో నిజమైన నేను ఏమిటి...? అనురాగ్ కాశ్యప్ సత్యకు, 'మైc ఐసాహీ హు'కు డైలాగుకు పనిచేశాడు. బ్లాక్ ఫ్రైడే, నోస్మోకింగ్‌కు కూడా పనిచేశాడు. వీటిలోఅసలైన అనురాగ్ కాశ్యప్ ఎక్కడ ఉన్నట్టు.

ఎందుకని రాకేష్ మెహరా 'అక్స్' అనే ఫ్లాప్ సినిమాని మొదట తీసి, తర్వాత 'రంగ్ దే బసంతీ' తీశాడు? ఎందుకు 'లగాన్' తీయడానికి ముందు 'బాజీ' సినిమాను

అశుతోష్ తీసి తన టైంను, టాలెంట్‌ను వృథా చేసుకున్నాడు. కొన్నేళ్లు యశ్‌రాజ్ బ్లాక్ బస్టర్స్ తీసి, తర్వాత ఎందుకని ఫ్లాప్స్‌ను తీయడానికి డిసైడ్ చేసుకుంది.

నిజం ఏమిటంటే ఇక్కడ ఎవరూ పోటుగాళ్లు కాదు. అందరికీ ఆ సమయంలో అందే మెటీరియల్ మీద వాళ్లు తీసేది ఆధారపడి ఉంటుంది. అది మంచిగా ఉంటే మంచి, చెడుగా ఉంటే చెడు! అంతే! నేను గానీ, ఇంకెవరైనా గానీ తీసుకునే మెటీరియల్ మా ఇష్టాన్ని బట్టి ఉంటుంది. కానీ ఆ ఇష్టానికి కారణాలు ఏమిటో మాకే తెలియకుండానే సాగిపోతాం. అందుకనే ఫలానా వాడు టాలెంటున్నవాడని గానీ, లేని వాడని గానీ చెప్పటం శుద్ధ అవివేకం.

ఒకవేళ అనురాగ్ గనుక 'దౌడ్' చిత్రానికి పని చేయడానికి వచ్చి ఉంటే మేము ఫ్లాప్ సినిమా తీసి ఉండే వాళ్లం. కానీ సత్యకు మరో రైటర్ వచ్చినా అది మంచి చిత్రంగానే వచ్చేది. కానీ ఇక్కడ నేను సత్యకు పని చేసిన సౌరభ్, సందీప్ చౌతా లేదా అనేక ఇతర నటులు, టెక్నీషియన్ల క్రెడిట్ లేదు అనుకోకుండా మాకు వచ్చిన మెటీరియల్‌ను బట్టి మా అందరికీ పేరువచ్చిందని మాత్రం అంటున్నాను. ఇక ఏది తీసుకోవాలో నాకు ముందే తెలిసి ఉంటే ఫ్లాప్ చిత్రాలను నేను ఎందుకని తీస్తాను.

పదేళ్ల కిందట సత్య విడుదలైంది. దానికి ముందు ఆ నటులు, టెక్నీషియన్లు ఎక్కడ ఉన్నారు...? ఏం చేశారు...? అనురాగ్, సౌరభ్, మనోజ్ బాజ్‌పాయ్, సందీప్ చౌతా, కెమెరామన్ మజ్హర్ కామ్రాన్, నేను- మేము దానికి ముందూ తర్వాత ఏం చేసామో చూసుకుంటే మేమంతా ఎంత పెద్ద పోటుగాళ్లమో మీకే అర్థమవుతుంది.

నేను వీడియో లైబ్రరీ ప్రారంభించడానికి పూర్వం నా స్నేహితులు, బంధువులు ఓ ఇరవై మందికి వీడియో ప్లేయర్లున్నాయని లెక్కలు వేశాను. క్యాసెట్‌కు పదిరూపాయిల వంతున రోజు నా ఫ్రెండ్స్ వద్దనే తీసుకుంటే ఇరవై క్యాసెట్లు అద్దెకు రోజుకు 200 రూపాయలు, నెలకు ఆరువేలు వస్తాయి. అది షాప్ నడపడానికి అయ్యే ఖర్చు. ఆ పైన వచ్చే లాభం మీదే ఛాన్స్ తీసుకోవచ్చు అని ఆలోచించి నేను షాపును తెరిచాను. రోజూ వంద క్యాసెట్లు అద్దెకు పోయేవి కానీ, నేను ఎవరిని నమ్ముకుని షాపు పెట్టానో ఆ ఇరవై మందిలో నుంచి ఒక్కరు కూడా నా షాపుకి రాలేదు. వచ్చినా అద్దె రాలేదు, ఎందుకంటే, వారు నా స్నేహితులు, నా బంధువులు కాబట్టి.

ఒకవేళ ఆ ఇరవై మంది నా షాపుకు రారని నాకు ముందే తెలిసి ఉంటే, నేను షాపును పెట్టేవాణ్ని కాదు.

అందుచేత ఈ విషయంలో నేను విజయాన్ని సాధించినట్టా? కానీ నిర్మాతలు ముందుగా శివ తీయాలని చెప్పారు. అదే విధంగా రంగీలా కంటే దౌడ్‌పై నేను ఎక్కువ ఆశలు పెట్టుకున్నాను. నేను పోటుగాణ్ణై వుంటే రంగీలా తర్వాత దౌడ్ ఎందుకు తీస్తాను...?

చివరకు నేను చెప్పదల్చుకుందేంటంటే నా సక్సెస్‌లు అన్నీ అనుకోకుండా వచ్చాయి. కానీ నా ఫెయిల్యూర్స్ అన్నీ నేను అనుకుని తీసినవే.

నేను ఏవేవో ఐడియాలు వేసి నాకు తోచిన పద్ధతిలో పోతాను, చిత్రాలు తీస్తుంటాను తప్ప కళాఖండం తీయాలని కూర్చోను. ఎందుకంటే కళాఖండాలు వాటంతటవే తయారవుతాయి కానీ మనం అనుకుని తియ్యలేం.

రంగీలా వెనక రమేష్

కాలేజీ రోజుల్లో అమీర్‌పేటలో రమేష్ అనే వ్యక్తితో తిరిగే వాడ్ని. అతను ఒక రకం వీధి రౌడీ. ఆ రోజుల్లో గూండాలతో విద్యార్థులు కలిసి మెలిసి తిరిగే వారు. రమేష్ అంటే అందరికీ భయం. నేను, నా స్నేహితులు అతన్ని మంచి చేసుకోవడానికి ప్రయత్నించేవాళ్లం. అతనితో కలిసి ఇరానీ హోటల్లో గంటలు కొద్దీ గడిపే వాళ్లం.

రమేష్ కాలేజీలో ఒక అమ్మాయిని ప్రేమించడం మొదలుపెట్టాడు. కానీ దగ్గరికి వెళ్లి మాట్లాడడానికి జంకేవాడు. మేము ఎంత ప్రోత్సహించినా వెళ్లేవాడు కాదు. బయట అంత ధైర్యంగా ఉంటాడు గానీ అమ్మాయిల విషయంలో అంతలా ఎందుకు భయపడు తున్నాడో అర్థమయ్యేది కాదు.

అతను హవాయి చెప్పులతోనే తిరిగే వాడు. కానీ ఒకరోజు కొత్త నైక్ షూస్ వేసుకుని వచ్చాడు. చెప్పుల్లో చూట్టం అలవాటైన మాకు అకస్మాత్తుగా అతను కొత్త బూట్లతో రాగానే ఫక్కున నవ్వాం. అతను హర్ట్ అయ్యాడు. తను ప్రేమించిన అమ్మాయిని ఇంప్రెస్ చేయడానికి కొత్త షూస్ వేశాడని నాకు అర్థమయ్యింది.

రమేష్ ప్రేమించిన అమ్మాయి ఒక ఆరడగుల ఆజానుబాహుడు అందగాడు కారున్న వాణ్ని ప్రేమించింది. వెళ్లి వాడ్ని నాలుగు ఉతికెయ్యి, మళ్లీ ఆ అమ్మాయి ఛాయలకే వెళ్లడు! అని మేము రమేష్‌కి ఎక్కించేవాళ్లం.

మా వైపు చూసి 'నాకంటే అతనే ఆమెకు అన్ని విధాలా తగినవాడు!' అన్నాడు. రంగీలా అప్పుడు పుట్టింది.

రంగీలా సినిమాలో పసుపుపచ్చ బట్టలతో మున్నా సీన్ ఐడియా రమేష్ నైక్ షూస్ నుంచి వచ్చింది.

సినీ నటి శ్రీదేవి తల్లి తన కూతుర్ని ఒక స్టార్‌గా చేయడానికి స్టూడియోల చుట్టూ తిరిగేదని విన్నాను. ఆమెనూ ఆమె కూతుర్నీ కలిపి మిలీ అనే పాత్రను నేను రంగీలాలో సృష్టించాను.

రంగీలాలో జాకీష్రాఫ్ పాత్రను 'సౌండ్ ఆఫ్ మ్యూజిక్'లో కౌంటెస్ పాత్ర నుంచి మలిచాను. ఆ సినిమాలో ఆమె పాత్రను వాంప్‌గా మార్చకుండా చాలా డిగ్నిటీగా చూపించాడు దర్శకుడు. నేను రంగీలా కథను తయారు చేసుకున్నాక, దాన్ని తెలుగులో

శ్రీదేవి, నాగార్జునలతో తీద్దామనుకున్నాను. జాకీ పాత్రకి గెస్ట్ అప్పీయరెన్స్‌గా రజనీకాంత్‌ను అడగాలనుకున్నాను. కానీ కథ శ్రీదేవి నాగార్జున ఇద్దరికీ నచ్చలేదు. దీనికి బదులుగా నేను తయారుచేసిన గోవిందా-గోవిందా చిత్రంలో నటించడానికి శ్రీదేవి నాగార్జునలు ఎక్కువ ఆసక్తి చూపించారు. దాంతో తెలుగు రంగీలా సబ్జెక్ట్‌ను మరిచిపోయాను.

కొంతకాలానికి నేను నిర్మించే అంతం (హిందీలో ద్రోహి) చిత్రంలో నాగార్జునకు జోడీగా మాధురీ దీక్షిత్‌ని తీసుకోవడానికి ముంబాయి వచ్చాను. కాని డేట్స్ ఇవ్వడానికి ఆమెకు ఖాళీ లేదు. అప్పుడు బోనీకపూర్ 'నరసింహ'లో నటించిన ఊర్మిళను తీసుకొమ్మని సలహా ఇచ్చాడు. వేరే ఎవరూ దొరక్క అంతం సినిమాకి ఊర్మిళని ఎంచుకున్నాను. కానీ ఆమె గానీ ఆ సినిమా గానీ ఎవరికీ నచ్చలేదు. కొన్ని నెలల తర్వాత మణిరత్నం, నేను కలిసి గాయం అనే సినిమాకు స్క్రిప్ట్ తయారుచేశాం. దానిలో ప్రధాన పాత్రకు రేవతిని, మరో సైడు హీరోయిన్ పాత్రకు ఊర్మిళను తీసుకున్నాము.

గాయం సినిమాకు ఊర్మిళతో ఒక పాటను వైజాగ్‌లో చిత్రీకరించాలని నేను ప్లాన్ చేశాను. కానీ కొరియోగ్రాఫర్ సుచిత్ర రావడం లేదని, రైలు మిస్సయిందని తెలిసింది. కానీ షూటింగ్‌ను రద్దు చేయడం ఇష్టం లేక, ఊర్మిళతో నీకు నువ్వే డ్యాన్స్ చేయగలవా అని అడిగాను. చేయగలనని చెప్పడంతో పాటను షూట్ చెయ్యటం మొదలుపెట్టా.

తనకి తానుగా డ్యాన్స్ చేస్తుండగా ఆ బాడీ లాంగ్వేజ్‌కి ఆ అందానికి ముగ్ధుడ్నై రంగీలా తీస్తే ఎప్పటికయినా తనతోనే తీయటానికి డిసైడ్ అయ్యాను.

'ఖయామత్ సే ఖయామత్ తక్', 'రాఖ్'లలో నటించిన అమీర్ అంటే నాకు చాలా ఇష్టం. ముంబాయికి వచ్చినప్పుడు అతన్ని నేను తరచూ కలుసుకునే వాడ్ని. అతనికి నా తొలి చిత్రం 'శివ' బాగా నచ్చింది. మేము ఇద్దరం కలిసి పని చేద్దామనుకుని చాలాసార్లు అనుకునే వాళ్లం. రంగీలా స్టోరీ నేను అమీర్‌కి చెప్పడంతో అది అమీర్‌ఖాన్‌కి చాలా నచ్చింది.

'సింగింగ్ ఇన్ ద రైయిన్' నేను వీడియోలో చూస్తున్నప్పుడు నాతో పాటు మా అమ్మ కూడా చూసేది. అందులో పాటల చిత్రీకరణలో అమ్మాయిల ఎక్స్‌పోజర్ ఎక్కువగా ఉన్నప్పటికీ, మా అమ్మకి ఆ దృశ్యాలు ఎబ్బెట్టుగా అనిపించేవి కాదు. కానీ డేవిడ్ ధవన్ కరిష్మాల 'సర్‌కాయి'లో ఖటియా పాట వేసినప్పుడు మాత్రం మా అమ్మ తల దించుకునేది.

మా అమ్మ ఎక్స్‌ప్రెషన్స్ గురించి ఆలోచించినప్పుడు 'సింగింగ్ ఇన్ ద రైయిన్'లో ఎక్స్‌పోజింగ్‌లో ఒక హుందాతనం, గర్వం, ఆనందం ఉన్నాయి గనక అలా తీస్తే ఎవ్వరికైనా నచ్చుతుందని వల్గర్‌గా ఫీలవరని నాకు అనిపించింది.

ఊర్మిళతో ఇలా అన్నాను... 'అందంగా ఉన్నావనుకుంటే అందంగా కనిపిస్తావు. వల్గర్‌గా ఉన్నావనుకుంటే వల్గర్‌గా కనిపిస్తావు' అని.

రంగీలాలో అన్ని పాటలనూ నేను చాలా గ్లామరస్‌గా తియ్యాలనుకున్నాను. దానిలో 'హై! రామా!' అనే పాటలో శృంగారాన్ని ఒలికిస్తూ నటించాలి. ఈ పాటను నేను జాకీ, ఊర్మిళలపై చిత్రీకరించాను. కాని నటనలో రొమాన్సు కంటే మిన్నగా వారి కళ్లలో కనిపించే శృంగారానికి ప్రాధాన్యం ఇచ్చాను. శృంగారానికి జంతువులు చాటుకు పోవు, చీకట్లో కెళ్లవు. వాటికి మూడ్ వస్తే పట్టపగలు కానీ, బహిరంగ ప్రదేశం కానీ –ఎక్కడైనా సరే! పరిసరాలు మర్చిపోయి రమిస్తాయి. జంతువులు తమ కోరికను గురించి పట్టించుకుంటాయే తప్ప ఎవరు చూస్తున్నారనే విషయం వాటికి పట్టదు. కుల్ధారా శిథిలాల్లో జాకీ–ఊర్మిళలపై పగటి పూట తీసిన 'హై రామా' పాటలో వారి కళ్లలోనే 'కామం' స్పష్టంగా కనిపించేలా చిత్రీకరించా.

నన్ను ఎక్కువగా భయపెట్టే విషయాలు

1. కటిక చీకట్లో నిలిచి ఉండటం. (నన్ను చంపేది ఏమిటో, ఎవరో కూడా చూడకుండా ఎలా చావటం...?)

2. రాత్రి పూట నిర్మానుష్యంగా ఉన్న రహదారులపై ఒంటరిగా ప్రయాణం చేయడం. (నేను వెళ్లే దారి అకస్మాత్తుగా ఎక్కడికి దారి తీస్తుందో!)

3. ఖాళీగా ఉన్న బీచ్‌లో ఒంటరిగా ఉండటం! (నీటిలో నుంచి ఏదో బయటికొచ్చి నన్ను పట్టికెళ్తుందేమో!)

4. 'షోలే'లో నటించి, చనిపోయిన నటులు, సాంకేతిక నిపుణుల ఆత్మలంటే నాకు భయం. (బతికున్న వారి బారి నుంచి పోలీసులు నన్ను కాపాడగలరు కానీ 'ఆగ్' తీసినందుకు వాళ్ల ఆత్మల నుంచి నన్ను ఎవరు రక్షిస్తారు...?)

5. నా శ్రేయోభిలాషులంటే నాకు భయం. (నాకు వాళ్ల వాళ్ల సలహాలు, వాళ్లు దయ చూపటాలు చూస్తుంటే నేను ఛస్తున్నానో...? లేక చచ్చాననో భావన నాకు కలుగుతుంది.)

పి.ఎస్: నన్ను విమర్శించే వారన్నా, సతాయించే వారన్నా, అసహ్యించుకునే వారన్నా నాకు చాలా ఇష్టం. నేను ఇంకా బతికి బట్టకట్టి ఉన్నానని వారి మూలంగా నాకు తెలుస్తుంది!

6. పిల్లలంటే నాకు భయం. నా చుట్టూ ఉన్న వాళ్ల కాన్‌సన్‌ట్రేషన్‌ని నా మీద నుంచి వాళ్ల మీదకి లాగేసుకుంటారు.

7. పోలీసులంటే నాకు భయం. నేను కూడా క్రిమినల్‌ననే భావన నాలో ఎక్కడో ఉండి, దాన్ని వాళ్లు గుర్తించి నన్ను పట్టుకుంటారేమో అని!

8. క్రిమినల్స్ అంటే కూడా నాకు భయం. వారి వ్యాపార రహస్యాలను నా సినిమాలలో నేను చాలా బయట పెడుతుంటాను కాబట్టి.

9. కరణ్ జోహార్ సినిమాలు – కొన్ని కారణాలవల్ల.

10. నా సొంత చిత్రాలు – మరికొన్ని కారణాల వల్ల.

హే! ఆడవాళ్లూ, పిల్లలూ, శ్రేయోభిలాషులూ, ఆత్మలూ, విమర్శకులూ, పోలీసులూ, కరణ్ జోహర్ ఇవన్నీ.. ఉట్టినే సరదాగా అన్నానంతే!

కాదేమో కూడా.

భయమంటే భయం

భయానికి ఆకారం లేదు. అది ఒక భావన మాత్రమే! ఎవరైనా హింసకు దిగినా, హింసాత్మక చర్యలు జరగడం చూసినా భయం కలుగుతుంది. ఇక మనకి తెలియని దాని మూలంగా భయం కలిగితే అది ఇంకా ఎక్కువగా ఉంటుంది.

మిమ్మల్ని భయపెట్టే వారు అనుసరించే పద్ధతులు, వారి ఉద్దేశ్యం మీకు అర్థమైతే అంతగా భయం కలగదు. ఉదాహరణకు మీరు ఒక పామును చూస్తే మీకు చాలా భయమేస్తుంది. కాని అది ఏ రకమైన విషసర్పం, దాని విషం శరీరంలోకి ఎక్కడానికి ఎంత టైం పడుతుందని తెలిస్తే అంత భయపెట్టదు. తెలిసిన దయ్యం అయితే ఫర్వాలేదు అన్నట్టుగా! భయానికి కారణం తెలిస్తే దాని నుంచి తప్పించుకోవటం వీలైతే దాన్ని నాశనం చేయాలని ఆలోచిస్తాం.

రాత్రి ఇంట్లో మీరు తప్ప ఎవరూ లేరు, మంచి నిద్రలోఉండగా మీకు ఎవరో మూలిగిన శబ్దం వినిపిస్తుంది. మీరు దిగ్గున లేచి శబ్దం వస్తున్న వైపు చూస్తారు. కానీ శబ్దం ఎందుకని వస్తుందో తెలిస్తే భయం కాస్త తగ్గుతుంది. అప్పుడు మెదడు పని చేస్తుంది, ఆలోచిస్తారు. కారణం ఏమిటో తెలిసిపోయింది. కారణం తెలిస్తే భయం చాలా వరకు పోతుంది.

భయం వల్లనే దేవునిపై నమ్మకం కలుగుతుంది. దానికి కారణం మనకు భద్రత కావాలి. క్షేమంగా ఉండాలి. ఆపద వచ్చినప్పుడు, మనస్సు వికలమైనప్పుడు మనం, మన కుటుంబంలోని వారిని గానీ, పోలీసులను గానీ అంత నమ్మికలేనప్పుడు దైవం పై నమ్మకం కలుగుతుంది. దీన్ని ఆధారంగా చేసుకునే సమాజంలోకి దుష్ట శక్తులు, మంత్రగాళ్ల ప్రవేశం జరిగింది. క్షుద్రపూజలు, క్షుద్రశక్తుల ఆరాధన రావడానికి కూడా ఇదే కారణం.

మీరు రహదారిపై కారులో వెళ్తుండగా ఒక పాత డొక్కు లారీ మీ ఎదురుగా రావడం కనిపిస్తుంది. దాని రంగు వెలిసిపోయి, బంపర్ వేలాడుతూ, చాలా మురికిగా ఉంది. హెడ్‌లైట్లు పగిలిపోయి ఉన్నాయి. దాన్ని చూడగానే ఎందుకో మీకు భయం కలుగుతుంది. కాని దాని బదులుగా ఎదురుగా కొత్త ట్రక్కు వస్తుంటే మీకు అంత భయం కలగదు. కానీ ఈ రెండింటిలో ఏది మీ కారును ఢీకొన్నా, కలిగే నష్టం ఒకటే! కానీ పాత ట్రక్కును చూడగానే దాన్ని నడిపే డ్రైవర్ గురించి వాడికి తన వాహనంపై శ్రద్ధ, ఇక నడపడంలో శ్రద్ధ, జాగ్రత్త ఎలా ఉంటాయనుకుని సబ్‌కాన్సియస్‌గా ఆలోచించి భయపడతారు.

ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లి నెల రోజుల తర్వాత ఇంటికి వస్తాం. తాళం తీసి లోపలికి అడుగుపెడుతూ మనం లేనప్పుడు ఆ నెల రోజులూ ఇల్లూ, ఇంట్లోని వస్తువులు ఏమేం చేసుంటాయో అని ఒక ఆలోచన వస్తుంది.

ఇక ఇంట్లో ప్రాణం లేని వస్తువులు, మనం నిద్రపోయిన తర్వాత అటూ ఇటూ తిరగవని గట్టిగా నమ్మగలరా...?

భయం కలిగించే సినిమా కాని లేదా మామూలు సినిమా కానీ థియేటర్ మధ్యలో ఒంటరిగా కూర్చుని చూస్తుంటే భయం కలుగు తుంది. మన వెనకాల ఎవరో ఉన్నారని, వాళ్లు కూడా మనతో పాటే సినిమాని చూస్తున్నారన్న భావన కలుగుతుంది. రాత్రి సమయంలో ఇంట్లో కూడా ఏదైనా దయ్యం సినిమాను హాల్లో కూర్చుని ఒంటరిగా చూడలేం. ఎందుకంటే దెయ్యం ఏ మూలో చాటుగా నక్కి మీ పై దూకడానికి సిద్ధంగా ఉన్నట్టు అనిపిస్తుంది.

నాలుగు రకాల మనస్తత్వం గల వారు థియేటర్‌లో ఉంటారు.

1. థియేటర్‌లోకి అడుగుపెట్టడానికి ముందే భయంతో నిండిన వారు ఉంటారు.
2. నన్ను ఇదేం భయపెడుతుంది? అనుకుని సవాలు చేసేవారు ఉంటారు.
3. భయం కలిగించే చోట కళ్లు మూసుకునే వారుంటారు.
4. ఇక అలా ఏ భయమూ లేకుండా చూసేవాడు ఉంటాడు. ఇమాజినెషన్ లేనప్పుడు భయం అనే భావన రాదు. కాబట్టి తను కూర్చున్న కుర్చీకి భయం లేనట్టే అతనికి కూడా భయం ఉండదు.

మర్యాదలేని మర్యాద

బాక్సాఫీసును ఏలిన 'దీవార్, జంజీర్,' వంటి కమర్షియల్ ఫార్ములా సినిమాల మధ్య కూడా చాలా సింపుల్ కథలలో స్టార్స్ లేకుండా సూపర్‌హిట్‌లు తీసిన దర్శకుడు బాసూ చటర్జీ పేరును మనం తరచూ వింటుండే వాళ్లం. దర్శకుడుగా ఆయన ఆరోజుల్లో మిగతావారికి భిన్నంగా ఉంటూ, సూపర్ హిట్ చిత్రాలైన 'రజనీగంధా, ఛోటీ సీ బాత్, చిత్ చోర్' వంటి సినిమాలు తీశారు.

నామట్టుకు నేనే 'చిత్ చోర్' చిత్రాన్ని ఏడుసార్లు చూసానని గుర్తుంది. – హైదరాబాదు రామకృష్ణ థియేటర్‌లో ఆ కథనంలో సింప్లిసిటీని నేర్చుకున్నాను. అదే నాకు 'రంగీలా' చిత్రానికి గైడ్‌గా పని చేసింది.

కట్ చేస్తే....

ఇరవై ఏళ్ల తర్వాత

నేను ముంబాయిలోని నా ఆఫీసులో ఉండగా, రిసెప్షనిస్ట్ వచ్చి, "ఎవరో బాసూ చటర్జీ అట, మిమ్మల్ని కలవాలని వచ్చారు" అన్నాడు.

నేనతన్ని "ఎవరాయన" అని అడిగాను.

దర్శకుడినని చెబుతున్నాడు సార్ అని చెప్పాడు.

ఆయనెందుకు మా ఆఫీసుకొచ్చారని షాకయ్యాను. నిజానికి ఆయనెలా ఉంటారో నాకు తెలీదు. చిన్న ఫోటో చూసానంతే... నేను రిసెప్షన్ దాకా వెళ్లి, ఆయన్ని నా గదిలోకి తీసుకొచ్చాను.

ఎందుకొచ్చారని ఆలోచిస్తూనే కాఫీ ఇచ్చాను. హైదరాబాద్‌లోని రామకృష్ణ థియేటర్‌లో ఆయన సినిమాలు చూట్టానికి టికెట్ల కోసం క్యూలో ఎలా నిలబడేవాణ్నో చెప్పటంతో.... ఆయన నేనెన్నో ఇంటర్వ్యూల్లో ఆ సంగతి చెప్పాను కనుక తనకు తెలుసని, సంతోషంగా అన్నారాయన, కాసేపు కబుర్లు చెప్పాక, తనెందుకొచ్చారో చెప్పారాయన, ఆయన దగ్గర ఒక స్క్రిప్ట్ ఉంది, నిర్మాతా ఉన్నాడు... అందులో నటించేందుకు మనోజ్ బాజ్‌పాయిని సంప్రదిద్దామని ఆయనెంత ప్రయత్నించినా కుదరటం లేదని అతన్ని కలిసేందుకు నాసాయం కావాలని అడిగారు.

నేను "తప్పకుండా" అని చెప్పి, పక్కగదిలోకి వెళ్లి మనోజ్‌కు ఫోన్ చేస్తే అతని ఫోన్ పన్చేయలేదు. అతని సెక్రెటరీకి చేస్తే ఊళ్లో లేడని తెలిసింది. బాసూ చటర్జీగారు

అతనికోసం ప్రయత్నిస్తున్న సంగతి సెక్రటరీకి చెబితే, అతను, "తెలుసండీ... ఆయన్నెలా వదిలించు కుందామనే మేము చూస్తున్నాం" అన్నాడు.

నేను నిశ్చేష్టుణ్ణయ్యాను. కానీ ఆ మాటలు సెక్రెటరీవే కానీ మనోజ్‌వి కావని, అతన్ని తెలిసిన వ్యక్తిగా భావించాను. చివరికి ఆయన చిత్రంలో చేయటానికి మనోజ్‌కు ఇష్టం లేదని అర్థమైంది.

బయటికి వచ్చి, బాసూజీతో, "మనోజ్ ఊళ్లో లేడు, అతనితో మాట్లాడి చెపుతాను" అన్నాను. మరికాసేపు మాట్లాడి ఆయన వెళ్లిపోయారు.

కొన్ని రోజుల తరువాత బాసూజీయే ఫోన్ చేసి, "మనోజ్‌కి నాతో పనిచేయటం ఇష్టం లేనట్లు తోస్తూంది..." అన్నారు. నాకేం చెప్పాలో తెలియలేదు. ఆయన తన కథ వినేందుకు ఆఫ్తాబ్ శివ్ దసానీకి రికమండ్ చేయమని అడిగారు.

నేను సరేనని ఆఫ్తాబ్‌కు ఫోన్ చేసాను. "ఆఫ్తాబ్, బాసూ చటర్జీగారు నిన్ను కలవాలను కుంటున్నారు" అంటే "ఎవరాయన" అని అడిగాడు.

ఆఫ్తాబ్ చిన్నవాడు. మూడు దశాబ్దాలు పెద్దయిన బాసూజీ గారిని గురించి తెలియకపోయి ఉండవచ్చు కనుక, నాకతని ప్రశ్న ఇబ్బంది కలిగించలేదు. 'చిత్ చోర్' వంటి సూపర్ హిట్ చిత్రాల దర్శకుడని వివరిస్తూ చెప్పాను.

"అప్పుడు మాట సరే గానీ, ఇప్పుడేం చేస్తున్నారు...?" అని అడిగాడు.

"చూడు ఆఫ్తాబ్, ఆయనేం చేస్తున్నాడో ఏం చేయబోతున్నాడో నాకు తెలియదు. గౌరవనీయుడైన సీనియర్ గనుక, ఆయన్ని కలిసి, కథ విను" అన్నాను.

"ఓకే సార్. ఆయనకు నా నంబర్ ఇవ్వండి" అన్నాడు ఆఫ్తాబ్. తేలికపడ్డ మనసుతో అతని నంబర్ బాసూజీకిచ్చి, నా పనిలో పడిపోయాను.

రెండు రోజుల తరువాత బాసూజీ ఫోన్‌చేసి కృతజ్ఞతలు చెప్పారు. నేనాయనతో, "ఆఫ్తాబ్ వచ్చి కథ విన్నాడా సార్?" అని అడిగాను.

"లేదు, టైంలేదని అతను తన సెక్రెటరీని పంపాడు" అన్నారాయన. ఒక ఫ్రీజ్ ఇచ్చి "పోనీ సెక్రటరీ కథ విన్నాడా సార్?" అని అడిగాను.

ఆయన, "లేదు. పదినిముషాలు విన్న తరువాత, అర్జెంటుగా పని ఉందని వెళ్లిపోయాడు. ఏమైనా నాకోసం ప్రయత్నించినందుకు థాంక్స్" అంటూ ఫోన్ పెట్టేశారు.

ఆయన కంఠం వినటం అదే ఆఖరుసారి. ఆ తరువాత ఆయన పేరుకూడా వినలేదు... ఇప్పుడైతే ఆయన పట్ల మర్యాదలేని మర్యాదతో ప్రవర్తించిన సంగతి కూడా నాకు లీలగానే తప్ప గుర్తులేదు.

'ఐడియా' కున్న శక్తి

'ఐడియా' సంస్థవారి "వన్ ఐడియా కెన్ ఛేంజ్ యువర్ లైఫ్" అనే వాక్యాన్ని మించిన సత్యమేదీ ఉండదు.

నా మొత్తం జీవితమూ, దర్శకుడుగా నా కెరీరూ, ఆ సత్యానికి పాజిటివ్, నెగెటివ్ రూపాల్లో సజీవదృష్టాంతమని చెప్పొచ్చు. "మనం గ్యాంగ్ స్టర్స్ గురించి వారెవరినైనా చంపినప్పుడో, లేదా వారు చనిపోయినప్పుడో మాత్రమే వింటుంటాం. కాని మధ్యకాలంలో వాళ్లేం చేస్తారు?" అనే ఐడియా నుంచి వచ్చిందే 'సత్య' సినిమా, "షోలే వంటి చిత్ర కథ ఈ రోజుల్లో జరిగితే ఎలా ఉంటుంది?" అన్న ఐడియా నుంచి 'ఆగ్' పుట్టింది. దాని ఫలితమేంటో అందరికీ తెలుసు. ముఖ్యంగా వాటి రిజల్టూ, జనం రియాక్షన్ ఎలా ఉన్నప్పటికీ, వాటివల్ల నేను సాధించిన విషయం ఒకటుంది. అవి నా రూట్స్‌తో పాటుగా నా జీవితం డైరెక్షన్‌నూ మార్చేశాయి.

పరిటాల రవి, మద్దెలచెరువు సూరిలకథ ఎన్నో ఏళ్లుగా జరిగింది. ఎవరికీ కూడా వారి కథని సినిమాగా తియ్యొచ్చన్న ఐడియా రాలేదు. ఒక సంవత్సరం పాటు 200 మంది నిరంతరం శ్రమించి, దాదాపు 30 కోట్లు ఖర్చుపెట్టిన తర్వాత ఆ ఐడియా ఒక సినిమాగా రూపాంతరం చెందింది. ఎవరికి ఈ చిత్రం ఫావరబుల్‌గా వుంటుంది... రవికా...? సూరికా...? వాళ్లిద్దరూ స్టేట్ బయట కూడా కీర్తి పొందుతున్నారే – ఇత్యాది ఆలోచనలు జనంలో తిరుగుతున్నాయి. దీనంతటికీ వెనకున్నది, "రవి, సూరిల మీద చిత్రం తీస్తే ఎలా ఉంటుంది?" అనే నా ఒక చిన్న ఐడియాయే!

నేనెలాంటి చిత్రాలు తీస్తున్నా అవి ఫ్లాపయినా, హిట్టయినా కూడా ఇంకా నేను కోరినట్లు కావాలనుకున్నట్లు ఎలా చేయగలుగుతున్నానని చాలామంది ఆలోచిస్తారు.

నేను ఒకే సమయంలో చాలా చిత్రాలకు పనిచేస్తుంటానని చాలామంది అనుకుంటారు కానీ, ఎన్నో ఐడియాలతో ఒకటే చిత్రానికి చేస్తున్నాననటమే నిజం. ఎన్నో విషయాల మీద ఆధారపడి ఆ ఐడియాలు కాలానుగుణంగా ఒక్కొక్కటిగా వెలికి వస్తాయి. నా బుర్రలో మెదులుతున్న ఆ ఐడియాలన్నిటినీ నేను పలువురి మెదళ్లలోకి చొప్పిస్తాను– రచయితలూ, అసిస్టెంట్ డైరెక్టర్లూ వగైరా... అలా. ఉదాహరణకు, 'సర్కార్' చిత్రం తాలూకు కథ నాలో ఐదేళ్లపాటు సాగాక సాకారమైంది. ఎనిమిదేళ్లపాటు మనసులో పెట్టుకున్న 'ఏక్' కథను ఎప్పుడు తీస్తానో నాకే తెలియదు. వచ్చే ఏడాదే కావచ్చు లేదా

మరో ఐదేళ్లు పట్టొచ్చు. ఒక ఐడియా తట్టగానే, ఒక రచయితకు చెప్పి దాని మీద పని చేయమంటాను. నాకున్న ప్రయారిటీస్‌ను చూసుకుంటూ నా ఐడియాని సినిమాగా తీయాలని ప్రకటిస్తే, వెంటనే మీడియా అప్పటికే అది నిర్మాణంలో ఉన్నట్లు రాస్తారు. అందువల్ల నేను ఎన్నో చిత్రాలకు ఒకే టైంలో పనిచేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతుంది.

ఉదాహరణకు, నేనిప్పుడు 'అమ్మ, డిపార్ట్‌మెంట్, గాడ్ అండ్ సెక్స్' అనే కథల ఐడియాల మీద పని చేస్తున్నాను. అలాగే మరో పది పేర్లు పెట్టని కథల ఐడియాల మీద కూడా పనిచేస్తున్నాను. అవన్నీ క్రమంగా రూపు దిద్దుకుంటాయి. అవన్నీ కూడా ముద్ద కట్టిన శక్తిలాగా కలిసిపోయి ఉంటాయి. సమయాను కూలంగా ప్రకటితమవుతాయి. అవి ఐదు కోట్ల చిత్రాలు కావచ్చు. 50 కోట్ల చిత్రాలు కావచ్చు.

ఇటీవల ఒక యాడ్ సంస్థ వారు, నా దగ్గరికొచ్చి ఒక ప్రకటనకు దర్శకత్వం వహించ మన్నారు. ఒక 60/30 క్షణాల ప్రకటనకు, అందులోనూ ఎవరికో కావలిసిన అవసరానికి అనుగుణంగా మరెవరో ఇచ్చిన ఐడియాకు డైరెక్టు చేయటం నాకు కుదరదని చెప్పేశాను.

ఆ ప్రకటనకు బదులుగా, నేనొక పూర్తి నిడివిగల చిత్రాన్ని వారి ప్రొడక్ట్‌ను పేర్కొంటూ తీస్తానన్నాను. అదేమిటని వారడిగితే నేను, "ఉదాహరణకు, ఇన్ ఫిల్మ్ బ్రాండింగ్ ద్వారా లక్స్‌ని సినిమాలో ఏదో ఒక సీన్లో జొప్పించే బదులు ఏకంగా 'లక్స్' పేరిట చిత్రమే తీస్తే ఎలా ఉంటుంది...? కథ ఒక గ్రామీణ యువతికి సంబంధించి ఉంటుంది. ఆమెకు లక్స్ సబ్బుతో స్నానం చేస్తే సినిమా తారంత అందంగా తయారవు తాననే నమ్మకం ఉంటుంది. క్లైమాక్స్ టైంకి ఆమె ఒక నటి అయ్యి, 'లక్స్'కు మోడల్‌గా నటిస్తుంది" అన్నాను.

వాళ్లు స్టన్నైయిపోయారీ ఐడియాతో, ఎందుకంటే ప్రొడక్ట్‌కు సంబంధించిన ఇటువంటి ఐడియాను వారింతకు ముందెప్పుడూ వినలేదు కనుక. చిత్రంలో చూపించే ప్రకటన వంటిది (ఫిల్మ్ ఇన్ ఆడ్) తయారవుతుంది. కనుక. వాళ్లు నా ఐడియాకు బోలెడు డబ్బిచ్చేందుకు అంగీకరించారు.

'లక్స్' పేరిట చిత్రాన్ని నిర్మిస్తానో, లేదో కానీ.... నా ఐడియాల శక్తిని గురించి మాత్రం ధంకాలు మ్రోగించకుండా ఉండలేకపోతున్నాను. .... హహ్హా!

సినిమా ఎలా ఆడింది?

వందమంది చూసిన ఒక చిత్రం తొంభైమందికి నచ్చొచ్చు. వెయ్యిమంది చూసిన మరో చిత్రం 990 మందికి నచ్చకపోవచ్చు. కానీ వసూలైన 1000 మంది టికెట్ల రేట్ బట్టి రెండో చిత్రమే హిట్టయినట్లు లెక్క. అంటే కమర్షియల్‌గా చూస్తేనన్నమాట. అలాగే ఒక చిత్రం నాలుగు కోట్లకు తయారై ఆరు కోట్లు వసూలు చేస్తే హిట్ కానీ అది ఎనిమిది కోట్లకు తయారై ఉంటే మాత్రం ఫ్లాపే!

ఒక చిత్రం హిట్ అనే దాన్ని వసూలు చేసిన పద్ధతి లేదా ఎంత వసూలవాలను కున్నారు, లేదా విమర్శకులు ఏమంటున్నారు లేదా చిత్రాన్ని చూసినవాళ్లెలా అనుకున్నారు – వీటిని బట్టి బేరీజు వేస్తారు.

సినిమా చూసిన ప్రతీవారినీ కలిసి మాట్లాడలేం కనుక, ప్రతివారూ ఏమను కుంటున్నారో తెలుసుకోవడం అసాధ్యం కనుక. కలిసిన కొందరినే అడగాలి.

ఒక వ్యక్తి ఆశించినట్లుగా, అంటే, రు.1000/–లు వసూలవుతాయని ఆశించినప్పుడు రు. 500/–లే వసూలైతే అది ఫ్లాప్. ఐదొందలే వస్తాయని అనుకున్నప్పుడు రు. 1000/–లు వసూలైతే అది హిట్. ఒక చిత్రం విజయం సాధించటం వేర్వేరు కారణాల మీద ఆధారపడి ఉంటుందని భావిస్తాం కనుక, పైవిధంగా అనుకోవటమూ సబబు కాదు. ఉదాహరణకు, 'డర్' చిత్రం షారుఖ్‌ఖాన్‌కు సూపర్‌హిట్ అయితే, సన్నీ దేవల్ కెరీర్‌కు పెద్ద ఫ్లాప్ పెట్టింది. జనం ప్రకటనల ప్రచారం వల్లే ఒక చిత్రాన్ని చూడాలను కుంటారు. దానివల్ల వారికి సినిమాలో ఉన్న విషయమేమిటో తెలుస్తుంది. కుతూహలం కలిగితే చిత్రం చూస్తారు.

ఒక సినిమా గురించి జనం చెప్పుకుని కలక్షన్లు పెరగటమనేది ఈ రోజుల్లో చాలా అరుదు.

ఒకప్పుడు హిందీలో సిల్వర్ జూబ్లీలు, వందరోజులు, యాభైరోజులు ఆడిన చిత్రాల స్థానే, నేటి కాలంలో పెద్ద హిట్లంటే రెండు నుంచి మూడు వారాలే ఆడుతున్నాయి.

దీనివల్ల చిత్రం నాణ్యత తెలియదు, డిస్ట్రిబ్యూషన్ పద్ధతి మాత్రం తెలుస్తుంది. అది ప్రచారం ద్వారా జనంలో పట్టును సంపాదించి చిత్రాన్ని విడుదల చేయించి వీకెండ్‌కు ఎంత త్వరగా వీలుంటే అంత త్వరగా వసూళ్లు చేయిస్తుంది. ఈ విధానం మనకు ఉత్పాదక సంస్థల కమర్షియల్ తెలివిని పరిశీలిస్తే తెలుస్తుంది. గతంలో ఫిల్మ్ మేకర్, తన చిత్రానికి జనానికి టికెట్లు దొరకటం లేదని విని ఆనందించటంతో పోలిస్తే, నేటి

డిస్ట్రిబ్యూషన్ విధానం చిత్రం చూడదలచిన ప్రతీ ఒక్కరికీ టికెట్లు దొరకాలనే పద్ధతిలో పనిచేయటం కనిపిస్తుంది.

కోక్ సంస్థ వారి విక్రయ సిద్ధాంతం ఏమిటంటే, వినియోగదారుడు కోక్ తాగాలనుకున్నప్పుడు, అది అతని చేతులకు అందుబాటులో ఫ్రిజ్‌లో లేదా ఇంటి పక్కనుండే దుకాణంలో లేదా అతని కళ్లెటు తిరిగితే అక్కడ దొరకాలని. ప్రస్తుతం సినిమాల అమ్మకాల సిద్ధాంతం కూడా ఈ దిశగానే సాగుతున్నది. ఎందుకంటే మునుపు నేను చెప్పినట్లు సినిమాను కూడా వినియోగదారుల ప్రొడక్ట్ కింద భావించటం వల్లనే.

చిత్రం అనేది నిర్మాతకూ, కొందరు ప్రేక్షకులకూ ఒక ఆర్టిస్టిక్ రూపమైతే, మొత్తం మీద చిత్రం తయారై థియేటర్లలో విడుదల కావటం మాత్రం వినియోగదారుని ప్రొడక్ట్‌గా భావించటం వల్లే.

'రంగీలా' చిత్రానికి కాక 'దౌడ్' చిత్రానికి నాకెక్కువ లాభాలు వచ్చాయని చెబితే మీకు ఆశ్చర్యం కలగొచ్చు. 1995లో పంపిణీ వ్యవస్థ చాలా అస్తవ్యస్తంగా ఉండటం వల్ల రంగీలాకి నాకు రావలసిన డబ్బు అందలేదు. 'రంగీలా' ఎంత వసూలు చేసిందో తెలిసిన డిస్ట్రిబ్యూటర్లు 'దౌడ్'ని మరింత ఎక్కువ డబ్బుకు కొనుగోలు చేశారు. అది సరిగ్గా ఆడకపోవటంతో వారు నష్టపోయారు. కమర్షియల్ భాషలో నామట్టుకు నాకు 'రంగీలా' ఫ్లాపూ, 'దౌడ్' హిట్టూ అయ్యాయి.

చాలామంది 'సత్య' చిత్రం హిట్టనుకుంటారు కానీ, నిజానికి 'సత్య' కన్నా మూడు రెట్లు ఎక్కువగా 'జంగిల్' వసూల్ చేసింది.

ఎందుకంటే 'జంగిల్', 'సత్య' కన్నా ఎక్కువ థియేటర్లలో విడుదలైంది. దేశమంతటా ఓపెనింగ్స్ బావున్నాయి. 'సత్య', ముంబాయి, నైజాం, ఢిల్లీ నగరాల్లో బాగా ఆడింది. నైజాంలోనూ 'సత్య' 1.25 కోట్లు వసూలు చేస్తే, 'జంగిల్' 1.75 కోట్లు వసూలు చేసింది. అంతే కాకుండా నార్త్‌లో చాలాచోట్ల 'సత్య'కు ప్రేక్షకులు లేకపోవటం చేత, రెండో/మూడో రోజునే తీసేశారు.

అంటే, 'జంగిల్' 'సత్య' కన్నా మేలైన చిత్రమనా....? 'జంగిల్' చిత్రం చూసిన వారికి అది నచ్చక పోయుండొచ్చు, 'సత్య' నచ్చి ఉండొచ్చు. ఏళ్ల తరువాత, నన్ను కలిసిన వారు, 'సత్య' నా ఉత్తమ చిత్రం అని మెచ్చుకుంటున్నారు. 'సత్య' విడుదలైన సంవత్సరం, అది వసూలు చేసిన మొత్తం, అదే ఏడాది విడుదలైన సల్మాన్ ఖాన్ చిత్రం 'బంధన్' పదిరెట్లు ఎక్కువ వసూల్ చేసింది. ఆ చిత్రం దర్శకుడు కె. మురళీమోహన్‌రావు. సల్మాన్‌ఖాన్‌కు కూడా ఈ చిత్రం గుర్తుండి ఉండకపోవచ్చు.

'నిశ్శబ్ద్' విడుదలై వెళ్లిపోయిన ఏడాది తరువాత ఒక అమ్మాయి లాప్‌టాప్‌లో ఆ సినిమాను చూసింది. నా చిత్రాలన్నింటిలోనూ అదే ఉత్తమ చిత్రమని అభిప్రాయపడింది.

ఒక గ్రూపులోని ఒక అబ్బాయి 'సర్కార్' చిత్రం మాస్టర్ పీస్ అంటే, ఆ గ్రూప్‌లో మరో అబ్బాయి 'గాడ్ ఫాదర్'కు అవమానమని అన్నాడు.

విమర్శకుల విషయానికొస్తే, టైమ్స్ ఆఫ్ ఇండియాలో ఖాలిద్ మొహమ్మద్ 'రాత్'ను గురించి కామెడీ చిత్రం అనీ, నా తొలిచిత్రం 'శివ' చూసి తలదించుకుని బయటికి వెళ్లాలనీ రాశాడు. దీపా గెహ్లోట్ 'సత్య', 'కంపెనీ' చిత్రాలను చీల్చి చెండాడి, 2½ స్టార్స్ కోవలోకి చేర్చింది. 'శివ' తరువాత నా రెండో చిత్రం 'క్షణక్షణం' సమీక్షలో బాల్‌రెడ్డి అనే ఒక అగ్రశ్రేణి సినీ విమర్శకుడు నన్ను వన్ ఫిల్మ్ వండర్‌గా వర్ణించాడు.

జనం అనుకున్నట్లుగా ఏ చిత్రమూ నష్టాల్లో పడదు. సాధారణంగా 90% చిత్రాలు డబ్బును పోగొట్టుకుంటాయని వింటుంటాం. అసలు దీని అర్థమేంటీ...? డబ్బు ఎక్కడికీ పోదు చేతులు మారుతుంది. అంతే ఒకానొక చిత్రం కోసం 20 కోట్ల డబ్బు ఖర్చు పెట్టినట్టయితే అది ఆ టెక్నీషియన్‌లు, సరంజామా సరఫరా చేసేవారు, నటీనటులు, తమ కుటుంబాలతో సహా చిత్రనిర్మాణం మీదే ఆధారపడి జీవిస్తున్న వారి చేతుల్లోకి వెళ్లిందని. డబ్బు ఆవిరైపోలేదనీ, వారి జేబుల్లోకి చేరిందనీ, కేవలం ఆ ఇరవైకోట్లూ పెట్టుబడిగా పెట్టి లాభం సంపాదించాలనుకున్న వ్యక్తి ఐడియా ఫ్లాపైందని గ్రహించాలి. ఈ వ్యవహారంలో పెట్టుబడిదారుడు ఫ్లాప్, ఆ డబ్బంతటినీ తమ జేబుల్లో నింపుకున్న జనం సూపర్ హిట్టన్నమాట! ఒక పెద్ద బడ్జెట్ చిత్రంలో 300 మంది పనిచేస్తే, నిర్మాత ధనాన్నీ, దర్శకుడూ, నటుడూ విశ్వసనీయతనూ పోగొట్టుకుంటారు. మిగతా 297గురూ డబ్బు సంపాదించు కుంటారు. ఎలాగైనా చిత్రపరిశ్రమ లాభనష్టాలను గురించి మీకు అర్థమయ్యేలా ఒక ఆర్టికల్‌లో చెప్పటం అసాధ్యం. కానీ కొంతవరకు చెప్పగలిగాననే అనుకుంటున్నాను.

ఒక చిత్రం నచ్చిందో లేదో చెప్పమంటే చెప్పగలను కానీ, ఆర్థిక విషయాలూ, వాళ్లు చిత్రం ద్వారా ఆశించేవీ, అభిప్రాయాలూ, ఆ చిత్రంతో సంబంధం గల సంగతులూ చెప్పమని అడిగితే, ఆ దృష్టితో "చిత్రం ఎలా నడిచింది?" అనే ప్రశ్నకు ఎప్పటికీ సమాధానం చెప్పలేను.

పేరులో ఏముంది?

ఒక సినిమా పేరనేది ఆకర్షణ మాత్రమే కాదు, ఆ చిత్రాన్ని చూడాలన్న భావోద్వేగాన్ని కూడా కలిగిస్తుంది. సినిమాల పేర్ల వల్ల నేను ఎప్పుడూ ఆకర్షింపబడుతూ ఉంటాను. నాకు బాగా జ్ఞాపకం. నా చిన్నతనంలో నన్ను బాగా ఆకర్షించిన మొదటి చిత్రం 'బ్యాడ్ డే ఎట్ బ్లాక్ రాక్'. ఆ పేరు ఏం చెబుతుందో ఒక్కసారి పరిశీలించండి. అది ఉత్తేజకరమైన లొకేషన్లో మిక్కిలి భావోద్వేగంతో కూడుకున్న సినిమాని సూచిస్తుంది.

పేరు అనేది కొన్నిసార్లు చిత్రంలోని పాత్రల్ని, లేదా వ్యక్తుల ప్రవర్తనని సూచిస్తుంది. అందుకే ప్రేక్షకుల్ని ఆలోచనాత్మకంగా చూడ్డానికి అది సిద్ధపరుస్తూంది. నా హారర్ చిత్రాన్ని 'భూత్' అని పేరు పెడ్తే చాలామంది వింతగా ఉందన్నారు. పోస్టర్ డిజైను, ఫాంట్ డిజైను తర్వాత అబ్బురపడ్డారు. అదే విధంగా మంచి పేరున్న చిత్రం 'సర్కార్'. అది ప్రేక్షకులు థియేటర్లో ప్రవేశించ డానికి ముందే అదే అమితాభ్ బచ్చన్ శక్తిని, పాత్రని ఊహించే విధంగా చేస్తుంది.

స్టీవెన్ స్పీల్ బర్గ్ చిత్రం 'రైడర్స్ ఆఫ్ ది లాస్ట్ ఆర్క్' అనే పేరు ఇప్పటి జనానికి చాలాకాలం క్రితం నివసించే ప్రజల గురించీ, ఆర్క్ పై వాళ్లు దాడి చేయబోవడాన్ని గురించీ సూచిస్తుంది. అలాగే అది పూర్వకాలంలో జరిగిన సంఘటన వైపుగా ప్రేక్షకుల్ని ఆకర్షించడానికి ప్రయత్నిస్తుంది.

'రంగీలా' చిత్ర విషయమై పేరు పెట్టడానికి చాలా రకాలుగా ఆలోచించాను. ఏదీ ఆలోచనకు రాలేదు. హైదరాబాద్లోని హాలిడే ఇన్లో నేను, అమీర్ ఖాన్ లాబీలో నడుస్తుండగా నా నోటి నుండి అప్రయత్నంగా 'రంగీలా' అనే పదమొచ్చింది. అమీర్ ఆగిపోయి మరొకసారి చెప్పమన్నాడు. 'రంగీలా' అని తిరిగి అన్నాను. అదే సరైనదనీ, మరో ఆలోచన వద్దనీ అన్నాడు.

అకస్మాత్తుగా మెదడులోంచి ఓ పేరు మెరుపులా ఎలా దూసుకొస్తుందో చెప్పడం చాలా కష్టం.

నా మట్టుకు నేను చాలా సందర్భాల్లో పేరులోని శబ్ద ధ్వనిని ఇష్టపడతాను. ఆ తరువాతనే అది సరైందో కాదో ఆలోచిస్తాను. నేనో రోజు ట్రెడ్మిల్ మీద వ్యాయామం చేస్తూ కొత్త హారర్ సినిమా టైటిల్ గురించి ఆలోచిస్తున్నాను. ప్రణాళిక సిద్ధం చేస్తూ

రచయితతో ఫోన్లో మాట్లాడుతూ మంత్రాలను, చేతబడులనూ గురించి చెబుతూ అతడు 'ఝూడ్ ఫూంక్' అన్నాడు. 'ఫూంక్' అనే శబ్దధ్వని నన్ను తక్షణమే ఆకర్షించింది. ఆ సమయంలో ఆ శబ్దానికి గల అర్థమేంటో కూడా నాకు తెలీదు. కానీ ఆ క్షణంలోనే నేను నా చిత్రానికి 'ఫూంక్' అనే పేరు పెట్టాలని నిశ్చయించుకున్నాను. అది ఎంత బాగోలేదని అనిపించినా ఫర్వాలేదు. ఓ పేరుని నిర్మాణాత్మకంగా మళ్లీ మళ్లీ ప్రయోగిస్తూ ఉంటే నెమ్మదిగా ప్రజలు దాన్ని ఇష్టపడటం మొదలెడ్తారు.

నాకిష్టమైన నా సొంత చిత్రాల పేర్లు కొన్ని:

1. రంగీలా
2. భూత్
3. కంపెనీ
4. జంగిల్
5. సర్కార్
6. కాంట్రాక్ట్
7. ఫూంక్
8. నిశ్శబ్ద్
9. రణ్

'శివ', 'సత్య' మొదలయిన చిత్రాల పేర్లు చాలా మామూలు పేర్లని నేననుకుంటాను, వానిలోని సహజ సృజన కంటే కూడా చిత్రంతో సాన్నిహిత్యం వల్ల ఇష్టపడేవిగా చేశాయి.

కొన్ని సందర్భాల్లో ఒక్కో పేరు ప్రారంభంలోనే ప్రజల్ని తిరగబడే విధంగా చేస్తుంది. ఆణిముత్యం లాంటి నా చిత్రం 'ఆర్‌జీవి కీ ఆగ్'లో అలాగే జరిగింది. ఆ టైటిల్ అలా మార్చడానికి గల కారణం కోర్టులు జోక్యం కలిగించుకోవడమే. కారణమేదైనా కావచ్చు కానీ దాని ప్రభావం ప్రేక్షకుల మీద ఎలా చూపుతుందనేదే ప్రశ్న. టైటిల్ అనేది జిడ్డుగానో, మొండిగానో, పిచ్చిగానో ధ్వనించడానికి కొన్ని విశేషణాలు ఉపయోగిస్తే చాలు. గాఢంగా నేను విశ్వసించడానికి ఉదాహరణ చెప్తాను. 'ఆర్‌జీవీ కీ ఆగ్'కి బదులుగా ఇంకో పేరు పెడితే చిత్రం అదే ఉంటుంది కాని ప్రేక్షకులు చూసే దృక్పథం మారటానికి ఛాన్స్ ఉంటుంది.

పేరు ప్రేక్షకుల్ని ఆకర్షించడమే కాదు, చాలాసార్లు అది రచయితని, డైరెక్టర్ని, స్క్రిప్ట్‌ని ఎలా ముందుకు కొనసాగించాలో కూడా తెలియజేస్తుంది. పలురకాల వ్యాపార సంస్థల ద్వారా సొమ్ము చేసుకోవడానికి విస్ఫోటంలా పనిచేస్తుంది.

చాలా సందర్భాల్లో నేను గమనించేదేమిటంటే, చిత్రనిర్మాతలు టైటిల్ ద్వారా ఇతివృత్తం వ్యక్తమయ్యేలా ఉండా లనుకుంటుంటారు... కాని నా ఉద్దేశ్యంలో సబ్జెక్టుకు సంబంధించిన టైటిల్ ఉండాలనేది అంత ప్రాధాన్యం లేని విషయం. అది ప్రేక్షకుల్ని ఇట్టే ఆకర్షించి వాళ్లు థియేటర్‌కి వచ్చేట్టుగానే చేయాలి. ప్రేక్షకుల్ని థియేటర్‌కు రప్పించడంలో టైటిల్ కూడా ప్రాముఖ్యాన్ని వహిస్తుంది.

చిత్రానికి సంబంధించిన భవిష్యత్తుని టైటిల్ అనేది ఎలా నిర్ధారిస్తుందనేది చెప్పడానికి నేనొక చక్కటి ఉదాహరణ చెప్తాను. నా బ్లాగ్‌లో పోలీసు ప్రపంచానికి సంబంధించి చిత్రం తీస్తున్నాననీ దానికి "కంపెనీ 2" అని పేరు పెట్టాలను కుంటున్నానని రాశాను. దానికి సంబంధించి స్పందిస్తూ సుమన్ అనే వ్యక్తి ఆ పేరు "డిపార్ట్‌మెంట్" అని ఉంటే బాగుంటుందని ఆ బ్లాగ్‌లోనే సలహా ఇచ్చాడు. వెంటనే ముందూ వెనకా ఆలోచించకుండా అతనికి థాంక్స్ చెప్పి 'బ్రిలియంట్'గా ఉందని స్పందించాను. ఆ తరువాత ఆ చిత్రం విషయమై ఆలోచించినప్పుడు 'కంపెనీ 2' అనేది సరైన టైటిల్ కాదని తెలుసుకున్నాను. అక్రమార్జన కోసం ఏర్పాటుచేయబడింది అండర్‌వరల్డ్ 'కంపెనీ' కానీ పోలీసు శాఖ ఓ క్రమపద్ధతిలో పన్జేస్తుంది.

సూక్ష్మంగా చెప్పాలంటే, అండర్‌వరల్డ్‌కు అధిపతి ఓ డాన్ అయితే, పోలీస్ ప్రపంచానికి డాన్ డిపార్ట్‌మెంట్.

అందుకే నా చిత్రానికి 'డిపార్ట్‌మెంట్' అని పేరు పెట్టడానికి నిశ్చయించుకుని దానికి సంబంధిత వ్యక్తులయిన పెట్టుబడిదారులూ, నటులూ, సాంకేతిక నిపుణులకి ఇతివృత్తాన్ని, 'డిపార్ట్‌మెంట్' టైటిల్ గురించీ, దానికి 'డిపార్ట్‌మెంట్' అని ఎందుకు పేరు పెట్టానో వివరించాను. వాళ్లంతా ఉత్తేజితులయ్యారు. టైటిల్‌లో ఏముందని మనం ఎప్పుడూ ప్రశ్నించుకోకూడదు. ఎందుకంటే ప్రతీది నిజంగానే టైటిల్‌లో ఉంది.

ఆలోచనల దర్శకత్వం

ఎయిర్‌పోర్టులు, ఫంక్షన్ల దగ్గర తరచుగా నేను ఒక్కోసారి చిత్ర సీమతో ఏమాత్రం సంబంధం లేని వ్యక్తులను కలుస్తుంటాను. వాళ్లు నా చిత్రాల నిర్మాణ శైలిని గూర్చి వ్యాఖ్యానిస్తూ ఉంటారు. నేను చాలా డిఫరెంట్‌గా ఫ్రేమ్ చేస్తానని, అందుకే నేనంటే ఇష్టపడతామని కొందరు, మీ చిత్రాలు చాలా భిన్నంగా ఉంటాయని కొందరు, 'అలా ఎందుకు తీశారని కొందరు... ఇలా సాంకేతిక పరిజ్ఞానం లేని ప్రజలు కూడా ప్రశ్నిస్తూ ఉంటే నాకు ఆశ్చర్యమేస్తుంటుంది. సాధారణ వ్యక్తులు కూడా ఇంతగా ఆలోచిస్తారా! అనిపిస్తుంది. వాళ్లు ఏ విషయమై మాట్లాడుతున్నారో దాని గురించి అంతగా వాళ్లకి అవగాహన లేకపోయినా గాని వారిలో స్పందన నన్ను ఆశ్చర్యపరుస్తుంది.

చిత్రరంగంతో సంబంధంగల వ్యక్తులు కూడా నా నిర్మాణం సాటి లేనిదనీ, "చాలా ప్రదర్శనాత్మకంగా ఉందనీ, బ్యాడ్‌గా ఉందనీ, హాస్యాస్పదంగా ఉందనీ" అంటూంటారు.

ఓ ప్రత్యేక శైలితో నేనెందుకు తీస్తానంటే ఏ చిత్రం కూడా తనకుతానుగా తయారు కాదు. అది ఏ సందర్భంలో ఎలా తీయబడిందనే దాని మీద ఆధారపడ ఉంటుంది. అది కథ విషయానికి సంబంధించిన ఉద్విగ్నత మీద ఆధారపడి ఉంటుంది. చిత్రం పలు విషయాల కలయిక. విషయం, సందర్భం, నటుని వ్యక్తీకరణ, లైటింగ్ మొదలయిన అంశాలన్నింటినీ సమన్వయపరచిన పిదప చివరగా నిర్మాణం జరుగుతుంది. రంగీలా చిత్రంలో 'ఊర్మిళ' జఘనం కదలికలు ఓ ప్రత్యేకమైన తీరులో చిత్రీకరించాను. ఫ్రేమ్‌కి ఓ అంగుళం ఎక్కువ జూమ్ ఇన్ చేసినా అంగుళం తక్కువ జూమ్ అవుట్ చేసినా కొద్దిగా అటూ ఇటూ ప్యాన్ చేసినా తన అందం మారిపోతుంది. ఊర్మిళ నడుము కదలికల్ని, ప్రత్యేకంగా చూపించడమే నాకు కావల్సిన ఎఫెక్ట్. అదే విధంగా 'సర్కార్' చిత్రంలో అమిత్‌జీ ముఖంపైన నీడలు కదలాడడం ఆ సీనుకు హైలైట్ లాంటిది. ముసలివాడి కథని విన్న అమిత్‌జీ ముఖ కవళికల్లో మార్పులు ఆ నీడల నాటకీయత రక్తి కట్టించాయి. షూట్ చేసేటప్పుడు కెమెరా ఎలా మూవ్ అవుతోంది. కంఠానికి, హావభావాలకి తగినట్టుగానే కదులుతోందా! గ్రౌండ్‌లో ఇంటి వాతావరణం. మూడు చక్రాల సైకిలు మీద ఓ పిల్లాడు ఇవన్నీ ఫ్రేమ్ 'సర్కార్' క్యారెక్టర్ని సూచిస్తాయి. క్లోజప్ కంటే ముందుగానే లాంగ్‌షాట్ కట్ చేస్తే కేవలం వివరణాత్మకంగా ఉండేది కాని నాటకీయత వచ్చేది కాదు. నా చిత్రానికి సంబంధించి నా కెప్పుడయినా విమర్శకుల వల్ల లభించే ఉత్తమ అభినందన ఏమిటంటే, నా చిత్రీకరణ తీరుని విమర్శించడమే.

నాతో ఎవరో అన్నారు. "కనీసం రాంగోపాల్‌వర్మ టేకింగ్‌ని విమర్శించగలరు కాని ఇతరుల గురించీ, వాళ్ల టేకింగ్ గురించి కనీసం మాట్లాడ్డానికి కూడా ఏమీ ఉండదు".

చాలా సందర్భాల్లో నేను గమనించిందేమిటంటే, ఏదైనా మామూలుగా ఉన్న దానికంటే భిన్నంగా తీసినప్పుడు ప్రజలు తమ స్పందనల్ని తెలుపుతారు. ఉదాహరణకి కొంతమంది నా కెమెరా పని తీరుని ఇష్టపడితే కొంతమంది దాన్ని ఆడిపోసుకుంటారు. ఆదే విధంగా కొంతమంది అభిమానులు నా బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ చాలా ఘాటుగా ఉందంటే, మరీ నాటకీయంగా ఉందని మరికొందరంటారు. ఇంకా కొంతమందైతే మెలోడ్రమటిక్‌గా ఉందంటారు. మరికొందరైతే కేవలం నా చిత్రాల్లోని బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కోసమే చూస్తామంటారు.

అయితే ఇక్కడ పాయింట్ ఏంటంటే మీరు ప్రత్యేకమైన సొంత ఆలోచనాదృక్పథం కలిగి ఉంటే, దాన్ననుసరించే అనేక ఆలోచనాదృక్పథాలు వెలువడుతాయి.

స్వయంకృషితో పైకి వచ్చినవాడు. తన సొంత అభిప్రాయాల్ని కలిగి ఉంటే, తమ ఆలోచనలు, అనుభూతులూ తనదైన ప్రత్యేక శైలితో ప్రదర్శించడానికి కారణం నిరుపమానమైన ప్రాపంచిక దృష్టి కలిగి ఉండడమే.

వ్యక్తి శారీరక స్థితి అనేది అతని సొంత ప్రయత్నం మీదా, అతని మానసికస్థితి అనేది అతని ఆలోచనల మీద ఆధారపడి ఉంటాయి. ఏ ప్రయత్నమైనా గానీ చివరగా డైరెక్ట్ చేయాల్సి ఉంటుంది. మీరు సంప్రదాయ పద్ధతిలో ఆ ప్రయత్నాల్ని డైరెక్టు చేసినా లేదా మీదైన ఆలోచనా దృక్పథంతో డైరెక్టు చేసినా అది మీ ఆలోచన నించి వస్తుంది. నా వరకైతే నేను దాన్ని ఓ ఛాయిస్‌గానే భావిస్తాను. అదో చిత్రానికి సంబంధించినదేకాదు, నా సమస్త జీవితానికి సంబంధించినదై ఉంటుంది.

ఏ తెలివితేటలు లేకుండానే నేను జన్మించానని నాకు తెలుసు, అందుకే జ్ఞానాన్ని, సత్యాన్ని తెలుసుకోవడం కోసమే, అన్నింటినీ సూక్ష్మంగా గ్రహించి, అవగాహన చేసుకొన్న తరువాతనే నేను వాటిని సహజత్వంలోకి మారుస్తాను. ప్రత్యేకంగా గ్రహించిన దాన్ని నాకై నేను డైరెక్టు చేసుకుంటాను. అంతేకాకుండా నా విశ్వాసాల సరళిమీద నమ్మకం గల వారిగా కూడా చేస్తాను.

నా మాటల్లో చెప్పాలంటే... "పలురకాల మనస్తత్వంతో ఉండే జనం దగ్గరనుండి, నా వివేచనతో సంపాదించిన తెలివితేటలతో, ఈ భౌతిక ప్రపంచం, కనిపించే మానవుని భౌతికమైన ఉనికి మరో పక్క ఉండగా, నేను మానవునికి సంబంధించిన విశ్వాసాల్ని అనుభూతుల్నే కాకుండా అతని చేతనాచేతన అవస్థల్ని ఇంకోపక్క అభివ్యక్తీకరించడమే నా కళ."

కళ బోధించదు. అది చూపెడుతుంది. కొన్నింటిని అందంగానూ, మరికొన్నింటిని బావుండకుండా.

నా కళని ఎవరైనా కళగా అనుభూతిని చెందకపోవచ్చు, కానీ నిశ్చయంగా, నిరంతరంగా నా అంతరాత్మ నాచిత్రానికి, నా జీవితాన్ని దిశానిర్దేశం చేస్తుంది.

'నిశ్శబ్ద్' చిత్రంలో ఓ డైలాగ్ ఉంది. బచ్చన్ తనదైన శైలిలో తానెందుకు ఫొటోగ్రాఫ్స్ తీస్తాడో జియాకు వివరిస్తూ అంటాడు, 'దునియా మే బహుత్ సే చీజ్ సామాన్య హెూతీహై లేకిన్ ఏక్ వ్యక్తీకా నజరియా ఉసే అలగ్ బనా దేతా హై. యహ్ తస్వీర్ మేరీ నజరియా హై. మేరా ఎహ్సాస్ హై' (లోకంలో చాలా వస్తువులు సామాన్యంగానే ఉంటాయి. కానీ ఒక్కో వ్యక్తి ఆ వస్తువుని చూసే దృక్పథం బట్టి అవి వేరుగా కనిపిస్తాయి.) అలాగే నేను తీసే నా చిత్రం నా దృక్పథం.

ఇప్పటికీ చాలామంది ఫలానా దృశ్యం అనవసరమైంది అంటే, కొంతమంది అద్భుతంగా ఉందంటారు. వ్యక్తిగత అభిప్రాయాలు, అవగాహన వల్ల వారి దృష్టిలో నిజమేదైనా కావచ్చు. కానీ ఆ సీన్‌ని నేను సాధారణమైన రీతిలో, సంప్రదాయ పద్ధతిలో షూట్ చేస్తే తప్పనిసరిగా అది ఎలాంటి ప్రభావాన్ని చూపకపోగా, నా ఉద్దేశ్యాన్ని కూడా పూర్తి చేసి ఉండేది కాదు.

దీనినే నేను నా 'కళ', నా 'ఆలోచన' అంటాను. కాని ఇది వేరే వాళ్లకి కనిపించక పోవచ్చు. నా కళ పట్ల, నా దృక్పథం పట్ల వారు గుడ్డి వారై ఉంటారు. నేను వారికి గుడ్డివాడిగా కనిపించడానికి కారణమొక్కటే. నా దృక్పథాన్ని వారు చూడరు, చూడదలచుకోరు.

చివరకు నేను చెప్పేది ఏంటంటే, నేను నా ఆలోచనల్ని డైరెక్ట్ చేయాలి కానీ నా ఆలోచనలు నన్ను డైరెక్టు చేయకూడదు.

మంట పెట్టిన 'ఆగ్'

'షోలే' సినిమాకు సంబంధించి ఏదైనా చేయాలన్న ఆలోచన ఐదారేళ్ల కిందట వచ్చింది. ఒక రోజు నాకు జి.పి.సిప్పీ మనవడు సషా సిప్పీ నుంచి కాల్ వచ్చింది.

'షోలే' తర్వాత భాగాన్ని తీయాలని తాము అనుకుంటున్నామని, దానికి అవసరమైన కథ కూడా తన మనస్సులో ఉందని సషా సిప్పీ చెప్పాడు.

షోలేలో 'మహబూబా' పాట తర్వాత గబ్బర్‌సింగ్, ఆ రాత్రి హెలెన్‌తో గడుపుతాడని, అతని వల్ల హెలెన్ గర్భవతై ఒక కొడుకుని కంటుందని చెప్పాడు. అతనే జూనియర్ గబ్బర్ అవుతాడు.

షోలే ముగింపుకథగా రెండోది తీయడానికి కొన్ని సమస్యలున్నాయి. దానిలోని కొన్ని పాత్రలు చనిపోయినవి. కొంతమంది నటులు ఈ లోకంలో లేరు. షోలే ముఖ్యపాత్ర జై ఆ సినిమా చివర్లో చనిపోతాడు. ఇక నిజంగానే సంజీవ్‌కుమార్, అమ్జద్‌ఖాన్ స్వర్గస్థులైనారు. అందుచేత ఆ సినిమాలో మిగిలిన పాత్రలు, మిగిలిన నటులతో పాటుగా, అవసరాన్ని బట్టి కొత్త వారిని కూడా తీసుకోవాలని సషా ఆలోచన.

ఇక కథకు వస్తే జూనియర్ గబ్బర్ తన తండ్రి గబ్బర్‌సింగ్‌కు జరిగినదానికి ప్రతీకారాన్ని తీర్చుకో దలిచాడు.

ఇలా ఉండగా పాత షోలేలో రాధ (జయ భాదురి) ఇంకా రాంఘడ్‌లోనే ఉంటుంది. ఆమెను చూడటానికి అప్పుడప్పుడు వీరూ, బసంతీ ఆ గ్రామానికి వస్తుంటారు. ఒకరోజు అదను చూసి ఆ ముగ్గురినీ జూనియర్ గబ్బర్ కిడ్నాప్ చేస్తాడు. వారిని విడిపించడానికి జరిగే కథతో అల్లింది ఆ చిత్రం.

ఒకరోజు నేను నలుగురైదుగురితో కలిసి కూర్చుని ఉండగా, కమర్షియల్ పోస్టర్ డిజైనర్ వచ్చి గబ్బర్ ఎలా ఉండాలో తయారు చేసిన డిజైన్‌ను చూపాడు. దానిలో గబ్బర్ వేసుకున్న డ్రెస్ చూసి, సిటీలో అలాంటి బట్టలను ఎవరైనా వేసుకుని రోడ్డు పైకి వస్తారా...? అనిపించింది. కాని నా చుట్టూ ఉన్న వారు మాత్రం చాలా బాగుంది అన్నారు.

సినిమాను రియలిస్టిక్‌గా తియ్యాలన్న తలంపుతో ఉన్న నేను ఆ డిజైన్‌ను చూసి ఇది సహజంగా లేదు అన్నాను. కాని డిజైనర్ మాత్రం. 'పాత షోలే గబ్బర్ మామూలు

దొంగే, కానీ ఏళ్లు గడిచిన కొద్దీ అతనికి ఫ్యాన్స్ పెరిగారు. ఇప్పుడు గబ్బర్ ఒక లెజెండ్' అన్నాడు! కాబట్టి మనం గబ్బర్ పాత్రను రియలిస్టిక్‌గా చూపించకూడదు అన్నాడు. అతన్ని గొప్ప స్టైలీష్‌గా ఫాంటసీ కలబోస్తూ చూపించాలి అన్నాడు. నా చుట్టూ ఉన్నవారు కూడా సమయం, సందర్భం బట్టి చాలా గొప్ప ఐడియా అన్నారు. అంతా విన్న తర్వాత నాక్కూడా అతను చెప్పేది రైటేమోనని, నేను అనవసరంగా మెంటల్ బ్లాక్స్ పెట్టుకుంటున్నానేమో అనిపించింది.

గబ్బర్ పోస్టర్ డిజైన్‌ను నేను అమితాబ్‌కి చూపించాను. ఆయన కూడా 'ఫెంటాస్టిక్' అన్నారు. కాని నేనేం చేయాలనుకుంటున్నానో ఏమిటో ఆయనకు తెలియదు. కేవలం ఆయన ఒక పోస్టర్‌ను చూసి అలా అన్నారు! అంతే! సర్కార్ తర్వాత మంచి డైరెక్టర్‌గా నన్ను ఆయన నమ్మారు. ఏదో కారణం ఉండబట్టే నేను దాన్ని ఆయనకు చూపించానని ఆయన భావించుండొచ్చు. అమితాబ్ కూడా మెచ్చుకున్నారు, నా చుట్టూ ఉన్నవారు కూడా మెచ్చుకున్నారు దీనితో బహుశా ఇదే బెటర్ అనుకున్నాను.

ఇలా నేను ప్రతీ పాత్ర స్వరూప స్వభావాలను మార్చుకుంటూ పోయాను. నాకు వచ్చిన పోస్టర్‌ని బట్టి దానికి ఎవరు తగినట్టుగా ఉంటారో ఆలోచించడం మొదలు పెట్టాను.

ఇలా నేను ఊహిస్తున్నది ఒక్కొక్కటీ సరిపోతున్నది కానీ షోలేలో కథలోని పాత్రల అనుభవం తాలూకు ఉద్వేగాలు, భావనల విషయం మొత్తం మర్చి పోయాను.

అజయ్‌దేవ్‌గణ్, సుష్మితా సేన్, లేదా మోహన్ లాల్, బచ్చన్, నిషాకొఠారి, ప్రశాంత్‌రాజ్ –ఇలా చాలామందితో మాట్లాడాను. వారందరూ బాగుందన్నారు. దానికి కారణం నేను చేసిన విశ్లేషణ. వీరిలో ఎవ్వరికీ కూడా సినిమాపై పూర్తి అవగాహన లేదు. అందరూ నేను చెప్పింది రైట్ రైట్ అన్నారు. పైగా లాయర్లు షోలే హక్కులను కొనవలసిన అవసరం లేదని అన్నారు. కానీ తీరా నేను మొదలుపెట్టేసరికి వాళ్లు, 'మీరు ఇలా చేయకూడదు, అలా చేయకూడదు, ఈ పాత్ర ఇలా ఉండకూడదు' అనడం, నేను ప్రతీదాన్నీ మార్చుకుంటూ పోవడం జరిగింది.

షోలే టైటిల్ నాకు దొరకలేదు కాబట్టి 'రాంగోపాల్ వర్మకీ సర్కార్', సంజయ్ లీలా భన్సాలీ 'దేవదాస్', మాదిరిగా 'రాంగోపాల్ వర్మకీ షోలే అనవచ్చా?' అన్నాను. ఈ పేరుతో రెడీ అయిన చిత్రాన్ని విడుదల చేయడానికి సిద్ధపడుతుండగా, ఈ టైటిల్‌లో షోలే మాటను వాడరాదని కోర్టు ఆదేశించింది. దానితో షోలేకు బదులుగా 'ఆగ్' అని మార్చాం. ఎందుకంటే షోలేకి దగ్గరగా అర్థం వచ్చే పదం 'ఆగ్' ఒక్కటే. ఈ విధంగా రాంగోపాల్ వర్మకీ షోలే, రాంగోపాల్ వర్మాకీ "ఆగ్" అయ్యింది.

ప్రేక్షకులు మీపై తీవ్ర విమర్శలు కురిపిస్తుంటే బాధ పడతారా అని అడిగితే లేదనే అంటాను. ఒక చిత్రాన్ని తీసేముందు, తర్వాత కలిగిన అనుభవాల నుంచి నేను చాలా నేర్చుకున్నాను. కాని 'ఆగ్' తీసి నేను చాలా మందికి కష్టం కలిగించినందుకు బాధ పడుతున్నాను.

చాలామంది నటులను, టెక్నీషియన్లను, పెట్టుబడి పెట్టిన వారిని నేను చేసిన ఒక పెద్ద తప్పులో భాగంగా చేశాను. వారందరూ నన్ను నమ్మి తమ డబ్బును, కాలాన్ని టాలెంట్‌ని వెచ్చించారు కాని వారికి దక్కింది ఏమిటి? నాతో పాటు విమర్శలు తప్ప.

అండర్ వరల్డ్‌తో నా పరిచయం

నేను మొట్టమొదటిసారిగా హైదరాబాద్ నుంచి ముంబై వచ్చినప్పుడు రైలు ధారావి స్లమ్స్ పక్క నుంచి పోతుండగా వాటికేసి అలా తదేకంగా చూస్తూ ఉండిపోయాను. వేలాది ఇళ్లు ఉన్నప్పటికీ, అవన్నీ ఒకే కప్పు కింద ఉన్నట్టు అనిపించింది. లోపలికి ఎలా వెళ్తారో, బైటికి ఎలా వస్తారో కూడా అర్థం కాదు. రైలు పట్టాలకు కేవలం మూడు అడుగుల ఎడంలో రెండేళ్ల పసిపాప తప్పటడుగులు వెయ్యడం చూశాను. ముంబాయిలో ఎవరి పని వారు చేసుకు పోతుంటారు. ఎవరి సమస్య వారిది. పక్కన ఏం జరుగుతున్నా పట్టించుకోరు. ప్రజలు అలా బతుకుతూ ఉంటారు. ముంబై పట్ల నాకు విపరీతమైన ఉత్సుకత కలగడానికి ఈ విధమైన వాతావరణం కారణం! రంగీలా సినిమా నిర్మాణాన్ని మొదలు పెట్టినప్పటి నుంచి నేను ఈ వాతావరణంలోకి తరచు రావడం జరిగింది.

ఒకరోజు నేను ఒక నిర్మాత ఆఫీసులో ఉండగా అతనికి ఫోను వచ్చింది. ఆడియో కింగ్ గుల్షన్ కుమార్‌ని ఒక ముఠా వారు కాల్చి చంపారు. చనిపోయిన అతని గురించి ఆ నిర్మాత చెబుతూ, 'అతను నాకు పొద్దున్నే 7 గంటలకు ఫోను చేశాడు, 8 గంటలకు ఎటో వెళ్లాడు, 1-30కి అతను ఎవరినో కలుసుకోవల్సి ఉంది- కాని ఈ లోగానే...' ఇలా అంటున్నాడు.

బాగా పరిచయమున్నవారు అకస్మాత్తుగా పోతే ఇలా జరిగిన విషయాలు గుర్తుకు చేసుకోవడం సహజం. అన్నీ సినిమాటిక్‌గా ఆలోచించే నేను మరో విధంగా ఆలోచించాను. ఆ వ్యక్తిని చంపిన హంతకుడు ఉదయం ఎన్ని గంటలకు లేచి ఉండాలి? తను ఇలా చంపడానికి వెళ్లాల్సి ఉంది కాబట్టి కాస్త పొద్దున్నే తనను నిద్ర లేపాలని తన తల్లికి అతను చెప్పి ఉంటాడా? చంపడానికి ముందు బ్రేక్‌ఫాస్ట్ చేశాడా లేక పని ముగించిన తర్వాత తిన్నాడా? ఇలా హతుని, హంతకుడి టైంటేబుల్ గురించి నేను ఆలోచనల్లో పడ్డాను. ఈ గ్యాంగ్‌స్టర్ల గురించి వాళ్లు ఎవరినైనా చంపినప్పుడు లేదా వాళ్లు చచ్చినప్పుడో మాత్రమే మనం ఆలోచిస్తాం. మరి మిగతా టైంలో వాళ్లు చేసేది ఏమిటి...? ఈ నా ఆలోచన్నించి పుట్టిందే 'సత్య' చిత్రం.

ఉదాహరణకి మీ పక్కింటి వాడే గ్యాంగ్‌స్టర్ కావచ్చు. పాయింట్ ఏంటంటే వాళ్లు ఎప్పుడూ ప్రత్యేకంగా కనిపించరు. మామూలుగా సాదాసీదాగా కనిపిస్తారు. పని ముగించిన తర్వాత జనంలో కలిసిపోతారు.

నా స్నేహితుడు ఒకడు, ఓషివారాలో పద్నాల్గొవ అంతస్థులో ఉంటున్నాడు. అతను సినిమా వాడు కాదు. అతను ఉండే ఫ్లాట్‌కు పైన ఎక్కడో ఇంకో వ్యక్తి లిఫ్ట్‌లో పోతున్నప్పుడు ఆ వ్యక్తి నా ఫ్రెండుకు కన్పించేవాడు. ఇద్దరూ హల్లో అనుకునే వారు. "ఎలా ఉన్నారు?", "హ్యాపీ దివాళీ...!" ఇలా అప్పుడప్పుడూ పండగలకీ పబ్బాలకీ పలకరించుకునే వారు...

ఒకరోజు నా ఫ్రెండుకు, తన భార్య అతన్ని పోలీసులు అరెస్టు చేశారని, ఒక హత్య కేసులో అతను పారిపోయి ఇక్కడ దాక్కున్నాడని చెప్పింది.

ఈ విషయం గురించి నా ఫ్రెండు చెబుతూ, 'నువ్వు ముంబైలో పదేళ్లుగా ఫలానా వాడికి పొరుగింటి వాడిగా ఉన్నప్పటికీ, అతని గురించి నీకు తెలియదు...?' అన్నాడు. అప్పుడే నాకు సత్య కథకు ఆలోచన వచ్చింది. సత్య సినిమాలో ఊర్మిళ ఉండే ఫ్లాట్ ఎదురుగానే సత్య ఉంటాడు కానీ అతను చేసేపని ఏమిటో తనకి తెలీదు.

ఇలా ఉండగా నేను ఒకరోజు అజిత్ దివానీ అనే ఒకతన్ని కలుసుకున్నాను. ఇతను మందాకినికి దావూద్‌తో ఎఫైర్ ఉన్నప్పుడు తన వద్ద సెక్రెటరీగా లోగడ పనిచేశాడు. ఈ విషయం నాకు తర్వాత ఎవరో చెబితే తెలిసింది. అజిత్‌తో మాట్లాడినప్పుడు ఒక గ్యాంగ్‌స్టర్ గురించి చెప్పాడు. అతని సోదరుడ్ని పోలీసులు చంపేశారు. ఆ విషయం అజిత్‌కి తెలిసి ఆ గ్యాంగ్‌స్టర్‌ను పరామర్శ కోసం కలుసుకున్నాడట. అప్పుడు అతను చనిపోయిన తన తమ్ముడి శవాన్ని తిడుతూ చెప్పింది వినకుండా, తన ఇష్టం వచ్చినట్టు చేసి చివరకు చచ్చాడు అన్నాడంట. ఇది విన్న నాకు విభ్రాంతి కలిగింది. చనిపోయిన వారిని అలా ఎవరైనా తిడతారా. ఆలోచించిన మీదట నాకు అనిపించింది తన మీద తనకున్న విపరీత నమ్మకంతో ఒక గ్యాంగ్ స్టర్ బతుకుతాడు అని. తన సోదరుడు తన మాట వినలేదు. ఇదే బహుశా అతనికి కోపం తెప్పించి ఉంటుంది. అతని బాధ కోపం రూపంలో వెలికి వచ్చింది.

మనమందరం సమాజంలో స్కూల్ నించి, పేరెంట్స్ నుంచి వచ్చే శిక్షణ మూలాన నాగరికంగా ప్రవర్తిస్తాం. కాని కాని సంఘ వ్యతిరేక శక్తులు కూర్చునే పద్ధతి, వ్యవహరించే తీరు, నవ్వే పద్ధతి, మొరటుదనం, నిర్లక్ష్యం ఇలా అన్నీ దానికి భిన్నంగా ఉంటాయి. అడవి పిల్లికీ, ఇంట్లో తిరిగే పిల్లికీ ఉన్న తేడా వాటి కళ్లు చూడగానే తెలిసి వస్తుంది. ఇలా రకరకాలుగా విశ్లేషణలు చేసి క్యారెక్టరు సృష్టించి "సత్య" తీశాను.

ఇదెక్కడి మీడియా?

మీడియా అనేది ఒక రిపోర్టింగ్ ఏజెన్సీ... వార్తలను ప్రజలకు తెలియజేయడం దాని బాధ్యత. వార్తా సేకరణ కూడా దాని పని. ఇక వార్త అంటే జరిగిన సంఘటన లేదా ఏదైనా కొత్త విషయం గురించి మొదటిసారి తెలుసుకోవడం. వార్త ఎప్పుడైనా తాజాగా ఉండాలి. ప్రజలను ఆకర్షించాలి. వార్తను చాలా నాటకీయంగా చెప్పాలి. ఇలా చెబితేనే ప్రచురణ సంస్థలు, టీవీ ఛానెల్స్ నిలుస్తాయి. యాడ్స్ వస్తాయి... దాంతో పాటు డబ్బులు కూడా... ఆదాయం కూడా పెరుగుతుంది. వ్యాపారం బాగా పెరుగుతుంది. అంటే చివరగా తేలింది ధన సంపాదన అనేగదా! ఐతే అందరికీ సంపాదనే లక్ష్యం అని చెప్పలేం. కొందరు వృత్తిలో సంతృప్తికి, తమకు తెలిసిన విషయాన్ని ప్రజలకు చెప్పడానికి, మంచి పేరు తెచ్చుకోవడానికి కూడా మీడియాలో చేరుతారు. మీడియాలో కూడా రకరకాల వాళ్లు ఉంటారు. ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకోవడం, పరులను విమర్శించినట్టుగానే తమతో కలిసి పని చేసేవారిని ఆడిపోసుకోవడం, అవతలి వారి కంటే తమకే పేరు రావాలనుకోవడం – ఇంకా అనేక రాజకీయాలు ఉంటాయి.

అయితే ఇది కేవలం మీడియాలోనే కాకుండా, అన్ని పరిశ్రమల్లోనూ కనిపిస్తుంది. సినిమా ప్రపంచంలో ఉన్నట్టుగానే మీడియాలో కూడా మంచి చెడు, వికార అవికారాలు కనిపిస్తాయి. కానీ చాలామందికి ఒక విషయం తెలియకపోవచ్చు. నిజాన్ని చెప్పవలసిన మీడియా యంత్రాంగం చడీ చప్పుడు గాకుండా అధికారం, ధన సంపాదన కేంద్రంగా మారిపోయింది.

స్ట్రిప్‌టీజర్‌కూ, మీడియాకూ ఉన్న తేడా ఒక్కటే! ఆవిడ తన బట్టలను ఒక్కొక్కటే తీసేసి నగ్నంగా నిల్చుని చూపరులకు ఆనందాన్ని కలిగించి డబ్బు తీసుకుంటుంది. కాని మీడియా మాత్రం ఇతరుల గుడ్డలూడదీసి, ఇంకెవరికో ఆనందాన్ని కలిగిస్తుంది. ఏదైనా విషాద సంఘటన, మనిషికి చాలా బాధ కలిగించేది జరిగినప్పుడు మీడియాలో ఎవరికైనా బాధ, విచారం కలుగుతాయా? లేదు! పైగా వారి కళ్లల్లో ఆనందం, మెరపులు కనిపిస్తాయి. ఎంత చెడు జరిగితే మీడియాకు అంత పెద్ద పండుగ.

ఇక వారు ఒక్కో సినిమాను లేదా సినిమా వారిని గానీ స్కాములో ఇరుక్కున్న పొలిటీషియన్లని గానీ చీల్చి చెండాడుతుంటే వారికి కలిగే ఆనందాన్ని ఎవరైనా గమనించారా. వారి కళ్లలో కాంతి గమనించారా?

ఒకరి కష్టం, ఇంకొకరి ఆనందంలా ఇక్కడి పరిస్థితి తయారైంది. అది మీడియాలోనే కాదు. సినిమా ఇండస్ట్రీలో కూడా.

సిన్మాల మీద విమర్శకులు నిప్పులు కక్కడం చూసి ఎక్కువగా సంతోషం పొందే వారు సినీ పరిశ్రమలోని తోటి వారే కావడం పచ్చి నిజం.

ఒక సినిమాకు సంబంధించిన వారిని చెడామడా ఏకుతూ విమర్శకులు రాతలు రాస్తే వాటిని చదువుతూ సంతోషపడే వారు, పళ్లు ఇకిలించేవారు సినిమాల వాళ్లే. దానికి కారణం వారిలోని అసూయ. ఏడుపు, విమర్శలు ఎదుర్కొన్న వారు ఎంత బాధపడితే, వారిపై రాసిన రాతలు చదివే ఇతర సినిమాల వారికి అంత సంతోషం.

అలా జరగడానికి కారణం అవతలి వారి విజయాలు. తాము తప్ప ఇంకెవరూ పైకి రాకూడదన్న ఈర్ష్య, అసూయ. కాని విజయాన్ని సాధించిన వారిని విమర్శిస్తూ ఉంటే, లేదా కింద పడిన వాడిని మీడియా పట్టుకుని చీల్చి చెండాడుతుంటే అసూయాపరులైన ఇతర సినిమాల వారిలో కలిగే సంతోషం ఇంతా అంతా కాదు. తిక్క కుదిరింది అనుకుంటారు.

ఎక్కడా లేని ఒత్తిడి, దెబ్బ తింటామన్న భయం సినిమా ఇండస్ట్రీలో ఉన్నాయి. అందుకే వారు ఎక్కువగా మీడియా వారికే భయపడతారు.

బట్టల వ్యాపారంలో నష్టం వస్తే ఎందుకని వచ్చిందో ఎవరూ పట్టించు కోరు, ఒక హోటల్ పరిశ్రమలో నష్టాలు వచ్చి పతనమైతే దాని గురించి ఎవరూ రాయరు. ఇక విమర్శల ప్రసక్తే ఉండదు. కాని ఒక ఫ్లాప్ పిక్చర్‌ను తీస్తే, మీడియా దయ వల్ల దాని గురించి వాయువేగంతో అంతటా పాకి పోతుంది.

సినీ పరిశ్రమలో కీర్తి ప్రతిష్ఠలు చాలా ముఖ్యం. డబ్బు కంటే ఎక్కువగా కీర్తికి ప్రాధాన్యం ఇస్తారు. సినీ పరిశ్రమకు ఎవరు వచ్చినా వారు మొదట తాపత్రయపడేది. తమకు మంచి పేరు రావాలి. తమకు ఒక గుర్తింపు రావాలి అని కోరుకుంటారు. మీడియాలో చాలామంది తమకు, తమ రాతల ద్వారా ప్రత్యేక గుర్తింపు కోసం అనేక విధాలుగా యత్నిస్తారు. అలా గుర్తింపు రావడానికి కంటపడిన ప్రతీ సినిమానూ చీల్చి చెండాడుతారు. సినిమాను అసహ్యించు కోవడం కంటే మిన్నగా దానిపై అవాకులూ-చెవాకులూ రాసి సంతోషించడం వారికి చాలా ఇష్టం!

ఇక మీడియాలో రిపోర్టర్ ఉద్యోగం చేయడం చాలా కష్టం, ఫుటేజ్ (కవరేజ్) కోసం అనేకచోట్లకి తిరగడం, తెల్ల కాగితాలు నలుపు చేయడం, అవతలి వారికంటే ముందుగా రిపోర్టులను ఫైలు చేయడం, ప్రోగ్రామ్స్‌ని ఆకర్షణీయంగా దిద్దడం వారి పని. రంగంలో పోటీని తట్టుకోవడానికి ఎంతకైనా దిగజారక తప్పదు. తమకు ఇష్టం లేకపోయినా తమకు బాగా పరిచయం ఉన్న వారిపై కూడా రిపోర్టర్లు బురద చల్లడం

జరుగుతున్నది. సినిమాను గానీ, సినిమావారిని గానీ తిట్టడం, చీల్చి ముక్కలు ముక్కలుగా చేయడంలో దయ, స్నేహం, జాలి– ఏవీ వారికి అడ్డు రావు (గడ్డితో గుర్రం స్నేహం చేస్తే అది తినేది ఏమిటి?)

ఒక ప్రముఖుడి గురించి ఏదో ఒక ముఖ్య సమాచారం గురించి ఒక జర్నలిస్ట్‌కు చూచాయగా తెలిసిందనుకోండి. ఇక అతనికి భయం పట్టు కుంటుంది. ఆ సమాచారం తనకు అందకపోవచ్చు ననుకుని భయపడినప్పటికీ, ఆ పరిస్థితిలో కూడా తనకు తెలిసిన చిన్న విషయానికి కూడా మసాలా కలిపి వార్తను తయారు చేసి ప్రసారానికి ఇస్తాడు.

దీనికి ఒక ఉదాహరణ: ముంబై మిర్రర్ నుంచి నాకు ఫోనులో ఒక మెసేజీ వచ్చింది. దానిలో అతను 'మీకు, అమిత్ జీ కీ (అమితాబ్ బచ్చన్) మధ్య ఏమైనా గొడవలున్నాయా?' అని అడిగారు.

'అదేం లేదే' అని సమాధానం ఇచ్చాను. అదే ప్రశ్నకి అమిత్‌జీ... "నాతో 20 సినిమాలు చేద్దామనుకుంటున్నానని" జవాబు ఇచ్చారు. ఈ విషయాన్ని నాకు ఆయనే తెలిపారు. హెడ్‌లైన్స్‌లో ఒక వార్తను ఇలా వేశారు. 'రాము–బచ్చన్‌ల మధ్య సంబంధాలు తెగి పోయాయి' అని. దాని కింద ఎక్కడో మేం ఖండించిన విషయం చిన్న అక్షరాలతో వేశారు.

ఇక్కడ ఒక పర్టిక్యులర్ జర్నలిస్ట్ గురించి కచ్చితంగా చెప్పుకోవాలి. ఇతని స్టైలే వేరు! ఇతను ఉండేది వేరే ఊరిలో, సంబంధాలు పెట్టుకున్నది ముంబాయి వారితో! ఒక చిత్రం ఫ్లాప్ అయిన తర్వాత ఆ సినిమా వారికి ఫోను చేసి తన సానుభూతిని వ్యక్తం చేయడం ఇతనికి అలవాటు. వారు కూడా భోరున ఏడ్వడానికి ఇతని భుజం అందుబాటులో ఉంటుంది. ఇలా వారిని మాటల్లో పెట్టి వారి చేత వాగించి, ఇతర ఫిల్మ్ వ్యక్తుల గురించి తనకు పనికి వచ్చే సమాచారాన్ని లాగి, దాన్ని ముంబైలోని తనకు అవసరమైన వారికి అందజేసేవాడు. ఇతను ఉండేది వేరే ఊరు కావడం వల్ల తమకు రాని సమాచారం తనకి తెలిసిందని, ముంబాయిలోని వారు అతనిచ్చే సమాచారంపై ఆధారపడుతున్నారు. పైగా బాలీవుడ్‌లోని వారికి ఇతనిపై చాలా నమ్మకం. అతను ఎక్కడో ఉంటున్నాడు కాబట్టి అతనికి ఏమి చెప్పినా పర్వాలేదనుకుని ఫిల్మ్‌ల వల్ల దెబ్బ తిన్న వారు చాలా చెప్పేవారు. తాము చెప్పింది ముంబైకి చేరదని నమ్మేవారు కానీ అప్పటికే వారిచ్చిన సమాచారం ముంబాయికి చేరి ఉంటుంది. ఇక ముంబాయిలోని జర్నలిస్ట్‌ల పంట పండుతుంది. అతను చెప్పిందానికి ఇంకా నాలుగైదు కల్పించి మసాలా దట్టించి రాసేస్తారు.

ముంబై కాక, ఇతర ప్రాంతాలలోని మీడియా వారికి ముంబైలోని ఫిల్మ్ వ్యక్తులతో అంతగా పరిచయం ఉండదు. అందుకే వారు నిష్పక్షపాతంగా రిపోర్టులు రాస్తారు. ఇక్కడి వారి కంటే కొంతైనా నిజాయితీ వారిలో కన్పిస్తుంది. ఇక ముంబైలోని మూడు–

నాలుగు పత్రికలు మొత్తం దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. దానికి కారణం ఆ పత్రికల వారిని ఫిల్మ్ వ్యక్తులు తమ ఇళ్లకు ఆహ్వానించి మర్యాదలు చేయడం.

ఐదారు పట్టణాలూ, నగరాలూ తిరిగి వచ్చిన తర్వాత నేను ఎంత కూపస్థ మండూకాన్నో నాకు అర్థమైంది. దేశంలోని ప్రతీ పట్టణంలో ఒక మీడియా ఉంది. అక్కడి జర్నలిస్టులు, ముంబైలోని జర్నలిస్ట్‌ల కంటే అన్ని విషయాలలో చాలా అధికులు. వారు అలా గొప్ప జర్నలిస్టులుగా తయారు కావడానికి కారణం 'కలుషిత' వాతావరణానికి దూరంగా ఉండటం అనుకుంటున్నాను.

నేను నిర్మించిన 'కంపెనీ' చిత్రం నుంచి ఒక వాక్యాన్ని ఇక్కడ చెప్పాలి.

దానిలో సినిమా వాళ్లని, మీడియా వాళ్లని కలిపి ఇలా అంటారు: 'యే బస్ హమారే ధంధే కీ జాత్ హై' ఇది మా వ్యాపార ప్రవృత్తి.

స్టార్లూ - యాక్టర్లూ

జనంతో ఏదైనా సినిమా చూడమని చెబితే, "అందులో ఎవరున్నారు?" అనేది వారు వేసే తొలి ప్రశ్న. ఒక స్టార్ ఇలాగే పుడతారు. ఎందుకంటే, జనానికి చిత్రం ఎలా ఉందో తెలియకపోయినా, అందులో ఎవరో ఒక స్టార్ ఉన్నాడని తెలిస్తే అతని మీద ఆధారపడి చూసేందుకు రెడీ అవుతారు.

ఒక స్టార్‌కూ, యాక్టర్‌కూ గల ప్రాథమిక భేదం ఏమిటంటే... స్టార్ అనేవాడు ఒక వ్యక్తిత్వం. దీనికి తగిన ఉదాహరణ షారుఖ్ ఖాన్. ఒక యాడ్‌లో చేస్తున్నా, లేదా ఒక షోలో ఉన్నా లేదా చిత్రంలో ఉన్నా లేదా ఊరికే కూర్చున్నా అతని వ్యక్తిగత ఆకర్షణ అలాగే ఉంటుంది. అతనితో మాట్లాడిన దాన్ని బట్టి, అనేక చిత్రాల్లో అతను కనిపించిన కారణంగా ప్రభావితం చేసే వ్యక్తిగానూ, వినోదాత్మకంగానూ, ఆకర్షణతోనూ కనిపించాడు. అలా కాకుండా, నటుడు చేసే పాత్రలతోనే జనం ఐడెంటిఫై అవుతారు.

'సత్య' విడుదలైన తర్వాత ఒక అవార్డుల ఫంక్షన్‌లో మనోజ్‌బాజ్‌పాయి స్టేజీ మీదికి వచ్చినప్పుడు, జనం అక్కడే ఉన్న షారుఖ్ ఖాన్‌ను వదిలేసి. భిక్కూభాయి అంటూ కేకలు వేశారు. అది మనోజ్‌కు థ్రిల్లింగ్ అనిపించింది. నేను మనోజ్‌తో జనం అతన్ని అతని పేరుతో కాక, అతను చేసిన పాత్ర పేరుతో పిలిచారనీ, దాన్ని సీరియస్‌గా తీసుకోవద్దనీ హెచ్చరించాను. అప్పటికి షారుఖ్ పాతిక సూపర్‌హిట్ చిత్రాల్లో చేశాడు కానీ జనంలో ఎవరికీ అతను చేసిన ఏ పాత్ర పేరూ గుర్తుకు లేదు. దీన్నే 'స్టార్ పవర్' అంటారు. నటులు తమ పాత్రలతో సహా కనుమరుగవుతారు కానీ, స్టార్లు మాత్రం చిరంజీవులుగా మిగిలిపోతారు.

చాలామంది, షారుఖ్‌ఖాన్ చేసిన యాక్షన్నే మళ్లీ మళ్లీ చేస్తున్నాడని ఫిర్యాదు చేస్తారు. అతనో పెద్ద స్టార్ కాబట్టి అది నిజమేనంటాను. కాని స్టార్ అనేవాడు తను చేసే దానికన్నా భిన్నంగా చేస్తే ఫెయిలవుతారు. దీన్ని 'పహేలీ', 'స్వదేస్' చిత్రాలను ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఒక మనిషిని కలిసిన ప్రతీసారీ వేర్వేరు పరిస్థితుల్లో, వేర్వేరు బ్యాక్‌గ్రౌండ్‌లో లేదా భిన్న మనస్తత్వాలతో కూడిన వారిలా ఉండాలి కానీ అతను మారకూడదు. దీనికి ముఖ్య ఉదాహరణలుగా షారుఖ్ ఖాన్‌నూ, రజనీకాంత్‌నూ చెప్పుకోవచ్చు. అసాధారణమైన పాత్రలతో సినిమా తీయాలనుకుంటే, కొన్ని కొన్ని సార్లు ఒక స్టార్ దానికి అటంకం అవుతాడు. ఎందుకంటే అతను, తనతో పాటు తన ఇమేజ్‌నూ మూటకట్టి తెచ్చుకుంటాడు.

అతని నుంచి జనం కూడా అలాంటివే ఆశిస్తారు. జనం నటనను చూడాలను కుంటారా లేక కేవలం బాగా కనిపించటాన్ని ఇష్టపడతారా...? అనేది ప్రశ్న.

మీరెప్పుడైనా డీవీడీ షాప్‌కెళ్లి చిత్రాలను ఎంచుకోవాలనుకుంటే, యాక్టర్లకోసం కాక, చిత్రం పేరో, దాని పోస్టర్ డిజైనో లేక డీవీడీ కవరు వెనుక రాసిన మూడు నాలుగు వాక్యాలో నచ్చి తీసుకుంటారు. కనుక చిత్రంలో నటీనటులూ ఆకర్షణ కావొచ్చు, దేన్ని గురించి అనేదీ కూడా ఆకర్షణ కావచ్చు.

ద్వేషాన్ని ప్రేమిస్తాను!

'షోలే' చిత్రంలోని ఒక సీన్లో ఠాకూర్, తన కుటుంబమంతటినీ సామూహికంగా చిత్రవధ చేసి చంపాడని గబ్బర్ మీద వచ్చిన కోపాన్ని చూసి గబ్బర్‌కి చాలా వినోదంగా అనిపిస్తుంది. "దే జిత్‌నీ గాలీ దే ఠాకూర్, జీ భర్‌గాలీ దే" (ఎన్ని తిట్లయినా తిట్టు ఠాకూర్, తనివి తీరా తిట్టు) అని అంటాడు. నా చిత్రాలన్నీ ఠాకూర్ కుటుంబం. నన్ను ద్వేషించేవారి సంఘం పేరు ఠాకూర్, నేను గబ్బర్‌ను. 'షోలే'లో ఠాకూర్, గబ్బర్‌ను చంపించేందుకు వీరూ, జైలను నియోగించాడు, కానీ నా విషయంలో ఇంకా ఆ నియామకం జరగలేదు. ఇదే నేను చెప్పదలచింది, నన్ను ద్వేషించేవారికి.

వింతగా నా చిత్రాలపై కన్నా చాలామందికి నాపైనే ద్వేషం. నన్ను ద్వేషించేవారు. నా కథల కన్నా గొప్పవీ, అద్భుతమూ అయిన కథలు, తమ వద్ద ఉన్నాయని అనుకుని వాటిని వినే నిర్మాతలు దొరక్క గిలగిల లాడుతారు. ఈ కారణం చేతనే ఎక్కువమంది తమ కోపాన్ని వెళ్లగక్కుతారు.

నా తొలి చిత్రంతో రాబోయే బ్రేక్ కోసం నేను యాతన పడుతున్న రోజుల్లో నేనో నిర్మాతను కలిసేందుకు ప్రయత్నించేవాణ్ణి. అప్పటికి నా స్క్రిప్ట్‌తో పోలిస్తే, అతను చెత్త సినిమాలు తీస్తున్నాడని నా ఫీలింగ్. గంటల తరబడి అతని ఆఫీసు ముందు వేచి ఉండేవాణ్ణి. అప్పుడతను పనికిరాని డైరెక్టర్లని (నా దృష్టిలో) తనతో కూచోబెట్టుకుని, లోపల చర్చిస్తుండేవాడు. కానీ కోపం తెచ్చుకోవడానికి బదులుగా, నేను, అతన్నీ, అతని చుట్టూ ఉన్న జనాన్నీ, పరిసరాలనూ బాగా స్టడీచేస్తూ, అతని చేత ఎప్పుడైనా నన్ను విశ్వసించటంలో అతని తెలివిని ఎలాగోలా మేల్కొలపాలా అని పథకాలు వేస్తుండేవాణ్ణి.

విలువగలవారెవరైనా ఉంటే, వారు సాధించినదేమిటో చూసి నేర్చుకోవాలి. అతను మన దృష్టిలో పనికిరాని వాడైనా అతను సాధించింది మనకో పాఠం నేర్పుతుంది. దాని ద్వారా మనం అతనికన్నా ఎత్తుకు ఎదగటానికి వీలవుతుంది. అంతే కానీ, నేల మీద కూర్చుని ద్వేషం నిండిన కళ్లతో ఆ పైకెదిగిన వాడి పతనం కోసం ఎదురుచూడటంలో అర్థం లేదు. అతని పతనం మనం పైకి వెళ్లేందుకు తోడ్పడదు. మనం తరచూ పట్టించుకోని సంగతేమిటంటే, మనకంటే పనికిరాని వాళ్లని మనం అనుకున్న వాళ్లు చాలాసార్లు మనకంటే ఎంతో పైన ఉంటారని. అదే జీవితక్రమం.

క్లుప్తంగా చెప్పాలంటే, ఒకరిని ద్వేషిస్తూ తమ శక్తిని వృథా చేసుకోవటం నిజంగా వేస్ట్ అంటాను. ప్రేమించటం కొన్ని సార్లు అయినా మంచి అనుభవాన్ని ఇస్తుందేమో గానీ, ద్వేషం వల్ల ఏమీ ఒరగదు.

ఒక డ్రామా కామిక్ ట్రాజెడీ

హైదరాబాదు నుంచి నరసాపూర్ వెళ్లే రైలు ప్రమాదానికి గురైంది. ఆ రైల్లో నేనున్నాను. పదిహేడుగురు మరణించారు. 'ప్రేమకథ' చిత్రం షూటింగ్ కని వెళ్తున్నాను. నా జీవితమంతటిలోకీ చాలా డ్రమెటిక్ , హాస్యపూరితమూ, ట్రాజిక్ భరితమూ అయిన సంఘటన అది!

నేను ఫస్ట్‌క్లాస్ క్యాబిన్ అప్పర్ బెర్త్‌మీద నిద్రపోతున్నాను. హఠాత్తుగా ఏదో టపటపా కొట్టుకుంటున్న పెద్ద చప్పుడూ, దాంతో పాటే కిందబెర్తు నుంచి ఎవరో భయంతో మూలుగుతున్న చప్పుడు వినిపించింది. ఆ మూలుగు క్రమంగా పెద్దదవుతూ వినబడసాగింది. నాకు కలిగిన మొదటి ఆలోచన ఏమిటంటే, రైలు పట్టాలు తప్పిందనీ, సడన్‌గా ఉన్నట్టుండీ టపటపా కొట్టుకునే చప్పుడూ, మూలుగూ– రెండూ ఆగిపోయి నిశ్శబ్దం ఆవరించింది. కలగంటున్నానని అనుకున్నాను.

లేవటానికి ప్రయత్నించి నాతల అదిమి పెట్టినట్లుగా ఉండటంతో లేవలేకపోయాను. కాసేపటి రైలుపెట్టె 30 డిగ్రీలు వాలుగా ఒరిగినట్లు అర్థం చేసుకున్నాను. దాని మూలాన నా తల కోచ్ గోడకి అదిమిపెట్టింది. అతికష్టంమీద లేచి కిందికి దిగి, నా షూస్ కోసం వెతుక్కున్నాను. నిదానంగా పెట్టె తలుపు దగ్గరికి వెళ్లగలిగాను. బయట నేను అడుగుపెట్టగానే, నా షూ గోధుమ పంటలోని బురదలో దిగబడింది. ముందురోజే కొన్నానా కొత్త షూస్‌ను. అప్పుడే ఫినిష్ అయిపోయాయని బాధపడుతూ ఆ షూస్‌ను జాగ్రత్తగా బయటికి తీసుకున్నాక, చుట్టుపక్కల పరిశీలిస్తే, రెండు పెట్టెలు పక్కకు పడిపోయి ఉన్నాయి. జనం బయటికి రావటం కనిపించింది. ఆ పెట్టెలు, జరిగిన ప్రమాదంలో విరిగిపోయి ఉన్నాయి. ఒకడు రైల్లోంచి ఓ దిండూ, దుప్పటీ, తెచ్చుకుని రైలు పట్టాల మీద పరుచుకుని రెస్క్యూ రైలొచ్చేస్తే లేపమంటూ చుట్టుపక్కల వారికి చెప్పి పడుకున్నాడు.

ఎస్5 కోచ్‌లో నా యూనిట్ వారున్నారు. ఆ కోచ్ మరో నాలుగు కోచ్‌ల తరువాత ఉండటం వల్ల నేనక్కడికి నడవసాగాను. ఒకతను గడ్డిమీద విరిగిన కాలితో పడి ఉన్నాడు. నేనింకాస్త ముందుకు వెళితే, ఎస్5 కోచ్ ముందున్న కోచ్ బాగా దెబ్బతిని ఉంది. లోపలినుంచి ఎవరో మంచి నీళ్లు కావాలని బాధతో మూలుగుతున్నారు. చీకటిగా ఉండటం చేత లోపలికి చూడలేకపోయాను కానీ, చిక్కుకుపోయి ఉన్నాడని మాత్రం గ్రహించాను. మరొకడు నీటి సీసా తీసుకుని కిటికీ దగ్గరికి వెళ్లి అందించబోయాడు. కానీ, ఇంకొకడు

నీరు ఇవ్వొద్దని అరిచాడు. ఎందుకని మొదటివాడు అతని వైపు తిరిగి అడిగితే, రెండోవాడు గాయపడ్డ వ్యక్తికి నీరెందుకు ఇవ్వకూడదో చెప్పటం మొదలుపెట్టాడు. మొదటి వ్యక్తి ఇంకా క్వొశ్చిన్స్ అడుగుతున్నాడు. ఓ పక్కన లోపలి వ్యక్తి బాధతో నీరు కావాలని దయనీయంగా మూలుగుతూ అర్థిస్తూ ఉంటే వీళ్లిద్దరూ గాయపడిన వారికి నీరివ్వటం వల్ల కలిగే ప్రమాదాలను గురించి చర్చించుకోసాగారు. మొదటి వాడు పెద్దవైన కళ్లతో వింటుండగా, రెండోవాడు తన జ్ఞానాన్ని గిఫ్ట్‌గా ఇవ్వటం మొదలుపెట్టాడు.

"సార్, మీకేం కాలేదుకదా?" అంటూ అరుపు వినబడేసరికి నేను వెనక్కి తిరిగాను. అప్పుడు నాకు అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఇ. నివాస్ నిలబడి ఉన్నాడు. అతనూ ఎస్5 కోచ్‌లోనే ఉన్నాడు. నేను మిగతావారెలా ఉన్నారని అడిగాను. "అందరూ బానే ఉన్నారు కానీ విద్యా మాత్రం అవుట్" అన్నాడు నివాస్.

అతనేమంటున్నాడో నాకర్థమైనా, అటువంటి పరిస్థితిలో సాటి వ్యక్తి మరణాన్ని క్రికెట్ టెక్నికల్ భాషలో చెప్పటం విచిత్రం అనిపించింది. మా కజిన్ సిఫార్సుతో కెమెరా అసిస్టెంట్ విద్యాను నా యూనిట్‌లోకి తీసుకున్నాను. తను లోయర్ బెర్త్‌మీద నిద్రపోతున్నాడనీ, ప్రమాదం జరిగిన విద్యాను కదిలించే ప్రయత్నం చేశాడనీ, ఎంత ప్రయత్నించినా కదలకపోతే అవుట్ అయ్యాడని గ్రహించాడనీ చెప్పాడు.

నేను నా సెల్‌ఫోన్ తీసి, ముంబాయిలోని నా కజిన్‌కి ఫోన్ చేశాను, అప్పుడు తెల్లవారు జామున నాలుగు గంటలు, సంగతి చెప్పగానే, "ష్యూరా...?" అని అడిగాడు నిద్ర స్వరంతో. నివాస్‌ను "ష్యూరా?" అని ప్రశ్నించాను. అతను కూడా అనుమానపడి, "అతను కదలటం లేదన్నది మాత్రం నిజం" అన్నాడు. నేను "స్పృహ తప్పాడేమో!" అన్నాను. దాంతో ఇద్దరం కలిసి ఆ బురదలో కష్టంమీద నడుస్తూ, ఎస్5 కోచ్‌కు చేరుకున్నాం. అది 45 డిగ్రీలు వాలుగా ఒరిగిపోయి ఉంది. దాని కిందికి వెళ్లి, విద్యాను పిలుస్తూ కేకపెట్టాడు ఇ.నివాస్. ఒక మూలుగు వినిపించింది. నేను వెంటనే నివాస్‌తో "అతను బ్రతికే ఉన్నాడు" అనగానే, నివాస్, "అతను విద్యా కాదు, మూర్తి" అన్నాడు. "మూర్తి ఎవరు?" అనడిగితే, అతను కోచ్‌లో రాత్రి పరిచయమయ్యాడని విద్యా పై బెర్త్ మీదా, మూర్తి మధ్య బెర్త్ మీద పడుకున్నారనీ, అన్నాడు. మూర్తి చిక్కుకుపోయాడని నివాస్ చెప్పాడు.

విద్యా బతికున్నాడేమో చూడమంటూ, నివాస్ మూర్తిని అడిగాడు. మూర్తి మూలుగు తప్ప ఏమీ వినిపించలేదు జవాబుగా. గాయపడి ఉన్న మూర్తిని, విద్యా సంగతి తెలుసుకోమని, అడగటం దారుణమనిపించింది.

హఠాత్తుగా "వర్మా సాబ్, మీరిక్కడున్నారా?" అంటూ స్వరం వినిపించి, వెనక్కి తిరిగి చూశాను. ఒక వ్యక్తి కొంతమందితో కలిసి మావైపే వస్తున్నాడు.

నేను అతన్ని గుర్తుపట్టలేకపోయాను. దాన్ని గ్రహించిన అతను, తనకు తాను పరిచయం చేసుకుంటూ, 'క్షణక్షణం' చిత్రం క్లైమాక్స్ షూటింగ్‌లో కలిసిన రైల్వే ఆఫీసర్నని చెప్పాడు. అతను తన బృందంతో రక్షణ రైల్లో వచ్చానంటూ, "మీ అవసరాలు చూడటానికి వచ్చాం... ఇతను స్టేషన్ సూపర్‌వైజర్ రామచంద్రన్, ఇతను నా క్లోజ్ ఫ్రెండ్ వెంకటేశ్వర్లు" అంటూ అందరినీ పరిచయం చేశాడు. "మీకేమైనా చేయాలా?" అని అడిగాడు.

"ఈ కోచ్‌లో విద్యా అనే అతను చిక్కుకుపోయాడండీ. అతనెలా ఉన్నాడో కనుక్కోగలరా...?" అని అడిగాను. "తప్పకుండా" అన్నాడతను.

ఉన్నట్టుండి "ఏదైనా సాబటేజ్ అనే అనుమానముందా...?" అంటూ ఓ కంఠం వినబడగానే అందరం అటు తిరిగాం. ఒక రిపోర్టరు డిక్టాఫోన్‌తో నిలబడి ఉన్నాడు. దాంతో ఒక్కసారిగా ఆ ఆఫీసర్ అధికారస్వరంతో "ముందు అవసరమైన వారికి సాయం అందించాలి. కావలిసిన విషయాలను మీరు నన్నే అడగాలి. నా పేరు నర్మింగ్ రావు" అన్నాడు.

ఆ మిస్టర్ రావు, మరునాటి పేపర్‌లో తన పేరును చూసుకోవాలనే తాపత్రయంలో ఉన్నాడని నాకు అర్థమైంది.

ఇంతలో అక్కడికి దగ్గరలోని గ్రామం నుంచి ఒక వ్యక్తి వచ్చాడు. అతను కనిపించాడు. తన గ్రామం చుట్టుపక్కల ఇటువంటి ప్రమాదం అంతకు ముందెప్పుడూ జరగలేదని మహోత్సాహంగా అతను చెప్పుకున్నాడు. జీవితాంతం అతను తన పిల్లలకూ, మనవలకూ ఈ కొత్త ఎక్స్‌పీరియన్స్‌ను గురించి అలుపెరగకుండా చెబుతాడని గెస్ చేశా.

మిగతావారికోసం నివాస్‌నూ, ప్రొడక్షన్ మేనేజర్ గారినీ ఉండమని చెప్పి, మరో యూనిట్ సభ్యుడితో కలిసి, దగ్గరలోని గుంటూరు వెళ్లటానికి కొంత దూరంలో ఉన్న జీపు కేసి నడిచాను. దారిలో చాలామంది ఆఫీసర్లూ, ప్రయాణికులూ నన్ను గుర్తించి ఎంతో మర్యాదగా పలకరించారు. నేను జీప్ ఎక్కి బయలుదేరమన్నాను. డ్రైవరు నావైపు చూపొకటి విసిరి, బురదలో చిక్కుకుపోయిన జీపు చక్రాన్ని చూపించాడు. అలా జరుగుతుందని తను ముందే చెప్పినప్పటికీ తనను పట్టించుకోని ఆ ఆఫీసర్లను ఆగకుండా తిట్టాడు. అతనికి నన్ను గురించీ, ఆ ప్రమాదాన్ని గురించీ ఏమీ పట్టలేదు.

కొందరు యూనిట్ సభ్యులతో కలిసి, ఆ బురద నిండిన దారి గుండా దగ్గరలోని గ్రామానికి నడవక తప్పలేదు నాకు. కొంత దూరం నడచిన తర్వాత వెనక్కి తిరిగి రైలును చూశాను. ఆ రైలుకూ, నాకూ మధ్య కుడివైపుగా ఒక పెద్ద చెట్టుంది. అది కాస్త ఎడమవైపు ఉంటే షాట్ బావుండేది కదా! అనిపించింది నాకు...

గ్రామం చేరాక, అక్కడ కొన్ని బండ్లున్నాయి. నాగార్జున ఫ్యామిలీ ఫ్రెండ్ ఒకరు, తన బండిలో నన్ను గుంటూరు నుంచి తన ఇంటికి తీసుకెళ్లాడు. నా బట్టలూ, షూసూ బురద బురదగా ఉన్నాయి. కాళ్లు కడుక్కుని లోపలికి వెళదామని నీళ్లడిగినా, అతను అతిథి సత్కారంతో అలాగే లోపలికి రమ్మని బలవంతం చేశాడు.

లోపల ఒకామెని తన భార్య అని చెబుతూ, నన్ను పరిచయం చేయబోతే, కాళ్లు బయటే ఎందుకు కడిగించి తీసుకురాలేదని అడుగుతూ పరిచయాన్ని పట్టించుకోలేదు, "ఆయనెవరో తెలుసా?" అని అతను అరిచినా కూడా. నేను బయటికెళ్లబోతుంటే, "ఎలాగూ లోపలంతా మురికి చేశాక ఇంకిప్పుడు బయటికెళ్లేం ప్రయోజనం?" అందావిడ.

స్నానం తరువాత, దగ్గరలోని హోటల్‌లోకి షిఫ్టయ్యాను. నివాస్ ఫోన్ చేసి మూర్తి కూడా సైలెంట్ అయిపోయాడని చెప్పాడు. ఇద్దరమూ 'మరణం' అనే పదాన్ని గురించి మాట్లాడకుండా మౌనం వహించాం.

ఎస్5 కోచ్ దారుణంగా చితికిపోయినందున, దాని పైభాగాన్ని కోసి తెరవవలసి వచ్చింది. విద్యా అప్పర్ బెర్త్ మీద, సరిగ్గా కప్పుకిందే ఉండటంతో పై కప్పును వెల్డింగ్ టార్చ్‌తో కోస్తున్నప్పుడు ఆ వేడికి అతని ముఖం పూర్తిగా కాలిపోయింది.

ముంబాయి నుంచి మా కజిన్ ఫోన్ చేసి, విద్యా తండ్రి వస్తున్నాడనీ, అతనికి నేను విద్యా మరణవార్త చెప్పాలనీ చెప్పాడు. అతనికి విద్యా గాయపడ్డాడని మాత్రమే చెప్పాట్ట. తొలిసారి ఒక తండ్రిని కలుస్తూ, కొడుకు మరణవార్త చెప్పేదెలాగా అని నేను గిలగిలలాడాను. నా ఫ్రెండ్ పండుకి ఈ సంగతి చెప్పాను. తను నన్ను బాధపడొద్దని ఈ సంగతి తను చూసుకుంటాననీ చెప్పాడు.

విద్యా తండ్రి వచ్చి నాకేసి ఏం వార్త వినాలో నని భయంగా చూస్తుండగా, పండు ఆయన వీపు మీద చరిచి, గట్టిగా, చాలా సంతోషంగా, "మీ అబ్బాయి చాలా అదృష్టవంతుడండీ. భగవంతుడు తీసుకెళ్లిపోయాడు. మేమంతా ఎందుకూ పనికిరాని వాళ్లం. మాకలాంటి అదృష్టం ఎప్పుడు కలుగుతుందో!" అన్నాడు.

పండు ఆ వార్త చెప్పిన విధం నాకు షాక్ తినిపించింది. ఆయన విస్మితుడయ్యాడు.

ముందు పండు పిచ్చి పని చేసాడని అనిపించినా తరువాత ఆ పరిస్థితిలో ఆ వార్తను అలా చెప్పడమే మేలనీ అనిపించింది. ఇక పండు వరుసగా ప్రమాదాలూ, ఆ సందర్భాలకు సంబంధించిన రకరకాల విషయాలూ, భగవంతుని లీలలూ – ఇలా చెప్పుకుంటూ పోయాడు. ఆ తండ్రికి ఆలోచించే సమయమే దొరకలేదు. అతని సమయస్ఫూర్తిని చూసిన నాకు, నేను కలిసిన వారిలో అతన్ని మించిన సైకాలజిస్ట్ మరెవరూ లేరనిపించింది.

దాని తర్వాత విద్యా తండ్రితో నేను చాలాసేపు మాట్లాడాను. కాలిపోయిన అతని ముఖాన్ని అతని తల్లికి చూపించొద్దని సలహా ఇచ్చాను. "అతని ముఖాన్ని మునుపటిలాగే తల్లిని గుర్తుంచుకోనీయండి" అని సలహా ఇచ్చాను. ఏకైక సంతానాన్ని ఆమె చూడకుండా సాగనంపటం ఎట్లాగని ఆయన వాదించాడు. ఎంత చెప్పినా ఆయన నా లాజిక్‌ను వినకపోవటం మూలాన నేను చాలా ఇరిటేట్ అయ్యాను.

చివరికి కొడుకు డెడ్‌బాడీతో ఊరు చేరుకున్న తరువాత తన అభిప్రాయాన్ని మార్చుకుని, నేను చెప్పిందే చేశారని, మా కజిన్ ఫోన్ చేసి చెప్పాడు. నేను, నా కౌన్సిలింగ్ శక్తిని అభినందించుకుని, నా వీపు నేనే తట్టుకున్నాను.

ఈ అనుభవం తరువాత, "జీవితం ట్రాజిక్‌గా కనిపించే కామెడీయే" అనే సత్యాన్ని గ్రహించాను.

బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ - ఒక మానసిక దృక్కోణం

నేపథ్యసంగీతానికి నేనెప్పుడూ మంత్రముగ్ధుణ్ణవుతుంటాను. 'ఏలియన్' చిత్రాన్ని విజయవాడ, ఊర్వశి థియేటర్‌లో పదిహేడు సార్లు చూశాను. అందులో మూడుసార్లు కేవలం బ్యాక్‌గ్రౌండ్ సంగీతం వినేందుకు కళ్లుమూసుకుని కూర్చున్నాను. లేకపోతే సంగీతం మీది నా ఏకాగ్రతను చిత్రం డిస్ట్రిబ్ చేస్తుంది కాబట్టి. సీడీలు దొరకని రోజుల్లో, నేను 'ఎంటర్ ద డ్రాగన్' చిత్రం సంగీతాన్ని రికార్డు చేసేందుకు ఒక టేప్‌రికార్డర్ తీసుకెళ్లేవాణ్ని. కళలన్నిటిలోకీ బ్యాక్‌గ్రౌండ్ సంగీతమే చాలా గొప్ప అని నాకు అనిపించేది. దానికీ ఇతర కళలకూ ఉన్న ప్రాథమికభేదం ఏమిటంటే, మిగతావి కంటికి కనిపించే భౌతిక వస్తువును సృష్టిస్తాయి. సంగీతం మన మానసికస్థితి మీద పనిచేస్తుంది.

నేపథ్యసంగీతం కథను చెప్పదు, కానీ ఒకానొక ఎమోషన్ గల విషయాన్ని ఒకానొక ప్రత్యేకమైన మార్గంలో చూసేందుకు గైడ్ చేయగలదు.

ఉదాహరణకు, 'శివ'లోని కాలేజీ ఫైట్ సీన్‌లో ఇళయరాజా ట్రాజిక్ సంగీతం పెడితే, నేనెందుకని అడిగాను. దానికాయన "వాళ్లిక్కడకి చదువుకునేందుకు వచ్చి దెబ్బలాడుకుంటున్నారు. వాళ్ల గురించి నాకు బాధ కలిగింది" అన్నాడు. మీరా సంగీతాన్ని ఒంటరిగా వింటే అది ఫైటింగ్ సీన్‌కు సంబంధించిందని అనుకోరు. ఇళయరాజా ఉద్దేశ్యమేమిటో కూడా ఎవరికీ కాన్సియస్‌గా బాగా అర్థం కాకపోవచ్చు. కానీ చిత్రంలో ఏది దేన్ని సృష్టిస్తూందో వివరాలు తెలియకున్నా, కోరుకున్న ప్రభావం పడటానికి సంగీతం ఆ పనిచేస్తుంది.

ఒక దర్శకుని ఉద్దేశ్యం ఏమిటో తెలుసుకోకుండా నేపథ్యసంగీతాన్ని నిర్లక్ష్యంగా సమకూరిస్తే ఫీలింగ్ వేరే డైరెక్షన్‌కు వెళ్లే ప్రమాదం ఉంది. 'కంపెనీ' చిత్రం విడుదలైనప్పుడు, చాలామంది డిస్ట్రిబ్యూటర్లు నాకు ఫోన్ చేసి, జనానికి మొదటి సగం బాగా నచ్చిందనీ, రెండో భాగంలో వారు ఫైటింగ్ సీన్‌లూ, తీవ్రమైన యాక్షన్ ఉంటాయని ఆశించి నిరాశ చెందారనీ చెప్పారు. నా ప్రమోషన్‌లో అలాంటివి ఉంటాయని నేను చెప్పకపోయినా, వారెందుకు ఆశించారో అని ఆశ్చర్యపోవటం నా వంతైంది. కాసేపు ఆలోచిస్తే, ఇంటర్వెల్‌లో నేపథ్య సంగీతం వల్ల జనం అలా ఆశించి వుంటారని అనిపించింది. కంపెనీ సినిమాలో... చందూ, మాలిక్‌ను "తూ ఔర్ తేరే కంపెనీ ఖల్లాస్!" అని బెదిరిస్తాడు.

హై ఎమోషనల్ విషయం కనుక, బ్యాక్‌గ్రౌండ్ సంగీతంతో దానికి బలమైన సంగీతం పెట్టాం. దాన్ని విన్న ప్రేక్షకులు తరువాతంతా ఫైటింగులే ఫైటింగులనీ ఆశించినట్లున్నారు.

అలా ఇంటర్వెల్ తరువాత రాబోయే భయంకర ఫైట్ సీన్‌లను ఊహించి ఆశించిన జనానికి అవి లేకపోవటం నిరాశ కలిగించి ఉంటుంది. అలాకాకుండా, ఇంటర్వెల్ సీక్వెన్స్ అంతటినీ విషాదం కురిపించే వేణునాదంతో నింపి, చందు, మాలిక్ విడిపోతున్నారనే భావాన్నే జనంలో కలిగించి ఉన్నట్లయితే, వారలా అనుకునేవారు కాదు.

అప్పుడున్న ఎమోషన్స్‌ను నేపథ్య సంగీతం దృశ్యానికనుగుణంగా పెంచనూ గలదు. నటునికి ఇచ్చిన సీన్‌లోని ఎమోషన్ని గొప్పగా చూపనూ గలదు లేదా ప్రేక్షకుల మనసులను అక్కడ జరుగుతున్నదానికి భిన్నంగా మరో వైపుగా మళ్లించనూ గలదు. ఇంకా, నిజంగా అక్కడేమీ లేని విషయాన్ని ఎంతో గొప్పగా చూపించేందుకు వాడుకోబడుతుంది కూడా.

ఇక్కడ 'సర్కార్'ను రషీద్ కలిసే సందర్భాన్ని గురించి చెప్పుకోవాలి. అతను నాయక్ గ్రూప్ సభ్యుడనీ, ఒక బీచ్‌లో తన సరకులు దింపుకోవాలనుకుంటున్నాడనీ తప్ప, ఇంకేం చెప్పనే లేదు. కానీ ఆ దృశ్యంలో వినిపించిన సంగీతం మాత్రం, ఏదో గొప్ప మరువలేని సీన్ జరిగిపోతున్నట్టు భయం కలుగజేస్తుంది.

ఒక విషాదభావాన్నో, సంతోషాన్నో లేదా అప్పటికి ప్రేక్షకుల బుర్రల్లో ఆ పాత్రను గురించి ఏ భావం కలుగుతుందో దాన్ని నేపథ్య సంగీతం తారస్థాయికి చేర్చగలదు. ఆ నటుడు తను చేస్తున్న ఆ పాత్రలాగే, లేదా తన నిజజీవితంలోనో అలాంటి భావాన్ని చూపలేడు... అంత గొప్ప పని చేస్తుంది సంగీతం!

'రంగీలా' చిత్రం సంగతి కొస్తే, జాకీనుంచి ఊర్మిళకు నటించేందుకు రమ్మని ఫోన్ వచ్చినప్పుడు, అమీర్ వైపు ఆమె పరుగెడుతుంది. అక్కడ సంతోషం నిండిన ఆమె మనసు ఎలా గెంతులేస్తూందో అది సంగీతం ద్వారా వినిపిస్తుంది.

నా ఆసక్తి నంతటినీ కేంద్రీకరించి, ఒక భావోద్వేగాన్ని అనుభవింపజేసే, అనుభూతిలోకి తెచ్చే నేపథ్య సంగీతాన్ని గురించి నేను చాలా రీసెర్చ్ చేశాను. భౌతికరూపంలో ఉన్న ఎమోషన్స్ అర్థం చేసుకోవటానికి నిరంతర కృషి అవసరం. ఇది కూడా చాలాసార్లు పొరపాట్లూ, అపజయాలకు దారితీయొచ్చు. కానీ మ్యూజిక్ ఇంటిగ్రేషన్ తాలూకు విధానం మాత్రం అలవోకగానూ, సునాయాసంగానూ ఉంటుంది.

ఒకరు జంతువు లేదా శిశువు లేదా అనూహ్యంగా తెలివిలేనివారైతేనే, వారి రియాక్షన్. సంగీతం పట్ల వారి టేస్ట్ కలిసి వారిని వారివారి భావాత్మక ఉపరితలాలకు చేరుస్తాయి. ఒకరి విలువలనూ, లోతైన భావాలనూ కలుపుతాయి. చాలామంది, నా చిత్రాల్లో వినిపించే నేపథ్యసంగీతం మరీ డ్రమెటిక్‌గానూ, ముఖం మీద కొట్టినట్లూ ఉంటుందని భావిస్తారు. అసలు సంగతేమిటంటే, వాళ్లు అలా భావించేలా చేయటమే నా ఉద్దేశ్యం.

గోడమీద పిల్లులు

ఇన్నేళ్ల జీవితంలో నేను తెలుసుకున్నదేమిటంటే, లోకంలో పనులు చేసే వాళ్లూ, పనులుచేయని వాళ్లూ ఉన్నారని. కాని ఎక్కువమంది ఏం చేయాలో నిర్ణయించుకోలేనివాళ్లే. అంటే గోడమీది పిల్లులన్నమాట! ఎందుకంటే వాళ్లు వ్యక్తిగతంగా ఎప్పుడూ ఏమీ సాధించరు. కనీసం ప్రయత్నం కూడా చేయరు. కనుక అపజయం పాలయ్యారని అననూ లేము. అంటే విజయాలూ లేవు కనుక, అపజయాలూ ఉండవు. నా జీవితంలో అలాంటి వారిని ఎందరినో కలిశాను. ఇంకా నేటి వరకూ కలుస్తూనే ఉన్నాను.

ఇలాంటివారే అమెరికా ఇరాక్‌తో యుద్ధానికి ఎందుకు దిగింది, లేదా ఎందుకు దిగలేదు అనో, ఫలానా క్రికెట్ వీరుడు ఒకానొక బంతిని ఎందుకు కొట్టలేకపోయాడు అనో, ఫలానా చిత్రం ఫలానా విధంగా ఎందుకు తయారై ఉండకూడదు అనో... వగైరా మాట్లాడుతుంటారు.

వీళ్లను గురించిన ఆశ్చర్యం గొలిపే విషయం ఏంటంటే, వారు తమ అభిప్రాయాలూ, దృఢ విశ్వాసాలను, ఎంతో స్పీడ్‌గా మరో విధంగా మార్చేసుకుంటూ ఉండటం! ఉదాహరణకు, నేను కొందరు డిస్ట్రిబ్యూటర్లతో కూర్చుని ఉండగా, వాళ్లు మహా ఘనవిజయం సాధించిన మరాఠీ చిత్రం 'మహేర్చీ సాడీ' రీమేక్ అయిన 'సాజన్ కా ఘర్' కథ చెబుతున్నారు. ఒరిజినల్‌లోని ఒక దృశ్యం వివరిస్తూ, హీరోకు అతని సవతి చెల్లెలు రాఖీ కడుతుంది. ఆ ఇంట్లో అందరూ ఆమెను బ్యాడ్‌లక్‌గా భావిస్తారు. తరువాత అతనికి యాక్సిడెంటయ్యి, చేయిపోతుంది. అందరూ ఆమెను తిడుతుండగా, అతను రాఖీ కట్టిన చేతిని పైకెత్తి, దాని వల్లే కనీసం తన రెండో చెయ్యి అయినా మిగిలిందని చెబుతాడు. ఆ డిస్ట్రిబ్యూటర్లు పారవశ్యంతో ఆ ఒక్క దృశ్యమే చాలు, దేశమంతటి నుంచీ కాసులు రాల్చటానికి, అంటూ పొగిడారు. ఆ చిత్రం ఘోరంగా దెబ్బతిన్న కొన్ని రోజులకు వాళ్లలోనే ఒకడు, ఆ రాఖీ సీన్ లాంటి చెత్త సీన్ ఉండటంవల్లే సినిమా ఫ్లాపన్నాడు. మిగతావాళ్లు వాదించకుండా ఊరుకున్నారు. మరి కొన్ని రోజుల తరువాత ఆ ఫిల్మ్‌మేకర్‌ను ఈ గ్రూప్ వారే అంత పనికిమాలిన చెత్త దృశ్యాలను చిత్రంలో పెట్టినందుకు మాటలతో చీల్చి చెండాడటం కూడా విన్నాను.

మరో ఉదాహరణ – శంకర్ దర్శకుడుగా తొలిసారి తీసిన సినిమా 'జెంటిల్‌మేన్' చిత్రం 'డొనేషన్స్' ఆధారంగా తీశాడు. విడుదలకు ముందే ఆ చిత్రం చూసిన ఇండస్ట్రీ

మొత్తం చాటుగా నవ్వుకుని, అటువంటి అల్ప ప్రాధాన్యం గల విషయం ఆధారంగా చిత్రం తీయటం, అందులోనూ కమెర్షియల్ చిత్రం దండుగ అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించుకుంది. ఆ చిత్రం విడుదలై రికార్డు స్థాయిలో వసూలు చేయడం గమనించి వారే, ప్రస్తుత విషయం అదేననీ, ప్రతి కుటుంబం వారూ దానితో ఐడెంటిఫై అయ్యారనీ అనుకున్నారు.

తరువాత ఆ చిత్రం రైట్స్ కొని, దాన్ని చిరంజీవితో మహేశ్‌భట్ దర్శకత్వంలో నిర్మించారు. ఘోరంగా ఫెయిలైంది. వ్యతిరేకంగా అప్పుడందరూ మళ్లీ డొనేషన్స్ గురించిన సబ్జెక్ట్ సినిమాను కమర్షియల్‌గా తీయటం శుద్ధ వేస్ట్ అన్నారు.

ఒకానొక ప్రఖ్యాత నిర్మాత, విడుదలకు ముందు 'సత్య' చూసి, దాని బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ తనకు నచ్చలేదనీ, మరీ గట్టిగా, చాలా డ్రమెటిక్‌గా వినిపించిందనీ, గడ్డాలతో, చెమటలు కారుతున్న ముఖాలను ఎవరూ చూడలేరనీ నాతో అన్నాడు. చిత్రం విడుదలై విజయ ఢంకా మోగించిన కొన్ని నెలలకు ఒక పార్టీలో, ఒకతను కలిశాడు. 'సత్య' సూపర్ హిట్ కావటానికి నేపథ్య సంగీతమే ప్రధానకారణమనీ, లేకపోతే అదో ఆర్ట్ చిత్రంగా మిగిలిపోయేదనీ అన్నాడు. బాలీవుడ్‌లో అంతకాలం అలవాటుగా కనిపించిన ముఖాలకన్నా నేచురల్‌గా కనిపించిన ముఖాలు మార్పుకు స్వాగతం చెప్పాయని కూడా అన్నాడు.

ఈ ఉదాహరణలన్నిటితోనూ నేను చెప్పదలచిన సంగతేమిటంటే, ఈ గోడ మీద పిల్లులు అతి వేగంగా తమ అభిప్రాయాలు మార్చేసుకుంటూ ఉంటారు – విషయం జరుగుతుండగా, అటు తరువాత కూడా, వారికి దృఢ విశ్వాసాలు సైతం మారిపోతుంటాయి అని. దీనికి రెండుకారణాలున్నాయి – ఒకటి, ఒక చిత్రం హిట్టు. ఫెయిలో అవుతుందని వారు చెప్పలేరు కనుక, తాము మూగవారిలా మాట్లాడకుండా ఉన్నామని జనం అనుకుంటారేమోనని, ప్రతిదాని మీదా తమకూ ఒక అభిప్రాయం ఉండాలనేది. ఇక రెండోది తమ అభిప్రాయం తప్పైతే, విజయానికి రెండో వైపున పట్టుబడటం నచ్చదు కనుక. అందుకని వారెప్పుడు తామన్నది తప్పయిపోతే, దాన్ని సమర్థించుకునేందుకు ఒక సిద్ధాంతాన్ని సిద్ధంగా ఉంచుకుంటారు. వాళ్ల విశ్వాసం కూడా చాలా ప్రాథమికమూ, పొలిటికల్‌గా, మారల్‌గా బహిర్గతం అవుతుంది. న్యాయానికీ, మంచికీ తమనూ, తమ విశ్వాసాలనూ ప్రతినిధులుగా భావించుకుంటూ, అవెంత తాత్కాలికమైనా సరే, విజయం సాధించినవారు, సాధించే ప్రయత్నంలో ఓటమి పాలైన వారి కన్నా విచిత్రమూ, బలమైన భావాలతో ఉంటారు. వీరు తమకు తమ విలువలూ, జవాబులు చెప్పలేని తమ నిస్సహాయతనూ ప్రశ్నించేవారిని ద్వేషిస్తూ, ఆ కోపాన్ని తమ భాషాపటిమతో విషపూరితంగా ఆ అసహ్యించుకునే వారి మీద వెలిగక్కుతారు.

నిచ్చెనను ఎక్కినవాడు ఎప్పుడు కింద పడతాడా అని ఎదురు చూస్తుంటారు. అందువల్ల తామేదో అతనికన్నా ఆకాశానికి ఎత్తుగా ఎదిగినట్లు అనుకుంటారు. నిచ్చెన మొదట్లో నిలబడి, ఎక్కేవాడి మీద కామెంట్స్ చేస్తుంటారు. తాము చూడాలనుకునేది నిచ్చెన ఎక్కినవాడి పతనాన్నే!

వీళ్లను గురించి చెప్పుకోవలసిన మరో విషయం, వీరు తాము గోడ మీది పిల్లులని తెలుసుకోలేకపోవటమే! ఎప్పటికప్పుడు ప్రస్తుతంతో రాజీ పడుతూ, తమకు తాము నమ్మబలుకుకుంటూ ఉండటమే దీనికి కారణం! వారి విశ్వాసాలు కాలం, పరిస్థితులను బట్టి మారిపోతుంటాయి కానీ, చివరికి వీరు తమ జీవితంలో ఒక స్థిరాభిప్రాయాన్ని ఏర్పరచుకోరు కాబట్టి, దేనితోనూ ఏకీభవించక, నిచ్చెన మీదికి ఒక్క అడుగు కూడా వేయలేకపోతారు.

ప్రపంచంలోని ఎక్కువమంది జనం గోడమీది పిల్లులే.

"మంచినీ, న్యాయాన్నీ చూడండి! అవి ఎక్కువగా దేన్ని ద్వేషిస్తాయి... తమ విలువల పట్టికలను బద్దలు కొట్టేవాడిని, విరిచేవాడిని, న్యాయవ్యతిరేకిని." వాడే సృష్టికర్త.

"అన్ని నమ్మకాలనూ నమ్మేవాళ్లని చూడండి! వారు ఎవరిని ఎక్కువగా ద్వేషిస్తారు? తమ విలువల పట్టికలను బద్దలు కొట్టే వాడిని, విరిచే వాడిని, న్యాయ వ్యతిరేకిని." వాడే సృష్టికర్త.

"నేను తోడుగా వచ్చే వారినే కానీ శవాల్నీ, పశువుల కాపరుల్నీ, నమ్మేవారినీ వెతకను. సహసృష్టికర్తలను, కొత్త పట్టికల కొత్త విలువలను రాసేవారిని అన్వేషిస్తాను.

"నా గురించిందంతా పక్వానికి వచ్చి కోయటానికి సిద్ధమైంది కనుక, పంటలు కోసే సాటి వాడిని వెతుకుతాను కాని నా దగ్గర వందల కొద్దీ కొడవళ్లు లేవు. ఆ కొడవళ్లకు సాన బెట్టడం తెలిసిన వారిని వెతుకుతాను.

"నా గమ్యానికి - నా సొంత దారిలో నేను వెళతాను, నిదానంగా నడవటానికి కూడా తటపటాయించే వారి మీదుగా దూకుతూ వెళతాను, అట్లా నేను ముందుకు పోవటం, పోక వెనకబడటమే అవుతుంది".

- ఫ్రెడరిక్ నీషే (దజ్ స్పోక్ జరతుస్త్ర)

నేను భయపడ్డ సమయం

తెల్లవారు జామున 3 గంటలు. రాత్రి 'భూత్' చిత్రం షూటింగ్ ముగించుకుని, ఎనిమిదో అంతస్థులో ఉన్న నా అపార్ట్‌మెంట్‌కు తిరిగొచ్చాను. పడుకున్న తరువాత, ఉన్నట్టుండి, 'భూత్' చిత్రంలోని దయ్యం బీరువా వెనుక ఉన్నట్లు అనిపించి భయం వేసింది. వెంటనే నా ఊహకు నేను పైకే గట్టిగా నవ్వేశాను. ఆ గోడ దగ్గరి నుంచి దెయ్యం నవ్వు కూడా నా నవ్వుతో కలిసి వినిపించింది. నేను గోడవైపు చూశాను. ఆ దెయ్యం నా సృష్టేననీ నన్ను భయపెట్టాలని ప్రయత్నిస్తూందనీ, నాకు నేనే నచ్చ చెప్పుకున్నాను. ఆ హాస్యాస్పద పరిస్థితికి నవ్వుకున్నాను. నా భయం ఆ బీరువా వెనుక భాగాన్ని పరిశీలించమంది. కానీ, నా బుద్ధి ఒప్పుకోలేదు. ఆ రెండింటికీ కాసేపు జరిగిన వాగ్వాదం తరువాత, వెళ్లి పరిశీలించాలనే ఆలోచనను అదుపు చేసుకున్నాను. చివరికి ఎలాగైతేనేం.... ఆ బీరువానే చూస్తూ, చాలా చిన్న స్వరంతో "ఎవరు" అంటూ పిలిచాను. జవాబు రాలేదు... నిశ్శబ్దమే!

నా ప్రవర్తనకు నా మీద నాకే కోపం వచ్చింది. మనసు మళ్లీ బీరువా వెనుక పరిశీలించమంటే బుద్ధి మాత్రం అలా చేస్తే దయ్యాలంటే నమ్మకం లేదని పదే పదే చెప్పిన నువ్వు జనాన్ని వంచిస్తున్న వాడివవుతావంది. చివరికి బీరువా వైపు వీపు చేసి ఇటు తిరిగి పడుకుని కళ్లు మూసుకున్నాను. వెనుక నుంచి అడుగుల చప్పుడు వినిపించింది. నా మనసును తెగ తిట్టుకున్నాను. ఇలా బెదిరిస్తున్నందుకు దాంతో గొడవ పడుతుండగా ఎవరో నా బెడ్‌మీదికి ఎక్కినట్లయ్యింది. ఎవరిదో ఊపిరి దగ్గరగా వినిపించసాగింది. నా మెడకు తగులుతున్న ఆ స్పర్శతో నేను హఠాత్తుగా పొర్లాను. ఎవ్వరూ లేరు. బీరువా నుంచి టీవీ దాకా గదిలోని ప్రతి వస్తువునూ పరికించి చూశాను. అన్నీ కూడా నన్నే చూస్తూ ఆ దెయ్యంతో కలిసి నన్ను భయపెట్టాలనుకున్నట్లు తోచింది.

అంతలోనే గొప్ప ఊహ ఒకటి వచ్చింది. సెల్‌ఫోన్ తీసి, ఆ దెయ్యం పాత్ర చేసిన అమ్మాయికి ఫోన్ చేశాను. "హి! రామూజీ!" అని ఆమె కంఠం వినిపించింది. ఆ సమయంలో ఫోన్ చేసినందుకు ఆమె కంఠంలో వ్యక్తమైన ఆశ్చర్యంతో. ఏదో కథ చెబుతూ, కాసేపు ఆమెతో కబుర్లాడ సాగాను. ఆమె మామూలు స్వరం విన్నాక, కాసేపు తరువాత నా భయాన్ని పారద్రోల గలిగాను. ఫోన్ పెట్టే సమయానికి నేనూ మామూలు స్థితికి వచ్చేశాను. నా బుద్ధి సాయంతో మనసు చేసిన మాయను ఎలా ఓడించగలిగానో తలుచుకుంటూ హ్యాపీగా నిద్రపోయాను.

డబ్బు

"డబ్బు" అనేది నాకెప్పుడూ ఒక దారి మాత్రమే, అది గమ్యం కాదు. డబ్బు విషయంలో ముఖ్యంగా ముందుగా గుర్తించాల్సింది దానితో ఏం చెయ్యాలను కుంటున్నామని. దాచుకోవడానికా...? స్థిరాస్తులు కొనటానికా...? లేకపోతే కూడబెట్టి మీ తరువాత తరాలకి ఇవ్వటానికా...? లేక వృద్ధాప్యంలో ఉపయోగించు కోవటానికా...? లేక దాన్ని ఎలా నచ్చితే అలా ఖర్చు పెట్టడానికా...? అనేది గుర్తించాలి.

నా కజిన్ రాజా వాళ్ళ నాన్నగారు చాలా ధనవంతుడు. కాని నాకు తెలిసి ఆయన జీవితంలో ఆయన కారుని ఎప్పుడూ బయటికి తీసి వాడటం నేను చూడలేదు. దాన్నెప్పుడూ కారు షెడ్డులోనే ఉంచి ఆయన మాత్రం బస్సులో ప్రయాణం చేసేవారు.

ఒకరోజు... జీవితాన్ని అనుభవించకుండా ఇంత డబ్బుండి ఏం లాభం అని ఆయన్ని అడిగాను. దానికాయన... "మా తాతగారు, మా నాన్నగారు సంపాదించిన డబ్బు మొత్తం అనుభవించడానికే అనుకునుంటే మాకిప్పుడు ఈ డబ్బు, ఈ ఆస్తులు ఉండేవి కావు." అన్నారు. అది విన్న నేను... "అంకుల్... మీ తాతగారు పొదుపుచేసి పోగు చేసి మీ నాన్నగారికిచ్చారు.... మీ నాన్నగారు పొదుపు చేసి పోగు చేసి మీకిచ్చారు... మీరు పొదుపు చేసి పోగు చేసి రాజా కిస్తారు... రాజా కూడా బాగా పొదుపు చేసి పోగు చేసి తన కొడుక్కిస్తాడు... ఒకవేళ రాజా కొడుకు నాలాంటి వాడయితే మీ మూడు తరాల వాళ్ళూ వెధవలయిపోయినట్టే కదా" అన్నాను.

నా దృష్టిలో డబ్బనేది కదలకుండా ఒకేచోట వుంటే దానికి విలువలేదు.... కానీ అదే డబ్బు ఒకరి చేతిలోంచి ఇంకొకరి చేతిలోకి మారుతూ చలిస్తూ ఉంటేనే దాని పవర్ బయటపడుతుంది.

చాలా సులువైన తాత్వికధోరణిలో డబ్బు ఎలా పుట్టిందో చెప్పాలంటే... ప్రాచీన కాలంలో మనిషి మిగతా అన్ని జంతువుల్లాగే తనూ కూడా వేటాడేవాడు. వేట, తిండి, నిద్ర ఇదే.... మళ్లీ వేట, తిండి, నిద్ర... ఇది అప్పటి మానవుని జీవనవృత్తం.

తర్వాత తర్వాత ఒక మనిషికి వ్యవసాయం చేసి పంటలు పండించే ఐడియా వచ్చింది. కానీ ఒక మనిషికి ఇంకో మనిషిని అర్థం చేసుకోవడం కాని పని. కానీ తన పంటల్ని పండించడానికి ఆ ఇంకో మనిషి పని అవసరం వుంది. అలా పని చేయించుకున్నందుకు సరిపడ వేతనం ఆ పనిచేసిన వాడికి చెల్లిస్తూ ఆ వేతనానికి పని చేస్తున్న తనకి తన విజన్ అర్థమవ్వకపోయినా తన పని జరిగిపోతుందనే ఒక పరమార్థంలో ఆలోచన నుంచి డబ్బు అనే ఐడియా పుట్టింది.

అలా వాళ్ళు సంపాదించిన డబ్బు వాళ్లకి ఒక శక్తవుతుంది. వాళ్ళ చేతుల్లో ఉన్న ఆ డబ్బుకి చలనం కలిగించి ఆ శక్తిని వినియోగించాలా...? లేదా దాన్ని చలనం లేకుండా మూలన పెట్టి దాచిపెట్టాలా అనేది వాళ్ళ ఇష్టం. డబ్బుని ఎంజాయ్ చెయ్యాలంటే ముందు జీవితాన్ని ఎంజాయ్ చేయడం తెలియాలి. అలా ఎంజాయ్ చెయ్యాలంటే జీవితమనే షాపులో ఏమేమి ఉన్నాయో తెలుసుకోవాలి. ఉదాహరణకు మీరొక షాపులో గొప్ప మ్యూజిక్ సిస్టమ్ కొన్నారనుకోండి... అందులో నుంచి వచ్చే మ్యూజిక్ ఎంజాయ్ చేస్తారు కానీ ఆ ఎంజాయ్ చేయిస్తున్న మీ మెదడు ఆ షాపులో దొరకదు. అది మీదై మీ జీవితమనే షాపులో వుండాలంతే. డబ్బు ఎందుకు సంపాదించి పొదుపు చెయ్యాలి...? మీ పేదరికాన్ని కప్పి పుచ్చుకోవడానికా...? లేక ఇతరులతో మిమ్మల్ని పోలుస్తున్నప్పుడు మీరు ఉన్నతంగా కనబడాలనా...? అంటే డబ్బు మిమ్మల్ని మీ గౌరవాన్ని పెంచే ఒక కొలత సాధనమా...? కాబట్టి డబ్బు మీ పరపతిని పెంచే తూకమవుతుందంతే.

మీకు ఒక అందమైన భవంతి ఉంటే ప్రత్యేకించి మీ వీధిలో ఇతరులు దాన్ని చాలా అపురూపంగా గొప్పగా చూడొచ్చు. కానీ, మీరు మీ ఇంటి ఇంటీరియర్ డెకరేషన్ పూర్తయిన రెండోరోజే మీ అందమైన భవంతిలో కొత్త కొత్త తప్పులు కనిపెడతారు. అంటే మీరు ఇతరుల్లా మీ ఇంటి అందాన్ని కాకుండా ఇంట్లోని తప్పులు మాత్రమే వెతకడానికి ప్రయత్నిస్తారు. అలాగే మీ భార్యతో మీకు గొడవలుంటే మీరు పనిచేసి ఇంటికొచ్చే టైంకి మీరు ఎంతో అందంగా కట్టించుకున్న మీ ఇల్లు మీకు ఓ కొంపలా కనబడుతుంది.

మీతో వున్న ఒకతను మీకు బోర్ కొట్టిస్తుంటే మీరు ఫైవ్ స్టార్ హోటల్‌లో కూర్చుని కాఫీ తాగినా మీరు ఆనందించలేరు. అదే మీ పక్కన మీకు ఆనందాన్నిచ్చే ఒకతను మీ పక్కనుంటే మీరు రోడ్డు పక్కన కాఫీ తాగినా అది మీకు అద్భుతంగా అనిపించొచ్చు.

ఆహ్లాదకరమైన మన అనుభూతుల్ని ఆస్వాదించ డానికి ఎప్పుడు డబ్బు ఉపయోగపడుతుందో అప్పుడే ఆ డబ్బుకి సార్థకత ఏర్పడినట్టు.

ఎవరైతే డబ్బుని పొదుపు చేయడానికి సంపాదిస్తారో వాళ్ళని నేను లెఖ్ఖ చెయ్యను. ఈ డబ్బు దాయడానికి వెనకున్న కారణం ఏంటో ఇప్పటిక్కూడా నాకు అర్థం కాదు. పుట్టినప్పట్నించి చచ్చేవరకూ జరిగే ఈ జీవన ప్రయాణంలో ఎదురయ్యే కష్ట నష్టాలు, లాభనష్టాల లెక్కలేంటో అసలు నాకు అర్థం కాదు. అదే జీవితమైతే ఇంక పుట్టడం కూడా వ్యర్థమని నా బలమైన అభిప్రాయం.

నా సినిమాలు నిర్మించాలంటే నాకు డబ్బు అవసరం. నాకున్న సామర్థ్యంమేరకు నా సినిమా వ్యాపార పరిధిలో నాకవసరమైనంత డబ్బుని మాత్రమే దానికి వినియోగం అయ్యేలా చూస్తాను. అంతేగాని నేను సినిమాలు చేసేది డబ్బు సంపాదించడానికో లేక

నా బ్యాంక్ బ్యాలెన్స్ పెంచుకోవడానికో కాదు.... నా సినిమా వల్ల నేను సంపాదించిన డబ్బుని నా తర్వాత సినిమా చేయడానికి వాడతాను.

సినిమా తీయటానికి డబ్బు కావాలి కాబట్టి సంపాదిస్తాను. అంతేగాని డబ్బు సంపాదనకి సినిమాలు తియ్యను. నేనెప్పుడూ డబ్బు సంపాదించాలని గానీ దాని గురించి ఆలోచించడంగానీ ఎప్పుడూ చెయ్యలేదు. ఎప్పటికీ చెయ్యను. ఎందుకంటే డబ్బుకి చలనశక్తిని ఇవ్వాలనేది నా సిద్ధాంతం. ఒక్కోసారి నేను తీసిన సినిమా ఆడకపోవచ్చు, కానీ దానికి ఖర్చుపెట్టిన డబ్బు ఎక్కడికి పోదు. ఆసినిమాకి చాలామంది కలిసి పనిచేయడంవల్ల వేతనాల రూపంలో వాళ్లందరి చేతుల్లోకి ఈ డబ్బు చేరుతుంది. అంటే దానికి చలన శక్తి వస్తుంది. అది వాళ్ళు జీవించటానికి ఉపయోగపడుతుంది. నేను డబ్బుని పోగొట్టుకోవచ్చు గాని నా ఐడియాలతో ఆ డబ్బుని మళ్లీ పుట్టించగలను.

ఆలోచనలు, భావనలు అనేవే మన నిజమైన ఆస్తులు. ఆవిధంగా అయితే నాకు సంబంధించినంతవరకూ నా అకౌంట్‌లో వున్న నా ఆలోచనలు, భావనలు బట్టి నేను మాహా ఆస్తిపరుణ్ణి, ఇంకా ఎప్పటికీ ఇలానే వుంటా కూడా... నేను ఎన్నో వేలసార్లు చెప్పినట్టు.... "నాకోసమే నేను బతుకుతాను..."

నా జీవితంలో అతి పెద్ద ఫ్లాప్

1994లో నేను ఒకరోజు ఉదయం చెన్నై నుంచి హైదరాబాద్ వచ్చి అదేరోజు సాయంత్రం ఫ్లైట్ పట్టుకుని ముంబాయి వెళ్లాల్సి ఉంది. ఆరోజు మధ్యాహ్నం చిన్న కునుకు తీస్తున్న నన్ను మా చెల్లి సడెన్‌గా లేపి మా దూరపు కజిన్ అయిన బుజ్జి భీమవరం నుంచి ఫోన్ చేశాడని చాలా అర్జెంట్‌గా నాతో మాట్లాడాలన్నాడని చెప్పింది. (ఆరోజుల్లో సెల్‌ఫోన్స్ లేవు.) బుజ్జికి నాతో అంత అర్జెంటేంటని చిరాకుతో లేచా. ఎందుకంటే బుజ్జి నాకసలు అంత క్లోజ్ కూడా కాదు. ఫోన్ దగ్గరకి వెళ్ళి హలో... అనగానే అవతల నుంచి బుజ్జి... నాన్నగారికి హార్ట్ ఎటాక్ వచ్చిందని చెప్పాడు. తన నాన్నగారు నాకు బాగా తెలుసు, నేను ఎలా ఉన్నారు అని అడిగే లోపల నన్ను "ఒంటరిగా ఉన్నావా... లేక ఎవరైనా ఉన్నారా?"అని అడిగాడు. నేను లేదు... పక్కన వేరే వాళ్లున్నారని చెప్పాను. దాంతో నన్ను బయటికొచ్చి తనకి ఫోన్ చెయ్యాల్సిందిగా చెప్పాడు. ఇంటి నుంచి బయటికొచ్చి మా రోడ్డు చివరలో ఉన్న ఎస్టీడీ బూత్ దగ్గరికి బయల్దేరాను. బుజ్జి వాళ్ళ నాన్నగారి హార్ట్ ఎటాక్ వివరాల గురించి నాకెందుకు ఒంటరిగా చెప్పాలి అని ఆలోచిస్తూ... బూత్ దగ్గరికి నడుస్తుండగా మొదటిసారి నాకు అర్థమైంది... బుజ్జి మాట్లాడుతుంది మా నాన్నగారి గురించని. వెంటనే వెనక్కి తిరిగి నాతో వస్తున్న మా బావగార్ని అడిగా... నాన్నగారు ఎక్కడున్నారని...? దానికి మా బావగారు... నిన్న ఆయన భీమవరం వెళ్లారని సమాధానమిచ్చారు.

నా భయం నిజమైంది. నేను బుజ్జికి కాల్ చేశాను. తను ఆ విషయాన్ని కన్‌ఫర్మ్ చేసి నాన్నగారు పోయారని చెప్పి మీరంతా ఇక్కడికొస్తారా...? లేక బాడీని హైదరాబాద్ తీసుకురమ్మంటారా అని అడిగాడు. నేను తనకి బాడీనే హైదరాబాదు తీసుకురమ్మని చెప్పాను. తర్వాత మా బావగారితో ఈ విషయం చెప్పగానే ఆయన షాక్‌తో రోడ్డు మీదే అలాగే అక్కడే కూర్చుండిపోయాడు. నాకు మాత్రం నా ఆలోచనలన్నీ ఈ విషయాన్ని మా అమ్మకి ఎలా చెప్పాలనే దాని చుట్టూ తిరుగుతూ నాన్నగారు పోయారన్న మాట నా తలకెక్కలేదు. మా బంధువులు కొంతమందికి ఫోన్ చేసి విషయం చెప్పి... ఈ విషయాన్ని మా అమ్మకి నేను చెప్పేంత వరకూ కూడా ఎవరూ మా ఇంటికి రావద్దని చెప్పాను.

ఎస్టీడీ బూత్ నుంచి ఇంటికి తిరిగి వెళ్తూ మా అమ్మకి ఈ విషయాన్ని ఎలా చెప్పాలా అని శరవేగంతో ఆలోచించడం మొదలుపెట్టాను. ఇంటికి వెళ్ళిన తర్వాత మా

అమ్మతో... నాన్నగారికి ఛాతిలో చిన్న నొప్పి వచ్చిందంట... అందుకని మెడికల్ ఫెసిలిటీస్ ఎక్కువ ఉంటాయని నాన్నగారిని హైదరాబాద్ తీసుకురమ్మన్నానని చెప్పాను. మా అమ్మ మొహంలో ఒక్కసారిగా వచ్చిన భయం చూసి వెంటనే నవ్వు నటిస్తూ అది చిన్న నొప్పే దానికి అనవసరంగా కంగారెందుకు అన్నాను. నా ప్రయత్నమంతా మా నాన్నగారి బాడీ ఇంటికి చేరేలోపు మా అమ్మ ఏడుపు టైం తగ్గించాలని. అలాగే అసలు విషయం అమ్మ జీర్ణించుకొనేలా చెప్పడానికి నాక్కూడా టైం కావాలి. నేను ఈ విషయం గురించి నా మనసులో చాలా స్క్రీన్‌ప్లేలు అనుకున్నాను. తర్వాత ఒక స్క్రీన్‌ప్లేని డిసైడ్ చేసుకుని కొంతమందిని మా రోడ్డు చివర ఉంచి ఎవరైనా అత్యుత్సాహం ప్రదర్శించే బంధువులు మా అమ్మని ఓదార్చడానికి వస్తే వాళ్ళని రాకుండా అడ్డుకోమని చెప్పాను. అదే టైంలో నా ఫ్రెండ్ ఒకడితో ఒక ఫోన్ సంభాషణ సెటప్ చేసి... మా అమ్మ ముందు... అతను మా నాన్నగారిని తీసుకొస్తున్న వాళ్ళతో మాట్లాడుతున్నట్టు సీన్ క్రియేట్ చేసి... మా నాన్నగారికి దారి పొడవునా కొంచెం కొంచెం నొప్పి పెరుగుతున్నట్టు బిల్డప్ ఇచ్చాను. ఇది మా అమ్మని నెమ్మదిగా సిద్ధం చెయ్యటానికి నేను ఎన్నుకున్న నాస్క్రీన్ ప్లే.

ఈ నా డైరక్షన్ పూర్తయ్యే సరికి బాగా రాత్రి అయిపోయింది. రాత్రి రెండు గంటల సమయంలో మా కజిన్, బాడీ వచ్చిందని చెప్పాడు. నేను బయటికొచ్చి బాడీని తీసుకొచ్చిన కారును చూశాను. మా కజిన్‌తో ఇప్పుడు బాగా రాత్రి కనుక బాడీని తన ఇంటికి తీసుకెళ్ళమని ఉదయం బాడీని తీసుకొస్తే అప్పుడు అమ్మకి నిజం చెప్పి అంత్యక్రియలు చేయడానికి వెంటనే ఏర్పాట్లు చెయ్యొచ్చని చెప్పాను. ఎందుకంటే మా అమ్మని బాడీ దగ్గర ఉదయం వరకూ ఏడుస్తూ కూర్చోటం చూడలేక. ఉదయం 5 గంటల ప్రాంతంలో మా తాతగారు మా అమ్మకి అసలు విషయం చెప్పేశారు.

మా అమ్మ ఏడుస్తుండగా మా అంకుల్ నా దగ్గరికొచ్చి మా నాన్నగారు తన కళ్ళని, తన అవయవాల్ని దానం చేయాల్సిందిగా రాసిన ఒక విల్లు గురించి చెప్పారు. మా బంధువులంతా అలా అవయవాలు దానం చెయ్యొద్దని అది సంప్రదాయానికి విరుద్ధమని నన్ను ఆ పనికి ఒప్పుకోవద్దని చెప్పారు. కానీ నేను మా నాన్నగారి కోరిక తీర్చాలనుకుని వెళ్ళి మా అమ్మతో చెప్పాను... దానికి తను నాకేది కరక్ట్ అనిపిస్తే అది చెయ్యి అని ఏడుస్తూనే చెప్పింది. కళ్ళ ఇనిస్టిట్యూట్‌కి కాల్ చేసిన కొద్దిసేపటికి ఆటోలో ఇద్దరు నర్సులు వచ్చారు. వాళ్ళు ఆటోలోంచి దిగుతూ ఏదో ఒక జోక్ వేసుకుని నవ్వుకోవడం నాకింకా గుర్తుంది. మా ఇంటి చుట్టూ వున్న ఏడుపులకి వాళ్ళ నవ్వులకి అసలు పొంతనే లేదు. వాళ్లు అందర్నీ బయటికి పంపించి టెక్నికల్ ప్రొసీజర్ ప్రకారం కళ్లు తీసుకుని హాస్పటల్‌కి వెళ్లిపోయారు. తరువాత మళ్లీ అందరూ నాన్నగారి బాడీ వున్న రూమ్‌లోకి వెళ్ళారు. నేను లోపలకి వెళ్లే సరికి మా అమ్మ మా నాన్నగారి కళ్ల చుట్టూ వున్న రక్తపు మరకల్ని చూడటం గమనించాను... వాళ్ళు కళ్లు తీస్తున్నప్పుడు అయిన రక్తపు మరకలని నాకర్థమైంది.

నేను చేసిన భయంకరమైన తప్పుకి నా మీద నాకు విపరీతమైన కోపం, అసహ్యం వేసింది. ఎందుకంటే మా అమ్మతో నలభై ఏళ్ళపాటు జీవించిన మా నాన్నగారి కళ్ళంటే తనకి చాలా ఇష్టమని అమ్మ తరచూ చెప్తుండేది. నేను ఈ నిర్ణయం తీసుకోవడానికి కారణం కేవలం మా నాన్నగారి చివరి కోరిక తీర్చాలనే. కానీ దానివల్ల సంభవించిన ఇలాంటి పరిణామాలు గురించి నేను ప్రాక్టికల్‌గా థింక్ చేయలేకపోయాను. మా నాన్నగారిని ఆ పరిస్థితిలో అమ్మకి చూపించడం నేను నా జీవితంలో తీసిన అతి పెద్ద ఫ్లాప్.

తర్వాత రోజు మా అమ్మతో ఏడో రోజు అని, పదకొండో రోజని కార్యక్రమాలు పెట్టొద్దు ఎందుకంటే ఆయన జ్ఞాపకాలు, మధుర స్మృతులు గుర్తుంచుకోవాలిగానీ, ఆయన పోయారని ఎవరో చూపించే జాలి, దయ మనకెందుకు అన్నాను. అన్ని విషయాల్ని పాజిటివ్‌గా తీసుకోవాలని చాలా పెద్ద లెక్చర్ ఇచ్చాను మా అమ్మకి. అలా లెక్చరిచ్చిన తర్వాత రోజు మా అమ్మ తన గదిలో ఏడుస్తుండడం గమనించి నా లెక్చర్ పనిచేయలేదని నేను కష్టపడి చేసిన సినిమా ఫ్లాపైనంతగా ఫీల్ అయ్యాను. ఆరోజు మధ్యాహ్నం మెట్లెక్కుతుంటే అప్పటివరకూ వినని ఒక కొత్త శబ్దం విన్నాను. లోపలికి చూస్తే నా తమ్ముడు ఏడుస్తున్నాడు. అదే మొదటిసారి తన ఏడుపు వినడం. నాలో నేను నా తమ్ముడి ఏడుపు సౌండ్ అలా ఉంటుందా అనుకున్నాను. మొత్తం ఈ జరిగిన ప్రోసెస్‌లో నాకు ఒక్క క్షణం కూడా ఎలాంటి బాధ గానీ, విచారంగానీ లేదు. ఎందుకంటే, నేను అక్కడి వాతావరణాన్ని, వేరే వాళ్ళ భావోద్వేగాల్ని డైరెక్టు చెయ్యటంలోనూ గమనించడంలోనూ బిజీగా ఉన్నాను.

దీని తర్వాత కొన్ని రోజుల తర్వాత ముంబాయి వెళ్లాను. నా ఒక కొత్త సినిమాకి సంబంధించిన ఒక కాస్టింగ్ విషయంలో నసీరుద్దీన్ షాని కలవటానికి ఆయన ఇంటికి వెళ్ళాను. ఆయన నన్ను చూడగానే ఆప్యాయంగా పలకరించి మా అమ్మ పోయినందుకు తన విచారం వెలిబుచ్చి నన్ను ఓదార్చడానికి ప్రయత్నించారు. ఎవరో ఆయనకు తప్పుడు సమాచారం అందించారని నాకర్థమైంది. ఆయన్ని ఇబ్బంది పెట్టటం ఎందుకని నేను కూడా అసలు విషయం చెప్పలేదు. నేను చెప్పలేదు కనుక ఆయన వాళ్ళ అమ్మ గురించి ఇవీ అవీ చెప్పి, మా అమ్మ పోవటం మా నాన్నగారు ఎలా తీసుకున్నారని అడిగారు. నేనింక అప్పుడు ఆయనకి అసలు విషయం చెప్పాల్సొచ్చింది. ముందే ఎందుకు చెప్పలేదని ఆయన నన్ను కోపంతో ఒక వింత జంతువుని చూసినట్టు చూశాడు.

సుమారు 10 సంవత్సరాల తర్వాత... నేను నానా పటేకర్ ఇంట్లో అబ్‌తక్ చప్పన్ డిస్కషన్స్‌లో ఉండగా నాతోపాటు డైరెక్టర్ షిమిత్ అమిన్, అబ్‌తక్ చప్పన్ రైటర్ సందీప్ ఉన్నారు. ఒక సీన్ సందర్భం గురించి వివరిస్తూ ఉదాహరణగా మా నాన్నగారి ఎపిసోడ్‌ని, ఆ నర్సులు కళ్లు తీసుకెళ్లడం, తదనంతర పరిణామాలు గురించి నానాపటేకర్‌కి నేను

వివరంగా చెప్తున్నప్పుడు నాకు సడెన్‌గా మాట బొంగురుపోయి కంట్రోల్ లేకుండా ఏడవటం మొదలుపెట్టాను. నానాపటేకర్ నన్ను తన చేతుల్లోకి తీసుకుని నన్ను గట్టిగా పట్టుకుని ఓదార్చాడు. మా నాన్నగారు పోయిన 10 సంవత్సరాల తర్వాత నేను ఏడ్చాను. ఇదే నా జీవితంలో అతి పెద్ద ఫ్లాప్.

నా ప్రపంచం

కంటితో చూస్తాం, చెవులతో వింటాం, చర్మంతో స్పర్శానుభూతి పొందుతాం. ఈ జ్ఞానేంద్రియాలు చేసేవన్నీ మెదడు నిర్వర్తించే కార్యకలాపాలే. మెదడు అంటే ఆలోచన, భావన తప్ప ఇంకేమీ కాదు. నేను కళ్లు మూసుకుని రాత్రి నిద్రపోగానే, నా మొత్తం ప్రపంచం నాకు సంబంధించినంత వరకూ అంతమైపోతుంది. తిరిగి ఉదయం నిద్రలేవగానే, మళ్లీ ఆవిష్కృతమవుతుంది.

ఆ ప్రపంచం ఈ భూగ్రహం మీద నిద్రపోయి లేచిన ప్రతి మనిషికీ, ప్రతి జంతువుకీ, ప్రతి క్రిమికీటకానికీ ఒక్కో విధంగా ఆవిష్కృతమవుతుంది. అది ఆ ఒక్కరికి మాత్రమే ప్రత్యేకమైన ప్రపంచం. దాన్ని చూడటం గానీ, అందులోకి వెళ్లి అనుభూతించడం గానీ వేరెవరికీ సాధ్యం కాదు, తమదైన ఆ ప్రపంచంలో ఉన్నవాళ్లతో ఇతరులకి ఎంత సాన్నిహిత్యం ఉన్నప్పటికీ. వాళ్ల వాళ్ల వ్యక్తిగత అనుభవాలు, వాళ్ల వాళ్ల ఉద్వేగాలు, వాళ్ల వాళ్ల జ్ఞానం, వాళ్ల వాళ్ల తెలివితేటల స్థాయిల మీద ఆధారపడి, వాళ్ల వాళ్ల ప్రపంచాలు వాళ్ల వాళ్లకి అనుగుణంగా నిర్మితమై ఉంటాయి.

అలాగే, నా ప్రపంచం కూడా నాకు మాత్రమే సంబంధించిన నా ఉద్వేగాలు, నా ఆలోచనలు, నా భావనల సమాహారం. కాబట్టి, నా ప్రపంచంలోకి వచ్చిన ఇంకెవరైనా, నేను ఎలా అనుకున్నానో నాలాగే వాళ్లూ అనుకోవాలనుకోవడం, నన్ను అభినందించాలనుకోవడం, నన్ను అర్థం చేసుకోగలరనుకోవటం నా భ్రమే అవుతుంది. ఎందుకంటే వాళ్ల ప్రపంచాన్ని నేను అనుభవించలేనట్టే నా ప్రపంచాన్ని వాళ్లు అనుభవించలేరు.

'నా సినిమాలు నాకోసం చేసుకుంటాను' అని నేను తరచూ అనే మాటకు నిజమైన అర్థం ఇది. ఎవరూ మనం చెప్పాలనుకున్నదాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేరని నాకు పూర్తిగా అర్థమైనప్పుడు, వాళ్లకు అర్థం అయ్యేటట్టు ప్రయత్నించడంలో అర్థం ఏముంది? అందుకే, నా ప్రపంచంలోకి రావడానికి ఆసక్తి ఉన్నవాళ్లకు నా సినిమాల ద్వారా బహిరంగ ఆహ్వానం పలుకుతాను. ఇక వాళ్లు వచ్చిన తరువాత దాన్ని ఎలా అర్థం చేసుకుంటారు, ఎలా వ్యాఖ్యానించు కుంటారు, ఎలా ఇష్టపడతారు, ఎలా ద్వేషిస్తారు అనేది వాళ్లకే వదిలేస్తాను.

నా సినిమా కూడా నా ప్రపంచం తప్ప మరోటి కాదు. ఆ ప్రపంచాన్ని నిర్మించడానికి చాలామంది పనిచేస్తుండవచ్చు. కాని వాళ్లందరూ రంగులద్దేది నా ఊహకే.

ఒక సినిమాకు సంబంధించి దర్శకుడు ప్రాథమిక కళాకారుడు కాదు. ఒక నటుడు నటిస్తాడు, ఒక సంగీత దర్శకుడు సంగీతాన్ని సృష్టిస్తాడు, ఓ రచయిత సంభాషణలు రాస్తాడు... ఇలాంటి ఎన్నో ప్రాథమిక కళల కలయికతో ఒక భావోద్వేగాన్ని సృష్టించడానికి వీలుగా వీటన్నింటినీ దర్శకుడిగా నేను ఏకీకృతం చేస్తాను. నేను ఏ సంగీతం వినాలని అభిలషిస్తున్నానో, అదే సంగీతం ప్రేక్షకుడికి వినబడుతుంది. ఏ రకమైన నటన చూడాలని భావిస్తున్నానో అదే నటన తెరమీద కనబడుతుంది.

కాబట్టి, నేను ప్రేక్షకుడికి ఏది ఎలా అందాలనుకుంటున్నానో, అదే ఆయా నటీనటులు, సాంకేతిక నిపుణులు అందజేస్తారు. ఈ అవగాహన నాకు స్పష్టంగా ఉంది కాబట్టే, ఒక సినిమా హిట్ అయితే దాని ఫలితం అందరిదీ అని, ఫ్లాప్ అయితే దానికి బాధ్యుణ్ని నేనే అని భావిస్తాను. ఎందుకంటే, నేను చేస్తున్న ఆ సినిమాకు ఏవి కావాలో వాటిని అందించడానికి నా దృక్పథంలో వాటిని చూసి వాళ్ల వాళ్ల శక్తిసామర్థ్యాల మేరకు పూర్తిస్థాయిలో వాళ్లు పనిచేస్తారు.

ఎవరి వల్ల సినిమాలోని నా ఏ ఊహ మెరుగుపడిందో కేవలం నాకు మాత్రమే తెలుస్తుంది. అందుకే, ఓ సందర్శకుడు నా ప్రపంచంలోకి అడుగిడి, తను ఆశించింది దొరక్క ఆశాభంగం చెంది, అసంతృప్తిగా బయటికి వెళ్తున్నాడంటే అది కచ్చితంగా కేవలం నా ఒక్కడి ఫెయిల్యూరే. కాని, ఆ సందర్శకుడికి ఏదైతే నచ్చిందో అది నాది కాక మరొకరి కంట్రిబ్యూషన్ వల్ల కావచ్చు.

మీ ప్రపంచం ఏంటో మీకు స్పష్టంగా తెలిసుంటే, మీరు దాన్ని అర్థం చేసుకొనుంటే, దాన్ని ఎలా నిర్మించాలనుకుంటున్నారో మీకంటూ ఒక స్పష్టత ఉంటే, మీ జీవితం మీకు మాత్రమే సంబంధించిన మీ కాల్పనిక ప్రపంచం అవుతుంది.

ఆ నా సొంతమైన నా కాల్పనిక ప్రపంచంలో నాకు ఉండేవి... సర్కార్ లాంటి శక్తివంతమైన వ్యక్తులు, గాఢమైన సంగీతం, శ్రీదేవి లాంటి అందంతో కూడిన శృంగారభరిత స్త్రీలు, వోడ్కా లాంటి డ్రింకులు, గ్యాంగ్‌స్టర్లు, దయ్యాలు, నేను ఎలా కావాలనుకుంటే అలా వక్రీకరించుకోగలిగే వేరు వేరు ఫిలాసఫీలు మాత్రమే. ఇక సామాజిక బాధ్యతలు, కుటుంబ విలువలు, అత్యున్నత ఆదర్శాలు, దేవుళ్లు, పెళ్లిళ్లు, పిల్లల చదువులు లాంటి చాలామంది జీవితాలకి సంబంధించిన వాస్తవాల మాట ఎత్తితే నేను నా కళ్లు మూసుకుని నిద్రకు ఉపక్రమిస్తాను...

గమనిక : మీ ప్రపంచంలో మీరుండండి. నా ప్రపంచంలో నేనుంటాను.

నా గురించి ఇతరులు

నేను తెలిసిన, నాకు తెలిసిన, నన్ను పరిశీలించిన, నాగురించిన కొందరి కొన్ని అభిప్రాయాలు ఈ తరువాయి శీర్షికలో ఉన్నాయి.

నాగురించి నాకు తెలిసినదానికన్నా నన్ను తెలుసుకున్న వాళ్ల నుంచి నా గురించి తెలుసుకోవడమనేదే నిజమైన తెలుసుకోవడం అనేది నాకు నా గురించి తెలుసు అనుకున్నవాళ్లనించి తెలిసింది.

Blank Page

నా కొడుకు రాము

– సూర్యావతి

ఒకసారి మా నాన్నగార్ని (ఆయన ఇంజనీర్) సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజి ప్రిన్స్‌పాల్ గారు రైల్వే స్టేషన్ లో కలిసారు. మీ మనవడు (రాము) క్లాస్‌లకు రాడు, చదవడు, ఆ విషయం రాము తల్లిదండ్రులకు చెప్పండి అని చెప్పారట. మా నాన్నగారు నాతో చెప్పారు. నాకు ఏం చెయ్యాలో అర్థం కాలేదు. అంతకు ముందే ఇంజనీరింగ్ కాలేజ్ నుంచి రాము నాన్నగారికి లెటర్ వచ్చింది. నేను మీరు వెళ్ళి ప్రిన్స్‌పాల్ గారిని కలిసిరండి అని చెప్పాను ఆయన వెళ్ళనన్నారు. "నేను వెళ్లి ఆయనను కలిస్తే జరిగేదేముంది. ఏదో ఒకటి అవనీ నేను చెప్తే తప్పితే తెలుసుకోలేని వాడు కాదు" అన్నారు.

చిన్నప్పుడు రాము 3 సంవత్సరాల వయస్సులో "అమ్మ నేను కూసులు కి వెళ్ళను" (కూసులు అంటే స్కూలు) అని ఏడ్చేవాడు. రాము నాన్నగారు వెళ్ళనంటున్నాడు కదా వదిలేయి అనేవారు. రాము నాన్నగారికి పిల్లలని తిట్టడం, కొట్టడం ఇష్టం ఉండేది కాదు. ఆయన స్టూడియోకి వెళ్ళిన తరువాత 2 దెబ్బలు వేసి నడిపించి తీసుకొని వెళ్ళి దించి వచ్చేదాన్ని. స్కూలు మా ఇంటి దగ్గరే. మా అమ్మాయి (రాము చెల్లెలు) కూడా అంతే. కడుపు నొప్పి, కాలు నెప్పి అనేది. ప్రోగ్రెస్ రిపోర్టు నాకు తెలియకుండా ఆయనతో సంతకం పెట్టించుకొని వెళ్ళిపోయేది. తరువాత నేను అడిగితే టీచర్ ఇవ్వలేదు అనేది. రాముకి ఒక సారి 30 మార్కులు వస్తే ఒక సారి 90 మార్కులు వచ్చేవి. తనకి రాక కాదు. సగం పేపర్ వ్రాసి వచ్చేసేవాడట. నేను తిట్టినా, కొట్టినా ఏమీ మాట్లాడేవాడు కాదు. సైలెంట్‌గా వుండేవాడు. రాము ప్రవర్తన చూసి నాకు చాలా బాధగా వుండేది. పిల్లోడు ఏమైపోతాడో అని, నన్ను అర్థం చేసుకోవడం లేదని.

3 సంవత్సరాల వయస్సులో A, B, C,D లు poems, tables ఒక్కసారి చెబితే వచ్చేసేవి. రాము నాన్నగారు చూసావా నువ్వు ఒక్క సారి చెబితే వచ్చేసాయి అనేదాకా నేను ఆ విషయాన్ని గమనించలేదు.

రాముకి సినిమాలు అంటే చాలా పిచ్చి, నాకు చదువుకోక పోతే ఏ మయిపోతాడో అని బెంగ, బాధ. రాము నాన్నగారికి మనస్సులో ఏముండేదో నాకు తెలియదు. ఆయన పిల్లల విషయంలో సహకరించడం లేదని బాధ. ఉక్రోషం, నిస్సహాయతతో పిల్లల పట్ల చాలా కఠినంగా ఉండవలసి వచ్చింది.

సినిమాలు నిన్ను ఏమీ ఉద్ధరించవు అని చాలా కోప్పడేదాన్ని. నేను తిడితే మా చెల్లెలి ఇంటికి వెళ్ళి 2 రోజులు ఉండివచ్చేవాడు. రాముని మా తమ్ముడు బాగా సినిమాలకి తీసుకొని వెళ్ళేవాడు. ఒక రోజు మా తమ్ముడిని కబురు పంపి "నా కొడుకొని చదువు మానిపించి సినిమాలకు తిప్పుతావా" అని అడిగాను. "నీ కొడుకుని నీవు అదుపులో పెట్టుకో నన్ను అడగకు" అన్నాడు. నేను నిజమే కదా అనుకున్నాను.

రాము ఎప్పుడు గట్టిగా మాట్లాడటం గాని, ఎదిరించడం గాని, డబ్బులు తీసుకోవడం గాని చేయలేదు. తల్లి తండ్రులని ఎప్పుడు ఇబ్బంది పెట్టలేదు ఏ విషయంలోను కూడా.

రాము 8 వ తరగతిలో ఉండగా హోమ్ వర్క్ చేయిస్తూ అమెరికాలో పిల్లలు చదువుకుంటూనే పార్ట్ టైమ్ చేస్తారట అన్నాను. తరువాత తెల్లవారు జామున 4 గంటలకి లేచి వెళ్ళేవాడు. నేను కరాటే నేర్చుకోవడానికి వెళ్తున్నాడు అనుకున్నాను. 2, 3 నెలలు వెళ్ళి ఉంటాడు. తరువాత నాకు తెలిసింది పార్ట్ టైమ్ జాబ్ గా పేపర్ వేస్తున్నాడని. ఆ సంగతి తెలిసి నా మనస్సు చాలా బాధపడింది.

మా నాన్నగారు ఇంజనీరుగా 12 సంవత్సరాలు నాగార్జున సాగర్ డామ్ మొదలు పెట్టినప్పటి నుంచి పూర్తి అయ్యేవరకు ఉన్నారు. G.V.K., సుబ్బరామిరెడ్డి ఆ టైములో అక్కడ కాంట్రాక్టర్స్. మా నాన్నగారికి వారు ఫ్యామిలీ ఫ్రెండ్స్. అంతే కాకుండా ఇంజనీర్, కాంట్రాక్టర్స్ సంబంధం కూడా ఉండేది.

రాము ఇంజనీరింగ్ పూర్తయ్యింది. ఆ రోజుల్లో (1984 సం.) గవర్నమెంటు ఉద్యోగాలు అంత తొందరగా దొరికేవి కావు. G.V.K. తో ఉన్న స్నేహంని బట్టి మా నాన్నగారు రాముని Taj Krishna లో సైట్ ఇంజనీర్‌గా జాయిన్ చేసారు.

ఆఫీసుకు బలవంతంగా వెళ్ళేవాడు. అమ్మా మనకి డబ్బులేనందుకే కదా నేను ఇష్టం లేక పోయినా ఈ ఉద్యోగానికి వెళ్ళాల్సి వస్తోంది అన్నాడు. "అంటే డబ్బు ఉంటే మాత్రము ఈ వయస్సులో తిని కూర్చుంటావా" అని అన్నాను. ఇంట్రస్ట్ లేకుండా వెళ్ళేవాడు. వారానికి నాలుగు రోజులు తాత గారింటికి(మా నాన్నగారు) వెళ్ళి ఆఫీసు అయిపోయిన టైము తరువాత ఇంటికి వచ్చేవాడు అని నాకు తరువాత తెలిసింది. నాకు కోపం కన్నా బాధ ఎక్కువ అనిపించేది. సినిమాలకి ట్రై చేస్తున్నాడని నాకు తెలియదు. తనకి సినిమా డైరెక్టర్ అవ్వాలని చాలా కోరిక ఉన్నా తల్లిదండ్రుల గురించి కూడా అంతే ఎక్కువగా ఆలోచించేవాడు.

కుటుంబం గురించి ప్రేమ ఉన్నందుకే తమ్ముడి చదువు, అమ్మ, చెల్లెలు, ఏది కావాలన్నా కొనుక్కునేటట్లుగా డబ్బులేదని ఏదీ మానుకోకూడదు. ఇంట్లో అందరూ Comfortable లైఫ్ లీడ్ చెయ్యాలి అనే ఉద్దేశ్యంతో వీడియో షాపు పెట్టాడు. మేము నిన్ను ఇంజనీర్‌గా చదివించింది వీడియో షాపు పెట్టడానికా, వీడియో షాపు రన్

చేయడానికి 10th Class చాలు అనే దాన్ని. దేనికీ ఎదురు చెప్పేవాడు కాదు. తను చేయదలుచుకున్నది మానేవాడు కాదు. తరువాత వీడియో షాపు చాలా సక్సెస్ అయ్యింది. రోజుకి రెండు వేలు వచ్చేది (1988 లో). షాపులో ఒక అబ్బాయిని కూర్చోబెట్టి తను సినిమా తీయాలనే పట్టుదలతో తిరుగుతూ ఉండేవాడు. ఒక రోజు నేను సినిమా ఫీల్డ్ లో నిన్ను బాగా తిప్పుకుంటారు నీకు ఏమీ అవకాశం ఇవ్వరు, షాపులో వచ్చే ఆదాయం మనకి చాలులే అనేదాన్ని. షాపు కూడా నాకు ఇష్టం ఉండేది కాదు కాని సినిమా ఫీల్డ్ కంటె బెటర్ అని.

ఈ లోపున నైజీరియాలో రాముకు ఉద్యోగం వచ్చింది. నెలకు 16 వేల రూపాయిల జీతం. రాము చదువుకున్న చదువుని గుర్తించి వచ్చిన ఉద్యోగం. మాకు ఇష్టం, మంచిది అని ముందు వెళతానన్నాడు. తరువాత వెళ్ళనన్నాడు. ఏదీ వినడు ఎలాగ అనుకున్నాను.

ఒక రోజు "సురేందర్ సినిమా డైరెక్టర్ ఛాన్స్ ఇస్తానన్నారమ్మ" అన్నాడు. నువ్వు చిన్నపిల్లాడివి ఆ పెద్దవాళ్ళు అలాగే అంటారు నువ్వు నమ్మకు నీ చదువుకి తగిన ఉద్యోగం నైజీరియాలో ఉంది అక్కడకి వెళ్ళు అన్నాను. రాము నాకు బైటకి వెళ్ళడం ఇష్టం లేదు అన్నాడు.

తరువాత వీడియో షాపులో వచ్చే డబ్బు మనకి చాలు సినిమా ఫీల్డ్ నాకు ఇష్టం ఉండదు. అమ్మాయిలు, డ్రింక్‌లు వద్దులే అన్నాను. ఈ మాటలకి రాము ఇలాంటి మాటలు చెప్పకు అన్నాడు.

రాము చిన్నప్పుడు 10, 12 సంవత్సరాల వయస్సు నుంచి సినిమాలు బాగా చూసేవాడు. మాకు తెలిసి రెండు సార్లు, తెలియకుండా 10, 12 సార్లు చూసేవాడు. ఈ పిల్లాడు ఏమైపోతాడో అని నాకు చాలా బాధగా ఉండేది. అది సినిమా తీయాలనే తపన, పట్టుదల అని "శివ" సినిమా తీసేవరకు అర్థం కాలేదు. కృషి, పట్టుదల, నిజాయితి, తపన, ఓర్పు ఉంటే ఏ రంగంలో అయినా సాధ్యం కానిది లేదు. ధైర్యం, నిజాయితి, కృషి, పట్టుదల, ఓర్పు, వృత్తిపట్ల తపన ఉంటే మంచి ఫలితం వచ్చి శాశ్వతంగా నిలిచి పోతుందన్న సత్యం నాకు రాములో తెలిసింది.

రాము ఒక సారి నాతో అన్నాడు "నిద్రాహారాలు శరీరానికి కావాలి కాని, మెదడుకి కాదు". అంటే కొంచెం నిద్ర, మితాహారం చాలు జీవించడానికి అని. అందరికి ఇదే ఆలోచనే ఉంటే సోమరితనము ఉండదు.

రోజుకు ఇరవై గంటలు పనిచేసినా చేశానని అనుకోడు. పనిని ఎంజాయ్ చేస్తాడు. పని చేసే కొద్ది ఇంకా ఫ్రెష్ గా అయిపోతుంటాడు. తను అనుకున్న పని చేయటమే తనకు రిలాక్సేషన్. ఈ స్వభావం నాకు చాలా నచ్చుతుంది.

రాములో నాకు నచ్చిన స్వభావం

ఇష్టం లేని పనికి ఒక నిమిషం కూడా ఖర్చుపెట్టడు. ఇష్టమయిన పని ఎన్ని గంటలు అయినా పట్టుదలగా ఇష్టంగా చేస్తూ ఉంటాడు.

రాము (ఏదో నాకు తెలియదు) చాలా ఇష్టంగా వ్రాసుకుంటూ ఉంటాడు. ఆ సమయంలో నాకు ఇంట్రస్ట్‌గా హోమ్ వర్క్ చేసుకునే స్టూడెంట్‌లా కనిపిస్తాడు (హోమ్ వర్క్ ఇంట్రస్ట్‌గా చేసేవాడు కాదు అది గతం). తనకి ఇష్టమైన పనిని పట్టుదలగా ఎన్ని గంటలు అయినా చేస్తాడని సినిమా ఫీల్డ్ లోకి వచ్చిన తరువాత అర్థమయ్యింది.

నాకు బాధ కలిగించే విషయం

నాకు బాధ కలిగించే విషయం... చిన్నప్పుడు తనని ఎంత సేపూ చదివించేస్తే చాలు అనే ఆలోచనే తప్ప ఇంకొకటి ఉండేది కాదు. రాము తెలివయిన వాడు. ఇంజనీరింగ్ లో జాయిన్ చేసి ఎంత ఇష్టం లేకుండా చదివినా, పోనీ ఒక సంవత్సరం లేటు అయినా ఇంజనీరు అయిపోతాడు. ఈ డిగ్రీకి చాలా విలువ ఉంటుంది. తెలివి ఉన్నా రాము రిస్క్ తీసుకోకూడదు, అనుకున్నానే కానీ చిన్నప్పుడు తన ఇష్టాన్ని గమనించలేదు. ఇప్పుడు చాలా బాధగా సిగ్గుగా ఉంటుంది. మామూలుగా అతి మామూలుగా పెంచానే తప్ప తనలో ఉన్న తపన అర్థం చేసుకోలేకపోయాను అని బాధ ఇప్పటికీ మనస్సులో గుచ్చుకుంటూనే ఉంది.

తల్లి మీద బిడ్డ చూపించే ప్రేమ ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క రకంగా చూపిస్తుంటారు. తల్లులు కూడా రకరకాలుగా కోరుకుంటారు. ఎవరి ఇష్టం వారిది. మాటలతో, చేష్టలతో చూపిస్తేనే ప్రేమ కాదు. రాముకి నా మీద ఉన్న ప్రేమ ఎలాంటిదో నాకు తెలుసు. తల్లీ బిడ్డల ప్రేమ ఇతరులకి నిరూపించుకోవాల్సిన అవసరం లేదు. అందరూ రాము రాలేదా, ఇవ్వలేదా, ఫోన్ చెయ్యలేదా, మీరు చెబితే వినడా అంటూ ఉంటారు. ఇవన్నీ చాలా చిన్న విషయాలు వీటన్నింటిని మించిన ఒక మంచి భావం, అనుభూతిలో ఉన్న నేను తన తల్లిగా ఎప్పుడూ మనస్సు కష్ట పెట్టుకోలేదు.

రాము సినిమాలు

సినిమాలు చూస్తే పాడయిపోవు అని రాముని కొట్టేదాన్ని కాని ఇప్పుడు తన పేరు తెరమీద చూసినప్పుడల్లా నేను చేసిన పనికి నా మనస్సు చివుక్కుమంటుంది. అలాగే నేను రాంగ్ తను రైట్ అయినందుకు గర్వంగానూ ఉంటుంది.

దేముడు

నా దృష్టిలో దేముడు అంటే నిజాయితీ ఉండి ఇతరులకి హాని చేయకపోవడం పట్టుదల, కృషి, ధైర్యం ఉండి (work is god అంటారు) ఇతరుల మనస్సు నొప్పించేటట్టు

మాట్లాడక పోవడం, అహంకారం ఉండకూడదు. వీటిలో 1% ఆచరించినా దేవుడిని పూజించినట్లే.

సినిమాలు చూసి నేర్చుకోవడం కాదు, ఎవరు ఏ పని చేసినా వారి స్వభావంతో వారు చేస్తారు అని నా నమ్మకం.

శివ సినిమా ప్రివ్యూ చూసిన రోజు నుంచి ఈ నిమిషం వరకు కూడా ఇంత గొప్ప డైరెక్టర్ కి తల్లిగా నాకు ఇంత అదృష్టమా, నాకు రాము కొడుకు అవటం ఏమిటి? ఇది నిజమా, కలా అని ప్రతిరోజు, ప్రతి నిమిషం అనిపిస్తుంది. ఇది పొగడ్తకాదు. ఎవరికీ తెలియకూడదు, చెప్పకూడదు అని అనుకున్న విషయం. పనిలో తన అంకిత భావం చూసి నాకూ పనిచేయాలి (నా పనిలో) అనే పట్టుదల వచ్చింది. చేయలేను అని అనుకోకూడదు అనే భావం వచ్చింది. డైరెక్టరు అయ్యి ఇరవై సంవత్సరాలు దాటినా నాకు మాత్రం తన ప్రతి సినిమా కొత్తగానే అనిపిస్తుంది. తన తీరులో తీసినట్టు అనిపించదు. ఇలా తీయడం రాముకి అలవాటే కదా అని ఎప్పుడూ అనిపించలేదు. ప్రతీ సారి అద్భుతంగా, కొత్తగా అనిపిస్తుంది.

తన దగ్గర పని చేసే ఆర్టిస్టులు, టెక్నీషియన్లు, ఇంట్లో వాళ్ళు ఎవరికయినా వాళ్ళ స్థాయిలో వాళ్ళకి అర్థం అయ్యేటట్టు చెబుతాడు. రెండు, మూడు సార్లు చెప్పినా వాళ్ళు అర్థం చేసుకోలేకపోతే వాళ్ళని పట్టించుకోడు. ఇంకెప్పుడూ ఎంత చిన్న పని అయినా ఆ మనిషికి చెప్పడు. అంతేకాని, అరుపులు, కోపాలు, చిరాకులు ఉండవు.

నేను అప్పుడప్పుడు రాము షూటింగ్ కి వెళ్తుంటాను. తను ఆర్టిస్టుల్లో ఉన్న భయాన్ని, సంకోచాన్ని పొగడతాడు. వాళ్ళల్లో ఉన్న పూర్తి ఆర్టిస్టుని బయటకి తీసుకువచ్చి వాళ్ళతో అద్భుతంగా నటించేటట్టు చెయ్యడం నా కళ్ళతో నేను చూసాను. షూటింగ్ అవుతూ ఉంటే రోజు రోజుకి ఆ ఆర్టిస్టులో confidence పెరుగుతూ ఉండడం నేను గమనించాను. ఫస్ట్ ట్రైం ఆర్టిస్ట్ గా వచ్చిన వాళ్ళు భయంతో వస్తారు. వాళ్ళల్లో ఆ భయాన్ని పోగొట్టి వాళ్ళలో ఉన్న ప్రతిభని రాబట్టుకునే తీరు చాలా బాగుంటుంది.

ఎంత మేధస్సు, స్టేటస్సు, అధికారం ఉన్నా ఓర్పు ఉంటేనే పని ప్రశాంతంగా జరుగుతుంది. గాంధీగారు చెప్పిన మాటలు "సోమరితనం దొంగతనం లాంటిది". గాంధీ గారి మీద నిజంగా అభిమానం ఉంటే ఆయన ఫోటో పెట్టుకోనక్కర్లేదు, ఆయనలో మంచి గుణాలు 1% ఆచరించినా ఆయన్ని గౌరవించినట్లే అంటాడు...

ఓర్పు, ప్రేమ, నిజాయితీతో గెలవలేనిది లేదు. "నీవు ఉన్నట్లు ఇతరులని ఉండమని ఒత్తిడి చేయకు" ఈ మాటలు నాకు చాలా నచ్చాయి.

నాకు అర్థమైన (?) రామ్ గోపాల్ వర్మ

– కృష్ణవంశీ (సినీ దర్శకుడు)

రామ్‌గోపాల్ వర్మ ...

... చాలా మందికి అర్థంకాడాయన... కొద్దిమందికే అర్థం అవుతాడు. ఆ కొద్దిమందీ కూడా అలా అనుకుంటారనేది నా ఉద్దేశం... అసలాయన ఎవరికీ అర్థం కాడనేది నిజం. మనందరం చిన్నతనం నుండి నేర్చుకున్న నేర్పబడిన ఒకానొక జ్ఞానమనే అజ్ఞానంలో (తో) ఈ ప్రపంచంలో బ్రతుకుతున్నప్పుడు.. ఆ (అ) జ్ఞానాన్నంతటినీ ఒకే ఒక మాటతోటో.. ఒక డెసిషన్‌తోటో పగలగొట్టేస్తాడు. మనం అప్పటివరకు ఎంత అజ్ఞానంలో ఉన్నామో అని తాత్కాలికంగా ఒక నిరాశకు గురిచేసి కొద్దిసేపటి తర్వాత మనం స్పృహలోకి వచ్చినప్పుడు "ఏమిటీ మనిషి" అనిపిస్తాడు. చాలా సార్లు చాలా విపరీతంగా అనిపిస్తాడు. ఏమిటీ ఈ విపరీతం అని కొంచెం చనువున్నవాళ్లు (చనువుందని అనుకునే వాళ్లు) అడిగితే అసలు "జీవితానికే అర్థంలేదని" కన్‌ఫ్యూజ్ చేసేస్తాడు. అనుకున్నది చేసేయమంటాడు.. తను చేసేస్తూ ఎప్పుడూ న్యూస్‌లో ఉంటాడు. కాదు న్యూస్ క్రియేట్ చేస్తాడు.

తలతిక్కగా మాట్లాడుతున్నాడు అనిపిస్తుంది కానీ.. అసలు నిజం ఏంటంటే అతను మాట్లాడుతున్న నిజాల్ని ఒప్పుకోవడానికి మన అహంకారం అడ్డొస్తుంటుంది. అందువల్ల అతన్ని తలతిక్క అనేసి మనం జాగ్రత్తపడిపోతాం.

చాలాసార్లు నిజమే చెప్తాడు. ఆ నిజం కోసం అనేక అబద్ధాలు కూడా చెప్తాడు. ...మనందరం 'నిజం' అని నమ్మినదానికి "పచ్చి నిజం" ఏమిటో చూపించి ఆ నిజాన్ని భయపెడ్తాడు. ....భయపెట్టడానికి కొన్ని సినిమాలు తీసి మనందర్నీ నవ్విస్తాడు... మంచి ఆటగాడు కూడా... అన్నీ ఆటలే ఆయనకి, మనుషులతో, వాళ్ల బ్రెయిన్స్‌తో ఎప్పుడూ ఆటలాడుతుంటాడు. వాటి మధ్యలో సినిమాలతో ఆడుకుంటాడు. పాత్రలతో, షాట్‌లతో కొత్తకొత్త టెక్నిక్‌లతో, పబ్లిసిటీతో... ఏంటో... తన ఆటకి ఎవరైనా అడ్డువస్తే వెంటనే వాళ్లని ఔట్ చేసేస్తాడు. తన ఆటని సీరియస్ గా తీసుకుని డబ్బులిచ్చి చప్పట్లు కొడుతూ అరుస్తూ అప్పుడప్పుడూ తిడుతున్న జనాల్ని చూసి హాయిగా నవ్వుతుంటాడు. ఊరికే టైటిల్స్ పెట్టి కొంత మందిని ఏడిపిస్తాడు. ఏంటీపని అని ఎవరైనా కోప్పడితే 'లెట్స్ డిస్కస్' అని టీవి స్టూడియోలో 'లైవ్' లో కూర్చొని వాళ్ల మతి పోగొడతాడు. బోర్ కొడితే

లైవ్ ప్రోగ్రామ్ మధ్యలోనే నిర్మొహమాటంగా లేచి వెళ్లిపోతాడు... నా షూటింగ్‌కి టైమ్ అయిందంటూ... రాత్రుళ్లు మన రూమ్ బయట ఉన్న చీకట్లో ఏముందో మనకు తెలీదంటూ (రాత్రి సినిమాలో ఓంపురి డైలాగ్ - రాముగారు చెబితే నేనే ఫెయిర్ చేసాను) మన చుట్టూ వున్న సొసైటీలోని చీకటి ప్రపంచం మీదకి తన సినిమా లైట్ వేసేస్తాడు. ఆ చీకటి ప్రపంచం ముసుగుని తీసేసి నగ్నంగా నిలుచోబెడతాడు. అది బోర్ కొడితే అప్పుడప్పుడూ అందమైన అమ్మాయిల బట్టలు కూడా విప్పేసి మన చీకటి ఆశలకు (Secret Desires) సేద తీరుస్తాడు.

మనిషికి Basic Instincts (భయం, నిద్ర, ఆహార మైథునాలు) తప్ప ఏదీ నిజం కాదంటాడు. .. నిజవేనేమో... ఇలా రాసుకుంటూ పోతే.. "రాంగోపాల్ కోటి" అయిపోయేలా వుంది.

ఇక నా వరకూ వస్తే నేనెంత అజ్ఞానంలో వున్నానో అని నాకు ఆయన పరిచయమైన తర్వాతే తెలిసింది. అందుకే నా అజ్ఞానాన్ని నాకు పరిచయం చేసిన ఆయనంటే నాకు చాలా అసహ్యమేసేది.. కోపమొచ్చేది. కానీ అది ఆయన మీద కాదు.. నామీద నాకే అని సొంత కుంపటి (సొంత గ్యాంగ్ ఆయన భాషలో) పెట్టుకున్న తర్వాత తెలిసింది.

డైరెక్టర్ గా Jeans, T-Shirt (Blue Jeans, Yellow T-Shirt, కళ్లజోడుతో మద్రాస్ అన్నపూర్ణ స్టూడియోస్ ఆఫీస్ బయట ఫస్ట్‌టైమ్ ఆయన్ని చూసాను. ఇప్పటికీ కళ్లముందే వుంది) వేసుకొని కాలేజ్ కుర్రాడిలా వచ్చింది ఫస్టు ఫస్టు తెలుగు ఫీల్డ్‌లో రాముగారే ... ఆ తర్వాతే ఆయన్ని మా అసిస్టెంట్ డైరెక్టర్స్ అందరం కాపీ కొట్టి మేమే రాంగోపాల్ వర్మలా ఫోజ్ కొట్టేవాళ్లం. నేను డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో రెండేళ్లుగా పనిచేస్తూ తర్వాత ఆరునెల్లు రాముగారి దగ్గర శివ చేసి పోస్ట్ ప్రొడక్షన్ టైమ్‌లో బాంబే ల్యాబ్‌లో ఇళయరాజా గారు 'శివ' సినిమాకి బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ చేస్తున్నప్పుడు ఆ సౌండ్‌తో కలిపి 'శివ' ని చూస్తున్నప్పుడు షాట్ సౌండ్, మ్యూజిక్, స్క్రీన్‌ప్లే, ఫైట్స్ అన్నీ కలిపి అసలు డైరెక్షన్ అంటే ఏంటో తెలియడం మొదలైంది.

ఆ తర్వాత ఎన్నో షాట్‌లు, ఎన్నో ఏళ్ళు, ఏన్నో పగళ్ళు, ఎన్నో రాత్రులు... పంజగుట్టలో వాళ్ళ ఇంటి ముందు పార్క్ పిట్టగోడ మా అన్ అఫీషియల్ ఆఫీస్.

నాన్నగారు కృష్ణంరాజు గారి ఆత్మీయ పలకరింపు, అమ్మ ఎంతో ఆప్యాయంగా ఇచ్చే అద్భుతమైన కాఫీలు, టిఫిన్‌లు, అక్క విజయగారి నిష్కల్మషమైన నవ్వు... ఎంతో నేర్పింది. మేము ఆయన దగ్గర పనిచేస్తున్నాం అనుకోలేదు. ఒక ఫ్యామిలీలా ఫీల్ అయ్యే వాళ్లం అంటే మరీ ఆర్టిఫీషియల్‌గా వుంటుందేమో..

ఏన్నో, ఎన్నెన్నో విషయాలు అనర్గళంగా చెప్పేవాడు (చెప్పేవారికి వినేవాడు లోకువ కదా..) బోల్డంత జ్ఞానం, విజ్ఞానం.. తత్వం కూడా (అయాన్ రాండ్ అని, నిషే అని) ఎన్నెన్నో వజ్రాలు.. దొరికినన్ని ఏరుకున్నాం... అవే ఇవాల్టికి నా ఆస్తి.

అలా ఆయన జీన్స్, టీషర్ట్‌తో స్టార్ అయిన Revolution, Sensation , ఇప్పటి వరకూ 22 ఏళ్లుగా (అన్నేళ్లయ్యాయా?!?) కొనసాగుతూనే వుంది. తెలుగు సినిమా (టాలీవుడ్ అంట..ఛీ..ఛీ.. అదేం మాట) కి అంతర్జాతీయ ప్రమాణాలు నేర్పి, బాలీవుడ్ కెళ్ళి వాళ్ల బద్ధకాన్ని బద్దలుకొట్టాడు. హాలీవుడ్‌కి కూడా వెళ్లాలి (వెళితే అసూయతో కుళ్లుతాం.. కానీ ఏవరికీ తెలీకుండా గర్వపడతాం).

బంజారా హిల్స్‌లో ఇదివరకూ వుండే రాళ్లలాగా పైకి కనిపిస్తాడు కానీ లోపల.. అసలు మనిషి వున్నాడు. కొన్ని అనుభవాలు.. శివ సినిమా స్టార్ట్ అవకముందు రాముగారు కీరవాణికి మాటిచ్చారు తన సినిమాకి మ్యూజిక్ డైరెక్టర్ గా తీసుకుంటానని ప్రామిస్ చేసాడు. (వీళ్లిద్దరికీ రావుగారిల్లు, కలెక్టర్ గారి అబ్బాయి సినిమాలప్పుడు మ్యూజిక్ డైరెక్టర్ చక్రవర్తి గారి దగ్గర పరిచయం.. ఆ రెండు సినిమాలకీ అసిస్టెంట్ డైరెక్టర్ గా Act చేసాడీయన). కానీ కొన్ని కారణాల వలన ఇళయరాజా గారిని (The Music Genious) తీసుకోవలసి వచ్చినప్పుడు ఇచ్చినమాట నెలబెట్టుకోలేక పోయానని ఎమోషనల్ అయి ఫీల్ అయిన దానికి నేను ప్రత్యక్ష సాక్షిని.. 'మాట' అంటే ఏంటో అప్పుడే తెలిసింది. తర్వాత 'క్షణక్షణం'తో ఆ మాటని నిలబెట్టుకున్నాడు.

అలాగే రావుగారిల్లుకి తనపైన కో-డైరెక్టర్‌గా పనిచేస్తున్న శివ నాగేశ్వర్రావు గారికి (ఈయనే మద్రాసు రోడ్లమీద తిరుగుతున్న నన్ను రాముగారి దగ్గర శివ సినిమాకి అసిస్టెంట్ డైరెక్టర్ గా జాయిన్ చేసింది) నేను డైరెక్టర్‌ని అయితే మిమ్మల్ని డైరెక్టర్‌గా పెట్టి సినిమా తీస్తానని చెప్పి (వినడానికి చాలా సిల్లీగా వుంది కదూ) దానికోసమే తన మనీ తోనే మనీ తీసి ఇండియాలోనే ఒక డైరెక్టర్ తన దగ్గర పనిచేసే అసిస్టెంట్ డైరెక్టర్స్‌ని డైరెక్టర్ చేయడమనే ఓ కొత్త విప్లవాత్మక దుష్ట సంప్రదాయం మొదలు పెట్టాడు. (చాలా మందికి రాముకి కళ్లు నెత్తి మీదకొచ్చాయ్ అన్నా సరే వినకుండా) గాయం... ఈ సినిమాలో జగపతి కాకుండా వేరే పెద్ద హీరోతో అయితేనే తీస్తాను అని ప్రొడ్యూసర్ అంటే (అప్పటికి రాత్రి, అంతం ఫ్లాప్ అయి రాము అయిపోయాడు అనుకుంటున్న రోజులవి..) జగపతి అయితేనే 'గాయం' అని చెప్పి మరీ తీసాడు ఆ సినిమాని. అప్పటికి జగపతి వాయిస్ బాగోలేదని అతని సినిమాకి డబ్బింగ్ ఆర్టిస్టుతో డబ్బింగ్ చెప్పించేవారు (హ..హ..హ). రాముగారు ఫస్ట్‌టైమ్ జగపతితోనే డబ్బింగ్ చెప్పించారు. ఇలాంటి క్రియేటివ్ సాహసాలు ఎన్నో... ఇలాంటి Heart Touching Incidents ఎన్నో ఎన్నెన్నో...

యాక్టర్స్, డైరెక్టర్స్, మ్యూజిక్ డైరెక్టర్స్, కెమెరామెన్, ఆర్ట్ డైరెక్టర్స్, పబ్లిసిటీ డిజైనర్స్... ఇలా కొన్ని వందల మందిని (హిందీలో కూడా) విసిరేసాడు జనం మీదకి..

అందులో నేను కూడా ఒకడిని... మనీ మనీ రష్ చూసి పక్కకు తీసుకొచ్చి అప్రిసియేషన్‌తో ఇచ్చిన కౌగిలింత ఇచ్చిన కిక్ నేను రెండుసార్లు నేషనల్ అవార్డు తీసుకున్నప్పుడు కూడా రాలేదు.

అలాగే గులాబి బైక్ సాంగ్ చూసి... మళ్లీ చూసి హైదరాబాద్‌లో అందరికీ చూపించి నన్ను పరిచయం చేయడం నేను ఎప్పటికీ మరిచిపోలేని, మళ్లీ, మళ్లీ దొరకబుచ్చుకోలేని ఓ Cocaine Line.

ఫైనల్‌గా రాముగారిని చూసినప్పుడల్లా మా రాజమండ్రి గోదావరికి అప్పుడప్పుడూ వచ్చే వరద గుర్తొస్తుంది.. నిండుగా పరవళ్లు తొక్కుతూ, భయపెడుతూ, రకరకాల ఎక్స్‌పీరియన్స్‌లు ఇస్తూ వచ్చి వెళ్లిపోయే వరదలాంటి వాడు రాముగారు... మా గోదారి వరద చూడ్డానికి చాలా బావుంటుంది.. అక్కడ ఉండటానికి ఇబ్బంది పెడుతుంది. వెళ్లాలనుకున్నా వెళ్లనివ్వదు.. అన్నిటినీ ముంచేస్తుంది... పగలగొట్టేస్తుంది. వెళ్లిపోతూ.. వెళ్లిపోతూ.. బంగారం లాంటి ఒండ్రు మట్టిని వదులుతుంది. ఆ తర్వాత ఆ మట్టిలో పంటలు బాగా పండుతాయి. అలా రాముగారు కూడా కలిసినప్పుడు ముంచేస్తాడు.. తర్వాత తెలుస్తుంది ఎంత ఇచ్చి వెళ్ళాడనేది.. అదీ వరద గోదారి లాంటి రామూగారు.

Ramu garu i am greatful to you for whatever you did to me and i am proud to be associated with you...

I love you sir

ప్రేమలేఖ

పూరీ జగన్నాథ్ (సినీ దర్శకుడు)

Socrates, plato... నేను పుట్టక ముందే పోయారు. Nietzsche, Ayn rand ల పుస్తకాలు తప్ప మనుషులు దొరకలేదు. పక్కనే Pune లో ఉన్న Osho Rajneesh ని చూడలేకపోయాను. కాని... ఈ రామ్‌గోపాల్‌వర్మతో మాట్లాడుతున్నాను. తిరుగుతున్నాను, కలిసి తాగుతున్నాను... ఇంతకంటే ఏం కావాలి నాకు?

ఆయన్ని చూస్తుంటే ఇన్ని తెలివితేటలు ఈ జన్మలోనే వచ్చాయా ఈయనికి అనిపిస్తుంది. ప్రపంచంలో Rebels ని వేళ్ల మీద లెక్కపెట్టొచ్చు.

అందులో ఒకడు మనమధ్య ఉన్నాడు...

REBEL GOPAL VARMA

రాము అంటే నాకు పిచ్చి... అదో రకమైన మోజు... ఎంత ఇష్టం అంటే ఆయన నుంచి ఫోన్ వస్తే ఏం చేస్తున్నా మధ్యలో ఆపేసి ఎన్నోసార్లు లేచివెళ్లిపోయాను ఆయన్ని కలవడానికి... ఆయనంటే అంత ఇష్టం.

నా Life లో హీరో RAMGOPAL VARMA.

హీరో అని ఎందుకు అన్నాను అంటే...

Note : ఈ దిగువన ఉదహరించబడిన అతని యొక్క లక్షణములను పరికించి చూడండి...

తను ఏం అనుకుంటే అది చేస్తాడు...

ప్రపంచం బద్దలైనా పట్టించుకోడు...

అందరితో చక్కగా నిర్మొహమాటంగా మాట్లాడేయగలడు...

సినిమా తప్ప మరో గొడవ లేదు...

ఎవరిమీదైనా సినిమా తియ్యగలడు...

వాళ్లతో యుద్ధం కూడా చెయ్యగలడు...

ఇష్టం వచ్చినప్పుడు పడుకుంటాడు...

Mood వచ్చినప్పుడు లేస్తాడు...

ఆకలేస్తే తింటాడు...

లేదా తినడు...

ఏంటి అని అడిగేవాడు లేడు...

తను కలవాలి అనుకుంటే ప్రపంచంలో ఎవరినైనా కలవగలడు...

తిక్కలేస్తే ఎవరినైనా సరే T.V. లోను మరియు Twitter లోను మనస్ఫూర్తిగా, ధైర్యంగా, ధారాళంగా తిట్టే దమ్మున్నవాడు. ఈ మనిషికి డబ్బు ఆశలేదు... ఆస్తులు కొనే ఆలోచన అస్సలు లేదు. మన అందరిలాగా వచ్చిన డబ్బు లెక్కపెట్టుకోడు... కరెన్సీ పట్టుకొనే చాలా సంవత్సరాలైంది. కాని ఫ్లైట్‌లు ఎక్కుతుంటాడు, దిగుతుంటాడు, కష్టపడుతూ ఉంటాడు, సుఖపడుతూ ఉంటాడు...

మహర్జాతకం...

ఎందుకంటే ఆయన జాతకం ఆయనే రాసేసుకున్నాడు కాబట్టి...

అతని మాటల్లో ఎంత Positiveness లేకపోతే, ఎంత Energy లేకపోతే, ఎంత Updated Thinking కాకపోతే ఆయన చుట్టూ, ఆయన మాటలువింటూ తెల్లవార్లు కూర్చుంటాం.

RAMU ఒక THOUGHT, ఓ ENERGY... ఆ ఎనర్జీ ఎంతోమంది జీవితాలు మార్చేసింది. ఆయన Introduce చేసిన Directors, Actors, Technicians వందల సంఖ్యలో భారతదేశం అంతా వ్యాపించారు...

రామ్‌గోపాల్‌వర్మ అనే వ్యక్తి అదోరకమైన వైరస్...

ఆయన పోయినా ఆ వైరస్ ఉండిపోతుందిక్కడ...

ప్రపంచంలో చాలా మంది Philosophers చాలా చెప్పారు...

వాళ్లు చెప్పింది మనం విన్నది చాలు...

We need a warrior like RAMU....

చివరి కోరిక : వీలయితే రాముని ఉంచుకుని నా పిల్లలతో కలిపి పెంచుకోవాలని ఉంది.

సర్కార్ రామ్

శివ నాగేశ్వరరావు (డైరెక్టర్)

తర్కం మొదలైన చోటే కర్మ సిద్ధాంతం ఆగిపోయి, వర్మ సిద్ధాంతం అంకురిస్తుంది... రావుగారిల్లు సినిమాకు పరిశీలకుడిగా వచ్చిన రామూ, నన్నడిన ప్రశ్న "దర్శకుడికి కావాల్సిన ముఖ్యమైన అర్హత ఏమిటి?" అని... దానికి నేనిచ్చిన సమాధానం "కామన్ సెన్స్"... ఆ తర్వాత అతి తక్కువ కాలంలోనే అన్నపూర్ణ స్టూడియోస్ అతనికి దర్శకత్వ అవకాశం ఇచ్చినప్పుడు, చాలా మంది నన్నడిగిన ప్రశ్న... "అతని బ్యాక్‌గ్రౌండ్ ఏమిటి?"... దానికి నేనిచ్చిన జవాబు "అతడికి బ్యాక్‌గ్రౌండ్ అంటూ ఏమీ లేదు... అంతా ఫోర్ గ్రౌండే నని...

శివ సినిమా తర్వాత రామ్ గోపాల్ వర్మ అంటే ఒక సంచలనం అయ్యాడు... ఆ తర్వాత శ్రీదేవి, వెంకటేష్ లతో తీసిన క్షణ క్షణం రిలీజయినప్పుడు ఫ్లాపయింది కానీ... తెలుగు క్లాసిక్స్ లో ఒకటిగా నిలిచిపోయింది. ఆ తర్వాత 2nd run లో 100 రోజులు ఆడింది... అదే విచిత్రం. పది మంది నడిచే దారిలో నడవకూడదనుకుంటాడు వర్మ... అందుకే పదే పదే రూటు మారుస్తుంటాడు...

కె. విశ్వనాథ్ గారు తెలుపు ? నలుపుల్లో తెలుగులో తీసిన సినిమా లో హీరోయిన్ కి ఓణీలాగేసి, బికినీ వేసి రంగులద్ది దాన్ని రంగీలా చేసాడు. క్షణంలో 60 వ వంతు సమయంలో ఒక నిర్ణయం తీసుకోగలడు... అంతకన్నా వేగంగా దాన్ని అమలుపరచగలడు. ఎవ్వరేం చెప్పినా తను అనుకున్నదే చేసే మహా మొండి ఘటం... ఒకే థియేటర్లో 7 సంవత్సరాలు ప్రదర్శించబడి, రికార్డు సృష్టించిన "షోలే" ను మళ్ళీ తీసి అగ్గిపాలు చేశాడు... తన రికార్డు తనే బద్దలు కొట్టుకోవటానికి "శివ 2006" తీసాడు...

రాము ఎప్పుడు సినిమా తీస్తాడా అని ఛానల్స్ వాళ్ళంతా ఎదురు చూస్తుంటారు. ఫలానా సినిమా తీస్తున్నాను అని ప్రకటించగానే దాని మీద చర్చావేదిక షురూ... "వినాయకుడు పాలు తాగాడన్న వార్త ఎన్నిసార్లు వేసినా అక్కడితో ఆగిపోవలసిందే... ఎందుకంటే, చర్చావేదికకి పాలు తాగిన వినాయకుడూ రాడు, పాలమ్మిన యాదగిరీ రాడు... కానీ రామూ వెళ్తాడు... దాంతో వారం రోజుల పాటు ఛానల్సన్నిటికీ ఫుల్ మీల్స్... రొటీన్ కి భిన్నంగా వుండాలనే రాము ఆలోచనే అతణ్ణి ఇంత వాణ్ణి చేసింది. చాల మంది అతని వాదాన్ని వితండవాదం అంటారు. అతని భావాన్ని అహం భావం అంటారు...

కొంత మందికి రామూని తిట్టడం ఒక ఫ్యాషన్... మరి కొందరి ఉనికికి అదే వెపన్... రామూని అభిమానించే వాళ్లతో పాటు, తిట్టేవాళ్ళు కూడా అతని సినిమాకి ప్రేక్షకులే... ఎవ్వరేమనుకున్నా తను అనుకున్నదే తీస్తాడు... జనాన్ని భయపెట్టేంత వరకు దయ్యం సినిమాలు తీస్తూనే వుంటాను అన్న వర్మ వెట్టికి మరోమెట్టు "మట్టిచెట్టు"... నేను మాట మీద నిలబడను అని చెప్పిన వర్మ ఆ మాట మీద మాత్రం నిలబడేవున్నాడు. ఫ్రాయిడ్ ని ఉటంకించినా, అయాన్ ర్యాండ్ ని వల్లించినా... "ఎప్పటికెయ్యది ప్రస్తుతమప్పటికామాటలాడి తప్పించుకు తిరుగు వాడే ధన్యుడు సుమతీ" అనే తెలుగు వాక్యాన్ని ఔపోసన పట్టాడు.

రక్త చరిత్ర విడుదలైతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందంటే... నేను రెడీ అన్నాడు. శివరాత్రికి ఒకే టిక్కెట్టు మీద రెండు ఆటలు వేస్తే... రామూ ఒకే సినిమాకి రెండు టిక్కెట్లు కొనిపించాడు... తన "యిజాన్ని" అప్పల్రాజులోకి ప్రవేశ పెట్టి తను తిట్టదల్చుకున్న అందర్నీ తిట్టించాడు... అదేమని అడిగే అవకాశం ఇవ్వకుండా ముందు తనను తానే తిట్టుంచుకున్నాడు... కసబ్ చేసిన అరాచకాన్ని కళ్ళారా చూద్దామని రామూ వేసిన అడుగు ఒక ముఖ్యమంత్రి సీటుకి కసక్ మని గుచ్చుకుంది...

ప్రతీకారమే పరమపద సోపానమని మహాభారతంలో చెప్పినా... ప్రతీకారమే లోకవినాశకం అని మాహాత్ముడు చెప్పినా... రామూ సినిమాలకి మాత్రం ప్రతీకారమే కథామూలం, ప్రతీకారమే మూలధనం... అదే ఇంధనం...

బెజవాడ రౌడీలు ఎలా తీస్తారో చూస్తాం అని ఎవరైనా బెదిరిస్తే... నేను అంత కంటే పెద్ద రౌడీని అని సమాధానమిచ్చాడు...

"రామ్" లీలా మైదానంలో ఆటగాడూ... కోచ్... రిఫరీ అన్నీ వర్మే... అంతా వన్ మ్యాన్ షో... ఆ మైదానంలో హిట్టుకీ, ఫ్లాపుకీ తేడా ఉండదు. తనకి ఎవ్వరితోనూ శాశ్వత బంధం కానీ, శాశ్వత స్నేహం కానీ, శాశ్వత వైరం కానీ వుండవు... చాలా మంది హీరోయిన్లతో అతడికి ఎఫైర్ లు అంటగడతారు. నాకు తెలిసి సక్రమంగానైనా... అక్రమంగానైనా అతడికున్న ఏకైక ఎఫైర్ సినిమాతోనే... వెరసి అతడు కరడుగట్టిన చలన చిత్రోన్మాది. అతడు నీటి బొట్టు కింద తామరాకు లాంటి వాడు, ఎన్ని బొట్లు మీద పడ్డా తనని అంటుకోవు...

He drinks cinema, he eats cinema, he sleeps cinema... సినిమాని ప్రేమిస్తాడు, సినిమాని శ్వాసిస్తాడు... సినిమాని శాసిస్తాడు... అమితాబ్ ని గబ్బర్ ని చేసినా... సర్కార్ ని చేసినా... మరాఠా సర్కార్ ని కూల్చినా... వర్మ వర్మే... వర్మే వర్మ...

అందుకే అతను సర్కార్ రామ్...

రాం గోపాల్ వర్మంటే...

ఒక శివుడు! ఒక దెయ్యం!! ఒక చరిత్ర!!!

– తనికెళ్ళ భరణి

శబ్దం!

సౌండ్!!

ఒక సైకిల్ చైన్ తెగిన శబ్దం... ఆంధ్రదేశమంతా రీ సౌండ్ అవ్వడం విచిత్రం...

కాలేజీల్లో... "శివ" గ్రూప్ గానూ... "భవానీ" గ్రూప్ గానూ... వెరసి "చైన్" బ్యాచ్ గానూ విడిపోయి విడివిడిగా కొట్టుకోవడం...

సైకిల్ చెయిన్లు "బ్లాక్" లో అమ్ముడుపోవడం...

మొత్తం ఇండస్ట్రీ అంతా ఒక యేడాది పాటు "శివ"రాత్రి జాగారం చెయ్యడం...

ఇదంతా...

పొట్టిగా... బక్కపల్చగా...కళ్ళద్దాలెట్టుకుని... "హారీపోటర్" లా కన్పించే ఓ యువకుడి మ్యాజిక్...

అతని పేరు...

రాం గోపాల్ వర్మ....

ఒక చలన చిత్ర సంచలనం!!!

* * *

మద్రాసు...

అన్నపూర్ణ ఆఫీసు... రావుగారిల్లు డిస్కషన్ కోడైరెక్టర్ శివనాగేశ్వర్రావు, డైరెక్టర్... "తరణి".. అప్పుడే మొదటిసారి... వర్మని చూడ్డం...

ఎక్కువ సైలెంట్ గా ఉండే వాడు. ఎప్పుడైనా పొరపాటున నోరు విప్పితే ఇంగ్లీషు!...

"వీడు ఇంగ్లీషు మీడియంగాడు రా బాబు" అనుకుంటుండేవారు మిగతా స్టాఫ్!... మెల్లిగ నాకెందుకో సాఫ్ట్ కార్నర్ ఏర్పడింది!.

సాయంత్రం ఇద్దరం కలసి పాండీ బజార్లో తిరుగుతూ ఉండేవాళ్ళం. నేను సిగరెట్లు అవీ కాలుస్తుంటే, అతను MAD కామిక్స్ కొనుక్కుంటూ ఉండేవాడు....

మొత్తానికి అంతా వర్మని "సినీ జనారణ్యంలో తిరిగే ఆంగ్ల చిరుతపులి" గా భావించేవారు...

* * *

ఓ రోజు ఏదో హోటల్లో కూర్చుని, "వెన్నెల్లో ఆడపిల్ల" స్క్రిప్ట్ రాసుకుంటున్నా... ఫోనొచ్చింది.

మిస్టర్ భరణీ... ఒక్కసారి ఆఫీసుకొస్తారా? నేను రామూని మాట్లాడుతున్నా... గుర్తొచ్చింది. రామూ అంటే "వర్మ"!

వెళ్ళాను...

జీన్స్ ప్యాంటు, లాల్చీ... పేద్ద టేబుల్ ముందు (డైరెక్టర్లు కూర్చునే కుర్చీలో!) కూర్చున్నాడు. "నేను ఒక సినిమా చేస్తున్నాను, నాగార్జునతో... మీరు స్క్రిప్ట్ రాయాలి...

నా చేతిలో సిగరెట్ చురుక్కుమంది!!

... శివ... సినిమా కథ చెప్పడం ప్రారంభించాడు!

కాదు... శివ సినిమాని చూపించడం ప్రారంభించాడు!...

... ఇద్దరం కలసి కార్లో వెళ్తున్నాం... మిస్టర్ భరణీ ఒక్క పది నిముషాలు కళ్ళు మూసుకుని... "సౌండ్" experience చెయ్యండి అన్నాడు!... కళ్ళుమూసుకున్నా... శబ్దాలు... ఎప్పుడూ మనం గమనించనివి!...

... ఎన్నో సార్లు బీచ్ ఒడ్డున పల్లీలు తింటూ స్క్రిప్ట్.

తయారై పోతున్నాడు... శివుడు...

* * *

హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోలో స్క్రిప్ట్ రాయడం... అప్పుడు బోయ్... ఇప్పుడు ఫేమస్ డైరెక్టర్ ఈ నివాస్. ఉత్తేజ్... తేజ... వీళ్ళంతా అసిస్టెంట్లు... శివనాగేశ్వర్రావు... కృష్ణవంశీ సహాయకులు...

ఫస్ట్ రీడింగ్... పిచ్చి కామెడీగా, విపరీతమైన పంచ్ లతో స్క్రిప్ట్ రాశా...

ఇదేంటి ఇన్నిజోకులున్నాయ్!.

స్టూడెంట్స్ కద వర్మా జీ!..

నాకు ఒక్క జోకు గూడ ఉండకూడదు. ఇట్స్ ఎ సీరియస్ ఫిల్మ్.

"అయితే దొబ్బింది!". అని మనసులో అనుకుని కృష్ణవంశీ వైపు చూశా!. "నిజమే అన్న..." అన్నట్టు తలూపాడు అతను...

బియ్యంలోంచి రాళ్ళేరినట్టు... లేదు రాళ్ళల్లోంచి బియ్యం ఏరినట్టు జోకులన్నీ తీసి, రసహీనమైన "శివ" స్క్రిప్ట్ అందించా.

కళ్ళు బైర్లు కమ్మేలా...

తల తిరిగి పోయేలా....

సైలెంట్ గా... పేద్ద వైలెంట్ సినిమా తీసిపారేశాడు

రాం... గోపాల్... వర్మ!!

* * *

రాం గోపాల్ వర్మ... ఒక అల్టిమేట్ ఎనర్జీ!

రాం గోపాల్ వర్మ... ఒక పదబంధ ప్రహేళిక...

రాం గోపాల్ వర్మ... మాట మీద నిలబడని... హరిశ్చంద్రుడు

రాం గోపాల్ వర్మ... ఎంత మందినో ప్రేమించే రామ చంద్రుడు

రాం గోపాల్ వర్మ... చిత్రమైన చిత్రాల ఫ్యాక్టరీ...

రాం గోపాల్ వర్మ... ఎవడికీ అర్థం కాని ఒక విచిత్రమైన మిస్టరీ...

రాం గోపాల్ వర్మ... ఒక అబ్ స్ట్రాక్ట్ పోయెట్రీ...

రాం గోపాల్ వర్మ... ఒక ఇండియన్ సినిమాకి డాక్యుమెంటరీ...

రాం గోపాల్ వర్మ... ఒక శివడు, ఒక దెయ్యం, ఒక చరిత్ర...

దట్సాల్....

WRONG-GO-PAL-WAR-MAA

(రాంగ్ - గో - పాల్ - వార్ - మా)

- నరేష్ (కాలేజ్ మేట్)

విజయవాడ సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజ్‌లో తను నా క్లాస్‌మేట్ అయినప్పట్నించి ఇప్పటి వరకూ నాతో తనకు ఉన్న ఎక్స్‌పీరియన్స్‌తో...

తను చేసేది తప్పా (WRONG)

తన దగ్గర్నించి పారిపోవాలా (GO)

తను నిజంగా నా ఫ్రెండేనా (PAL)

ఎప్పుడు దెబ్బలాటలోకి దిగుతాడో (WAR)

తను నిజంగా మావాడేనా (MAA)

అనే అనుమానాలు ఇప్పటికి కూడా అలాగే ఉన్నాయి.

తెల్ల లాల్చి పైజామా, దువ్వుకోని తల (ఎప్పుడూ నూనె కూడా పెట్టుకోవడం చూడలేదు), హవాయి స్లిప్పర్స్, చేతికి వాచీ కూడా ఉండేది కాదు, దేవుడికి దణ్ణం పెట్టుకోవడం కానీ, అగర్‌బత్తి వెలిగించడం గానీ ఎప్పుడూ చూడలేదు. కాలేజ్‌లో చాలా తక్కువ కనిపించడం, క్యాంటీన్ దగ్గర కానీ, రోడ్డు మీద ఫ్రెండ్స్‌తో గానీ లేకపోతే విజయలక్ష్మి థియేటర్ దగ్గర కానీ, కాస్తో కూస్తో డబ్బులుంటే లీలామహల్‌లో కానీ, నవరంగ్ థియేటర్‌లో కానీ కన్పించేవాడు. నీషే ఫిలాసఫీ గురించి ఎక్కువ చెప్పేవాడు. దెయ్యం మాస్క్ వేసుకుని రాత్రిళ్లు హాస్టల్‌కి వచ్చే వాళ్లని కంబళి వేసుకుని చీకటిలో నుంచిఒక్కసారిగా గెంతి వాళ్లని భయపెట్టి వాళ్ళ భయాన్ని చూసి ఆనందించేవాడు.

ఎంటర్ ద డ్రాగన్, ద ఎక్స్‌ట్రా టెరిస్ట్రియల్ (ఈ.టి.), ఒమన్, మాసుమ్, అభిలాష, ఛాలెంజ్ సినిమాలు ఆ రోజుల్లో తనకి బాగానచ్చిన సినిమాలు.

కరాటే ప్రాక్టీస్ చెయ్యటం నాకింకా గుర్తు. మనం కొట్ట గలిగినా కొట్ట లేకపోయినా వీడూ వీళ్ల గ్యాంగ్ ఎందరొచ్చినా చితక్కొట్టేస్తారేమో అన్న భయం అందరికీ పుట్టించాలని ఆ రోజుల్లో చెప్పేవాడు.

మేం ఫైనల్ ఇయర్‌లోకి వచ్చేటప్పటికీ మెడికల్ కాలేజ్ స్టార్ట్ అయ్యింది. అంతే అప్పట్నించి ఇంజనీరింగ్ ఫ్రెండ్సే కాకుండా మెడికోస్‌లోకూడా చాలా మంది తనకి

ఫ్రెండ్స్ అయ్యారు. వాళ్లకెవరికైనా లోకల్ వాళ్లతో గొడవైతే ఆ గొడవ సాల్వ్ చేయడానికి ఫస్ట్ ముందుండే వాడు. కైజర్ వాళ్ల సిస్టర్‌ని లోకల్ వాళ్లు ఎవరో కామెంట్ చేస్తే వాళ్లని కొట్టాడు. సత్య సినిమా టైటిల్ సత్య అనే మెడికో నుంచి వచ్చింది. ఆ అమ్మాయికి నిషే గురించి ఎక్కువ బోధనలు చేస్తూ ఉండేవాడు.

ఇళయరాజా అంటే చెవి కోసుకునే వాడు. తెలుగుపాటలే కాకుండా ఇళయరాజా హిట్స్ ఇన్ తమిళ్ అనే తమిళ పాటల క్యాసెట్ ఒకటి సంపాదించాడు. ఎక్కడ్నించి సంపాదించాడో నాకు సరిగా గుర్తు లేదు గానీ సోనీ వాక్‌మెన్ ఒకటి తెచ్చాడు. కొన్నాళ్ల పాటు పండగే. సివిల్ బ్లాక్ పైకి వెళ్ళి పోయి వాక్‌మెన్‌లో ఆ క్యాసెట్ పెట్టుకుని ఒక్కొక్క పాట ఒకళ్ల తరువాత ఒకరం వినేస్తూ ఎంజాయ్ చేసే వాళ్ళం. ఆ అరిగిపోయిన సోనీ క్యాసెట్ నా దగ్గర ఇంకా పదిలంగానే ఉంది.

విజయవాడ వెళ్లిపోయి మిగిలిన టూ సబ్జెక్ట్స్ స్టీల్, కాంక్రీట్ (ఆర్‌సిసి) ఒకళ్లకొకళ్ళ అప్పచెప్పుకుని రెండు సబ్జెక్ట్స్ ఎట్లాగైతే అవజేసాము. అయినా కూడా ఇద్దరం డిగ్రీ తీసుకోలేదు. ఓన్లీ ప్రొవిజనల్స్ తెచ్చుకున్నాము. ఒకే, చదువయిపోయింది. ఇప్పుడు ఏం చెయ్యాలా అని మిలియన్ డాలర్ల ప్రశ్న. నాకు మెడిలాయిడ్స్ అప్పు గ్రైప్ వాటర్ మార్కెటింగ్ ఉండేది. తను మాత్రం కృష్ణా ఓబరాయ్ (ఇప్పుడదితాజ్ కృష్ణా) కనస్ట్రక్షన్‌కి సైట్ ఇంజినీర్‌గా జాయిన్ అయ్యాడు. ఆ హోటల్‌లో సైట్ ఇంజినీర్ జాబ్‌తనకిపే మాత్రం సాటిస్‌ఫ్యాక్షన్ ఇవ్వలేకపోయింది. ఎట్లాగైనా డైరెక్టర్ కావాలి అనేది తన కోరిక, యాంబిషన్, గోల్. మరి తన ఫ్యామిలీని పోషించటానికి మంత్లీ డబ్బులు కూడా కావాలి, అవి ఎలా..?

అప్పట్లో వీసీఆర్‌లు, వీడియో క్యాసెట్స్ మంచి రోరింగ్ బిజినెస్. అది స్టార్ట్ చేస్తే చాలా బాగుంటుందనినాతో డిస్కస్ చేసాడు. కాని పెట్టుబడి ఎవరిస్తారు. నన్నడిగితే నా దగ్గర లేవన్నానూ. (ఎందుకంటే మాది జాయింట్ ఫ్యామిలీ)

"ద మూవీ హౌస్" పెట్టిన తర్వాత అది కొంతకాలానికి బాగా సక్సెస్ అయ్యింది. దాంతో తన కాన్ఫిడెన్స్ రెట్టింపయ్యి తనలో దాగి వున్న సినిమా తియ్యాలన్న తన కోరికకి మళ్లీ ఊపిరి వచ్చింది. షాపులో వుంటూనే ఖాళీ టైంలో అన్ని సినిమాలు చూస్తూ అందులో ఉన్న పాయింట్స్ అన్నీ నోట్ చేస్కుంటూ ఉండేవాడు. ఎప్పుడైనా నేనొస్తే బీర్ తెప్పించేవాడు. బయట ఇద్దరం చేతక్ స్కూటర్ మీద కూర్చుని అమీర్ పేట్ సెంటర్‌లో బీర్‌ని తాగేవాళ్లం. ఎక్కువ ఖాళీ ఉంటే ఊర్వశి రెస్టారెంట్‌కి వెళ్లి పోయే వాళ్లం. అప్పుడు తను వెయిటర్‌తో "మేక్ ఇట్ ఫాస్ట్" అని అనేవాడు. దానికి నేను ఆ వెయిటర్ డ్యూటీ టైం అయిపోయి "టేక్ ఇట్ ఫాస్ట్" అంటే ఏమంటావు అని అడిగేవాడ్ని. ఇలా ఇద్దరం తెగ నవ్వుకునే వాళ్ళం.

ఆ టైంలో ఒకరోజు నాకు ఫోన్ చేసి తన దగ్గర స్క్రిప్ట్ రెడీగా ఉందని తనొక మంచి సినిమా తీసేస్తాను అని స్టూడియో వాళ్లకి చెబితే దానికి స్టూడియో వాళ్లు చాలా కూల్‌గా "బాబు సినిమా అంటే ఆషామాషీ కాదు చాలా ఉంటుంది. నువ్వు కొంతకాలం అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేయ్ అప్పుడు నీకే తెలుస్తుంది. నీ మీద ఏ రోజైతే మాకు కాన్ఫిడెన్స్ వస్తుందో ఆ రోజు మేమే చెబుతాము సినిమా తియ్యమని" అన్నారని చెప్పాడు. దాంతో రావుగారిల్లుకి అసిస్టెంట్‌గా, కలెక్టర్ గారి అబ్బాయికి అసోసియేట్ డైరెక్టర్‌గా చేస్తూ ఒకరోజుమళ్లీ నాకు ఫోన్ చేసి నన్నర్జంట్‌గా రమ్మనాడు. తను అన్నపూర్ణస్టూడియోకి వెళ్లానని... నాగార్జున బుట్టలో పడిపోయాడు. తను చెప్పిన కథ నాగ్‌కి, వెంకట్ అక్కినేనికి చాలా బాగా నచ్చేసిందని చెప్పాడు. కట్ చేస్తే 'శివ'.

"ఫ్లై విత్ ద క్లౌడ్స్ ఫ్రమ్ ద విండ్ ఇన్ ద డెసర్ట్ దేర్స్ సేండ్ స్టార్మ్. సాండ్ స్టార్మ్... సాండ్ స్టార్మ్.." అనే ఒక ఇంగ్లీషు పాట పదే పదే వినేవాడు. క్షణక్షణం క్యాసెట్ రికార్డింగ్ అయ్యి రాగానే నాకు ఫోన్ చేసి రమ్మంటే నేను వెళ్ళి పాటలు విన్నాను... నాకు మతి పోయింది. నాకందులో ఎంతో నచ్చిన పాట "అందనంత ఎత్తా తారా తీరం సంగతేంటో చూద్దాం దా" ఇది తను సిరివెన్నెలకి తన మనసు విప్పి చెబితే అంత అందంగా ఆ పాటని రాసాడనిపించింది.

రైఫిల్, శ్రీదేవిలు ఆ రోజుల్లో తనకి ఇష్టమైన అమ్మాయిలు. జయసుధ అన్నా కూడా తనకి చాలా ఇష్టం.

"బంతీ చామంతీ ముద్దాడుకున్నాయిలే", "యురేకా సకామిక.. నవ్వింది మల్లెచెండు..నచ్చింది గర్ల్‌ఫ్రెండూ.. దొరికెరా..." ఆ రోజుల్లో తన ఫేవరెట్ సాంగ్స్.

ఏది ఏమైనా నాకిప్పటికీ ఎప్పటికీ అర్థం కాని మనిషి.

నిశ్శబ్ద సంభాషణ

- పూడూరి రాజిరెడ్డి
(సినీ విశ్లేషకుడు)

నిశ్శబ్దంగా మాట్లాడటం మనకు చేతకాదు. అలా మాట్లాడితే అర్థం చేసుకోవడమూ మనకు సాధ్యంకాదు. కానీ ఈ విషయంలో రామ్‌గోపాల్ వర్మ అదృష్టవంతుడు. మనకు కొన్నిసార్లయినా అర్థమయ్యాడు. అర్థంకానప్పుడు అబ్బురంగా చూస్తూ ఉన్నాం. అందువల్ల మనం గొప్పవాళ్లం.

ఒక్కోసారి మనం గొప్పవాళ్ల స్థాయినుంచి సాధారణ స్థాయికి పడిపోతూ వుంటాం. అప్పుడు మళ్లీ వర్మ అర్థంకాడు. తెర నిండా నలుపు రంగు పులిమాడేమిటి అనిపిస్తుంది. చీకటిని ఎందుకు ప్రేమిస్తాడూ అనిపిస్తుంది. మాట్లాడుకొని చావొచ్చుగా అనిపిస్తుంది. క్రిమినెల్ బ్రెయిన్ అనాలనిపిస్తుంది. క్రైమ్‌ని గ్లామరైజ్ చేసాడనిపిస్తుంది.

ఒక సాధారణ మనిషనేవాడు పదిమందిని ఎగరేసి కొడితే మనం సానుభూతిగా అర్థం చేసుకుంటాం. హీరో అన్నాక ఆ మాత్రం చేయకపోతే ఎలా అని సర్దిచెప్పుకుంటాం. అదే ఒక మాఫియా గ్యాంగు సభ్యుడు ఏ వికారం లేకుండా పిస్టల్ పేల్చితే అది హింస అంటాం. సమాజానికి చెడు సంకేతం ఇస్తున్నదంటాం. మనం ఎమైనా అంటాం.

మనం ఏమన్నా వర్మ వినలేదు. విన్నా మారలేదు. ప్రతి నిమిషమూ తనను తాను మార్చుకుంటూ వెళ్లినవాడు, చివరకు తనుగా ఏమీ మిగలడు. అందుకే పరిశ్రమకు వచ్చి 20 ఏళ్ళయినా రామ్‌గోపాల్ వర్మ... ఆర్.జి.వి. గానే మిగిలాడు. ఒక 'ఫ్యాక్టరీ' గా ఎదిగాడు.

శివ, క్షణక్షణం, గాయం, రంగీలా, సత్య, కంపెనీ, సర్కార్...

ఏడు తరాలకు సరిపడా ఏడు సినిమాలు ! ఇప్పుడు 'రక్తచరిత్ర' రాస్తానంటున్నాడు. శివ (1989) అనే ఒక చిటికె వేసి, మనుషుల చూపుల్ని లాక్కున్నప్పుడే అతడికి ఈ లోకంతో పనివుండేది. ఆ తర్వాత అతడే ఓ లోకమైనాడు. మనుషులతో సంబంధం తెంచుకున్నాడు. ప్రేక్షకుల బాధ్యతను మాత్రమే స్వీకరించాడు.

రాజకీయవేత్తలకు ప్రజలు ... వ్యాపారానికి వినియోగదారులు... ఓ దర్శకుడికి ప్రేక్షకులు! ఒక నేరస్థుడు ఆ రోజు రాత్రి అన్నంలోకి ఏ కూర కలుపుకొని తిన్నాడో,

అర్ధరాత్రి కిటికీ పక్కన నీడలు ఎలాంటి నృత్యం చేస్తాయో, పదంతస్థుల భవనం భూకంపానికి స్వల్పంగా కదిలితే, ఏడో అంతస్థులో వాడి మానసిక స్థితి ఏమిటో, పళ్ల సందుల్లో పేరుకుపోయిన తెల్లటిపాచిని ఎలాంటి పుల్లతో తీసుకుంటారో... చాలా మంది దర్శకులకు అల్పమైన విషయాలు. వాళ్ల హీరోలు వీటికి అతీతులు. వాళ్లకు భయమనేది వుండదు. ఎదురనేది వుండదు. వాళ్ల చొక్కా నలక్కూడదు. వాళ్లు ఇరుకు సందుల్లో, మురికి కాలవల పక్కన పరుగెత్త కూడదు. చివరకి వాళ్లకు రక్తమాంసాలు కూడా వుండకూడదు.

ఎలాంటివాణ్ని స్త్రీ మెచ్చుతుందో చలం రాసినదాన్ని ఇంకోలా వాడుకోగలిగితే – మరయంత్రంలా ఉండే మంచి హీరో కంటే, మనిషిలా ప్రవర్తించే దుష్టుడే మేలు.. ప్రేక్షకుడికి. ఆ దుష్టులు భూమండలమంతా వున్నారు. అందుకే వర్మకు 'భూమి గుండ్రంగా వుండదు. బల్లపరుపుగా కూడా వుండదు'. ఆయనకు భూమి తుపాకిలా వుంటుంది. కరెన్సీ కట్టలా వుంటుంది. రెండూ కలిపితే వచ్చే అధికారంలా వుంటుంది. సర్వర్ గడ్డాన్ని అరికాలితో రాసే గూండాగాడి అహంకారంలా వుంటుంది.'స్నేహితుణ్ని, పరిగెత్తించి తెగ నరికే కసాయివాడి క్రౌర్యంలా వుంటుంది. అన్నను చంపాల్సివచ్చిన తమ్ముడి నిశ్శబ్ద దుఃఖంలా వుంటుంది.

ఈ ఇరవై ఏళ్లుగా వర్మకు లోకం ఇలాగే కనపడుతోంది. కాకపోతే అతను జింకను వేటాడే పులిని ఒక ఆరాధనా భావంతో చూస్తూవున్నాడు. పులిని చంపే హైనాల గుంపుని కూడా అలాగే చూస్తూ వున్నాడు. అందుకే ఆయన మనిషి !

అందుకే చెత్త సినిమాలు కూడా తీసాడు. చెత్త సినిమాలు తీయడం వల్ల ఆయన మనిషి కాదు, బుద్ధొచ్చింది అని లెంపలేసుకోగలడు, తప్పుగా తీసానని ఒప్పుకోనూ గలడు. ఏప్పటికైనా భయపెట్టే సినిమా తీస్తానని మనల్ని భయపెట్టనూగలడు.

మనిషిని గుర్తించడం ఇంకో మనిషికే సాధ్యమౌతుంది. అందుకే ఆయన ఇండస్ట్రీకీ ఎంతో మందిని పరిచయం చేయగలిగాడు. ప్రతిభను గుర్తించడం కుడా ఒక ప్రతిభ!

ఆయన మనిషి కాబట్టే ఎందరో గాడ్‌ఫాదర్ పిచ్చోళ్లలో నేనూ ఒకణ్ని అని చెప్పుకోవడానికి ఆయనకు అభ్యంతరం లేకపోయింది. ఎందరో వర్మ పిచ్చాళ్లలో నేను ఒకడిని అనుకోవడానికి చాలామందికి అభ్యంతరం ఉండదనుకుంటాను.

రామూని ఎంజాయ్ చెయ్యాలి

– మురళీ రాజు

అంటే... తనతో ఎక్స్‌పీరియన్స్‌ని అన్నమాట. చలం వచనంలో చిక్కని వెన్నెల... స్మైల్ కవిత్వంలో నిగూఢమైన భావసాంద్రత... బాపు గీతల్లో వొంపులూ సోయగాలూ... నాకు యెంత ఆశ్చర్యాన్ని కలుగజేసి ఆనందాన్నిచ్చాయో ? రామూ అనే ఎక్స్ పీరియన్స్ కూడా నన్ను అంత కదిలించింది. ఒక మేఘాన్ని చేతుల్లో ఎలా బంధించలేమో రామూని కూడా ఒక నిర్వచనానికి పరిమితం చెయ్యలేం. అందుకని నాకు రామూ ఒక ఆర్గానిక్ ప్రాసెస్ లా అనిపిస్తాడు.

ఒక కళాకారుడికి తనలోంచి ఉద్భవించి రూపు దాల్చిన వస్తు మూలాల గురించి ఎరుక యెలా వుండదో – రామూ అనే "పెన్నిధి" మా కుటుంబంలో ఎలా ఆవిర్భవించిందో మాకు తెలీదు. ఈ "పెన్నిధి"ని అవగాహనకు తెచ్చుకొని, అనుభవానికి తెచ్చుకొనే పరిజ్ఞానం మాకు లేదు. నిత్యం ఆశ్చర్యపరిచే, నా మేనల్లుడు రామూ క్రియేటివ్ చర్యల మూలాల గురించి అవగాహనగాని వాటి గురించి చర్చించి విశ్లేషించగలిగే శక్తి, సామర్థ్యాలు గాని నా దగ్గర లేవు.

రెండు సార్లు రామూ నన్ను ఛాలెంజ్ చేశాడు. రెండు సార్లూ నేను ఓడిపోయాననే చెప్పాలి.

ప్రసాద్ లాబ్స్ లో "శివ" సినిమా చూసి బయటకు వచ్చాక "నువ్వు కూడా అంతకంటే గొప్ప సినిమా తియ్యలేవు" అని రాముతో అన్నాను.

కాని తర్వాత వచ్చిన క్షణక్షణం, రంగీలా, గాయం, అనగనగా ఒకరోజు, సత్య, కంపెనీ, నాచ్, భూత్, సర్కార్, నిశ్శబ్ద్, రన్, రక్తచరిత్ర నా స్టేట్ మెంట్ లోని అవగాహన లోపాన్ని ప్రస్ఫుటంగా నాకు తెలిసేటట్టు బహిర్గతం చేశాయి. రాము కరెక్టు అని ప్రూవయింది. ఆ రోజు నాలోవున్న అపరిపక్వత నాకు ఈ రోజు సుస్పష్టమయింది. తన సినీ ప్రయాణంలో యిప్పటి వరకు పన్నెండు మంచి సినిమాలు తియ్యడం ఒక్క రామూకే సాధ్యమయింది.

మరో సందర్భంలో తను తీసిన సినిమా గురించి మాట్లాడుతూ వుంటే – "అసలు సినిమాల గురించి నీకేం తెలుసు?" అని రాము అడిగాడు. ఇది కూడా కటువుగా కర్కశంగా అనిపించింది. కాని నన్ను నేను ప్రశ్నించుకున్నప్పుడు నిజంగానే నాకు ఏమీ తెలీదనే విషయం అర్థమయింది. ఇది ఇరవై సంవత్సరాల క్రితం మాట. ఆ రోజు

నుంచి రామూ పుణ్యమా అని సినిమా గురించి అంతో ఇంతో తెలుసుకున్నా - ఈ ఇరవైయేళ్ళలో సినిమా గురించి నేను తెలుసుకున్నది చాలా తక్కువని... తెలుసుకోవలసింది చాలా ఎక్కువని అర్థమయింది.

సినిమా అనేది మ్యాజిక్కు. ఆ మ్యాజిక్ ని చేయగలిగే చాకచక్యం అన్నివేళలా అందరివల్లా సాధ్యమయ్యే ప్రక్రియ కాదు. కొన్ని సమయాల్లో కొందరికే లభ్యమయ్యే అపూర్వ అవకాశమిది. రామూ పన్నెండు సార్లు ఆ అవకాశాన్ని చేజిక్కించుకున్నాడూ అంటే ఒక క్రీడాకారుడు లెక్కలేనన్ని విజయాలు సాధించిన దానితో సమానం. రామూకు ఈ సందర్భంగా చేతులు జోడించి నే చెప్పేదేమిటంటే "నిజమే, సినిమా గురించి నాకేమి తెలీదు". ఇంకా పొగరుగా చెప్పేదేమిటంటే "నాకే కాదు, సినిమా గురించి ఎవ్వరికీ ఏమీ తెలీదు". తెలుసు అనుకొని భ్రమ పడతారు. కాని తెలీదు. మంచి సినిమా ఎలా జరిగిందో ఎవరికీ తెలీదు. చెడ్డ సినిమా ఎలా మారిందో కూడా ఎవరికీ తెలీదు.

రామూని ఒక మనిషిగా నేను చూడలేను. రామూని అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేయడం కంటే రామూని ఎంజాయ్ చెయ్యడమే నాకు సులువు. నాకు ఉపయోగకరం. రామూని ఎవరు ఏ దృక్పథంతో చూస్తే అలా గోచరిస్తాడు. శబరి నిరాశలేని నిరీక్షణతో రాములవారి ఆగమనం కోసం ఎలా వేచి వున్నదో ఈ రామూ అనే ఎక్స్ పీరియన్స్ నా వివేకాన్ని పెంచుతుందని గాఢంగా నమ్ముతున్నాను. జగత్, జీవుడు, ఈశ్వరుడు ఎలా మనోకల్పితాలో రామూ మాటలూ చేష్టలూ అన్నీ కల్పితాలే. ఆయన సృష్టించిన కల్పన వెనుక ఒక ఋషి, ఒక కృషీవలుడు దాగి వుంటాడు. సత్యాన్వేషణలో మనకు గోచరించే విషయం... ఈ సమస్త విశ్వంలో వ్యాపించిన చైతన్యంలోంచి విశ్వం ఆవిర్భవించిందని... ఆ చైతన్యం అనుభవానికి వస్తుంది కాని మాటలతో వర్ణించలేమని... అలాగే రామూ కూడా! రామూని అనుభవించగలనుగాని వర్ణించలేను...

రామ్ ఎఫెక్ట్

కె. క్రాంతి కుమార్ రెడ్డి

(సినీ పరిశీలకుడు)

"**ముం**దున్న రోజులు చాలా కఠినతరమైనవి అని అతడికి తెలుసు. ఎదుర్కోవలసిన ప్రశ్నలు, రూపొందాల్సిన కార్యాచరణను గురించి ఆలోచించాలనీ తెలుసు. కాని దాని గురించి తను ఆలోచించనని కూడా అతడికి తెలుసు. ఎందుకంటే, కార్యాచరణ అనేది ఎప్పుడో నిర్ణయించబడిందని స్పష్టంగా తెలుసు కాబట్టి..."

ఇవి అయాన్ ర్యాండ్ తన "ఫౌంటేన్ హెడ్" నవల ప్రారంభంలో హోవర్డ్ రోర్క్ వ్యక్తిత్వాన్ని వివరిస్తూ రాసిన వాక్యాలు... అయాన్ ర్యాండ్ ప్రభావంలో మునిగి తేలిన వర్మకు ఈ భావాలు అచ్చంగా సరిపోతాయి. హోవర్డ్ రోర్క్ లా రామ్ గోపాల్ వర్మ తన జీవితంలో తనకేం కావాలో, ఏం చేయాలో స్పష్టంగా తెలిసినవాడు.

సమాజమనే ప్రయోగశాలలో వర్మ నిత్య పరిశోధకుడు. మొదటి నుంచీ సబ్జెక్ట్ పుస్తకాలను వదిలేసి, తన చుట్టూ ఉన్న మనుషుల మనస్తత్వాల్ని స్టడీ చేయడం తనకు ఆసక్తిగా ఉండేదని, చిన్నప్పుడు క్లాస్‌లో గొడవ చేసేవాళ్లు తన దృష్టిలో హీరోలని, వాళ్ల స్నేహం కోసం ఎప్పుడూ ప్రయత్నించేవాడినని వర్మ తరచూ చెప్తుంటాడు. అదే "అసాంఘిక శక్తులతో నా మొదటి పరిచయం" అన్నాడు వర్మ ఓ ఇంటర్వ్యూలో నవ్వుతూ.

వారానికి తాను 8 - 10 సినిమాలు చూసేవాడినని, ఒక్కోసారి ఒకే సినిమాను చాలాసార్లు చూడటం, అయితే అందులో కూడా తనకు నచ్చిన సీన్ ను పదేపదే చూడటం, నచ్చని సీన్స్ వచ్చినప్పుడు బయటికి వచ్చేవాడినని చాలా సందర్భాల్లో చెప్పుకొచ్చాడు... బహుశా సినిమా ఎడిటింగ్ అనేది వర్మకు అర్థమవడానికి అది ఆరంభం అనుకుంటా! ఇంజనీరింగ్ తర్వాత నైజీరియాకు వెళ్లాలనుకున్న వర్మ ఆ నిర్ణయాన్ని మార్చుకుని హైదరాబాద్, అమీర్ పేటలో వీడియో లైబ్రరీని ఓపెన్ చేయడం వర్మ లైఫ్ లో ఒక టర్నింగ్ పాయింట్.

డైరెక్షన్ ఛాన్స్ కోసం ట్రయల్స్ వేస్తున్న ప్రాసెస్‌లో వర్మ వినిపించిన కథ నాగార్జునకు కొత్తగా అనిపించడంతో సెట్స్ మీద "శివారంభం", సినిమా ఇండస్ట్రీలో "వర్మారంభం" ఒకేసారి జరిగాయి.

1989 అక్టోబర్ 5..

ఆ రోజు తెలుగు సినిమా హిస్టరీలో ఓ మైల్ స్టోన్. అప్పటి వరకూ సినిమాల్లో ఏ సమయంలో హీరోయిన్ హీరోతో ఏం డైలాగ్ చెబుతుంది... ఏ సందర్భంలో హీరో విలన్ తో ఫైట్ చేస్తాడు... వందల సినిమాల అనుభవంతో ఆడియన్స్ ఏ సీన్ తరువాత ఏ సీన్ వస్తుందో ఈజీగా చెప్పేసేవారు. కానీ మొదటి సారి "శివ" చూసినప్పుడు ఆలోచనలు ఆపేసి, స్క్రీన్ కేసి థ్రిల్లింగ్ గా చూశారు.

ఒక సీన్ లో భవాని అనుచరుల్ని కొట్టి ఒకడిని అతడి అడ్డాకు మోసుకెళ్తాడు శివ. అప్పటివరకు భవాని గురించి విన్నాడే తప్ప, ఎప్పుడూ ఇద్దరూ ఎదురుపడలేదు. బయట ఉరుములు, మెరుపులు. ఆఫ్ లైట్ లో శివ ఫేస్. శివ నెమ్మదిగా భవాని డెన్ లోకి నడుచుకుంటూ వస్తాడు. నానాజీ భవాని చెవిలో శివ అంటే వీడే అంటాడు నెమ్మదిగా. దెబ్బలు తిన్న తన అనుచరుల వైపు, దగ్గరికి వస్తున్న శివ వైపు భవాని షాకింగ్‌గా చూస్తుంటాడు. కేవలం సౌండ్, లైటింగ్, ఎక్స్ ప్రెషన్స్, పొడి పొడి డైలాగ్స్ తో ఆ సీన్ కు ఎమోషనల్ ఇంపాక్ట్ తీసుకువచ్చాడు వర్మ. రాము మల్చిన "శివ" సినీ పరిశ్రమలో ఓ కొత్త శకానికి నాంది. తన శివలాగానే వర్మ సినిమా ప్రపంచంలోకి ఓ నిశ్శబ్ద విప్లవంలా దూసుకొచ్చాడు.

తెలుగు, హిందీ పరిశ్రమలో "శివ" సంచలన విజయం ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీకి కొత్త ఆక్సిజన్‌ను అందించింది. క్షణక్షణం, గాయం తెలుగు సినిమా ఇండస్ట్రీలో తనదైన స్టాంప్ వేసిన వర్మ తన పరిధిని విస్తరించాలనుకున్నాడు. రంగీలాతో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చి ఆ సక్సెస్ తో వర్మ ఇక వెనుదిరిగి చూడలేదు.

ఆయన సినిమా క్రమాన్ని పరిశీలిస్తే సైకలాజికల్ థ్రిల్లర్స్ తీయడం, క్రిమినల్స్ మైండ్‌లో డార్క్ సైడ్ ఏముందో తెలుసుకోవడం వర్మకు ఒక అబ్సెషన్ అనిపిస్తుంది...

వర్మ దృష్టిలో హీరోలు, విలన్లు అంటూ ఎవరూ ఉండరు. "ఒక వ్యక్తి పరిస్థితుల కారణంగా తీసుకునే నిర్ణయాలు ఒక్కొక్కరికి ఒక్కోలా కనిపిస్తాయి అంతే..." అని ఆయన చాలా సార్లు చెబుతుంటారు. అందుకే సమాజానికి విలన్లుగా కనిపించిన మాఫియా డాన్స్ ఆయనకు మాత్రం మామూలు మనుషుల్లానే కనిపించారు. గ్యాంగ్ స్టర్స్ లైఫ్ బేస్డ్ గా బోలెడన్ని సినిమాలు తీశారు. మేరియోప్యూజో "గాడ్ ఫాదర్" ను అటు తిప్పి, ఇటు తిప్పి పాత సినిమాను ప్రతిసారి కొత్తగా చూపించాడు. ఆ క్రమంలోనే వచ్చిన "సత్య" ఒక మాస్టర్ పీస్. "షోలే" తర్వాత వచ్చిన బెస్ట్ సినిమా స్క్రిప్ట్ "సత్య" అని విమర్శకుల అభిప్రాయం.

ఇరుకు గల్లీలు, ఇరానీ ఛాయ్, ఉర్దూ కలిసిన హైదరాబాదీ తెలుగును వర్మ కొత్తగా చూపించాడు. హైదరాబాద్ నుంచి ముంబైకి ఎక్స్ పోర్ట్ అయిన తరవాత,

"సత్య"లో మురికి నిండిన ముంబై స్లమ్స్, మనుషుల్ని డిఫరెంట్ యాంగిల్ లో తెరకెక్కించాడు. "సమాజంలో జరిగిన వాస్తవాలను అద్దంలో చూపించే జర్నలిస్టులాంటివాడు ఫిల్మ్ మేకర్. అది మరింత ఎఫెక్టివ్ గా చూపించేందుకు కొంత డ్రామా కలుపుతాడు" అని వర్మ అభిప్రాయం. "సత్య" తరువాత మాఫియా నేపథ్యంలో "కంపెనీ", "డి" చిత్రాలు తీశాడు. హాలీవుడ్ గాడ్ ఫాదర్ ట్రయాలజీలా, హాంకాంగ్ లో ఇన్ ఫెర్నల్ ఎఫైర్స్ ట్రయాలజీలా ఈ మూడు సినిమాలను ఇండియన్ సినిమాలో ట్రయాలజీగా విమర్శకులు పేర్కొంటారు.

తన సినిమాల్లో పాత్రలకు ఇంటెన్సీని దట్టించి రియలస్టిక్ గా కనిపించేట్టు చేయడంలో వర్మ మాస్టర్. వర్మ సినిమాల్లో సెంటిమెంట్ తక్కువ అనుకున్నవాళ్లకు శివ, సత్య, క్షణక్షణం, రంగీలా, గాయం, సర్కార్, రక్తచరిత్ర... ఏ సినిమా చూసినా మానవ సంబంధాల తాలూకు భావోద్వేగాలు విస్తృతంగా కనిపిస్తాయి. ఏ పాత్ర ఎంతవరకు మాట్లాడాలి, ఏ షాట్ ఎలా కంపోజ్ చేయాలి, ఏ సీన్ ను ఎలా స్టార్ట్ చెయ్యాలి, ఎలా క్లోజ్ చేయాలి ఏ షాట్ ఏ యాంగిల్ లో ఉంటే ఎంత ఎఫెక్ట్ వస్తుంది... ఎక్కడ మ్యూజిక్ ఉంటే, ఎక్కడ సైలెన్స్ ఉంటే ఎమోషన్ బిల్డ్ అవుతుంది అన్నది వర్మకే తెలిసిన మాస్టర్ టెక్నిక్.

బాడీలోకి బుల్లెట్ దిగినంత లోతుగా, గొంతులోకి గాఢ సల్ఫ్యూరిక్ ఆమ్లం జారినంత ఘాటుగా ఉంటాయి వర్మ సినిమాలు. ఆయన ఐడియాలజీతో కనెక్ట్ కాకపోవచ్చు. కానీ చెప్పాలనుకున్నదానిని ఆయన స్క్రీన్ మీద చెప్పే పద్ధతికి ఎవరైనా కన్విన్స్ అవాల్సిందే!

వర్మ తన సినిమాల్లో పాటలు స్టోరీ కంటిన్యుటీని డిస్టర్బ్ చేస్తాయని ఫీలైనప్పుడు కథలో వాటిని బలవంతంగా చొప్పించడానికి ప్రయత్నించలేదు. కొన్ని సందర్భాల్లో సాంగ్స్ ను స్టోరీని ముందుకు తీసుకువెళ్లే ఇన్స్ట్రుమెంట్ గా వాడుకున్నాడు.

వర్మ తన చుట్టూ జరుగుతున్న పరిణామాల్ని చాలా నిశ్శబ్దంగా గమనిస్తాడు. అయితే అంత సులభంగా తన అభిప్రాయాలను బయటికి వెల్లడించడు. తను చెప్పాలనుకున్న ప్రతి భావాన్ని తన సినిమా ద్వారా బాహ్య ప్రపంచానికి కమ్యూనికేట్ చేస్తాడు. యోగిలా తన పని తాను చేసుకుంటూ పోతూ ఆ నిశ్శబ్దంలోంచి ప్రపంచాన్ని తన వైపుకు ఆకర్షించేలా చేస్తాడు.

శరీరంలోని అణువణువునూ ఉత్తేజం చేసే రక్తప్రసరణ వ్యవస్థను ఆవిష్కరించిన విలియం హార్వేలా, ఒకదానికొకటి అనుసంధానమైన ఫిల్మ్ ఇండస్ట్రీలో అన్ని క్రాఫ్ట్స్ ను తన ఆలోచనలతో ఇన్స్పయిర్ చేసిన డైనమిక్ ఫిల్మ్ మేకర్ వర్మ.

హాలీవుడ్ సినిమాకు ఆల్ఫ్రెడ్ హిచ్ కాక్ లా... జపనీస్ సినిమాకు అకిరా కురసోవా... ఇటాలియన్ సినిమాకు విట్టోరియా డిసికా... ఇండియన్ సినిమాకు ఎక్స్ పెరిమెంటల్ టచ్ ఇచ్చిన ఫిల్మ్ మేకర్ రాం గోపాల్ వర్మ.

తన ఇరవైయేళ్ళ కెరీర్ లో ఇండియన్ సినిమాకు వర్మ ఏం చేశాడని ప్రశ్నిస్తే... "ఇది రాంగోపాల్ వర్మ చిత్రం" అనే ఒక బ్రాండ్ వేసుకున్నాడు. ఫిల్మ్ మేకింగ్ బేసిక్స్‌ను షేక్ చేశాడు. కొత్త ప్రిన్సిపుల్స్ ని, పారామీటర్స్ ని డిఫైన్ చేశాడు. అప్పటిదాకా "కంటెంట్" సెంటర్ పాయింట్ గా కదులుతున్న సినిమా మీడియాలో "ఫామ్" తో ప్రయోగాలు చేశాడు. కథ కాదు కథనం, ఏం చెబుతున్నాం అన్నది కాదు ఎలా చెబుతున్నామన్నది ప్రధానం అని ప్రూవ్ చేశాడు. తన ముందు వరకు వెండితెరపై మధ్యతరగతి కుటుంబ సంక్షోభాలు, ఫ్యూడల్ సంఘర్షణలు రాజ్యమేలుతున్నప్పుడు మారిన పరిస్థితులపై ఫోకస్ చేశాడు. బిగినింగ్, మిడిల్, ఎండ్ కు తన సొంత డెఫినేషన్స్ ఇచ్చాడు. ఫిల్మ్ ఎకనమిక్స్ కు, ఫిల్మ్ సోషియాలజీకి కొన్ని కొత్త చాప్టర్స్ జత చేశాడు. సినిమా అనే ఒక సైన్స్ ఫండమెంటల్స్ లో మౌలిక మార్పులు తీసుకొచ్చిన సెల్యూలాయిడ్ సైంటిస్ట్ వర్మ.

రాం గోపాల్ వర్మ తన బ్రాండ్ ను లేక ఐడెంటిటీని ప్రమోట్ చేసుకునే ప్రాసెస్ లో తన ఆలోచనలను, భావాలను మొత్తంగా వ్యక్తిత్వాన్ని డిజైన్ చేసుకున్నట్టుగా కనిపిస్తుంది. పార్టీలతో, ఫంక్షన్లతో హడావుడిగా ఉండే సినీ ప్రపంచంలో తానొక యునిక్ ఇండివిడ్యువల్ గా కనిపించడానికి వ్యూహాత్మక ప్రణాళికను రూపొందించు కున్నట్టు అర్థమవుతుంది. ప్రతి శుక్రవారం థియేటర్లో తన సినిమా ఒకటి రిలీజ్ అవ్వాలని "ఫ్యాక్టరీ"ని స్థాపించిన వర్మ చివరకు తనే ఓ "ఫ్యాక్టరీ"గా మారాడు.

నిరంతరం ఏదో ఆలోచనలో తనమునకలయ్యే వర్మ బుర్రలోకి తొంగిచూస్తే, అదొక మండుతున్న ఆలోచన కొలిమిలా కనిపిస్తుంది. చిన్న మెదడులో అయన్ ర్యాండ్ ని, పెద్ద మెదడులో ఫ్రాన్సిస్ ఫోర్డ్ కొప్పోలాని మోస్తూ తిరుగుతున్న క్రియేటివ్ జీనియస్ లా కనిపిస్తాడు. కొన్ని సార్లు మనసులో ఏదో అంతర్గత కల్లోలం చెలరేగుతున్నట్టు, గదమ పై చేయి ఉంచి సుదీర్ఘంగా ఆలోచిస్తున్న ఆగస్ట్ రోడిన్ "థింకర్" లా తాత్వికంగా కనిపిస్తాడు. ముందు క్షణం లో వచ్చిన ఆలోచన మరుక్షణంలో వర్మకు పాతదిగా అనిపిస్తుంది. ఏదో కొత్తగా చేయాలన్న తపన ఆయన్ని నిరంతరం కాల్చేస్తున్నట్టుగా కనిపిస్తాడు.

అతడి గురించి ఈ ప్రపంచం చాలా సీరియస్ గా డిస్కస్ చేస్తున్నప్పుడు ఎక్కడో ముంబైలో జిమ్ లో ఎక్సర్ సైజ్ లు చేసుకుంటూనో, తన ఆఫీస్ లో గాడ్ ఫాదర్ ను ఏ వందో సారి చూస్తూనో ఏకాంత క్షణాల్లోకి జారుకుంటాడు. తనను ఈ ప్రపంచం కొన్ని రోజుల పాటు మరచిపోయిందని అనిపిస్తే, తన బ్లాగ్ లో కరణ్ జోహార్ ఫ్యామిలీ డ్రామాలపై కామెంట్స్ విసురుతాడు. లేక మరేదో క్రేజీ కాంబినేషన్ తోనో – సెన్సేషనల్ టాపిక్ మీదో సినిమా అనౌన్స్ చేస్తాడు. అదీ కాకుంటే ట్విట్టర్లో చిరంజీవి మీదో, ఎవరో ఒకరి మీదో కామెంట్లు విసురుతాడు. విమర్శలు, వివాదాలు లేనిదే వర్మకు నిద్రపట్టదు. తననెవరైనా మర్చిపోతే మరో సంచలన ప్రకటన చేసి ఎదుటి వాళ్ళకు నిద్ర పట్టకుండా

చేస్తాడు. రక్తచరిత్ర పారించిన వివాదాల నెత్తుటి తడి ఆరక ముందే బెజవాడ రౌడీలతో కత్తులు పట్టిస్తానంటాడు. అసలు ఇదంతా పబ్లిసిటీ కోసం చేస్తున్నారా అంటే, అసలు నా లైఫే ఓ పబ్లిసిటీ అంటాడు. ఏదేమైనా పబ్లిక్ తనని అంత ఈజీగా మర్చిపోనివ్వడు. ఇది ఒక రీకాల్ స్ట్రాటజీ కావొచ్చు.

ఆయనొక నదీ ప్రవాహం లాంటి వాడు. ఎన్నో పిల్లకాలువల్ని తనలో కలుపుకుని ముందుకు సాగిపోతాడు. గత ఇరవైయేళ్ళల్లో ఆయన దగ్గర పనిచేసి, ఆ తరువాత పెద్ద దర్శకులైన వాళ్ళు ఎందరో వున్నారు. ఇప్పటికీ దర్శకులు కావాలనుకుంటున్న వాళ్ళకు ఆయనే ఇనిస్పిరేషన్. అయస్కాంతం ఇనుమును ఆకర్షించినట్టుగా సినిమా దర్శకుడు కావాలనుకునే వాళ్ళు మొదట ఆయన వైపు ఆకర్షితులవుతారు.

ఆయనో కేంద్రం... చుట్టూ కక్ష్యలో సినిమా పరిశ్రమ యావత్తూ భ్రమణం చేస్తున్నట్టు కనిపిస్తుంది. కొంతమందికి అది భ్రమ, కొంతమందికి నిజం.

వర్మను విపరీతంగా ప్రభావితం చేసిన అయాన్ ర్యాండ్ "ఫౌంటేన్ హెడ్" లో చివరి వాక్యం ఇలా ఉంటుంది. ఇప్పుడక్కడ అతడు, ఆకాశం, సముద్రం మాత్రమే మిగిలి ఉన్నాయి.

సాహిత్యానికి సంబంధించి ఇరవయ్యవ శతాబ్దం నాది అని ప్రకటించుకున్నాడు శ్రీశ్రీ...

వర్మ అలా ప్రకటించుకోకపోయినా అతని సినిమాయే అతని ప్రకటన...

'రామ్‌గోపాల్‌వర్మని చంపటం ఎలా?'

– అవిర్నేని భాను (ఒక దురభిమాన అభిమాని)

'గో'విందా గోవిందా' వంటి చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల మీదకి వదిలి బ్రహ్మహత్యా పాతకాన్ని మించి పాపాన్ని మూటకట్టుకున్న రామ్‌గోపాల్‌వర్మని ఆ ఏడుకొండలవాడు ఎందుకు క్షమించి వదిలేసాడో అన్నది నాకు మొదట బోధపడలేదు. హిందు మతం మీద కొద్దిపాటి అవగాహన ఏర్పరుచుకున్న తర్వాత నాకు తెలిసిన విషయం ఏమిటంటే... దుష్ట సంహారం అనేది ఆ పరమేశ్వరుని బాధ్యత అని. 'శివ' భగవానుడు వర్మను ఎందుకు క్షమించి వదిలిపెట్టాడో పాఠకులకు ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఐతే 'శివ 2006' చూసిన తర్వాత ఆ పరమేశ్వరుడు వర్మని ఎందుకు భస్మం చేయలేదన్నది మరొక చిక్కు ప్రశ్న. బహుశా గోవిందా గోవిందాను మించిన పాపం చేసినందుకు కించిత్ సంతోషించి లోక రక్షకుడైన విష్ణుమూర్తి ఈసారి వర్మను కాపాడి ఉండవచ్చు.

దేవుళ్ల మాట అటుంచి, ఈ మన తెలుగు సినిమా పరిశ్రమలోనే వర్మని 'అంతం' చేయాలన్న మీమాంస చాలా మందిలో ఉండే అవకాశాలు పుష్కలం. 'రక్తచరిత్ర' సినిమాలో పరిటాల రవిని బట్టతలతో చూపించలేదని సూరి అనుచరులు కావచ్చు, సూరిని చక్కటి దేహదారుఢ్యంతో చూపించినందుకు రవి అనుయాయులు కావచ్చు, 'రక్తచరిత్ర'లో ఒకానొక ఫొటోలో గుండు కొట్టించబడిన అజ్ఞాత వ్యక్తి తమ ఆరాధ్య హీరో అన్న అనుమానంతో మరి కొంతమంది కావచ్చు, మన తెలుగు ప్రజల 'విశాల' దృక్పథం దృష్ట్యా కారణాలు మరింత హాస్యాస్పదంగా ఉండవచ్చు. ఇంకా చెప్పాలంటే 'కథ–స్క్రీన్‌ప్లే–దర్శకత్వం అప్పల్రాజు' చిత్రంలో తెలుగు దర్శకుల మీద ఉన్న విమర్శనాత్మకమైన పాటలో ప్రస్తావించబడి తీవ్ర మనస్తాపానికి గురైన సదరు తెలుగు సినిమా దర్శకుడు కావచ్చు, లేదా ఆ పాటలో ప్రస్తావనకి నోచుకోక ఆత్మన్యూనత భావంతో క్రుంగిపోయిన మరొకరు కావచ్చు. వీటన్నిటినీ మించి 'అగ్ని' చిత్రదర్శన భాగ్యం కలిగిన ప్రతి సగటు ప్రేక్షకుడి మొట్టమొదటి ఆలోచన వర్మ సంహారమే! మరింత విడమర్చి చెప్పాలంటే, ఆ చిత్రాన్ని చూసిన మనలాంటి వందలాది ప్రేక్షకులు అతనిని ఊహకందని రీతిలో చిత్రవధ చేసి మరీ తుదముట్టించాలనుకున్నాం. ఎంతైనా, ప్రతీకారమే పరమసోపానం (మహాభారతంలో ప్రస్తుతించబడి, అప్రస్తుతంగా రక్తచరిత్రలో వినియోగించబడినది) కదా? ఏది ఏమైనప్పటికీ, ఆశ్చర్యకరంగా వర్మ తన జీవితాన్ని హాయిగా లాగిస్తూ, విజయఢంకా మ్రోగిస్తూ, విలేఖరుల నోర్లు మూయిస్తూ, తండోపతండాలుగా తన సినిమాల పరంపరని కొనసాగిస్తూ, ప్రేక్షకులని బెంబేలెత్తిస్తున్నాడు.

కానీ హేతుబద్ధంగా ఆలోచించిన కొద్దీ, వర్మని అంతం చేయటం సాధ్యం కాదేమో అనిపిస్తుంది. ఈ పరిశ్రమ వ్యక్తిగా వర్మ తాలూకు ముద్ర, ఆయన నడవడిక అడుగడుగునా గోచరిస్తుంది. ఎంతో మంది ఆశావహ దర్శకులు, సాంకేతిక నిపుణులు వర్మని ఒక స్ఫూర్తి ప్రదాతగా భావిస్తారు. వీళ్లందరూ కాక ఇంటర్నెట్‌లో వందల వేల అనామకులు వర్మ గురించి పుంఖానుపుంఖాలుగా ప్రస్తుతించడం సర్వసాధారణం. తెలుగు సినిమాకి ఒంటి చేత్తో దిశా నిర్దేశం చేసాడు అని ఆయన అభిమానులు ఉవాచ. వర్మ తెలుగు సినిమాని వదిలి వెళ్లిన తర్వాత తెలుగు సినిమాలు పాత మూస ధోరణిలోనే కొనసాగుతున్నాయి అన్నది వారి వాదన. వర్మని అంతమొందించాలి అన్న సంకల్పం తప్పించి ఈ వాదనలకి సరైన ప్రతివాదన నా దగ్గరలేదు. ఇక తెలుగు సినిమా దర్శకుల మీద పాట విషయానికివస్తే, ఆయన అభిమానుల దృష్టిలో అది కేవలం సుహృద్భావంతో కూడిన హాస్యమే తప్ప ఇతరులను అపహాస్యం చెయ్యటం కాదు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, వర్మ ఆ పాటలో అందరికంటే తన మీద తానే కఠినమైన విమర్శలు చేసుకున్నాడు. ఒక వ్యక్తి తనపై తానే హాస్యాలాడటం అన్నది అరుదుగా చూస్తుంటాము. ఈ విధంగా వర్మ ఆ పాట రూపంలో ఒక సరికొత్త హాస్యరసానికి మన పరిశ్రమలో అంకురార్పణ చేసాడు. ఈ తరహా వాదన తెలుగు సినిమా దర్శకులకు కొంత ఉపశమనం కలిగించవచ్చు కానీ ఎక్కడో నా అంతరంగాల్లో అతడిని అంతం చేయాలన్న భావన ఇంకా నన్ను వీడలేదు.

నా దృష్టిలో ప్రతి దర్శకుడు తన అభీష్టం కొద్దీ కథని ఎంపిక చేసుకోవచ్చు. రక్తచరిత్ర తీసిన వర్మని అంతం చేయాలనుకుంటే, అతని కన్నాముందు 'గాంధీ' సినిమా తీసిన అటెన్‌బోరోని, 'లెజెండ్ ఆఫ్ భగత్‌సింగ్' తీసిన రాజ్‌కుమార్ సంతోషిలను కూడా అంతం చేయవలసిందే. ఇక్కడ నేను నేతలు, హీరోల గురించి మాట్లాడటం లేదు. ఒక దర్శకుడ్ని ప్రేరేపించే కథలు కథనాల గరించి ప్రస్తావిస్తున్నాను. ఈ విషయంలో నాలోని లౌకికుడు వర్మకి మద్దతు తెలుపుతున్నాడు. కనీసం చిత్రాన్ని చూడకుండా గమనిస్తే ప్రతీ గుంపులో గోవిందయ్య వర్మని ప్రస్తుతించడం ద్వారా ఉచిత ప్రచారం పొందుతున్నాడా అన్న సందేహం కలగక మానదు. వర్మని అభిమానించవచ్చు, అసహ్యించుకోవచ్చు, అవహేళన చేయవచ్చు కానీ అతడి ఉనికి మాత్రం తప్పనిసరి. అసలు ఈ హడావిడి చూస్తుంటే, వర్మ ఛరిశ్మాని వాడుకొని ఈ టీ.వీ.ఛానల్స్ అన్నీ లబ్ధి పొందుతున్నాయా అనేది నా సందేహం. ఈ సందేహం నన్ను కొంత కలవరానికి గురిచేస్తోంది కానీ నా ఈ సందేహం నిజమేనేమో, వర్మ ఒక వ్యక్తి కాదేమో, ఒక ఆలోచనా శక్తేమో?

ఈ విధంగా ఆత్మ విమర్శ చేసుకుంటూ 'అగ్ని' చిత్రంపైన నాకున్న కోపాన్ని కూడా ప్రశ్నించసాగాను. నా కోపమంతా కేవలం టికెట్ డబ్బులు ఇంకా కొన్ని గంటల నా సమయం వృథా అయ్యిందనే. కానీ చరిత్రలో కలికితురాయిగా మిగిలిన షోలే చిత్రాన్ని మరలా తీయటానికి వర్మ ఎంత సమయం, డబ్బు, వనరులు ఖర్చుచేసి ఉంటాడో? ఆ

చిత్రాన్ని రూపొందించడానికి ముగ్గురు జాతీయ అవార్డ్ గ్రహీతలని ఆ సినిమాలో నటింపచేయటానికి వర్మ ఎంత శ్రమించి ఉంటాడో? భూప్రపంచంలో ఒక చెత్త సినిమా తీసి ప్రేక్షకులతో ఛీ కొట్టించుకోవాలని ఏ దర్శకుడూ సినిమా తీయడు. కర్ణుడి చావుకి కోటి కారణాలు అన్నట్టు, ఓ సినిమా పరాజయానికి అనేకానేక కారణాలు ఉండొచ్చు కదా? ఆ ఆలోచనలతో వర్మని అంత మొందించాలన్న కోరిక నాలో బలహీనపడుతుంది. ఎందుకంటే అది అనితర సాధ్యమేమో? ఒక వ్యక్తిని చంపవచ్చు కానీ అతడి ఆలోచనను చంపలేము (సర్కార్ చిత్రంలోని ఒక సంభాషణ) ఎంత నిజం?

వర్మ ఒక సామాన్య మానవుడి స్థాయిని ఏనాడో అధిగమించేసాడు. వర్మ ఒక ఆలోచనా తరంగం, ఒక ప్రభావం, నిరంతర ప్రవాహం, క్లిష్టమైన వ్యక్తిత్వాల సమూహం. ఒక్కమాటలో చెప్పాలంటే వర్మని అంతం చేయటం అసాధ్యం. ఆ మాటకి వస్తే అలాంటి ఆలోచన రావటమే అవివేకం. వర్మ జన హృదయాలలో అమరజీవి. ఈ వ్యాసం ఇంతవరకూ ఓపికగా చదివి వర్మని అంతం చేయడం అన్న బలీయమైన కోరిక ఇంకా ఉన్నవాళ్లకి మాత్రం నేను కొన్ని సలహాలు సూచనలు ఇవ్వగలను. వర్మని అంతం చేయడానికి ఏ కిరాయి నరహంతకుడో, ఆయుధమో, పరికరమో, విస్ఫోటక పదార్థమో అవసరంలేదు. ఆయనని గత కొద్ది సంవత్సరాలుగా అతి దగ్గర నుంచి గమనిస్తున్నాను. ఉదయం మొదలు సాయంత్రం వరకు ఆయన చేసే ప్రతీ పని సినిమాకు సంబంధించిందే. కానీ రాత్రివేళల్లో ఆయన ఏమి చేస్తారనేది ఇక్కడ అప్రస్తుతం. ఆ ఒక్క విషయాన్ని నేను పాఠకుల విజ్ఞతకి, వారి ఊహాశక్తులకి వదిలేస్తున్నాను. వర్మ ఒక టెరా హెడ్జ్ అల్టి-మల్టి-టాస్కింగ్ ఉన్న మరమనిషి. ఆయన ఎల్లప్పుడూ ఏదో ఊహిస్తూ, ఆలోచిస్తూ, పిచ్చిరాతలు రాస్తూ, ఏవో పిచ్చి బొమ్మలు గీస్తూ, ఎస్.ఎమ్.ఎస్.లు పంపుతూ ట్విట్టర్‌లో సందేశాలు వదులుతూ ఉంటారు. ఈయన సామర్థ్యం చూస్తుంటే కచ్చితంగా ప్రముఖ దర్శకుడు శంకర్ 'రోబో' కన్నా వర్మాయే శక్తివంతుడేమో అనిపిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన్ని మనం 'రోబో గోపాల్‌వర్మ' అని పిలవచ్చు. ఆయన కదలికల్ని విశ్లేషించిన తర్వాత, వర్మని అంతం చేయడానికి ఒకే ఒక మార్గం - ఆయనని ప్రపంచంలో ప్రచార సాధనాల నుంచి (ముఖ్యంగా సినిమా) దూరంగా ఉంచటం. ఆయనని తీసుకెళ్లి ఒక కీకారణ్యంలో వదిలివేయాలి లేదా కలం, కాగితం, కంప్యూటర్, టీ.వీ., ఫోన్ ఎలాంటి ప్రచార/ప్రసార సాధనాలు, సౌకర్యాలు లేని ఏదైనా ఒక పెద్ద భవంతిలో ఖైదు చేయాలి. ఈ రెండు పద్ధతులు విజయవంతంగా అమలు పరిస్తే వర్మని కచ్చితంగా అంతం చేయవచ్చు. కాని పక్షంలో పరిణామాలు అత్యంత ప్రమాదకరంగా మారవచ్చు. వర్మ తప్పించుకొని బాహ్య ప్రపంచంలోకి తిరిగి వస్తే కనుక, ఆయన తన అనుభవాలన్నింటినీ రంగరించి ఒక సినిమాగా రూపొందించటం తథ్యం. ప్రచార సాధనాలు లేని ఆ ఇంట్లో ఆయన అనుభవాలను చిత్ర విచిత్రమైన కెమెరా కోణాల్లో బంధించి, ఒళ్లు గగుర్పొడిచే ముఖ కవళికలతో, భయానక భయంకర బీభత్సమైన

క్రీనీడలతో మరొక చిత్రాన్ని మన మీద వదలడం ఖాయం. ఈ మృగతృష్ణ ఇంతటితో ఆగదు. ఆ సినిమా విజయవంతం ఐతే దాన్ని తరువాయి భాగంగా, పరాజయం పాలైతే కథకి సున్నితమైన మార్పులు చేర్పులు చేసి మరో పేరుతో అదే కథాంశంతో ప్రేక్షకులపై పదే పదే దాడి చేయడం తథ్యం.

చివరిగా... వర్మ లేకపోతే మనకి ఆయన ప్రయాసతో రాసుకున్న అర్థంలేని కథలు, అత్యాశతో తీసే అర్థం కాని సినిమాలు, అర్ధ నగ్న కథానాయికలు, వ్యర్థమైన విలేఖరుల ప్రశ్నలు, ద్వంద్వార్థపు సమాధానాలు, సరదా సరదా వ్యాఖ్యానాలు, బురద జల్లే టీ.వీ. కథనాలు, సిగ్గు పడకుండా రాసుకునే బ్లాగ్, భగ్గుమనే వ్యాఖ్యలు, నిగ్గు తేల్చే ప్రతివ్యాఖ్యలు... ఇవేవి ఉండేవి కావు. వర్మే లేకుంటే ఇలాంటి వ్యాసం రాయొచ్చన్న ఆలోచన నాకు తట్టేది కాదు. ఆయన లేకపోతే ప్రపంచ వ్యాప్తంగా రోజు మొత్తం ఇంటర్నెట్‌లో సినిమాకి సంబంధించిన అడ్డమైన ప్రతీ విషయాన్ని / వ్యాసాన్ని పొల్లు పోకుండా మళ్లీ మళ్లీ చదివే నా ఈసాటి సినీ ప్రేమికులెవ్వరూ నా ఈ వ్యాసాన్ని చదివే వారు కాదు. ఇంతటితో నా ఈ సీదాసాదా సోదిని ముగిస్తున్నాను.

అతనో సూటి వంకర

జె.వి.రమణ (కాలేజ్ ఫ్రెండ్)

"సూటిగా ఉండేవాడు ఎప్పుడు వంకరగా కనిపిస్తాడు" ఇది రక్తచరిత్రలో ఒక మాట, బహుశ ఇది రాం గోపాల్ వర్మకు చాలా వర్తిస్తుంది.

చాలా ప్రశ్నలకు సమాధానాలు అంత సులువుగా దొరకవు. కాని తెలియని విషయాలు తెలిసినట్టుగా ప్రవర్తిస్తుంటాము. తెలియని విషయాలు తెలియవని, తెలిసిన విషయాలు ఎందుకు తెలుసునని అనుకుంటాడోనని విశ్లేషణాత్మకమైన వివరణ ఇవ్వగల వ్యక్తి రాం గోపాల్ వర్మ. అతడిది ఒక భిన్నమైన మనస్తత్వము.

నేను అతనిని సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజి, విజయవాడలో చేరిన మొట్ట మొదటి రోజే కలిసాను. అతను నాకంటే ఒక సంవత్సరము సీనియర్. నేను హాస్టల్ లో చేరిన రోజే అతను నా రూమ్ కు వచ్చి ర్యాగింగ్ విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు చెప్పాడు. కొన్ని నెలల తరువాత అతను మంచి కరాటే ఫైటర్ అని తెలుసుకున్నాను. అతను రోజూ కసరత్తు చేసేవాడు. కాని ఒక చిన్న గొడవ మినహా, ఎపుడు ఎవరిని కొట్టిన సందర్భము గుర్తులేదు. అతని గురించి నాకు ఆసక్తి కలిగించిన విషయం ఏమిటంటే వీధి గొడవల్లో పాల్గొనే వ్యక్తి పుస్తకాలు చదవడం, విశ్లేషించడం. ఇది ఒక అరుదైన కాంబినేషన్ అని నాకనిపించేది.

నేను, రాం గోపాల్ వర్మ మరియు ఇంకా కొందరు మిత్రులు కలిసి విజయవాడలోని కామయ్యతోపులో ఒక ఇంట్లో ఉండేవాళ్ళం. ఇందులో సత్యేంద్ర ఒకడు. మాకెవ్వరికి ఇంజనీరింగ్ చదువు పట్ల ఎంత మాత్రము ఆసక్తి ఉండేది కాదు. ఎప్పుడూ కబుర్లు, సినిమాలు మరియు ఏవేవో విషయాలు చర్చించే వాళ్ళము. సత్యేంద్ర ఒక పెద్ద మేధావి, అతని పట్ల అందరికి ఒక రకమైన గౌరవము, కొంత ఈర్ష్య ఉండేది. అతడు ఎప్పుడు పుస్తకపఠనములో మునిగి తేలుతూ ఉండేవాడు. అతని ఊహాజనకమైన ప్రశ్నలు మంచి చర్చలకు దారితీసేవి, అయితే రాం గోపాల్ వర్మ మటుకు చాలా ప్రాక్టికల్‌గా ఉండేవాడు. తత్వములో గాని, తర్కములో గాని మరీ విపరీత ధోరణిలోనికి వెళ్ళకుండా, తను గ్రహించిన సత్యాన్ని తన చుట్టూ ఉన్న వ్యక్తులకిగాని, పరిసరాలకిగాని అప్లై చేసే వాడు. అతను ఎప్పుడూ చిన్న, చిన్న విషయాలు గాని, రొటీన్ గా జరిగే విషయాల గురించి కాని ఆసక్తి చూపేవాడు కాదు. బహుశ అందుకేనేమో ఫ్యామిలి సెంటిమెంట్స్ గిట్టవు, భగవంతుని మీద నమ్మకం లేదు. రంగనాయకమ్మ రాసిన "రామాయణ విషవృక్షము" అతనికి చాలా నచ్చిన పుస్తకం. అందులోని విషయాలు తరచు

వివరించేవాడు. అతని ఆలోచనలు ఎప్పుడు సమాజాన్ని ఏదో ఒక రకంగా ఎలా ప్రభావితం చెయ్యాలా అని అది మంచిగాని, చెడుగాని, వాటి కారణాల గురించి గాని ఎక్కువగా ఆలోచించటం, విశ్లేషించటం చేసేవాడు. తను చెప్పాలనుకున్న విషయాన్ని అనువైన సందర్భము వెతుక్కుని లేదా సృష్టించుకుని ఆసక్తికరంగా చెప్పడంలో సిద్ధహస్తుడు. చాలా చిన్న విషయాలను కూడ భిన్నమైన కోణములో చూడగలడు. ఉదాహరణకు మామూలుగా ఎక్కడైనా ఒక రోడ్డు ప్రమాదం జరిగితే జనం అక్కడికి పరిగెత్తి, అక్కడ ఏమీ కాలేదు అని తెలిసిన మరునిమిషం చాలా నిరుత్సాహానికి గురవుతారు. అంటే జనం ప్రమాద స్థలానికి పరిగెత్తేది, అక్కడ ఏదో జరిగిందన్న థ్రిల్ ను experience చేయటానికే. అందువల్ల ఎవరికీ ఏంచవ్వకపోతే Disappoint అవుతారు అనేవాడు. ఇలాంటి ఆసక్తికరమైన విషయాలు చాలా చెప్పేవాడు.

అతనితో నాకున్న సహచర్యముతో గాని, అతనితో వివిధ సందర్భాలలో చర్చించిన విషయాల ఆధారంగా గాని, అతనిపై నాకున్న అభిప్రాయాలు/కలిగిన అభిప్రాయాలు/ నమ్మకాలు...

1. ఎప్పుడూ రిస్క్ అనుకునేవాడు అసలు పైకే రాడు
2. అందరికి అధికారంటే ఇష్టము, కాని కొందరికే అది పొందే ధైర్యము, సామర్థ్యము ఉంటుంది.
3. అతను ఇతరులను చూసి ఎలా నవ్వగలడో, అలాగే తనను తాను చూసుకొని నవ్వుకోగలడు.
4. మనము నమ్మదే నిజం. అసలైన నిజం అంటూ ఉండదు. నిజం గురించి ఈ నిజం చాలా మందికి అర్థము కాదన్న విషయం అతనికి చాలా బాగా తెలుసు.
5. ఎదుటి వాడి బలాన్ని కాని, బలహీనతను గాని అంచనా వేయగలడు. తన ఈ అంచనాలను తనకు అనుకూలంగా వాడుకోవడంలో దిట్ట.
6. అతను తన failures కి ఇతరులను బాధ్యులు చేయడు.
7. తను చెప్పుకునేంత చెడ్డవాడు కాదు. నిజానికి అతనిలో ఒక చాలా సున్నితమైన మనిషి దాగి ఉన్నాడు.
8. అతనికి డబ్బుపై అసలు మోజు లేదు. అందుకేనేమో కరెన్సీ నోట్లు నలిపేసేవాడు.
9. తనకు నచ్చినట్టే తను జీవించేవాడు.

తను

– **మోహన్ కృష్ణ** (క్లాస్‌మేట్)

ఫోన్‌లో 'హలో మోహన్' అన్న తన పిలుపు... సరిగ్గా 25 ఏళ్ల కిందట విజయవాడలో కేసీపీ కాలనీలో రూమ్‌మేట్లుగా ఉన్నప్పటి నా మిత్రుడి గొంతును పోలి ఉంది. అప్పట్లో మా ఇద్దరి మధ్య ఉన్న సాన్నిహిత్యాన్ని ఆ గొంతు ఒక్కసారిగా మళ్లీ గుర్తుచేసింది. తనతో నా సహవాసాన్ని భాగాలుగా విభజించి చెప్పుకోవచ్చు.

కాలేజీలో చేరిన మొదటి సంవత్సరంలో కొత్త స్నేహాలు, కొత్త ఫ్రెండ్ సర్కిళ్లు, వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన వారిలో ఒకే అభిప్రాయాలు కలిగి ఉన్నవారు జట్టుకట్టడం ప్రారంభించాం. తను హైదరాబాద్ నుంచి వచ్చినా... కేవలం హిందీ మాట్లాడే హైదరాబాదీలతోనే కాకుండా అందరితో కలిసిపోయేవాడు. తెనాలికి చెందిన నాకు మద్రాసు, హైదరాబాద్‌ల నుంచి వచ్చిన వారంటే ప్రత్యేక ఆసక్తి ఉండేది. కానీ, తను మాత్రం నాకు మరింత ఆసక్తి కలిగేలా చేశాడు.

రూమ్ మధ్యలో పంచింగ్ బ్యాగ్ పెట్టుకొని బాక్సింగ్, కరాటే సాధన చేసేవాడు. అతను తెలుగు మాట్లాడితే... స్వచ్ఛమైన ఆంధ్రుడిలా, హిందీ మాట్లాడితే పక్కా హైదరాబాదీలా, ఇంగ్లీషు మాట్లాడితే ఓ విద్యావేత్తలా ఉండేవాడు. అప్పట్లో మా కాలేజీలో ర్యాగింగ్ మితంగానే ఉండేది. మాకు సీనియర్ బ్యాచ్ ఒక్కటే ఉండేది. సీనియర్లను, తను తన మాటలతో కట్టిపడేయడంతో మాకు ర్యాగింగ్ బాధ తప్పింది. సంగీతంపై బాగా మక్కువ చూపేవాడు. కాలేజీ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనేవాడు.

సివిల్ ఇంజనీరింగ్‌లో ఇద్దరం ఒకే తరగతిలో చదవడం వల్ల ఒకరి గురించి మరొకరు తెలుసుకునే అవకాశం కలిగింది. తను ప్రతి విషయంలోనూ విభిన్నంగా ఆలోచిస్తూ చాలా తెలివైన వాడిలా ఉండేవాడు. కానీ, తను చదువులో వెనుకబడి ఉండటం నాకు ఆశ్చర్యం కలిగించేది. ఇతర విషయాల్లో అద్భుత నాలెడ్జ్, భాషపై పట్టు ఉన్న తను ఇంజనీరింగ్ సబ్జెక్టుల్లో మాత్రం తడబడేవాడు. ఇలాంటి వారిని మరికొంత మందిని చూడటంతో... నాకు ఇంజనీరింగ్‌లో మంచి మార్కులు పొందగలననే నమ్మకం కుదిరింది. కానీ, తనలాగా కరాటే ఎక్సర్‌సైజ్‌లు, ఇంగ్లీష్ నవలలు చదవడం, హిందీ, ఇంగ్లీష్ సినిమాలు చూడడంలాంటివి చేయాలని నాకూ అనిపించేది. కేవలం పుస్తకాల పురుగులతోనే కాక ఇతర రంగాల్లోనూ రాణిస్తున్న వారితో జట్టు కట్టాలని నిర్ణయించుకున్నాను.

తను హాస్టల్‌లో కరాటే సాధనకు ఓ గ్రూప్‌ను ప్రారంభించినప్పుడు కొద్దిమంది అత్యంత ఉత్సాహంతో చేరారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనేలా తను ఇతరులను ఒప్పించేవాడు. ఆ సమయంలో తను తనకు తోచిందే చేసేవాడు. కానీ, పరీక్ష ఫలితాలు వచ్చినప్పుడు మాత్రం... తన తండ్రి కోర్కెను తీర్చలేకపోతున్నందుకు చాలా బాధపడేవాడు. ఇక ఇంజనీరింగ్ మూడు, నాలుగు సంవత్సరాల్లో మేం ఇద్దరం బాగా మాట్లాడుకునేవాళ్లం. ఇద్దరం వేర్వేరు ఫ్రెండ్ సర్కిళ్లతో కలిసి తిరిగేవాళ్లం. నాకు విద్యావిషయాల్లో ఆసక్తి ఎక్కువగా ఉండేది. తను 'రాముడు మంచి బాలుడి'లా ఓ పెన్ను, పుస్తకం పట్టుకొని వెళుతూ బాగా చదువుకొని తన తండ్రి నమ్మకాన్ని కాపాడాలని కోరుకునేవాడు. కానీ, ఆ ఆలోచనకు ఒకటిరెండు రోజుల్లోనే స్వస్తి చెప్పేవాడు. ఇదే సమయంలో తను నాకు జూనియర్ అయ్యాడు. ఎందుకంటే అతని సబ్జెక్టులు చాలా మిగిలిపోయాయి మరి.

అలాంటి సమయంలోనూ సినిమాల రూపకల్పన, సినిమా వ్యక్తుల ప్రత్యేకతపై మాట్లాడేందుకు ఎక్కువగా ఆసక్తి చూపేవాడు. జనాల మనోభావాలపై అతనికి విలక్షణమైన ఆసక్తి ఉండేది. కొత్త క్లాస్‌లో అతనికి సరిగ్గా తెలియకపోయినా టాప్ ర్యాంకర్ గురించి చెబుతున్నప్పుడు... తనలోని విశ్లేషణా శక్తి నాకు అర్థమయ్యేది. అప్పటి మా ప్రిన్సిపల్ తుమ్మల వేణుగోపాలరావు కాలేజీలో విద్యార్థులను బలవంతంగా ఎలా క్రమశిక్షణతో ఉంచేవారో కూడా చెప్పేవాడు. అలాగే టీచర్ల మనోభావాలు కూడా చక్కగా విశ్లేషించేవాడు. ప్రత్యేకించి మాథ్స్ ఈ విశ్లేషణలు స్టూడెంట్స్ మీద కూడా కొనసాగేవి. కాలేజీలో అత్యంత ఆకర్షణీయమైన వ్యక్తి ఎవరనే విషయాన్ని తెలుసుకొనేందుకు అందరి అభిప్రాయాలు తీసుకొనేవాడు. వాటితో తన ఆలోచనలను పోల్చి చూసుకునేవాడు.

హాస్టల్ నుంచి వెళ్లిపోయాక (చదువులో అతను పల్టీ కొట్టడం వల్ల పంపించివేశాక) రవీందర్, నర్సింహారావు, శ్రీధర్‌లాంటి వాళ్లతో కలిసి కామయ్యతోపులో ఉండేవాడు. నాకు తెలిసి వాళ్లంతా చదువులో ఇబ్బందులు పడేవారే. సినిమాలు, మార్షల్ ఆర్ట్స్ మధ్యలో కాస్త చదువుతూ ఉండేవాళ్లు. ఆ రెండేళ్లలో కాలేజీలో కొన్ని ఫైట్‌లు జరిగేవి. ఆ రోజుల్లోవాళ్లు ఎవర్నయినా కొట్టాలంటే 'స్పాట్' అనేవాళ్లు. చాలా గ్రూపులు ఉండేవి కానీ, తను, తన ఫ్రెండ్స్ గ్రూపులు వేరు. వాళ్లంతా బాగా ఎంజాయ్ చేసేవారు. పరిస్థితులను బట్టి గ్రూపులను మారేవాడు. కానీ, అతను స్పాట్ పెట్టే కార్యక్రమంపై వీటీ ప్రసాద్, పట్టాభి, ఎల్.రాజగోపాల్ వంటి ధైర్యస్థులతో బాగా మాట్లాడుతుండేవాడు. నవ్వొచ్చే విషయం ఏంటంటే కొట్టుకొనేటప్పుడు పారిపోయి తప్పించుకొనేవాళ్లను కూడా పొగిడేవాడు.

ఏ గ్రూపులో చేరకుండానే ఫైటింగ్స్ జరిగే సమయంలో భయాందోళనలు ఎలా ఉంటాయనే విషయాన్ని తెలుసుకొనేందుకు ఎక్కువగా ఆసక్తి చూపేవాడు. అప్పట్లో స్టూడెంట్స్ యూనియన్ ప్రెసిడెంట్‌గా ఉన్న నేను ఓసారి అలాంటి కొట్లాటలో పాల్గొన్నప్పుడు అతని పరిశీలనాశక్తిని గమనించి ఆశ్చర్యపోయాను.

విభిన్న విషయాలపై అతని ఇష్టాయిష్టాలు, వాటిపై తీవ్రంగా చర్చించడాన్ని గుర్తించాను. గాడ్‌ఫాదర్ సినిమాలోని సీన్లు, నవలలోని సంభాషణలు, ఇళయరాజా పాటలు, జాస్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, శ్రీదేవి అందం, జయసుధ, రేఖల నటన, బ్రూస్‌లీ జీవితకథ, మెక్‌కెన్నాస్ గోల్డ్‌లో వాయిస్ ఓవర్, క్రికెట్ పై అతనికున్న ద్వేషంలాంటి ఎన్నో విషయాలపై అతని ఆలోచనలను క్యారక్టరైజ్ చేసేవాడు.

కానీ, నేను ఆ విషయాలపై ఎక్కువగా దృష్టి పెట్టలేదు. తర్వాత నేను తనలోని ఫిలాసఫీ నాలెడ్జ్‌ని నెమ్మదిగా అర్థం చేసుకున్నాను. మా బంధం చివరి దశలో అదే పెద్ద అంశంగా మారింది.

విజయవాడలో నేనున్న చివరి సంవత్సరంలో ప్రపంచంలోని అన్ని విషయాల గురించి మాట్లాడుకోవడం ద్వారా తన గురించి మరింత తెలుసుకున్నాను. ఆ సమయంలో నేను గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి కాలేజీలో అసోసియేట్ లెక్చరర్‌గా చేరాను. అప్పటికి ఇంకా తను చదువుతో కుస్తీ పడుతూనే ఉన్నాడు. అప్పుడు మేమిద్దరం కేసీపీ కాలనీలోని రూమ్‌లో ఉండేవాళ్లం. తను చాలా సీరియస్‌గా పుస్తకాలు చదివేవాడు. కానీ అవి ఇంజనీరింగ్‌వి కాదు ఫిలాసఫీవి. అదే సమయంలో అతను సత్యేంద్ర పట్ల బాగా ఆసక్తి చూపేవాడు. అప్పుడు అతను తన డిగ్రీ ఎప్పుడు పూర్తి చేసినా ఫర్వాలేదన్న నిర్ణయానికి వచ్చేశాడు. నా సాన్నిహిత్యం అతనిపై ప్రభావం చూపలేదు. కాని అతని ఆలోచనలే నన్ను ప్రభావితం చేశాయి. అప్పట్లో తన గర్ల్‌ఫ్రెండ్ దగ్గర నుంచి చాంతాడంత లెటర్లు వచ్చేవి. వాటిని మళ్లీ మళ్లీ చదువుతుండేవాడు. తనకి తాత్వికంగా పెద్ద పెద్ద లెటర్లు రాసేవాడు.

అప్పట్లో నాకు తను ఇచ్చిన 'పొలిటికల్ థాట్' పుస్తకం నన్నెంతగానో ప్రభావితం చేసింది. చదవడంపై నా ఆసక్తిని పెంచింది. అప్పటి నుంచే నేను ఫిలాసఫీని ఎంత ఇష్టపడుతున్నానో తెలుసుకోగలిగాను. నీషే గురించి ఎప్పుడు మాట్లాడినా నేనెంతో శ్రద్ధగా వినేవాడ్ని. అలాగే దజ్‌స్పోక్ జారతుస్త్ర, అయాన్ రాండ్‌ల గురించి కూడా ఎక్కువగా చెబుతుండేవాడు. పవర్ గురించి, నీషే మీద తనతో చర్చ జరుగుతున్నప్పుడు కొంతసేపు అది నా పరిధి దాటి ఉండేది. అలాంటప్పుడు నేను కేవలం వింటూ ఉండేవాడ్ని.

తనకి సినిమాలపై ఉన్న ఇష్టం, పరిశీలన చూసిన నేను... భవిష్యత్తులో అతను తప్పకుండా డైరెక్టర్ అవుతాడని చెప్పిన మొదటి వ్యక్తిని నేనే. ఇద్దరం కలిసి ఉన్న చివరి రోజుల్లో... డైరెక్టర్ కావాలన్న తన కోరికను నాతో చెప్పేవాడు. అప్పుడు నేను... ముందు డిగ్రీ పూర్తి చేయమని తనకి చెప్పేవాడ్ని. ఆ తర్వాత నేను అక్కడి నుంచి వేరే దేశం వెళ్లిపోవడంతో మా ఇద్దరి మధ్య సంబంధం తెగిపోయింది.

చాలా సంవత్సరాల తర్వాత సెలవుల్లో రాష్ట్రానికి వచ్చిన నాకు ఓ రోజు 'శివ' అనే సినిమా పోస్టర్‌పై రాంగోపాల్ వర్మ పేరు కనిపించింది. దాన్ని చూసి నేను అది ఎవరని తెలుసుకొనే ప్రయత్నం చేయలేదు. ఎందుకంటే అది తనే అని నాకు తెలుసు.

నన్ను అత్యంత ప్రభావితం చేసిన నా కాలేజ్ ఫ్రెండ్ సత్యేంద్ర ఈ పుస్తకం కోసం నా గురించి తన అభిప్రాయం పంపాడు. ఈ పుస్తకంలో వున్న అన్ని ఆర్టికల్స్ తెలుగులో ఉన్నా సత్యేంద్ర పంపించిన ఈ ఒక్క ఆర్టికల్‌ని మాత్రం ఇలాగే ఇంగ్లీషులో యథాతథంగా ఉంచేయాలని నిర్ణయించు కున్నాను. ఎందుకంటే సత్యేంద్రని అనువదించేటంతటి సామర్థ్యం, నాకు గానీ ఇంకెవరికి గానీ లేదని నా నమ్మకం. అర్థమయితే చదవండి. అర్థమవ్వకపోతే ఐ డోంట్ కేర్.

– రామ్‌గోపాల్ వర్మ

Reminiscences on Ram

– Satyendra

It is a peculiar feature of complex systems, both societal and biological, that they exhibit extreme and frequently unpredictable nonlinear behavior. And nowhere does the veracity of this statement receive a more resounding endorsement than here in India – the land of the ultimate paradox. Thus we see that while the average level of beauty in India is low, unlike say Sweden, where as one visitor there assured me "80 percent of the women are beautiful", yet, we note to our astonishment, that the most beautiful women in the world are invariably from the Indian subcontinent. And it is not patriotic chauvinism on my part that makes me say this. On a return flight from Germany in 1994, I was personally informed by the German Air-hostess, who had travelled all over the world and knew what she was talking about, that in no country she had visited had she encountered women of such surpassing and arresting beauty as in India. Nor does the paradoxical aspect of this nation end at this issue of mere physical pulchritude. To cite another example, we find that the majority of Indians have not experienced true love, and never will, have no idea indeed what it means other than the banal interpretation drawn for them by the movies; And so pervasive is the lacuna of emotion in this respect that whole hordes of Indians have little hesitation of marrying entire strangers – not infrequently face unseen - a proclivity institutionalized in the classic Indian arranged marriage which routinely appalls the visiting westerner, the vast majority of whom

– as I can vouchsafe from personal experience in America - *do* marry *for* love. Yet remarkably enough the very greatest of loves are to be found in India. In this mass morass of conformity, banality, indifference and apathy to this greatest of all human emotions, which lends such delicacy, felicity and purity to that most ancient bond between man and woman, we occasionally run into individuals willing to risk and sacrifice career, life and limb in order that they may win the hand of their beloved. Few westerners can, or do, feel love with the overwhelming single –mindedness of the smitten Indian.

To this elite group of rare individuals Ramgopal, fortunately or unfortunately, belonged in the year 1979 when I first met him as a sophomore student at Siddhartha Engineering college. His was a love for a Hyderabadi girl, a love of singular purity, which regrettably went un-requited for a full 5 years – an eternity for a teenager. People today know only the jolly Ram, the articulate Ram, the suave Ram, Ram the professional director and producer, Ram the success story, and may feel a twinge of envy and admiration in equal measure. What few, if any , of the coterie of admirers of the modern generation realize is that this state of success and felicity was arrived at only after he had paid his dues in pain, after he had gone through a harrowing and traumatic period of acute sorrow. Even amongst those of his contemporaries who knew him back then, only a tiny number were fully cognizant of this fact and fathomed the extent of his melancholia that lay as a shadow and incubus over his life for so long. The fact that despite his protestations of true undying love, his declarations of fealty were spurned, even snubbed, devastated him, and marked his countenance for the entire 4 year period I knew him at college. Even to those who didn't know him his solemnity of demeanor and introspection was obvious, and, since virtually all didn't know the cause, nonplussing. He once told me that his thwarted love had affected him so much as to rob him of all joy in the common pleasures of life. That watching movies, being with friends, reading, or going out to restaurants were to him now tasteless and unfulfilling activities. And it was not hard to believe him, for his large eyes, noted at that tender age by both men and women for their singular beauty, shone like two broken rainbows over a shattered inner world.

This lacerating pain continued unabated day after day, and accounted in no small measure for his obsessive practice of the martial arts, in whose stern and unyielding regimens of training and pain, he sought to submerge the pain and turmoil that raged within him. It accounted too for his chronic irritability and shortness of temper which made not a few uncomfortable in his presence – for they found his callused blackened knuckles - toughened by relentless battery against a sand -laden punching bag – and dead calm un-nerving.

Yet he was popular - very much so; his company sought, his favors desired. The fact that he was fearless of combat and could be counted on – by those on whom he bestowed his friendship - to provide support in the event of a gang-fight or other physical squabbles, made many attempt to curry his favor. He was not stupid , of course, easily saw through their pretenses, yet was rarely offended. That he was viewed by many in this light, as a feckless thug, was ironic really considering that he can easily be counted amongst the gentlest of souls I have ever met - certainly possessed of greater compassion and empathy than perhaps anyone I have known. Such was the sanctity in which he held all life that in a fit of remorse, while in Intermediate, he smashed in two an air-gun, a prized possession of his, after he had shot dead a sparrow. When a mosquito stung his forearm he refused to smash it with open palm as virtually all of us do, but would gently brush it away lest he do it harm. When he saw a bunch of hooligan kids beat a mole to death he burst into tears. Needless to say he was also a vegetarian. . He was, unbeknownst to himself, a complete and practicing Buddhist, though he proclaimed himself an atheist. Such excessive sensitivity of soul is rare in anyone and particularly so in the militant *Kshatriya* caste to which he belonged for he was a *Raju.*

This great sentimentality of his was known to not a few, and it is saddening for me to record that the bulk of his acquaintances sought his company more for his prowess in combat than for this far nobler and rarer character trait. And in one so quiet and introverted, given to speaking only when spoken to, the list of his professed “friends” was astonishing to behold. There was hardly an occasion when I took an evening walk with him when we weren’t accosted by at least half a dozen sundry friends with whom he had

little choice but to bandy banalities, while I stood frustrated nearby, determined henceforth never to go on walks with him, for any such perambulation soon became a fractured , interrupted series of unending "Hi-byes".

All this relentless fixation on martial arts training and the time lost to paltry palaver with innumerable cohorts and acquaintances, inevitably affected his studies for the worse. Though of gifted memory – he was a class ranker up to the 6th form and often needed to read something just once before it was absorbed wholly into memory - he failed to pass for two years in a row. Yet he read a fair amount – mostly thriller novels, from which doubtless the first seeds of imagination, that would burst into such productive flower 10 years later when he became an iconoclastic film-director, were first planted: Robert Ludlum, James Hadley Chase, Alfred Hitchcock, and a multitude of others , all passed through his hands. It goes without saying that his negligence of his studies worried his parents – his father once confessed to me he didn't know in which year he currently was - not unwarrantedly, for back then, 30 years ago, times were hard, money was scarce, the economy in a doldrum, and we were chronically short of funds, with no prospect of gainful employment even after graduating, for jobs too were difficult to come by. .

Yet such is the power of youth, its reliable gusher of energy guaranteeing mindless happiness, that by and large joy pervaded our frames. Our beings were marked by great purity, idealism and even ecstasy. In the third year of Engineering several of us like-minded students got together, pooled our money, and took a ramshackle red-tiled, oblong multi-partitioned house in rent. I lived in the front portion of the very first section, a verandah really, peremptorily latching the adjoining door and sealing myself off from the rest. It was a room only if you tried hard to believe it was, for the entire front was a metallic grille that opened my room out to the outer courtyard that lay drenched in a welter of fallen leaf in a daily celebration of life. What an ecstatic chord does the memory of those halcyon years now evoke in me. There was a freshness, if not wisdom, that pervaded our lives – late nights spent reading under the yellow naked incandescent bulb, our youth shielding us easily from the ravages of lack of sleep and worse

nutrition. We could do anything, go anywhere, with impunity - and we did. We got by on nothing, yet felt like kings. Ram lived, along with another friend, behind me in a separate dingy section into which little light penetrated as a result of my sealing off the partition door. It was rare for me to associate with either, lost as I was in a world of my own.. Though cheek-by-jowl neighbors we hardly ever spoke to each other at all, primarily owing to the disdain and superciliousness I held for all. Whether my attitude was justified is open to question; that it didn't provoke anger or hostility on their part is as indisputable as it is praiseworthy.

The dry air of Vijayawada in winter provokes an exhilaration of soul and the days and nights fled by in a blur of reading, occasional drinking, a little trouble-making but fortunately no wenching. I had inherited a set of Weights from a departing Yugoslav friend and Ram would lift them dutifully each day, the clanging of the iron hitting cement greeting my ears morn and evening. We – or rather I - on occasion, as already mentioned, would imbibe prodigious amounts of alcohol of a level which if taken today would readily prove fatal. It is amazing how much liberty of mind and body our sheer youth afforded us, a fact that is obvious to me only now thirty years later.

Did he and I go to the movies often ? Yes, very often. Hardly a fortnight would pass without him dragging me off to a film he assured me was a classic. And by and large his judgment was impeccable. They *were* classics. To name just a few: *Vasanthakokila, Guppedu manasu.* The kind of technical wizardry so prevalent in movies nowadays and which can readily camouflage shoddy film-making and a second-rate, limp storyline just wasn't available in those days. Movie directors and script writers really had to use their wits and focus a lot more attention on plot and articulation of dialogue, in order for their film to be commercially viable. Of course there were duds and flops even back then, some so bad that we left the cinema hall in the intermission itself. But equally it is surprising how many of those movies were indeed good - both Telugu and English flicks - and were by and large - and I say this without a moment's hesitation - of a far higher and more uniform quality in the 1970s and 1980s than now. High tech garbage like *Independence Day, Star Wars, Mars Attacks,*

The Sixth Element and sundry other techno-crap which blight the movie landscape now, just weren't around.

Poor as we were back then, we went to movies at a surprising high frequency, for , unlike now, movie tickets in those days were not so prohibitively priced. Some truly enduring classics like *Sphinx, Rollerball, Rider on the Rain, The Clockwork Orange* were seen by Ram and me. This invariably and mystifyingly on second shows. Mystifying because I am hard-pressed now to account for our predilection for the late show, for the return journey to the suburbs on the dilapidated RTC bus was often a nightmare that all but annulled the joy the movie had afforded us.

It is questionable whether movies as outstanding as those we so routinely saw will ever be made again. And it is not maudlin sentimentality for the lost irretrievable past that makes me say this. Strictly, objectively speaking, movies were simply better architected three decades ago. Audiences had nothing else to do, had better and longer attention spans, and this gave the director time, latitude and space to develop his theme. Nowadays on the other hand, such a plethora of sources of enjoyment distract the consumerist public, most of whom have lost the reading habit, and the skills of sustained attention that it develops, that movie-makers – including Ramgopal - have little choice but to make movies of crass commerciality in order to stay viable and solvent in a fickle market. Thematic movies involving intricate plot, complex character development are simply out of the question, and what was once truly a very expressive art form has now sunk to the level of visual pre-digested pap. Will this dismal scenario change ? No, not likely. That said it is still possible for an established director of sound financial standing to afford the luxury of making *occasionally* an outstanding, thought-provoking movie. We , the discerning public, a near invisible minority, cannot, and should not, ask for more.

Blank Page



రకరకాల ప్రశ్నలకి, కామెంట్లకి, స్టేట్‌మెంట్లకి

నా రకరకాల రియాక్షన్లు

Blank Page

1. మీ పెళ్లి విఫలమయింది. కానీ అయాన్ ర్యాండ్ పెళ్లి సక్సెస్. తేడా ఎక్కడుంది?

జ. **నా భార్యకి చెడ్డ మొగుడు దొరికాడు. అయాన్ ర్యాండ్‌కి మంచి మొగుడు దొరికాడు.**

2. మీరు నిజంగా ఎమోషనలా లేక ఎమోషనల్‌గా ఉన్నట్టు నటిస్తారా?

జ. **ఎమోషన్ల పట్ల చాలా ఎమోషనల్‌గా ఉంటా... ఎమోషనల్ గాళ్ళ దగ్గర ఎమోషన్ నటిస్తా.**

3. మీరు నేర్చుకున్నదాని నుంచి నాకు నేర్చుకోవాలని ఉంది.

జ. **నేను నేర్చుకొన్నదాని నుంచి నువ్వు నేర్చుకోకపోవడం గానీ, నేను నేర్చుకోలేకపోయినదాని నుంచి నువ్వు నేర్చుకోవడం గానీ మంచిది కాదు –**

గమనిక: **నేనిక్కడ అన్నదాంట్లో అర్థం నాక్కూడా సరిగ్గా అర్థం అవలేదు కానీ అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తే ఎక్కడో అర్థం ఉండే ఉంటుంది అని నా అర్థం.**

4. ఎదుటివారిని ఒప్పించడం ఎలా?

జ. **ముందు మిమ్మల్ని మీరు ఒప్పించుకోవడం ద్వారా.**

5. ఫ్లాపులు తీస్తున్నా మీకింకా ఫైనాన్సు చేసేవాళ్ళు దొరుకుతున్నారే?

జ. **మీలాంటి అమోఘమైన టాలెంట్ ఉన్న వాళ్ళు క్లాసిక్స్ తీస్తామన్నా ఒక్క పైసా కూడా ఇవ్వని వాళ్ళే నాకు కోట్లు ఫైనాన్స్ చేస్తామని వెంటపడు తుంటారు.**

6. మాలాంటి అల్పులతో మాట్లాడుతుంటే మీకెలా అనిపిస్తుంది?

జ. **నేను దేవుణ్ణని అనిపిస్తుంది.**

7. మీడియాలో మీ మాటలు వినీ, మీ రాతలు చదివీ – మీరో గొప్ప నటుడనే అభిప్రాయానికి వచ్చేసా.

జ. **ఆ అభిప్రాయం కోసమే నా నటనంతా.**

8. శ్రమకీ, కఠోర శ్రమకీ తేడా ఏమిటి?

జ. **ఇష్టపడి చేస్తే శ్రమ. ఇష్టం లేకుండా చేస్తే కఠోర శ్రమ.**

9. మీరు ఒకేసారి ఇరవై పనులు చేస్తానంటారు. టెక్నికల్‌గా ఇది సాధ్యమేనా?

జ. **మీలాంటి మామూలు వాళ్ళకి కాదు. దయ్యాంశ సంభూతుడినైన నాకు సాధ్యం.**

10. తెలివైన వాళ్ళని పొగరుబోతులనీ, తెలివితక్కువ వాళ్ళను అమాయకులనీ అంటారు.

జ. **అమాయకత్వం అంటే అసలేమీ తెలియకపోవడం. తెలిసీ అర్థం చేసుకోలేక పోతే అది తెలివితక్కువ. తెలుసుకోవాలని అనుకోకపోవడం పొగరు. అమాయకత్వం ఉందని తెలుసుకోవడమే తెలివి.**

11. గాంధీగారు నగ్నంగా ఉన్న ఆడాళ్లతో పడుకొనేవారనే రూమర్ విన్నారా?

జ. అది రూమర్ కాదు ఆయనే స్వయంగా ఒప్పుకొన్నారు. తన బ్రహ్మచర్య దీక్షకి ఆయన పెట్టుకున్న పరీక్ష అది. ఆయన మన జాతి పిత కాబట్టి ఇక్కడితో వదిలేద్దాం.

12. మన భావోద్వేగాలన్నీ లాజిక్‌కి లొంగుతాయా?

జ. లాజిక్‌కి అందని భావోద్వేగాలకు విలువ లేదు.

13. మీరు గణిత మేధావి శ్రీనివాస రామానుజం మీద సినిమా తీస్తే చూడాలని ఉంది.

జ. నాకు ఎక్కాలంటే చిరాకు.

14. స్వచ్ఛమైన ప్రేమ, స్వచ్ఛమైన కామం – వీటిలో ఏది అర్థవంతమైనది?

జ. స్వచ్ఛమైన ప్రేమలో కామం, స్వచ్ఛమైన కామంలో ప్రేమా ఉంటాయి. కామం పవిత్రం. ప్రేమ దివ్యం. స్త్రీ దేహం దేవాలయం.

15. స్త్రీ లోలుడికీ, ప్రేమికుడికీ తేడా ఏంటీ?

జ. లొంగదీసుకొనేవాడు స్త్రీ లోలుడు. లొంగిపోయేవాడు ప్రేమికుడు.

16. మీ వీరాభిమాని ఎవరైనా హాస్పటల్‌లో చివరి క్షణాల్లో ఉండి, మిమ్మల్ని కలవాలని ఉంది అనుకుంటే వెళతారా?

జ. అది అప్పుడు నాకున్న వేరే ప్రయారిటీల బట్టి ఉంటుంది. అదే కాకుండా నేను నచ్చేవాళ్ల కన్నా నాకు నచ్చేవాళ్ళే నాకు ముఖ్యం.

17. మీ కోపాన్ని మీరెలా అదుపులో పెట్టుకుంటారు?

జ. కోపం తెప్పించిన వ్యక్తుల మీద కోప్పడకుండా, కోపం తెప్పించే నా ఉద్వేగం మీద కోప పడడం ద్వారా.

18. మీరు పైకి కఠినంగా కనబడ్డా, మీలో చాలా సున్నితత్వం ఉంది. ఒకే మనిషిలో ఈ రెండూ ఉండడం సాధ్యం కాదు.

జ. దుఃఖం నుంచి తప్పించుకోవడానికి నేను కఠినత్వం అనే ముసుగు వేసుకుంటాను.

గమనిక: ఇది నిజం కావచ్చు, కాకపోనూ వచ్చు.

19. అందరికంటే మిమ్మల్ని విభిన్నంగా ఉంచే అంశం ఏమిటి?

జ. నా విభిన్నం.

20. గతంలో మీరూ మణిరత్నం కలిసి 'దొంగా దొంగా', 'గాయం' స్క్రిప్టులు రాశారు కదా.... మళ్ళీ ఎప్పుడు?

జ. కలిసి రాశామన్న మాటే గానీ ఆయన మాట నేను వినలేదు. నా మాట ఆయనా వినలేదు. సరదాగా ఇద్దరి పేర్లూ వేసుకున్నాం అంతే...

21. 'దేవుడు శిక్షిస్తాడు!' అనే మాట మీరు నమ్ముతారా?

జ. తామే శిక్షించే దమ్మూ ధైర్యం లేని వాళ్ళు చెప్పే మాటలివి.

22. మీరు ఒకేసారి ఇన్ని సినిమాలు ఎలా చేస్తారు?

జ. సీక్రెట్.

23. మీకింత శక్తి ఎక్కడనుంచి వస్తుంది?

జ. పోయే లోపల చాలా చాలా సినిమాలు చేయాలనే కోరిక లోనుంచి...

24. విజయం అంటే ఏమిటి? విజేత ఎవరు?

జ. విజయం అనేది ఇతరుల కోసం. విజేతగా ఉండడం మనకోసం.

25. కామాన్ని అధిగమించడం సాధ్యమేనా?

జ. నువ్వేమి మాట్లాడుతున్నావో అర్థమౌతోందా? కామం, దేముడూ... ఈ రెండే తెలివీ, చదువూ అక్కరలేకుండా తాదాత్మ్యం పొందగలిగేవి.

26. ఆరాధించే వారెవ్వరూ భగవంతుడు కాలేరు.

జ. ఆరాధన నటించే వారు మాత్రం గ్యారెంటీగా రాజకీయ నాయకులు అవుతారు.

27. మీకు ఇతరుల గుర్తింపు, మెప్పు అవసరం లేకపోతే అందరి దృష్టిలో పడాలనే ప్రయత్నం ఎందుకు?

జ. నాకు పబ్లిసిటీ పిచ్చి కాబట్టి

28. మీరు మరీ టూ మచ్ అంటుందండీ నా గర్ల్ ఫ్రెండ్.

జ. నేను టూ మచ్ అనుకుంటే ఆవిడ మరీ టూ లెస్ అయ్యుంటుంది.

29. సెక్సుకీ, మందుకీ మీరు నిజంగా అంత ప్రాధాన్యత ఇస్తారనుకోను. వాటి వల్ల పనులు డిస్టర్బ్ కావూ?

జ. భలేవాడివోయ్.. మన జీవితంలో ఆనందాన్నిచ్చేవాటిని 'ప్రాధాన్యత' అనే చట్రంలో బంధిస్తే ఎలా?

30. రామాయణం ఆధారంగా మంచి సినిమా తియ్యకూడదూ?

జ. దాని బదులు రావణామాయణం తీస్తా.

31. మీరు చెడింది చాలదూ... అందర్ని చెడగొట్టాలా?

జ. చెడిపోతేనే గదా బాగు పడేది....

32. మీరు రోర్క్ అంత స్వార్థపరులా?

జ. రోర్క్ నిస్వార్థమైన స్వార్థపరుడు. నేను స్వార్థపూరితమైన నిస్వార్థపరుణ్ణి.

33. ప్రేమించిన వాడిలో తప్పుల్ని అమ్మాయిలు క్షమించినట్టుగానే, ఓవరాల్‌గా సినిమా బావుంటే చిన్న చిన్న తప్పుల్ని ప్రేక్షకులు క్షమించేస్తారు

జ. నిజమే కానీ, సీరియస్‌గా తీసామని కలరిచ్చే రియలిస్టిక్ సినిమాల విషయంలో అది నిజం కాదనిపిస్తుంది. ఎందుకంటే ఒక అమ్మాయి తను కేర్ చెయ్యని వ్యక్తి ఏం చేసినా పట్టించుకోదు. కానీ తను బాగా కేర్ చేసే వ్యక్తి చిన్న తప్పుల్ని కూడా భూతద్దం లో చూసి ఏకిపారేస్తుంది.

34. అయాన్ ర్యాండ్ ఫిలాసఫీ మీద రాసిన పుస్తకాల కన్నా ఆమె రాసిన కాల్పనిక కథలకే ఎక్కువ ప్రాచుర్యం వచ్చింది. ఎందుకని?

జ. ఫిలాసఫీని నేరుగా చెబితే అర్థం చేసుకొనేంత తెలివి మనకు లేదని ఆమెకు స్పష్టంగా తెలుసు. అందుకే కాల్పనిక సాహిత్యం ద్వారా ఆమె మన భావోద్వేగాలను ప్రేరేపించి, తన ఫిలాసఫీ మనకు అందేలా చేసింది.

35. ఎవరైనా ఎందుకు అసూయ ఫీలవుతారు?

జ. జీవితం అనే కెమెరా ఎప్పుడూ వాళ్ళ మీదే ఫోకస్ అయి ఉండాలని వాళ్ళ కోరిక. కనుక అది పక్కవాడి వైపు తిరిగితే అసూయతో రగిలిపోతారు.

36. మిమ్మల్ని ఎవరైనా సరే తీవ్రంగా ప్రేమించటమో... ద్వేషించటమో చేస్తారు.

జ. ప్రేమా, ద్వేషమా అనేది పక్కనబెడితే, వాటిలో ఎంత తీవ్రత ఉంది అనేదే నాకు నచ్చే అంశం.

37. చెడ్డ సినిమాలు అనేవి ఉండవు. చెడ్డ ప్రేక్షకులే ఉంటారు.

జ. సినిమా మంచి చెడూ నిర్ణయించేవి ప్రేక్షకుల అభిరుచులు, అంచనాలు, వాళ్లు అర్థం చేసుకొనే చేసుకోలేని తీరులు మాత్రమే.

38. కొన్ని సార్లు మీ సమాధానాలు చూస్తుంటే భయం వేస్తోంది.

జ. నావి సమాధానాలు కాదు నిజాలు... నిజం చూసి మీరు భయపడితే నేనేం చెయ్యను?

39. మిమ్మల్ని ఒక్కోసారి ప్రేమించాలని, ద్వేషించాలనీ, అసలు పట్టించుకో కూడదని అనుకుంటాను.

జ. ప్రేమా, ద్వేషం– ఈ రెండూ పట్టించుకోవాల్సిన అవసరం లేని ఎమోషన్లు. ఇక కావాలని పట్టించుకోకపోవటం అనేది మాత్రం చాలా పట్టించుకోవలిసిన ఎమోషన్.

40. సాంకేతిక విలువల్లో హాలీవుడ్‌తో సమానంగా మనమూ ఎదగాలంటే ఇంకెంత కాలం పడుతుంది?

జ. సాంకేతిక విలువ అనేది టెక్నిక్‌తోనూ, ఎక్విప్ మెంట్‌తోనూ, బడ్జెట్‌తోనూ రాదు, వాటిని ఉపయోగించే బుర్రలను బట్టి వస్తుంది. మనమూ వాళ్ళ స్థాయికి ఎదగాలంటే ఒక 100 ఏళ్ళు మాత్రమే పడుతుంది. అయితే అప్పటికి వాళ్ళు మరో 500 ఏళ్ళు ముందుకెళ్ళటం జరుగుతుంది.

41. తల్లి దండ్రులు తమ బిడ్డల విజయాలు చూసి గర్వపడతారు... స్వార్థాన్ని బోధించే వ్యక్తిగా మీ అభిప్రాయం ఏమిటి?

జ. తల్లి దండ్రులు తమ బిడ్డలను తమ ప్రతిరూపాలుగా భావిస్తారు కాబట్టి వారి విజయాలను తమవిగా భావించి గర్వ పడతారు. తమ పిల్లల్నే తాము ప్రేమించడం మహా స్వార్థం అవుతుంది.

42. కురసోవా సినిమాలు బోర్ కొడుతున్నాయి కానీ 'క్షణ క్షణం' మాత్రం ఎన్ని సార్లయినా చూడాలనిపిస్తుంది.

జ. శ్రీదేవి ఉందిగా.

43. మీరు ఎవ్వరి గురించీ ఆలోచించరు కానీ అందరూ మీ గురించి ఆలోచించేలా చేసుకుంటారు.

జ. నేను అనుకున్నట్టుగా ఇతరులను ఆలోచింపచెయ్యగలిగితే నేను ప్రత్యేకించి ఆలోచించాల్సిన అవసరమే రాదు.

44. అక్రమ సంబంధాలపై మీ అభిప్రాయం.

జ. సక్రమమైన వివాహంలో అక్రమమైన ఆనందాన్ని చాలా సమక్రంగా ఇస్తాయి.

45. ఉదయాన్నే లేవగానే మీరు మొదటగా చూసేదేంటి ?

జ. నా బెడ్ రూమ్ సీలింగ్‌ని.

46. "గాడ్ ఫాదర్" మూలం మహాభారతమేగా?

జ. మహా భారతాల్లోని మూలాలు అనేక మూలాల గాడ్ ఫాదర్లు.

47. స్త్రీలలో మీకు నచ్చేవి ఏమిటి?

జ. ప్రతీ అంగుళం.

48. మీలో ఒక వేదాంతి, ఒక దర్శకుడు ఇద్దరూ ఉన్నారు. ఇదెలా సాధ్యం?

జ. **వేదాంతం నాకు మార్గదర్శకత్వం ఇచ్చింది.... నా స్వీయ దర్శకత్వం నన్ను వేదాంతిని చేసింది.**

49. విజయం సాధించిన ప్రతి సినిమా వెనుకా ఒక మంచి స్క్రిప్ట్ ఉంటుంది. ఏమంటారు?

జ. **మంచి స్క్రిప్టుతో చెత్త సినిమా తీయొచ్చేమో గానీ, చెత్త స్క్రిప్టుతో మాత్రం మంచి సినిమా తీయలేం.**

50. మీ హీరోయిన్లకు మీరే కాస్ట్యూమ్స్ చేస్తారా?

జ. **లేదు తీస్తా.**

51. మీ అమ్మగారు మీ సమాధానాలు చదివితే ఎలా రియాక్ట్ అవుతారో?

జ. **ఆమెకి నేను చాలా కాలంగా తెలుసు కాబట్టి నా ట్రిక్కులకి మోసపోవటం మానేసింది.**

52. మీరు సమస్యాత్మక పరిస్థితుల్ని ఎలా ఎదుర్కొంటారు?

జ. **ముందుగా ఆ సమస్యలు నన్ను ఎలా ఎదుర్కొంటాయో అవగాహన చేసుకోవటం ద్వారా**

53. మీరన్నీ కన్ఫ్యూజింగ్‌గా చెబుతారు. అయినా ఏదో అర్థం అవుతూనే ఉంటుంది. ఇదెలా సాధ్యం?

జ. **నన్ను సరిగ్గా అర్థం చేసుకోకపోవడం వల్ల కన్ఫ్యూజ్ అవుతున్నారు. అలాగే నా మీద మీకున్న నమ్మకం వల్ల 'ఏదో' అర్థం అయినట్టుగా ఫీలవుతున్నారు.**

54. మీ తల్లిదండ్రులు మిమ్మల్ని ఓ పనికిమాలినవాడిగా జమకట్టారు అని చెప్పారు కదా. మీరు సక్సెస్ అయ్యాక వాళ్లెలా ఫీలయ్యారు?

జ. **పనికిమాలిన వాళ్ళు కూడా సక్సెస్ అవుతారని తెలుసుకున్నారు.**

55. మీరు ద్వేషాన్ని నిర్వచించగలరా?

జ. **మీ శక్తినీ, సమయాన్నీ, సామర్థ్యాన్ని– వృథా చెయ్యకుండా వదిలేయాల్సిన విషయం పట్ల సమయం వినియోగించేలా చేసే ఉద్వేగమే ద్వేషం.**

56. మీరింకా అయాన్ ర్యాండ్‌నీ, నీషేనీ పట్టుకొని వేళ్లాడతారెందుకు?

జ. **లేకపోతే? నిన్ను పట్టుకుని వేళ్లాడమంటావా?**

57. ఎప్పుడూ ఫిలాసఫీ గురించి మాట్లాడే వాళ్ళు సాధించేదేమీ ఉండదు.

జ. **ఫిలాసఫీ సాధన గురించి చెబుతుందే తప్ప, మిమ్మల్ని సాధకుడుగా మార్చలేదు.**

58. ఔత్సాహిక దర్శకులకు మీరిచ్చే సలహా ఏమిటి?

జ. **సలహా అడగొద్దు.**

59. 'గాడ్ ఫాదర్'ని స్పీల్‌బర్గు, 'జాస్'ని కొప్పోలా డైరెక్ట్ చేస్తే ఎలా ఉంటుంది.?

జ. **చాలా ఆసక్తికరమైన ఆలోచన. వాళ్ళిద్దరి దృక్కోణాలు చాలా విభిన్నం కనుక ఆ సినిమాలు కూడా కచ్చితంగా డిఫరెంట్‌గా రూపొందుతాయి. కానీ ఆ రెండూ కూడా ఇప్పుడున్నంత గొప్పగా మాత్రం తయారై ఉండేవి కాదు అని నా నమ్మకం.**

60. వ్యభిచారం నేరం, పాపం అని మీరు భావిస్తారా?

జ. **లేదు కానీ – నాకు వ్యభిచారం అంటే చాలా అసహ్యం. ఎందుకంటే అది శృంగారంలోని పవిత్రతని దెబ్బతీస్తుంది.**

61. మీరెలా విశ్రాంతి పొందుతారు?

జ. **పొందను.**

62. జనానికి క్రికెట్ అంటే ఇంత పిచ్చికదా. దాని మీద సినిమా తీస్తే పెద్ద సక్సెస్ అవుతుంది కదా?

జ. **నాకు క్రికెట్ కన్నా, దాన్ని ఇష్టపడే వాళ్ళంటే ఇంకా పెద్ద చిరాకు. అలాంటి జనాల కోసం నేనెప్పుడూ ఏ పనీ చెయ్యను.**

63. మనకి 1200 కోట్లిస్తే 12 "అవతార్"లు తియ్యొచ్చు.

జ. **డబ్బు నుంచి ఐడియాలు రావు. ఐడియాల నుంచి డబ్బులొస్తాయి.**

64. సెల్ఫ్ కాన్ఫిడెన్స్‌తో ఇతరులను మోసం చెయ్యొచ్చు. ఓవర్ కాన్ఫిడెన్స్‌తో మనల్ని మనమే మోసం చేసుకుంటాం.

జ. **సూపర్ కాన్ఫిడెన్స్‌తో మన తప్పుల్ని సరిదిద్దుకుని మళ్ళీ ఓవర్ కాన్ఫిడెంట్ అవ్వచ్చు.**

65. మీరు స్త్రీ లోలురా?

జ. **కాదు, స్త్రీ ప్రేమికుణ్ణి.**

66. మీరు– రాక్షస సైతాన్ వర్మ !!!

జ. అయి ఉండొచ్చు. నాకూ అప్పుడప్పుడూ డౌటొచ్చీ నా వంటి మీద ఎక్కడైనా "ఒమెన్" సినిమాలోలా "666" లాంటి సైతాన్ గుర్తులు ఉన్నాయేమో అని వెతుక్కుంటా.

67. గొప్పగా విఫలమైన వాడే గొప్ప విజేత కాగలడు – రాబర్ట్ కెనడి.

జ. **ఎవరైతే గొప్పగా విఫలమయి, మళ్ళీ ఎప్పుడు గెలుస్తామా అని ఆశతో ఎదురుచూస్తుంటారో వాళ్ళే ఇలాంటి గొప్ప మాటలు చెబుతుంటారు – RGV.**

68. ఊహ అనేది జీవితంలో రాబోయే సంతోషాలకు ఒక ట్రెయిలర్ లాంటిది – ఆల్బర్ట్ ఐన్ స్టీన్.

జ. **చాలా సార్లు ట్రెయిలర్ హిట్టయి సినిమా ఫెయిలవుతుంది – RGV.**

69. సైట్ ఇంజనీర్‌గా మీ అనుభవాలు చెబుతారా?

జ. **ఆడ కూలీలు వంగి పనిచేస్తున్నప్పుడు తప్ప మిగతా టైమంతా చాలా బోర్ కొట్టేది.**

70. మీ దృష్టిలో స్నేహం అంటే?

జ. **మానసికంగా ఆధారపడడానికో, టైమ్ స్పెండ్ చెయ్యడానికో స్నేహితులు అవసరం. నేను ఏ విధంగానూ ఎవరిమీదా ఆధారపడను కాబట్టి నాకెప్పుడూ స్నేహితులెవరూ లేరు.**

71. మీరీ రచనలను పబ్లిసిటీ కోసం చేస్తున్నారు కదూ.

జ. **లక్షా తొంభయ్ ఎనిమిదిన్నర సార్లు చెప్పాను, చెబుతున్నా, చెబుతాను.... నేను ఎప్పుడు ఏది చేసినా కేవలం... కేవలం... కేవలం పబ్లిసిటీ కోసమే.**

72. 'మనీ' లో "వారెవా ఏమి ఫేసు" పాటలో 'బాగుంది గాని ప్లాను, పల్టీ కొట్టిందో ఏమిగాను' అనే లైన్లు మీరే పాడారట కదా?

జ. **అవును.**

73. మీరు ఎవరి అభిప్రాయాలూ పట్టించుకోనప్పుడు ఈ రాతలెందుకు?

జ. **ఇతరుల అభిప్రాయాలు పట్టించుకోను. కానీ నా అభిప్రాయాలని ఇతరుల మీద రుద్దటం నాకిష్టం కాబట్టి.**

74. జనాల్ని సినిమాలు ప్రభావితం చెయ్యవని మీరెలా చెప్పగలరు?

జ. **నమ్మకాల పునాదుల్ని కదిలించగలిగేది ఏదయినా జనాన్ని ప్రభావితం చేస్తుంది. అది సినిమా కావచ్చు, పుస్తకం కావచ్చు లేదా ఒక మనిషి కావచ్చు. అలాగని అన్నిటినీ జనరలైజ్ చేసి ప్రతి సినిమాకీ ఆపాదించే ప్రయత్నం చేయకూడదు.**

75. ఫౌంటెన్ హెడ్ చదువుతున్న మొదట్లో మీరు రోర్క్ లా అనిపించారు. మధ్యలో ఉండగా కీటింగ్ అనుకున్నా. చివరికొచ్చేసరికి మీరు వైనాండ్ అని తేలింది.

జ. **ఇప్పటికన్నా మీరు నేను కేవలం రామూనే అని గ్రహించి ఉంటారు.**

76. శక్తి, సంతృప్తి – ఈ రెండిట్లో మీరు ఏది ఇష్టపడతారు?

జ. **శక్తి లేకుండా నిజమైన సంతృప్తి రాదు.**

77. మీ చుట్టూ మీరొక వృత్తం గీసుకుని కూర్చున్నారనిపిస్తుంది.

జ. **వంపుల్లో ఉండడం నాకు ఇష్టం.**

78. మహా ఉన్మాది అనే పేరు మొదటిసారిగా ఎప్పుడు విన్నారు?

జ. **మేం విడిపోయినప్పుడు నా మొదటి గర్ల్ ఫ్రెండ్ అలా పిలిచింది.**

79. మీరు అమ్మాయి అయి ఉంటే రామూతో శృంగారం జరపడానికి ఇష్ట పడతారా?

జ. **అంతకంటే బెటర్ టేస్టే ఉంటుంది నాకు.**

80. మీ మొదటి స్నేహితురాలు ఎవరు?

జ. **మనకంతా ప్రియురాళ్లే...**

81. ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌ల మీద మీ అభిప్రాయాలు వింటే ఫౌంటెన్ హెడ్‌లో రోర్క్ కీటింగ్‌తో చెప్పిన "నీ జ్ఞానానికి నువ్వే సిగ్గుపడేలా చేస్తారు" అనే వాక్యం గుర్తొచ్చింది.

జ. **కరెక్టు– చాలా ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లు ఏదైతే సినిమాకు అవసరం లేదో దాన్నే పనిగట్టుకుని మరీ నేర్పుతూంటాయి.**

82. జేమ్స్ బాండ్ సినిమాలు మీకు బాగా నచ్చేవా?

జ. **బాగా... ముఖ్యంగా బాండ్ ప్రక్కనుండే అమ్మాయిలు.**

83. మీరు ఇతరుల్ని అనుసరించినప్పుడల్లా విజయం సాధించారు. కానీ మిమ్మల్ని మీరే అనుసరించినప్పుడు మాత్రం విఫలమయ్యారు.

జ. **తెలిసిందే తియ్యటం వల్ల తెలియంది తెలియదు.**

84. జ్ఞానం, అజ్ఞానం– ఈ రెండిట్లో ఏది ప్రమాదకరం?

జ. **జ్ఞానం శరీరానికి ప్రమాదకరం. అజ్ఞానం మనసుకి ప్రమాదకరం.**

85. మీరు ఇంజనీరింగ్ సీట్ కోసం ఎంట్రన్స్ రాసారా?

జ. రాశా. చివరి నుంచి ఇరవయ్యో ర్యాంక్ వచ్చినట్టు గుర్తు.

86. 'సత్య' సినిమాలో గురునారాయణ్‌ని చంపాలని భీకూ, సత్యా మాట్లాడుకొనే సీన్‌ని మీరు వాళ్ళ వెనకాల నుంచీ సీల్ హౌటీలో తీశారు. ఎందుకు అలా తీశారు?

జ. రెండు కారణాలు. ఒకటి: ఆ రోజు పొద్దుట్నుంచీ చక్రి, మనోజ్‌ల మొహాలు చూసీ చూసీ బోర్ కొట్టడం, రెండు: లైట్ అప్పటికే పోతూంది, సీన్ ముగించాలి అన్న తొందరలో.

88. 'కౌన్' సినిమాలో ఊర్మిళ టెర్రేస్ మీద కూర్చుని 'లాలిపాట' పాడే సీన్ ఎందుకు అంత భయం కలిగిస్తుంది?

జ. అమాయకత్వానికి, క్రూరత్వం కరెక్టుగా కలిస్తే ఊహకు అందని భయం సృష్టించవచ్చు. అందుకే హారర్ సినిమాల్లో దెయ్యాలుగా ఎప్పుడూ చిన్న పిల్లల్నీ ఆడవాళ్ళనే చూపిస్తారు.

89. సినిమా తీస్తున్నప్పుడు ఆ కథలోని భావోద్వేగాలకు డైరెక్టర్ దూరంగా ఉండాలా?

జ. డైరెక్టర్ కథలోని భావోద్వేగాలను పరిశీలించాలేగానీ, వాటిలో లీనం కాకూడదు. తను కూడా వాటి వల్ల ప్రభావితం అయితే కథలో నిజాయితీ లోపిస్తుంది.

90. జనం అంతా మతాన్ని వదిలేసి వోడ్కా, సెక్సు వెనకపడితే ఈ ప్రపంచం ప్రమాదకరంగా మారదా?

జ. మీకు అంత భయంగా ఉంటే ఓషో ఆశ్రమంలో చేరండి. అక్కడ మందు, మగువ, మతం – మూడూ దొరుకుతాయి. నేను మాత్రం ఇలాగే ప్రమాదకరంగా బతుకుతా.

91. మీరు షేక్స్పియర్‌ని చదివారా?

జ. అంతకంటే జేమ్స్ హ్యాడ్లీ చేజ్, ఫ్రెడరిక్ ఫోర్సిత్, చందమామ కథలు చాలా బెటర్.

92. మీరు కోరలు పీకిన పాము. ఇంకా విషం ఉన్నట్టు నటిస్తున్నారు.

జ. హ..హా... మెచ్చుకుంటున్నావో తిడుతున్నావో అర్థం కాలేదు కానీ, నువ్వు చెప్పింది మాత్రం కరెక్టే.

93. మీరు అమ్మాయయితే చాలా సెక్సీ గా ఉంటారు.

జ. సెక్సీ సంగతి ఎలా ఉన్నా, ఏం చేస్తే మగవాడు పూర్తి స్థాయిలో సంతోషం పొందుతాడో నా అనుభవం ద్వారా నాకు బాగా తెలుసు. అందుకుని ఒక మగాడికి నేను చాలా మంచి అమ్మాయిని అవుతాను. నాకు తెలిసిన ఈ సత్యం ప్రపంచంలోని అమ్మాయిలందరికీ నేర్పాలని నాకు పెద్ద కోరిక.

94. భయం అనేది స్వచ్ఛమైన ఉద్వేగం అని నా ఉద్దేశం.

జ. ఆ ఉద్వేగాన్ని పూర్తిగా అర్థం చేసుకుంటేనే దాన్ని అధిగమించగలుగుతారు.

95. తెలివితేటల్లో మిమ్మల్ని మించిన వాళ్లెవరయినా మీకు తగిలారా ?

జ. నా తెలివితేటలు చూసుకుని పొంగిపోవడం తోనే నాకు టైమ్ సరిపోతుంది. ఇంకొకళ్ళ తెలివితేటలు గుర్తించేంత తీరికేదీ....

96. మీరెప్పుడయినా రక్త దానం చేశారా?

జ. చెమట దానం కూడా చెయ్యలేదు.. చెయ్యను.

97. 'గాయం'లో "అలుపన్నది ఉందా?" అనే పాట చూస్తుంటే మీలాంటి వ్యక్తి స్త్రీలకు సంబంధించిన అంత సున్నితమైన భావాలను తెరకు ఎక్కించగలిగాడా అని ఆశ్చర్యం వేసింది.

జ. హలో... స్త్రీల పట్ల నాకన్నా ఎక్కువ గౌరవం ఉండే వ్యక్తిని నేనింతవరకూ కలవలేదు.

98. ఏసు క్రీస్తుపై మీ అభిప్రాయం ఏంటి?

జ. నాకు కండలూ, ఆయుధాలు ఉన్న దేవుళ్ళంటేనే ఇష్టం.

99. సినిమాలు తీయడం ఒక కళగా భావిస్తారా?

జ. అత్యుత్తమమైన మహా కళగా భావిస్తాను. కర్ణాటక సంగీతం, భరత నాట్యం లాంటి వాటికన్నా 50,000 రెట్లు బెటర్.

100. మీ ఆత్మకథకి ఏం పేరు పెడదామనుకుంటున్నారు?

జ. "నేను నేనే"

101. మీరు రాసినవి చదువుతూంటే మీరు ఇంజనీరింగ్ పాసయ్యారు అంటే నమ్మబుద్ధి కావటం లేదు.

జ. ఏం చేస్తాం అవీ మన విద్యా వ్యవస్థల స్టాండర్డ్స్.

102. మీ దృష్టిలో స్త్రీ అంటే ?

జ. నస పెట్టనంత వరకూ, ఇలా చెయ్ అలా చెయ్ అని చెప్పనంత వరకూ, కబుర్లు చెప్పమని అడగనంత వరకూ స్త్రీ దేవుడి సృష్టి మొత్తం లో అత్యుత్తమం.

103. మీరు తాము అనుకున్నంత చెడ్డవాళ్ళు కాదని జనం అర్థం చేసుకోడానికి చాలా ఏళ్ళు పడుతుందేమో!

జ. జనం అనుకున్నదానికన్నా చాలా చెడ్డవాణ్ణని నాకు అర్థం కావడానికి కూడా చాలా ఏళ్ళు పడుతుందేమో!

104. భయాన్ని పోగొట్టుకోవడం ఎలా?

జ. మీ ప్రాణంతో సహా దేనికీ విలువ ఇవ్వనంత కాలం భయమనేది ఉండదు.

105. జ్ఞానాన్ని శక్తి అని నిర్వచించిన వాళ్ళే అజ్ఞానాన్ని బ్రహ్మానందమని అంటారెందుకు?

జ. జ్ఞానికి తనకు ఏం కావాలో తెలుసు. ఆ కావాల్సింది అందనప్పుడు బాధ కలుగుతుంది. అదే అజ్ఞానికి తనకు ఏం కావాలో తెలీదు గనక ఎప్పుడూ సంతోషంగానే ఉంటాడు.

106. చెడ్డవాళ్ళ కథలు ఆసక్తికరంగానూ, మంచివాళ్ళ కథలు బోరింగ్ గానూ ఉంటాయా?

జ. చరిత్ర నిర్మాతలు ఎప్పుడూ చెడ్డ వాళ్ళే. ఆ చెడ్డవాళ్ళ కాలంలోనే కోట్ల మంది మంచి మనుషులు పుట్టి గిట్టీ వాళ్ళెవరో ఏమిటో ఎవరికీ తెలీకుండానే పోయారు.

107. మిమ్మల్ని టీవీలో చూసినప్పుడు ఈ పొగరుమోతోడి దగ్గర ఏదో విషయం ఉంటుందనే అనిపించింది.

జ. నా దగ్గర విషయం ఉంది గనుకే పొగరుగా ఉంటా.

108. వాంఛకీ కోరికకీ తేడా ఏంటీ?

జ. సొంతం చేసుకోవాలనుకోవడం కోరిక. ఆ కోరిక చాలా తీవ్రమయితే వాంఛ.

109. ప్రపంచంలో సినిమాలనేవే లేకపోతే ఏంచేసే వాళ్ళూ?

జ. సృష్టించేవాణ్ణి .

110. మీరు మనిషా? పశువా?

జ. స్వచ్ఛమైన ప్రవృత్తిలో పశువు కన్నా తక్కువ. మలినమైన ప్రవృత్తిలో మనిషికన్నా ఎక్కువ.

111. మీ ఆత్మ న్యూనతా భావాన్ని కప్పి పుచ్చడానికి పొగరు, లెక్కచేయని తనం అనే ముసుగు వేసుకుంటున్నారని నా నమ్మకం.

జ. నా నమ్మకం ఏంటంటే మీరు అతి న్యూనతా భావంతో బాధపడుతూ, మీకున్న ఆవగింజంత బుర్రతో నా సైకాలజీ గురించి శెనగ గింజంత సిద్ధాంతం తయారు చేసి, మీ మిత న్యూనతా భావాన్ని అతి విశ్వాసం అనే ముసుగు లో దాచిపెట్టుకునే ప్రయత్నం చేస్తున్నారని..

112. మిమ్మల్ని మీరు ఇంతలా ప్రేమించుకుంటూ, స్వతంత్రంగా బతకడం ఎలా సాధ్యమయింది.

జ. నేనేం నన్ను ప్రేమించుకోవడం లేదు. ఎవరి ప్రేమనీ ఆశించను కాబట్టి స్వతంత్రంగా బతకడం సాధ్యమయింది.

113. మీరు ఫిల్మ్‌మేకర్ అయ్యాక ప్రేక్షకుల నుంచి దూరమయ్యారని బాధ పడుతుంటారా?

జ. అలాంటిదేం లేదు. నేను ప్రేక్షకుడిగా ఉన్నప్పుడు చాలా మంది ఫిలిమ్ మేకర్లు నా బుర్రతో ఆడుకున్నారు. నేను కూడా ఎప్పుడెప్పుడు ఫిలిమ్ మేకర్ అయి నాలాంటి ప్రేక్షకుల బుర్రలతో ఆడుకోగలనా అని ఎదురు చూసేవాణ్ని. ఎదుటివారు నా బుర్రతో ఆడుకోవడంకన్నా ఎదుటివారి బుర్రలతో ఆడుకోవడమే బెటర్ అని నాకు విజయవాడ థియేటర్లలో జ్ఞానోదయం అయ్యింది.

114. స్వార్థమే నిజమైన ఇజం.

జ. ఏ ఇజామూ లేకపోవడమే నిజమైన ఇజం.

115. మరణం తర్వాత మరో జీవితం ఉందని మీరు నమ్ముతారా?

జ. నేను ఈ క్షణాన్ని మాత్రమే నమ్ముతాను. క్షణ క్షణం జీవిస్తాను.

116. స్త్రీని సృష్టించి దేవుడు తప్పుచేసాడంటారా?

జ. లేదు..లేదు..లేదు– దేవుడు చేసిన రెండు మంచి పనుల్లో ఒకటి నన్ను సృష్టించడం. రెండు స్త్రీని సృష్టించడం.

117. మీ దగ్గర నేర్చుకున్న జ్ఞానంతో వేదాంతాన్ని మడత పెట్టడం నేర్చుకున్నా.

జ. ముందు నిన్ను వేదాతం మడత పెట్టకుండా చూసుకో.

118. మీకీ ఒంటరితనం అనే రోగం ఎక్కడనుంచి వచ్చింది?

జ. ఒంటరి తనం ఒక రోగం అని మీరు అంటుంటే, మీలాంటి రోగుల నుంచి దూరంగా ఉండాలనుకోవడమే నా ఒంటరి తనం అని నేనంటా.

119 మీకు... అయాన్ ర్యాండ్‌లాంటి తెలివైన అమ్మాయి, తెలివి తక్కువగా ఉండే సెక్సీ అమ్మాయి కలిస్తే... ఎవరితో డేటింగ్ కి వెళతారు?

జ. అయాన్ ర్యాండ్ లాంటి అమ్మాయిని డేటింగ్‌కి తీసుకెళ్లి మాటలు వింటాను. సెక్సీ అమ్మాయిని లోపల ఉంచుకొంటాను.

120. మీరు ఇంజనీరింగ్ చదువుతుండగా ఓ పక్క సత్యేంద్ర, అయాన్ ర్యాండ్, నీషే లాంటి మేధావులతో ఇంటరాక్ట్ అవుతూ గ్యాంగుల కొట్లాటల్లో ఎలా ఇన్‌వాల్వ్ అయ్యారు?

జ. ఆ మేధావుల సాంగత్యంవల్లే గ్యాంగ్ ఫైట్స్ వెనకున్న సైకాలజీ అర్థం చేసుకొని శివ, సత్యా, కంపనీ లాంటి సినిమాలు తీయగలిగా.

121. మీరు సీరియస్ ప్రశ్నల కన్నా తుంటరి ప్రశ్నలకే ఎక్కువ స్పందిస్తూ ఉంటారు.

జ. ప్రతి తుంటరి ప్రశ్న వెనకా సీరియస్ నెస్ ఉంటుంది. అలాగే నా ప్రతి సీరియస్ జవాబు వెనకా తుంటరితనం ఉంటుంది.

122. గాంధీ ఎప్పుడూ గాంధీ ఇజం ఫాలో కాలేదు. అలాగే రామూ కూడా రామూ ఇజమ్ ఫాలో అవరు.

జ. నేనెవర్నీ ఫాలో కాను... అమ్మాయిల్ని తప్ప.

123. మీ రాతలన్నీ చాలా బాగుంటాయి. నేను చాలా ఎంజాయ్ చేస్తుంటాను.

జ. మీరు ఎంజాయ్ చెయ్యకపోయినా నాకు పోయేదేమీ లేదు.

124. మీరు పోయాక మీ ఆస్తి ఎవరికి చెందుతుంది?

జ. కచ్చితంగా మీకు మాత్రం చెందదు.

125. ప్రముఖులందరూ గొప్పవాళ్లు కాదు.

జ. గొప్పవాళ్ళందరూ ప్రముఖులు కారు.

126. ఈ ప్రపంచంలో మనుషులు మాత్రమే నవ్వగలరని మీరు అంటారు కదా, ఆ విషయం మీకెలా తెలుసు?

జ. అయ్యా, నేను ఈ ప్రపంచం అంతా తిరిగి ప్రతి పశువుకీ, పక్షికీ, కీటకానికీ జోకులు చెప్పా.. అవేవీ నవ్వలేదు కాబట్టి అలా ఫిక్స్ అయ్యా.

127. ఎవరో చెబితే నేర్చుకోడానికి జనం సిద్ధంగా లేరని మీరు చెప్పిన మాట కరెక్ట్ కాదు.

జ. నేను చెప్పింది కరెక్ట్ కాదని మీరన్నప్పుడే నేను చెప్పింది కరెక్ట్ అని రుజువయింది

128. విద్యా సంస్థలు మాత్రమే జ్ఞానాన్ని ఇవ్వగలవు

జ. ఎలాంటి జ్ఞానం అన్నది నా ప్రశ్న

129. మీరెప్పుడయినా నిస్సహాయంగా ఫీలవుతుంటారా?

జ. నో

130. ఫిల్మ్ ఇన్స్టిట్యూట్‌లో చేరడం దండగ అని మీ ఉద్దేశమా?

జ. "నేను ఫిల్మ్ ఇన్స్టిట్యూట్‌కి వెళ్లలేదు ఫిలింస్‌కి వెళ్ళాను" అని క్వెంటిన్ టొరాంటీనో (హాలీవుడ్ డైరక్టర్) అన్నారు. నేను కూడా అదే చేసాను. ఫిల్మ్ ఇన్స్టిట్యూట్‌లు సినిమాకీ మనకీ మధ్య నిలబడి సినిమాల గురించి వారికున్న అభిప్రాయాలను మన మీద రుద్దడానికి ప్రయత్నం చేస్తాయి.. నాకు 'సిటిజన్ కేన్' కన్నా జాస్ బాగా నచ్చింది. మీకు నా 'కంపనీ' కన్నా బోయిన సుబ్బారావు 'పుట్టింటి పట్టుచీర' బాగా నచ్చుండొచ్చు.

మీకు 'సిటిజన్ కేన్' నచ్చక పోయినా ఇన్స్టిట్యూట్ వాళ్ళు చెప్పారు కదా అని దాన్ని గొప్ప సినిమాగా భావించి, మీకు సొంతంగా నచ్చే సినిమాలు చెత్త అనే అభిప్రాయంలో పడతారు. అలా కాకుండా మనకు నచ్చిన సినిమాల ద్వారానే మనం నేర్చుకోవడం బెస్టు.

131. సృజనాత్మకత పుట్టుకతో వస్తుందా లేక నేర్చుకోగలమా?

జ. దేవుడూ, సమాజం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులూ మన మీద రుద్దే పనికిమాలినవన్నీ తొలగించుకోగలిగితే ప్రతివాడూ సృజనశీలుడవుతాడు.

132. మీరే ఓ ఫిల్మ్ స్కూల్ మొదలెట్టొచ్చుగా.

జ. నాకు దాన ధర్మాలు కానీ వ్యాపారం గానీ చేసే సదుద్దేశం లేదు.

133. మీరే స్కూల్లో చదివారు?

జ. సికింద్రాబాద్‌లో సెయింట్ మేరీస్ స్కూల్‌కి వెళ్ళాను. కాని చదువుకుంది మాత్రం కేంటీన్‌లోనూ, బస్సుల్లోనూ(కామిక్సూ, నవల్సూ).

134. ఎంతో కష్టపడే డైరెక్టర్ల కన్నా స్టార్స్ కే ఎక్కువ రెమ్యూనరేషన్ ఇస్తారెందుకని?

జ. కష్టానికి కాదు.. కలెక్షన్లు రప్పించేవారికి ఇస్తారు రెమ్యునరేషన్లు. జీవిత సత్యం ఏంటంటే అందరికన్నా ఎక్కువగా కష్టపడేవారికి అందరికన్నా తక్కువ విలువ ఉంటుంది.

135. అయాన్ ర్యాండ్ పిల్లలకు మాత్రమే నచ్చుతుంది.

జ. అలాగే ముసలాయనా, నీ కర్మ కాండలకు పిలవడం మర్చిపోకు. నేను మిగతా పిల్లలూ తప్పక వస్తాం.

136. పెళ్ళాం బిడ్డలు లేకుండా మీరు ఛస్తే... మీ గురించి ఏడ్చేదేవరు? మోసుకెళ్లేదెవరు?

జ. నువ్వు పెళ్లిచేసుకుంది అందుకే అని తెలిస్తే నీ పెళ్ళాం బిడ్డలు నిన్ను ఇప్పుడే చంపేసి, కుక్కలకూ నక్కలకూ వేస్తారు జాగ్రత్త.

137. ఆడాళ్ళు మగాళ్లలో ఏం చూస్తారు?

జ. బాబూ నీకు నేను ఆడదానిలా కన్పిస్తున్నానా, ఈ ప్రశ్న అడిగావ్?

138. "అడవి" సినిమాలో దేముడు గొలుసు పట్టుకుని తిరిగే భక్తుణ్ణి కూడా చంపేశారే?

జ. గుళ్ళ దగ్గర తొక్కిసలాటల్లో ఎంతమంది భక్తులు చనిపోవడం లేదు – అందుకే దేవుడి మీద పగతీర్చుకోడానికే ఆ సీన్ పెట్టా. అఫ్ కోర్స్, దేవుడు కూడా 'అడవి'ని ఫ్లాప్ చేసి నా మీద పగతీర్చుకున్నాడు. మళ్ళీ 'అడవి' సీక్వెల్‌లో నేను మరికొంత మంది భక్తులను చంపి రక్త చరిత్ర సృష్టిస్తాను.

139. పెళ్ళంటే ఎందుకంత విముఖత?

జ. జ్ఞానిని కాబట్టి. సాధారణంగా ఏ విధమైన బాంధవ్యం అయినా కొన్ని అంచనాలని సృష్టిస్తుంది. ఆ అంచనాలు.. ఆశాభంగాన్ని సృష్టిస్తాయి. అందుకే నేను ఏ విధమైన బాంధవ్యం ఏర్పడటానికి ఒప్పుకోను.

140. మీరు కమిట్ మెంట్ కి భయపడి పెళ్ళికి వ్యతిరేకత చూపిస్తున్నారు. మరి సినిమా తీయడం అంటే ప్రేక్షకులతో కమిట్ అవడమే కదా?

జ. ఇక్కడో తేడా ఉందమ్మా... నేను ప్రేక్షకులతో ఒకే గదిలో పడుకుని, వాళ్ళు చెప్పేదంతా వినాల్సిన పనిలేదుగా.

141. మీ ఆలోచనా విధానం మలుపు తిరిగిందెప్పుడు ?

జ. నేను ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదివేటప్పుడు. గుడికి వెళ్ళడం కన్నా, చదువుకోవడం కన్నా బీరు తాగడం, కెబరేకి వెళ్ళడం చాలా ఎక్కువ ఆనందాన్నిస్తాయని తెలుసుకున్నక్షణంలో.

142. మీకున్న జ్ఞానాన్ని బట్టి చూస్తే మీరు చాలా కష్టనష్టాలు దాటి వచ్చారనిపిస్తుంది.

జ. లేదు. నా జ్ఞానం కష్ట నష్టాలను లెక్కచేయకపోవడం వల్ల వచ్చింది. వాటిని లెక్కచేసే మనుషులు చాలా నిరాశగా, నిస్పృహతో, దుర్భరంగా బతుకు తుంటారు. వాళ్ళకి జీవితాంతం జ్ఞానం అబ్బే అవకాశమే లేదు.

143. మీ వ్యాఖ్యలు చూస్తుంటే మీరు స్వామి వివేకానంద రచనల నుండి ప్రభావితమయినట్టనిపిస్తోంది?

జ. నా లెవెల్ ఇంకా అంతకి దిగజారలేదు.

144 ఆబ్జెక్టివిజానికి 'ఫౌంటెన్ హెడ్' కన్నా 'ఎట్లాస్ ష్రగ్డ్' మంచి ఉదాహరణ.

జ. 'ఫౌంటెన్ హెడ్'లో ఆబ్జెక్టివిజం సిద్ధాంతం ఉంటే, 'ఎట్లాస్ ష్రగ్డ్'లో దాని ఆచరణ ఉంటుంది. రెంటినీ పోల్చలేం..

145. వేదాంతి కావాలంటే ముందు కామన్ సెన్సు అలవర్చుకోవాలి

జ. కామన్ సెన్స్ అలవర్చుకుంటే వచ్చేదికాదని తెలుసుకోవటమే వేదాంతం.

146. మీరు ప్రశ్న అడిగిన వాళ్ళ పేరు ప్రస్తావించరేంటి?

జ. నేను జవాబిచ్చేది ప్రశ్నలో ఉన్న ఆలోచనకే కానీ, వ్యక్తికి కాదు.

147. కాపీ కొట్టడానికీ ప్రేరణ పొందడానికీ తేడా ఏంటీ?

జ. ఉన్నది ఉన్నట్టుగా తీసుకొంటే కాపీ. దాని వెనక ఉన్న ఆలోచనని తీసుకొంటే ప్రేరణ.

148. అయాన్ ర్యాండ్ బెస్ట్ పుస్తకాలు రెండు సూచించండి.

జ. ఫౌంటెన్ హెడ్‌ని రెండు సార్లు చదవండి.

148. మీరు స్ట్రీ గా పుట్టి ఉంటే?

జ. బాబోయ్... నాకు ఆడాళ్ళంటే చాలా ఇష్టం. దయచేసి ఇలాంటి శాపనార్థాలు పెట్టకండి.

149. చాలా మంది రాజకీయ నాయకులు అంగ్ సాన్ సూకీని ఇష్టపడతారు

జ. అదేమన్నా తినే పదార్థమా?

150. 'బ్రా' ని ఎవరు కనిపెట్టారు?

జ. గ్యారెంటీగా దాన్ని తీయటానికి ఇష్టపడే వ్యక్తే అయ్యుంటాడు.

151. మంచి, చెడులను మీరు ఎలా నిర్వచిస్తారు.

జ. నేను చేసేదంతా మంచి, ఇతరులు చేసేదంతా చెడు.

152. దృక్పథానికి మీరిచ్చే నిర్వచనం?

జ. ప్రతి విషయం మీదా మహా స్పష్టమైన అభిప్రాయం కలిగి ఉండడం.

153. సినీ రంగం పట్ల చాలా మంది ఆకర్షింపబడతారేంటి ?

జ. కళ మీద ఆకర్షణ వారిని పరిశ్రమకు లాక్కొస్తుంది. ఆ తరువాత డవలప్ అయిన కీర్తి కాంక్ష వాళ్ళని నాశనం చేస్తుంది.

154. ఇంటెలిజెన్స్‌కీ బ్రిలియన్స్‌కీ తేడా ఏంటి?

జ. బ్రిలియెంట్ కాగలిగే సామర్థ్యమే ఇంటెలిజెన్స్. ఇంటెలిజెన్స్ ద్వారా వచ్చేది బ్రిలియన్స్

155. మీరు కరాటే ప్రాక్టీస్ చేస్తున్న ఫోటోలు ఎక్కడ తీసినవి?

జ. ఇంజనీరింగ్ చదువుతున్నప్పుడు విజయవాడ కామయ్యతోపులో నేనుండే రూమ్ పైన తీసినవి.

156. నేను అమీర్ పేటంతా తిరిగినా మీ షాపు ఎక్కడ ఉండేదో కనుక్కోలేకపోయా.

జ. యాడ్ లాబ్స్ మల్టీప్లెక్స్‌కి దగ్గర్లో చలసాని డయాగ్నోస్టిక్స్... కుమార్ షర్ట్స్ షాప్‌కి ఎదురుగా. ఇప్పుడు అక్కడ రాజ్‌దూత్ స్వీట్ షాపు ఉంది.

157. కేవలం అయాన్ ర్యాండ్ అనే ఓ స్ట్రీ ఊహాల్లోంచి ఊడిపడ్డ వ్యక్తి హోవార్డ్ రోర్క్.

జ. ఆ స్ట్రీ ఊహల్లోంచి వచ్చిన వ్యక్తిని అనుకరిస్తేనే నాకు చాలా మంది ఊహల్లో బతికే స్ట్రీలు లభించారు. అయాన్ ర్యాండ్ కి థ్యాంక్స్.

158. మీ 'శివ'ని సరిగ్గా అర్థం చేసుకోకుండా 'జోష్'(నాగచైతన్య)లో అనుకరించానికి ట్రై చేసి ఫెయిలయ్యారు.

జ. దానిదేముంది – నేను కూడా అలాగే అనుకరించి నా ఫ్లాప్ 'శివ 2006' తీసాగా.

159. డైరెక్టర్ కావాలనే కోరిక నన్ను చంపేస్తోంది.

జ. డిస్ట్రిబ్యూటర్లని, అమాయక ప్రేక్షకులనీ చంపే కన్నా నీ చావు నువ్వే చావడం మేలు.

160. మీ రాతలన్నీ సినిమాలు, సొల్లు వేదాంతాలకే పరిమితమా.

జ. ఈ రాతలన్నీ నా కోసం, నీలా సోల్లు రాతలు చదవాలనుకొనేవాళ్ళ కోసం కాదు.

170. జనం అంతా రామూయిజం ఫాలో అయితే ప్రపంచం మొత్తం పిచ్చి వాళ్ళతో నిండి పోతుంది.

జ. పిచ్చోడా నీకు అర్థం కానిదేమిటంటే...నన్ను ఫాలో అవమని నేనెప్పుడూ చెప్పలేదు. మీరు ఏం ఫాలో అవుతున్నారో దాన్ని అర్థం చేసుకోమని మాత్రమే చెబుతున్నా.

171. మీరు ఆస్తికులా నాస్తికులా?

జ. ఏదీ కాదు. దేవుణ్ణి నమ్మడం, నమ్మకపోవడం రెండూ స్టుపిడ్ వాదాలే. దేవుడు – అతనో, ఆమో లేక అదో– ఏదయినా, ఉన్నా లేకున్నా నాకు మాత్రం ఎప్పుడూ అవసరపడలేదు.

172. నిర్ణయాలు తీసుకోవడానికి బొమ్మా బొరుసు వేస్తామెందుకు?

జ. ఆలోచించడం నుంచి తప్పించుకోడానికి.

173. మీరు నిజంగా పొగరు మోతే అయితే అంత సున్నితమైన భావోద్వేగాల్ని తెరపై ఎలా పండించగలుగుతున్నారు?

జ. నేను నమ్మినవి నిర్భయంగా ప్రకటించడాన్నే మీరు పొగరు అనుకుంటున్నారు. ఇక సున్నితత్వం అంటారా అది అవగాహన బట్టీ, భావోద్వేగాలను బట్టి వస్తుంది.

174. ప్రేమ, శృంగారం, వివాహం – వీటి మధ్య తేడా ఏంటి?

జ. శృంగారాన్ని మనం ప్రేమిస్తాం. ప్రేమలో ఉన్నప్పుడూ శృంగారాన్ని ఆనందిస్తాం. ఈ రెంటినీ పెళ్లి చెడగొడుతుంది.

175. మీరు నిస్సహాయ స్థితిలో పడితే చూడాలని ఉంది.

జ. నేను అసహాయ శూరుణ్ణి.

176. మీ కంటూ ఎవరూ లేకపోవడం వల్ల జీవితం శూన్యంగా అనిపించడం లేదూ!?

జ. బంధాలూ బాంధవ్యాలూ ఇష్టపడనని చెప్పాగానీ, నాకెవరూ లేరని నేనెప్పుడూ చెప్పలేదే. కొంత మంది నా ఆహ్వానం మీద నా జీవితం లోకి వస్తారు. వాళ్ళు నేను వద్దనుకున్నప్పుడు వెళ్లిపోతారు.

177. ఫిల్మ్ స్టార్ల పిల్లలే మళ్ళీ స్టార్స్ అవుతున్నారేంటి?

జ. వ్యాపారుల పిల్లలు వ్యాపారం చెయ్యట్లా? స్టార్స్ ని నిందించే ముందు ఫిల్మ్ స్టార్ కానందుకు మీ నాన్నను నిందించండి. మీరే గనక స్టార్ అయి ఉంటే మీ డబ్బులతో ఇంకోళ్ళ కొడుకుని స్టార్ చేస్తారా?

178. మీరూ మాలాంటి మామూలు వాళ్ళే. కాకపోతే అందర్లో అంతర్గతం గా ఉండే ప్రాథమిక వాంఛల్ని ధైర్యంగా బయట పెడుతుంటారు.

జ. ప్రాథమిక వాంఛల పట్ల నాకుండే అవగాహన, గౌరవమే అలా మాట్లాడిస్తుంది. అదే నాలో ఉన్న గొప్ప గొప్పతనం.

179. రామూజీ, మీరంటే నాకు చాలా గౌరవం. చెడు మాటలు ఆపకూడదా..ప్లీజ్!

జ. మాటల్లో మంచివీ, చెడ్డవీ అనేవి ఉండవు. ఏ మాటయినా భావ వ్యక్తీకరణకే. ఇప్పుడింక నోట్లో వేలేసుకుని మీ అమ్మ ఒడిలో బజ్జో బుజ్జీ.

180. మీ సిద్ధాంతాలూ ఫిలాసఫీలూ చదివేక ఒక ఉత్తమ మార్గం అంటూ ఏదీ లేదని అర్థమయింది.

జ. ఈ సందర్భంగా నేను నీషే చెప్పిన ఈ మాటల్ని కోట్ చేస్తాను.
"నన్ను వెతుకుతున్నాను అంటున్నావ్... మరి నిన్ను నువ్వు వెతుక్కున్నావా?
నిన్ను నువ్వు కనుక్కున్న రోజూ నన్ను వెతకడం మానేస్తావ్"

181. రామూఇజం ఏ ఇజం లో నుంచి వచ్చింది?

జ. అన్ని ఇజాల నుంచి ఏ ఇజమూ కాని ఇజాల నుంచి....

182. మీ నైతిక విలువల గురించి చెప్పండి.

జ. ఉంటేగా. ..

183. సమాజ సేవలో పాల్గొంటారా?

జ. సొంత సేవ లో చాలా బిజీగా ఉన్నా.

184. సమాజానికి ఎంతో కొంత ఇచ్చే ఆలోచన లేదా?

జ. నేను ఇచ్చేవాణ్ణి కాదు. తీసుకొనే వాణ్ణి..

185. మీరంటే ప్రేమ ఉండ బట్టే అందరూ మిమ్మల్ని ద్వేషిస్తుంటారు.

జ. కాదు. వాళ్ళ ప్రేమను నేను లెక్క చేయను కాబట్టి వాళ్ళు నన్ను ద్వేషిస్తుంటారు.

186. ఒక దర్శకుడికి ఉండాల్సిన ప్రాథమిక సామర్థ్యాలేమిటి?

జ. సినిమా తియ్యాలన్న వాంఛతో పాటు మీ వాంఛను నమ్మి డబ్బులు పెట్టే నిర్మాత ని వెతికి పట్టుకొనే సామర్థ్యం ఉండాలి. లేదా ఓ నిర్మాతను బోల్తా కొట్టించే కన్నింగ్ అన్నా ఉండాలి.

187. మిమ్మల్ని కలవాలని ఉంది.

జ. మీరు మగాళ్లయితే అసలా ప్రయత్నమే చేయొద్దు. మీరు స్త్రీ అయితే ముందుగా మీ కొలతలు పంపించండి. మీరు మగయినా, ఆడయినా, లేదా రెండూ కాకపోయినా, తెలివైనవాళ్లయితే, నా మేధస్సుకు నచ్చే విషయం చెప్పి మిమ్మల్ని కలవాలి అనిపించేలా చెయ్యండి. మీరు ఏ కోవకీ చెందకపోతే మీ ప్రయత్నం మానుకోండి.

188. చాలా మంది మీకు ఉచిత సలహాలు ఇవ్వాలని చూస్తున్నారు.

జ. ఎంత పంచినా తరగని నిధిలా మనుషుల దగ్గర పుష్కలంగా ఉండేవి సలహాలే.

189. సింహానికి తను తినబోయే మేకల అంగీకారం అక్కరలేనట్టే శక్తిమంతుడికి ఇతరుల అంగీకారంతో పనిలేదు.

జ. మీ పాయింట్ కరెక్టే గానీ,పోలిక మాత్రం సరి కాదు. సింహం వేట విషయంలో ఇతర సింహాల సలహా,అంగీకారం తీసుకోదు. మన జీవన విధానంలోనూ అంతే ఇతరులకోసం, ఇతరుల సలహాలతోనే పనిచేస్తే మనం ఏమీ సాధించలేము.

గమనిక: ఇతరుల సలహాలు విని ఉంటే నేనింకా అమీర్ పేటలో వీడియో షాప్ నడుపుకుంటూనే ఉండేవాణ్ని.

190. మీ గురించి మీరు మూడు వాక్యాలలో ?

జ. అత్యంత మేధావిని, మహా తెలివి తక్కువ వాడిని, చాలా సార్లు ఈ రెంటికీ మధ్యస్థంగా ఉండేవాడిని.

191. మీకింత సెన్స్ ఆఫ్ హ్యూమర్ ఎలా వచ్చింది.

జ. చాలా కాలం కిందట జీవితం హాస్యాస్పదం అని తెలిసింది.

192. మీరు ఎదుర్కున్న క్లిష్ట పరిస్థితుల గురించి చెప్పండి.

జ. పరిస్థితులెప్పుడూ క్లిష్టంగా ఉండవు. వాటిని ఎదుర్కోవడం ఎలా అని మనం భయపడడం వల్ల అవి క్లిష్టంగా అనిపిస్తాయి. నేను ఆలోచిస్తానే తప్ప మథన

పడను. ఆలోచిస్తే పరిష్కారాలు కనిపిస్తాయి. మథన పడితే డిప్రెషన్ వస్తుంది. ఒక ఆలోచన పని చేయకపోతే మరో ఆలోచన పనిచేస్తుంది. చాలా మంది మథన పడడాన్నే ఆలోచన అనుకుంటారు.

193. నాకు మీరు పిచ్చోళ్ళనిపిస్తుంది.

జ. కాదన్నానా?

194. అందమైన అమ్మాయికీ, సెక్సీ అమ్మాయికీ తేడా ఏమిటి?

జ. రెండూ వేరు కాదు. అందంగా లేని అమ్మాయి సెక్సీగా ఉండదు. సెక్సీగా లేని అమ్మాయి అందంగా ఉండదు.

195. మీలా ఆత్మవిశ్వాసంతో తొణికిసలాడటం ఎలా?

జ. మీరు ఎవరి లెక్కలో లేని వారనీ, ఏమీ చేతగాని వారనీ గుర్తించండి. అప్పుడిక ఎవరేమంటారోనన్న భయం లేకుండా చెయ్యాలనుకున్నది చేసేస్తారు. అప్పుడే మీకు ఆత్మవిశ్వాసం వస్తుంది.

196. మీరు వాచి ఎందుకు పెట్టుకోరు ?

జ. నేను కాలాన్ని పరిగెట్టిస్తానుతప్ప కాలంతో పరుగెట్టను.

197. నీషే, షోపెన్ హావర్ – ఈ ఇద్దరిలో ఎవరి వేదాంతం మీకు ఇష్టం?

జ. వాళ్ళిద్దరూ వంటకాలు కాదు ఏది ఇష్టం అంటే చెప్పడానికి. అనుభవాల ద్వారా అర్థమై బుర్రలోకి ఇంకే ఏ వేదాంతమైనా నాకు ఇష్టమే.

198. 'ఫౌంటెన్ హెడ్' నాకు బాగా నచ్చింది. నేను మిమ్మల్నే హోవార్డ్ రోర్క్‌లా ఊహించుకుంటున్నా.

జ. మీకు 'ఫౌంటెన్ హెడ్' గానీ, రోర్క్ గానీ బుర్రకెక్కలేదు..రోర్క్ కీ నాకూ ఉన్న తేడా ఏంటంటే – రోర్క్ ఒక ధ్యేయంతో బతికే వ్యక్తి. నేను హ్యాపీగా బతకడమే తప్ప వేరే ధ్యేయం లేని వ్యక్తిని. ఇతరుల్ని అనుసరించే పొరపాటు చేయకండి.

199. అచ్చం మీలా ఉండాలనుకొనే వాళ్ళే మిమ్మల్ని ద్వేషిస్తుంటారు.

జ. కాదు. వాళ్ళు ఎలా ఉండాలనుకుంటారో, ఎలా ఉండడానికి భయపడతారో, అలా ఉంటాను కాబట్టి నన్ను ద్వేషిస్తారు. నేను ఫెయిలయినప్పుడే వాళ్ళకి కాస్త మనశ్శాంతి దొరుకుతుంది. కానీ పాపం వాళ్ళకి ఆ కాస్త ప్రశాంతతని కూడా ఇవ్వకుండా నేను నా తర్వాతి పని మొదలుపెడుతుంటాను. దాంతో వాళ్ళ కోపం మరింత ఎక్కువ అవుతుంది. చాలా ఏళ్లుగా ఇలాగే జరుగుతోంది, దాంతో పాటే వాళ్ళ ద్వేషం కూడా దిన దిన ప్రవర్ధమానమవుతోంది. పదే పదే కర్రతో తల మీద కొట్టినా చావని పాముని ఎలా ద్వేషిస్తారో నన్నూ అలాగే

ద్వేషిస్తారు. అయితే వాళ్ళు తెలుసుకోవాల్సింది ఏంటంటే 'నా ప్రాణం నా తలలో లేదు. నా ఆలోచనల్లో ఉంది. ఆలోచనల్ని ఆపడం కానీ, చంపడం కానీ ఎవరి వల్లా సాధ్యం కాదు'.

200. మీరు మూర్ఖుల ప్రశ్నలకి కూడా సమాధానమిస్తుంటారెంటి?

జ. ఎన్ని రకాల మూర్ఖులు ఉంటారో మీలాంటి తెలివైన వాళ్ళకి చూపుదామని...

201. మీ దృష్టిలో మతం అంటే?

జ. నేను దేవుడూ, కులం, మతం లాంటి వాటిని నమ్మను. నా భావాలు, నా ఆలోచనలే నా దేవుళ్ళూ, నా మతాలు.

202. మీకు అతిశయం ఎక్కువ, విషయం తక్కువ.

జ. నేను మొత్తం అతిశయాన్నే. ప్రపంచంలో అతిశయం ఒక్కటే నిజం.

203. మీరు నిజంగా ప్రేమించిన ఒక్కరి పేరు చెప్పండి

జ. ఎవరూ లేరు. నన్ను సంతోష పెట్టినంత కాలం ఎవర్నయినా ప్రేమిస్తాను. ఆ సంతోషం అందించలేనప్పుడు మానేస్తాను. నాకు తెలిసీ నా అంత స్వార్థ పరుడు ఇంకోడు లేడు. అందుకు నేను చాలా గర్వపడతాను.

204. మీరు నాస్తికులు ఎప్పుడు అయ్యారు?

జ. సుమారుగా 12 ఏళ్ల వయసులో దేముడు గురించి అర్థమవ్వకపోయినా భక్తుల గురించి అర్థం అయింది. అందుకే నాస్తికుణ్ణి అయ్యా.

205. అయాన్ ర్యాండ్ నన్ను తీవ్రంగా ప్రభావితం చేస్తోందని గమనించి చదవడం మానేశా. కానీ రామూ ఇజాన్ని మాత్రం దూరం చేసుకోలేకపోతున్నా.

జ. నేను మీకు అయాన్ ర్యాండ్‌ని మందు కలిపి ఇచ్చా. అయాన్ ర్యాండ్ కన్నా నేను ప్రమాదకరమైన డ్రింకుని. కానీ నన్ను సరైన మోతాదులో తీసుకొంటే మాత్రం మంచి కిక్కిస్తా.

206. భారతీయ సినిమాల్లో గొప్పదనం లేదని మీరెందుకు అనుకుంటారు?

జ. మీ దృష్టిలో గొప్పది అనుకున్న ఒక భారతీయ సినిమాని తీసుకుని దాన్ని ఎక్కణ్ణుంచి ఎత్తేశారో ఆ ఒరిజినల్‌తో కంపేర్ చేసి చూడండి.. నా సినిమాలతో సహా – మీకే తెలుస్తుంది...

207. మీరు మీ మార్గంలోనే నడవండి.

జ. నడవను. పరుగెత్తుతా.

208. మీ రాతలు సినిమా వాళ్ళ కోసమా, వేదాంతుల కోసమా.

జ. చదివేవాళ్ల కోసం కాదు, చదవనోళ్లకోసం కాదు. చదివి అర్థం చేసుకునే వాళ్లకోసం, చదవకుండా వాగే వాళ్లకోసం.

209. మీరు వచ్చే జన్మలో ఎలా పుట్టాలనుకుంటున్నారు

జ. నాలా

210. మీ రచనా సంపుటికి "నా ఇష్టం" అని ఎందుకు పేరు పెట్టారు?

జ. నా ఇష్టం.

211. ఆచరించే మీలాంటి వారికన్నా ఆలోచించే వారే సోక్రటీస్ స్థాయికి చేరగలుగుతారు.

జ. మీలాంటి ఆలోచనలు ఉన్నవాళ్ళు మాత్రం నా రాతలు చదివే స్థాయికి కూడా చేరరు.

212. ద్వేషంలో ఉన్న మనుషులు గతంలో తమకు జరిగిన సాయాలను కూడా మర్చిపోతారు. ద్వేషం అనేది చాలా శక్తిమంతమైన ఉద్వేగం కదా?

జ. స్వార్థంలోంచి పుట్టిన ద్వేషం అన్నిటికన్నా శక్తిమంతమైన ఉద్వేగం.

213. మీ రాతల వల్ల కుర్రాళ్ళంతా అయోమయంలో పడ్డ అడ్డగాడిదల్లా తయారవుతున్నారు?

జ. గ్రేట్. నా ధ్యేయం కూడా అదే. అయోమయంలో పడ్డామని తెలుసుకున్నాక ఆ అడ్డగాడిదలు సరైన మార్గం వెతుక్కోగలుగుతాయి. మీలాంటి వాళ్ళు మాత్రం అడ్డగాడిదల్లా కూడా కాకుండా బండరాళ్లలా ఎక్కడున్న వాళ్ళు అక్కడే ఉండిపోతారు.

214. మనిషి మనిషిలాగే ఉండాలి తప్ప భావోద్వేగాలు లేని అతీత స్థితికి చేరుకోకూడదు.

జ. మనిషి ఎప్పుడూ దేవుడు కావడానికే ప్రయత్నించాలి. అలా చెయ్యనప్పుడు మనిషిగా కొనసాగటంలో అర్థం లేదు

215. ఈ ప్రపంచంలో హోవార్డ్ రోర్క్ లాంటి వాళ్ళుండే అవకాశం లేదు. అయినా ఎందుకు ఇంత మంది అతనిలా ఉండాలని ఆరాటపడతారు.?

జ. అందరం ఏదో ఒకటి సాధించాలనే తపనతోనే బతుకుతుంటాం. రోర్క్‌లా ఉండాలని ప్రయత్నిస్తే కనీసం అతనిలో సగమో, పాతికో అవుతాం.

216. మీరు తిమ్మిని బమ్మిని చెయ్యగల సమర్థులు. 2 ని 5 అని, 5 ని 2 అని నమ్మించగలరు.

జ. రెండయినా, అయిదయినా వాటికి మనమిచ్చే విలువ మన విలువను బట్టి ఉంటుంది.

217. నిర్ణయాలు తీసుకొనే సామర్థ్యం గురించి చెప్పండి.

జ. మీరు జీవితంలో ఎక్కడికి వెళ్ళాలో నిర్ణయించుకున్నాక ఆగకుండా పరుగెట్టడం ప్రారంభించండి. దారిలో మీరు కింద పడొచ్చు, కాళ్ళు నొప్పెట్టొచ్చు. ఊపిరి అందకపోవచ్చు కానీ కచ్చితంగా ఏదో ఒక చోటికి చేరుతారు. అయితే మీరు పరుగెట్టక ముందే పడితే ఎలా, నొప్పెడితే ఎలా, చేరుతామో లేదో అన్న సందేహాలతో ఆలోచిస్తూ కూర్చుంటే ఉన్నచోటే ఉండిపోతారు.

218. మీరు మమ్మల్ని లెక్కచెయ్యకపోయినా, మేము మాత్రం మీ పట్ల ఆసక్తి చూపుతూనే ఉంటాం.

జ. అయితే మీ కాళ్ళకు దణ్ణం పెట్టాలా?

219. మన గూడు పదే పదే చెదిరిపోతున్నా సాలెపురుగు లాగా మళ్ళీ మళ్ళీ దాన్ని కట్టుకుంటూ బతకడం మంచి మార్గమా?

జ. వేరే మార్గమే లేదు. చావూ బతుకూ ఎలాగూ మన వెన్నంటే ఉంటాయి కాబట్టి గూడు కట్టుకుంటూ ముందుకుపోవడమే శరణ్యం.

220. మీరు మంచి బాలుడా, చెడ్డ బాలుడా?

జ. మంచి వాళ్ళకు చెడ్డవాణ్ణి. చెడ్డవాళ్ళకు మంచి వాణ్ణి.

221. మీ గురించి తెలిసేంత వరకూ, హోవార్డ్ రోర్క్ లాంటి ఒక వ్యక్తి నిజ జీవితంలో కూడా ఉంటారని నేను అనుకోలేదు.

జ. హలో... అంత తొందరొద్దు. "షోలే" కీ "ఆగ్" కీ ఎంత తేడా ఉందో, నాకూ రోర్క్ కీ అంత కన్నా ఎక్కువ తేడా ఉంది. మీకు 'ఫౌంటెన్ హెడ్' గానీ, నేను గానీ అస్సలు అర్థం కాలేదు. ఏదేమయినా మా ఇద్దర్నీ పోల్చడం అంటే, నాకూ, రోర్క్‌కీ ఇద్దరికీ అవమానమే!

222. మీరు ఆస్తికులా, నాస్తికులా?

జ. నేను రామూనే నమ్ముతాను. రామూ ఇష్టుణ్ణి. రామూయిస్టుని.. రాము ఇజాన్ని.

223. మీరు అన్ని ఇజాలనీ మీ సొంత ప్రయోజనాలకే ఉపయోగించుకొంటున్నారు.

జ. హమ్మయ్య.. ఎంత కరెక్ట్‌గా చెప్పారండీ. నేను ఇంతకాలంగా చెబుతున్న దేంటో కనీసం మీ ఒక్కరికయినా అర్థమయినందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ

సందర్భంగా జర్మన్ వేదాంతి నీషే నుంచి విజయవాడ వేదాంతి సత్యేంద్ర వరకూ అందరికీ నా కృతజ్ఞతలు. మీకు కూడా లక్ష టన్నుల కృతజ్ఞతలు.

224. మీకు స్నేహితులు లేకపోతే మీమీద, ఉంటే వారి మీద, జాలి పడతాను.

జ. మీ జాలిని వృథా చేస్తున్నందుకు మీ మీద జాలి కలుగుతోంది.

225. భారతీయ చలన చిత్ర చరిత్రలో మీరు నిలిచిపోతారు.

జ. చరిత్రలో నిలిచి ఉండడం పెద్ద గొప్ప కాదు. నేను దానితో పడుకోవాలనుకుంటున్నాను.

226. జ్ఞాని తను చేసిన తప్పు మళ్ళీ చేయడు.

జ. తప్పులు చేయకపోతే జ్ఞాని కాడు. మళ్ళీ మళ్ళీ తప్పులు చేయకపోతే మహా జ్ఞాని కాలేడు.

227. మిమ్మల్ని 'జూ'లో పెట్టాలి.

జ. అవునవును. అలాచేస్తే విమర్శకులకు మంచిది. నన్ను తిడుతూ వ్యాసాలు రాయడం మానేసి డైరెక్ట్‌గా రాళ్లే వెయ్యొచ్చు.

228. పెళ్లిళ్లు స్వర్గలోకంలో అవుతాయంటారు. మరి విడాకులూ?

జ. జ్ఞాన లోకంలో.

229. ప్రేమకీ కామానికీ తేడా ఏమిటి?

జ. కామం స్వచ్ఛమైనది, నిజాయితీగా ఉంటుంది. ప్రేమలో పక్షపాతం ఉంటుంది. దాన్ని నమ్మలేం.

230. మీ పదాలు ఇంకొంచెం సౌమ్యంగా ఉంటే బాగుంటుంది.

జ. జనాల కపాలాలు చాలా మందం. మేకుల్లాంటి పదాలయితేనే లోపలికి దిగుతాయి.

231. మీరంటే నాకెందుకింత ప్రేమ?

జ. ముందు నేనంటే నాకెందుకింత ప్రేమో తెలుసుకున్నాక మీరు నన్నెందుకు ప్రేమిస్తున్నారో తెలుసుకొనే ప్రయత్నం చేస్తాను.

232. మీ స్వభావం వల్లే మీ జీవితంలో స్త్రీ లేకుండా పోయింది.

జ. కాదండీ సార్. నా స్వభావం వల్లే బోలెడంత మంది స్త్రీలు నాకు దొరికారు.

233. మీలాగా నైతిక విలువల పట్ల పట్టింపు లేని స్థితికి చేరుకోవడం ఎలా?

జ. చాలా సింపుల్. మీ నైతిక విలువల బట్టలు విప్పి, ఆ నగ్నత్వాన్ని మీరింత వరకూ చూడని కోణంలో చూడండి.

234. మీ రాతలు చదివాక నన్ను నేను పోగొట్టుకున్న ఫీలింగ్ కలుగుతోంది.

జ. మిమ్మల్ని వెతికిపట్టుకునేంత అవసరం, టైమ్ ఇక్కడెవరికీ లేదు.

235. మీ వేదాంతం చూస్తుంటే చీరల షాపులో ఇష్టం లేని చీరను అంటగట్టే ప్రయత్నంలా ఉందని మా సోదరి అంటోంది.

జ. నేను చీరలు అమ్మే వాణ్ని కాదు. ఆ చీరలు విప్పి వారి అందాలని వాళ్లకే చూపించి వాళ్ళే మురిసిపోయేలా చేసేవాడ్ని.

236. మీ ఫ్రెండ్ సత్యేంద్రని కలిశాక మీ జీవితం లో మార్పు వచ్చిందన్నారు. ఇంతకీ సత్యేంద్ర ఎవర్ని కలిసుంటారో?

జ. నాలాంటి వాణ్ణి కలిసుండొచ్చు...

237. "ఫౌంటెన్ హెడ్" చదివాను కానీ, "అట్లాస్ ష్రగ్డ్" పూర్తిచేయ్యడం నా వల్ల కావటం లేదు.

జ. బహుశా మీ తెలివితేటలకున్న పరిమితుల వల్ల కావచ్చు. లేదా పరిమితులు లేని మీ తెలివితేటల వల్ల కావచ్చు. కానీ మీరడిగిన దాన్ని బట్టి చూస్తే మొదటిదే రైట్ కావచ్చు.

238. తప్పు చేశానన్న బాధ నుండి మీరెలా తప్పించుకుంటారు.

జ. బాధ పడడం కన్నా తప్పు ఎలా జరిగిందో తెలుసుకుని, మళ్ళీ అలా జరగ కుండా బిజీ అవ్వడం ద్వారా.

239. మీకు ఇంగ్లీషు పుస్తకాలూ, ఇంగ్లీషు సినిమాలూ తప్ప ఏవీ నచ్చవు. మీరు ఇండియాలో ఉంటున్న అమెరికన్...

జ. దేశాల కన్నా తెలివితేటలకు నేను ప్రాధాన్యం ఇస్తా. మీకే గనక అమెరికన్ల కన్నా ఎక్కువ తెలివి ఉంటే మీరు అనకా పల్లిలో ఉన్నా వెతుక్కుంటూ వచ్చేస్తా.

240. మీరు ఇంకెవరిలానో నటిస్తున్నారనిపిస్తుంది.

జ. నేను ఎవరికో ఇంకెవరిలాగానో అనిపించటానికి కారణం ఆ ఎవరో ఇంకెవరికో ఇంకెవరిలాగో అనిపిస్తారు కాబట్టి.

241. పెళ్లి గురించి ఎందుకంత చెత్తగా వాగుతారు? వైవాహిక జీవితం పట్ల మీకసలు అవగాహనలేదు.

జ. అయ్యుండొచ్చు.. లేదా మీ భార్య నా దగ్గర లేకపోవటం వల్ల కావచ్చు.. ...

242. మిమ్మల్ని మీరు తక్కువ చేసుకుంటారు కానీ... 'అవతార్' కన్నా మీ 'సత్యా', 'కంపనీ' సినిమా లే చాలా బాగుంటాయ్!?

జ. మీలాంటి సన్నాసులున్నంత కాలం నాలాంటి సన్నాసులు సన్నాసి సినిమాలు తీస్తూనే ఉంటారు. దేవుడే గనక కేవలం మీలాంటి వాళ్ళనే పుట్టించి, నా సన్నాసి సినిమాలన్నిటినీ కూడా గ్యారెంటీగా హిట్ చేయిస్తానంటే రోజూ గుడికెళ్లి దండం పెట్టుకుంటూ, పెళ్లిచేసుకుని, పిల్లలని చదివిస్తూ,నా దేశాన్ని ప్రేమిస్తూ, పొద్దున్నే నిద్ర లేస్తూ, ఆడాళ్లాని నా అక్క చెల్లెళ్లలా భావిస్తూ, వోడ్కా మానేసి ఏదైనా మదర్ థెరేసా, ఫాదర్ బొరేసా లాంటి సేవా సంస్థలో చేరిపోతా...

243. బ్లూ ఫిలిమ్స్‌లో కూడా వేదాంతం ఉంటుందా?

జ. మనిషి జీవితంలో ఉద్వేగ పరమైన, మేధాపరమైన, శారీరకమైన గ్యాప్‌లు చాలా ఉంటాయి. వాటిని అర్థం చేసుకొని గ్యాప్‌లు ఫిల్ చేసుకోవాలనే కోరిక అందరికీ ఉంటుంది. రాజకీయ నాయకులు, వేదాంతులు, బ్లూ ఫిలిమ్స్ తీసే వాళ్ళకు ఈ విషయం బాగా తెలుసు కాబట్టే వాళ్ళే మన గ్యాప్‌లు ఫిల్ చేస్తూంటారు

244. "పోయినోళ్ళంతా మంచోళ్ళు"....ఎందుకని?

జ. పోయినోళ్ళు.. బ్రతికి ఉన్నోళ్ళకి ఏ విధమైన పోటీనీ ఇవ్వలేరు కాబట్టి. వాళ్ళ గురించి ఆలోచించాల్సిన అవసరం ఉండదు కాబట్టి.

245. మీ మూడ్, టైము, పరిస్థితులని బట్టి మీ నుంచి మంచి లేదా చెడ్డ సినిమాలు వస్తుంటాయి.

జ. 100 % కరెక్ట్. కాకపోతే అవి రిలీజయ్యే వరకూ మంచివా చెడ్డవా అన్న విషయం నా మూడ్ నాకు తెలియనివ్వదు.

246. ఎంతో మందికి బ్రేక్ ఇచ్చిన మీరు...మీరు చెప్పుకునేంత చెడ్డవాళ్ళు మాత్రం కాదు.

జ. వాళ్ళకోసమే సినిమా తీస్తే అది బ్రేక్ ఇవ్వడం అవుతుంది. నా సినిమా కోసం వాళ్ళ టాలెంట్‌ని ఉపయోగించుకోవడం నా స్వార్థమే అవుతుంది.

247. మీ ప్రతి పాత్రలోనూ అయాన్ ర్యాండ్ రచనలోని పాత్రలు కనబడు తుంటాయి.

జ. నిజ జీవితంలోని వ్యక్తులని ప్రేరణగా తీసుకుని అయాన్ ర్యాండ్ రచనలు చేసింది. నేనూ నా పాత్రల సృష్టికి నిజ జీవితం మీదే ఆధార పడతా కాబట్టి పోలికలు కనబడడం సహజం.

248. మీ రచనలతో నేను ప్రేమలో పడ్డా. కానీ ఎలా చెప్పాలో తెలియడం లేదు.

జ. చెప్పేశారుగా!

249. ప్రపంచంలో ఉన్న పదీ పన్నెండు కథల్ని మళ్ళీ మళ్ళీ ఆసక్తి కరంగా చెప్పడం గొప్ప కళ.

జ. నాకు తెలిసింది రెండే కథలు.. అవీ పూర్తిగా కాదు. అందుకేనేమో నా సినిమాలన్నీ అదే టైపుగా ఉంటాయి.

250. వెటకారానికి బట్టలు తొడిగితే అది వర్మ అవుతుంది.

జ. బట్టలు విప్పితే అది సత్యమవుతుంది.

251. మీరూ మామూలు మనిషే., మీకూ మాలాగే భావోద్వేగాలున్నాయి.

జ. మీరు ఎలా హ్యాపీ ఫీలయితే అలా అనుకోండి. నేను మాత్రం నేనే దేవుణ్ణి అని ఫిక్స్ అయ్యా.

252. మీరు పెద్ద పిచ్చి కేసు. కాకపోతే మాలా రొటీన్‌గా బతికేసే వాళ్ళ కన్నా బెటరు.

జ. పిచ్చి అంటే వాస్తవాలని అర్థం చేసుకోలేకపోవడమే. కానీ వాస్తవాలను నా కంటే ఎవరూ బెటరుగా అర్థం చేసుకోలేరు కాబట్టి నేను పిచ్చి వాణ్ని కాదు. నాకు పిచ్చనుకుంటున్న మీరు పిచ్చికేసు.

253. మీ రాతలు మాకేం నేర్పకపోయినా ఆలోచింపజేస్తున్నాయి.

జ. ఎవడూ ఎవడికీ ఏమీ నేర్పనూ లేడు, ఆలోచింపచేయనూ లేడు. మార్పు అనేది మీ అంతర్గత అభిప్రాయాలూ, మీకు ఎదురయ్యే అనుభవాలను బట్టి వస్తుంది. వాటిలో నా రాతలు కూడా ఒక భాగమై ఉండొచ్చు.

254. మీకూ హోవార్డ్ రోర్క్ (ఫౌంటెన్ హెడ్ లో హీరో) కీ తేడా ఏంటీ?

జ. ఆశయాలకీ, ఆచరణకీ ఉన్న తేడా. మనందరిలో హోవార్డ్ రోర్క్ ఉంటాడు. కానీ అందరం హోవార్డ్ రోర్క్ లు కాలేం. జీవితంలో గెలవడం అంటే హోవార్డ్ రోర్క్ అవడం కాదు, అతన్ని అర్థం చేసుకోవడం. నా దృష్టిలో నాకు తెలిసిన వారందరి కంటే రోర్క్‌ని నేనే ఎక్కువ అర్థం చేసుకున్నా.

255. పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాతే మీరు విశ్లేషణ ప్రారంభిస్తూంటారా?

జ. పూర్తిగా అర్థం చేసుకోవడం అనేది, పూర్తిగా అర్థం చేసుకోలేకపోవడమనేది లేదని పూర్తిగా అర్థం చేసుకోవటం.

256. రాజకీయాల మీద సినిమా తీసే ఆలోచన ఉందా?

జ. నా సినిమాలు చాలా వరకూ రాజకీయాల మీద తీసినవే. ఉదాహరణకు "కంపనీ" అండర్ వరల్డ్ రాజకీయాల మీదా, "సర్కార్" ఫ్యామిలీ రాజకీయాల

మీదానూ. అయితే ఏదో ఒక రోజు రాజకీయ నాయకుల రాజకీయాల మీద కూడా సినిమా తీస్తా.

257, మీరు వైనాండ్‌నీ, టూహీనీ, కీటింగ్‌నీ, రోర్క్‌నీ ఒక్క ముక్కలో వర్ణించ గలరా?

జ. వైనాండ్‌లో రోర్క్ ఉన్నాడు. కానీ ఆ విషయం అతనికి తెలియదు.

1. టూహీలో రోర్క్ ఉన్నాడు కానీ అతనికి ఆ రోర్క్ అంటే భయం.
2. రోర్క్‌లా తయారవడం తన వల్ల కాదని కీటింగ్‌కు తెలుసు.
3. తనలో ఉన్న వైనాండ్‌నీ, టూహీని, కీటింగ్‌నీ చంపగలిగిన వాడే రోర్క్.

లిరోర్క్, వైనాండ్, టూహీ, కీటింగ్.. వీళ్ళంతా 'ఫౌంటెన్ హెడ్' లో పాత్రలు.

258. మన పరాజయాల్ని ఎదుటి వారి మీదికి నెడుతూంటాం ఎందుకు?

జ. ఎందుకంటే మనల్ని మనం నిందించుకుంటే మన అస్తిత్వం దెబ్బతింటుంది కాబట్టి. అయినా పరాజయాల్ని ఒప్పుకోవటానికి ఆత్మ స్థైర్యం కావాలి.. అందుకే ఎక్కువమంది ఇతరులని నిందించే పనిలో ఉంటారు.

259. కొంతమంది పుట్టుకతో సన్నాసులు. మరికొంత మంది సన్నాసి తనాన్ని సాధించుకుంటారు. ఇంకొంత మందికి సన్నాసితనం ఆపాదించబడుతుంది.

జ. చాలా మంది సన్నాసులకి ఈ మూడు విషయాలూ తెలియదు కాబట్టి వేరే సన్నాసులు గురించి చర్చిస్తూంటారు.

260. రామూయిజం అంటే నాకు విపరీతమయిన ఇష్టం. అది అర్థం చేసుకున్నాక నేను ప్రపంచాన్ని కొత్తగా చూడగలుగుతున్నా.

జ. ప్రపంచాన్ని ఊరకే చూస్తూ కూర్చుంటే ఉపయోగం లేదు... మీ భావోద్వేగాలతో, తెలివితేటలతో దాన్ని నీలో కలుపుకున్నప్పుడే అవి నీలో భాగం అవుతాయి.

261. జీవితానికి అర్థం ఏమిటి?

జ. ఈ ప్రశ్న వేశారంటే జవాబు వినే స్థితిలో ఉన్నారనుకోను.

262. మీలో ఒక డైరెక్టరే కాదు, ఒక ఫిలాసఫర్, ఒక సైకాలజిస్ట్ ఉన్నారు.

జ. వీళ్ళందరికన్నా లైఫ్‌ని సూపర్‌గా ఎంజాయ్ చేసే ఒక పిచ్చనాకొడుకు కూడా నాలో ఉన్నాడు.

263. ఎంతయినా మీరు చాలా స్మార్ట్ అండీ !!

జ. నేను స్మార్ట్ కాదని తెలుసుకొనేంత స్మార్ట్ నెస్ మీలో లేదు కాబట్టే నన్ను స్మార్ట్ అనుకుంటున్నారు.

264. సినిమాలు సమాజాన్ని మారుస్తాయంటారా?

జ. మార్చవు. "హమ్ ఆప్కే హై కౌన్" రిలీజైన కాలం నుంచి ఉమ్మడి కుటుంబాలు ఎన్ని ఏర్పడ్డాయంటారు ?

265. ఇతరుల పరాజయాలను చూసి చాలా మంది సంతోషిస్తారు కదా?

జ. కచ్చితంగా. ఇతరుల పరాజయాలు చూసినప్పుడు వాళ్ళకు తమ సొంత పరాజయాలు.. విజయాలుగా కనిపించి సంతోషం కలుగుతుంది

266. ఇతరులను మీరు లెక్కపెట్టనప్పుడు అసలీ రాతలన్నీ ఎందుకు?

జ. మీలాంటి మానసిక అపరిపక్వత ఉన్న వ్యక్తులని ఇరిటేట్ చేయటం నాకు ఇష్టం కాబట్టి...

267. మీరు దేని పట్ల మితి మీరిన అభిమానం చూపిస్తారు?

జ. అయాన్ ర్యాండ్ థియరీల నుంచి జెన్నిఫర్ లోపెజ్ జఘనం వరకూ నాకు చాలా వాటి పట్ల మితి మీరిన అభిమానం ఉంది....

268. మీరు ఇనుము వేడెక్కిన తర్వాత కొట్టడం కాకుండా... సుత్తితో కొట్టి దాన్ని వేడెక్కించాలనుకుంటారు.

జ. నా ప్రకారం పనులు జరగాలి గానీ అవి జరిగేవరకూ నేను ఆగను.

269. ఎవరూ ఎవరినుంచీ ఏమీ నేర్చుకోరని మీరు అంటారు. మరి గురు శిష్యుల మాటేమిటి?

జ. నేర్చుకోవడం అనేది మన అంతరంగంలో జరిగే ప్రక్రియ. బోధన కేవలం యాంత్రికం. నేర్పించబడడం కన్నా నేర్చుకోవడానికే నేను ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాను. అందుకే నాకు టీచర్లు గిట్టరు.

270. ప్రపంచంలో అసలు ఆడాళ్లే లేకపోతే?

జ. అబ్బా... ఎందుకండీ ఇలాంటి దుర్మార్గపు ఆలోచనలు చేస్తారు.

271. జీవితంలో ఓడ్కా కన్నా, సెక్సు కన్నా గొప్పవి చాలా ఉన్నాయి అని తెలుసుకొనే స్థాయికి మీరు ఎప్పటికి ఏదుగుతారో ఏమో?

జ. ఎంత ఎదిగిపోయారండీ? మీ స్థాయికి నేను ఎదిగే బదులు రివర్స్‌లో ఎదిగి ఎప్పటికీ ఒక పిల్లాడి లాగే ఉండిపోతాను.

272. మీలాంటి బాధ్యతా రహితమైన వ్యక్తి మీడియా బాధ్యతల గురించి మాట్లాడ్డమా? ఎంత విచిత్రం?

జ. విచిత్రం ఏముంది? మీరు మొరగడం లేదూ...

273. మీరు ఇంత నిజాయితీగా, మనసులో ఏదీ ఉంచుకోకుండా ఎలా ఉండగలుగు తున్నారు?

జ. సత్యాన్ని దాచలేమని తెలిసిన తర్వాత దాన్ని దాచడం అనవసరం అని నా అభిప్రాయం. నా దృష్టిలో సత్యం అనేది అందరితో పంచుకోవాల్సిన సంపద.

274. సెక్సు, సినిమా – ఈ రెంటిలో ఏదో ఒకటే ఎంచుకోవాల్సి వస్తే?

జ. సినిమా సెక్సుని గానీ, సెక్స్ సినిమాని గానీ ఎంచుకుంటా.

275. మనకి సముద్రాలూ, షార్కుల గురించి అవగాహన లేదు కదా 'జాస్' లాంటి సినిమా ఇక్కడ వర్క్ అవుట్ అవుతుందా?

జ. 'జాస్' విజయవాడలో మండుటెండల్లో 100 రోజులు ఆడింది. ప్రేక్షకులు సినిమాలోని భావోద్వేగాలతో కనెక్ట్ అవుతారు గానీ, ఆ కథ ఎక్కడ జరుగు తోందనేది పట్టించుకోరు.

276. సినిమా కథలు ఎలా రాయాలనే దాని గురించి ఒక ఆర్టికల్ రాయకూడదూ...

జ. సినిమా కథా రచన అంటే ప్రధానంగా కథ చెప్పగలిగే నేర్పు అని అర్థం. అది ఎవరూ ఎవరికీ నేర్పలేరు.

276. టైటిల్ ఏదయితే ఏంటండీ, సినిమా బాగుండాలి గానీ...

జ. అబ్బా... ఎంత తెలివో...

277. మీకు మంచి టెక్నాలజీ, భారీ బడ్జెట్ ఇస్తే "అవతార్" తీయగలిగే వారా?

జ. హా..హా.హా.. హీ. హ్హా హ.హ.

278. ఐడియాలు, ఆలోచనలే ముఖ్యమైనప్పుడు "ఇది రామ్ గోపాల్ వర్మ చిత్రం" అని వేసుకోవడం ఎందుకు?

జ. నా పేరు తెరమీద చూసుకోవడం నాకు ఇష్టం కాబట్టి.

279. అంతంత కళ్ళు, ఇంత తెలివితేటలూ ఉన్న మీరు అమ్మాయి అయితే భలే బాగుండేది...

జ. అబ్బ– నాకు సిగ్గేస్తోంది బాబూ...

280. చావుకీ బతుక్కీ సంబంధం ఏమిటి?

జ. చావు లాంటి బ్రతుకుని బతక్క పోవటం.

281. ప్రార్థన మీద మీ అభిప్రాయం.

జ. ప్రేమ కంటే పవిత్రమైన అపవిత్రం.

282. మీరెంతగా కష్టపడి పొగరుబోతుగా నటించినా మీలో సహజంగా ఉన్న సౌమ్యత బయటపడుతూనే ఉంటుంది.

జ. నాలో సహజంగా ఉండే పొగరుని అర్థం చేసుకోని తెలివి లేని వాళ్లందరికీ నేను సౌమ్యంగానే కనబడతా.

283. ఇలాంటి సమాధానాలివ్వడానికి మీకెంత టైమ్ పడుతుంది?

జ. ఇన్ స్టెంట్‌గా వచ్చేస్తాయి. ఇవి జీవితం పట్ల నాలా వున్న నా రియాక్షన్స్ కాబట్టి.

284. దేవదాస్‌లా ఆత్మహత్య చేసుకొనే వ్యక్తుల గురించి మీ అభిప్రాయం?

జ. ప్రేమలో ఉన్నప్పుడు త్రాగుతూ అమ్మాయితో ఆనందించక...విడిపోయాక త్రాగి విచారించే దేవదాసులు చావడమే బెటర్.

285. నగ్న సత్యం చాలా అందమైనది.

జ. కరెక్టే గానీ బాడీ బాగుండాలి మరి...

286. ఇనుము వేడెక్కిందాకా ఆగొద్దు. సుత్తి దెబ్బలతో దాన్ని వేడెక్కించాలి.

జ. నా జీవితం అంతా అలాగే బతికా. కాని కొన్ని సార్లు వళ్ళు వాచిపోయిందను కోండి.

287. మీరేం పెద్ద తెలివైన వాళ్లేమీ కాదు అని నా అభిప్రాయం. మీ చుట్టూ ఉన్న వాళ్ళు తెలివితక్కువ వాళ్ళు కాబట్టి మీరేదో తెలివైన వారిలా కనబడుతున్నారని నా అభిప్రాయం.

జ. మీరో దద్దమ్మ అని నా అభిప్రాయం. మీ చుట్టూ ఉన్న వాళ్ళ తెలివి ఎక్కువ ఆలోచనలు మిమ్మల్ని తెలివి ఎక్కువ వారిలా ఫీలయ్యేలా చేస్తున్నాయని నా అభిప్రాయం.

288. సినిమా సినిమాకీ మీ వ్యక్తిత్వంలో మార్పులొస్తుంటాయా?

జ. సినిమా చేస్తున్నప్పుడు కలిగే ఆయా అనుభవాల వల్ల వ్యక్తిగా నేను మార్పు చెందుతాను గానీ నా వ్యక్తిత్వం మాత్రం ఎప్పటికీ స్థిరంగానే ఉంటుంది.

289. 'ఆగ్' లో యాపిల్ సీన్ ఎలా తీశారు?

జ. ప్రత్యేకంగా తయారు చేసిన రిగ్ ఉపయోగించి ఆ షాట్ తీసా. సినిమా ఫెయిలయింది కాబట్టి దాన్నెవరూ పట్టించుకోలేదు. ఆ సినిమా ఫ్లాప్ అయినా ఆ షాట్ గొప్పతనం గుర్తించినందుకు మీకు నా ముద్దులు...

290. 9/11 లో 3000 మంది అమెరికన్లు చనిపోయారు. ఆఫ్ఘన్, ఇరాక్‌ల్లో లక్షల్లో చనిపోతున్నారు. అయినా అమెరికన్ జీవితాలకిచ్చిన విలువ ఆఫ్ఘన్స్ కి ఇవ్వడం లేదు. ఎందుకని?

జ. **మనం కూడా ఒరిస్సా, చత్తీస్‌ఘడ్ వ్యక్తుల కన్నా ముంబై, హైదరాబాద్ వ్యక్తి జీవితానికే ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వడం లేదా? ఇది మానవ నైజం.**

291. "నా చావు నేను చస్తాను" అని మీరన్న వాక్యం నాకు ఇష్టం.

జ. **అదే నా ఫిలాసఫీ. అయాన్ ర్యాండ్ నుంచి నేను తెలుసుకున్న సారాంశం కూడా అదే... "నేను ఎవరి కోసమూ బతుకను. నా కోసం బతకమని ఎవరినీ అడగను".**

291. సినిమాకి ఎడిటర్ ప్రాణం కదా. అయినా నటులకన్నా చాలా తక్కువ రెమ్యూనరేషన్ ఇస్తారెందుకు?

జ. **ప్రేక్షకులను థియోటర్‌కి రప్పించే వారే ఎక్కువ రెమ్యునరేషన్ పొందటానికి అర్హులు.**

292. మీరు తీర్మానాలు చేస్తుంటారా?

జ. **ఆ, పొద్దున్నే తీర్మానం చేస్తా. మధ్యాహ్నం కల్లా వదిలేస్తా.**

293. పక్కవాడెలా బతకాలో ప్రతి వాడికీ తెలుసు. తనెలా బతకాలో మాత్రం తనకి తెలీదు.

జ. **కరెక్ట్‌గా చెప్పారు... ఇతరుల పనికి మాలిన తనాన్ని విమర్శించే వాళ్ళంతా తమ పనికిమాలిన తనాన్ని గుర్తించరు.**

294. ఏం బతుకండీ బాబూ... పెద్ద కలలా ఉంది...

జ. **అవును... ఊరికూరికే మెలకువ వచ్చి పీడకల అని కూడా తెలిసిపోతుంది. అది ఇంకా పెద్ద చిరాకు.**

295. మనకి తెలియదు అని తెలుసుకోవడం సద్గుణం.

జ. **తెలియదని తెలియకపోవడం దుర్గుణం.**
తెలుసు అని అనుకోవడం మాయ రోగం.

296. ప్రపంచాన్ని మార్చగలం అనుకునే పిచ్చివాళ్లే నిజంగా ప్రపంచాన్ని మార్చగలరు.

జ. **అవును.. కానీ ప్రపంచం నిండా దాన్ని మార్చాలని ట్రై చేసి ఫెయిలైన పిచ్చివాళ్ళే ఎక్కువగా ఉన్నారు.**

297. తెలుగు సినీ పరిశ్రమ గురించి ఏమనుకుంటున్నారు?

జ. నేను నా గురించి తప్ప వేరే గురించి ఆలోచించను.

298. టేబుల్ ఫ్యాన్ క్లాక్ వైజ్‌గా తిరుగుతుంది. కానీ సీలింగ్ ఫ్యాన్ మాత్రం యాంటీ క్లాక్ వైజ్‌గా ఎందుకు తిరుగుతుంది అని నా చిన్నప్పుడు మా టీచర్‌ని అడిగా.

జ. మీ పరిశీలనా శక్తి బాగానే ఉంది కానీ, దాన్ని ఫాన్‌లకి మాత్రమే పరిమితం చెయ్యకుండా జీవితంలో వేరే వాటికి కూడా అన్వయిస్తే పైకి రావటానికి ఒకింత ఛాన్స్ ఉంది.

299. మీరు తెలుగు కన్నా ఇంగ్లీషులోనే బాగా భావ వ్యక్తీకరణ చేస్తారు.

జ. ఎందుకంటే నేను ఇంగ్లీషులోనే ఆలోచిస్తాను. బహుశా నేను చదివిన ఇంగ్లీషు పుస్తకాలు, సినిమాల ప్రభావం కావచ్చు. కానీ నా ఉద్దేశ్యంలో... ఈ "నా ఇష్టం"లో నా ఆలోచనలు అన్నీ ఇంగ్లీష్ లో కన్నా తెలుగులో బాగా వ్యక్తీకరించా.

300. మీకు సాహిత్యం మీదా, వేదాంతం మీదా మంచి పరిజ్ఞానం ఉంది కానీ, చదువులో మాత్రం మీరు యావ్రేజ్ స్టూడెంట్ అయి ఉంటారు.

జ. యావ్రేజ్ కాదు బిలో యావరేజ్. ఇంజనీరింగ్‌లో రెండు సార్లు ఫెయిలయ్యా. చివరికి అత్తెసరు మార్కులతో పాసయా...అదీ కాపీ కొట్టి.

301. ఇంజనీరింగ్, మెడిసిన్‌లో సీటు సాధించలేకపోయిన వాళ్ళంతా ఫెయిల్యూర్సేనా?

జ. అసలు ఇంజనీరో డాక్టరో కావాలనుకోవడమే నా దృష్టి లో పెద్ద ఫెయిల్యూర్. ఇలా అనడం మీకు ఆశ్చర్యం కలిగిస్తుందేమో గానీ, చదివిన నాకు తెలుసు ఇంజనీరింగ్ పెద్ద బోర్ అని. అలాగే పక్కవాడి జబ్బుల గురించి ఆలోచిస్తూ జీవితం గడపడం కూడా నా వల్ల కాదు. కాకపోతే అదృష్టవశాత్తూ అందరూ నాలా ఇంత పెంటగా ఆలోచించరు కాబట్టి, నాలాంటి వాడికి అవసరం వచ్చినప్పుడు కూడా మెడిసిన్ చదివిన డాక్టర్లుండటం నా అదృష్టం.

302. నేను మీ నుంచి మాంచి ఉషారుగా ఉండే యాక్షన్, సెక్స్, ట్విస్టులూ, అద్భుతమైన కెమెరా యాంగిల్స్ ఉండే సినిమా ఎక్స్‌పెక్ట్ చేస్తున్నాను.

జ. చేసేద్దాం...

303. ఏంటి సార్, కామెడీని పట్టించుకోవట్లేదు.. అన్నీ సీరియస్ సినిమాలే తీస్తున్నారు.

జ. సమస్య ఏంటంటే నేను కామెడీని సీరియస్‌గా, సీరియస్‌ని కామెడీగా చూస్తుంటా.

304. 'కంపనీ'లో మాలిక్ పాత్రని ఎలా క్రియేట్ చేశారు?

జ. కొంత హోవార్డ్ రోర్క్, ఇంకొంత నేను, మరికొంత నేను చూసిన కొంతమంది ఇవన్నీ కలిస్తే మాలిక్

305. నా నిజమైన ఆసక్తి దేనిమీద ఉందో గుర్తించటం ఎట్లా?

జ. మీ ఫీలింగ్స్‌ని మీరునిజాయితీగా పరిశీలించుకుంటే చాలు.

306. "చాలా మంది జవాబుల కోసం వెతకరు. అవి దొరకవు అనుకోవడమే వారికి ఆనందం" - అయాన్ ర్యాండ్.

జ. అవును... అలాగే చాలా మంది ఇతరుల తప్పొప్పులను, పరాజయాలను వెతికి వెక్కిరించడమే పనిగా పెట్టుకుంటారు. ఈ పనిలో పడి తామే పెద్ద ఫెయిల్యూర్స్ అని తెలుసుకోలేకపోతారు.

307. మిమ్మల్ని ప్రశ్నలు అడిగే వాళ్ళలో చాలా మంది మీ హిట్ సినిమాల గురించి మాట్లాడతారే గానీ, మీ ఫ్లాప్ సినిమాల్లోనూ గొప్ప విషయాలుంటాయని గుర్తించరు.

జ. ఎందుకంటే ఎక్కువ మంది అందరూ మాట్లాడే విషయాలకే ప్రాధాన్యత ఇస్తారు. వాళ్ళకు సొంత ఆలోచన ఉండదు.

308. "నేను క్లయింట్స్ కోసం బిల్డింగులు కట్టను. కట్టాలి కాబట్టి నాకు క్లయింట్స్ కావాలి" - హోవార్డ్ రోర్క్

జ. 'ఫౌంటెన్ హెడ్'లో హోవార్డ్ రోర్క్ చెప్పిన ఈ వాక్యాన్ని బేస్ చేసుకునే నేను నా జీవన సౌధం కట్టుకున్నా

309. "గాడ్ ఫాదర్" లాంటి సినిమాలు మీ విజన్‌ని ప్రభావితం చేశాయి కదూ?

జ. కొంతవరకూ నుంచి చాలా వరకూ.

310. విషయం లేకుండా స్టైలునే నమ్ముకోవడం వల్ల "సర్కార్ రాజ్" బోరుకొట్టింది

జ. నా ఆశయం.. సినిమా ద్వారా మిమ్మల్ని చికాకు పెట్టడమో, ఆశ్చర్యపరటమో, ప్రేరణ కలిగించటమో ఇంకా ఏమేమో చేయటం. ఇవేమీ సాధ్యపడకపోతే.. కనీసం ఇలాంటి కామెంట్ చేయించటం...మొత్తానికి ఇదైనా నెరవేరింది... హ..హ..హా.హా...

311. సినిమా అనేది నాటకీయత అద్దిన వాస్తవం. దాన్ని నిజం అనిపించేలా చూపించడమే దర్శకుడి టెక్నిక్. అయితే ప్రేక్షకులు ఆ టెక్నిక్ ని గుర్తించకుండా జాగ్రత్త పడాలి - డేవిడ్ లీన్

జ. సినిమా అనేది ఊహాత్మకమైన వాస్తవం. ఆ వాస్తవాన్ని ఊహాత్మకం అనిపించేలా చెయ్యడమే దర్శకుడి టెక్నిక్. అయితే ప్రేక్షకులు ఆ టెక్నిక్‌ని గుర్తించేలా జాగ్రత్త పడాలి. అలా చేస్తున్నా కాబట్టే ఇలా ఉన్నా...- RGV

312. నేను జీవించడానికి కలగంటాను - స్టీవెన్ స్పీల్ బర్గ్

జ. నేను కలగనటానికే జీవిస్తా...- RGV

313. మీకేవన్నా మానసిక సమస్యలున్నాయా?

జ. ఉన్నాయిగానీ, వాటిని నా సామర్థ్యంగా జనాన్ని నమ్మిస్తుంటాను.

314. మీతో మందు కొడుతూ ఫిలాసఫీ మాట్లాడాలని ఉంది.

జ. నేను ఫిలాసఫీ మాట్లాడతాను కాబట్టి మందు కొడతాను. మందు కొట్టినప్పుడు మాత్రం ఫిలాసఫీ మాట్లాడను.

315. ఆత్మ విశ్వాసం తగ్గడం వల్లే మనుషులు సిగ్గుపడే వాళ్ళుగా, అంతర్ముఖులుగా అవుతారా?

జ. ఎదుటివారు ఏమనుకుంటారో అనే భయం తోనే సిగ్గు మొదలవుతుంది. కానీ నాలాగా విపరీతమైన పొగరు ఉండటం వల్ల కూడా అంతర్ముఖులు కావచ్చు.

316. మీరో పక్క ఎదురీదాలి అంటూనే మరో పక్క అందరితోనూ కలవాలి అని కూడా అంటున్నారు. ఇది కాంట్రడిక్టరీ కదా?

జ. తేడా ఏంటంటే - పరాయి ఆలోచనలతో ప్రవాహంలో పడి కొట్టుకు పోతారా? లేక పరాయి వాళ్ళ బలాన్ని ఉపయోగించుకుని ప్రవాహానికి ఎదురీదుతారా అనేది ప్రశ్న,

317. మీరు అన్నన్ని పనులు చేస్తుంటారు- ఊహిస్తుంటేనే జ్వరం వస్తోంది.

జ. నాకు జ్వరం తెప్పించుకొనేంత ఖాళీ లేదు.

318. డబ్బు మీద మీ అభిప్రాయం.

జ. ఉన్నవాడికి ఎలా ఖర్చు పెట్టాలో తెలీదు. ఖర్చు పెట్టడం తెలిసిన వాడికి డబ్బు ఉండదు. అదే పైవాడి బంపర్ లీల.

319. అయాన్ ర్యాండ్ నుంచి ఏం నేర్చుకోవచ్చు.

జ. నేను అయాన్ ర్యాండ్ నుంచి నేర్చుకొని ఉండొచ్చు. మీరు నా ద్వారా అయాన్ ర్యాండ్‌ని మీకు చేతనైంతలో తెలుసుకొని ఉండొచ్చు. ఫైనల్‌గా నాకన్నా, అయాన్ ర్యాండ్ కన్నా మీరు స్వయంగా ఏం నేర్చుకొన్నారు అన్నదే ముఖ్యం.

320. బాధ్యతా రాహిత్యంతో ఉండే మీరు ఇంత ఫిలసాఫికల్‌గా ఎలా మారారు?

జ. ఫిలాసఫీ తెలుసుకున్నాకే నేను బాధ్యతా రహితంగా మారాను. ఎందుకంటే బాధ్యత అనేది ఉన్నప్పుడే అంచనాలూ, నిరాశలూ మొదలవుతాయి అని అర్థమైంది కాబట్టి.

321. చాలా మంది డైరెక్టర్లు స్త్రీలను మీలాగే చూపించాలని ట్రై చేసి ఫెయిలవు తుంటారు. ఎందుకని?

జ. **ఎందుకంటే వాళ్ళు స్త్రీలను నేను చూసినట్టుగా చూడరు కాబట్టి. నేను స్త్రీ అందాన్ని ఆరాధిస్తాను.**

322. ఏ సిద్ధాంతమూ లేకపోవడమే రామూ సిద్ధాంతమా?

జ. **అవును. ఏదీ లేకపోవడమనేదే అన్నీ ఉండడం.**

324. మీరు జీవితంలో ప్రతీ క్షణాన్ని అనుభవిస్తారా?

జ. **ప్రతీ క్షణాన్ని జీవిస్తాను..దాన్నుంచి వచ్చే ప్రతి రసపు బొట్టునీ అనుభవిస్తా.**

325. "శివ" సినిమాలో భరణి రఘువరన్ చెవిలో "శివ" అని చెప్పే సీన్ ఐడియా ఎలా వచ్చింది?

జ. **నా రెండు చెవుల మధ్యా బ్రెయిన్ అని ఒకటుంది. మీకు ఉన్నట్టు లేదు. అందుకే ఇలాంటి ప్రశ్న అడిగారు.**

326. మీరెప్పుడైనా జనాలకి సలహాలిస్తూంటారా?

జ. **ఆ...సలహాలు తీసుకోవద్దని.**

327. మల్టీపుల్ పర్సనాలిటీ డిసార్డర్‌లా మీలో చాలా మంది ఉన్నట్లున్నారు.?

జ. **నేనొక్కణ్నే చాలామందిని. చాలా మందిలో నేను ఒకణ్ణి. నాకున్నది మల్టీపుల్ పర్సనాలిటీ ఆర్డర్. దాన్ని మల్టీపుల్ పర్సనాలిటీ డిసార్డర్ అనే వాళ్లందరికీ సింగ్యులర్ పర్సనాలిటీ ఆర్డర్ ఉందని నా నమ్మకం.**

328. మీరే గనక గ్యాంగ్ స్టర్ అయ్యుంటే కచ్చితంగా మోస్ట్ వాంటెడ్ అయ్యుండే వారు!!

జ. **హా.హా..హా... నేను గ్యాంగ్ స్టర్‌ని కాకుండా సినిమా డైరెక్టర్‌ని కావడం ఈ దేశం చేసుకున్న అదృష్టం అని కంపెనీ రైటర్ జయదీప్ సహానీ అనేవాడు.**

329. మిమ్మల్ని మీరు గొప్పవాళ్లుగా ఎందుకు ఫీలవుతారు?

జ. **ఎప్పుడో ఓ గొప్పాయన నేను గొప్పవాణ్ణని చెప్పాడు. ఆ చెప్పినవాడు గొప్పవాడు కాబట్టి ఆయన చెప్పిందంతా గొప్పే గనక, పైగా ఆ చెప్పిన గొప్పాయన నేనే కాబట్టి నేనే గొప్పవాణ్ణి అని గొప్పగా ఫీలవుతా.**

330. అధికారం, డబ్బు అందరికీ అవసరమే. కానీ కొందరికే దక్కుతాయి. ఎందుకని?

జ. **దద్దమ్మా, అందరికీ డబ్బూ అధికారం దక్కితే వాటికి విలువేం ఉంటుంది?**

331. మానవ ఉద్వేగాల్లో అతి బలమైనది ఏది?

జ. అసూయ.

332. మంచి కథ కన్నా మంచి మార్కెటింగ్ విధానాలు ముఖ్యం అనుకుంటున్నారా?

జ. జనాలు థియేటర్‌కి వస్తేనే కదా కథ మంచిదో కాదో తెలిసేది.

334. అయాన్ ర్యాండ్ తన సొంత ఫిలాసఫీని పాటించకుండా జీవితాన్ని ఎందుకు దుర్భరం చేసుకుంది?

జ. తన జీవితం దుర్భరం అయ్యింది కాబట్టే ఆమె ఫిలాసఫర్ అయ్యిందేమో?

335. సంగీతమే ఉద్వేగాలు పలికిస్తున్నప్పుడు మళ్ళీ గీతాల అవసరం ఉందంటారా?

జ. అవసరమైతే తప్ప అవసరం లేదు.

336. నిజ జీవితంలో కూడా ఇలాగే తిక్క సమాధానాలిస్తుంటారా?

జ. ఇంకా ఘోరంగా.

337. "క్షణ క్షణం"లో రైలు పట్టాలపై కాయిన్ పెట్టే కుర్రాడు - "సత్య" లో న్యూస్ పేపర్ మీద అన్నం తినే అడుక్కునే వాడు - ఇలాంట్ ఐడియాలు మీకెలా వస్తాయ్?

జ. అవి ఐడియాలు కావు. సన్నివేశంలో సహజత్వం తీసుకురావడానికి నేను అనుసరించే పక్రియలు.

338. అయాన్ ర్యాండూ, ఆమె అభిప్రాయాలూ నా దృష్టిలో జీరో.

జ. ఒకే మిస్టర్ జీరో, నీలాంటి జీరోలు లక్షలమంది ఉన్నారు. వాళ్ళతో కలిసి మీ బావుల్లో మీరు బ్రతకండి.

339. 'సర్కార్ రాజ్' బ్యాక్ గ్రౌండుని 'గాయం'లో రామిరెడ్డి బ్యాక్ గ్రౌండు నుంచి కాపీ కొట్టారు కదా?

జ. ఆ రెండూ కూడా 'డేమియన్: ఓమెన్ 2' మెయిన్ ట్రాక్ నుంచి కాపీ కొట్టినవే.

348. మిమ్మల్ని 1% కూడా లైట్ గా తీసుకోలేం. అలాగని 99% కూడా సీరియస్‌గా తీసుకోలేం.

జ. నిజానికి మీరు నాలో ఉన్న 99% లైట్ నెస్ ని 100% సీరియస్‌నెస్‌తో తీసుకోవాలి

349. భావాలకీ ఆలోచనలకీ తేడా ఏంటీ?

జ. ఆలోచనలని మనం కంట్రోల్ చేసుకోగలం కానీ భావాలు మాత్రం మనల్నే కంట్రోల్ చేస్తాయి

350. మీరో పక్క దేవుణ్ణి నమ్మనంటూనే సత్యేంద్రని దేవుణ్ణి చేస్తున్నారే.

జ. **దేవుడు ఎవరో, ఏమిస్తాడో నాకు తెలీదు. కానీ సత్యేంద్ర మాత్రం నాకు చాలా ఇచ్చాడు.**

351. రణ్, అడవి మంచి ప్రాజెక్టులే గానీ, మీరు నెక్ట్స్ ప్రాజెక్ట్ మీద మోజులో హడావిడిగా చుట్టేసినట్టున్నారు!?

జ. **సత్యా, కంపనీ, సర్కార్ సినిమాల్ని కూడా అలాగే నెక్ట్స్ ప్రాజెక్ట్ మీద మోజులో హడావిడిగా చుట్టేసాను. ఇప్పుడేమంటావు తెలివీ?**

352. ఫ్లాప్ అయిన సినిమాని జనం దుయ్యబడతారెందుకని?

జ. **సినిమా ఫ్లాప్ అవడం, మనిషి చచ్చిపోవడం రెండూ ఒకటే. కాకపోతే మనిషి చచ్చిపోయినపుడు సానుభూతి చూపెడతారు. సినిమా చచ్చిపోయి నప్పుడు మాత్రం దాన్ని చీల్చి చెండాడతారు.... దాన్ని తీసినవాడు ఇంకా బ్రతికే ఉన్నాడు కనుక.**

353. కొంత మంది ప్రతిదాన్నీ తీవ్రంగా విశ్లేషిస్తుంటారు. మరికొంత మంది అసలు దేన్నీ పట్టించుకోరు.

జ. **ఇంకొంత మంది ప్రతిదాన్నీ విశ్లేషించినా ఏమీ తెలుసుకోలేక పోతారు. దేన్నీ విశ్లేషించక పోవడం వల్లే అన్నీ తెలుస్తాయని ఇంకొంత మంది చాలా తెలుసుకుంటారు.**

354. మనమంతా శ్రీదేవిని గొప్ప అందగత్తె అనుకుంటాం కదా ఆవిడ మాత్రం అలా ఫీలవదని నా అభిప్రాయం.

జ. **ప్రపంచమంతా శ్రీదేవి థండర్ థైస్ ని పొగుడుతున్నప్పుడు ఆమె మాత్రం వాటిని చూసుకుని వీళ్ళకి ఇవంటే ఇదేం పిచ్చి అనుకొని ఆశ్చర్యపడి ఉంటుందని ఒకసారి సత్యేంద్ర నాతో అన్నాడు.**

355. నేను రెండేళ్ల కిందట మీతో ప్రేమలో పడ్డా. నన్ను పెళ్లి చేసుకుంటారా?

జ. **మీకు రైఫిల్ లాంటి బాడి, శ్రీదేవి లాంటి అందం, అయాన్ ర్యాండ్ భావజాలం ఉండి, "ఆగ్" తో సహా నా అన్ని సినిమాలు నచ్చి ఉంటే ఒకే!!!**

356. గంభీరంగా కనపడే మీ వెనుక అభద్రతా భావం లేదూ!?

జ. **ఓడిపోతామనే భయం లోంచి అభద్రత వస్తుంది.**

ప్రతిదానికీ విలువలు ఆపాదించే మనస్తత్వం నుంచి పొందాలనే కోరిక వస్తుంది.

పొందిన దానికి మీరిచ్చే విలువను బట్టే విలువలు ఆపాదించే మనస్తత్వం వస్తుంది.

అవగాహనా లేమి వల్లే విలువ కట్టడం మొదలవుతుంది.

సరైన నిర్ణయాలు తీసుకోలేక పోవడం నుంచి అవగాహనా లేమి ఏర్పడుతుంది.

ఫలితాల గురించి భయం వల్ల సరైన నిర్ణయాలు తీసుకోలేకపోవడం జరుగుతుంది.

గెలవాలనే దుగ్ధ నుంచి ఫలితాల గురించిన భయం బయల్దేరుతుంది.

ఓడిపోతామనే భయం నుంచి గెలవాలనే దుగ్ధ మొదలవుతుంది.

కాబట్టి విజయానికి విలువ ఇవ్వకపోతే ఓటమి భయం ఉండదు. ఓటమి భయం లేనప్పుడు అభద్రతా భావానికి ఆస్కారమే లేదు.

హెచ్చరిక: పైదంతా పదిసార్లు చదివినా అర్థం కాకపోతే మీరు సూపర్ దద్దమ్మ అని ఫిక్సయిపోండి.

357. మీ రచనలను నేనెప్పుడూ ఏకాంతంగా చదవడం ఇష్టపడతాను.

జ. నేనేమంత చదవకూడనిది రాయట్లేదే.

358. చెడ్డవాళ్ళ వల్లే లోకం బాగుపడుతుందా? ఏం మాట్లాడుతున్నారండీ.

జ. బాగుపడుతుంది అనలా... చెడ్డవాళ్లే చరిత్ర సృష్టిస్తారని చెప్పా... ఎఫెక్ట్ కోసం ఇలాంటివి అంటూ ఉంటా...ఆట్టే హైరానా పడిపోకు...

గమనిక: ఇది కూడా ఎఫెక్ట్ కోసం చెప్పిందే!

359. శ్రీదేవిని మీరు దేవతగా చూడ్డం వల్ల రొమాంటిక్‌గా మూవ్ కాలేక పోయానన్నారా!?

జ. కరెక్టే... నా ఫ్యాంటసీలు నెరవేర్చమని ఆవిడ ఫొటోకు పూలూ పళ్లతో పూజలు చేసి ఫ్యాంటసైజ్ చేశా. ఇంతకీ నా ఫ్యాంటసీ ఏమై ఉంటుందను కుంటున్నారు?

360. నేనెంత దుర్మార్గుణ్ణో నాకు తెలుసు కాబట్టి నాలాంటి మనుషులున్న ఈ మానవజాతి అంటే నాకు ద్వేషం.

జ. నేనూ దుర్మార్గుణ్నే. అయినా నన్ను నేను ఇష్టపడతాను. అందుకనే నాలాంటి మనుషులు ఉన్న ఈ దుర్మార్గపు మానవ జాతినీ ఇష్టపడతాను.

361. నీషే ఉపనిషత్తుల వల్ల ప్రభావితమయ్యాడని మీకు తెలిస్తే షాకవుతారు. అలాగే షోపెన్ హావర్ కూడా వాటిని అత్యుత్తమ మానవ జ్ఞానానికి నిదర్శనం అన్నాడు.

జ. అంటే ఉపనిషత్తుల విలువ తెలుసుకోటానికి మీకు నీషే, షోపెన్ హావర్ అవసరమయ్యారన్నమాట – మంచిదే. ఇక నుంచి ఉపనిషత్తుల సారమంతా బుర్రలో ఇంకించుకొని నాలాగే సొంత రాతలు మొదలెట్టండి. మాలాంటి వాళ్ళం మాత్రం నీషే, అయాన్ ర్యాండ్, మ్యాడ్ మాగజైన్, రామయిజమ్స్‌ని ఫాలో అవుతూ బతికేస్తాం.

362. మీరు ఆడాళ్ళకు విలువ ఇస్తారంటే నాకు నమ్మబుద్ధి కావట్లేదు

జ. ఆడవాళ్ళకు నా కన్నా గౌరవం ఇచ్చే వాడు ఇంకొకడుండడు. వాళ్ళ అందాన్నీ శృంగారాన్ని ఎప్పుడూ గౌరవిస్తూనే ఉంటాను. అంతెందుకూ, దేవుడనే వాడే గనక ఉంటే కేవలం ఆడాళ్ళను సృష్టించినందుకే తనని గౌరవిస్తాను. వాళ్లందర్నీ నాకే దక్కించనందుకు ద్వేషిస్తాను.

363. అయాన్ ర్యాండ్, శ్రీదేవి - వీళ్ళిద్దరిలో ఒకరిని ఎంపిక చేసుకొనే అవకాశం వస్తే...

జ. డౌటేముంది... శ్రీదేవే... అయాన్ ర్యాండ్ నుంచి నాకు కావాల్సింది తన పుస్తకాలనుంచి ఆల్రెడీ దొరికేసింది.

364. ఏ గొప్ప పుస్తకం లోనూ దొరకని విలువైన అంశాలన్నీ మీ రచనల్లో ఉన్నాయి.

జ. ఇతరులు ఒక పుస్తకం ద్వారా చెప్పలేకపోయిన విషయాలని నేను ఒక్క వాక్యంలో చెప్తా.

ఇతరులు జీవితాంతం కష్టపడ్డా అర్థం చేసుకోలేని విషయాలను నేను ఒక్క హావభావంలో చూపిస్తా.

365. లెజెండ్‌కీ సెలబ్రిటికీ తేడా ఏంటి?

జ. లెజండరీ శాశ్వతం. సెలబ్రిటీ క్షణికం.

366. "రక్త చరిత్ర"ని 13 ఏళ్ల లోపు పిల్లలు చూడకూడదా?

జ. ఆ సినిమా 30 ఏళ్ల మానసిక వయస్సు ఉన్న పదమూడేళ్ల పిల్లల కోసం, పదమూడేళ్ళ మానసిక వయస్సున్న ముప్పై ఏళ్ళ పిల్లల కోసం తీసా.

367. మీతో పాటే మీ 'రామూయిజం' కూడా మాయమై పోతుందా?

జ. 'రామూయిజం' రామూల కోసం.

368. నాగరికత అంతిమ లక్ష్యం వ్యాపారమేనా?

జ. వ్యాపారం నుంచే నాగరికత పుడుతుంది.

369. లక్ష్యం కన్నా లక్ష్యం కోసం చేసే ప్రయత్నమే గొప్పది

జ. ప్రతిఫలం ఆశించకపోతేనే లక్ష్యం గొప్పదవుతుంది.

370. దేవుణ్ణి నమ్మనంటూనే మీరు 'రక్త చరిత్ర'లో శ్లోకాలు వాడారెందుకు?

జ. శ్లోకాలు కాదు. ఆ శ్లోకాల శబ్దాలు నాకు బాగా నచ్చాయి. ఆ పదాలు అర్థం కాకపోయినా పాడేవాళ్ళు వాటిలో ఏదో ఊహించుకుని చాలా పవిత్ర భావనతో పాడతారని గ్రహించి వాటినలా ఉపయోగించాను. అందువల్లే 'రక్త చరిత్ర' లోని హింస కు ఒక పవిత్రత, గౌరవం వచ్చాయి.

371. దుర్మార్గుల చేతల కన్నా, మంచి వాడి మౌనమే ప్రమాదకరం - స్వామి వివేకానంద

జ. చెడ్డవాళ్లే చరిత్ర సృష్టిస్తారు. మంచి వాళ్ళ గురించి మాట్లాడ్డానికేం లేదు - RGV

హిట్లర్, ఒసామా బిన్ లాడెన్, జార్జ్ బుష్, సద్దాం హుస్సేన్ లాంటి వాళ్ళ చర్యల వల్ల ప్రపంచం మారిపోతూ ఉంటుంది. వాళ్ళే చారిత్రక పురుషులు. ఇహ మామూల జనాలంటారా, కష్ట పడుతూ, పిల్లల్ని కంటూ, ట్యాక్సులు కట్టుకుంటూ చరిత్రకీ, ప్రపంచానికీ సంబంధం లేకుండా బతికేస్తుంటారు. లెక్కకే మనుషులుగానీ, చరిత్రకు లెక్క కాదు.

372. దేవుణ్ణీ, మతాన్నీ లోతుగా అర్థం చేసుకున్నట్టున్నారు. అందుకే మీరు వాటిని వదిలేశారు.

జ. ఎక్కడొదిలేశానూ... నా అవసరం కొద్దీ దేవుణ్ణి వాడుకుంటూనే ఉన్నా. 'సర్కార్'లో గోవింద నామస్మరణ వాడుకున్నా. ఇంకా కొన్నిసార్లు దేవుడిని బూచిగా కూడా చూపి నా పనులు చేయించుకుంటూనే ఉన్నా.

373. మీరు సినిమాలు చూడ్డం మొదలెట్టిన కొత్తల్లో ఏ అంశాలు ఇష్టపడే వారు?

జ. హీరోల గన్లూ, హీరోయిన్ల తొడలూ...

374. బోరుకొట్టడం గురించి ఏమన్నా చెప్పండి?

జ. నాకెప్పుడూ బోర్ కొట్టదు. ఆలోచనలు చచ్చిన బుర్రకు బోర్ కొడుతుంది. నాకా స్థితి ఎపుడూ రాలేదు. ఎందుకంటే నా మైండ్ 24 గంటలూ హైపర్ యాక్టివ్‌గా ఉంటుంది. ఏదో జరగాలని ఎదురుచూసే వాళ్ళకు బోర్ కొడుతుంది గానీ, నాలా పనులు జరిపిస్తూ పోయే వాళ్ళకు బోర్ ఉండదు.

375. మీరన్నట్టుగా ప్రపంచమంతా నా మనసులోనూ, ఊహల్లోనూ ఉంటే, నాకు నచ్చినట్టుగా నేను ఎందుకు ఊహించుకోలేక పోతున్నా?

జ. నువ్వొకటి అర్థం చేసుకోవాలి. అసలు బతికి ఉన్నాం అన్న ఫీలింగ్ ఎక్కణ్ణుంచి వస్తుంది? మన ఆలోచనలూ, తెలివితేటలూ, జ్ఞానం, ఆశయాలు - వీటన్నిటి మధ్యా జరిగే సంఘర్షణనుంచే గదా - అంటే మన జీవితాంతం మన మెదడు మనతో ఒక గేమ్ ఆడుకుంటూనే ఉంటుందన్నమాట!

376. క్షణం కూడా బుర్రకు రెస్ట్ ఇస్తున్నట్టు లేరు... మీకు ఇక కొత్త ఐడియాలు రావటం కష్టం కదా?

జ. క్షణం కూడా ఆలోచించడం ఆపకుండా విపరీతంగా ఆలోచించడం వల్లే నాకు కొత్త ఐడియాలు...

377. చాలా సార్లు మీ మాటల్లో 'ఫౌంటెన్ హెడ్' హీరో హోవార్డ్ రోర్క్ తొంగి చూస్తుంటాడు. కానీ మీ సినిమాల ద్వారా మీరు మీ ప్రేక్షకుల్ని డిజప్పాయింట్ చేసినట్టుగా, రోర్క్ ఎప్పుడూ తన క్లయింట్స్‌ను డిజప్పాయింట్ చేయలేదు.

జ. రోర్క్ కట్టిన బిల్డింగ్ లన్నీ అయాన్ ర్యాండ్ రాసిన పేపర్ల మీదే కదా? నా సినిమాలన్నీ కూడా పేపర్ మీద అద్భుతంగానే ఉంటాయ్. నమ్మకపోతే నాతో ఫ్లాపులు తీసిన నా నిర్మాతలని అడగండి.

378. హీరోయిన్లని ప్రెజెంట్ చెయ్యడంలో రాఘవేంద్రరావుకీ, రామ్ గోపాల్ వర్మకీ తేడా ఏంటి?

జ. ఆయన దృష్టి బొడ్డు మీదా... నా దృష్టి మీకు తెలుసు.

379. మీ విలువ ఎంతని మీరనుకుంటున్నారు?

జ. అది ప్రొద్దున నేను లెగిసినప్పటినుంచీ రాత్రి పడుకునేంతవరకూ కొన్ని వందల సార్లు మారిపోతుంది.

380. మీ ఆలోచనల్లో స్పష్టత లేకపోవడంవల్లే ఒక్కోసారి ఒక్కో రకంగా జవాబిస్తున్నారు.

జ. స్పష్టత ఉంది కాబట్టే నా జవాబులు ఒక్కో సారి ఒక్కో రకంగా ఉంటాయి.

381. మీరు సినిమాలు తీస్తూ, చూస్తూ, రాస్తూ, కొత్తప్లాన్‌లు వేస్తూ - ఇలా లక్షా తొంభయ్ పనులు ఒకే సారి చేస్తుంటారు. ఎప్పుడూ సమస్య అనిపించదా?

జ. ఫలానాది పోతుందేమో అన్న భయం లేనప్పుడు ఎన్ని పనులయినా చెయ్యొచ్చు. ఏ సమస్యా రాదు. నా జీవితాన్ని నేను ఫుల్ బాటిల్‌లా జీవిస్తాను.

382. పాత్రల భావోద్వేగాలతో ప్రయాణం చెయ్యడం ఫిల్మ్ మేకింగ్‌లో ఎంత వరకూ అవసరం?

జ. అసలు సినిమా తియ్యడంలో ఉండే మజా అదే గదా. పాత్రల భావోద్వేగాల్లో మునిగి తేలినప్పుడే మన ఎమోషనల్ లైఫ్ ఒక పరిపుష్టత చెందుతుంది.

383. అందానికి మీరిచ్చే నిర్వచనం?

జ. నాకు ఆహ్లాదం కలిగించేది.

384. రెగ్యులర్‌గా చదవడం వల్ల మీ రైటింగ్ స్కిల్స్ మెరుగుపడ్డాయా?

జ. చదవడం వల్ల కాదు... ఆ చదివింది నన్ను ఎందుకు ప్రభావితం చేసిందో నాకుగా నేను అర్థం చేసుకోవడం వల్ల మెరుగుపడింది.

385. మీరు రాస్తున్న వ్యాసాలు చదువుతున్నప్పుడు పూర్తవుతున్నాయంటే నాకు చాలా బాధగా ఉంటుంది.

జ. మీ కాంప్లిమెంట్‌కు కృతజ్ఞతలు. అయితే బ్యాడ్ ఏంటంటే బాగున్నవన్నీ ఎప్పుడో అప్పుడు పోకతప్పదు.

386. ఆబ్జెక్టివిజంకి మీరిచ్చిన నిర్వచనం చూస్తే అయాన్ ర్యాండ్ గర్వపడుతుందా? సిగ్గుపడుతుందా?

జ. నవ్వుకుంటుంది.

387. మీ దృష్టిలో దేవుడు?

జ. నాక్కావలసింది ఇవ్వగలిగేవాడు, లాక్కెళ్ళిపోయే వాడు.

388. శాశ్వతమైన, కచ్చితమైన సత్యాలు ఎక్కడా ఉండవు – ఫ్రీడ్రిక్ నీషే

జ. కచ్చితమైన సత్యాలు ఉండవు గాబట్టి మన సత్యాల్ని మనమే కచ్చితం చేసుకోవాలి – RGV

389. శ్రీదేవి నాకు సెక్స్ సింబల్‌గా కన్నా ఒక సోదరిలా అనిపిస్తుంది.

జ. నీ బుర్ర దొబ్బేసిందా? నేను గనక ఆమెను సోదరి అనుకుని ఉంటే నాకు నా టీనేజి అంతా దొబ్బేసుండేది.

390. మీరు శ్రీదేవిని క్యాండిల్ లైట్‌లో చూశారు కాబట్టే సత్యా లో ఊర్మిళని అలాగే ప్రెజెంట్ చేశారు కదా?

జ. :)

391. శ్రీదేవి... శేఖర్ కపూర్ "మిస్టర్ ఇండియా"లో కన్నా మీ "క్షణం క్షణం"లోనే అందంగా చూపెట్టారు.

జ. బాబ్బాబూ.. ఆ ముక్కేదో కాస్త శ్రీదేవికి చెబుదురూ...

392. మీరు నమ్ముతారో లేదో గానీ శ్రీదేవి గురించి మీరు రాసిన వ్యాసం చదివి నాకు ఏడుపు వచ్చింది.

జ. నువ్వు నమ్ముతావో లేదో గానీ 'క్షణ క్షణం' షూటింగ్ అంతా నేను ఏడ్చేవాణ్ణి.

393. మీ సినిమాల్లో నేలకు దగ్గరగా పాకే కెమెరా కదలికలు ఎక్కువగా ఉంటాయి.

జ. నాలో ఉన్న శిశు మనస్తత్వం వల్ల కావచ్చు. నాకు పాకడం ఇష్టం.

394. ఫెయిల్యూర్‌కి మీ నిర్వచనం.

జ. గెలవాలనే ప్రయత్నం ఆపెయ్యడమే.

395. సినిమాలనే కాదు ఈ రోజుల్లో ప్రతిదాని విలువనీ అనవసరంగా హైప్ చేస్తున్నారు.

జ. విలువ అనేది మనం విలువ కట్టడం బట్టి ఉంటుంది.

395. సర్కార్, కంపనీ డిఫరెంట్ స్టైల్స్ లో తియ్యాలని ముందే అనుకున్నారా?

జ. స్టైల్ అనేది కథను బట్టీ, పాత్రలను బట్టీ దానంతట అదే ఎవాల్వ్ అవుతుంది. సత్యాలో పాత్రలన్నీ ఊహకు స్వచ్ఛందంగా ప్రవర్తిస్తుంటాయి. అందుకే కెమెరా వర్క్ కూడా అందుకు అనుగుణంగా ఉంటుంది. సర్కార్ లో మాత్రం కెమెరా పాత్రలని నిర్బంధిస్తుంది. అందుకే ఆ సినిమాలు చూసిన వాళ్లెవరయినా సడన్‌గా వాటిల్లోని ఒక్క ఫ్రేమ్ చూసి కూడా అది ఏ సినిమాలోదో చెప్పగలుగుతారు.

396. మీ పాత్రలు ఎప్పటికీ గుర్తుండిపోవడానికి కారణం ఓవరాక్షన్ చెయ్యక పోవడమేనా?

జ. ప్రేక్షకుడు ఊహించినదానికన్నా ఎక్కువగా నటిస్తే అది ఓవరాక్టింగ్ అవుతుంది. అంటే ఆ సినిమాకి ఆ పాత్రలకి సంబంధించి ప్రేక్షకుడు నిర్దేశించుకునే పరిమితులను బట్టి ఓవరాక్షన్ నిర్వచనం మారుతూంటుంది. కానీ డెఫెనిట్‌గా సహజ నటన అనేదే గుర్తుండిపోయేలా చేస్తుంది.

397. చిన్నప్పుడు కూడా మీ ప్రపంచం సినిమాయేనా?

జ. మొదట్లో నాకు కథలంటే పిచ్చి. ఆ తర్వాత రౌడీయిజం వైపు ఎట్రాక్ట్ అయ్యా. అది దాటాక మానవాతీత శక్తులూ, అమ్మాయిలూ. ఇలాగుండగా ఒకానొక రోజు పంజాగుట్ట ఇరానీ కేఫ్‌లో ఇవన్నీ కలగలిపి సినిమా తియ్యొచ్చు కదా అనిపించి ఇక అప్పట్నుంచీ అదే పనిలో ఉన్నా. బుద్ధుడుకి బోధి చెట్టు క్రింద జ్ఞానోదయం అయినట్లు నాకు ఇరానీ కేఫ్‌లో అయ్యింది.

398. మీలాంటి పాత్రని మీ సినిమాల్లో ఎప్పుడయినా పెట్టారా?

జ. నా సినిమాల్లో మగ కారెక్టర్లన్నింట్లోనూ నేనుంటా. అంతెందుకు "కంపనీ" లో మాలిక్‌నీ నేనే, అదే సినిమా 'ఖల్లాస్' పాటలో ఇషా కొప్పికర్ బాడీని చూసే రాజ్ పాల్ యాదవ్‌నీ నేనే. నేనెప్పుడో ఫీలయిన, ఫీలవుతున్న ఎమోషన్‌లో నుంచి వచ్చినవే నా పాత్రలన్నీ.

399. అందరూ మీలాగా ఆలోచిస్తే, ఈ ప్రపంచం పదేళ్లలోనే నాశనమై పోతుంది.

జ. నేను పోయిన ఒక క్షణం తర్వాత ప్రపంచం ఏమయి పోయినా నాకు అనవసరం. నేను చావడం తోనే నాకు తెలిసిన నా ప్రపంచం కూడా చచ్చిపోతుంది అనేదే నా ఫిలాసఫి.

400. ఫిలాసఫీ కన్నా సైకాలజీ చాలా ఇంటరెస్టింగ్‌గా ఉంటుంది.

జ. **సైకాలజీ అంటే ఇతరులని మోసం చెయ్యడం. ఫిలాసఫీ అంటే మనల్ని మనం మోసం చేసుకోవడం.**

401. మీ సమాధానాలు చదువుతుంటే ఒక్కోసారి భయంగానూ, మరోసారి ధైర్యంగానూ ఉంటోంది.

జ. **నా సమాధానాలు మీ నమ్మకాల పునాదుల్ని కూల్చేస్తాయి కాబట్టి భయపడతారు. అసలు పునాదులే లేవన్న సంగతి మీరు తెలుసుకున్నప్పుడు మీకు ధైర్యం వస్తుంది.**

403. మీలాంటి వారు ఎవరైనా నా జీవితంలో నాకు పరిచయం ఉండి ఉంటే ఎంత బాగుండేది.

జ. **నా రాతలు చదవడం నాతో అఫైర్ పెట్టుకోవటంలాంటిదే. నన్ను కలిస్తే మాత్రం అది పెళ్లిలాంటిదవుతుంది. ఆఫర్లే ఎప్పుడూ పెళ్ళి కన్నా ఎక్కువ ఆనందాన్ని ఇస్తాయి. డౌటుంటే పెళ్ళయిన లేదా విడాకులు అయిన ఎవరినయినా అడగండి, చెబుతారు.**

404. బ్లూ ఫిలింస్ తీయడం కూడా కళేనా?

జ. **ఫిలిమ్ మేకర్ అభిరుచిని బట్టి ఏదయినా కళాత్మకంగా తీయొచ్చు. ఏం తీస్తున్నామన్నది ప్రధానం కాదు. ఎలా తీస్తున్నామన్నదే కళా, కాదా అన్నదాన్ని నిర్ణయిస్తుంది.**

405. రాము ఎవరు?

జ. **మీరు అతను ఎవరనుకుంటే అతనే.**

406. మీ సినిమాలన్నింటిలో డైలాగులేమీ లేని క్యారెక్టర్ ఒకటుంటుంది. 'సర్కార్ రాజ్'లో కత్తిగాటున్న పొడుగాటి వ్యక్తి, 'రణ్'లో మినిస్టర్ అసిస్టెంట్, 'సత్య'లో పొడవాటి జుట్టున్న వ్యక్తి. దీని వెనుక ఏదయినా కారణం ఉందా?

జ. **మిస్టీరియస్‌గా ఉండే పాత్రల్ని నేను ఇష్టపడతాను. "గాడ్ ఫాదర్ 2" లో ఒక సీన్‌లో ఇలా ఏమీ చెయ్యకుండా ఊరికే ఉండే క్యారెక్టర్ ఒకటుంది. అది నాకు బాగా ఎఫెక్టు ఇచ్చింది. బహుశా ఆ సినిమా నుంచే ఈ విషయాన్ని నాకు తెలీకుండానే అందుకున్నట్టున్నా.**

407. సినిమా అనేది నాటకీయత మేళవించిన కాల్పనిక కథలా ఉండాలా? నాటకీయత ఉన్న యథార్థ కథలా ఉండాలా?

జ. **యథార్థంతో కల్పనని జోడించి అది కాల్పనిక యథార్థమా లేక యథార్థ కల్పితమా అని ప్రేక్షకులని ఆలోచించీ ఆలోచించకుండా చేయగలగాలి.**

408. మీ గురించి అస్సలేమీ తెలీని వ్యక్తులకు మిమ్మల్ని మీరు పరిచయం చేసుకోవాల్సి వస్తే ? శివ, రంగీలా, సత్యా, కంపెనీ, సర్కార్ – వీటిలో ఏ సినిమా డైరెక్టర్‌నని ముందుగా చెప్పుకుంటారు?

జ. **నేను సినిమాల డైరక్టర్‌ని కానీ సినిమా డైరక్టర్‌ని కాదని చెప్తా.**

409. రాము గారూ, మీరే నా దేవుడు.

జ. **నేను దెయ్యాన్ని అనే విషయం మీకు పూర్తిగా అర్థం అయితే తప్ప మీరు నేను దేవుణ్ణి అని గ్రహించలేరు.**

410. మీరు "మెగాలో మానియాక్" అనుకుంటా.

జ. **మెగా కన్నా ఎక్కువ, మానియాక్ కన్నా తక్కువ.**

411. శంకరాభరణం, శివ – ఈ రెంటిలో ఏది క్లాసిక్ అంటారు?

జ. **కచ్చితంగా 'శంకరాభరణమే' ! ఎందుకంటే అది పూర్తిగా ఒరిజినల్ సినిమా. 'శివ'ని చాలా సినిమాల నుంచి కాపీ కొట్టి తీసాను. ఎక్కణ్ణుంచి కాపీ కొట్టానో తెలీదు కాబట్టే జనం 'శివ'కి జేజేలు పలికారు.**

412. ఇతరులు మిమ్మల్ని గౌరవించాలని కోరుకుంటారా? గౌరవించమని ఆదేశిస్తారా?

జ. **రెండూ కాదు. నేనసలు ఎదుటి వారిచ్చే గౌరవాన్ని లెక్క చేయను.**

413. నాకెందుకో 'శంకరాభరణం' కాన్సెప్ట్ 'ఫౌంటెన్ హెడ్'కి దగ్గరగా ఉందనిపిస్తుంది.

జ. **ఒక రకంగా నిజమే కానీ, 'శంకరాభరణం' హీరోకి హీరోయిజం ఉండదు. చివరకు వచ్చేసరికి శంకరశాస్త్రి మీద జాలి కలుగుతుంది. అదే 'ఫౌంటెన్ హెడ్' లో హోవార్డ్ రోర్క్ ఫెయిలయినా అతను మనకు హీరో లానే కనబడతాడు.**

414. మీరు రాసేవన్నీ నాకు చాలా బాగా నచ్చుతాయి. కానీ పూర్తిగా అర్థం చేసుకోలేక పోతున్నా.

జ. **మళ్ళీ చదవండి.**

415. మీరెందుకు ప్రతీసారి రిస్క్ తీసుకుంటారు. అంత ధైర్యం ఎక్కణ్ణుంచి వస్తుంది?

జ. **అంత రిస్క్ ఎలా తీసుకుంటావు అని నేను అడిగిన ప్రశ్నకు ఎన్ కౌంటర్ స్పెషలిస్ట్ దయానాయక్ నాకు చెప్పిన మాటల్ని ఇక్కడ కోట్ చేస్తున్నా: "క్రికెట్ ఆడేటప్పుడు బ్యాట్ ఎత్తి బంతిని బాదితే సిక్సరైనా వెళుతుంది లేదా అవుటయిపోతాం. రెండూ ఓకే. కానీ జీవితంలో వికెట్ కాపాడుకోవాలని డిఫెన్స్ ఆడుతూ కూర్చుండటం కన్నా నిస్సారమైన జీవితం మరొకటి ఉండదు".**

416. విజయం మనుషుల తలకెక్కుతుంది ఎందుకని?

జ. తలకెక్కకుంటే విజయమన్న పదానికి అర్థమే లేదు.

417. "శంకరాభరణం" లోనూ తప్పులున్నాయి.

జ. సినిమాలో తప్పులు ఉండడం, లేకపోవడం అనేది చూసే వాడిలో తప్పులు ఉండడం లేకపోవడం పై ఆధారపడి ఉంటుంది.

418. "రక్త చరిత్ర" హింసని రీడిఫైన్ చేసిందనుకుంటా.

జ. నిజానికి "రక్త చరిత్ర" హింసని రిఫైన్ చేసింది.

419. "రక్త చరిత్ర" ట్రైయిలర్‌కి వాయిస్ ఓవర్ ఎందుకు ఇచ్చారు?

జ. చాలా గొంతులు ట్రై చేసి చివరకు నాదే బెటర్ అనిపించి చెప్పేశా. అది విని కొంత మంది ఉచ్చారణ సరిగ్గా లేదన్నారు. ఆ వాయిస్ ఓవర్ ఉద్దేశ్యం - నేననుకున్నది ప్రేక్షకులకు నా స్టైల్లో చెప్పడం కానీ, తెలుగు భాషను ఎలా పలకాలో నేర్పటానికి కాదు.

420. "అట్లాస్ ష్రగ్డ్" పది పేజీలు చదివే సరికి బోరొచ్చింది.

జ. "అట్లాస్ ష్రగ్డ్" బోర్ కొట్టిందంటే మీ తెలివి తేటల మీద నాకు బోర్ కలిగింది. పది పేజీల సంగతి అటుంచి మీకు ఒక్క వాక్యం కూడా అర్థం అయ్యి ఉండదు.

421. మీరు ఎమోషన్లు లేకుండా ఎమోషనల్‌గా ఫీలయ్యే వ్యక్తా?

జ. నేను ఎమోషనల్‌గా ఎమోషన్లు లేవనుకునే ఎమోషనల్ వ్యక్తిని.

422. ఈ కింది సినిమా ప్రశ్నలకు సమాధానాలిస్తారా?

- సినిమాల్లో పాత్రలను కార్లు తరుముతున్నప్పుడు ఆ కార్లకు అందకుండా పక్కకు పోకుండా, వాటి ముందే పరుగెత్తుతుంటారెందుకు?
- రెగ్యులర్‌గా మన హీరోలు దెబ్బలు తింటున్నప్పుడు కిమ్మనకుండా భరిస్తారు. ఆ తర్వాత హీరోయిన్ కాపడం పెట్టబోతే మాత్రం 'అబ్బా' అంటారు. ఎందుకని?
- సినిమాల్లో పక్క మీద ఏం జరిగినా, పక్క మాత్రం చెదరదు. ఇదేమన్నా సెన్సార్ రూలా?
- దెయ్యం సినిమాల్లో హీరోయిన్లు ఏ చప్పుడు అయినా చూడ్డానికి వెళ్ళేటప్పుడు, వాళ్ళ ఒంటి మీద అతి తక్కువ బట్టలు ఉంటాయెందుకు?
- సినిమా పోలీసులు పరిశోధన చేసేటప్పుడు తప్పనిసరిగా క్యాబరే డ్యాన్సులకు వెళతారెందుకు?

జ. సూపర్బ్ అబ్జర్వేషన్స్. ఈ ఐడియాలు నాకు రానందుకు మీమీద అసూయ కలుగుతోంది.

423. కసబ్ ఉరిపై మీ స్పందన.

జ. ఏ తీవ్రవాదయినా చావడానికి సిద్ధపడే వస్తాడు. అలాంటి వ్యక్తిని ఏడాది పాటు సజీవంగా ఉంచి అతన్ని టార్చర్ పెట్టారు. ఇప్పటికయినా చంపి అతని కోరిక నెరవేర్చబోతున్నారు.

424. మీరు డబ్బు వెనకాల పరుగెట్టకండి. సినిమా అద్భుతంగా రావాలని కృషి చెయ్యండి. సినిమా ఆటోమ్యాటిక్‌గా హిట్ అవుతుంది.

జ. మీరు సలహాలు ఇవ్వడానికి పరుగెత్తకండి. మీ తెలివి తేటలన్నీ మీమీదే ప్రయోగించుకోండి. మీరు ఆటో మ్యాటిక్ గా హిట్టవుతారు.

425. ముసలివాళ్ళు దైవచింతన వైపు ఎందుకు మ్రొగ్గుచూపుతారు?

జ. చావు దగ్గర పడినప్పుడు ఛాన్స్ తీసుకోవటానికి భయం వేస్తుంది.

426. ఫిలాసఫీ...ఫిల్మ్ మేకింగ్‌పై ఎలాంటి ప్రభావితం చూపుతుంది?

జ. మన ఫిలాసఫీయే.. మన ఫిల్మ్.

427. లాంగ్ లెక్చర్లిచ్చే హోవర్డ్ రోర్క్‌ని భరించడంకన్నా దేవుడ్ని నమ్మడం బెటర్ కదా?

జ. రోర్క్‌ని అర్థం చేసుకోలేని నీలాంటి తెలివితక్కువవాళ్ళుంటారని ఊహించే వాడెవడో భగవంతుణ్ణి కనిపెట్టాడు.

428. నేను అన్నింటినీ పీల్చుకోగల స్పాంజ్ లాంటి వాడిని.

జ. బావుంది గానీ...నువ్వు పీల్చిందంతా పిండటానికి ఓ బలమైన చెయ్యి కూడా అవసరమని గుర్తుపెట్టుకో.

429. మీవన్నీ పిచ్చి సమాధానాలు..ఎప్పుడూ ఒకేలా ఉంటాయి.

జ. అయ్యుండచ్చు...కాని ఎక్కడైనా పులి తన చారలు మార్చుకోవటం, పాము విషం వదులుకోవటం చూసావా!

430. సినీ ఫీల్డులో అంతా సెకెండ్ హ్యాండ్ గాళ్ళే అనుకుంటా.

జ. నీలాంటి థర్డ్ హ్యాండ్ గాళ్ళని చూసి మేము ఫస్ట్ హ్యాండ్ గాళ్ళలా ఫీలవుతాం.

431. నువ్వు.. సినిమాలు తప్ప వేరే ఆలోచన లేని ఓ జంతువ్వి.

జ. నీలాంటి ఆలోచనలు ఉన్న మనిషిని అవ్వటం కన్నా అదే బెటర్.

432. విజయవాడ అమ్మాయిలని మీరు ఇష్టపడ్డారా?

జ. విజయవాడేం ఖర్మ, ఎక్కడి అమ్మాయిలనైనా ఇష్టపడతా. కాకపోతే చాలాసార్లు వాళ్ళించుకునే అబ్బాయిలంటేనే చిరాకు.

433. సోమరి బుర్రకు కామం ఎక్కువ అనుకుంటా?

జ. **అది కరెక్టు కాదు. చురుకైన బుర్రల్లోనే ఆ కోరికలు అధికం. బద్ధకస్తులు బెడ్ మీద కూడా బద్ధకంగానే ఉంటారు.**

434. మా మామయ్యతో మీరు నాకు ఫేవరెట్ అని చెప్తే... పిచ్చిపట్టింది అన్నాడు.

జ. **కరెక్టే... లేకపోతే ఎందుకు మీ మామయ్యతో చెప్పటం?**

435. ఒకవేళ శ్రీదేవి మీకు రాఖీ కడితే..?

జ. **రాఖీ సిస్టర్ సెంటిమెంట్ పండగన్నది మరిచిపోతా.**

436. తెలివైనవాడికీ, తెలివిగా ప్రవర్తించే వాడికీ మధ్య తేడా ?

జ. **తెలివైనవాడు చాలా కాలం మనగలడు, తెలివిగా ప్రవర్తించేవాడు మాత్రం కొద్దికాలం తరువాత కనపడడు.**

437. మీరు ఏదైనా మిస్సవుతున్నారా?

జ. **మిస్సవుతున్నాను అనే ఫీలింగుని మిస్సవుతున్నా!**

438. మీ కెమెరా ఏంగిల్స్ చాలా విభిన్నంగా ఉంటాయేంటి?

జ. **నేను విభిన్నమైన వాడ్ని కాబట్టి.**

439. "సర్కార్ రాజ్" సినిమాలో గుట్టపై నుంచొని కాన్వాయ్‌ని చూస్తూండే గొర్రెలు కాచే పిల్లవాడిని చూపించటంలో మీ ఉద్దేశ్యం?

జ. **మీతో ఇలా అడిగించాలనే నా ఉద్దేశ్యం.**

440. మీ రచనలు నాకు పెట్రోలు లాంటివి..అవి లేకుండా నా ప్రయాణం సాగట్లేదు.

జ. **పెట్రోలుకు మిమ్మల్ని ముందుకు తీసుకెళ్ళే ప్రతిభ కాకుండా మిమ్మల్ని కాల్చేసే గుణం కూడా ఉంటుంది జాగ్రత్త.**

441. మీ పాజిటివ్ నెస్‌ని కూడా జనం నెగిటివ్‌గా తీసుకుంటున్నారే.

జ. **ఎందుకంటే, ఈ లోకంలో రెండు రకాల మనుషులున్నారు. ఒకరు పాజిటివ్‌గా ఉండే నెగిటివ్ మనుషులు. ఇంకొకరు నెగిటివ్‌గా ఉండే పాజిటివ్ మనుషులు. నేను రెండో టైపు. మీరు చెప్పేవాళ్ళు మొదటి రకం.**

442. స్వాతంత్ర్య దినోత్సవంపై మీ అభిప్రాయం.

జ. **నాక్కావలసిందల్లా నా పర్సనల్ స్వతంత్రం ఒక్కటే. అది నాకున్నన్నాళ్ళూ నేను పాకిస్తాన్లో ఉండటానికైనా రెడీ!**

443. మీరు చదువుల్లో చాలా బ్యాడ్ కదా..మరి బి.టెక్ సీట్ ఎలా వచ్చింది.

జ. మా నాన్న డొనేషన్ కట్టారు.

444. శ్రీదేవికి ఆమె పుట్టిన రోజున విషెస్ చెప్తూంటారా?

జ. లేదు.. ఆమెకు వయస్సు పెరుగుతుందనే ఆలోచన నాకు గిట్టదు.

445. మీ దృష్టిలో ఆదర్శ మహిళ అంటే...

జ. తల్లిగా, స్నేహితురాలిగా, హితువు చెప్పే శ్రేయోభిలాషిగా మారకుండా కేవలం "మహిళ" గా ఉండే "మహిళ" కోసమే నా అన్వేషణ.

446. యాక్షన్, సెక్స్..రెండింటిలో ఏది గొప్పంటారు.

జ. దీనికి పెద్ద ఆలోచన ఎందుకు... చిన్న టెస్ట్ చాలు. ఒక మనిషిని TV, DVD లతో ఒక రూంలో ఒంటరిగా పెట్టి ఒక యాక్షన్ సినిమా, ఒక సెక్స్ సినిమా పెడితే ఏది మొదట చూస్తాడు...అదే మీ ఆన్సర్...

447. మీరు ఎప్పుడూ నిజమే మాట్లాడుతూంటారా?

జ. అవును...అబద్ధం చెప్పినప్పుడు తప్ప.

448. పాశ్చాత్యుల ఆలోచనలు చూసి మీరు తక్కువగా ఫీలవటం మంచిది కాదు.

జ. మీ తెలివి ఎక్కువ అభిప్రాయానికి కృతజ్ఞుడ్ని సార్..కానీ నా తెలివి తక్కువ ఫీలింగ్ మనం ఎంత తెలివి తక్కువ వాళ్ళమనే తెలివి ఎక్కువ అవగాహన నుంచి వచ్చింది. అందుకనే నీలాంటి తెలివి తక్కువ వాళ్ళ కంటే నేను తెలివి ఎక్కువగానే ఉన్నా పాశ్చాత్యుల కంటే తెలివి ఎక్కువ మనకు అనుకునే తెలివి ఎక్కువ వారు తెలివి తక్కువ వాళ్ళని నేనిక్కడ చెప్పిన తెలివి ఎక్కువ అర్థం.

449. నాకు తెలిసుండి మీరు ఎవరి మాట వినని జగమొండి.

జ. నన్ను ఒప్పించటం చాలా ఈజీ... తెలివైనవాడు నాకు ఆలోచనలనిచ్చి, అందగత్తె నాకు అందాలనిచ్చి నా నోరు మూయించగలరు.

450. మన జాతీయపతాకం 63 వ జయింతి జరుపుకుంది. పింగళి వెంకయ్య గారి డిజైనింగ్ అద్భుతం కదా...

జ. ఏం..ఆ డిజైన్ వేరే విధంగా గానీ ఇంకెవరైనా వేసుంటేగానీ మీకు నచ్చేది కాదా?

451. ప్యారడైజ్ రెస్టారెంట్‌లో బిర్యాని చాలా బావుంటుంది.

జ. తిండి గురించి ఆలోచించటం...మాట్లాడటం కన్న పనికిమాలిన పని ప్రపంచంలో మరోటి ఉంటుందనుకోను.

452. సిటిజన్ కేన్ సినిమా ఎప్పుడు చూసినా ఫ్రెష్‌గా అనిపిస్తుంది..

జ. దానికన్నా అడవిరాముడు వెయ్యిరెట్లు బెటర్.

453. అందమైన అమ్మాయిని చూడగానే మగాళ్ళు ప్రేమలో పడిపోతారని ఎందుకను కుంటున్నారు.

జ. ప్రేమలో ఏమీ పడరు. అది కేవలం అనుభవించాలనే ఆకర్షణ అంతే. కాకపోతే ఇలాంటి ఆకర్షణలు తప్పనుకునే గిల్ట్ ఫీలింగ్ కారణంగా దాన్ని ప్రేమగా ప్రకటించేస్తారు. ఆ కోరిక కాస్తా తీరాక, ప్రేమనేది మిగలదు. ఈ విషయం ప్రేమించి పెళ్ళి చేసుకున్న ఏ అమ్మాయినైనా అడగండి.

454. చనిపోయే ముందు మీ చివరి కోరిక ఏంటి?

జ. దేముడు నిజంగా లేడనే నా నమ్మకం నిజం కావాలని కోరుకుంటా. ఎందుకంటే నిజంగా దేముడనే వాడుంటే.. ఇన్నాళ్ళూ నేను ఆయన గురించి వాగిన వాగుడుకి కొరడాల్తో కొట్టించి నూనెలో వేయిస్తాడు.

455. మీ ఫోటోల్లో మంచి ఎక్స్‌ప్రెషన్స్ ఉంటాయి. తెరపై నటించొచ్చు కదా.

జ. తెరవెనక నటనలో బిజీగా ఉన్నా...

456. కలలు నిజం కావెందుకని?

జ. కలలు నిజం కావాలంటే మొదట కల కనడం నుంచి నిద్ర లేవాలి.

457. మీ జీవితంలో పశ్చాత్తాప పడిన సందర్భాలున్నాయా?

జ. లేవు... తప్పు చేశానని తెలుసుకొనేటప్పటికే ఇంకో తప్పు చేయటంలో మునిగిపోయుంటా.

458. హాలీవుడ్ సినిమాలు రియల్‌గా, మన సినిమాలు ఫేక్‌గా ఉంటాయి. ఎందుకని?

జ. వాళ్ళ సినిమాలనే మనం ఫేక్ చేస్తుంటాం కాబట్టి.

459. రంగీలాలో మీ పేరు పక్కన శ్రీదేవి ఫోటో ఉంటుందేంటి?

జ. నిజ జీవితంలో ఎలాగూ కుదర్లేదు కాబట్టి కనీసం అలా గుల తీర్చుకున్నా.

460. మీరు RGV గా ఉండడం ఇష్టపడతారా?

జ. మీకు మాత్రమే నేను RGV ని. నాకు నేను నేనే.

461. ఇంజనీరింగ్ పరీక్షలప్పుడు బాగా ప్రిపేర్ అయ్యేవారా?

జ. కాపీ కొట్టడానికి బాగా ప్రిపేర్ అయ్యేవాణ్ణి.

462. కామన్ సెన్స్ అనేది అంత కామన్‌గా కనపడదు ఎందుకని?

జ. నీలాంటి కామన్ మనుషులు ఇలాంటి నాన్ కామన్ సెన్స్ ప్రశ్నల్ని చాలా కామన్‌గా అడుగుతుంటారు కాబట్టి...

463. ఫౌంటెన్ హెడ్, దజ్ స్పోక్ జరతుస్త్ర చదవని, సత్యేంద్ర తెలియని వర్మను ఊహించగలమా?

జ. మంచి ప్రశ్న. కానీ నేను నేను కాబట్టి వాటిని అర్థం చేసుకున్నానా లేక అర్థం చేసుకున్నాను కాబట్టి నేను నేనయ్యానా అనేది నాకే ఇప్పటికీ అర్థంకాలేదు. కానీ వాళ్ళు మాత్రం డెఫినెట్‌గా నాకు మార్గం చూపెట్టారు. ఆ మార్గానికి దర్శకత్వం మాత్రం నేనే వహించాను.

464. మీకు మీరు బాగా నచ్చుతారు కదూ!

జ. తింగరి గాళ్లడిగే ఇలాంటి ప్రశ్నలు చూసినప్పుడల్లా నాకు నేను ఇంకా బాగా నచ్చుతాను.

465. నేను మీ రాతలు చదువుతుంటే సైకో అన్నారు నా ఫ్రెండ్స్. కానీ మీ ఆలోచనల్ని కార్య రూపంలో పెడుతుంటే మాత్రం జీనియస్ అంటున్నారు.

జ. ఆలోచనలను అర్థం చేసుకొనే వాళ్ళు చాలా తక్కువ మంది ఉంటారు. ఫలితాలు చూపిస్తే గానీ వాళ్ళకు లైట్ వెలగదు.

466. యథార్థ గాథని కల్పిత కథగా చెప్పడమా? కల్పిత గాథని యథార్థ కథగా చెప్పడమా? ఏది గొప్ప టేలెంట్?

జ. ఏది యథార్థమో, ఏది కల్పితమో తెలీని స్థితిలోకి ప్రేక్షకుల్ని తీసుకెళ్లడమే అసలైన టేలెంట్.

467. స్కార్ ఫేస్, గాడ్ ఫాదర్ లాంటి సినిమాలు హాలీవుడ్‌లో 70ల్లో వచ్చాయి. మన సత్య, కంపెనీ సినిమాలు కూడా ఇంకొంచెం ముందు వస్తే బాగుండేదేమో?

జ. మనది థర్డ్ వరల్డ్, మనవి థర్డ్ మైండ్స్. అందుకే వాళ్ళ అప్పటి ఐడియాలని అందుకోవటానికి మనకి ముప్పై ఏళ్ళు పడితే, అవతార్, ఇన్సెప్షన్ లాంటి సినిమాలని అందుకోవటానికి మూడు వందల ఏళ్ళు పడుతుంది.

468. నేను మళ్ళీ గనక పుడితే మీలాగా పుట్టాలనుకుంటున్నా.

జ. ఇంకోళ్లలాగా పుట్టడానికి వెయిట్ చెయ్యడం కన్నా, ఇప్పుడే మీకు తోచిన విధంగా మీ పెరుగుదలని మలుచుకోవటం మేలు.

469. ప్రతి ప్రశ్నకీ ఏదో మెలిక పెట్టి సమాధానం చెబుతారేంటి?

జ. మెలిక నా సమాధానాల్లో లేదు. ఏమీ అర్థం అవని మీ బుర్రల్లో ఉంది.

470. మీకు మామూలు పిచ్చే కాదు, ఎదుటి వాళ్ళకు కూడా పిచ్చెక్కించే పిచ్చి కూడా ఉంది.

జ. **అవును మీరు కరెక్టే – పిచ్చెంకించాలనే పిచ్చి నాకు పిచ్చ పిచ్చగా ఉంది.**

471. మీ జీవితంలో ఫౌంటైన్ హెడ్ హీరోయిన్ డోమెనిక్ లా మేధా చర్చలు జరిపే అమ్మాయి ఉందా.

జ. **అలాంటమ్మాయిలు పుస్తకాల్లో చదవటానికే బాగుంటారు. అమ్మాయిలతో చర్చించి టైమ్ వేస్ట్ చేసుకోవడం కన్నా వేరే మంచి పనులు చాలా చేయొచ్చు.**

472. నాగార్జున, సత్యేంద్ర – వీళ్ళిద్దర్లో ఎవరెక్కువ మేలు చేశారు మీకు?

జ. **సత్యేంద్ర ఆలోచనలిచ్చాడు. నాగార్జున లైఫ్ ఇచ్చాడు.**

473. "ఎంటర్ ది డ్రాగన్" లాంటి సినిమా తీసే ఆలోచన ఉందా?

జ. **సూపర్బ్. అదే నా డ్రీమ్. బ్రూస్ లీ & సెక్స్. ఈ రెండే భగవంతుడి క్రియేటివ్ క్రియేషన్ అని నా నమ్మకం.**

474. ప్రతి మనిషిలో ముగ్గురు మనుషులుంటారట. మన ఊహల్లో మనం. ఎదుటి వారి ఊహల్లో మనం. మన అసలు మనం.

జ. **నాకు నేను ఏడుగురుగా అనిపిస్తుంటాను.**

నా అసలు నేను.

ఎదుటివారి ఊహల్లో నేను.

ఎదుటి వారి ఊహల్లో నేనిలా ఉంటాను అనుకునే నేను.

నేను కావాలనుకునే నేను.

ఒకప్పటి నేను.

ఇప్పటి నేను.

రేపటి నేను అనుకునే నేను.

475. మీ సినిమాల్లో బిజిఎంలు మునుపటంత గొప్పగా ఉండడం లేదే?

జ. **నా బీజీఎంలు బాగానే ఉన్నాయ్. మీ చెవులే మునుపుటంత గొప్పగా లేవేమో.**

476. మీ ఫోటో పంపుతారా. రోజూ పూజ చేసుకుంటా.

జ. **అభినందించదగ్గ ఆలోచన. చాలామంది దేవుళ్ళ కన్నా బెటర్ మొహమే నాది.**

477. మన తలల్లో అహంకారం. గుండెల్లో దురాశ. మనసుల్లో కామం. కళ్ళల్లో అసూయ. శరీరంలో ద్వేషం ఉంటాయి?

జ. **అవన్నీ కలిసాయి కనుకే మనం పరిపూర్ణమయ్యాం.**

478. కలలు నిజం కావెందుకని?

జ. కలలు నిజం కావాలంటే మొదట కల కనడం నుంచి నిద్ర లేవాలి.

479. మీకసలు ఎమోషన్సే లేవని చెప్తారు. కానీ మీ సినిమాల్నిండా ఎమోషన్లే...

జ. హే రామా, కృష్ణా, జీసస్, అల్లా... ఏమీ ఖర్మ. నేనెప్పుడయినా నాకు ఎమోషన్లు లేవని చెప్పానా? నేను ఎమోషనల్‌గా ఫీలయినప్పుడు నాలోంచి నేను బయటికొచ్చి నా ఎమోషన్లని పరిశీలిస్తుంటా. ఎమోషన్లే గనక ఒక జబ్బయితే, నాకు నేనే డాక్టర్ని.

480. క్షణ క్షణం క్లైమాక్స్‌లో శ్రీదేవిని కదులుతున్న ట్రైన్ పైకి ఎక్కే సీన్‌కి ఎలా ఒప్పించారు?

జ. ఏదన్నా జరిగితే సూపర్ మ్యాన్‌లా పైకెగిరి తనని రక్షిస్తానని హామీ ఇచ్చా.

481. ఇతరుల అసూయాల్ని తట్టుకోవడం ఎలా?

జ. ఇంకొకళ్ళ అసూయను పట్టించుకుంటూంటే మీకు అసూయ పడటానికి టైమ్ సరిపోదు.

482. మీ గురువు నీషేకి చివర్లో పిచ్చెక్కిందటగా.

జ. నాకా సమస్య లేదు. నేను పుట్టుకతోనే పిచ్చోణ్ణి.

483. మన ఆలోచనల్ని కంట్రోల్ చేసుకోగలమని మీరంటున్నారు. నేను నమ్మను.

జ. నేను నా గురించి చెబుతున్నా. మీలాంటి మేధ లేనోళ్ళ గురించి కాదు.

484. మీకు ఈ ధైర్యం, సామర్థ్యం తుది శ్వాస వరకూ ఉంటాయని ఆశిస్తాను

జ. తుది శ్వాస గురించి లెక్కచేయనంత కాలం ధైర్యం, సామర్థ్యం ఎక్కడికీ పోవు.

485. నిరాశావాదికీ, ఆశావాదికీ తేడా ఏంటీ?

జ. ఆశావాది విమానాన్ని కనిపెడితే నిరాశావాది ప్యారా చ్యూట్ కనిపెట్టాడు. మధ్యస్థంగా ఉండేవాళ్లు నేల మీదే నిలబడి ఈ రెండిట్లో తప్పులు కనుక్కునే పనిలో ఉంటారు.

486. మనుషులుగా పుట్టినందుకు జీవితానికో పరమార్థం కావాలి.

జ. జీవితం అంటే జీవించడమే. ప్రతిక్షణం జీవితాన్ని అనుభవించడం జీవన పరమార్థం. చాలా మంది బతికే ఉన్నా జీవచ్ఛవాల్లా బతుకుతూ ఉంటారు.

487. అపరాధ భావాన్ని మీరెలా అధిగమిస్తారు.

జ. అపరాధ భావన అనేది సమాజం మన మీద రుద్దిన ఒక రోగం మాత్రమే. దాన్ని వదిలించుకోడానికి జ్ఞానం అనే మందు వేసుకున్నాను.

488. మీరేంటో నాకు అర్థం కావడం లేదు

జ. అసలు నన్నెందుకు అర్థం చేసుకోవాలనుకుంటున్నారో అన్నదయినా అర్థం చేసుకొనే ప్రయత్నం చేయండి

489. ఇరవై ఏళ్లూ దాటినా ఇంకా మీరు "శివ" మీదే పడి బతికేస్తున్నారు.

జ. కాదు. "శివ" కన్నా ముందొచ్చిన అనేక గొప్ప సినిమాల మీద పడి బతికేస్తున్నా. వాటి నుంచి నేర్చుకొనే "శివ" తీసా.

490. ఫ్లాప్‌ల దెబ్బకు భూమ్మీదకి దిగారనుకుంటా.

జ. పాతాళంలో కూరుకుపోయా. కానీ నేను పాములాంటి వాణ్ని కాబట్టి ఇక్కడా సుఖంగానే ఉంది.

491. మీరు స్వీయ ఆరాధన అనే మానసిక జబ్బుతో బాధపడుతున్నట్టున్నారు.

జ. అదేంటో గానీ వినడానికి చాలా ఇంపుగా ఉంది.

492. మీరు అర్జంట్‌గా మానసిక వైద్యుణ్ణి కలవాలి.

జ. కలిసా. కొన్నాళ్ళకు అతని మానసిక స్థితి కూడా చెడింది.

493. మీరు వృద్ధాప్యంలో ఒంటరిగా మిగిలిపోతారనిపిస్తుంది.

జ. ఒక్కచిన్న కరెక్షన్. నేను వృద్ధాప్యంలో అత్యంత ఆనందంగా ఉన్న ఒంటరి వృద్ధుడిగా మిగిలిపోతాను.

494. మీ పేరుకి మీరు న్యాయం చేకూరుస్తున్నారనే అనుకుంటున్నారా?

జ. న్యాయమో అన్యాయమో తెలీదు గానీ, మా నాన్న మాత్రం నాకు మంచి పేరే పెట్టారు. అదే ఏ అప్పల్రాజనో పెట్టుంటే పోస్టర్ ఎలా ఉంటుందో ఊహించండి!

రక్త చరిత్ర

ఇది అప్పల్రాజు చిత్రం.

495. మీరు ఇన్ని సినిమాలు తియ్యకుండా ఏడాదికి ఒకటే గొప్ప సినిమా తియ్యొచ్చుగా.

జ. మీ గొప్ప సలహాలు మీ మాట వినేవారికే ఇచ్చుకోవచ్చుగా.

496. మిమ్మల్ని మీరే దేవుడు అనుకుంటారా? ఎంత అహంకారం?

జ. నేను దేవుడికన్నా గొప్పవాడిని.

497. మీరేదయినా వేదాంత సభలో మాట్లాడాలి.

జ. ఇతరుల మాటలు విని అర్థం చేసుకోనెంత ఓపిక ఎవరికీ ఉండదు. విని, తెలుసుకుని, సొంతంగా ఒక అభిప్రాయం ఏర్పరచుకోవడం కన్నా ఎవరో

ఒకర్ని ఫాలో అయిపోవడం ఉత్తమం అని అందరూ అనుకుంటారు. గత 30 ఏళ్లలో అయాన్ ర్యాండ్ రచనలు చదివామని చెప్పుకున్న వాళ్ళను వందల సంఖ్యలో కలిశాను. అయినా ఆవిడ ఫిలాసఫీని అర్థం చేసుకొని ఆచరించే వాళ్ళు ఒక్కరూ కనబడలేదు. ఉపన్యాసాలు భావోద్వేగాలను రెచ్చగొడతాయే తప్ప తర్కాన్నీ, విశ్లేషణనూ నేర్పలేవు.

498. ప్రపంచమంతా రంగస్థలమైతే ప్రేక్షకులు ఎక్కడ కూర్చుంటారు?

జ. దేవుడి పక్కన.

499. బట్టలమ్మే షాపుకి వెళ్లాలంటే టిక్కెట్టు అవసరం లేదు. సినిమాలకు మాత్రం కావాలి.

జ. మీ తెలివి తెల్లారినట్టు ఉంది. షాపులో కొనుక్కొనేది షాపుని కాదు, బట్టలు.

500. మీ రాతలు నైస్‌గా ఉన్నాయి.

జ. మీరు బ్రహ్మాండం లేదా చెత్త అన్నా నాకు అభ్యంతరం లేదు గానీ, దయచేసి 'నైస్' లాంటి డొల్ల పదాలు వాడకండి.

501. పోస్టర్లలో కూడా కళ ఉంటుందా.

జ. ఎమ్మెఫ్ హుస్సేన్ లాంటి వాళ్ళ చిత్రాల కన్నా నాకు చాలా సినిమా పోస్టర్లు ఎక్కువ కళాత్మకంగా ఉంటాయి.

502. జ్ఞానుల కన్నా మూర్ఖులూ, మూఢ భక్తులు నిస్సంశయంగా ఎక్కువ మంది ఉంటారు.

జ. మూర్ఖులు ఆలోచించకుండా చేసేస్తారు. జ్ఞానులు ఆలోచన మాత్రమే చేసి వదిలేస్తారు.

503. ఫిలిమ్ మేకర్లు కూడా అందరి లాంటి మనుషులే. శివ, రంగీలా, సత్యా, కంపనీ లాంటి హిట్ సినిమాలు తీసిన దర్శకుడు 'ఆగ్' తీయడంలో తప్పేం లేదు.

జ. ఈ మాట అన్నందుకు నేను మిమ్మల్ని పెళ్లి చేసుకుంటా.

504. మీ చుట్టూ ఉన్నవాళ్ళు తెలివైన వాళ్ళు కావడం మీ అదృష్టం

జ. నిజమే, చుట్టూ దద్దమ్మలుంటే మనం కూడా దద్దమ్మలమని తెలియటానికి ఆస్కారం లేదు.

505. ఎప్పుడయినా రష్యన్ అమ్మాయిలతో కలిసి వోడ్కా తాగారా?

జ. అమ్మాయిలతో కలిసి ఉన్నప్పుడు వోడ్కా తాగడం కన్నా ముఖ్యమైన పనులు వేరే ఉంటాయి.

506. చిన్న పిల్లల పట్ల మీ అభిప్రాయం?

జ. **వాళ్ళంటే నాకు అయిష్టం. ఎందుకంటే నేనున్నా కూడా అందరి దృష్టీ వాళ్ళే ఆకర్షిస్తారు. నా వయసుని కూడా గుర్తు చేస్తారు.**

507. మీకు ప్రేక్షకుల మీద గౌరవం పోయినట్టుంది.

జ. **లేనిది నేనెలా పోగొట్టుకుంటాను?**

508. హీరోయిన్ అంగాంగ ప్రదర్శన మీద ఆధారపడే చీప్ దర్శకులకీ మీలాంటి ప్రత్యేకమైన దర్శకుడికీ తేడా ఏమిటి?

జ. **చీప్ అంటే ఏమిటో నాకు తెలియదు. నా దృష్టిలో హీరోయిన్ అంగాంగాలని ప్రత్యేకంగా చూపగలిగిన వాడే ప్రత్యేకమైన దర్శకుడు.**

509. ఓపికనీ, వినయాన్నీ మీరెలా నిర్వచిస్తారు?

జ. **ఆ రెండూ నా డిక్షనరీ లో లేవు.**

510. ఎలా బతకాలో తెలియని మనుషుల గురించి మీరు ఏమంటారు?

జ. **బతికి ఉన్న శవాలు.**

511. మీరు బి గ్రేడ్ వెబ్ సైట్స్‌కీ, ఛానెల్స్‌కీ కూడా ఇంటర్వ్యూలు ఇవ్వడం ఏమీ బాగాలేదు.

జ. **మీలాంటి సి గ్రేడ్ వాళ్ళకి కూడా జవాబు ఇస్తున్నప్పుడు వాళ్ళకి ఇంటర్వ్యూ ఇవ్వడం తప్పేమీ కాదు.**

512. ఆత్మహత్యల గురించి మీ అభిప్రాయం?

జ. **ఏ సమస్యకైనా ఎదురొడ్డి పోరాడే మనస్తత్వం నాది. జీవితాన్ని అమితంగా ప్రేమిస్తాను కనక నాకు ఆత్మహత్యల మీద దురభిప్రాయం లేదు.**

513. జ్ఞానం, తెలివితేటలు, మేధ, వివేకం – వీటిలో తేడా తెలిపే ఒక ఉదాహరణ ఇవ్వండి.

జ. **పాముకి విషం ఉంటుందని తెలుసుకోవడం జ్ఞానం.**

ఆ విషం ప్రమాదకరమని గుర్తించటం తెలివి.

దానికి విరుగుడు కనిపెట్టడం మేధ.

ఇవన్నీ తెలిసినా ఎందుకయినా మంచిదని పాముకు దూరంగా ఉండడం వివేకం.

514. మీరు అందుకున్న అత్యుత్తమ సలహా ఏది?

జ. నేను ఎవరి సలహాలు కోరను, తీసుకోను. ఏ ఇద్దర్లో ఒకే రకమైన మేధస్సు, శారీరక, మానసిక స్థితులూ ఉండవు కాబట్టి ఒకరి సలహా మరొకరికి పని చెయ్యదు. ఒకరి సలహా మరొకరు వినడం బుద్ధి తక్కువ పని.

515. మీ తెలివితేటలను మీరెలా అంచనా వేస్తారు?

జ. అవి ఉపయోగించడం వల్ల వచ్చిన ఫలితాన్ని బట్టి.

516. మ్యాడ్ మ్యాగజైన్ మిమ్మల్ని ఎంతగా ప్రభావితం చేసింది?

జ. 'మ్యాడ్' ద్వారా నేను చాలా జీవిత సత్యాలు తెలుసుకోగలిగాను. 'మ్యాడ్' అనే కాదు, ఏ జోక్ అయినా నిశితంగా గమనిస్తే అందులో వేదాంత పరమైన, మానసిక పరమైన సత్యాలు ఉంటాయి. వాటిలో అయాన్ ర్యాండ్, నీషేల పుస్తకాలన్నింటి కన్నా ఎక్కువ జ్ఞానం ఉంటుంది.

517. మీరు అందుకున్న అత్యుత్తమమైన బహుమతి ఏది?

జ. ఒకానొక క్లిష్ట దశలో మా నాన్న గారు నేను ఇష్టపడ్డ దారిలో వెళ్ళేందుకు ఇచ్చిన అనుమతి.

518. మీకు వంట వచ్చా?

జ. వంట దాకా ఎందుకూ, ఆకలవకపోతే తినడమే దండగ అనుకొనే వాణ్ని నేను.

519. మీ సమాధి మీద ఏమని రాసి ఉంటుంది?

జ. అంత మంచివాడూ కాదు..అంత చెడ్డవాడూ కాదు.

520. మీరింత తిక్క మనిషి కదా మీకు అమ్మాయిలు ఎలా పడతారు?

జ. వాళ్లకి నాకన్నా ఎక్కువ తిక్క కాబట్టి.

521. మీ తొలివలపు మీకింకా గుర్తుందా?

జ. ఆహా... "తొలివలపే...తీయనిది" - సెయింట్ మేరీస్‌లో మా ఇంగ్లీష్ టీచర్ సరస్వతిగారిని చాలా ఇష్టపడ్డా. ఆమె ఏం టీచ్ చేసేదో మాత్రం ఎప్పుడూ వినలేదు.

522. మీరు సెయింట్ మేరీస్‌లో చదువుతున్నప్పుడు పక్కనున్న సెయింట్ ఫ్రాన్సిస్ గర్ల్స్ స్కూల్లోకి తొంగి చూస్తుండే వారా.

జ. చేసింది అదొక్కటే.

523. కెమెరా పరిభాష ద్వారా పాత్రల అంతర్గత ప్రేరణలను చూపగలమా?

జ. కెమెరా పరిభాష ఉన్నదే అందుకు.

524. కెమెరా కదలికల్లో మీరింకా పాత పద్ధతుల్నే వాడుతున్నారే.

జ. పద్ధతుల్లో పాత, కొత్త అని ఏదీ ఉండదు. ఒక షాట్‌ని దర్శకుడు ఎలా చూడాలనుకుంటే ఆ షాట్ అలా తీయబడుతుంది.

525. నియంతకీ దర్శకుడికీ తేడా ఏంటీ?

జ. నియంత 'ఇలా చెయ్' అని నిర్దేశిస్తాడు. దర్శకుడు 'ఇలా చెయ్యాలి' అని సూచిస్తాడు. కానీ నాకు తెలిసిన చాలామంది దర్శకులు సూచించడానికన్నా నిర్దేశించడానికే ఇష్టపడతారు.

526. మీకింత పొగరెందుకు?

జ. పొగరుకీ ఆత్మ విశ్వాసానికీ తేడా తెలుసుకోవాలంటే మీక్కాస్త తెలివి కావాలి.

527. మీ నోరు మూయించాలంటే మీ నోటికి టేప్ వేసి అంటించడం కానీ, మీతో పడక ఎక్కడం కానీ చేయాలని నా గర్ల్ ఫ్రెండ్ అంటోంది.

జ. రెండోదే బెటర్. ఆమె చాలా తెలివైన నిర్ణయం తీసుకుంది.

528. మీ దృష్టిలో అందమైన స్త్రీ?

జ. నాకు అందంగా కనపడే స్త్రీ.

529. మీ వ్యక్తిత్వం పట్ల నాకు రక రకాల ఆలోచనలు వస్తున్నాయి.

జ. నేను రక రకాల వ్యక్తిత్వాలున్న వాడిని కాబట్టి మీ సంశయం సహజమే.

530. మీ సినిమాలకి సంబంధించి మీరు చేసిన మూడు తప్పులు చెప్పగలరా?

జ. శివ, సత్యా, రంగీలా తీయకుండా ఉండాల్సింది. ఈ మూడు సినిమాలూ గొప్ప సినిమాలుగా ముద్ర పడిపోవడం వల్ల మళ్ళీ అలాంటి సినిమాలు తీయడం లేదని నన్ను అక్షింతలుతో వాయించేస్తున్నారు విమర్శకులు.

531. రాము, రామ్ గోపాల్ వర్మ, RGV – ఈ మూడిట్లో ఏ పేరు ఇష్టం?

జ. రాము. ఎందుకంటే ఆ పేరు అమాయకంగా అనిపిస్తుంది. ఆ పేరు వల్ల మన కొంటె వేషాలు కొన్ని కొట్టుకుపోతుంటాయి.

532. మిమ్మల్నొక దీవిలో జీవితాంతం ఒంటరిగా వదిలేస్తే, మీ వెంట తీసుకెళ్ళే 5 సినిమాలు ఏవి?

జ. "గాడ్ ఫాదర్", నాలుగు బ్లూ ఫిలిమ్స్.

533. స్త్రీలంటే మీకింత ఇష్టం కదా, మీరే సెక్స్ ఛేంజ్ చేయించుకోవచ్చు కదా?

జ. హల్లో, నాతో నేనే సరసమాడుకొనే అలవాటు నాకు లేదు.

534. భావాలను కలగచెయ్యడంలో, సినిమాల కన్నా రాయడం లోనే ఎక్కువ అవకాశం ఉంటుందని అనుకుంటున్నారా?

జ. అవును. కాదు.

ఎందుకంటే ఉదాహరణకు "గాడ్ ఫాదర్'లో లూకా బ్రాసి అనే క్యారెక్టర్ గురించి మారియో పూజో రాసిన వర్ణన చదవండి:

"తూర్పు న్యూయార్క్ అండర్ వరల్డ్‌లో లూకా బ్రాసి పేరు చెబితే అందరూ వణికిపోతారు. బలిష్ఠంగా, పెద్ద తలతో ఉండే అతని కళ్లల్లోకి చూసిన వారికి గుండెల్లో ప్రమాద గంటలు మోగుతాయి. అతని హింసాత్మక చరిత్ర భయానకం. డాన్ పట్ల అతని భక్తి అపారం. డాన్ చీకటి సామ్రాజ్యానికి అతనో మూల స్తంభం. అతనికి దేవుడంటే భయం లేదు. పోలీసులంటే జంకులేదు, సాటి మనుషులన్నా, సమాజమన్నా లెక్క లేదు. లూకా బ్రాసి ఒక పెను తుపానులాంటి వాడు. పూర్తిగా ఏ శక్తి ఆధీనంలోనూ ఉండడు"

మారియో పూజో తన పదాలతో వర్ణించినంత గొప్పగా ఏ దర్శకుడు కూడా లూకా బ్రాసిని తెర మీద చూపలేడు. పూజో పుస్తకంలోని లూకా ముందు కొప్పోలా తెరమీద చూపిన లూకా తేలిపోయాడు.

ఇప్పుడు ఒక సినిమాలో ఒక దృశ్యాన్ని వర్ణిస్తా చూడండి:

"కెమెరా నేల మీద ఉంది. ఒక స్త్రీ కాళ్ళు మడమలకు కొంచెం పై వరకూ నగ్నంగా కనబడుతూ మంచం దిగుతాయి. ఆమె నడుస్తుంటే ఆమె పాదాలతో పాటు కెమెరా కూడా ట్రాక్ అవుతుంది. నేల మీద పడి ఉన్న ఆమె ప్యాంటీస్ ఫ్రేమ్‌లోకి వచ్చాక కెమెరా ఆగుతుంది. ఆమె చేతులు ఫ్రేమ్‌లోకి వచ్చి ప్యాంటీని అందుకుంటాయి. ఆమె ప్యాంటీ వేసుకొంటోంది. ప్యాంటీ ఆమె కాళ్ళ మీదుగా పైకి జరుగుతుంటే కెమెరా దాన్ని ఫాలో అవుతూ, పైకి లేస్తూ కటి ప్రాంతానికి వచ్చేటప్పటికి ఆగిపోతుంది. ప్యాంటీ పైకి వెళ్లిపోతుంది. ఇప్పుడు ఆమె ఫ్రేమ్ లోనుంచి బయటకు వెళ్లిపోతుంది. కెమెరా ప్యాన్ అయి, మంచం మీదున్న ఒక మగాడ్ని చూపుతుంది. అతను 'ఐ లవ్ యువర్ బట్ బేబీ' అంటాడు.

ఇక ఈ సీన్ వల్ల ప్రేక్షకుల్లో కలిగే మానసిక భావాలను విశ్లేషిస్తే:

మొదటి సారిగా ఆమె కాళ్ళు చూసినప్పుడు 'నగ్నంగా ఉందా ఏంటీ' అనుకుంటారు. ప్యాంటీస్ ఫ్రేమ్‌లోకి రాగానే 'అవును, ఆమె నగ్నంగానే ఉంది' అని ఉత్తేజితులవుతారు. కెమెరా ప్యాంటీతో పాటు ఆమె కాళ్ళ మీదుగా పైకి

ప్రయాణిస్తున్నప్పుడు 'ఓ... మొత్తం చూపించేస్తాడా' అని, 'ఓహ్... చూపించేస్తున్నాడే' అనీ చొంగకార్చుకుంటూ కుర్చీలో ముందుకు వస్తాడు. కానీ కెమెరా ఆగిపోయి ప్యాంటి పైకి పోగానే డైరెక్టర్‌ని తిట్టుకుంటారు. మంచం మీది వ్యక్తి 'ఐ లవ్ యువర్ బట్ బేబీ' అనగానే అతన్ని చంపెయ్యాలన్నంత అసూయ కలుగుతుంది. ఎందుకంటే మనం చూడంది వాడు చూసేసాడు అని తెలిసింది కాబట్టి.

పైన చెప్పిన సీన్లో ప్రేక్షకుడి మనో భావాలను నియంత్రించడం కెమెరాతో మాత్రమే సాధ్యమవుతుంది తప్ప రాతలో ఆవిష్కరించడం వీలుకాదు. అంటే రచయితలు రాసే కొన్ని వాక్యాల్ని దృశ్యాల్లోనూ, దర్శకులు చూపే కొన్ని దృశ్యాల్ని వాక్యాల్లోనూ చెప్పడం చాలా కష్టం అని అర్థం చేసుకోవాలి.

చివరగా మరో మాట. ఈ ప్యాంటీస్ సీన్ ఏ సినిమాలోదీ అని మీరు బుర్ర బద్దలుకొట్టుకోకండి. నా పాయింట్ మీకు అర్థమయ్యేలా చెప్పడానికి నేనే క్రియేట్ చేశా.

535. మిమ్మల్ని మీరెలా వర్ణించుకుంటారు?

జ. నేను పిచ్చివాడిగా నటించే మేధావిని గానీ, మేధావిలా నటించే పిచ్చివాడిని కానీ అయి ఉంటాను. ఈ వాక్యంతో కుస్తీ పట్టకండి. రెండిటి అర్థం ఒకటే.

536. మీ రాతలు చదవడం వల్ల నాకు పిచ్చి ముదిరిపోతోందని మా అమ్మగారు అంటున్నారు.

జ. ఇలా అనడం వల్ల మీ అమ్మగారి పిచ్చి ముదిరిపోయిందేమోనని మా అమ్మగారు అంటున్నారు.

537. పనివాళ్ళకీ, కుక్కలకీ ఉండే 'రాము' అనే పేరుతో మిమ్మల్ని పిలవడం మీకు అవమానంగా లేదా?

జ. ఆ స్థాయి నుంచి ఈ స్థాయి వరకూ నేను ఎదగడం నాకు చాలా సంతోషంగా ఉంది.

538. రాజకీయ నాయకులు అసలు ఎప్పుడయినా నిజం చెబుతారా?

జ. ఇతర రాజకీయ నాయకులను అబద్ధాల కోరు అని నిందించినప్పుడు.

539. మీరెందుకు బతుకుతున్నారు?

జ. మందు కోసం, మగువ కోసం. వాటిని పొందడానికి కావాల్సిన డబ్బు సంపాదించటం కోసం...

540. నిజ జీవితంలో సెక్సు తెరమీద చూపినంత గొప్పగా ఉండదే.

జ. తెర మీద కనబడేది ఎడిట్ చేయబడ్డ స్త్రీ. నిజ జీవితంలో నిజమైన స్త్రీ.

541. అందరూ మిమ్మల్ని రాము అని కానీ, RGV అని కానీ అంటారు. మరి మీ ఫ్రెండ్స్ మిమ్మల్ని రామ్ గోపాల్ అంటారేంటి?

జ. నాలో ఉన్న రాము, గోపాల్ ఇద్దరూ వాళ్ళకి తెలుసు కాబట్టి.

542. సెన్సార్ షిప్‌కి మీరెందుకు వ్యతిరేకం?

జ. మనల్ని ఎవరు పాలించాలో ఓటు ద్వారా ఎంపిక చేసుకొనే తెలివి మనకుందని మన రాజ్యాంగం ఒప్పుకున్నప్పుడు ఎలాంటి సినిమాలు చూడాలో తెలుసుకొనే జ్ఞానం మనకు ఉండదని ఎందుకు అనుకుంటుందన్న జ్ఞానం నాకులేదు కాబట్టి.

543. మీ హీరోయిన్స్ అందరూ అద్భుతమైన శరీరాకృతి కలిగి ఉంటారెందుకు?

జ. నాకలా ఇష్టం కాబట్టి.

544. మీరొక పిచ్చివాళ్ళ స్వర్గంలో బతుకుతున్నారు.

జ. మీలాంటి మేధావుల నరకం కన్నా ఇక్కడ చాలా బావుంది.

545. ప్రపంచంలో పవర్, సెక్సు, వోడ్కా లేకపోతే ఏం చేస్తారు?

జ. చస్తా.

546. సినిమా ఎలా తియ్యాలి అన్నదాని మీద ప్రతివాడికీ ఒక అభిప్రాయం ఉంటుంది.

జ. 'ఆగ్' రిలీజ్ అయ్యాక ఇప్పటికి లక్షా ముప్పై నాలుగు వేల ఏడొందల ఇరవై తొమ్మిది మంది ఆ సినిమాను నేను ఎలా తీసి ఉండాల్సిందో నాకు క్లాసు పీకారు, పీకుతూనే ఉన్నారు. లెక్కించడం మానేశా...

547. ఓ పక్క మీరు అయాన్ ర్యాండ్ అనే స్త్రీని గొప్ప మేధావి అని ఆరాధిస్తూ, మరో పక్క సెక్సీ అమ్మాయిలంటే పడి చస్తానంటారేంటి?

జ. అటు అయాన్ ర్యాండ్‌నీ, ఇటు సెక్సీ అమ్మాయిల్నీ ఆరాధించడానికి కారణం ఒకటే కాదు కాబట్టి.

548. మీరు సక్సెస్ ఫుల్ కాబట్టి ఇలా ఆలోచిస్తున్నారు.

జ. ఇలా ఆలోచిస్తాను కాబట్టి సక్సెస్ అయ్యాను.

549. స్త్రీలలో మీకు సెక్సీగా అనిపించేది ఏది?

జ. సెక్సీగా కనిపించనిది ఏది అని అడగండి...

550. మీ ప్రతి సినిమాలో మీ నిజ స్వరూపం కనబడుతుందా.

జ. అది కనబడకుండా కప్పి పెట్టడానికే నేను సినిమాలు తీసేది.

551. సంపద మనిషి ఆలోచనలోంచి వచ్చేదే కదా?

జ. ఆలోచన ఆచరణగా మారినప్పుడే సంపద సృష్టించబడుతుంది.

552. ప్రేక్షకులు నేపథ్య సంగీతం వింటూ సినిమా చూస్తారు కాబట్టి ఉద్వేగాలు ఫీల్ అవుతారు. షూటింగ్ సమయంలో ఆ ఫీల్ మీకు ఎలా వస్తుంది?

జ. షూటింగ్ స్టార్ట్ అవకముందే ఆ సంగీతం నా మనసులో ప్రోగటం మొదలవుతుంది.

553. సీక్వెల్స్ ఎందుకు తీస్తారు

జ. ఆ ఆనందం, ఆ అనుభూతి మరోసారి ఆస్వాదించటానికి. ఇంకా ఇంపార్టెంట్‌గా ఇంకొన్ని డబ్బులు కొట్టెయ్యడానికి.

554. మరణం అంటే భయపడతారా?

జ. మరణం అంటే భయం లేదు కానీ జీవితం అంటే చాలా మక్కువ ఎక్కువ.

555. మీ సినిమాల్లో మగ ఎక్స్‌ట్రా నటులు మొరటుగా, ఆడ ఎక్స్‌ట్రా నటీమణులు సెక్సీగా ఉంటారెందుకని?

జ. ఊహించండి.

556. సత్య క్యారెక్టర్ నాస్తికుడూ, తెలివైనవాడూ అయినప్పుడు పెళ్లిచేసుకోవాలని ఎందుకు అనుకుంటాడు?

జ. నాస్తికత్వం కన్నా, లాజిక్ కన్నా స్త్రీ చాలా శక్తిమంతమైనది, ఆకర్షణీయమైనది కనుక.

557. మీరెప్పుడూ చెబుతుంటారే "సినిమాలు తియ్యడానికి డబ్బు కావాలి, డబ్బుకోసం సినిమా తీయను" అని, ఆ డైలాగ్ సర్కార్ సినిమాలో "ప్లాంట్ కోసం డబ్బు కావాలి, డబ్బుకోసం ప్లాంట్ కాదు" అనే డైలాగ్ లాగే ఉంది.

జ. వీటికి మూలం ఫౌంటెన్ హెడ్‌లో రోర్క్ అనే మాట – "నేను నిర్మించాలి కాబట్టి క్లయింట్స్ కావాలి. క్లయింట్స్ కావాలి కాబట్టి నిర్మించను"

558. మీలాంటి తెలివైన వ్యక్తి చదువులో ఎందుకు వెనకబడ్డాడు?

జ. చదువు వల్ల నాకు ఒరిగేదేమీ లేదని తెలుసుకొనేంత తెలివైనవాణ్ని కాబట్టి చదువు పక్కన పెట్టి సినిమాలు చూస్తూ గడిపేశాను.

559. హోవార్డ్ రోర్క్ అంటే ఎంత ఇష్టం ఉన్నా మేమంతా పీటర్ కీటింగ్‌లు అయిపోతున్నాం అనిపిస్తోంది.

జ. **డోంట్ వర్రీ. హోవార్డ్ రోర్క్‌కీ పెళ్ళయి, కుటుంబం ఏర్పడి, పిల్లల గోల భరిస్తూ, ట్యాక్సులు కడుతూ, ట్రాఫిక్ జామ్స్‌లో ఇరుక్కుపోతూ ఉంటే అతనూ మనకంటే ఫాస్ట్‌గా పీటర్ కీటింగ్ అయిపోతాడు.**

560. అందరూ అనుకుంటున్నట్టు మీరు విచిత్రమైన మనిషేం కాదు. తీవ్రమైన భావజాలంతో సంక్లిష్ట వ్యక్తిత్వం ఉన్నవారు.

జ. **మీకో రహస్యం? మీరు కరెక్ట్.**

561. సెన్సార్ ఒప్పుకుంటే మీరు స్త్రీలని నగ్నంగా చూపుతారా?

జ. **అబ్బా.. ఎంత ఆశ!**

562. మీ హీరోలందరూ నాస్తికులుగానే ఉంటారెందుకు?

జ. **వాళ్ళు నా ప్రతి రూపాలు కాబట్టి.**

563. పొడవాటి కాళ్ళూ, ఎత్తైన స్తనాలూ, సన్నటి నడుమూ, ఇసుకతిన్నెల్లాంటి పిరుదులూ ఉంటే చెత్త సీన్ కూడా ఆసక్తికరంగా మారుతుందా?

జ. **అవన్నీ ఉంటే సీన్ ఎవడిక్కావాలండీ.**

564. మీరెన్ని మాటలు చెప్పినా చివరికి ప్రేక్షకుల్ని ఆనందింప జెయ్యాల్సిందే, డబ్బులు పెట్టిన వాళ్ళకు లాభాలు చూపించాల్సిందే.

జ. **ప్రేక్షకులకు ఏం కావాలో వాళ్ళు చూసుకుంటారు, నేనేం తీయాలో నేనే తీసుకుంటాను. లాభాల సంగతి డబ్బులు పెట్టిన వాళ్ళు ఆలోచించుకుంటారు. నీ సంగతి నువ్వు చూసుకో.**

565. ఇద్దరు తన్నుకుంటుంటే చూసే వాళ్ళకు ఎందుకు ఆనందం?

జ. **తన్నులు తింటున్నది తాము కాదు గనక.**

566. మీ పోస్టర్ డిజైన్లూ, ప్రోమోలూ అదిరిపోతాయి. కానీ సినిమాలే... అంత బాగుండవు!

జ. **మీరు మరీనూ... కనీసం అవన్నా బావుంటాయిగా.**

567. మీరో తెలివైన, చదువుకున్న గూండా.

జ. **సూపర్బ్‌గా చెప్పారు. మీ పరిశీలనా శక్తి అమోఘం. వెటకారం కాదు నిజంగానే మెచ్చుకుంటున్నా.**

568. మీరు కారణం లేకుండానే వ్యవస్థ మీద తిరగబడే వ్యక్తి.

జ. కారణాలు ఎందుకు లేవు? నా సొంత ప్రయోజనాలే నా కారణాలు.

569. మీకు అనుకరించడమే వచ్చు.

జ. ఇది తెలుసుకోగలిగారంటే మీరు గొప్ప క్రియేటివ్ పర్సన్ అయి ఉంటారు.

570. సర్కార్ లో చందర్ అనే పాత్ర ఎవర్నో కొట్టమని తన మనుషులకు చెప్పే సన్నివేశం చూస్తుంటే, ఒక కార్పెంటర్ తన మనుషులకు సూచనలు ఇస్తున్నట్లనిపించింది.

జ. ఆ పాత్రధారికి నేను ఇచ్చిన సూచన సరిగ్గా అదే.

571. ప్రేక్షకులకు షాట్ డివిజన్, కెమెరా యాంగిల్స్ లాంటి టెక్నికల్ విషయాలతో పనిలేదు. కథాగమనం తోనే వాళ్ళు కనెక్ట్ అవుతారు.

జ. తెర మీద కథ నడపడం అన్నది పదాలతో కథ చెప్పినంత ఈజీ కాదు. అలాగయితే ఖాళీ తెర ముందు రైటర్‌ని కుర్చీలో కుర్చో పెట్టి ఆడియెన్స్ కి కథ చెప్పించెయ్యచ్చుగా. సినిమాలు తీయడమెందుకు దండుగ.

572. మీరు హిచ్‌కాక్‌ని కాపీ కొడతారా?

జ. చాలామందితో పాటు ఆయన్ని కూడా కాపీ కొడతాను.

573. మనం పొరపాటు చేసినప్పుడు సారీ చెప్పడం తప్పు కాదు కదా?

జ. చెప్పొచ్చు. కానీ మనం చేసింది రైటే అని మొండిగా వాదిస్తే అవతల వ్యక్తి మన నెత్తిన ఎక్కి కూర్చోకుండా ఉంటాడు.

574. ప్రతీసారి అడ్డంగా వెళితే పనికిరాదు.

జ. నిలువుగా వెళితే ఎప్పుడూ పనికిరాదు.

575. మీరు సైకో నా?

జ. సైకోలకు సైకో.

576. ఐ లవ్ యూ అన్నంత సులభంగా "ఐ లస్ట్ యూ" అని చెప్పగలిగే ధైర్యం ఉందా మీకు?

జ. చాలా తీవ్రమైన ఉద్వేగంతో ఓ అమ్మాయికి "ఐ లస్ట్ యూ" చెప్పాను. నా కోరికలో ఉన్న నిజాయితీకి మెచ్చి తను నన్ను లవ్ చెయ్యడం మొదలెట్టింది.

577. ఆసక్తి కరమైనది ఏదైనా చూపాల్సి వస్తే మాత్రమే సినిమా తీయండి.

జ. నేనెప్పుడూ చేసేది అదే, కానీ ప్రేక్షకులే చాలా సార్లు చూడటానికి ఆసక్తి చూపించ లేదు.

578. మీరు త్వరత్వరగా సినిమాలు తీయడానికి కారణం మీ అసహనమా?

జ. **కాదు. తీయాలనుకున్న సినిమాలన్నీ తీయకుండానే పోతానేమో అనే భయం.**

579. "శివ"కి మీకు ఎంత రెమ్యునరేషన్?

జ. **ఇప్పటి వరకూ ఎంత సంపాదించానో, ఇకపై ఎంత సంపాదిస్తానో, అంత.**

580. మీ పేరులో రెండు విరుద్ధ స్వభావాలున్న రాముడు, కృష్ణుడు ఉన్నారు.

జ. **బహుశా అందువల్లేనేమో నా బుర్రంతా ఎప్పుడూ గందరగోళంగా ఉంటుంది.**

581. మీకూ సత్యేంద్రకీ జరిగిన ఒక సంభాషణ చెబుతారా?

జ. **ఒక రోజు నేను బయిటకి వెళుతుండగా సత్యేంద్ర తన చెప్పులు నాకు ఇచ్చి తెగిన స్ట్రాప్‌ని కుట్టించుకు రమ్మన్నాడు. నేను ఫీలయ్యా. దానికి తను "నేను నా పెట్టో, వాచీయో ఇచ్చి రిపేర్ చేయించమని ఉంటే నువ్వింత అఫెండ్ అయ్యే వాడివి కాదు. మన చేతులకన్నా, తల కన్నా మన కాళ్ళు తక్కువని నమ్మేలా ఈ సమాజం నిన్ను ప్రోగ్రామింగ్ చేసింది. ఒక వేళ చెప్పులకు ఉన్న మట్టి గురించి నువ్వు ఫీలవుతుంటే - మన శరీరంలో అంత కంటే చాలా ఎక్కువ మట్టి ఉంటుందని నువ్వు తెలుసుకోవాలి. అయినా మట్టి అంటే ఏమిటి? ఈ ప్రపంచం లో ఉన్నవన్నీ 102 మూలకాల కలయిక వల్ల ఏర్పడ్డవే కదా. విడి విడిగా చూస్తే ఏ ఒక్క మూలకాన్నీ నువ్వు హీనంగా భావించవు. కానీ వాటి వల్ల ఏర్పడ్డ పదార్థాల కలయికలు కొన్నిటిని మాత్రం నువ్వు అసహ్యించు కుంటున్నావు..." పదిహేను నిముషాలు సాగిన ఈ టైపు సుదీర్ఘ ఉపన్యాసం విన్నాక నేను, తన చెప్పుల్ని నెత్తి మీద పెట్టుకుని రిపేర్ కోసం తీసుకెళ్లాను.**

582. సత్యేంద్ర లాంటి వాళ్ళు జీవితంలో దారుణంగా విఫలమవుతారు.

జ. **సత్యేంద్ర లాంటి వాళ్ళ విషయంలో గెలవడం, ఓడిపోవడం అనే పదాలు ప్రయోగించకూడదు. ఇతరుల మెప్పుకోసం చూసే మనలాంటి వాళ్ళకే గెలుపు ఓటమి అనేవి ముఖ్యం. సత్యేంద్ర దృష్టిలో అవి హాస్యాస్పదంగా కనబడతాయి.**

"ఆ కొండ మీద చెట్టు ఒంటరిగా నిలబడి ఉంది. మనుషుల్నీ పశువుల్నీ దాటి అది ఎంత ఎత్తుకు ఎదిగిందంటే ఇప్పుడు అది మాట్లాడితే వినేంత ఎత్తు ఎవరూ లేరు" - నీషే.

583. ప్రయోజనం లేని మేధ, సామర్థ్యం, తెలివితేటలు నిరుపయోగమే కదా?

జ. **ప్రయోజనం ఎవరికి అన్నదే ప్రశ్న. "కొంత మంది వ్యక్తులు ఒక టన్నెల్‌లో ప్రయాణిస్తున్నారనుకుందాం. దాని చివరికి చేరడమే వాళ్ళ లక్ష్యమయితే ముందు ఎవరు చేరారో వాళ్ళే గెలిచిన వాళ్లవుతారు. కానీ వాళ్ళంతా వేరు వేరు టన్నెల్స్‌లో**

వేరు వేరు లక్ష్యాలతో, వేరు వేరు సామర్థ్యాలతో నడుస్తున్నట్టయితే ఎవరు బెటరో ఎలా లెక్క కట్టగలం?" కొందరు ఎప్పుడూ ఏ టన్నెల్‌లోనూ నడిచే ప్రయత్నమే చేయరు. వాళ్ళకి ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలనే తపనే తప్ప గెలవాలనే కోరిక ఉండదు. సత్యేంద్ర ఆ కోవకి చెందినవాడు.

584. నిరుత్సాహం దరిచేరకుండా సంతోషంగా ఎలా ఉంటున్నారు?

జ. ఇలాగే జరగాలి అని కోరుకోకుండా జరిగిన, జరుగుతున్న ప్రతి క్షణాన్నీ జుర్రుకుంటూ...

585. ఈ ప్రపంచంలో ఉన్నదంతా తెలుసుకోవడానికి ఒక్క జీవిత కాలం సరిపోతుందా?

జ. అన్నీ తెలుసుకోవడం ముఖ్యం కాదు. తెలుసుకోవాలని అనిపించిన దాన్ని తెలుసుకోవటం ముఖ్యం. "జ్ఞాన సముపార్జన ముఖ్యం కాదు. మీకో లక్ష్యం అంటూ ఉంటే, ఆ లక్ష్యాన్ని చేరడానికి అవసరమైన జ్ఞానాన్ని సాధించటం ముఖ్యం" – అయాన్ ర్యాండ్

586. సాధారణ కెమెరా యాంగిల్స్ మీద బోరు కొట్టడం వల్లే మీరు విచిత్రమైన కెమెరా యాంగిల్స్ ఉపయోగిస్తారా?

జ. ఆ సందర్భాన్ని బట్టి ఆ షాట్‌ని ఎలా చూడాలనుకుంటున్నాను అన్న దాన్ని బట్టి మీరన్న 'విచిత్రమైన'యాంగిల్స్ ఉపయోగిస్తాను. మనం చూసే కోణం వల్ల, చూస్తున్న వస్తువుకి నేను ఫీలవుతున్న ఒక భావం ఏర్పడుతుంది.

587. దేవుడు మన చుట్టూ ఉండే గాలి లాంటి వాడు. ఫ్యాన్ వేసినప్పుడే గాలి ఉందని మనకు తెలుస్తుంది.

జ. నేను ఎయిర్ కండీషనర్ వాడుతా.

588. డైరెక్టర్ కాకపోయుంటే RGV ఎలా ఉండే వాడు?

జ. కలలు కంటూ, చేసే ప్రతి పనిలో ఫెయిల్యూర్‌గా.

589. తెలివి తేటల్ని మీరెలా నిర్వచిస్తారు?

జ. జ్ఞానం అంటే సత్యాలను తెలుసుకోవడం, తెలివి అంటే ఆ సత్యాలను అర్థం చేసుకోవడం, మేధ అంటే ఆ సత్యాలను జీవితం లో ఉపయోగించుకోవడం. ఉదాహరణకు: గ్లాసులో ఐస్ కోల్డ్ వాటర్ పోస్తే దాని చుట్టూ మంచు బిందువులు ఏర్పడుతాయి. వాతావరణంలో ఉన్న నీటి ఆవిరి ఘనీభవించడం వల్ల ఇలా జరుగుతుందని మీరు వివరించ వచ్చు. అయితే అలా వివరించడానికి ముందు మీకు వాతావరణం లో నీటి ఆవిరి ఉంటుందనీ, తక్కువ ఉష్ణోగ్రతల వద్ద అది

ఘనీభవిస్తుందనే 'జ్ఞానం' ఉండాలి. ఆ జ్ఞానానికి మేధ తోడయితే మీరు రెఫ్రిజిరేటర్లూ, ఎయిర్ కండీషనర్లూ కనిపెట్టగలరు. ఇంకా సింపుల్‌గా చెప్పాలంటే 2+3 =5 అని మీరు చెప్పాలంటే, మీకు ముందుగా 2 కీ, 3 కీ, 5 కీ ఎంత విలువ ఉందో తెలిసి ఉండాలి.

590. నేను వైద్య రంగాన్ని వదిలేసి సినిమాల్లోకి వెళ్ళడం బుద్ధితక్కువ పని అని మా నాన్నగారు అంటున్నారు.

జ. మా నాన్నగారూ అలాగే అనుకున్నారు. ఇప్పుడు చూడండి ఎవరి మాట నిజమయిందో! అదలా ఉంచితే, నాన్నలు అనే మాటలు కూడా నిజమయ్యే అవకాశం ఉంటుంది. కానీ -ఎదురయ్యే వ్యతిరేక పరిణామాల్ని ఎదుర్కొంటూ, మన జీవితాన్ని మనం అనుకున్నట్టుగా బతకడమే బెటర్.

591. మీ వేదాంతాలతో ఒక సినిమా తీయొచ్చుగా?

జ. వేదాంతం ఆలోచనలకే పరిమితం.

592. "కంపెనీ" సినిమాలో మాలిక్ పాత్ర సయీద్‌నీ, అనీస్ నీ కారులో కాల్చేసే సీన్ ఎలా సృష్టించారు?

జ. డాక్టర్లు ఇంజక్షన్ ఇచ్చే విధానం నుంచి ఆ ఆలోచన వచ్చింది. సయీద్ చేతిని మాలిక్ పక్కకి తొలగించి గుండెలకు తుపాకీ అంటించి కాల్చే ఆ సీన్ చాలా 'క్లినికల్'గా ఉండాలన్నది నా ఉద్దేశ్యం.

593. మీ ఫ్యాక్టరీ ఎక్కడ ?

జ. నేనెక్కడుంటే అక్కడే.

594. పెళ్ళంటే నమ్మకం లేనప్పుడు అసలు పెళ్లెందుకు చేసుకున్నారు?

జ. బుద్ధి తక్కువై. అయితే, ఆ బుద్ధి తక్కువ పని చేయకపోతే నాకు 'బుద్ధి'వచ్చేదే కాదుగా!

595. "సర్కార్" సినిమాలో అనుపమ్ ఖేర్ నుదుటిన బుల్లెట్ మార్క్ చూపించి, ఆ తర్వాత వెనక ఉన్న వ్యక్తి మీదికి ప్రేక్షకుల అటెన్షన్ డైవర్ట్ చేసే సీన్ చాలా తెలివిగా చేశారు.

జ. నాకు తెలివిలేదని ఎప్పుడయినా చెప్పానా?

596. పైరసీ గురించి మీ అభిప్రాయం ఏమిటి? దాన్ని నిర్మూలించాలనుకుంటున్నారా?

జ. నేను కూడా అక్కణ్ణుంచీ, ఇక్కణ్ణుంచీ ఆలోచనలను పైరేట్ చేసి బతికే వాణ్ణి గనుక పైరసీతో పోరాడే నైతిక అర్హత నాకు లేదు.

597. ఊహా ప్రపంచం, నిజ ప్రపంచం – ఈ రెంటిలో ఏది ఉత్తమం?

జ. **ఊహా ప్రపంచమే నిజం. నిజ ప్రపంచం అనేది లేదు.**

598. మీకు పద్మ భూషణ్, పద్మశ్రీ లాంటి అవార్డులు రాలేదేంటి?

జ. **నాకు పద్మ చాలు.**

599. ఎవరయినా అమ్మాయికి ప్రపోజ్ చేశారా?

జ. **సుమారుగా 142 సార్లు ప్రపోజ్ చేశాను. 163 సార్లు రిజక్ట్ కూడా చెయ్యబడ్డాను. అంటే నేను ప్రపోజ్ చెయ్యకముందే 21 మంది నిరాకరించేశారు!**

600. నీషే సిద్ధాంతాలను అయాన్ ర్యాండ్ నిరాకరించింది కదా. వాళ్ళిద్దరూ మీ అభిమాన వేదాంతులు అవడం ఎలా సాధ్యం?

జ. **ఎవరి నుంచయినా, దేని నుంచయినా నాకు కావాల్సిందేమిటో నేను తీసుకుంటానే తప్ప ఏ ఒక్కరితోనో ఆగిపోను. అందరినుంచీ గ్రహించిన వాటికి నా సొంత భావాలు కలిపి నా బ్రాండ్ మసాలా మిక్స్ ఫిలాసఫీ తయారు చేసుకున్నాను.**

601. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ చేసేటప్పుడు మీరు ఇన్వాల్వ్ అవుతారా, లేక నిర్ణయాలన్నీ మ్యూజిక్ డైరెక్టర్ కే వదులుతారా?

జ. **బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ విషయంలో నేనెప్పుడూ ఫోర్ గ్రౌండ్ లోనే ఉంటాను. మ్యూజిక్ డైరెక్టర్స్ బ్యాక్ గ్రౌండ్‌లోకి నెట్టేస్తుంటాను.**

602. మీ మొహంలో ఎప్పుడూ భావోద్వేగాలు చూడలేదు.

జ. **కావాలనుకున్నప్పుడు కావాల్సిన వాళ్ళ ముందే కావాలని నా భావోద్వేగాలు బయట పెడతాను.**

603. మీరు మీ లక్ష్యం సాధించారని అనుకుంటున్నారా?

జ. **లక్షల సార్లు సాధించాను. ఈ రోజే పది సార్లు సాధించాను. నాకెప్పుడూ తక్కువ టైమ్‌లో సునాయాసంగా సాధించగలిగే లక్ష్యాలు ఉంటాయి. ఈ రోజు నా గోల్ 50 పుష్ అప్‌లు తీయడం.**

604. ఏమీ తెలియక పోవడమే పరమానందం.

జ. **ఏమీ తెలియని వాళ్ళకే అది వర్తిస్తుంది.**

605. ప్రేమను ఎలా హ్యాండిల్ చేస్తారు?

జ. **నా చేతుల్లో.**

606. ఈ రాతల పరమార్థం ఏమిటి?

జ. నా ఆలోచనలని, భావాలని ధంకా బజాయించి చెప్పడం.

607. దేవుణ్ణి నిరాకరించడం వల్ల మీ ఆత్మలోని డొల్లతనమే బయటపడింది.

జ. ఓకే, నిండు ఆత్మ గారూ, ఈ సారి మీరు గుడికి వెళ్లినప్పుడు నా మీద కంప్లయింట్ ఫైల్ చెయ్యండి. అలాగే మీరు స్వర్గానికి వెళ్లే దారిలో నరకానికి వచ్చి నాకు హలో చెప్పండి.

608. మీ సినిమాలు సక్సెస్ అయినపుడు ప్రేక్షకులకు కృతజ్ఞతలు చెప్పాలి కదా?

జ. వాళ్ళకు నచ్చిన సినిమా తీసినందుకు వాళ్ళే నాకు థ్యాంక్స్ చెప్పాలి.

609. మీరు చాలా కష్టపడి చేసినా ఫలితం దక్కక పోతే ఎలా ఫీలవుతారు?

జ. నేనసలు కష్ట పడను. ప్రతి క్షణం, ప్రతి పనీ ఎంజాయ్ చేస్తాను. ఇష్టపడి చేసేది ఏదయినా ఆనందాన్నే ఇస్తుంది. అందులో కష్టం ఉండదు.

610. మీరు నాస్తికులు కదా, సర్కార్‌లో మీ హీరో సుభాష్ నాగ్రే దేవుణ్ణి పూజిస్తుంటాడేంటి?

జ. జనాల్లో మెజారిటీ భక్తులు కాబట్టి వాళ్ళూ తమ హీరో దేవుణ్ణి పూజిస్తుంటే చూడాలనుకుంటారు. అందుకే నేను నాస్తికుడిని అయినా, దేవుడిని సొమ్ముచేసుకుంటున్నా. ఇప్పుడు చెప్పండి, ఎవరు గొప్పవాళ్ళు?

611. ఈ ప్రపంచంలో మీకు బాగా నచ్చే ప్రదేశం?

జ. నేను ఎక్కడుంటే అదే.

612. మీరు నీషేనే ఎందుకు కోట్ చేస్తారు?

జ. ఆయన చెప్పింది అర్థం అయ్యీ - అవనట్టుగా ఉంటాయి. నా అవసరం ప్రకారం వాటిని అటూ, ఇటూ తిప్పుకునే సౌలభ్యం ఉంటుంది కాబట్టి.

613. మీరు 3 గంటలు మాత్రమే నిద్ర పోతారని విన్నాను.

జ. కాదు... 3న్నర గంటలు.

614. 99% మంది పెళ్లెందుకు చేసుకుంటారు.

జ. తెలివైన వాళ్ళు 1% మంది మాత్రమే కాబట్టి.

615. మిమ్మల్ని జనం 'వింత మనిషి' అంటుంటే మీకెలా అనిపిస్తుంది?

జ. నేను నా ఆలోచనల్లో, చర్యల్లో ఒంటరిని. అందుకే నేను వింతగా కనబడడంలో ఆశ్చర్యం లేదు.

616. ఫలితాలు ఎలా ఉంటాయి అని ఆలోచించకుండా మీరు నిర్ణయాలు తీసుకోవడం వల్లే మీరిన్ని ఫ్లాప్‌లు తీశారు కదా!

జ. హిట్‌లు తీయడానికి కూడా అదే కారణం.

617. మీరు జీవితంలో ఇంత విజయం సాధించకపోయినా మీ స్వభావం ఇలాగే ఉండేదా?

జ. ఈ స్వభావం ఉండడం వల్లే నేనింత విజయవంతం కాగలిగాను.

618. మీది ద్వంద్వ ప్రవృత్తి.

జ. నాది ద్వంద్వ ప్రవృత్తి కాదు బహు ప్రవృత్తి.

619. నాకిప్పుడు 22 ఏళ్ళు. నా జీవితంలో నాకు తెలిసిన వ్యక్తులందరిలో మీరూ, రోర్క్, నీషేలే చాలా ఆసక్తికరమైనవారు.

జ. అంటే– ఇంత వరకూ ఒక్క అందమైన అమ్మాయిని కూడా కలవలేదా?

620. మీ రాతలకి బానిసనయి పోయా.

జ. వోడ్కా, సెక్సు కూడా ట్రై చేసి చూడండి.

621. మీరు సక్సెస్ అవ్వాలని రాసి పెట్టి ఉంది.

జ. విధి, అదృష్టం, రాసి పెట్టి ఉంది అనే పదాలు వాడే వాళ్ళంతా జీవితంలో ఫెయిలయ్యే వాళ్ళే అని నా నమ్మకం. అయినా దేవుడు, దెయ్యం, విధి, జ్యోతిష్యం, సంఖ్యా శాస్త్రం లాంటి మానవాతీత విషయాలు ఉండవచ్చేమో గానీ, అవి మన కంట్రోలులో ఉండేవి కావు. మన చేతిలో లేని విషయాల గురించి ఆలోచించడం మానేసి, మనం చెయ్యగలిగిన వాటిపై మన కృషి, మన దృష్టి పెడితే మంచిది.

622. మీ నాన్నగారు కూడా మీలాగే దేన్నీ లెక్కచెయ్యని వ్యక్తి అయి ఉంటే మీ పరిస్థితి ఎలా ఉండేది?

జ. నాలాంటి స్వార్థపరుడికోసం ఆయనలా టైమ్ వేస్ట్ చేసినందుకు, నేను కూడా అదే పొరపాటు చెయ్యలా.

623. చదువు మీద ఇంట్రెస్ట్ లేనప్పుడు అసలు కాలేజ్‌లో ఎందుకు చేరారు?

జ. అప్పుడయినా, ఇప్పుడయినా ఒక ధ్యేయం కోసం అని నేనెప్పుడూ ఏదీ చెయ్యలేదు. మా అమ్మా నాన్నలు ఆ టైమ్‌లో నన్ను ఇంజనీరింగ్ చెయ్యమన్నారు. నాకు కొత్త వ్యక్తుల్ని, కొత్త వాతావరణాన్ని చూసే అవకాశం వస్తుందనిపించి ఓకే అన్నా. కాలేజీ రోజుల్లో నేను పరిశీలించిన వ్యక్తిత్వాల్ని ఇప్పటికీ సినిమాల్లో వాడుతున్నాను. అక్కడ రైఫిల్ అనే అమ్మాయి నన్ను సెక్సువల్‌గా ఉద్రేక పరిస్తే,

సత్య అనే అమ్మాయి నా హృద్వేగాల్ని రెచ్చగొట్టింది. అలాగే సత్యేంద్ర అనే నా ఫ్రెండ్ నా మేధస్సుని ఉత్తేజ పరిచాడు.

624. మీమీద అత్యంత ప్రభావం చూపిన పుస్తకం

జ. అయాన్ ర్యాండ్ రాసిన "ఫౌంటెన్ హెడ్"

625. మిమ్మల్నీ మీ రాతల్నీ చాలామంది విమర్శిస్తారెందుకు?

జ. ఏనుగులు వెళ్తూంటే కుక్కలు మొరుగుతూండటం సహజం.

626. విమర్శలు మీమీద ప్రభావం చూపుతాయా?

జ. కుట్టినప్పుడు చిరాకు పడతాను. కరిచినప్పుడు కంగారుపడతాను. మొరిగితే మాత్రం పట్టించుకోను.

627. ఆత్మ న్యూనతా భావంతో బాధ పడే మీలాంటి వారికే శక్తి సామర్థ్యాల మీద అతి ఆసక్తి ఉంటుంది

జ. బలహీనులైన మీలాంటి వాళ్ళే శక్తి సామర్థ్యాలను బలహీనంగా విమర్శిస్తారు

628. స్వతంత్రంగా ఏదైనా చెయ్యగలిగిన వారే తమ కలలను నిజం చేసుకోగలుగుతారు

జ. ఒంటె లాగ మనిషి తనకు తానే మోకరిల్లి అర్థం లేని, అవసరం లేని బరువుల్ని తన వీపు మీద ఎక్కించుకుని జీవితం భారమయిపోయిందని ఏడుస్తూంటాడు. వాయు వేగంతో పరుగెత్తే సామర్థ్యం ఆ బరువుల్ని వదిలేస్తేనే వస్తుందని మనిషి గుర్తించాలి - ఫ్రీడ్రిక్ నీషే

ఒకవేళ ఆ బరువుని వదిలించుకొనే అవకాశం లేనట్టయితే దాన్ని మోయడం లోనూ ఆనందాన్ని అనుభవించే మనస్తత్వాన్ని ఆపాదించుకోవాలి కానీ... మోస్తున్న బరువుగురించి ఏడవడం కన్నా చావటం మేలు - RGV

629. మీరు ఒక స్త్రీ నుంచి అందుకున్న అత్యుత్తమమైన కితాబు?

జ. నా కళ్ళలో ఉన్న తీవ్రతకు తను శారీరికంగా స్పందించానని చెప్పింది.

630. "సత్యా"లో చందర్‌నీ, భీకూనీ చంపే సీన్స్ ఎందుకంత హఠాత్తుగా వచ్చేస్తాయి?

జ. నిజ జీవితంలో చావు చెప్పిరాదు కాబట్టి.

631. సినిమాల్లో మీరు విప్లవాత్మకమైన మార్పులు తేవచ్చుగా.

జ. నేనేదో సరదాగా సినిమాలు తీసుకుంటున్నా. మార్పులు తేవాలనే పెద్ద పెద్ద ఆశయాలతో సినిమా తీస్తే బాక్సాఫీస్ నా మీద విప్లవం తీసుకొస్తుంది.

632. "నేను జీవితపు అత్యున్నత శిఖరాల మీద ఉన్నా" అని ఎప్పుడూ చెప్పుకుంటారేంటి?

జ. నేను అలా అన్నానో లేదో తెలియదు గానీ, మీరు మాత్రం పాతాళంలో ఉన్నట్టున్నారు.

633. మీరు తప్పూ ఒప్పుల్లో దేని పక్షానా నిలబడక పోవడానికి కారణం భయమా?

జ. కాదు. జ్ఞానం.

634. మీ రాతలు కొంతమందిలో మంచి ప్రభావాన్ని, మరికొంత మందిలో చెడు ప్రభావాన్నీ చూపుతున్నాయి తెలుసా?

జ. ప్రపంచంలో దేని ప్రభావం అయినా దేని మీదైనా ఇలాగే ఉంటుంది.

635. మనకు ప్రియమైన వారి ప్రేమకు మించిన సంతృప్తి ఈ ప్రపంచంలో మరోటి లేదు.

జ. అది ఆ ప్రియమైన వారిని బట్టి ఉంటుంది. చాలాసార్లు మనకి ప్రియమైన వారే పరమచిరాకు తెప్పిస్తారు.

636. ఈ సమాజం విధించే కట్టుబాట్లను అధిగమించడం ఎలా?

జ. మన జీవితం ఎప్పుడూ మనం చెయ్యాలనుకున్న దానికీ, చేయాల్సి వచ్చేదానికీ మధ్య జరిగే స్పర్థల మధ్య గడచిపోతుంది. ఎవరి కోసం రాజీ పడకుండా మనం చెయ్యాలనుకున్నదాన్నే చేసెయ్యడం ద్వారా ఈ సంకటం నుంచి బయట పడొచ్చు. అలా చెయ్యడం తప్పు అనే గిల్టీ ఫీలింగ్ తప్పు అని కూడా అర్థం చేసుకోవాలి.

637. కరకుగా, వ్యంగ్యంగా ఉండే మీ రాతలని కొందరు ద్వేషిస్తారు. మరి కొందరు విపరీతంగా ప్రేమిస్తారు.

జ. ప్రేమించినా, ద్వేషించినా నాకేం అభ్యంతరం లేదు. కాని నేను బోర్ కొట్టాను అంటేనే బాధపడతా.

638. ఒకసారి విడాకులు తీసుకున్నాక మళ్ళీ పెళ్లిచేసుకోవాలనుకొనే వారిని మీరేమంటారు?

జ. డబుల్ దద్దమ్మ.

639. మీ రాతలు ఇంత సరదాగా ఉంటాయి... కానీ టీవీలో ఎందుకంత సీరియస్‌గా కనపడతారు.

జ. సందర్భాన్ని బట్టే నేను స్పందిస్తా. అలాగే చానెల్ వాళ్ళు నేను మాట్లాడిన దాంట్లో వాళ్ళకు కావాల్సినవే ఎడిట్ చేసి వేస్తారు. ఇక్కడ అదేం ఉండదు గనక నా ఇష్టం వచ్చినట్టు రాసింది మీ ఇష్టం వచ్చినట్లు కనిపిస్తుంది.

640. రాము, రామ్ గోపాల్ వర్మ, RGV - ఈ మూడిట్లో తేడా ఏమిటి?

జ. రామూ నిజం. రాంగోపాల్ వర్మ ఒక అభిప్రాయం. రాయడానికి స్పేసు కలిసివస్తుందనీ, అనటానికి టైమ్ కలిసొస్తుందనీ మీడియా వాళ్ళు RGV అంటారు.

641. మీరు అయాన్ ర్యాండ్‌నీ, నీషేనీ చదవక పోతే మీకింత తెలివి వచ్చేది కాదేమో?

జ. నేను మొత్తం అయాన్ ర్యాండ్ నుంచీ నీషే నుంచీ నేర్చుకొన్నాను అన్నది నిజం కాదు. ఇతరుల ద్వారా జ్ఞానం వస్తుందే తప్ప తెలివితేటలు రావు. తెలుసుకోవాలనే కోరిక ఉన్నవాళ్లందరికీ జ్ఞానం అందుబాటులోనే ఉంటుంది. కానీ చాలా మంది అజ్ఞానాంధకారం లోనే ఉండడానికి ఇష్టపడతారు తప్ప, తమలో జ్ఞాన జ్యోతి వెలిగించుకోరు. జ్ఞానాన్ని వెలుతురుతోనూ, అజ్ఞానాన్ని అంధకారంతోనూ పోల్చే సందర్భంలో నీషే ఇలా అన్నాడు..

'నేనే గనక చీకటినయితే, కాంతి అనే స్తనాల నుంచి జ్ఞానాన్ని మహా ఆత్రంగా జుర్రుకుంటా'

642. మీకు పొగడ్తలు ఇష్టమా?

జ. నేనేమిటో నాకు కచ్చితంగా తెలుసు కాబట్టి ఎవరన్నా నన్ను పొగిడినా, తిట్టినా పట్టించుకోను. నాకు లేని గొప్పని ఆపాదించే వాడు ఎంత మూర్ఖుడో, నేను చేయని దానికి విమర్శించే వాడూ అంతే మూర్ఖుడు.

643. మీ సమాధానాలు కొన్ని మరీ చిన్నపిల్లలు ఉడుక్కున్నట్టు ఉంటున్నాయి.

జ. మీరన్నది నిజమే కావచ్చు. ఎందుకంటే చిన్న పిల్లాడిగా ఉన్నప్పటి చురుకుదనాన్నీ, ఆనందాన్నీ నేనింకా వదులుకోలేదు..వదులుకోను

644. మీరూ, మీ సినిమాలూ, మీ హ్యూమరూ - ఇవన్నీ డార్క్‌గానే ఉంటాయి గనక మీకు నచ్చే స్త్రీలు కూడా అదే రంగులో ఉంటారా?

జ. నో. వాళ్ళలో అన్ని రంగుల వాళ్ళూ నాకిష్టమే!

645. మీలో ఒక ఆలోచనాపరుడూ, చదువుకున్నవాడూ, నేరస్తుడు, మొరటు వాడూ ఉన్నారు.

జ. స్వార్థపరుడూ, అహంభావి, మహా ఉన్మాది, చంచలుడూ, నిజాయితీ లేనివాడు కూడా ఉన్నాడు.

646. ఐ హేట్ యూ.

జ. ప్రేమించడం ఎంత మూర్ఖత్వమో, ద్వేషించడం అంతకంటే ఎక్కువ మూర్ఖత్వం. ప్రేమించటంలో అప్పుడప్పుడూ సెక్సయినా వస్తుంది. ద్వేషించటంలో అది కూడా రాదు.

647. మీరు మీ జీవితంలో అన్నీ సక్సెస్ ఫుల్ నిర్ణయాలే తీసుకున్నారనడం సరి కాదు.

జ. అలా ఎప్పుడూ అనలేదే! ఫలితాల గురించి ఆలోచించకుండా నిర్ణయాలు తీసుకుంటాను అని మాత్రమే చెప్పాను.

648. సినిమాలు, సెక్సు- ఈ రెంటిలో ఒకటే ఎంచుకోవాల్సి వస్తే?

జ. నా సినిమాలయినా, నా స్త్రీలయినా, నా రాతలయినా నేను చేసేది ఒకటే.

గమనిక: పై స్టేట్‌మెంట్ లో నిగూఢమైన వేదాంతం ఉండొచ్చు లేదా నాకు చాలా అలవాటైన ప్రేలాపన కూడా ఉండి ఉండవచ్చు.

649. కుర్రాళ్ళు మీ రాతలు నమ్మి పాడవ కూడదని కోరుకుంటున్నా.

జ. మీరన్న 'పాడు' అవ్వాలని నేను కోరుకుంటున్నా. అప్పుడే వాళ్ళు బాగుపడతారు. అయినా ఎవరూ ఎవర్నీ, దేన్నీ నమ్మరు. వాళ్ళ నమ్మకాలు వాళ్ళ జీవన ప్రయాణంలోని దశల్ని బట్టి దిశల్ని మార్చుకుంటూ పోతుంటాయి. "నా నుంచి నిన్ను నువ్వు కనుక్కోలేవు. నిన్ను నువ్వు కనుక్కున్నాకే నన్ను వదిలేసి నువ్వు నువ్వుగా ఉండగలవు" - నీషే

650. నైతిక జ్ఞానం వదిలేస్తే దైవత్వం వస్తుందని మీరు అంటున్నారు.

జ. నైతిక జ్ఞానం అనేది మన దగ్గర ఉన్న దానికీ, మనం కోరుకొనే దానికీ మధ్య గోడలా నిలబడి ఉంటుంది. దాన్ని తొలగిస్తే జంతువుల్లా స్వచ్ఛంగా బ్రతకొచ్చు. ఆ స్వచ్ఛతే దైవత్వం.

651. మీరింత వరకూ ఎంతమంది స్త్రీలతో గడిపారు.

జ. సంఖ్య చెప్తే నీ గుండె ఢామ్మంటుంది.

652. మీరు సినిమాలు తీస్తూనే ఉండడానికి ప్రేరేపించే శక్తి ఏమిటి?

జ. మీ మెదళ్ళలో ఇంకిపోవాలనే తీవ్రమైన వాంఛ.

653. ఇదేం నేరంకాదు గానీ, ప్రపంచమంతా మీ చుట్టూ తిరగాలని మీరు కోరుకుంటారు.

జ. అఫ్ కోర్స్, తిప్పుకుంటాను కూడా. నేను, నా చర్యల వల్ల కాదు గానీ, నా ఆలోచనల వల్ల నేను ఒక తీవ్ర అసాంఘిక శక్తిని. నా వల్ల నా చుట్టూ ఉన్న వాళ్ళకే కాదు, నాకు కూడా ప్రమాదం. అయినా ప్రమాదాలకు ఎదురీదడం నాకుగా నేను ఏర్పరుచుకున్న నా జీవన విధానం.

654. నీషే నీ, అయాన్ ర్యాండ్ నీ చదవక ముందు కూడా మీరింత మానసిక దృఢత్వంతో ఉండే వారా?

జ. మానసిక ధారుఢ్యం ఉంది కాబట్టే వాళ్ళని చదివి అర్థం చేసుకోగలిగా. "అనుభవం నేర్పని పాఠం బుర్రకెక్కదు. ఎక్కిందంటే అది కచ్చితంగా అనుభవం ద్వారా నువ్వు ముందే తెలుసుకున్నది" – నీషే

655. మీ దృక్కోణాల కన్నా మీ కళ్లే చాలా సెక్సీ గా ఉంటాయి.

జ. మీరంటున్న ఆ సెక్సీదనం నా దృక్కోణాల వల్లే నా కళ్లలోకి వచ్చింది.

656. మీ సినిమాలు నడిచే స్పీడుని మీరు ఎలా నిర్ణయిస్తారు?

జ. ఆ సినిమాని నేను ఏ స్పీడులో చూడాలనుకుంటాను... అనే దాన్ని బట్టి.

657. మిమ్మల్ని మీరు ఎలా వర్ణించుకుంటారు?

జ. నేనొక హార్డ్ కోర్ బ్లూ ఫిలిం లాంటి వాణ్ణి. మీరు దాన్ని ద్వేషించవచ్చు, చీప్ అనుకోవచ్చు, ఇష్టపడొచ్చు కాని ఎలా అనుకున్నా దగ్గరుంటే చూడకుండా మాత్రం ఉండలేరు.

658. హాయ్ రామూ, ఈ వారాంతం ఎలా గడిపారు?

జ. ఇలాంటి పోచుకోలు కబుర్లు నాకు ఇష్టం ఉండదు.

659. శక్తి అంటే ఏమిటి?

జ. శారీరకంగా, మానసికంగా, మేధా పరంగా మనకు కావాల్సింది సాధించి పెట్టే సాధనం.

660. మీరు చాలా మేధావులు, సృజనాత్మకత ఉన్నవారు, జీవితంలో గెలిచిన వారు, పైగా రొమాంటిక్ హృదయం ఉన్నవారు. అయినా మిమ్మల్నెవరూ చేపట్ట లేదేమిటి?

జ. చాలా సార్లు చేపట్టబడ్డాను, నా నిజం తెలిసాక వదిలెయ్యబడ్డాను కూడా.

661. మీరు వీడియో షాపు నడుపుతుండగా వీడియో క్యాసెట్లు పైరసీ చేసేవారని నా ఫ్రెండు మిమ్మల్ని విమర్శిస్తుంటాడు.

జ. నా మిగతా నేరాల గురించి తెలిస్తే ఇంకేమంటాడో!

662. నాస్తికుడైన RGV ఆస్తిక సినిమా 'గోవిందా గోవిందా' ఎలా తీశాడు?

జ. చాలా మంచివాడైన RGV గ్యాంగ్ స్టర్ సినిమా అయిన 'సత్య'ని ఎలా తీశాడో అలానే.

663. పరాజయాలనుంచి లేచి, నిలదొక్కుకొనే మీ సామర్థ్యం అద్భుతం.

జ. నేను దేన్నీ పరాజయంగా భావించను. మిగతావాళ్లు నా పరాజయాల ఫలితాల్ని గమనిస్తుంటే, నేను ఓటమికి దారి తీసిన కారణాలు వెతికే పనిలో ఉంటాను.

ఎందుకు ఓడామో తెలుసుకున్న మరుక్షణంలో మీ పరాజయం మీ బలంగా మారుతుంది. కొత్తగా మీరు నేర్చుకున్న పాఠాలే మిమ్మల్ని విజయ మార్గంలో తీసుకెళతాయి.

గమనిక: ఈ ఫార్ములా పాత తప్పులు మళ్ళీ చేయకుండా మాత్రమే మిమ్మల్ని కాపాడగలదు. కానీ కొత్త తప్పులు చెయ్యకుండా ఆపలేదు. ఇది నా స్వీయ అనుభవం. అందుకే మళ్లీ మళ్ళీ ఫ్లాపులు తీస్తూంటాను.

664. మీ సినిమాలన్నిట్లో ఒకే రకమైన లైటింగ్, ఒకేరకమైన పాత్రలు, ఒకే రకమైన 'లుక్' ఉంటాయి.

జ. వాటిని తీసింది ఒకే రకమైన నేను కాబట్టి.

665. కేవలం మూర్ఖులు మాత్రమే శక్తికీ, బలానికీ ఆకర్షితులవుతారు. – ఐన్ స్టీన్.

జ. కేవలం మూర్ఖులు మాత్రమే శక్తినీ, బలాన్నీ ద్వేషిస్తారు. వాటిని సాధించే సత్తా లేదని వాళ్ళకు మనసులో తెలుసు కాబట్టి. –RGV

666. రాము ఒక వ్యక్తి. రామ్ గోపాల్ వర్మ ఒక ఆలోచన.

జ. RGV ఒక కల్పన.

667. ఇతరుల అభిప్రాయాలు పట్టించుకోకపోవడం ఎవరికైనా ఎలా సాధ్యమవుతుంది?

జ. ఇతరుల అభిప్రాయాలు పట్టించుకునే టైమ్ లేనంత బిజీగా ఉండడం ద్వారా.

668. మీరొక బాస్టర్డ్.

జ. థ్యాంక్స్.

669. మీ జీవన విధానం చూస్తుంటే మీకేమీ ఎమోషన్లు లేవనిపిస్తుంది.

జ. అవును.

670. ఎందుకని మీ అసిస్టెంట్లు మీ అంత సక్సెస్ ఫుల్ కాలేదు?

జ. ముందు నేనెందుకు సక్సెస్ అయ్యానో తెలుసుకున్న తర్వాత మీ ప్రశ్నకు సమాధానం చెబుతాను.

671. విపరీత వ్యక్తికి నిర్వచనం?

జ. ఇతరులకి భిన్నంగా ఉండేవాడు. ఏ కట్టుబాట్లకూ లొంగని వాడు. ఒంటరిగా ఉండే సాహసం చెయ్యలిగేవాడు మరియు నేను.

672. అర్థవంతమైన సినిమా అనే మాట ఎప్పుడయినా విన్నారా?

జ. అదో పెద్ద జబ్బు. చాలా మంది ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులకు అది సోకుతుంది.

673. మీ టఫ్ గై ఇమేజ్ బూటకం అనుకుంటున్నా.

జ. నాకు తెలిసిన చాలా మంది అమ్మాయిలు కూడా ఇదే మాట అంటారు. కానీ అసలు ఏ అమ్మాయయినా టఫ్‌గా లేని వాణ్ణి ఎందుకు ప్రేమిస్తుంది? మగాళ్లు టఫ్‌గా ఉండాలని, అమ్మాయిలు సెక్సీగా ఉండాలని వేల ఏళ్ల నుంచీ ఉన్న ప్రకృతి సత్యం. దాని ఆధారంగానే నా ఇమేజ్‌ని డెవలప్ చేసుకున్నా.

674. మరణం తర్వాత జీవితం ఉంటుందా?

జ. రేపటి గురించి ఆలోచించేంత తీరికే లేదు. ఇక మరణం తర్వాత? ఛాల్లే!

677. మంచి పాటలు, కొన్ని కామెడీ సీన్లు, ఇంకొన్ని ఎమోషనల్ సీన్లు ఉంటే చాలు సినిమా అన్ని రకాల ప్రేక్షకులకూ నచ్చుతుంది.

జ. ఛా...సూపరండి మీరు.

678. భవిష్యత్తులో మీరు మోహన్ లాల్‌తో సినిమా చేస్తారా?

జ. "ఆగ్" తర్వాత మళ్ళీ సినిమా చెయ్యమని అడిగితే ఆయన నా చేతులు నరికేస్తారేమో!

679. మీరింకా బతకడానికి మరో రెండు నెలలే టైమ్ ఉందని డాక్టర్ చెబితే, ఆ రెండు నెలలూ ఎలా గడుపుతారు?

జ. ఇప్పుడు ఎలాగో, అలాగే. ఎందుకంటే.. నేను నా జీవితాన్ని క్షణాల లెక్కన జీవిస్తుంటాను.

680. మీకు నమ్మకం లేని పనులను కూడా చేస్తుంటారా?

జ. బుర్ర సరిగ్గా పని చెయ్యనప్పుడు.

681. నైతికంగా ఏదీ పట్టని స్థితికి చేరగలమా?

జ. నే చేరాగా.

682. మీరు విడాకులు తీసుకోవడానికి దారితీసిన కారణం?

జ. పెళ్లి.

683. మీరెందుకు ఇంత మొండిగా, పొగరుగా, తెలివిగా ఉంటారు?

జ. నేను మొండి, పొగరు, తెలివయిన వాడ్ని కాబట్టి.

684. అయాన్ ర్యాండ్‌వి తప్ప వేరే పుస్తకాలు చదవలేక పోతున్నా.

జ. పుస్తకం చదవడం అంటే వేరే వ్యక్తి ప్రపంచాన్ని సందర్శించడం లాంటిది. ఎన్ని కొత్త ప్రపంచాలు తిరిగితే అంత జ్ఞాన సంపద వస్తుంది. అయాన్ ర్యాండ్‌ని మాత్రమే చదువుతూ కూర్చుంటే మీకు ఆమె ప్రపంచం తప్ప మరోటి తెలియదు. ఒక పుస్తకం లేదా ఒక వ్యక్తి మీకు నేర్పిన జ్ఞానం ఉపయోగించుకుని ఆ తర్వాతి స్థాయి జ్ఞానార్జనకు బయలుదేరాలి.

685. మీరు మీ జీవితాన్ని సంపూర్ణంగా అనుభవిస్తారనుకుంటా.

జ. నాకంటే బాగా జీవితాన్ని ఎంజాయ్ చేసే వాణ్ని నేనింతవరకూ చూడలేదు.

వీరప్పన్ లో, ఒసామా బిన్ లాడెన్ లో, దావూద్ ఇబ్రహీంలో ఒక వేళ వర్మ టైపు ఆలోచనలుంటే వాళ్ళ ఇంటర్వ్యూలు ఎలా ఉండేవి అనే ఊహతో రాసినది.

– జీవన్ రెడ్డి (వర్మ ఫాన్)

వీరప్పన్ వర్మ

1. మీ పేరు?
   వీరప్పన్ వర్మ

2. మీ డేట్ ఆఫ్ బర్త్ ?
   అడవుల్లో ఉండేవాళ్ళకు డేట్ ఆఫ్ బర్త్ ఏం గుర్తుంటుంది.

3. మీరు అడవుల్లోనే ఎందుకుంటారు... జనాల్లోకి ఎందుకు రారు...?
   నా చావు నేను చస్తాను... నన్ను వదిలేయండి.

4. మీరు ఏనుగుల్నే ఎందుకు వేటాడతారు?
   చీమల్ని, దోమల్ని చంపితే పబ్లిసిటీ ఏముంటుంది. అందుకే నేను ఏనుగుల్ని చంపుతాను...

5. అంటే మీరు పబ్లిసిటీ కోసమే ఏనుగుల్ని చంపుతున్నారా?
   Yes...

6. పెళ్ళి చేసుకొని అడవుల్లోకి ఎందుకు వెళ్ళారు?
   పెళ్ళి చేసుకున్నాను కాబట్టి...

7. మీకు ఇష్టమైన ముగ్గురి పేర్లు చెప్పండి ?
   1 - నేను, 2 - నేను, 3 కూడా నేనే...

8. గంధపు చెక్కల్నే అమ్ముతున్నారెందుకు ?
   మీలాంటి పిచ్చి వాళ్ళు, పిచ్చిమొక్కలు కొంటామంటే వాటిని కూడా అమ్ముతా...

9. మీ దగ్గరున్న డబ్బుల్తో సమాజానికుపయోగపడే కార్యక్రమాలు చేస్తారా?
ఇలాంటి ప్రశ్నలు నాకు వినబడవు... వినబడే ప్రశ్నలడగండి.

10. మీరు సమాజంతో కలిసి జీవించే అవకాశం ఉందా...?
ఉంది... సమాజం అడవుల్లోకి వస్తే...

11. మీరు ఇంతటి దుర్మార్గుడిగా మారటానికి కారణం...?
కారణం ఏంటా అని ఆలోచించకపోవడమే...

12. ఒక్క మాటలో "వీరప్పన్ వర్మ" అంటే....?
ఒక్క మాటలో కష్టం... రెండు మాటల్లో "వీరప్పన్", "వర్మ"

13. మీ సమాధానాలు అర్థమయ్యా అర్థమవనట్టు ఉంటాయెందుకు ?
నాకర్థమయ్యింది నేను చెప్తాను... మీకర్థమవుతుందా లేదా అని ఆలోచించను.

14. మీకు ఇష్టమైన వాళ్ళు ?
నా చేతిలో చచ్చినవాళ్ళు

15. మీకు దేవుడు ప్రత్యక్షమైతే ఏ వరం కోరుకుంటారు?
దాన్ని కూడా పబ్లిసిటీకి వాడుకొంటాను...

16. చివరగా ఏం చెప్పాలనుకుంటున్నారు ?
మీరేం అడగాలనుకుంటున్నారు....?

ఒసామా గోపాల్ వర్మ

1. మీ పేరు ?
   ఒసామా గోపాల్ వర్మ

2. మీరు ఏడుగుర్ని ఎందుకు పెళ్ళి చేసుకున్నారు?
   ఏదో ఒక భార్య అయినా హిట్టవ్వకపోతుందా అన్న ఆశతో

3. మీకు ఇష్టం లేనిది?
   అమెరికా

4. ఇష్టమైంది?
   అమెరికా అమ్మాయిలు...

5. మీరు ఇంతమందిని ఎందుకు చంపుతున్నారు ...
   నేను ఎన్ని సార్లు చెప్పాలి... ఏది చేసినా పబ్లిసిటీ కోసం అని.

6. శాంతి నెలకొల్పడానికి మీరు యుద్ధాలు మానేసి, పూలు పంచి, పావురాలు ఎగురవేయొచ్చు కదా?
   మీరు ఇంటర్వ్యూ చేస్తుంది గాంధీనో, నెహ్రూనో కాదు... ఒసామా గోపాల్ వర్మని, మైండిట్.

7. మీలో మంచి తనం ఎప్పుడు కనబడుతుంది?
   మీరు నాలా మారినప్పుడు...

8. మీ కిష్టమైన వ్యక్తి ?
   మహాత్మా గాంధీ

9. మీకు Darkness ఇష్టమా, Lighting ఇష్టమా ?
   Blasting **అంటే ఇష్టం**

10. మీరు గుహల్లో దాక్కోకుండా, బయటకివచ్చి శత్రువులతో పోరాడవచ్చు కదా?
శత్రువులనే గుహల్లోకి రమ్మనొచ్చు కదా...

11. మీలా ఇంకో ఒసామా వస్తే ఏం చేస్తారు ?
నాలాంటోడు ఇంకొకడుంటే ముందు మీరేం చేయాలో ఆలోచించుకోండి.

12. మిమ్మల్ని అమెరికా ఉరితీస్తానంటుంది...మీ కామెంట్?
ఇంత చిన్న విషయాల గురించి నేనెప్పుడూ ఆలోచించను

దావూద్ వర్మ

1. మీరు అండర్ వరల్డ్ డాన్ గానే ఎందుకెదగాలనుకున్నారు?
"అప్" కెళ్ళే మార్గం "అండర్" నుండే ప్రారంభమవుతుంది కాబట్టి.

2. ఎవరి మీది కోపంతో మీరు మారణకాండలు సృష్టిస్తున్నారు?
ఎవరి కోసమూ నేనేదీ చేయను... "నా ఇష్టం" కోసం మాత్రమే చేస్తా.

3. ఇలా ఎప్పుడు పడితే అప్పుడు, ఎక్కడ పడితే అక్కడ ఎంత కాలం చంపుతారు?
నా ఇష్టమొచ్చినంత కాలం... మీ కిష్టముంటే మీరూ వచ్చి చావండి లేదా నన్ను చంపండి.

4. మీకు చాలా మంది బాలీవుడ్ భామలతో సంబంధాలున్నాయట కద?
నిజమే... "బాంబు" లేకుండా, "భామ" లేకుండా నేనుండలేను.

5. మీరు మాఫియాలోకి వెళ్ళకుంటే...?
మీడియాలోకెళ్ళేవాణ్ణి...

6. మీరు పోలీసులకి దొరికితే ఏంచేస్తారు?
ఈ ప్రశ్న వాళ్ళనడగండి... వాళ్ళే ఏదో ఒకటి చెయ్యగలరు.

7. మీ బలం, బలహీనత...?
నా బలం చీకటి... బలహీనత చీకటే...

8. చాలా మంది యువత "మీలా" కావాలనుకుంటున్నారు... మీ అభిప్రాయం?
వాళ్ళు నాలా మాత్రమే అవగలరు... "నేను" కాలేరు.

9. మీ ఫ్యామిలీ గురించి...?
"నా" ఫ్యామిలీ, "నా" కు ఇంపర్సనల్... నో కామెంట్స్

10. మిమ్మల్ని నవ్వుతూ ఎప్పుడు చూడగలము...?
మీరు నిద్రపోయాక... మీ కలల్లో...

11. ఈ మధ్య కాలంలో మీరు బాంబులెక్కడా వేయట్లేదెందుకని?
వెరైటీ కోసం.

12. మీకు ఏ డైరెక్టర్ అంటే ఇష్టం...? ఎందుకు ?
రాంగోపాల్ వర్మ. నేను ఒక్కణ్ణి చంపితే పదిమందిని చంపినట్టు పబ్లిసిటీ చేస్తాడు.

13. మీరు వేసే బాంబుల్లో ముస్లిములు కూడా చస్తున్నారు!
నేను వేసే బాంబుకు మతం తెలియదు... అక్కడ ఎవరున్నా చస్తారు.

14. మీరు ముందు ముందు ఇంకా ఎక్కడెక్కడ బాంబులు వేయబోతున్నారు?
చెప్పను... మీరే చూడండి.

కొన్ని మధుర
కొన్ని అమధుర స్మృతులు

Blank Page

రామ్ లీ



బ్రూస్ లీ బతికిపోయాడు.... చచ్చిపోయి



బ్రూస్లీ సినిమాలు చూసి నేర్చుకున్న ఫైట్లు ఇక్కడ ఉపయోగపడ్డాయి



నాగార్జున ప్లేస్‌లో నేను, గణేష్ ప్లేస్‌లో నాగార్జున



నాగార్జునని పక్కన పెట్టి మొత్తం ఫైట్ నేనే చేసేస్తే ఎలా...
అనుకుంటున్నట్టున్న నేను



చూపించావులేరా.. ఇప్పుడు నాక్కూడా ఛాన్స్ ఇవ్వు అని
అనుకుంటున్నట్టున్న నాగార్జున

రఘువరన్ కన్న నేనే బెటర్ అనిపిస్తున్నాను



తెలుగులో శుభలేఖ సుధాకర్ నీకన్నా బెటర్‌గా రాశాడు అని
హిందీ శివ షూటింగ్‌లో జుట్సీకి చెబుతున్న నేను



నెక్ట్స్ షాట్ ఏంటి అని అడుగుతున్నట్టున్న తేజ

శ్రీదేవితో పాము సీను



క్షణ క్షణం క్లైమాక్స్ షూటింగ్‌లో ఇంజన్ పొగకి మొహాలు కప్పుకున్న
వెంకటేష్, శ్రీదేవి

రాముగారు చెప్పినంత బాగా మీరు చేయట్లేదని అంటున్నట్టున్న శ్రీదేవి



తనని స్ట్రైట్‌గా చూస్తే నా ఫీలింగ్స్ తెలిసిపోతాయేమోనని
భయంతో పక్కకు చూస్తున్న నేను

ఇంత అందంగా మిమ్మల్ని ఎవరైనా చూపించారా అంటున్నట్టున్న నేను...
గొప్పలు చెప్పుకోవడం ఎప్పుడాపుతానో అని బోరుగా చూస్తున్నట్టున్న ప్రభుదేవా!

నా కొంప ముంచటానికి కాకపోతే మీరింత అందంగా ఎందుకు పుట్టారండి



నువ్వూ శ్రీదేవి కూడా జంటగా బానే ఉన్నారు...

అనుకుంటున్నట్టున్న వెంకటేష్

నన్ను చూడకుండ ఎప్పుడూ శ్రీదేవినే చూస్తూ ఉంటాడు...

అనుకుంటున్నట్టున్న వెంకటేష్



ఈ ఫ్యాన్ కన్నా పెద్ద ఫ్యాన్‌ని



భయపడకుండా దూకు... అంటున్నట్టున్న నేను

క్షణక్షణం ఫంక్షన్‌లో

క్షణక్షణం ఫంక్షన్‌లో



ఊర్మిళతో గుసగుసలు

ఖాన్ దాదాకి అభివందనాలు



అప్పుడప్పుడు నేను కూడా డాన్స్ చేస్తాను

సుభాష్ ఘాయ్ సినిమాలు బ్లాక్‌లో టిక్కెట్లు కొని చూసేవాణ్ణి



దౌడ్ సినిమా సెట్‌లో సంజయ్‌దత్‌తో



నా అభిమాన నటుడితో



చూశారా... నేనెంత వాణ్ణి అయిపోయానో (నేను శివ స్క్రిప్ట్‌తో రామోజీరావుగారి వద్దకు వెళ్లినప్పుడు నాకు ప్రాక్టికల్ ఎక్స్‌పీరియన్స్ లేదని ఆయన రిజెక్ట్ చేశారు)



గాయం, దొంగ దొంగ స్క్రిప్ట్ కోసం స్టోరీ డిస్కషన్‌కి మణిరత్నం, నేను నారాయణ పేట్‌కి వెళ్లినప్పటి ఫోటో... తను చెప్పింది నేను వినలేదు. నేను చెప్పింది తను వినలేదు.

మేం అందరం వేరే వేరే గ్యాంగ్‌లు పెట్టుకోకముందు ...
గుణశేఖర్, ఉత్తేజ్, తేజ, నేను, కృష్ణవంశీ, గోపీచంద్



నా చిన్నప్పటినుంచీ నాకేమాత్రం అడ్డు పెట్టకుండా నా ఇష్టం వచ్చినట్టు
జీవించడానికి అనుమతించిన మా నాన్నగారు.



నేను కూడా ఒకప్పుడు పిల్లోడ్నే



నేను నా కూతురి కన్నా చైల్డీష్



రాము కూతురికి కూడా తన నాన్నకున్నంత ఏటిట్యూడ్ ఉన్నట్టుందే
అనుకుంటున్నట్టున్న బిగ్ బి.

తమ్ముడు, చెల్లి, నేను

నా తమ్ముడు కోటి, నా చెల్లెలు విజయ



అమ్మ, తాతయ్య, నేను, పిన్ని



మా కాలేజ్ ఫ్రెండ్స్ మోహన్ కృష్ణ, సుబ్రహ్మణ్యం...
లెఫ్ట్‌లో ఉన్న మోహన్ కృష్ణ నేను ఎప్పటికైనా డైరెక్టర్ అయ్యితీరుతానని
జోస్యం చెప్పిన మొట్టమొదటి వ్యక్తి

చిన్నప్పటి నుంచి నాలో నిద్రిస్తూ ఉండే ఒక గాంగ్ స్టర్
ఏ మూలో ఉన్నాడని ఇప్పటికీ నా అనుమానం

Blank Page

——————— నామీద మీడియా....

మీడియా మీద నేను....

Blank Page

His Master's Voice

It is said that there are different kinds of creative artistes. The first, whose work reflects the kind of people they are. The second, whose work is a complete contrast from the kind of people they are. Which category does Ram Gopal Varma belong to? Find out, as the producer-director analyses himself as a son, sibling, employer, filmmaker and friend.

There comes a phase in the relationship when the actor starts believing the image. He expect a new equation from me, his crea and I'm not wi for it. That b the alien

రాంగోపాల్ వర్మ, ఊర్మిళల మధ్య చిత్రమైన కాల 'మహిమ'

పరిశ్రమలోని ఒక వర్గం కథనం ప్రకారం ఈ వదంతుల మూల కారణం 'రంగీలా' రాజీ ఊర్మిళా మటోండ్కరే. 'రామ'కీ (రాంగోపాలవర్మ పరిశ్రమలో రాముగానే ప్రసిద్ధుడు) రంగీలా టీమ్‌కి (బాలీ అనాలేమోకదా!) మధ్య ఏదో వచ్చిందిట మొత్తానికి. ఆ ఏదో మరేదో కాదని రెండు చిత్రం తర్వాత ఊర్మిళ కళ్ల మరీ నెత్తికెక్కి అనలు రాము వైభవ ప్రాభవాలకు కారణం అన్నంత భావనతో తనకిచ్చే పారితోషికం విషయంలో రాము మిగతావారితో పోలిస్తే చాలా తక్కువగా ఇచ్చి చిన్నమాట మాస్తున్నాడనీ అనుకుంటూ అంత వహించిందనీ తెలుస్తోంది. ఊర్మిళకు తాను ఇచ్చినంత స్టార్‌డమ్‌తో పోల్చినట్లయితే పారితోషికం విషయంలో ఆమె అసంతృప్తి చాలా అసహజం అని రాము భావన.

'రంగీలా' తో స్టార్‌మేకర్‌గా రాము తనమీదా తాను భావించుకుంటున్నారీ. 'వేలం

సుభాష్‌ఘాయ్ మొదలైనవారంతా ప్రతిస్పందించారట. రాంగోపాలవర్మ ఊర్మిళను అణచడానికే తనకు సత్య చిత్రంలో పాత్ర ఇచ్చాడని మహిమ గ్రహించిందో లేదో తెలీకుండానే తన పాత్ర పట్ల క్రేజ్ పీలయిన మహిమకూ వర్మకూ మధ్య రెగ్యులర్‌గా పాత్ర గురించిన చర్చలూ, కలయికలూ జరిగాయి. దొడ్డెబ్బతినడంతో సత్యతో ద్విగుణీకృత ఉత్సాహంతో కొత్త హీరోయిన్‌తో పుంజుకోవాలని వర్మ కూడా ఆశించినట్టే వున్నాడు. ఊర్మిళ స్థానాన్ని ఆక్రమించుకోడానికి మహిమా ఉవ్విళ్లూరింది. సుభాష్‌ఘాయ్ తనకు ఇవ్వతలపెట్టిదో రాంగోపాలవర్మ ఇస్తాడని ఆమె ఆశపడిందేమో కూడాను. కానీ మహిమకు తన గురించి తనకు తెలియడం సంగతి మాట అటుంచి, కాల మహిమ గురించి పామర తెలియదనాలి. లేకపోతే ఇప్పుడు ఆమె తనంతట తానే సత్య చిత్రంనుంచి తప్పుకునే పరిస్థితులు సంభవించి వుండేవా! రాంగోపాలవర్మే తెలిసిగా తన 'ఊర్మిళ'ను తాను తనదారికి తెచ్చుకునే పథకంలో 'మహిమ'ను పావుని చేసి ఆమె తనంతట తాను చిత్రంనుండి విరమించుకునేలా చేశాడని వరిశ్రమ పరికొత్తగా చెప్పుకుందోందిప్పుడు.

ఇప్పుడు మరో హీరోయిన్ గురించి తలపోస్తూండడమూ ఊర్మిళ తట్టుకోలేకపోయింది. పారితోషికాలు, రెమ్యూనరేషన్‌లు ఆటుంచి అసలు వర్మ నిర్ణయమే ఊర్మిళకు చిన్నసైజు షాక్ అయింది. రాముకి నిజానికి కావలసింది కూడా అదే. ఊర్మిళ లేకుండా కూడా తాను ముందుకు నిరాఘాటంగా నిర్మించేపాంగానే నిర్మించగలనని చాటడమే కదా వర్మ లక్ష్యం. అందుకు మహిమను వాడుకున్నారన్నమాట.

ఊర్మిళను తన సత్య చిత్రంలో తీసుకోవాలి అంటే మహిమ తప్పుకోవాలి. మహిమ అప్పటికే అగ్రిమెంట్‌పై సంతకం చేసింది. మహిమ తనంతట తాను తప్పుకుంటే తప్ప వర్మ రేయగలిగిందేమీలేదు. అలా తప్పుకునేలా

పరిణయమయ్యాడు. అతన్ని హీరో చేసిన సత్య చిత్రం మహిమ పాత్రనే నివరకు ఆనాసుకం చేసినట్లు అనిపించింది. రాంగోపాలవర్మ మన్నాగం ఫలించింది. తనకు చెప్పిన నిక్రిష్టకూ చిత్రంలో పేయడానికి సంతకం చేసిన తర్వాత చిత్రం ఫ్లోనింగ్‌లో వెడుతున్న దానికీ పూర్తి తేడావుందనీ మహిమ గ్రహించింది. ఈలోగా అనేక పరిణామాల మెనక వున్న అసలు కథ వెలుగులోకి వచ్చింది వరదోక్ మహిమ చేసిన తొలి చిత్రం క్రమంగా పుంజుకుని విజయపథం పట్టింది. ఆమె పాత్రకు ప్రేక్షకుల హర్షామోదాలు

మహిమ

చిత్రంలో ప్రవేశించింది కనుక ఇప్పుడు చిత్రం హీరోయిన్ టరియంకెడ్ కామావచ్చు. బాలీవుడ్ ప్రేక్షకులకు ఇప్పటికే ఊర్మిళ బిగ్‌స్టార్, చక్రవర్తి అంత గుర్తింపున్న హీరో కాదుకనుక చిత్రం తదనుగుణంగానే రూపొందించడం జరుగుతుందంటే ఆశ్చర్యం ఏముంటుంది! మహిమ తాను 'సత్య' చిత్రంలో నటించడం లేదని స్పష్టం చేసింది. అండర్‌వర్ల్డ్ కథనంతో హీరో టరియంకెడ్ చిత్రమైన సత్యలో తానొక

The man behind *Siva*

By Amit Mitra and Shakeel M. Rasheed





"సెన్సార్‌తో రామ్ ..రామ్..." రామ్ గోపాలవర్మ

తెలుగు చలన చిత్రాలలో ఒక కొత్త ఒరవడిని సృష్టించిన దర్శకుడు రాంగోపాల్‌వర్మ తాను తొలిసారిగా దర్శకత్వం వహించిన 'శివ' చిత్రంతో ఘన విజయాన్ని సాధించింది. తదనంతరం రూపొందించిన 'క్షణ క్షణం' చిత్రం కూడా మంచి విజయాన్నే చవి చూసింది. దాని తరువాత రూపొందించిన రాత్రి చిత్రం మొదటి సినిమా ప్రెస్ అ... తెలుగు మా...

WELCOME TO SRI RAMGOPAL VARMA

చలనచిత్రమనెడు నిలువుటద్దము
పైన ముసిరి పేరుకున్న మురికి తుడిచి
"శివ" చిత్రముతో గణతికెక్కినట్టి కర్మయోగి !!
అతని చిత్రాలు ప్రగతికి ఆనవాళ్ళు !
అతని నూక్తులు ఆణిముత్యాల నరులు !
అతనే "రామ్‌గోపాల్‌వర్మ"

"క్షణక్షణం"తో క్రొత్త ఒరవడిని సృష్టించి "అంతం"తో యువతను కొల్లగొట్టబోతున్న మా దర్శకుడు "శ్రీ రామ్‌గోపాల్‌వర్మ" "ఉత్తమ దర్శకుడు"గా అత్యంత ప్రతిష్ఠాకరమైన రాష్ట్ర ప్రభుత్వ "నంది" అవార్డును అందుకొనేందుకు "సింహపురి"కి విచ్చేస్తున్న శుభసందర్భములో స్వాగతం ! సుస్వాగతం !!

తేజా ఫిలింస్, నెల్లూరు. ఫోన్:29872.

'రాత్రి'లో రేవతి, రోహిణిహత్తంగడి, ఆకాశ్

చెప్పుకోండి చూద్దాం!

సినీరంగంలోనికి అడుగిడుతూనే యువతరాన్ని ఆకట్టుకొని, సినీప్ర ముఖుల, సినీవృద్ధుల, ప్రముఖ జర్నలిస్ట్‌ల ఆశీసులు అందుకొన్న ఈ పాప ఎవరో చెప్పుకోండి చూద్దాం!

తెలుసుకున్న వాళ్లు విజేతలుగా, తెలుసుకోలేనివాళ్లు తెలుసుకున్న తరువాత ఈ చిన్న నస్సెన్స్ విడిపోయిన ఆనందంతో నవ్వుకోండి.

చెప్పుకోలేక పోయారా?

వెరైటీ, నాచురాల్టీ, క్రియేటివిటి, క్వాలిటీ, సెన్సిటివ్ ఉన్న దర్శకుడు, తెలుగు కళామతల్లి గర్వించదగిన ముద్దుబిడ్డ, నేటి ప్రముఖ దర్శకుడు "రామ్‌గోపాల్ వర్మ"

వాటీజ్ రాంగోపాలవర్మ!

'శివ' తీశాడు. అతని ఆ మొదటి చిత్రంతోనే మంచి టెక్నీషియన్‌గా పేరు పొందాడు? భూతవైద్యుడు ఓంపురి చేత ఓ మాటనిపించాడు. రాత్రిపూట దీపం వెలిగి

రాంగోపాల్ వర్మపై జాలిపడ్డ కె.ఎస్.ఆర్.దాస్

(ప్రభు)

హైదరాబాద్, మే 24

కె.ఎస్.ఆర్.దాస్ ప్రొడక్షన్స్ పతాకంపై చిత్ర నిర్మాణాన్ని చేపట్టి దర్శక నిర్మాతగా మారిన దర్శకుడు కె.ఎస్.ఆర్.దాస్‌ను 'ధర్మా' షూటింగ్‌లో 'శివరంజని' కలసినప్పుడు 'శివ' చిత్రం గురించి చిత్ర దర్శకుడు రాంగోపాల్ వర్మను గురించి ప్రస్తావన వచ్చింది. రాంగోపాల్ వర్మను గురించి మాట్లాడుతూ కె.ఎస్.ఆర్.దాస్ "పాపం ఆ కుర్రాడిని తలుచుకుంటే జాలేస్తుంది. ఎంత పెద్ద హిట్ ఇచ్చాడు. ఎంత సెన్సేషన్ క్రియేట్ చేశాడు. అతన్ని



కె.ఎస్.ఆర్.దాస్

తాయి. అందరిలో విపరీతమైన టెన్షన్స్ క్రియేట్ అవుతాయి. అతను తదుపరి చిత్రంలో చాలా రెస్ట్‌లెస్‌గా ఫీల్ అవుతాడు" అన్నారు. 'అంటే అంత హిట్ ఇవ్వడం

తు. 'శివ' చిత్ర దర్శకుడి గురించి ఇంకా సంభాషణ కొనసాగిస్తూ "ఆర్టిస్ట్‌ల మీద గాని, టెక్నిషియన్స్ మీదగాని డైరెక్టర్‌కు ఉండవలసిన గ్రిప్, లీడర్‌షిప్ విషయంలో రాంగోపాల్ వర్మ ఘటికుడనిపించుకున్నాడు. ప్రతి ఆర్టిస్ట్, టెక్నిషియన్ అతను ఎలా కావాలంటే, ఎలా చెయ్యాలంటే అలా చేసాడు. ఇలాంటి యంగ్ ఇంటలెక్చువల్స్‌ను ఇండి పెండెంట్‌గా వదిలెయ్యాలి. మంచి సంస్థ అయి ఉండి అతను కోరింది సమకూర్చి మొత్తం బాధ్యతను అతనికి అప్పగించి నిర్మాత దూరంగా ఉండాలి. నిర్మాత డామినేషన్ ఏ మాత్రం ఉండకూడదు. అలా అయితే రామ్‌గోపాల్ వర్మ విల్ అగైన్ క్రియేట్ ది సేమ్ సెన్సేషన్" అంటూ అభినందించారు కె.ఎస్.ఆర్.దాస్.

ఈనాడు

సినీవినీలాకాశంలో వినూత్న దర్శకనక్షత్రం

(స్టాఫ్‌రిపోర్టర్, సిటీ డెస్క్, విశాఖ)

సమాజంలోని సంఘటనలకే ఆర్షిన కథను సరికొత్త పంథాలో చిత్రీకరించి, అణువణువునా అడుగడుగునా సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకొనడంతో స్వయంసేథ శక్తిని ప్రదర్శించే అవకాశం గల శక్తివంతమైన సినీ మీడియాను తెలుసుకోవడం కొందరు దర్శకులకే సాధ్యమవుతుంది. వెనుకటి తరంలో వైవిధ్య ప్రతిభ చూపిన దర్శకుల కోవలో కొత్తగా చేరిన మరో దర్శకుడు శ్రీ రాంగోపాల్ వర్మ. సంగీతాన్ని చాయాగ్రహణాన్ని సమపాళ్లలో వాడిన ప్రజ్ఞాశాలి.

[illegible] వర్మ పేరు వినగానే ఈనాటి [illegible] కుర్రకారుకు జ్ఞాపకం [illegible]త్యం, చాయా

'శివ' అన్న కుతుర్ని హత్యచేసినవ్యక్తి చూపిన సింబాలిక్ షాట్స్ ఉత్తమ దర్శకత్వానికి ఉనికి పట్టాయి.

డిష్యుం... డిష్యుం శబ్దాల హోరే ఫైటింగ్ అనుకునే ప్రేక్షకులకు "సాంకేతిక విలువలు"

ఇది. వరుస దుర్మార్గుడైన 'భవానీ' కూడా ప్రణాళికతోరాజకీయనాయకుడిని చంపడంగుండాలను పురిగొల్పడం వంటివి నేటి పిడ్రోహక శక్తుల గేముఖాల వెనుకనున్న వ్యాఘ్రగుణాల్ని బట్టబయలు చేస్తాయి.

బుద్ధిమంతుడైన విద్యార్థి, అమాయకుడైన యువకుడు, దౌర్జన్యాలకు విసిగిపోతే ఎలా స్పందిస్తాడో, అదెంత తీవ్రంగా ఉంటుందో చూపించడానికి దర్శకుడు శ్రీ రాంగోపాల్ వర్మ తీసుకొచ్చిన సీన్లవారీ వరిణామం ప్రేక్షకులకొత్తొచ్చినట్లుగా అనిపించనడంలో లేదు. అందుకే 'శివ' చిత్రం విజయం సాధించింది [illegible] యిగా [illegible]

ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో

'గీతాంజలి', 'మౌనపోరాటం', 'సూత్రధారులు'కు నంది అవార్డులు

ఉత్తమనటుడు కమలహాసన్, ఉత్తమనటి విజయశాంతి, ఉత్తమదర్శకుడు రాంగోపాల్‌వర్మ

గీతాంజలి

మౌనపోరాటం

సూత్రధారులు

ఫెంటాస్టిక్ డైరెక్టర్ రామ్‌గోపాల్‌వర్మ

" 'శివ' సినిమా చూశాను. అద్భుతంగా వుంది. ఆ తర్వాత క్షణ క్షణం కూడా చూశాను. వెరీ ఫెంటాస్టిక్. అందుకే అవించింది నాకు రామ్ గోపాల్‌వర్మ సూపర్బ్ డైరెక్టర్ అని. నాకు ఆయన టేకింగ్ బాగా నచ్చుతుంది. 'అంతం' సినిమాలో నేను తొలిసారి ఆయన డైరెక్షన్‌లో నటించాను. కాని షేమ్ థింగ్ [illegible]మిటంటే నేను ఇంతవ

పడం వలన వీడియోలో చూడలేకపోయాను. జనరల్‌గా నేను ఎక్కువ సినిమాలు కేసెట్స్ రూపం[illegible] చూస్తు[illegible]

Going places 'by the minute'

Barely four films old, Ram Gopal Varma has already carved a niche for himself in the tinsel world. The runaway hit 'Shiva' was his debut film, topped with 'Kshana Kshanam'. 'Raat' followed and now 'Antam' is on the anvil.

Barely four films old, Ram Gopal Varma has already carved a niche for himself in the tinsel world. The runaway hit *Shiva* his debut film won him laurel topped it with *Kshana Kshanam*, the biggest grosser of the year. *Raat* came next, and now *Antam* on the anvil is being awaited with eager anticipation. There's simply no stopping this new entrante!

Ram Gopal Varma belongs to a different clique altogether. Film making comes to him naturally. His films are laced with an ingenuity perhaps unseen before.

This reporter met him on the sets of his latest film *Antam*, starring Nagarjuna and Urmila Matondkar. A fight sequence was being shot in which, the dashing, handsome Nagarjuna was to take on the baddies. One would think that a fight sequence is easy to capture on the camera. Obviously not. It is after many takes that the shot is okayed by the man himself.

Obviously Ram Gopal Varma is a fastidious film maker. Film making comes to him naturally. "I used to watch 10 films per week. And, believe me one learns a lot more through watching films than doing a course", he quips.

Hailing from Hyderabad, armed with a civil engineering degree, from Vijayawada he worked as a construction engineer with the Krishna Oberoi, followed by a brief stint with Navopan. He ran a video library for some time too. "I was looking for a break for a long time, and attempted meeting many directors but to no avail! Then, I went to Annapoorna studio's with the story of *Shiva*. They liked it. And that's how *Shiva* came into being," he recalls fondly.

From then on, there was no looking back. And with *Kshana Kshanam* he had entered the portals of the hall of fame. *Kshana Kshanam* was a tumultious success. The film also won him the Nandi award. Varma wholeheartedly agrees that *Kshana Kshanam* has been his best and the most satisfying film he has made to date. "With *Kshana Kshanam* I was trying to break the tradition of fixed stories, where the boy meets girl, the usual run-of-the mill kind of themes. I did succeed considerably, but to my surprise the film picked up only after 50 days of running.

This he attributes to the surfeit of songs in the film.

One sterling facet of this young director, is his ability to come to terms with his shortcomings. And the same goes for his films too. This self-criticism indeed brings out the best in the director.

As is usual with the accolades came the brickbats. Accusations were hurled at Varma for having culled parts of the film from Hollywood thrillers and for not presenting anything different. What does he have to say in his defense. A cool cat he nonchalantly queried. "How does one define originality," he queried. "Most certainly Hollywood films have been a great inspiration. But it would be wrong to say I copied from it, he adds.

Then, followed his tryst with horror, in the making of *Raat*. A totally Un-Ramsay like film, *Raat* was gripping, and horrifying. But, unfortunately, it bombed. Not only was one expecting it to be different as promised, but one also felt it was merely a display of technical showmanship. He agreed that *Raat* did not do well, "perhaps because I showed the devil". But, *Raat* according to him was not meant to be taken seriously. "*Raat*, he maintains, was conceptualised in a different way. After a brief pause he said,it is difficult to analyse a film like *Raat*. You see I worked very hard for this film and gave myself totally to it. But, somehow people felt the film ended abruptly resulting in many loose ends. Admitted, I did get carried away by the technique and went wild with it.

But, the film no doubt had something unusual to offer. In the sense, it was a film wherein, I visualised the shots and wove the story around it. *Raat* was like a roller-coaster ride where one, merely enjoys the thrill of the moment. But where was that something different. "Why, for the first time, didn't you see a ghost draped in a maroon saree instead of white," he stated jocularly.

Regarding his latest film *Antam*, Ram Gopal Varma is tight-lipped. However, after much cajoling, he relented to reveal that *Antam* is actually a love story, but I am sure people will think it is a violent film. "*Antam* is slated for a July end release.

As a parting shot Ram Gopal Varm stated, "I don't make films to win awards, I make it for the masses."

A M

Scene from *Kshana Kshanam*

Ram Gopal Varma

"అనగనగా ఒక రోజున
"క్షణంక్షణం "శివ"కరుడై
సమాజానికి పడ్డ "గాయం"
సమసేందుకు "అంకితం"వై
జన్మించాడు జగద్ధర్మకుడు
"గోవింద"నామాల గోపాలుడు

భారతీయ చిత్రరంగంలో పరిచయం అవసరం లేని అరుదైన దర్శకుడు రాంగోపాల్‌వర్మ. అంతర్జాతీయ స్థాయిలో తనదైన ముద్ర వేసుకున్న వర్మ 'భూత్' సృష్టిస్తున్నారు. కథ పాతదే అయినా... కథనం కొంతకొత్త సహకారం అంతర్జాతీయస్థాయిలో ఉండేలా ప్రయత్నం చేశారంటున్నారు వర్మ. మరోవైపు నిర్మాతగా కూడా అయన కొత్త బాధ్యతల్ని నిర్వహిస్తున్నారు. ఎందరో యువదర్శకుల్ని ప్రోత్సహించే ప్రయత్నంలో భారీ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో ముంబాయిలో రాంగోపాల్ వర్మ 'ఈనాడు సినిమా'తో ముచ్చటించారు...

చిత్రాల నిర్మాణానికి ఒప్పందం కుదుర్చుకున్నాం. వీటికి నా వద్ద అసోసియేట్ దర్శకులుగా పనిచేసిన యువదర్శకులు దర్శకత్వం వహిస్తున్నారు.

*** మీరు బ్యాండియట్ సెంమరీ ఫాక్సీవిల్మ్‌తో కూడా సంయుక్తంగా ఓ చిత్రాన్ని చేస్తున్నారు కదా? ఆ చిత్రం వివరాలు...?**

'బ్యాండియట్ సెంమరీ ఫాక్స్'తో పాటు సీమా తీ చిత్రాన్ని నా దర్శకత్వంలో నిర్మించనున్నాను. అందులో వైవ్ ఆలీఖాన్, ఊర్మిళ మటోండ్కర్, సీమా బిశ్వాస్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. అర్ధరాత్రి అంతా మాదిరిగా పూర్తి యింది.

*** మరి అంగ్ల చిత్రానికి ఎప్పుడు దర్శకత్వం వహిస్తున్నారు? హాలీవుడ్ చిత్రాల స్థాయికి ఎదిగినట్లు భావిస్తున్నారా?!**

త్వరలోనే హాలీవుడ్ చిత్రానికి దర్శకత్వం వహించనున్నాను. అందుకు సంబంధించిన కథపై

నా జీవితాశయం

రామ్‌గోపాల్ వర్మ

చర్చలు జరుగుతున్నాయి. అది ద్విభాషా చిత్రంగా ఇంగ్లీషు, హిందీలో నిర్మిస్తాం. దీని బడ్జెట్ రూ. 80 కోట్లవైనే ఉంటుంది. ఓ ఆంగ్లేయ చిత్రానికి దర్శకత్వం వహించినంత మాత్రాన హాలీవుడ్ చిత్రాల స్థాయికి ఎదిగినట్లు నేను భావించటంలేదు. హాలీవుడ్ చిత్రాలు చూడటం ఎన్ని రెట్లు ఆస్వాదిస్తానో అన్నిరెట్లు

*** మీరు గతంలో చెయ్యాల నేవ్యంలో రాళ్ళ (తెలుగులో 'రాత్రి') తీశారు. అది అంతగా విజయం సాధించలేదు కదా! ఇప్పుడు మళ్ళీ 'భూత్' ఎందుకు రూపొందించాలని పించింది?**

కథ అంత ముఖ్యం కాదు. రాత్రి (రాత్) అపజయానికి కారణం నేను మారిన పరిస్థితుల దృష్ట్యా హారర్ చిత్రం చేయాలనిపించి. దీన్ని చేస్తున్నాను. ఈ 'భూత్' కొత్తగా ఉంటుంది.

*** ఈ చిత్రానికి మ్యూజిక్?**

అలాంటిదేమీ లేదండి. అది కథ మాత్రమే. మనం చెయ్యాలనుకున్న చిత్రాలు అనగానే ఎక్కడో మారుమూలన ఉన్న లుగా లలో శబ్దాలు వేయడంగానే అనుకుంటారు. అందుకు విరుద్ధంగా 'భూత్' చిత్ర కథ మొత్తాలు సన్నివేశంలో అన్ని చెప్పి ఉపయోగించడం జరిగింది.

నా చావు నేను చస్తా

- నాకు కరెక్టనిపిస్తేనే చేస్తా
- వ్యక్తిగత జీవితం లేదు.. నేనో మానిప్యులేటర్‌ని
- కృష్ణుడి లక్షణాలే ఎక్కువ... ఇంతమంది అమ్మాయిలని కరెక్టుగా చెప్పను
- భయపెట్టడం ఇష్టం.. క్రైం సీనంటే ఉత్సుకత
- జూనియర్ ఎన్టీఆర్‌తో సినిమా తీస్తా
- చిరంజీవికి సారీ చెప్పా
- సిటీలో చేసిన అకౌంట్లు రెండు మూడే

ఇండస్ట్రీ మీద ఏమైనా కోపమా?

హిందీ సినిమాల మీద ఆసక్తి ఎక్కువ ఉండేది. సత్యలాంటి సినిమా ఇక్కడ తీయలేను. ఇక్కడ నా సినిమాలు నచ్చేవాళ్లు చందమంది ఉంటారనుకుంటే.. మొత్తం ఇండియా పంద హైదరాబాద్‌లోనే సమానం. ప్రేక్షకులు విస్తృతమవుతారు. అందుకే ముంబై వెళ్లాను.

పెద్ద ఎన్టీఆర్‌తో సినిమా తీయాలన్న ఆకాంక్ష ఉండేదని చెప్పేవారు. దాన్ని తీర్చుకోవడానికి జూనియర్‌తో ఏమైనా తీస్తారా?

తప్పకుండా. కాల పరిమితి ఏమీ అనుకోలేదు. కానీ ప్లాన్ అయితే ఉంది.

చిరంజీవితో సినిమా మొదలుపెట్టి మధ్యలో ఆపేశారు. ఆ సమయంలో చిరంజీవిని బ్యాడ్ పెట్టారని అంటారు..

చిరంజీవిని నిజంగానే బ్యాడ్ పెట్టాను. మూడో మూడు శాతం నా తప్పే. అందుకు కారణం ఏమిటంటే.. సంజయ్‌దత్ అప్పుడే జైలుకి వెళ్లాడు. ఈ రోజో రేపో బయటకి వస్తాడని ఊహాగానాలు వస్తున్నాయి. నెల రోజులకే బయటికి

కానీ మీరు మీడియానే బ్లాగిట్ చేసి ఓ సినిమానే ఫ్లాప్ చేశారు...

అది తప్పు. మీడియాను బ్లాగిట్ చేసి నేను తీయలేదు. నిజం చెప్పడం మీడియా విధి. కానీ తీవ్ర పోటీ వాతావరణంలో టీఆర్‌పీ రేటింగ్‌లు, యాడ్ రెవెన్యూ తదితరాల నేపథ్యంలో వాణిజ్యపరమైన ఒత్తిళ్లతో పాటు ఒగో కూడా తొలైత ప్రామాణిక లక్ష్యం మరచిపోతారు. ఐదో ఒత్తిళ్లతో రజ్ తీస్తున్నాను. నిజాల్ని చెప్పడంతోపాటు ప్రామాణిక లక్ష్యాన్ని మరచిపోయిన ఓ రాంగో చిత్రం దన్నదే రజ్ కథ.

సినిమాలకు సామాజిక బాధ్యత ఉంటుందా ఉండదా?

నా సినిమాలకు ఉండదు. సామాజిక బాధ్యత అంటే నాకు నమ్మకం లేదు. నా బాధ్యతలను చూసుకోవడంలోనే నాకు క్షణం తీరికలేదు.

ఏ హీరో, హీరోయిన్లనైనా రానన్ని ఆఫర్లు వరంతులు మీపై రావడానికి కారణం?

ఎఫర్ట్స్ ఆడ, మగ మధ్య మాత్రమే ఉంటాయి. నా పేరులో రాముడు ఉన్నా.. ఆయన గుణగణాలు ఒక్క శాతం కూడా నాలో లేవు. కృష్ణుని లక్షణాలే ఎక్కువ. నిజంగా పెళ్లాలంటే నేను పెద్ద మానిప్యులేటర్‌ను. అదా, మగా కాదు అందరినీ మానిప్యులేట్ చేస్తాను.

ఇప్పటివరకు మీ జీవితంలోకి ఎందరు అమ్మాయిలు ప్రవేశించి ఉం

నిజమైన సంబర్ చెబితే.. కొందరు అమ్మాయిల దగ్గర మా

మీరు ఈ మధ్య సడన్‌గా కొందరు హీరోయిన్‌

అనలోయి పాటపాటున చిల్ అన్నారా?

మీరు (జర్నలిస్టు

దగ్గర సంబంధ

మీకు ఫోటో సె లేకపోయారు

ఆలో పెద్ద పుర సినిమాను తీసే కారణం ఏ

మీ ని

'వైజయంతీ మూవీస్' సరికొత్త వైభవం

బరంజీవికి రాంగోపాల్‌వర్మ హాండ్ ఇచ్చారా?

చిరంజీవి సినిమా
ఏ పరిణామాలో ?

THE SUNDAY REVIEW • SEPTEMBER 12, 1999

Basic Instincts

Hollywood-happy director Ram Gopal Varma talks about being dramatic without being melodramatic. Is that the secret of his success?

CLEARLY, Hollywood has been his alma mater. School-lost in the high-velocity thrills, subterfuges and romances, Ram Gopal Varma acknowledges his debt to entertainers ranging from Guns of Navarone to Spielbergian bagatelles.

The 34-year-old director started off as a civil engineer, earning Rs 800 a month. As soon as he got the better of him, he started a video library in Hyderabad's Panjagutta neighbourhood. Like Quentin Tarantino during his growing years in San Francisco, Varma recommended his favourite flicks to a growing clientele. "When months, I started making Rs 15,000 a month," he recalls. "I gave up my plans to work in Nigeria, where I thought I could earn enough money to start my own film.

Since then, the director has made Shiva, Kshan Kshanam and Govinda Govinda in Telugu and Raat, Drohee and the expressively publicised Rangeela in Hindi. He's in the process of

Urmila Matondkar in Rangeela

could earn enough money to start my own film.

Since then, the director has made Shiva, Kshan Kshanam and Govinda Govinda in Telugu and Raat, Drohee and the expressively publicised Rangeela in Hindi. He's in the process of

desperation. Although there isn't much by way of a conventional plot, the movie had everyone glued to their seats.

Haven't you been guilty of using the frantic Steadicam-style excessively?

mother who keeps coughing and coughing till a doctor prescribes some medicines which just aren't available at the chemist's. We've had more than enough sibling mothers.

Do you feel limited by the formula while telling you

కాలు తియ్యారు.

ఇదిగో అని జవాబిచ్చారు.

న్నాకు ఏం చూసి ఇచ్చారు?

అన్నపు[redacted]డియోప్ ఎస్.ఎస్. క్రియేషన్స్ నిర్మించబోయే చిత్రం ద్వారా 'రాము' అనే యువకుడికి దర్శకుడిగా తొలి అవకాశం ఇస్తున్నట్టు యువ నిర్మాత నాగార్జున తెలిపారు. అయితే రాము ఏ దర్శకుడి వద్దా పని చేయలేదని సురేంద్రవద్ద మాత్రం పనిచేశాడని నాగార్జున చెప్పారు. ఏ అనుభవం లేని యువకుడికి ఏం చూసి ఈ అవకాశం ఇస్తున్నారని ప్రశ్నించగా నాగార్జున సవ్యంగా ఏ ఎక్స్‌పీరియన్స్ చూసి నాకు ఛాన్స్ ఇచ్చారు? అలాగే

"తప్పకుండా. స్టూడియో కూడా నడపాలి కదా! వెంకీ, 10, 15 రోజులపాటు స్టూడియోలో షూటింగ్ చేయమని నా నిర్మాతలను కోరుతున్నాను. వారు అంగీకరిస్తున్నారు కూడాను. అలాగే మా అన్నపూర్ణ స్టూడియో తరపున జనవరి నుంచి ఒక చిత్రం కోదండరామిరెడ్డిగారి దర్శకత్వంలో తీస్తున్నాము. నాన్నగారు, నేను నటిస్తున్నాము. ఏప్రిల్ నుంచి రాము (పాండ్ ఇంజనీరు కృష్ణంరాజుగారి అబ్బాయి) దర్శ

పేపర్ బాయ్.. బాక్సింగ్ ఛాంపియన్.. సినిమా ఇంజనీర్.. కరాటే ఇన్‌స్ట్రక్టర్.. వీడియో షాప్ ఓనర్..

సాక్షి అన్నీ రామ్‌గోపాల్ వర్మే!

వర్మకు అద్వానీ 'కంపెనీ'

(సుభాష్ కె.ఝా/ముంబాయి)

విభిన్నమైన కథాంశంతో ప్రేక్షకులను ఆకట్టుకునేరీతిలో చిత్రాలు నిర్మించే ప్రముఖ దర్శకుడు రాంగోపాల్‌వర్మకు హోంమంత్రి అద్వానీ పక్కన కూర్చుని చిత్రాన్ని చూసే అపూర్వ అవకాశం వచ్చింది. హోంమంత్రి అద్వానీ వర్మ నిర్మించిన 'కంపెనీ' చిత్రం చూడదలచినట్లు అందుకు వర్మకు అంగీకారమైతే కలసి చూద్దామని వర్తమానం పంపారు. దాంతో తన చిత్ర నిర్మాణాన్ని పక్కనపెట్టి ఢిల్లీవెళ్లినట్లు, అద్వానీతోకలసి 'కంపెనీ' చిత్రాన్ని చూసినట్లు రాంగోపాల్ వర్మ చెప్పారు. అద్వానీకి చిత్రరంగం, చిత్రనిర్మాణంపై ఉన్న అవగాహన తనను ఆశ్చర్యానికి గురిచేసిందని వర్మ అన్నారు. హీండీ సినిమాపై మంచి అవగాహన ఉండటమే కాక సినిమా తీయడంలో టెక్నిక్‌లకు సంబంధించి కొన్ని సూక్ష్మాతి సూక్ష్మమైనపరిశీలనలు అద్వానీ చేశారన్నారు. అలాగే ఫొటోగ్రఫీ అంటే ఆయనకు ప్రాణమని, సినిమాచూసేటపుడు చాలా ఆసక్తిగా సినిమా ఫొటోగ్రఫీని గమనిస్తారని వర్మ అన్నారు. జులైలో వర్మ హైటెక్ స్పెషల్ ఎఫెక్ట్స్‌తో ఒక హార్రర్ సినిమా తీస్తున్నారు. ఈ సినిమాలో అభిషేక్‌బచ్చన్, ఊర్మిళా మటోండ్కర్ ప్రధాన పాత్రలలో నటిస్తున్నారు. ఈ సినిమాలో మరో ముఖ్యమైన పాత్రను



వీరి కాంబినేషన్‌లో సినిమా ఇక లేదా?

THE HINDU

FRIDAY REVIEW

FRIDAY, JULY 1, 2005

Director showcases his idol

INTERVIEW It was dream come true for Ram Gopal Varma as he directed Amitabh Bachchan in 'Sarkar,' releasing today.

BACHCHAN HAS TAKEN "SARKAR" MUCH BEYOND WHERE I COULD EVER TAKE IT. RAMGOPAL VARMA

Ramu on the rampage

CINEMA Among other things, Ram Gopal Varma is contemplating a remake of 'Kshanakshanam'

REMIX KING From 'Sholay' to his own films, Ramgopal Varma seems to have been bitten hard by the remake bug PHOTO: CH. VIJAYA BHASKAR

Reclining on a chair with a ramrod-straight backrest, Ram Gopal Varma is casual in more than one way. Eclectic storylines and their brilliant picturisa-

engineering, he landed a job as a site engineer at a five-star hotel in Hyderabad but he did not enjoy the work thanks to the constant feeling that he was made for something bet-

Shock, with Ravi Teja and Jyothika as the lead pair, is currently being shot.

Brush with the Big B

విలీసి నిష్కారం

"వర్మగారు! వరుసగా మేము నటించిన రెండు చిత్రాలు ఫెయిల్ అయ్యాయి. మరలా తెలుగులో ఫెయిల్ హీరోయిన్‌గా నిలబడ్డాము. అయినా మీ చిత్రంలో నటించే అవకాశం రాలేదు. మమ్మల్ని రాదా చేర్చి చెప్పండి" అని రాంగోపాల్ వర్మను విలీసి విజ్ఞాపనచేస్తున్నట్లుగా ఉంది దమ్యకృష్ణ, ఆర్తి ఫిలింస్ ప్రారంభోత్సవంలో కలిసిన వీరురువురు తమ కాంబినేషన్ చిత్రంలో ఎప్పుడు కలుస్తారో వేచి చూద్దాం.

కిల్లర్ ఐడియా

అప్పటికి నేను డైరెక్టర్‌గా అవకాశాల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నాను. అప్పటికి శ్రీవారికి ప్రేమలేఖ, మయూరి, ప్రతిఘటన వంటి విభిన్నమైన వరుస హిట్ చిత్రాలతో రామోజీరావుగారు ప్రొడ్యూసర్‌గా టాప్ పొజిషన్‌లో ఉన్నారు. నేను ఆయన అపాయింట్‌మెంట్‌కోసం రకరకాలుగా ప్రయత్నించేవాడిని.

అప్పుడు నాకో 'కిల్లర్ ఐడియా' వచ్చింది. రామోజీ గ్రూపునకు చెందిన న్యూస్‌టైమ్ పత్రికలో 'ద ఐడియా దట్ కిల్డ్ థర్టీ మిలియన్ పీపుల్' అనే ఆర్టికల్ రాశాను. దాంతో నాకు రైటర్‌గా ఐడెంటిటీ వచ్చి రామోజీరావుగారితో సులువుగా అపాయింట్‌మెంట్ దొరికింది. అనుభవం లేదన్న ఒకేఒక్క కారణంతో డైరెక్టర్‌గా నాకు అవకాశం ఇవ్వడానికి ఆయన నిరాకరించారు. దాంతో నా ప్రయత్నం విఫలమైంది. దర్శకుడికి అనుభవం అవసరం లేదని, అది టెక్నీషియన్స్‌కు మాత్రమే అవసరమని వాదించాను. కానీ ఆయన వినలేదు.

దర్శకుడికి ఇమాజినేషన్ ఉంటే సరిపోతుందన్న నా వాదనను ఆయన తోసిపుచ్చి, తన పత్రికలో నాకు ఒక కాలమిస్ట్‌గా మాత్రమే ఉద్యోగం ఇవ్వగలనని చెప్పారు. ఆ ఆర్టికల్ వల్ల నేను అనుకున్నదేమీ జరగకపోయినప్పటికీ, దానివల్ల నాకు గుర్తింపు దొరికింది. పేపర్లో నా పేరు రావడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు చాలా థ్రిల్ ఫీలయ్యారు. ఆ ఆర్టికల్‌ని మీకోసం ఇక్కడ ప్రచురిస్తున్నాను.

– రామ్‌గోపాల్ వర్మ

"The Ideas That Killed 30 Million People" written by RGV in 'NewsTime'

The writing finger writes knowing not to what use the book and its ideas would be put by future generations. The most horrendous example of the phenomenon is Nietzsche being appropriated by Hitler and the lesser Nazis.

Although the ideas that nourished the intellectual roots of Adolf Hitler, who started as a small-time painter and went on his way to become the master of Europe, can be traced back to many a megalomanical thought that poured out from a few German minds of 19th century, no other man's ideas have con-

tributed so much to the barbarous part of the Nazi mind as those of the philosopher Nietzsche.

Nietzsche's writings, often dismissed off as but outpourings of a raving insane mind by many a thinker now and then and described by George Santayana as full of genial imbecility and boyish blasphemy, were untiringly praised by the Nazi writers with great enthusiasm. The Nazis would quote him on every conceivable subject. Hitler openly declared his admiration for the philosopher and often used to visit the Nietzsche Museum at Weimar and publicize his deep respect for Nietzsche by posing for photographs of himself staring in rapture at the painting of the philosopher.

Friedrich Wilhelm Nietzsche was born in 1844. He was descendant of the Nietsky family, a reputed race of aristocrats and warriors. But he himself was a weak branch of this mighty tree. As a result of genetic inheritance of a feeble constitution from his father he was subject to a variety of physical ailments, neuralgia, weak eyes, dizzy headaches.

He was the laughing stock of the school with his weak body and shy nature. He was afraid of the boys and never could bring himself to use their slang and cuss words. But for the short time he used to play with his sister he always would wind up in a corner with some book or the other. After school he joined the University of Bonn and from there he transferred to Lepzing and devoted himself to the study of German language.

He discovered Schopenhauer's The World as Will and Idea and hungrily read every word of it. Schopenhauer declared that nature traps humanity into an existence of misery through procreation by baiting sex. So in order to escape this trap man should willfully stop procreating and breathing. Nietzsche absorbed this pessimistic doctrine and transformed it from a will to die to will to live. The will should be to live in spite of all the suffering that we endure. Such an assertion of the will raises man above himself and transforms him into God, he claimed.

One day during the war between Germany and France, he saw a troop of cavalry marching to the front and at that moment he said his entire philosophy fell into place. He felt for the first time that the strongest and highest will to life does not find expression in a miserable struggle for existence but only in a will to war, a will to power, a will to overpower.

In an evil moment man has created God and thereafter was chained to his own creation. He urged that man should be able to break the chain and gather courage to be himself and to surpass himself. Man must strive to become Superman. He dismissed morality as but a device to lead men by their noses and proceeded to define good and evil. The term good was not an ethical classification formerly but only a social distinction. Good formerly meant brave and strong. The strong used to impose their will on the society and draw a moral code to suit their own characteristics.

But as the time went on, a new set of people have risen who were physically weak but mentally strong. In a struggle against their warrior masters they invented the so called virtues as a weapon to use against the sword. A system of ethics was founded to cover their own weaknesses. They proclaimed the rights of the underdog to shackle the natural instincts of the strong and to perpetuate their own impotent rule. A religious propaganda was launched in their support to exalt their own impotency. The poor, the weak, the lowly are the good and for them alone is salvation.

In such a way did "the fox replace the eagle". It was an act of clever revenge on the part of the cowardly against the courageous. It was the most pious fraud ever committed in history, declared the anti-Christ, as Nietzsche called himself.

Society does not exist for its own sake, claimed Nietzsche, but only as an elevator by means of which a select race of human beings may elevate themselves to a higher duty. It will be ascertained beyond doubt for any reader of Mein Kampf that

Hitler took his select race of human beings to be Aryans. Nietzsche's views are reflected often in Hitler's Mein Kampf. "All the results of art, science and technology that we see before us today, are almost exclusively the creative product of the Aryan…It is the fire of his knowledge that caused man to climb the path to mastery over the other beings of this earth. .. The Aryan, in his encounter with lower people, subjugated them and bent them to his will…As long as he ruthlessly upheld the master attitude, not only did he remain master, but also the preserver and increaser of culture. As soon as the subjected people began to raise themselves up and approach the level of their conqueror, the barrier between mater and servant broke down. The Aryan gave up the purity of his blood and, therefore, lost sojourn in the paradise which he had made for himself… We all sense that in the distant future humanity must be faced by problems which only the highest race, becoming master people and supported by the means and possibilities of an entire globe, will be equipped to overcome".

The above extracts of Mein Kampf clearly indicate to what extent Nietzsche influenced Hitler.

Nietzsche further claimed that all talk about "good and bad conscience" is sheer nonsense. Actually a strong man does not feel any sense of shame for any of his deeds. Do the great birds of prey feel shame as they seize helpless sheep, he reasoned.

"The strong men, the masters regain the pure conscience of a beast of prey; they can return by a fearful succession of murder, arson, rape and torture with same joy in their hearts, the same contentment in their souls as if they had indulged in some student's rag.

"Man must be evil; for evil is man's best force. The evilest is necessary for Superman's best".

These words were uttered by the most terrible man that has ever existed, as Nietzsche described himself in his autobiography Ecce Homo, had a profound influence in shaping the mind of Hitler and a host of lesser Nazis, and in time they would justify the breaching of Versailles Treaty, the violation of the Hague Convention and the most cold –blooded and ruthless deeds such as the suppression of personal freedom, the brutal practice of slave labour, the depravities of Auschwitz and other such concentration camps, the ruthless massacre of his own followers in 1934, the savage killing of the war prisoners and the senseless slaughter of millions of Jews.

He had created the greatest revolution in history, declared Nietzsche. Some day after his death, history would no longer be divided into BC and AD, the era before Christ and the era after Christ. Christ would be forgotten now that Nietzsche has replaced him. History would be divided into BN and AN, the dark centuries of ignorance before Nietzsche, and the enlightened centuries after Nietzsche.

About war, Nietzsche lashed out in the thundering language of The Old Testament in which Thus Spoke Zarathustra is written: "Ye shall love peace only as a means to a new war. Ye say that it is the god cause that halloweth every war. I say unto you that is the good war that halloweth every cause.

"Lo I command you to make way for the predator, the splendorous blond beast would arise again," he prophesied.

"Let the nations of the World beware! Let the democracies of Europe tremble! Within fifty years these babel governments will clash in a gigantic war for the markets of the world.

"The beasts of prey, the race of conquerors shall rise in mightier and more deadly form. Those who cannot bear my philosophy are doomed and those who regard it as the highest blessing are destined to be the masters. The superman is coming. Make way for him or be destroyed. He and the elite around him would be the lords of the earth".

Few people who have read Mein Kampf, the so called Nazi bible, and the people who have followed the deeds of Hitler and his Nazi followers during the course of the Second World war would doubt that Hitler considered himself the superman of Nietzsche's prophecy.



THE IDEAS THAT KILLED 50 MILLION PEOPLE

The writing finger writes knowing not to what use the book and its ideas would be put by future generations. The most horrendous example of the phenomenon is Nietzsche being appropriated by Hitler and the lesser Nazis.

By P Ramgopal Varma

"నా ఇష్టం"తో నేను మాట్లాడేదానికి అర్థం మీ ఇష్టంతో మీరేం అర్థం చేసుకుంటే అదే అని నేనన్న మాటకు అర్థం మీ ఇష్టంతో మీరేం అర్థం చేసుకున్నారన్నది "నా ఇష్టం"తో నేను అర్థం చేసుకున్నది.

– రామ్‌గోపాల్ వర్మ

నా ఇష్టం

RAMGOPAL VARMA

- రామ్‌గోపాల్ వర్మ

"నీ కోసం నువ్వు బతుకు... ఎవర్నీ నీకోసం బతకమని అడక్కు"

- అయాన్ ర్యాండ్

"ఒంటెలాంటోడు మనిషి. తనకు తానే మోకరిల్లి తన భుజాల మీద అనవసరమైన బరువులు ఎక్కించుకుని ఆ తరువాత బతుకు భారమైపోయిందని ఏడుస్తాడు"

- ఫ్రెడ్రిక్ నీషే

"నీ కళ్ళతో నువ్వు చూస్తున్నావు కాబట్టే ప్రపంచం అనేది ఒకటుందని నీకు తెలుస్తుంది... నువ్వు కళ్ళు మూసుకుంటే దానికి మనుగడ లేదు... అలా ప్రపంచం అన్నది నీ ఊహే కనుక నీ ఊహే ప్రపంచమని తెలుసుకో"

- ఆర్థర్ షోపెన్ హావర్

గెలవాలనే ప్రయత్నాన్ని ఆపేయడమే అత్యంత మహా వైఫల్యం.

- సత్యేంద్ర

ఎమెస్కో బుక్స్